భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) స్థాపన పదవ వార్షికోత్సవ సంకలనం

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) కేంద్రకమిటీ పత్రికా ప్రకటనలు (2004-2014)

కేంద్రకమిటీ
భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)

# ముందుమాట

సి.పి.ఐ.(మావోయిస్టు) పార్టీ 10 సంవత్సరాల వార్షికోత్సవాల సందర్భంగా పార్టీ ఏర్పడిన సెప్టెంబర్ 21, 2004 నుండి ఆయా సందర్భాల్లో ఇచ్చిన పత్రికా ప్రకటనలను విలువైన డాక్యుమెంట్ల ప్రచురణలో భాగంగా తీసుకురావాలని కేంద్ర కమిటీ నిర్ణయించింది. అయితే గత దశాబ్దకాలంలో కేంద్ర కమిటీ ఆయా సందర్భాల్లో ఇచ్చిన పత్రికా ప్రకటనలు కొన్ని మేము సేకరించలేకపోయాం.

గత దశాబ్దకాలంలో సి.పి.ఐ.(మావోయిస్టు) పార్టీ ప్రపంచంలోనూ, దేశంలోనూ జరిగిన కొన్ని ముఖ్యమైన రాజకీయ పరిణామాల మీద తన స్పష్టమైన వైఖరిని ప్రకటించింది. ఆ ప్రకటనల రాజకీయ, చారిత్రక ప్రాధాన్యతలను దృష్టిలో పెట్టుకొని వాటి సంకలనాన్ని పార్టీ కార్యకర్తలకూ, ప్రగతిశీల ప్రజాస్వామికవాదులకూ, సంస్థలకూ, మేధావులకూ, మావోయిస్టు ఉద్యమంతో చేయిచేయికలిపే స్నేహితులకూ అందించాలనుకుంటోంది. ఇది మావోయిస్టు ఉద్యమాన్ని అర్థం చేసుకోవటానికీ మరియు ఉద్యమానికి మద్దతును కూడగట్టేందుకు తోడ్పడుతుంది. ఆయా సందర్భాల్లో ప్రకటనల ద్వారా ఇచ్చిన పార్టీ పిలుపులను పార్టీ కార్యకర్తలు అమలు జరిపారు. విప్లవాచరణ రీత్యా ఇది ఒక ప్రాధాన్యత కలిగిన విషయం. ఈ ప్రకటనలలో కొన్ని సెంట్రల్ రీజినల్ బ్యూరో ఇచ్చినవి కాగా, మరికొన్ని ఈస్టరన్ రీజినల్ బ్యూరోవి. ఆయా సందర్భాల్లో ఇచ్చిన మొత్తం ప్రకటనలను తెలుగులోనూ, హిందీలోనూ తీసుకురాలేక పోయాం. భారత విప్లవోద్యమానికి సంబంధించిన దాదాపు అన్ని ప్రకటనలూ ఇంగ్లీషులో లభ్యమవుతున్నాయి. వీటి రాజకీయ, చారిత్రక ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకొని భవిష్యత్తులో అన్నీ లభ్యమయ్యేలా, విప్లవ క్యాంపుకు అందించేలా చూసుకుంటాము. గత పది సంవత్సరాల విప్లవ యుద్ధాన్ని తీవ్రతరం చేయటంలో భాగంగా, ప్రజా పోరాటాల్ని తీవ్రతరం చేయటంలో భాగంగా పార్టీ కార్యకర్తలు, నాయకులు, పి.ఎల్.జి.ఏ. కమాండర్లూ, విప్లవ ప్రజానీకం అనన్యమైన త్యాగాలు చేశారు. ఈ దశాబ్దిలో గణనీయంగా విప్లవ రాజకీయాల ప్రచారం కూడా జరిగింది. ఈ ప్రకటనలు గత దశాబ్దికాలంలో ఆయా స్థాయిల్లో వివిధ రూపాల్లో కొనసాగిన విప్లవ ప్రచార కార్యాచరణని ప్రతిబింబిస్తాయి. కార్మికవర్గ పార్టీలు ప్రపంచవ్యాప్తంగా సామ్రాజ్యవాదులకు, వారి తొత్తులకూ వ్యతిరేకంగా జరిగే ప్రచార యుద్ధంలో ఇవి భాగమే. అయినప్పటికీ ప్రభుత్వాల భయంకరమైన ప్రచార యంత్రాంగం ద్వారా అబద్ధాలు, అసత్యాలు, విప్లవోద్యమం మీద దుమ్మెత్తిపోసే భారీస్థాయి ప్రచారంతో పోల్చుకుంటే తక్కువేనని చెప్పవచ్చు. చేయాల్సింది ఇంకా చాలా ఉందని గుర్తిస్తున్నాం. సామ్రాజ్యవాదం ఆర్థిక సంక్షోభం నుండి ఎన్ని విఫల ప్రయత్నాలు చేసినప్పటికీ 2008 నుండి మరింత ఊబిలోకి కూరుకుపోతోంది. సామ్రాజ్యవాదం చేస్తున్న దురాక్రమణపూరిత యుద్ధాలు, దోపిడీలు, అణచివేతలు, జోక్యందారీ పద్ధతులూ, వాటికి వ్యతిరేకంగా పెల్లుబుకుతున్న ప్రజాప్రతిఘటన ప్రపంచవ్యాప్తంగా పదునెక్కుతున్న మౌలిక వైరుధ్యాలకు అద్దం పడుతుంది. ఈ అంతర్జాతీయ రాజకీయ, ఆర్థిక దృశ్యం మన భారతదేశంలో కూడా ప్రతిబింబిస్తోంది. మరోవైపున అంతర్జాతీయ స్థాయిలో కమ్యూనిస్టు భావజాలానికి వ్యతిరేకంగా సామ్రాజ్యవాదులు

విషప్రచారం చేస్తున్నారు. అదే సందర్భంలో యూరోపులోని పెట్టుబడిదారీ దేశాల్లో సామ్రాజ్యవాద సిద్ధాంతాలకు కేంద్రాలైన దేశాల్లోనే ఆర్థిక సంక్షోభాలను అర్థం చేసుకోవటానికి మహోపాధ్యాయుడు మార్క్స్ పుస్తకాలను అధ్యయనం చేయటం పెరుగుతోంది. వాటిలో భాగంగానే ఈ సంక్షోభాలకు సమాధానాలను వెతికే క్రమంలో మార్క్సిజం-లెనినిజం-మావోయిజాన్ని అధ్యయనం చేయటం పెరుగుతోంది. ఈ ప్రకటనలు సంఖ్యరీత్యా కొద్దివే అయినప్పటికీ ఈ దోపిడీ వ్యవస్థలో ఉత్పన్నమయ్యే అనేక ప్రశ్నలకు జవాబులను ఇచ్చాయి. అంతేకాకుండా ఈ దోపిడీ వ్యవస్థను నిర్మూలించే మార్గాన్ని కూడా చూపెట్టాయి.

ఈ దశాబ్దంలోనే బహుముఖ క్రూరమైన ఆపరేషన్ గ్రీన్‌హంట్ కూడా మొదలైంది. మధ్యభారతదేశంలో గనులను, ప్రకృతి సంపదలను సామ్రాజ్యవాదులు, దళారీ బూర్జువా వర్గం దోపిడీ చేయటానికి ఆటంకంగా ఉన్న మన పార్టీని, విప్లవోద్యమాన్ని సమూలంగా నిర్మూలించేందుకు వారి యజమానులైన సామ్రాజ్యవాదుల అండదండలతో గ్రీన్‌హంట్ ఆపరేషన్‌ని ప్రారంభించారు. ఇది ప్రజలపై చేస్తున్న భయంకర యుద్ధంగా కొనసాగుతోంది. ఈ దశాబ్దంలో పాలకవర్గాల ప్రతీఘాతుక విప్లవ అణచివేతకు వ్యతిరేకంగా తీవ్రంగా పోరాడి గెరిల్లా యుద్ధాన్ని విస్తృతం చేశాం. ఈ దశాబ్దంలో మన దేశంలో జరుగుతున్న ప్రజల మీద యుద్ధానికి ప్రపంచవ్యాప్తంగా మరింత సంఘీభావాన్ని పొందాము. ఇందులో భాగంగా మనం కూడా ఫిలిప్పైన్స్‌లో జరుగుతున్న ఉద్యమానికి సంఘీభావంగా ఒక వారం రోజులు మన దేశంలో సంఘీభావ వారాన్ని పాటించాము. ఎల్.ఐ.సి. వ్యూహంలో భాగంగా అమెరికా సామ్రాజ్యవాదుల దిశానిర్దేశంలో విప్లవోద్యమానికి వ్యతిరేకంగా బహుముఖ మానసిక యుద్ధంలో భాగంగా పాలకవర్గాలు ఇంతకు ముందు కనీవినీ ఎరుగని రీతిలో దుష్ప్రచార యుద్ధాన్ని కొనసాగిస్తున్నాయి. మన విప్లవోద్యమం పాలకవర్గాలకు కొరకరాని కొయ్యగా మారింది. అందుకే మనపై ఈ విష ప్రచారం జరుగుతోంది. పార్టీ మీద పెద్దయెత్తున పాలకవర్గాలు మానసిక యుద్ధాన్ని కొనసాగిస్తున్న నేటి తరుణంలో ఈ ప్రకటనల సంకలనం ఈ మొత్తం క్రమాన్ని అర్థం చేసుకునేందుకు ఉపయోగపడుతుందని ఆశిస్తున్నాం. ప్రభుత్వ దమనకాండనూ, విష ప్రచారాన్ని అర్థం చేసుకోవటానికి ఈ ప్రకటనల సంకలనాన్ని ఉపయోగించుకొని ప్రభుత్వం దమనకాండను, విషప్రచారాన్ని తిప్పికొట్టాల్సిందిగా కార్యకర్తలకూ, సానుభూతిపరులకూ, ఉద్యమ మద్దతుదారులకూ మరియు విప్లవ ప్రజానీకానికీ మేము విజ్ఞప్తి చేస్తున్నాం.

విప్లవాభినందనలతో

**కేంద్రకమిటీ**

**సి.పి.ఐ.(మావోయిస్టు)**

సెప్టెంబర్ **1, 2014**

# విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | సి.పి.ఐ. (మావోయిస్టు) ఏర్పాటుపై కేంద్రకమిటీ ప్రకటన (14-10-2004) | 9 |
| 2. | పోలీసుల తప్పుడు లేఖలపై సి.సి. ప్రకటన (11-5-2005) | 13 |
| 3. | ప్రజల ప్రజాస్వామిక తెలంగాణాపై సి.సి. ప్రకటన (30-5-2005) | 18 |
| 4. | ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రికి బహిరంగ లేఖ (30-5-2005) | 20 |
| 5. | తెరాస నేతలకు ఇచ్చిన అల్టిమేటంపై సి.సి. ప్రకటన (10-6-2005) | 29 |
| 6. | ఎస్.ఐ.బి. దుష్ప్రచార దుమారంపై సి.సి. ప్రకటన (9-9-2005) | 32 |
| 7. | సత్యమూర్తిపై పోలిట్‌బ్యూరో ప్రకటన (2-11-2005) | 33 |
| 8. | దోర్నపాల్‌లో పి.ఎల్.జి.ఎ. నాయకత్వంలో సల్వాజుడుం గూండాలపై జరిగిన దాడిపై సి.సి. ప్రకటన (1-3-2006) | 36 |
| 9. | కామ్రేడ్ సంతోష్ (సి.టి.సి.) అరెస్టుపై - సి.సి. ప్రకటన (12-9-2007) | 39 |
| 10. | లాల్‌గఢ్ పోరాటంపై సి.ఆర్.బి. పత్రికా ప్రకటన (23-6-2009) | 41 |
| 11. | తెలంగాణా సమస్యపై అధ్యయనం చేసేందుకు శ్రీకృష్ణ కమిటీని వేయడంపై సి.ఆర్.బి. పత్రికా ప్రకటన (8-3-2010) | 47 |
| 12. | కామ్రేడ్ ఆజాద్‌ని బూటకపు ఎన్‌కౌంటర్‌లో కాల్చి చంపడంపై సి.సి. ప్రకటన (4-7-2010) | 50 |
| 13. | కాశ్మీర్ ప్రజలపై జరుగుతున్న దాడులపై సి.సి. ప్రకటన (30-7-2010) | 55 |
| 14. | తమ స్వాతంత్ర్యం కోసం ఉద్యమిస్తున్న కాశ్మీరీయులను హతమారుస్తున్న భారత పాలకవర్గాల దుశ్చర్యలకు వ్యతిరేకంగా భారత్ బంద్‌కై సి.సి. పిలుపు (23-9-2010 | 59 |
| 15. | ఒబామా భారత యాత్రపై సి.సి. ప్రకటన (31-10-2010) | 63 |
| 16. | ఉద్యమ ప్రాంతాల్లో కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు సైనిక రిక్రూట్‌మెంట్ క్యాంపెయిన్లు జరపడంపై సి.ఆర్.బి. ప్రకటన (25-11-2010) | 67 |
| 17. | యూనిఫైడ్ యాక్షన్ ప్లాన్‌పై సి.సి. ప్రకటన (27-11-2010) | 70 |
| 18. | హిందూ మతతత్వానికి వ్యతిరేకంగా డిసెంబర్ 6న నిరసనదినం పాటించాలని సి.సి. విజ్ఞప్తి (4-12-2010) | 73 |
| 19. | ఛత్తీస్‌గఢ్ కోర్టు తీర్పులపై జనవరి 2-8 నిరసనవారం జరపాలని సి.సి. విజ్ఞప్తి (24-12-2010) | 76 |
| **20.** | **ఒడిశాలో బూటకపు ఎన్‌కౌంటర్లను ఖండించండి(12-1-2011)** | **81** |
| **21.** | **మిలియన్ మార్చ్‌'ను ఎత్తిపట్టండి(16-3-2011)** | **85** |

22. లిబియాపై సామ్రాజ్యవాదుల యుద్ధాన్ని ఖండించండి,
అరబ్ ప్రజల తిరుగుబాటుకు సంఘీభావం తెలుపండి(31-3-2011) 88

23 ఐదు రాష్ట్రాల విధానసభ ఎన్నికలను బహిష్కరించండి(6-4-2011) 94

24. వ్యవస్థీకృతమైన అవినీతిని అంతం చేయడానికి ప్రజాపోరాటాల్ని తీవ్రతరం చేయండి(13-4-2011) 98

26. జైతాపూర్ పోరాటకారులపై ప్రభుత్వ హింసను ఖండించండి(28-4-2011) 101

27. ఒసామా బిన్ లాడెన్ దారుణ హత్యను ఖండించండి(4-5-2011) 106

28. బీహార్‌లో ముగ్గురు కేంద్రకమిటీ సభ్యుల అరెస్టుకు వ్యతిరేకంగా
భారత్ బంద్ (11-5-2011) 111

29. భారత సైన్యమా వెనకకు మళ్లు.(4-6-2011) 118

30. కామ్రేడ్ జగదీష్ మాస్టర్ అరెస్టును ఖండిస్తూ భారత్ బంద్(13-6-2011) 124

31. ఛత్తీస్‌గఢ్, ఒడిశాలపై నూతన ప్రభుత్వ దాడిని ఖండించండి(15-6-2011) 128

32. నారాయణపూర్ జిల్లా (మాడ్ ప్రాంతం) నడిమధ్యలో నెలకొల్పబోతున్న
సైనిక శిక్షణా కేంద్రాన్ని వెంటనే ఆపెయ్యాలి (18-6-2011) 133

33. కామ్రేడ్ పత్తిపాటి వెంకటేశ్వర్లుకు జోహార్లు(20-6-2011) 135

34. పోస్కో వ్యతిరేక ఉద్యమకారులకు జేజేలు(22-6-2011) 138

35. రాష్ట్రపతి శాంతిచర్చల ప్రతిపాదన ప్రజలను పక్కదారి పట్టించే
మాయోపాయమే(24-6-2011) 143

36. కామ్రేడ్ ఆర్.ఎస్.రావుకు జోహార్లు(27-6-2011) 146

37. కామ్రేడ్స్ జీతన్ మరాండీ తదితరుల మరణదండనలను రద్దు
చేయాలి (2-7-2011) 149

38. ముంబయ్‌లో బాంబు దాడుల్ని ఖండించండి (17-7-2011) 152

39. మావోయిస్టు ఉద్యమంపై ప్రభుత్వ దుష్ప్రచారాన్ని చెత్తకుప్పలోకి
విసిరెయ్యండి(19-8-2011) 156

40. సకల జనుల సమ్మె'కు మద్దతుగా భారత్ బంద్(1-10-2011) 160

| | | |
|---|---|---|
| **41.** | కామ్రేడ్ మల్లోజుల కోటేశ్వరరావు దారుణ హత్యను ఖండించండి **(25-11-2011)** | **163** |
| **42.** | భారత విప్లవోద్యమ మిత్రులకూ, శ్రేయోభిలాషులకూ విప్లవాభివందనాలు **(13-1-2012)** | **168** |
| 43. | ఫాసిస్టు ఎన్.సి.టి.సి.ని రద్దు చేయాలి (2-5-2012) | 172 |
| 44. | బుటువాన్ రెయిడ్‌కై ఎన్.పి.ఎ.కు విప్లవాభినందనలు (10-5-2012) | 176 |
| 45. | కామ్రేడ్ యాన్ మిర్డాల్ భారత పర్యటనను కేంద్ర ప్రభుత్వం రద్దు చేయ తలపెట్టడంపై (4-6-2012) | 178 |
| 46. | బాసగూడ నరమేధానికి కారకులైనవారిని శిక్షించాలి (10-7-2012) | 181 |
| 47. | సవ్యసాచి పండా పార్టీ నుండి బహిష్కరణ **(16-7-2012)** | 186 |
| 48. | కామ్రేడ్ బి.ఎస్.ఏ. సత్యనారాయణ అమరత్వంపై - సి.ఆర్.బి. (19-7-2012) | 196 |
| 49. | కామ్రేడ్ గోరు మాధవరావుకు జోహార్లు **(29-7-2012)** | **199** |
| 50. | అమెరికా సాంస్కృతిక సామ్రాజ్యవాదంపై ఖండన - సి.సి. (20-9-2012) | 204 |
| 51. | రిటైల్ రంగంలో ఎఫ్.డి.ఐ. ప్రవేశంపై - సి.సి. (21-9-2012) | 208 |
| 52. | సత్యమూర్తిని ఎలా అంచనా వేయాలి - సి.సి. (30-9-2012) | 215 |
| 53. | అఫ్జల్‌గురు ఉరితీతను ఖండిస్తూ - సి.సి. (13-2-2013) | 224 |
| 54. | ఫిలిప్పైన్ విప్లవానికి మద్దతుగా - సి.సి. (23-3-2013) | 227 |
| 55. | బీహార్ ఛాత్రా హత్యాకాండపై భారత్ బంద్ - సి.సి. (31-3-2013) | 231 |
| 56. | ఫిలిప్పైన్ విప్లవానికి మద్దతుగా - సి.ఆర్.బి. (15-4-2013) | 234 |
| 57. | పువ్వార్ హత్యాకాండపై సెంట్రల్ రీజియన్ బంద్-సి.ఆర్.బి. (19-4-2013) | 239 |
| 58. | భూసేకరణ బిల్లుపై - సి.సి. (20-4-2013) | 244 |
| 59. | కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల దుష్ప్రచార క్యాంపెయిన్‌పై-సి.ఆర్.బి.(6-6-2013) | 250 |
| 60. | మే25 ఘటన సాకుతో చేస్తున్న రాజ్య నిర్బంధంపై-సి.సి. (11-6-2013) | 258 |
| 61. | ఉత్తరాఖండ్ ప్రకృతి బీభత్సంపై - సి.సి. (26-6-2013) | 269 |
| 62. | కామ్రేడ్ ఆలూరి భుజంగరావుకు జోహార్లు - సి.సి. (30-6-2013) | 275 |
| 63. | ఎడ్వర్డ్ స్నోడెన్ బహిర్గతపరిచిన రహస్య (ఇంటర్నెట్ స్వాతంత్ర్యాన్ని హరించే) అమెరికా ఎన్.ఎస్.ఏ డాక్యుమెంట్లపై - సి.సి. (1-7-2013) | 279 |
| 64. | కామ్రేడ్ గంటి ప్రసాదం హత్యపై - సి.ఆర్.బి. (7-7-2013) | 285 |
| 65. | తెలంగాణా ప్రజలకు విప్లవ జేజేలు - సి.ఆర్.బి. (31-7-2013) | 289 |
| 66. | సిరియాపై అమెరికా దురాక్రమణపై - సి.సి. (5-9-2013) | 294 |

67. మల్కన్‌గిరి హత్యాకాండపై భారత్ బంద్ - సి.సి. (17-9-2013) 306
68. పాట్నా, కందమాల్ కోర్టు తీర్పులను ఖండిస్తూ - సి.సి. (16-10-2013) 310
69. ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికలను బహిష్కరించిన ప్రజలకు-సి.సి.(2-12-2013) 314
70. హైద్రాబాద్, పోలవరం ప్రాజెక్ట్ తదితర విషయాలపై - సి.ఆర్.బి. (9-12-2013) 317
71. ప్రజాసంఘాలపై నిర్బంధం - సి.సి (28-12-2013) 319
72. కామ్రేడ్ ఆకుల భూమయ్య హత్యపై - సి.ఆర్.బి. (30-12-2013) 324
73. తెలంగాణా రాష్ట్ర ఏర్పాటు బిల్లుపై సి.ఆర్.బి. పత్రికా ప్రకటన (16-2-2014) 327
74. భారత విప్లవ నాయకుడు కామ్రేడ్ ఎస్.ఏ. రవూఫ్‌కు సి.సి. సంతాప సందేశం (1-3-2014) 329
75. పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల బహిష్కరణపై సి.సి. ప్రకటన (24-3-2014) 333
76. తోంగ్‌పాల్ అంబుష్‌పై సి.సి. ప్రకటన (25-3-2014) 342
77. పార్లమెంటు ఎన్నికల ఫలితాలపై సి.సి. ప్రకటన (19-5-2014) 346
78. విప్లవ మేధావి కామ్రేడ్ సునీతి కుమార్ ఘోష్‌కు విప్లవ నివాళి - సి.సి. ప్రకటన (20-5-2014) 354
79. విప్లవ నాయకుడు కామ్రేడ్ సుశీల్‌రాయ్ ఎర్రసూర్యునిలా ఎల్లప్పుడూ మన మార్గాన్ని ప్రకాశవంతం చేస్తూనే ఉంటారు - సి.సి. ప్రకటన (19-6-2014) 358
80. రైల్వే ఛార్జీల పెంపుకు వ్యతిరేకంగా సి.సి. ప్రకటన (21-6-2014) 365
81. పర్యావరణ విధ్వంస పోలవరం ప్రాజెక్టు నిర్మాణంపై సి.సి. ప్రకటన (29-6-2014) 368
82. పాలస్తీనా ప్రజలపై జియోనిస్టు ఇజ్రాయెల్ చేస్తున్న దాడులపై సి.సి. ప్రకటన (30-7-2014) 377
83. జైలు నిర్బంధంలో ఉన్న సీనియర్ మావోయిస్టు నేత కామ్రేడ్ కోబాడ్ గాంధీపై ప్రభుత్వ, జైలు అధికారుల వేధింపులపై సి.సి. ప్రకటన (28-8-2014) 379
84. కామ్రేడ్ ఎం.టి.ఖాన్‌కు అరుణారుణ శ్రద్ధాంజలి ! సి.సి. ప్రకటన (29-8-2014) 382

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# కేంద్రకమిటీ (ప్రొవిజనల్)

**అక్టోబర్ 14, 2004**

## భారత కమ్యూనిస్టుపార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు) [పీపుల్స్‌వార్], మావోయిస్టు కమ్యూనిస్టు సెంటర్ ఆఫ్ ఇండియా విలీనం

## భారత కమ్యూనిస్టుపార్టీ (మావోయిస్టు) ఆవిర్భావం

భారతదేశం లోని ఒక ప్రాంతంలో దుర్గమారణ్యాల మధ్య ప్రజా గెరిల్లా యోధులు, పార్టీ కార్యకర్తలు, ప్రజాసంఘాల కార్యకర్తలు పాల్గొన్న ఒక బహిరంగ సభలో 2004 సెప్టెంబర్ 21న భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) ఆవిర్భావాన్ని ప్రకటించడం జరిగింది. మావోయిస్టు కమ్యూనిస్టు సెంటర్ ఆఫ్ ఇండియా, భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు) [పీపుల్స్‌వార్] అనే రెండు పార్టీలు విలీనం అయి కొత్త ఐక్య పార్టీగా భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) ఆవిర్భవించింది. భద్రతా కారణాల రీత్యా ఈ విలీన ప్రకటనను ఇంతకాలం ఆపి ఇప్పుడు యావత్ భారత ప్రజానీకం ముందర, ప్రపంచ ప్రజానీకం ముందర విడుదల చేస్తున్నాం. ఒక నూతన ప్రజాస్వామిక సమాజ స్థాపన కోసం సోషలిజం, కమ్యూనిజంల దిశగా పురోగమనం కోసం విప్లవాత్మక మార్పులలో తమకు నాయకత్వం వహించే ఒక నిజమైన శ్రామికవర్గ పార్టీ కోసం ఈ దేశ పీడిత ప్రజానీకం వెలిబుచ్చుతున్న కోరికలను, ఆకాంక్షలను ఈ కొత్త పార్టీ ఆవిర్భావం తీరుస్తుంది.

మొదట రెండు పార్టీల ఉన్నత స్థాయి ప్రతినిధి బృందాల మధ్య కూలంకషమైన చర్చలు జరిగి ఆ తర్వాత వాటికి రెండు రెండు పార్టీల సంయుక్త కేంద్ర కమిటీ సమావేశం తుదిరూపం ఇచ్చిన తరువాత ఈ ఐక్యపార్టీ ఆవిర్భవించింది. ఈ కూలంకషమైన, నిర్మాణాత్మకమైన చర్చలు సమానస్థాయిలో జరిగి ఐదు మౌలిక పత్రాలను అంగీకరించాయి. అవి ఉజ్వలమైన మార్క్సిజం-లెనినిజం-మావోయిజపు అరుణారుణ పతాకాన్ని సమున్నతంగా ఎత్తిపట్టండి, పార్టీ కార్యక్రమం, భారత విప్లవ వ్యూహం-ఎత్తుగడలు, అంతర్జాతీయ, దేశీయ పరిస్థితిపై రాజకీయ తీర్మానం, పార్టీ నిబంధనావళి.

ఈ పత్రాలతో పాటుగా ఈ రెండు పార్టీల ప్రేమాస్పద నాయకులు, అధ్యాపకులు, అమరులు కామ్రేడ్ చారు మజుందార్, కామ్రేడ్ కన్హాయ్ చటర్జీ ఐక్యపార్టీ నిర్మాతలుగా అంగీకరించాలనీ, ఎత్తిపట్టాలనీ నిర్ణయించడం జరిగింది. 1960 దశకపు కల్లోల కాలం నుంచి, ముఖ్యంగా మహత్తర నగ్జల్బరీ ప్రజ్వలన నుంచి, ఆవిర్భవించిన ఈ రెండు పార్టీలు

భారత కమ్యూనిస్టు ఉద్యమపు సుదీర్ఘ చరిత్రలో విప్లవాత్మక అంశాలన్నింటికి సజీవ వారసులని గుర్తించడం జరిగింది. ప్రస్తుత స్థితిలోని ప్రత్యేకత ఏమిటంటే ఈ రెండు పార్టీలు భారత విప్లవాన్ని పురోగమింపజేయాలనే ఒకే లక్ష్యానికి 35 సం.రాలుగా కట్టుబడి వున్నప్పటికీ భారత విప్లవోద్యమంలోని రెండు భిన్నప్రవంతులుగా కొనసాగాయి. ఇప్పుడు సంయుక్తంగా చేపట్టిన అన్ని చర్చలు దాదాపు అన్ని సైద్ధాంతిక, రాజకీయ పంథా సమస్యలపై ఏకీకృత అవగాహన వున్నదని స్పష్టం చేశాయి. ఇప్పుడు రూపొందించిన పంథా రెండు పార్టీలు సాధించిన ఐక్యతకు సూత్రబద్ధ పునాదిని కల్పించింది.

ఈ ఐక్యత ప్రాతిపదికగా సంయుక్త కేంద్రకమిటీ సమావేశం రెండు పార్టీలను ఒకే ఏకీకృత పార్టీగా తీర్మానించింది. ఈ పార్టీ ఇక నుంచి భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)గా పిలువబడుతుంది. కొత్తపార్టీ ప్రధాన కార్యదర్శిగా కామ్రేడ్ గణపతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏకీకృత భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) ఆవిర్భావం భారత కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలో తప్పనిసరిగా ఒక కొత్త మైలురాయిగా నిలిచిపోతుంది. మార్క్సిజం-లెనినిజం-మావోయిజం పునాదిగా ఒక ఏకీకృత మావోయిస్టు పార్టీ ఏర్పాడాలనేది ఈ దేశ విప్లవ ప్రజానీకం, పీడిత ప్రజానీకంతో పాటుగా మా శ్రేణులు, దక్షిణాసియాలోనూ, అంతర్జాతీయంగానూ వున్న అన్ని మావోయిస్టు శక్తులు చిరకాలంగా కలలు కన్న ఒక కోరిక. ఇవ్వాళ ఈ సుదీర్ఘకాలపు ఆకాంక్ష, స్వప్నం ఒక వాస్తవంగా సాకారం అవుతున్నది.

కొత్త భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) భారత శ్రామిక వర్గపు సంఘటిత రాజకీయ అగ్రగామి దళంగా కొనసాగుతుంది. దాని ఆలోచనను, అన్ని రంగాల కార్యచరణను నిర్దేశించే సైద్ధాంతిక పునాదిగా మార్క్సిజం-లెనినిజం-మావోయిజం వుంటుంది. ఈ పార్టీ మొత్తంగా కమ్యూనిస్టు ఉద్యమానికి ప్రధాన శత్రువుగా రివిజనిజాన్ని గుర్తించి మితవాద, అతివాద పెడధోరణులన్నింటికీ వ్యతిరేకంగా పోరాడుతుంది. ఈ ఏకీకృత పార్టీ బయట వున్న అన్ని నిజమైన మావోయిస్టు బృందాలను ఐక్యం చేయడానికి కృషి చేస్తుంది.

ఈ మావోయిస్టు పార్టీ తక్షణ లక్ష్యం, కార్యక్రమం ఇప్పటికే సాగుతున్న, పురోగమిస్తున్న భారత నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని ముందుకు తీసుకుపోవడం, పరిపూర్తి చేయడం. ఈ నూతన ప్రజాస్వామిక విప్లవం ప్రపంచ శ్రామికవర్గ విప్లవంలో ఒక భాగం. ఈ విప్లవ విజయానికి నయా వలసవాద రూపపు పరోక్షపాలన, దోపిడీ, ఆధిపత్యం క్రింద కొనసాగుతున్న అర్ధవలస, అర్ధ భూస్వామ్య వ్యవస్థను కూలదోయవలసి వుంది. ఈ విప్లవం సామ్రాజ్యవాదాన్ని, భూస్వామ్యాన్ని, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ విధానాన్ని తన లక్ష్యాలుగా పెట్టుకుంటుంది. ఈ విప్లవం సాయుధ వ్యవసాయ విప్లవ యుద్ధం. అంటే దీర్ఘకాలిక ప్రజాయుద్ధం ద్వారా సాగి పరిపూర్తి అవుతుంది. సాయుధంగా అధికారాన్ని హస్తగతం చేసుకోవడం కేంద్ర, ప్రధాన కర్తవ్యంగా వుంటుంది. పల్లెల నుంచి పట్టణాలను చుట్టుముట్టి అంతిమంగా వాటిని స్వాధీనం చేసుకోవడంగా అది వుంటుంది. అందువల్ల గ్రామీణ ప్రాంతాలు, దీర్ఘకాలిక ప్రజాయుద్ధం పార్టీ కార్యాచరణ కంతటికి "కేంద్ర స్థానం"లో వుంటాయి. పట్టణాల పని దానికి అనుబంధంగా వుంటుంది. ఎందుకంటే ఈ పోరాటానికి అత్యున్నత ప్రధాన రూపంగా సాయుధ పోరాటం, ప్రధాన నిర్మాణరూపంగా సైన్యం ఉంటాయి. అందువల్ల

సాయుధ పోరాటమే నిర్ణయాత్మక పాత్ర వహిస్తుంది. అదే సమయంలో సాయుధ పోరాట క్రమంలోనూ, సాయుధ పోరాటం ద్వారా అధికారాన్ని హస్తగతం చేసుకోవడంలోనూ ఐక్యసంఘటనను నిర్మించడం జరుగుతుంది. ప్రజాసంఘాలు, ప్రజాపోరాటాలు అత్యవసరమే. అవిభాజ్యమైనవే. కాని వాటి కర్తవ్యం యుద్ధానికి తోడ్పడడమే.

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు) [పీపుల్స్‌వార్], మావోయిస్టు కమ్యూనిస్టు సెంటర్‌లకు చెందిన రెండు గెరిల్లా సైనిక విభాగాలు - పీపుల్స్ గెరిల్లా ఆర్మీ, పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ- కూడా విలీనం అవుతున్నాయని, ఇక నుంచి అవి రెండు ఏకీకృత పి.ఎల్.జి.ఏ.లో భాగమవుతాయని కూడా ప్రకటిస్తున్నాం. ఇక ముందు అత్యంత తక్షణ కర్తవ్యం పార్టీ ముందున్న ప్రధాన కర్తవ్యం ఏమంటే ఏకీకృత పి.ఎల్.జి.ఏ.ను పూర్తి స్థాయి ప్రజా విముక్తి సైన్యం (PLA)గా అభివృద్ధి చేయడం. ప్రస్తుతం వున్న గెరిల్లా జోన్లను స్థావర ప్రాంతాలుగా తీర్చిదిద్దడం. తద్వారా అలలు, అలలుగా పురోగమిస్తూ నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయడం. ముగ్గురు కేంద్రకమిటీ సభ్యులు కామ్రేడ్స్ శ్యాం, మహేష్, మురళి అమరత్వపు మొదటి సంస్మరణ దినం సందర్భంగా 2000 సంవత్సరంలో ఏ రోజునైతే దేశంలో మొట్టమొదటిసారిగా ప్రజా సైన్య ఆవిర్భావం జరిగిందో ఆ డిసెంబర్ 2ను PLGA ఆవిర్భావ దినంగా గుర్తిస్తున్నాం.

దీనితోపాటుగా ప్రజానీకానికి సంబంధించి అనేక రాజకీయ, తదితర సమస్యలపై ఒక కొత్త విప్లవ ప్రజా ఉద్యమ కెరటాలను అభివృద్ధి చేయడానికి పార్టీ అత్యధిక శ్రద్ధ వహిస్తుంది. సామ్రాజ్యవాదానికి, భూస్వామ్య విధానానికి, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరేకంగా ఎక్కుపెట్టబడే ఈ పోరాటాలలో సువిశాల ప్రజారాశులను పాల్గొనిపింపజేస్తుంది. మన దేశంపై ఎక్కుపెట్టబడిన దుర్మార్గమైన సామ్రాజ్యవాద దాడి ఇప్పటికే పేదరికంలో మగ్గుతున్న ప్రజలను మరింత విస్తృత నైరాశ్యంలోకి నెట్టింది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో వేలాది మంది ఆత్మహత్యలకు పాల్పడడానికి కారణమైంది. దేశం మీద పెరిగి పోతున్న సామ్రాజ్యవాద దాడులను ఎదుర్కొనేందుకు, రాజ్యహింసను ఎదుర్కొనేందుకు, సామ్రాజ్యవాదానికీ, భూస్వామ్య విధానానికీ వ్యతిరేకంగా అన్ని ఉద్యమాల మద్దతు కూడగట్టేందుకు భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) విశాల ప్రజారాశులను సమీకరిస్తుంది.

వివిధ జాతులు విడిపోయే హక్కుతో సహా స్వయం నిర్ణయాధికారం కోసం సాగిస్తున్న పోరాటాలను కొత్త పార్టీ సమర్థిస్తుంది. ఆ ఉద్యమాలపై సాగుతున్న దుర్మార్గ రాజ్యా అణచివేతను ఖండిస్తుంది. విప్లవంలో మహోద్ధృత శక్తిగా మహిళలను గుర్తించి వారిని సమీకరించడానికి సంఘటితం చేయడానికి పార్టీ ప్రత్యేక శ్రద్ధ వహిస్తుంది. అన్ని రకాల సాంఘిక అణచివేతలకు, ముఖ్యంగా అస్పృశ్యతకు, కులతత్వానికి వ్యతిరేకంగా పార్టీ పోరాడుతుంది. అతి ఎక్కువ ప్రమాదకారులైన హిందూ ఫాసిస్టు శక్తులను బహిర్గత పర్చడానికి, ఒంటరులను చేసి ఓడించడానికి పార్టీ కృషి చేస్తుంది. ఇతర మత చాందసవాద శక్తులను పార్టీ నిలదీస్తుంది. ప్రజా పోరాటాల పదును ఢిల్లీలోని కొత్త కాంగ్రెస్ పాలకులకు, సిపిఐ, సిపిఎంలకు, వారి సామ్రాజ్యవాద పెత్తందారులకు వ్యతిరేకంగా నిలిపి వుంచుతుంది.

తమ సామ్రాజ్యవాద పెత్తందారుల, మరీ ముఖ్యంగా అమెరికన్ సామ్రాజ్యవాదులతోపాటుగా భారత పాలక వర్గాలు సాగిస్తున్న విస్తరణవాద చర్యలను పార్టీ బహిర్గతం చేస్తుంది. ప్రతిఘటిస్తుంది. కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ నేపాల్ (మావోయిస్టు) నేతృత్వంలో పోరాడుతున్న నేపాలీ ప్రజలతో పార్టీ భుజం కలుపుతుంది. తమ సైనిక శక్తితో నేపాల్‌ను జోక్యం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్న భారత విస్తరణ వాదులను, అమెరికన్ సామ్రాజ్యవాదులను పార్టీ అతి తీవ్రంగా వ్యతిరేకిస్తుంది. పెరూ, ఫిలిప్పైన్స్, టర్కీ తదితర ప్రాంతాల్లో మావోయిస్టు పార్టీల నాయకత్వంలో సాగుతున్న ప్రజాయుద్ధాన్ని పార్టీ సమర్థిస్తుంది. సామ్రాజ్యవాదానికి, విప్లవ ప్రతిఘాతుకత్వానికి వ్యతిరేకంగా సాగే ప్రజా ఉద్యమాలన్నింటికి పార్టీ తన మద్దతును తెలుపుతుంది. ప్రపంచ వ్యాపితంగా కార్మిక వర్గ ఉద్యమాలను, ఇతర ప్రజా ఉద్యమాలను పార్టీ సమర్ధిస్తుంది. అమెరికన్ సామ్రాజ్యవాదుల నాయకత్వంలో సాగుతున్న దురాక్రమణకు, దౌర్జన్యానికి వ్యతిరేకంగా ఇరాకీ, అఫ్గన్ ప్రజలు సాగిస్తున్న వీరోచిత పోరాటాలను పార్టీ సంపూర్ణంగా సమర్ధిస్తుంది.

ఏకీకృత పార్టీ, శ్రామిక వర్గ అంతర్జాతీయ పతాకాన్ని సమున్నతంగా ఎత్తిపడుతుంది. అంతర్జాతీయ స్థాయిలో నిజమైన మావోయిస్టు శక్తుల ఐక్యత కొరకు శాయశక్తులా ప్రయత్నం చేస్తుంది. సామ్రాజ్యవాదానికి, దాని తొత్తులకు వ్యతిరేకంగా ప్రపంచ శ్రామిక వర్గ విప్లవాన్ని పురోగమింపజేసేందుకు యావత్ ప్రపంచంలోని అణగారిన ప్రజలతో, జాతులతో ఐక్యత పెంపొందించుకొని వారితో భుజం కలిపి పోరాడుతుంది. తద్వారా అంతర్జాతీయ స్థాయిలో సోషలిజాన్ని స్థాపించేందుకు దాన్ని కమ్యూనిజం దిశగా నడిపేందుకు మార్గం సుగమం చేస్తుంది.

ఈ ఉదాత్త ఆదర్శాల కొరకు వేలాది మంది మా మృతవీరులు తమ విలువైన ప్రాణాలను అర్పించారు. ఆ అమర యోధులు వెలిగించిన ఉజ్వలమైన మార్గంలో మునుముందుకు సాగుతామనీ, ఆ అమరవీరుల స్వప్నాలను సాకారం చేసేందుకు ప్రస్తుతం వున్న శక్తులను, రాగల శక్తులను సమీకరించి పోరాడుతామనీ ఏకీకృత భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) కేంద్ర కమిటీ (ప్రొవిజనల్) శపథం చేస్తున్నది.

**విప్లవాభినందనలతో**

**గణపతి**

**కేంద్రకమిటీ (ప్రొవిజనల్) తరపున**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)**

**అక్టోబర్ 14, 2004**

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# కేంద్ర కమిటీ

**11-5-2005**

## విప్లవకారులపై, కవులూ కళాకారుల కలం గళంపై దాడిని తీవ్రతరం చేయడానికే వరవరరావు పేరుతో పోలీసు లేఖల విడుదల! నైతిక పోలీసింగ్ అంటూ పెడబొబ్బలు పెడుతున్న రాజశేఖర్ రెడ్డి చేపట్టిన అత్యంత అనైతిక దాడిని ప్రజలు ప్రజాస్వామ్యవాదులందరూ ముక్తకంఠంతో ఖండించాలి!!

ఏప్రిల్ 26న మా పార్టీకి చెందిన ఇద్దరు కొరియర్లను అరెస్టు చేసి వారి వద్ద దొరికిన ఉత్తరాలను రెండు వారాల పాటు దాచి ముఖ్యమంత్రి రాజకీయ నిర్దేశనలో 'సర్వజిత్తుల' సేన్ నాయకత్వంలో SIB పోలీసులు పథకం ప్రకారం 7వ తేదీ నుండి దఫదఫాలుగా పత్రికలకు విడుదల చేయనారంభించారు. మా కేంద్ర కమిటీ సభ్యుడు గంగాధర్ తమ పార్టీ మాజీ ప్రతినిధులు ముగ్గురికి రాసిన ఉత్తరాన్ని, దానికి జవాబుగా వరవరరావు ఆయనకు రాసిన ఉత్తరాన్ని, రామక్రిష్ణకు రాసిన ఉత్తరాన్ని పోలీసులు 10 రోజులకు పైగా తమ వద్ద ఉంచుకుని వాటికి కొన్ని వక్రీకరణలను జోడించి చివరికి పేపర్లకు విడుదల చేసారు. ఇదంతా ఉన్నత స్థాయిలో రూపొందించిన కుట్ర ప్రకారం జరిగిందే. ఈ సందర్భంగా వివాదాస్పద లేఖలకు సంబంధించిన అసలు వాస్తవాలను మా కేంద్ర కమిటి రాష్ట్ర ప్రజల ముందు ఉంచుతోంది.

మా పార్టీ పొలిట్‌బ్యూరో సమావేశం తరువాత మా పార్టీ తరఫున చర్చల్లో పాల్గొన్న ముగ్గురు ప్రతినిధులకు గంగాధర్ పేరుతో మేం ఉత్తరం పంపిన విషయం వాస్తవమే. ఆ ఉత్తరానికి సంబంధించి పేపర్లలో వచ్చిన విషయాలన్నీ (నేను చూసినంతవరకూ) సరిగానే ఉన్నాయి. అయితే గంగాధర్‌కు వరవరరావు పంపిన జవాబును మాత్రం పోలీసులు వక్రీకరించి కొన్ని అంశాలను దుర్బుద్ధితో కలిపి మీడియాకు విడుదల చేసారు. వరవరరావు గారి వద్ద నుండి మాకు అందిన ఉత్తరానికీ, పేపర్లలో వచ్చిన విషయాలకి చాలా తేడా ఉంది. అందులో తన ఆరోగ్యాన్ని గమనంలో ఉంచుకుని తనను బాధ్యతలనుండి రిలీవ్ చేయమని కేంద్ర కమిటీని

కోరిన విషయం వాస్తవమే. అయితే ముగ్గురు చర్చల ప్రతినిధుల మధ్య తలెత్తాయంటున్న మనస్పర్థల వలన కాదు. తమ దృష్టికి వచ్చిన విషయాలను మాకు రిపోర్టు చేసారే కానీ మిగిలిన ఇద్దరు ప్రతినిధులపై ఆయన ఆరోపణలేమీ చేయలేదు. ఆయన రాసిన ఉత్తరం ప్రస్తుతం మాకందుబాటులో లేదు. అందగానే పత్రికలకు పంపుతాం. పార్టీలో అంతర్గత సమస్యలు ఎన్నో ఉంటాయి. వాటిని తమ స్వార్థ రాజకీయాలకు ప్రభుత్వం, పోలీసులు వాడుకోవడం శోచనీయం.

ఏ సమస్యలపై వాగ్దానాలు గుప్పించి కాంగ్రేసు పార్టీ ఎన్నికల్లో గెలిచిందో ఆ సమస్యలన్నీ పరిష్కారం కాకపోగా మరింత జటిలమై 'ప్రజాపథం' వంటి కార్యక్రమాలు నవ్వులపాలై, ఒక్క సంవత్సర పాలనలోనే అన్ని రంగాలలో విఫలమై బూటకపు వాగ్దానాల సర్కారుగా పేరు గడించి ప్రజల అసహ్యానికి గురై సాధికారతను కోల్పోయిన వైఎస్ఆర్ ప్రభుత్వం తన వైఫల్యాల నుండి ప్రజల దృష్టిని మరల్చడానికి ఎంచుకున్న అత్యంత అనైతికమైన, హేయమైన, నీచమైన ఎత్తుగడ ఇది. ప్రతినిధుల మధ్య విభేదాలు సృష్టించడానికీ, విప్లవ కవుల కళాకారుల, విప్లవ సానుభూతిపరుల గొంతు నొక్కి వేయడానికీ, ప్రజా సమస్యలపై పోరాడుతున్న విప్లవ ప్రజాసంఘాలపై, విప్లవ సానుభూతిపరులపై రాజ్య హింసను మరింత తీవ్రతరం గావించడానికీ, పోలీసులు కొనసాగిస్తున్న బూటకపు ఎన్‌కౌంటర్లు పాశవిక దమనకాండ దుర్మార్గపు చర్యలనుండి ప్రజల దృష్టిని మరల్చడానికీ, పరిటాల రవి హత్యలో పోలీసులే ప్రధాన పాత్ర వహించడం వలనా, ఐజీ మీనా ముఠా నాయకుడి స్థాయికి దిగజారడం వలనా మొత్తం పోలీసు వ్యవస్థపైనే ప్రజల్లో తీవ్ర అసహ్యం అవిశ్వాసం పెరగడంతో వారిని ప్రక్క తోవ పట్టించడానికీ, శిశు విక్రయాల కేసులో ఇరుక్కున్న తన భార్యను కాపాడడానికి నానా గడ్డి కరుస్తున్న డీజీపిని రక్షించుకోవడానికీ, ప్రజల ప్రయోజనం తప్ప మరే ప్రయోజనమూ లేని మా సీపీఐ (మావోయిస్టు) పార్టీని తమ సమస్యల పరిష్కారానికి నిజమైన ప్రత్యామ్నాయంగా ప్రజలు భావించడాన్ని ఏ మాత్రం జీర్ణించుకోలేక మా పార్టీని అప్రదిష్టపాలు చేయడానికీ అబద్ధాల జంట వైఎస్ఆర్-డీజీపీలు కలిసి పన్నిన నీచపు కుట్ర ఇది.

నైతిక విషయాలలో దోపిడీవర్గ పార్టీలకూ మావోయిస్టు పార్టీకి తేడాలేదని ప్రజలలో తప్పుడు భావనను కలిగించడానికీ తద్వారా తాము తలపెడుతున్న అత్యంత క్రూరమైన దాడికి నైతిక సమర్థన పొందడానికీ వైఎస్ఆర్-స్వరణ్‌జిత్ సేన్ల పోలీసు ప్రభుత్వం రూపొందించిన దుర్మార్గపు పథకం ఇది. అవినీతికూపంలో కూరుకుపోయిన రాష్ట్ర డీజీపి లేఖలను విడుదల చేసిన తరువాత 'దేర్ ఆర్ నో హోలీ కౌస్' అంటూ అందరినీ ఒకేగాటన కట్టడానికి చేసిన

ప్రయత్నం ఈ కుట్రను ప్రతిబింబిస్తుంది. అందుకే 10 రోజులకు పైగా తర్జనభర్జనలు చేసి కొన్ని విషయాలను కలిపి చివరికి విడుదల చేసారు. వ్యతిరేకంగా మాట్లాడిన వారందరికీ ఇటువంటి కక్ష సాధింపు చర్యలుంటాయని ఒక బెదిరింపుగా కూడ ఈ లేఖల ద్వారా ప్రభుత్వం తెలపదలుచుకున్నది.

ఇక అబద్ధాలను అల్లడంలోనూ, ప్రకటనలను ఉత్తరాలను ఫోర్జరీ చేయడంలోనూ ఆంధ్ర రాష్ట్ర పోలీసులకున్న సుదీర్ఘ చరిత్ర, పేరు ప్రఖ్యాతులు రాష్ట్ర ప్రజానీకానికి చక్కగానే తెలుసు. ఇటీవలి కాలంలో జరిగినవి చూస్తే వీరి అనైతికత ఏమిటో ఎవరికైనా అర్థం అవుతుంది. 2004 జనవరిలో ఆ. ప్ర. రాష్ట్ర కమిటీ సభ్యుడు కా॥సత్యంను పోలీసులు పట్టుకుని కాల్చేసిన తరువాత పౌర హక్కుల సంఘం నేత లక్ష్మణ్ గారిపై ఆరోపణ చేస్తూ రామక్రిష్ణ పేరుతో పోలీసులు ప్రకటన ఇచ్చారు. ఎన్నికలు కాగానే కా॥గణేష్

పేరుతో, చంద్రన్న పేరుతో ప్రకటనలిచ్చారు. నిన్న గాక మొన్న మార్చ్ 31న శవాలను మాయం చేయాలని, బస్సులను కాల్చాలని, తుపాకులతో కాక కత్తులతో చంపాలని క్యాడర్లకు పిలుపునిస్తూ రామక్రిష్ణ పేరుతో ప్రకటన ఇచ్చారు. అత్యంత నిర్బంధ పరిస్తితుల వలన ఈ తప్పుడు ప్రకటనను బహిర్గతపర్చడానికి రామక్రిష్ణకు 10 రోజులు పట్టగా ఆ 10 రోజులు ప్రజలను, ప్రజాస్వామికవాదులను గందరగోళపరచ గలిగారు. తిరిగి బలరాం పేరుతో మరో ఫోర్జరీ ప్రకటన పత్రికలకు విడుదల చేసారు. వీరి చరిత్ర చెప్పుకుంటూపోతే అంతుండదు. ఇటువంటి ఎత్తుగడల ద్వారా అబద్ధపు ప్రకటనల ద్వారా ప్రజలలోనూ, పార్టీ క్యాడర్‌లోనూ కొంత గందరగోళం కొద్ది రోజులు కలగచేయడంలో పోలీసులు సఫలమైనా అనతికాలంలోనే వారి కుట్రలను ప్రజలు అర్థం చేసుకున్నారు.

మన పోలీసు అధికారులు నిజం చెప్తారని వారి గురించి తెలిసినవారు కలలో సైతం ఎవరూ ఊహించలేరు. అయినా అటువంటి కుఖ్యాత పోలీసు అధికారులు విడుదల చేసిన లేఖలపై ఆధారపడి దళిత సంఘాల నాయకులమని చెప్పుకునే కొందరు వరవరరావు గారికి వ్యతిరేకంగా మాట్లాడడం, మా పార్టీలో కులవిభేదాలున్నాయని ఆరోపించడం దురదృష్టకరమైన విషయం. ఇది పచ్చి అబద్ధమే కాక దురుద్దేశంతో కూడుకున్న ఆరోపణ. వివి కింద గద్దర్ పని చేయడం ఏం పద్ధతి? అని కంచె అయిలయ్య ఆశ్చర్యం వెలిబుచ్చాడు. విప్లవ పార్టీలు రచయితల్లో కూడ అగ్రవర్ణాల పెత్తనం కొనసాగడం బాధాకరం అన్నాడు. ఇటువంటి అవాస్తవ ఆరోపణలు పోలీసుల దుష్ట పన్నాగాలకు బలం చేకూర్చుతుందే తప్ప

ప్రజల ప్రయోజనాలకు ఏమాత్రం ఉపయోగపడదు.

వాస్తవమేమంటే మేం ముగ్గురిని చర్చల ప్రతినిధులుగా ఎంచుకున్నప్పుడు ప్రజాస్వామ్య పద్ధతిలోనే టీం లీడర్‌ను ఎన్నుకోవడం జరిగింది. ఈ కాలం అంతా ముగ్గురూ ఒక టీం లాగా పని చేసారు తప్ప ఒకరి క్రింద ఒకరు పనిచేయడం ఏమిటి? అని బూర్జువా పోటీతత్వంతో ఎవరూ ఆలోచించలేదు. ఎప్పుడూ కులపరిధిని దాటి ఆలోచించలేని సంకుచిత మేధావులకు దళిత నాయకులకు మేం విజ్ఞప్తి చేసేదేమంటే మీరు విశాల వర్గ దృక్పథంతో విషయాలను చూడండి, విశ్లేషించండి. దోపిడీ పాలకవర్గాల, పోలీసు అధికారుల కుట్రలకు బలికాకండి. మా పార్టీ పోరాడేది అశేష పీడిత ప్రజానీకం కోసమేనని, అంటే ముఖ్యంగా దళిత, ఆదివాసీ, మహిళా, మైనారిటీల ప్రయోజనాల కోసమేనని అందరికి తెలుసు. మా ప్రతినిధులలో కుల విభేదాలు ఉన్నాయనడం పోలీసుల దోపిడీదారుల సృష్టే తప్ప ఏ మాత్రం వాస్తవం లేదు. కానీ ప్రతి ఒక్కరినీ కులాన్ని బట్టి తప్ప గుర్తించలేని దైన్య స్థితిలో నేటి మన సమాజం ఉంది కావున ఎటువంటి విభేదం పొడచూపినా వెంటనే కులం రంగు పులమడం అలవాటయ్యింది.

మావోయిస్టు పార్టీ ప్రతినిధుల మధ్య మనస్పర్ధలు పెంచడానికీ, ప్రతి రంగంలోనూ తన ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికీ, చంద్రబాబు ఫాసిస్టు పాలనను సైతం తలదన్నే తన దుర్మార్గ పాలన నుండి ప్రజల దృష్టిని మరల్చడానికీ, వైఎస్ఆర్ ప్రభుత్వం కుట్రపూరితంగా లేఖలను వక్రీకరిస్తూ విడుదల చేసింది. మరి కొన్ని లేఖలను విడుదల చేసినా ఆశ్చర్యపడవలసిందేమీ లేదు. ప్రభుత్వ దుష్ప్రచారం వెనుక గల కుట్రను, పకడ్బందీ పథకాన్ని ప్రజలు ప్రజాస్వామికవాదులు అర్థం చేసుకుంటారనీ, ప్రజల ప్రజాస్వామిక హక్కులను హరించివేయడానికి వైఎస్ఆర్ పోలీసు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను తిప్పికొట్టాలనీ విజ్ఞప్తి చేస్తున్నాం.

మా ప్రతినిధుల కార్యక్రమాల గురించీ వారి మధ్య ఉన్న భిన్నాభిప్రాయాల గురించీ మా పార్టీకి స్పష్టంగానే తెలుసు. పార్టీ లోపలా బయటా మా యూనిట్లలో, సానుభూతిపరులలో భిన్నాభిప్రాయాలు ఉండడం అసహజమైనదేమీ కాదు. వారిపై ఎటువంటి ఆరోపణ వచ్చినా పార్టీ నాయకత్వం క్షుణ్ణంగా విచారణ జరిపి తగిన చర్య తీసుకుంటుంది. మా పార్టీ ఎంత నిజాయితీతో పని చేస్తూ ఉందో, వేలాది మంది మా కార్యకర్తలు ఎలా ప్రాణత్యాగం చేసారో మా చరిత్ర తెలిసిన వారెవరైనా సులభంగానే అర్థం చేసుకోగలరు. మాకు వాస్తవాలను దాయవలసిన అవసరం ఎన్నడూ లేదు. తప్పులు జరిగితే బహిరంగంగానే ప్రజలను క్షమాపణ

కోరతాం. మా ప్రతినిధులు ముగ్గురూ కూడ విప్లవ కార్యాచరణతో మూడు దశాబ్దాలు పెనవేసుకుని ఉన్నవారే. అరెస్టులు కాబడినా పోలీసుల, ప్రైవేటు గ్యాంగుల నుండి దాడులకు గురై రకరకాల మానసిక హింసలకు గురైనా గట్టిగా ప్రజల పక్షాన విప్లవం పక్షాన నిలబడినవారు. అందుకే వారిని చర్చల ప్రతినిధులుగా మేం ఎంచుకున్నాం. గట్టిగా నిలబడ్డారు కనుకనే వారిపై పోలీసులకు, దోపిడీ ప్రభుత్వానికీ అంత కసి, మంట. ఇప్పటికే ఏమాత్రం సంబంధం లేకున్నా కేసు పై కేసు పెడుతూనే ఉన్నారు. కర్నాటక పోలీసు స్టేషన్‌పై దాడి కేసు కూడ పెట్టారంటే కవులూ కళాకారుల గొంతును ఎలా నులిమివేస్తున్నారో అర్థం చేసుకోవచ్చు.

ఇప్పటికైనా నీ అబద్ధాలను, అక్రమాలను, అనైతిక చర్యలను కట్టిపెట్టి మితిమీరిన దుర్మార్గపు చర్యలతో ఆంధ్ర రాష్ట్రాన్ని నాజీల కాన్సెంట్రేషన్ క్యాంపుగా మార్చివేస్తున్న నీ పోలీసు అధికారులను నియంత్రించవలసిందిగా వైఎస్ఆర్ ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నాం. విప్లవకారులపై నీ ప్రభుత్వం ఎక్కుపెడుతున్న భౌతిక దాడులు కానీ, సైకలాజికల్ దాడులు కానీ, మరే రకమైన అనైతిక దాడి కానీ వారిని ఏమాత్రం భయపెట్టలేదు. ప్రజలను ఎల్లకాలం నీ గోబెల్స్ ప్రచారం మోసం చేయలేదు. అది చివరికి నీకే ఉరిత్రాడవుతుంది. వైఎస్ఆర్-సర్వజిత్తు సేన్‌ల అప్రజాస్వామిక అనైతిక ప్రజావ్యతిరేక పాలనను విధానాలను నిరసిస్తూ, అన్ని వర్గాల సెక్షన్ల ప్రజలు ఐక్యంగా ఉద్యమిద్దాం. 'వరవరరావు లేఖల' పేరుతో దుష్ప్రచారం కొనసాగిస్తూ ప్రజాసంఘాలపై దాడులను తీవ్రతరం చేయడానికీ, రాజ్యహింసకు సాధికారత పొందడానికీ పోలీసు అధికారులు-అబద్ధాల ముఖ్యమంత్రి కలిసి పన్నిన కుట్రలను భగ్నం చేద్దాం.

**ప్రకాష్,**

**పొలిట్‌బ్యూరో సభ్యుడు,**

**సీపీఐ (మావోయిస్టు)**

# భారత కమ్యూనిస్టు పార్టీ(మావోయిస్టు)

## కేంద్రకమిటీ

పత్రికా ప్రకటన

తేది: 30.05.2005

## మన ప్రత్యేక తెలంగాణా ప్రజల ప్రజాస్వామిక స్వావలంబ తెలంగాణానే!

## దోపిడీదార్ల తెలంగాణా కాదు, ప్రపంచబ్యాంకు-ప్రపంచ వాణిజ్య సంస్థల సామ్రాజ్యవాదుల దోపిడీకి నిలయమైన తెలంగాణా కానేకాదు!!

### తెలంగాణా పీడిత ప్రజలారా, నిజాయితీగా మద్దతునిచ్చే ప్రజాస్వామికవాదులారా, మనమంతా ఏకమవుదాం!

### ప్రత్యేక ప్రజాస్వామ్య తెలంగాణాకై ఐక్యంగా తెగించి పోరాడుదాం!!

ఇటీవల కాలంలో తెలంగాణా వెనుకబాటుతనం గురించి అన్ని దోపిడీవర్గ పార్టీలు మొసలి కన్నీళ్ళు కార్చడం మొదలు పెట్టాయి. ప్రత్యేక తెలంగాణా ఏర్పాటే సకల సమస్యలకు పరిష్కారమని టీఆర్ఎస్ ప్రకటించగా, ప్రాంతీయ మండలి ఏర్పాటు, 610 జీఒ అమలు, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, ఉపాధి, పరిశ్రమల ఏర్పాటు, వగైరా చర్యల ద్వారా తెలంగాణా ప్రాంత అభివృద్ధి సాధ్యం అంటూ ఇతర పార్టీలు ఊదరగొడ్తున్నాయి.

ఇన్నాళ్ళు తెలంగాణా ప్రాంతాన్ని తమ చిత్తం వచ్చినట్లు కొల్లగొట్టి సామ్రాజ్యవాదులకు దోచిపెట్టిన పాలక వర్గాలు వాటి ప్రతినిధులైన కాంగ్రేసు, తెదేపాలకు, బిజెపి, మరియు పోకాల్డ్ కమ్యూనిస్టులైన సిపిఐ, సిపిఎం తెలంగాణా వెనుకబాటుతనం ఈరోజే ఎందుకు గుర్తుకొస్తోంది? అభివృద్ధి కోసం ప్యాకేజీలు, ప్రణాళికలు ఎందుకు గుర్తుకొస్తున్నాయి? తెలంగాణా ప్రజలు తమ ప్రాంత సంపద తమకే చెందాలని నినదిస్తూ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుకై ఉద్యమించడానికి సమాయత్తమవుతున్న తరుణంలో సమైక్యాంధ్ర ద్వారా వారిని మరింత స్వేచ్ఛగా దోచుకోవచ్చనే దురుద్దేశంతో ఆంధ్రప్రాంత పాలకుల ప్రయోజనాలను, వారితో మిలాఖతైన తెలంగాణా దొంగల ప్రయోజనాలను సంరక్షించడానికి కాంగ్రేసు, తెలుగుదేశం, బిజెపి పార్టీలు అభివృద్ధి పేరిట అనేక గిమ్మిక్కులు చేస్తున్నాయి.

కేవలం తెలంగాణా రాష్ట్ర డిమాండుపైనే ఎన్నికల్లో పోటీచేసి (నక్సలైట్ల ఎజెండానే మా ఎజెండా అంటూ ప్రజలను ఆకర్షించి) టిఆర్ఎస్ సీట్లు సంపాదించగా, ప్రత్యేక తెలంగాణాకు తాము వ్యతిరేకం కాదంటూ ఆ డిమాండుకు మద్దతు ప్రకటించినట్టు చేసి కాంగ్రేసు లబ్ది పొందింది. నేడు అదే కాంగ్రేసు, దాని నేత వైఎస్ఆర్, ప్రత్యేక తెలంగాణాను పూర్తిగా వ్యతిరేకిస్తున్నారు. పెద్ద రాష్ట్రాల వలన లాభం వుందంటూ, నక్సలైట్లను అణచడానికి పెద్ద రాష్ట్రాలు ఉపయోగపడుతాయంటూ మతి భ్రమించిన వాడిలా మాట్లాడుతున్నాడు. తెలంగాణా రాష్ట్రం కంటే చిన్న రాష్ట్రాలు మన దేశంలో ఎన్ని వున్నాయో కూడ తెలియనంత మూర్ఖుడనుకోవాలా మన ముఖ్యమంత్రి? రాష్ట్రాల మాటటుంచి అసలు ప్రపంచంలోని దేశాలలోనే తెలంగాణా కంటే చిన్నవి సగానికి పైనే వుంటాయని స్కూలు పిల్లలనడిగినా చెప్తారు. మరి ఇటువంటి పరమ చెత్త లాజిక్కులతో తమ మూర్ఖత్వాన్ని ప్రదర్శించుకుంటున్నా, ప్రత్యేక తెలంగాణాకు వైఎస్ఆర్ బద్ధ వ్యతిరేకని స్పష్టమైపోయినా ఇంకా కాంగ్రేసుతో కలిసి టిఆర్ఎస్ నాయకులు మంత్రి పదవుల్లో కొనసాగడంతో వారి అసలు స్వరూపం ప్రజల ముందు బహిర్గతమైపోయింది. ఇప్పటికైనా ఆ పార్టీ నిజంగానే ప్రత్యేక తెలంగాణా డిమాండుకు కట్టుబడి వుంటే వెంటనే కాంగ్రేసు ప్రభుత్వంతో సంబంధాలు తెగతెంపులు చేసుకోవాలి. టిఆర్ఎస్ మంత్రులందరూ తమ పదవులకు బేషరతుగా రాజీనామా చేయాలి. అలా చేయకుండా కొనసాగితే టిఆర్ఎస్ నాయకులెవరినీ గ్రామాలకు రానివ్వద్దని ప్రజలకు మా పార్టీ కార్యకర్తలకు పిలుపునిస్తున్నాం.

ప్రత్యేక తెలంగాణా డిమాండును నీరుగార్చడానికి ప్రాంతీయ బోర్డులంటూ కాంగ్రేసు చేసిన ప్రతిపాదనను బలపరుస్తున్న సిపిఐ, సిపిఎం పార్టీల రాజకీయ దివాళాకోరుతనాన్ని ప్రజలు అర్థం చేసుకోవాలి. ఈ వామపక్షాలనబడే పార్టీల చరిత్రంతా ఏదో ఒక బూర్జువా పార్టీకి వంత పాడుతూ వారికి సేవ చేయడమే. మార్క్సిస్టు సూత్రాలను తలకిందులు చేసి తమ పార్లమెంటరీ క్షుద్ర రాజకీయాలను సమర్థించుకున్నట్టే ఈ పార్టీలు ప్రత్యేక తెలంగాణాను వ్యతిరేకించడానికి కూడా మార్క్సిజంకు తమదైన భాష్యాన్ని చెప్తున్నాయి. అసమాభివృద్ధి ఒక సామ్రాజ్యవాద స్వభావమని గతితార్కికంగా అర్థం చేసుకున్నపుడు గానీ శ్రీకాకుళ పోరాటం కాలం నుంచీ కూడా మేమెందుకు ప్రజల ప్రత్యేక తెలంగాణా డిమాండును సమర్థిస్తున్నామో అర్థం కాదు. మార్క్సిజం పిడివాదం కాదు. సృజనాత్మక అన్వయం. ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్షలను అర్థం చేసుకోలేనివారెవరూ మార్క్సిస్టు కాజాలరు. ప్రజల ప్రజాస్వామిక డిమాండుకు కౌంటర్‌గా మార్క్సిస్టు సిద్ధాంతాన్ని నిలపడం అంటే దానిని భ్రష్టు పట్టించడమే. ఇప్పటికైనా కాంగ్రెసు ప్రభుత్వానికంటకాగే స్థితి నుండి బయటపడాలని ప్రజలు ఈ వామపక్షాలను నిలదీయాలి.

కొత్తగా ఈ మహానాడు సభల్లోనే తెలుగుదేశం పార్టీ సమైక్యాంధ్ర తీర్మానం చేసి అందుకోసం ప్రాణాలైనా ఇస్తామని చెప్పడం మరొకమారు తెలంగాణా ప్రజలకు చంద్రబాబు తలపెట్టిన ద్రోహాన్ని పునరుద్ఘాటించడమే. చంద్రబాబు నాయకత్వానికి వంతపాడిన చెన్నమనేని రాజేశ్వరరావు మొదలు టిడిపిలోని తెలంగాణా నాయకుల గులాంగిరీని ఎండగట్టి ప్రతిఘటించాల్సిందిగా ప్రజలను కోరుతున్నాం.

ప్రత్యేక తెలంగాణా అంటే కేవలం భౌగోళికంగా కొంత భూమి విడిపోవడం మాత్రమే కాదు. అది మూడున్నర కోట్ల ప్రజల బతుకుతెరువుకు సంబంధించిన ప్రశ్న. భూమి లేనివారికి భూములను పంపిణీ చేసే సమస్య. వారి ప్రజాస్వామిక హక్కులకు సంబంధించిన ప్రశ్న. మరో దేశంపై యుద్ధం కొనసాగించే తీరులో తెలంగాణా ప్రజల అణచివేతపై వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తూ 'తెలంగాణా అభివృద్ధిని బలిపెడ్తూ అత్యంత దుర్భర, అమానవీయ, పాశవిక దాడులను కొనసాగించే ఖాకీ మూకలనుండి విముక్తి గావించే సమస్య. చట్ట విరుద్ధంగా ప్రవర్తించే పోలీసులను శిక్షిస్తూ, ప్రజల జీవించే హక్కునూ, న్యాయమైన సమ్మె హక్కునూ, తమ ప్రజాస్వామిక హక్కులకై ప్రజలు ఉద్యమించే హక్కునూ, ప్రతి పౌరుడి వాక్ సభా స్వాతంత్ర్యాల హక్కునూ సంరక్షించే ప్రశ్న.

తెలంగాణాను ఆంధ్రా పాలకుల కబంధ హస్తాలనుండి విడిపించడమే కాదు, సామ్రాజ్యవాదుల ప్రపంచబ్యాంకు-ప్రపంచ వాణిజ్య సంస్థల దోపిడీ నుండి విముక్తి గావించాలి. తెలంగాణా వనరులను తెలంగాణా అభివృద్ధికి తెలంగాణా ప్రజల అవసరాలను తీర్చడానికి వినియోగించాలి. ఇది చేయలేకపోతే

ప్రత్యేక తెలంగాణాకు అర్థమే లేదు. అటువంటి ప్రత్యేక తెలంగాణా దొరలకు, వారితో మిలాఖతైన ఆంధ్ర ప్రాంత దోపిడీదార్లకు సామ్రాజ్యవాదుల ప్రయోజనాలకే ఉపయోగపడుతుంది తప్ప ప్రజలకు పెద్దగా ఒరిగేదేమి ఉండదు.

ఇటువంటి ప్రజాస్వామిక, స్వావలంబ తెలంగాణా గురించే మా వేలాది కామ్రేడ్లు రక్తతర్పణం చేసారు. తెలంగాణా గడ్డ అడుగడుగు మా వేలాది అమరుల రక్తంతో తడిసింది. తెలంగాణా అభివృద్ధి కోసం ఎవరు ప్రాణత్యాగాలు చేసారో, ఎవరు ద్రోహం చేసారో తెలంగాణా ప్రజలకు స్పష్టంగానే తెలుసు. తెలంగాణా అభివృద్ధి కోసం మేమున్నాం అంటూ నేడు మన చెవులు ఊదరగొడుతున్న దోపిడీ వర్గ పార్టీలన్నీ తెలంగాణాను రక్తసిక్తం చేయడంలో ప్రధాన పాత్రధారులే. తెలంగాణా వీరపుత్రులు, భారత ప్రియతమ విప్లవ నాయకులుగా పేరుగాంచిన మా కామ్రేడ్స్ శ్యాం, మహేశ్, మురళిలను, ఆర్‌కె, ఏకె, కౌముదిలను, అణగారిన తెలంగాణా మహిళల నుండి గొప్ప విప్లవ నాయకురాళ్ళుగా ఎదిగి వచ్చిన పద్మ, లలిత, విద్య, సుగుణ ఇంకా అనేకానేక వీరవనితలనూ, గులాం రసూల్, పురుషోత్తం, బెంజమిన్, నాగేశ్వర్రావు, రఘు వంటి అనేక ఆదివాసీ దళిత ముస్లిం ప్రజానీకానికి చెందిన వీరులను, ఎందరో రైతాంగ, కార్మిక, విద్యార్థి, మేధావి సెక్షన్లకు చెందిన కామ్రేడ్స్‌ను అత్యంత కిరాతకంగా చిత్రహింసలు పెట్టి హత్య చేసిన తెలుగుదేశానికి తెలంగాణా గురించి మాట్లాడే హక్కెక్కడిదని ప్రశ్నిస్తూ తరిమికొట్టడం తెలంగాణా ప్రజల కర్తవ్యం.

అలాగే తెలంగాణా ప్రజల అభివృద్ధి కోసం అహర్నిశలు పాటుపడుతూ వరంగల్ ప్రజలలో పోరాడే స్ఫూర్తిని నింపిన మా యాదన్నను ట్రీట్‌మెంట్ కోసం వెళ్తే పట్టుకుని హత్యచేసి, మానాలలో నిజామాబాద్-పశ్చిమ కరీంనగర్ ప్రజల అభివృద్ధి కోసం అత్యంత కష్టభూయిష్టమైన పరిస్థితులను సైతం లెక్కచేయకుండా శ్రమించిన కామ్రేడ్స్ రమేష్, బాబన్నలతో సహా పదిమందిని పిరికిపందల వలె విషం పెట్టి చంపి, మా పాలమూరు నాయకుడైన సంతోష్‌ను, పుష్పను పట్టుకుని హింసించి హత్యచేసిన వైఎస్‌ఆర్‌కు, ఆయన నాయకత్వం వహించే కాంగ్రెసు నాయకులకు తగిన బుద్ధి చెప్పడం తెలంగాణా ప్రజల బాధ్యత. అణచివేతలో కూడ సామ్రాజ్యవాదులపై ఆధారపడుతూ వారి మానవరహిత హైటెక్కు విమానాలతో తెలంగాణాను మరింత రక్తసిక్తం చేయాలని చూస్తున్న వైఎస్‌ఆర్-స్వరణ్‌జిత్‌సేన్‌ల, వీరిని సపోర్టు చేస్తున్న కేంద్రప్రభుత్వానికి ప్రజాబలంతోనే బుద్ధిచెప్పాలి.

ఇక వైఎస్‌ఆర్ చుట్టూ, సోనియాగాంధీ చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ తెలంగాణా ఏర్పాటు కోసం ఢిల్లీ పాలకులను దేబరిస్తూ, నిస్సిగ్గుగా వారితో మిలాఖతై మంత్రి పదవులు పొంది తెలంగాణా ప్రజలకు ద్రోహం తలపెట్టిన టిఆర్‌ఎస్‌కు జూన్15లోగా కాంగ్రెసుతో తెగతెంపులు చేసుకోవడానికి చివరి అవకాశాన్నిద్దాం. అప్పటికీ ఆ పార్టీ నాయకులు కాంగ్రెసు వారితో అంటకాగుతూ వుంటే తెలంగాణా ద్రోహులుగా పరిగణించి వారికి తగిన బుద్ధి చెబుదాం.

నూతనంగా ఏర్పడుతున్న విజయశాంతి 'తల్లి తెలంగాణా' పార్టీ ప్రత్యేక తెలంగాణా ఏర్పడితే దాని రూపు రేఖలు ఎలా వుంటాయో స్పష్టం చేయాలి. ప్రజాస్వామిక, స్వావలంబ తెలంగాణా గురించి తన వైఖరిని స్పష్టం చేయాలి. ముస్లిం ప్రజల హక్కుల కాలరాచివేతకు, ముఖ్యంగా ఐఎస్ఐ ముద్రవేసి అమాయకులను వేధించడాన్ని కొనసాగించబోమని స్పష్టంగా ప్రకటించాలి. ఆదివాసీ, దళిత, మహిళా సమస్యలపై తన వైఖరిని స్పష్టం చేయాలి. అంతేకాదు ప్రస్తుతం తెలంగాణాలో కొనసాగుతున్న రాజ్యహింసపై బూటకపు ఎన్‌కౌంటర్లు మొదలుకొని తీవ్ర నిర్బంధంపై తన వైఖరి బిజెపి వైఖరి కాదని రుజువు చెయ్యాలి. ఎందుకంటే ఆమె బిజెపికి రాజీనామా చేసింది తప్ప ఆమెను బిజెపి తొలగించలేదు. చిన్న రాష్ట్రాలను బలపరుస్తానంటున్న బిజెపి కేంద్ర, రాష్ట్ర నాయకత్వాల ఆశీస్సులు కూడా ఆమెకు వున్నట్టు కనిపిస్తున్నది. అందువల్ల తెలంగాణాలో ప్రజాస్వామిక హక్కుల పునరుద్ధరణ గురించి ప్రపంచబ్యాంకు, ప్రపంచ వాణిజ్య సంస్థల దోపిడీ ప్రయోజనాలకు తెలంగాణా ప్రయోగశాల కావడం గురించి ఆమె వైఖరి ఏంటో తెలియజేయాలి.

తెలంగాణా రాష్ట్రం ఏర్పడితే స్వావలంబన విధానానికి కట్టుబడి వుంటుందని, ప్రజలు స్వాధీనం చేసుకున్న భూములు వారికే ఇస్తుందని ఒక్కమాటలో చెప్పాలంటే చర్చల సందర్భంగా మేము ప్రకటించిన ఎజెండాపై ఆమె వైఖరి ఏమిటో స్పష్టం చేయాలి.

ప్రత్యేక తెలంగాణాపై మా పార్టీ వైఖరిని అనేక సార్లు స్పష్టం చేసాం. శాంతి చర్చల ఎజెండాలో కూడా ప్రత్యేక తెలంగాణా అంశాన్ని చేర్చాం. ఎజెండాను చూసి వైఎస్‌ఆర్ ప్రభుత్వం తోక ముడుస్తుందని మేం అనుకున్నట్టే జరిగింది. మా పార్టీ.........

* ప్రత్యేక తెలంగాణాను పూర్తిగా సమర్థిస్తుంది. విశాల, ఐక్య మిలిటెంట్ ఉద్యమం ద్వారానే ప్రత్యేక తెలంగాణా సాధ్యమని విశ్వసిస్తుంది.
* ప్రజాస్వామ్యం, స్వావలంబన, భూమిలేనివారికి భూపంపిణీ నినాదాలతో ప్రత్యేక తెలంగాణా ఏర్పడాలని విశ్వసిస్తుంది, ఈ నినాదాలపై పోరాటానికి సిద్ధమైన వారందరితో కలిసి పోరాడుతుంది.
* తెలంగాణా అంటే మట్టి కాదనీ, తెలంగాణా అంటే మనుషులనీ విశ్వసిస్తూ ప్రజల కోసం స్పష్టమైన ఎజెండాను రూపొందించవలసిందిగా ప్రత్యేక తెలంగాణా రాష్ట్రం కోసం పోరాడాలనుకునే శక్తులన్నింటినీ కోరుతుంది.
* సర్వ సంపదలకు నిలయమైన తెలంగాణాలో కరువు కాటకాలకు, ఆకలిచావులకు తావు లేకుండా రైతాంగానికి సాగునీరు, సరిపడే విద్యుత్తు, బ్యాంకు రుణాలు, పంట దిగుబడులకు గిట్టుబాటు ధరలు, మార్కెటింగ్ సదుపాయాలు, కల్తీ విత్తనాలు పురుగుమందుల వ్యాపారులను కఠినంగా శిక్షిస్తూ ప్రభుత్వమే సరఫరా చేస్తుందనే హామీ ఇచ్చే పార్టీలనే తెలంగాణాలో అడుగుపెట్టనిస్తుంది.
* రెండవ ఎస్‌ఆర్‌సి ఏర్పాటనేది పచ్చి మోసపూరిత నినాదమనీ, దానిని తిరస్కరించాల్సిందిగా తెలంగాణా ప్రజలను కోరుతుంది. రెండవ ఎస్‌ఆర్‌సిని కోరే పార్టీల దగాకోరుతనాన్ని, వంచనను ఎండగడుతూ, ఆ పార్టీలకు తగిన బుద్ధి చెప్పవలసిందిగా తెలంగాణా ప్రజలను కోరుతుంది. ఇప్పుడు వైఎస్‌ఆర్ రెండవ ఎస్సార్సీని కూడా వదిలి మూడు ప్రాంతాలకు అభివృద్ధి బోర్డులని మాట్లాడుతున్నాడు. ఆంధ్రప్రదేశ్ ఏర్పాటుతో ఒక్క తెలంగాణా కోసమే ఏర్పడిన ప్రాంతీయ తెలంగాణా కమిటీ ఏం నిర్వాకం చేసిందో తెలంగాణా ప్రజలందరికీ తెలుసు. ఇప్పుడు మూడు అభివృద్ధి బోర్డులలో కోస్తా అభివృద్ధి బోర్డే తన మోసపూరిత గణాంకాలతో మిగిలిన రెండు ప్రాంతాల అభివృద్ధి హరిస్తుందనేది స్పష్టం. కనుక ఈ ప్రాంతీయ అభివృద్ధి బోర్డులను కూడా తిరస్కరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాం.
* వెనుకబడిన ప్రాంతానికి ఉపయోగపడని పులిచింతల ప్రాజెక్టును వెంటనే ఉపసంహరించుకోవాలనీ, ప్రజలను విభజించే విధానాలకు, ప్రాంతాల మధ్య తారతమ్యాలను పెంచే ప్రణాళికలకు స్వస్తి చెప్పాలని ప్రభుత్వాన్ని హెచ్చరిస్తుంది. తన మొండివైఖరిని విడనాడకుండా పులిచింతల వంటి ప్రజావ్యతిరేక ప్రాజెక్టులను నిర్మించపూనుకుంటే వాటిని అన్ని పద్ధతుల ద్వారా అడ్డుకోవలసిందిగా తెలంగాణా, ఆంధ్ర రాష్ట్రాల ప్రజలకు పిలుపునిస్తుంది.

ప్రత్యేక తెలంగాణా రాష్ట్ర డిమాండుకు ఆంధ్రప్రదేశ్‌లోని మా పార్టీకి చెందిన మూడు జోనల్ కమిటీలు (ఉత్తర తెలంగాణా, ఏఓబి, ఏపి రాష్ట్ర కమిటీలు), మా పార్టీ కేంద్రకమిటీ, పొలిట్‌బ్యూరోలు తమ పూర్తి మద్దతునిస్తున్నాయి. ప్రత్యేక తెలంగాణా కోసం మిలిటెంట్ పోరాటాలను చేపట్టవలసిందిగా ప్రజలకు, పార్టీ కార్యకర్తలందరికీ పిలుపునిస్తున్నాయి.

**ప్రకాష్,**
పొలిట్‌బ్యూరో,
సిపిఐ(మావోయిస్టు)

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# కేంద్ర కమిటీ

**30-5-2005**

ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రికి,

నీ పార్టీ నువ్వు అధికారం చేపట్టి సరిగ్గా ఒక సంవత్సరం కావస్తోంది. ఎన్నికల ముందు నువ్వు నీ పార్టీ నేతలు అనేక అంశాలపై, ముఖ్యంగా నక్సలైట్ల ఎడల వైఖరి, బూటకపు ఎన్‌కౌంటర్లపై న్యాయ చారణ, మా పార్టీపై నిషేధం ఎత్తివేత, ప్రజల వాక్‌సభా స్వాతంత్ర్యాల గ్యారంటీ, ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు, అక్రమ ఆస్తులు, కుంభకోణాలపై విచారణ, సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలపై, ప్రపంచ బ్యాంకు షరతులపై శ్వేతపత్రం, దళిత, మహిళ, మైనారిటీల సమస్యల పరిష్కారం వంటి వాగ్దానాల వర్షం కురిపించి ఓట్లు దండుకుని కాంగ్రెసు పార్టీ అధికారంలోకి వచ్చింది. అయితే ఈ వాగ్దానాలన్నింటినీ తుంగలోతొక్కి అతి తక్కువ కాలం లోనే ప్రజలను వంచించడానికి నువ్వు సిద్ధమవ్వడం ఆంధ్రరాష్ట్ర ప్రజల దౌర్భాగ్యం. వీటిలో అన్నింటికంటే ముఖ్యమైనదీ, నీ పార్టీ అత్యంత అట్టహాసంగా ప్రకటించి ఆరంభించినదీ నక్సలైట్లతో చర్చల ప్రక్రియ. ఇరువైపులా సంయమనం పాటించడం వలన, ముఖ్యంగా మా పార్టీ, ప్రజాసైన్యం, విప్లవ ప్రజాసంఘాల కార్యకర్తలు నీ పోలీసు అధికారుల కవ్వింపు చర్యలకు రెచ్చిపోకుండా ప్రజాభీష్టానికి అనుగుణంగా చైతన్యపూర్వకంగా వ్యవహరించడం వలన 8 నెలలపాటు రాష్ట్రంలో ప్రశాంత వాతావరణం నెలకొన్నది. అయితే జనవరి 6 న జనశక్తి దళ సభ్యుణ్ని వరంగల్ జిల్లాలో మీ పోలీసులు కాల్చి చంపడంతో ఈ ప్రశాంత వాతావరణం ఒక్కసారిగా భగ్గుమంది. 48 గంటలు కూడా గడవకముందే మా పిఎల్‌జిఎ దళంపై విచ్చల విడిగా కాల్పులు జరిపి లక్ష్మి అనే చైతన్య మహిళా సమాఖ్య కార్యకర్తను అరెస్టు చేసి, చిత్రహింసలకు గురిచేసి కాల్చిచంపి ప్రకాశం జిల్లాలో ఎన్‌కౌంటర్‌లో చనిపోయినట్లు నీ హంతక పోలీసు అధికారులు కట్టుకథ అల్లడంతో బూటకపు ఎన్‌కౌంటర్ల పర్వం తిరిగి ప్రారంభమయ్యింది. ఆత్మరక్షణార్థమే పోలీసులు కాల్పులు జరిపారని అది సరైనదేనని కనీస న్యాయ విచారణ జరపకుండానే అత్యంత అప్రజాస్వామిక నియంతృత్వ పద్ధతిలో నిస్సిగ్గుగా నువ్వు, నీ హోంమంత్రి ప్రకటించి ఏ నియంతృత్వ పాలనను, బూటకపు ఎన్‌కౌంటర్లను వ్యతిరేకిస్తూ ప్రజలు చంద్రబాబును గద్దె దింపారో, అదే నియంతృత్వ పాలనను,

బూటకపు ఎన్‌కౌంటర్లను తిరిగి ఎజెండాలోకి తెచ్చారు.

## ప్రజల వత్తిడి లేకపోతే చర్చల ఊసే ఎత్తేవాడివా?

నక్సలైట్లతో బేషరతుగా చర్చలు జరుపుతామని, చంద్రబాబు హయాంలో జరిగిన అన్ని బూటకపు ఎన్‌కౌంటర్లపై న్యాయ విచారణ జరిపి దోషులైన పోలీసు అధికారులను శిక్షిస్తామనీ, నక్సలైటు 'సమస్య' శాంతి భద్రతల సమస్య కాదనీ, సామాజిక-రాజకీయార్థికసమస్య అనీ, ఇంకా ఇలాంటివే గత అసెంబ్లీ ఎన్నికల ముందు దాదాపు 6 నెలలు నువ్వు, నీ పార్టీ నాయకులు ప్రజలను నమ్మించ యత్నించారు కానీ అధికారంలోకి వచ్చిననాటినుండి చర్చలు జరపడానికి షరతులు  విధించడానికి ప్రయత్నాలు చేస్తూనే వస్తున్నారు.

మే నెలలో ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిననాడే బెల్లంపల్లిలో జరిగిన బూటకపు ఎన్‌కౌంటర్‌ను సమర్థించడం ద్వారా ప్రజల వత్తిడి లేకపోతే చర్చల ఊసే ఎత్తేవాడివా? నక్సలైట్లతో బేషరతుగా చర్చలు జరుపుతామని, చంద్రబాబు హయాంలో జరిగిన అన్ని బూటకపు ఎన్‌కౌంటర్లపై న్యాయ విచారణ జరిపి దోషులైన పోలీసు అధికారులను శిక్షిస్తామనీ, నక్సలైటు 'సమస్య' శాంతి భద్రతల సమస్య కాదనీ, సామాజిక-రాజకీయార్థికసమస్య అనీ, ఇంకా ఇలాంటివే గత అసెంబ్లీ ఎన్నికల ముందు దాదాపు 6 నెలలు నువ్వు, నీ పార్టీ నాయకులు ప్రజలను నమ్మించ యత్నించారు కానీ అధికారంలోకి వచ్చిననాటినుండి చర్చలు జరపడానికి షరతులు విధించడానికి ప్రయత్నాలు చేస్తూనే వస్తున్నారు. మే నెలలో ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిననాడే బెల్లంపల్లిలో జరిగిన బూటకపు ఎన్‌కౌంటర్‌ను సమర్థించడం ద్వారా పోలీసుల అప్రజాస్వామిక చర్యలకు కితాబునివ్వనారంభించావు. 1990-1994 మధ్య 670 మంది విప్లవకారులను పొట్టనబెట్టుకున్న నీ కాంగ్రెసు ప్రభుత్వం తిరిగి అదే దారిలో నడవక తప్పదని నువ్వు అధికారం చేపట్టిననాటినుండే మా పార్టీ డాక్యుమెంట్లలో పేర్కొంటూ వస్తున్నాం. మా అంచనా ప్రకారమే 8 నెలల  విరామం తరువాత  జనవరి 6 నుండి తిరిగి ఎన్‌కౌంటర్ల పర్వానికి ప్రారంభోత్సవం చేసావు. అందుకే నేడు నీ హయాంలో జరిగిన జరుగుతున్న బూటకపు ఎన్‌కౌంటర్లపై, అమానుష హత్యాకాండపై న్యాయ విచారణ జరపడం తక్షణ డిమాండ్‌గా ప్రజల ముందుకు వచ్చింది.

అధికారంలోకి వచ్చిననాటినుండి ప్రతి ముఖ్య  విషయంలో ప్రజల వత్తిడి ద్వారానే నీ పార్టీ, నువ్వు దిగి వచ్చారు తప్ప నిజాయితీతో కాదు. కాల్పుల  విరమణ ప్రకటించడానికే నీకు నెల రోజుల పైన పట్టింది. ప్రజల, ప్రజాస్వామికవాదుల వత్తిడి వలన, కాల్పుల విరమణ

జరగకపోతే చర్చలకు మేము సిద్ధంగా లేమని తేల్చిచెప్పడం వలన నీ ప్రభుత్వం దిగివచ్చి జూన్ 16 నుండి3 నెలల కాల్పుల రమణ ప్రకటించింది. అప్పటినుండి మీరు ఆడుతూ వస్తున్న నాటకం బహుశా ప్రపంచ చరిత్రలోనే ఎక్కడా మనకు కనపడదు. కాల్పుల విరమణ ఒప్పంద నియమాలను రూపొందించుకుని వాటిని ఎవరు ఉల్లంఘించినా చర్య తీసుకోవాలని మా పార్టీ, జనశక్తిలు కలిసి ప్రతిపాదిస్తే 'నియమాలు' అని పిలవడానికి సిద్ధంకాక మీరు చాలా కాలం తాత్సారం చేసారు. మరో ప్రక్క 'ఆయుధాలు లేకుండా రాజకీయ ప్రచారం చేసుకోవచ్చు' అనే 7వ క్లాజును ఇరికించి, దానికి వివిధ సందర్భాలలో వివిధ అర్థాలు చెప్తూ సారాంశంలో ఆయుధాలతో నక్సలైట్లు గ్రామాలలో సంచరించకూడదనే షరతు విధించచూసారు. ఉభయులూ అంగీకరించిన కనీస నియమాలపై సంతకం చేయనిరాకరించారు. కాల్పుల విరమణకు చట్టబద్ధతలేకుండచేసి పర్యవేక్షక కమిటీని నామమాత్రం చేసారు. పదుల సంఖ్యలో పోలీసులవైపు నుండి ఉల్లంఘనలు జరుగుతున్నప్పటికీపర్యవేక్షక కమిటీ ప్రేక్షక పాత్రవహిస్తూ ఉండిపోయింది.

ఎట్టకేలకు మా వైపు నుండి పట్టు విడుపులతో ఉంటూ మొదటి రౌండు చర్చల ఎజెండాలో 7 వ క్లాజును చేర్చుదాం అని మేం ప్రతిపాదించడంతో ప్రతిష్టంభన తొలగి చివరకు కాల్పుల విరమణ ప్రకటించిన నాలుగు నెలల తరువాతైనా, చర్చలు ఆరంభమయ్యాయి. మొదటి దఫా చర్చల్లో మాది రాజకీయంగా పైచేయి కావడం, అనూహ్యమైన ప్రజాస్పందన రావడంతో ఖంగుతిన్నావు. మొదటి విడత చర్చలు ముగిసిన వెంటనే ఇక చర్చలకు ఫుల్‌స్టాప్ పెట్టాలని ఖచ్చితమైన నిర్ణయానికి వచ్చావు. వాషింగ్టన్, ఢిల్లీల నుండి వచ్చిన ఆదేశాల మేరకు నువ్వు రెండవ దఫా చర్చలు జరగకుండా చేయడానికి పథకరచన చేసావు. మా చర్చల ఎజెండా మీ దోపిడీ వర్గాలను, భూస్వాములను కలవరపరిచింది. 1 కోటి 20 లక్షల ఎకరాల భూములను పంపిణి చేయాలనే మా డిమాండ్ మొత్తం భూస్వామ్య వర్గాన్ని భయకంపితులను చేసింది. సామ్రాజ్యవాద ప్రపంచీకరణకు వ్యతిరేకంగా మేం లేవనెత్తిన 'స్వావలంబన' నినాదం సామ్రాజ్యవాదులను, ప్రపంచ బ్యాంకును, దళారీ బూర్జువావర్గాన్ని కుదిపి వేసాయి. ఇక దళిత, మహిళ, మైనారిటీ, ఆదివాసీల హక్కుల గురించి మేం రూపొందించిన డిమాండ్లను నువ్వు, నువ్వు ప్రాతినిధ్యం వహించే దోపిడీ పాలకవర్గాలు, జీర్ణించుకోలేకపోయాయి. మా డిమాండ్ల వలన ప్రజలు చైతన్యవంతులు కావడం, రాడికలైజ్ కావడం నువ్వు సహించలేనిది కాబట్టే రెండవ దఫా చర్చలకు సిద్ధంగా లేవు. మేం లేవనెత్తిన డిమాండ్లను చూడగానే ఫాక్షనలిజం, కమ్యూనలిజం కంటే నక్సలిజమే అత్యంత ప్రమాదకరంగా నీకు కనపడసాగింది. నక్సలైట్లను

అణచివేయడానికి అక్టోబరు చివరినుండే పథకం సిద్ధం చేసుకున్నావు.

చర్చల అనంతరం అక్టోబరు 30న జరిగిన రాష్ట్ర క్యాబినెట్‌లో అది పరాకాష్ఠకు చేరింది. 7వ క్లాజును సైతం ప్రక్కనపెట్టి ఆయుధ విసర్జన చేయాలన్నావు. చర్చలు వేరు, శాంతిభద్రతల పరిరక్షణ వేరు, అంటూ చిత్రమైన వాదనలను ముందుకు తెచ్చావు. కాల్పుల విరమణ ఒప్పందం చేసుకుంటే నీ పథకాన్ని అమలు చేయలేవు కాబట్టి డిసెంబర్ 16 నుండి కాల్పుల విరమణను పొడిగించకుండా ఇంతకు ముందులానే పోలీసులు సంయమనం పాటిస్తారనీ, రెండవ దఫా చర్చలు తప్పక జరుగుతాయనీ, హోంమంత్రి పచ్చి అబద్ధాన్ని ప్రకటించాడు. దాదాపు డిసెంబర్ ఆరంభం నుండి విస్తృతంగా గాలింపులు జరుపుతూ కనపడితే కాల్చడానికి నీ పోలీసులు సన్నద్ధం అయ్యారు. అడవిలో సైతం గాలింపులు నిర్వహించడం ప్రారంభించారు. అటువంటి పరిస్థితుల్లోనే శాఖ అడవుల్లో మందుపాతర పేల్చాం.

మరో దఫా చర్చలకు ఏ మాత్రం సిద్ధంగాలేని నువ్వు, ఈ వాస్తవాన్ని ఒప్పుకునే దమ్ము లేక చర్చలకు ఎప్పుడూ సిద్ధమేనని మతి భ్రమించిన వాడిలా నేటికీ మాట్లాడుతున్నావు. పాశవిక హత్యాకాండ ద్వారా మాతో ఆయుధ విసర్జన చేయించి చర్చలకు బలవంతంగా రప్పించాలని పగటికల కంటున్నట్టు స్పష్టమవుతోంది.

## చట్టబద్ధ పాలన-శాంతి భద్రతల సమస్య:

మొదటి దఫా చర్చలు జరగగానే ఒక్కసారిగా నీ ప్రభుత్వానికి శాంతిభద్రతల సమస్య ఎందుకు గుర్తుకొచ్చింది? శాంతియుతంగా స్థూపావిష్కరణలు, బహిరంగ సభలు జరుపుకోవడాన్ని కూడ సహించలేని నీ ప్రభుత్వానికి చట్టబద్ధ పాలన గురించి మాట్లాడేహక్కు ఎక్కడ వుంది? చట్టబద్ధపాలన గురించి మాట్లాడే నువ్వు ప్రజలకు చట్టబద్ధంగా చెందాల్సిన భూములను పంచడానికి సిద్ధం కాగలవా? చట్టవ్యతిరేకంగా వేలకోట్ల రూపాయల నల్లధనాన్ని కూడబెడుతున్న దోపిడీదార్లపై చర్య తీసుకోగలవా? జీతం వేలలో వుండే ప్రభుత్వాధికారులు, పోలీసు ఉన్నతాధికారులు కోట్లాది రూపాయల విలువ చేసే భవంతులు, ఎస్టేట్లు ఎలా సంపాదించుకున్నారో విచారణ జరిపి చట్టపరంగా చర్య తీసుకునే సత్తా నీకుందా? రాయలసీమలో నీ వర్గం పెంచి పోషించే సాయుధ ముఠాలను, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో పోలీసధికారుల సహాయంతో రియల్ ఎస్టేట్ వ్యాపారం కొనసాగిస్తూ వివిధ రకాలుగా ప్రజలను దోచుకుతింటున్న ప్రవేటు సాయుధ ముఠాలను నిరాయుధం చేయడానికి, అదుపు చేయడానికి నువ్వు చేపట్టిన చర్యలు ఏవి? అంతెందుకు, పసికందులను అమ్ముకునే

తన భార్యను చట్టం నుండి రక్షించుకోవడానికి చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడుతున్న నీ 'సర్వజిత్తుల సేనా' నాయకుడిని కట్టడి చేసే దమ్ముందా నీకూ నీ ప్రభుత్వానికీ?

## శాంతిభద్రతల పరిరక్షణ కోసమే ఎన్‌కౌంటర్లు జరుగుతున్నాయంటున్న నీ ప్రమాదకర సిద్ధాంతము :

ప్రపంచ శాంతి పరిరక్షణ కోసమే ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్‌లపై తాము దాడి చేసామని అక్కడ తాము చేసే ఊచకోత శాంతికోసం, ప్రజాస్వామ్యం కోసం అనివార్యమని పచ్చి అబద్ధాల కోర్లు, నియంతలూ ఐన బుష్, బ్లెయర్‌ల సిద్ధాంతాన్ని తు.చ తప్పకుండ అమలుచేస్తూ నక్సలైట్లను చంపడం ద్వారా శాంతిని స్థాపిస్తానంటున్నావు. నిన్నటిదాకా 'శాంతి భద్రతల' సమస్యగా చూడకూడదని వాదించిన నువ్వు ప్రపంచ బ్యాంకు అధినేత ఓల్ఫెన్‌సన్‌తో, సామ్రాజ్యవాద పెట్టుబడిదారులతో రహస్య మంతనాలు జరిపిన తరువాత ప్లేటు ఫిరాయించావు. మాతో మరో దఫా చర్చలు జరిపి స్వావలంబన, తెలంగాణ వంటి సమస్యలు చర్చించడానికి నువ్వు కానీ నీ సామ్రాజ్యవాద-భూస్వామ్య-దళారి పెట్టుబడిదారీ యజమానులు కానీ ఏ మాత్రం సిద్ధంగా లేరు కాబట్టే శాంతిభద్రతల సమస్యగా చిత్రించి క్రూర అణచివేత విధానాన్ని అమలు చేయడానికి కుట్ర పన్నారు.

కొత్తగా ఉత్పన్నమైన శాంతిభద్రతల సమస్యలేమీ లేకపోయినా ప్రజల్లో మా పార్టీకి పెరుగుతున్న ఆదరణ, మా విప్లవరాజకీయాలకు పెరుగుతున్న సాధికారత, ప్రజలు దినదినం రాడికలైజ్ కావడం, మా పార్టీని విప్లవ ప్రత్యామ్నాయంగా పరిగణిస్తూండడం, న్యాయమైన ప్రత్యేక తెలంగాణా డిమాండును అణచివేయాలనే దురుద్దేశం, రాష్ట్రంలోనూ నీ పార్టీలోనూ పెరుగుతున్న సంక్షోభం, మరో దఫా చర్చలు ఎటువంటి పరిస్థితుల్లోనూ జరగనివ్వకూడదని ఖచ్చితమైన నిర్ధారణకు రావడం, సామ్రాజ్యవాదుల దళారీ బూర్జువా వర్గాల వత్తిడి - వీటన్నింటి వలన ఒక్కసారిగా నీకు నక్సలిజం శాంతి భద్రతల సమస్యగా కనిపించనారంభించింది

ఇరాక్‌పై దాడి చేయాలని ఖచ్చితమైన నరయానికొచ్చిన తరువాత తన దురాక్రమణను సమరించుకోవడానికి అనేక అబద్ధాలను బుష్-బ్లెయిర్‌లు ఎలాగైతే విస్తృత ప్రచారానికి తెచ్చారో, అదే విధంగా గ్రామాల్లో నక్సలైట్లు నిర్బంధ వసూళ్లు చేస్తున్నారని, పంచాయితీలు నిర్వహించి బెదిరిస్తున్నారనీ, మందుపాతరలు ఏర్పాటుచేస్తున్నారనీ, పెద్దఎత్తున ఆయుధాలు సమకూర్చుకుంటున్నారనీ, రిక్రూట్‌మెంటు విపరీతంగా పెంచుకుంటున్నారనీ, ఇవి శాంతి భద్రతలకు భంగమనీ నువ్వు, నీ పోలీసుఅధికారులు ప్రచారం చేపట్టి హత్యాకాండకు సాధికారత

పొందాలని చూసారు.

వాస్తవమేమంటే నువ్వు రాష్ట్రాన్ని రక్తసిక్తం చేయడానికి నీ కిరాయి ఖాకీలకు ఆదేశాలు జారీ చేసేంతవరకూ అంటే దాదాపు 8నెలలుగా సంయమనం పాటించడంలో భాగంగా ఒక్క హింసాయుత ఘటనకు మేం పాల్పడలేదు. కోవర్టులు, ఇన్‌ఫార్మర్లు వంటి వారు దొరికితే పత్రికా లేఖరుల సమావేశంలో ప్రవేశపెట్టి వదిలివేశాం. డబ్బు వసూళ్ల కోసం మీ దోపిడీవర్గ పార్టీలవలే, పోలీసులవలే ఏ ఒక్కరిని నిర్బంధించింది లేదు. ప్రజల సమస్యలను ప్రధానంగా తీసుకుని పని చేసాం. దీనివలన నీ పోలీసు అధికారుల రాబడి గణనీయంగా తగ్గిపోయింది. చట్టబద్ధంగా పాలించడం అంటే అక్రమ సంపాదనకు కళ్లెం పడడమే కాబట్టి చట్టాన్ని పాతర వేసి పోలీసు రాజ్యాన్ని నెలకొల్పడం నీకూ నీ అధికారులకు అవసరం.

వాస్తవానికి నీ ప్రభుత్వమూ పోలీసులే కాల్పుల రమణను ఉల్లంఘిస్తూ వచ్చారు. అక్టోబరు 30న జరిగిన రాష్ట్ర క్యాబినెట్ సమావేశం తరువాత శాంతియుతంగా జరిగే సభలు-సమావేశాలకు అనుమతినివ్వకపోవడం, అమరుల స్థూపావిష్కరణలను సైతం అడ్డుకోవడమే కాక స్థూపాలను కూలగొట్టడం, వందలాదిమంది ప్రజలపై అక్రమ కేసులను బనాయించడం, మావోయిస్టుల సభలకు హాజరైనవారి వీడియోలు తీసి, వారిని వేధించడం, నక్సలైట్లు ఎదురుపెడితే లేదా వారి ఆచూకీ తెలిస్తే కాల్పులు జరపడం, లొంగుబాట్లను ప్రోత్సహించడం, త్రిసూత్ర పథకం పేరుతో, కౌన్సిలింగ్ పేరుతో గ్రామాల్లో విస్తృతంగా పర్యటిస్తూ, ఇన్‌ఫార్మర్ వ్యవస్థను ఏర్పరచుకోవడం, కోవర్టులను తయారుచేసుకోవడం - ఇలా పలు విధాలా అప్రజాస్వామికంగా, నిరంకుశంగా వ్యవహరించడంతో నక్సలైటు వ్యతిరేక ప్రచారాన్ని ముమ్మరం చేస్తూ వాతావరణాన్ని కలుషితం చేసారు.

నక్సలిజాన్ని నువ్వు ఈ రోజు శాంతి భద్రతల సమస్యగా చూడడం వలన సైనిక పరిష్కారాన్ని వెతుకుతున్నావు. దీనివలన నిజంగానే శాంతి భద్రతల సమస్య తలెత్తుతుంది. నీ పోలీసులు చేసే దాడులను మేం సాయుధంగా ఎదుర్కొనక తప్పదు. రాజ్యహింస వలన ప్రతిహింస కూడ పెరుగుతుంది. ఇప్పటికే దాదాపు 50 మంది విప్లవకారులను నీ కిరాతక పోలీసులు బలిగొన్నారు. కాకమ్మ కథలు చెప్పడంలో నియంత చంద్రబాబు కంటే నువ్వు ఒక ఆకు ఎక్కువే చదివావు. రోజూ ప్రకటన ఇస్తూ నీ కిరాయి పోలీసుల మనోబలాన్ని నిలబెట్టుకోవడానికి ఫలయత్నాలు చేస్తున్న నువ్వూ, నీ హోంమంత్రి, డీజీపీలు నక్సలైట్లను ఎదుర్కొనే దమ్ము లేక అత్యంత హేయమైన, నాగరిక సమాజం తలవంచుకునే పద్ధతులను

ప్రోత్సహిస్తున్నారు. మానాలలో మా 10మంది కామ్రేడ్స్‌కు అన్నంలో విషం కలిపి రాత్రంతా అత్యంత పైశాచికంగా హింసించి సామూహికంగా హత్య చేయించావు.

ఇటువంటి సంఘటన చంద్రబాబు ఫాసిస్టు హయాంలో కూడ కనపడదు. బహుశా ప్రపంచ చరిత్రలోనే ఇది అరుదైనది. నువ్వు 9 నెలల్లోనే ఈ ప్రపంచ ఘనత సాధించావు. కామ్రేడ్స్ రమేష్, బాబన్నల వంటి యోధులను ప్రత్యక్షంగా ఎదుర్కొనే దమ్ము నీ పోలీసులకు లేదని ప్రజలకు స్పష్టమై పోయింది. కామ్రేడ్ యాదన్న, రంజిత్, సీను, సంతోష్-పుష్పలు, మధు ఇంకా మా కామ్రేడ్స్ అనేకమందిని పట్టుకుని కాల్చావు. నిరాయుధంగా ఉన్న లక్ష్మి, సుదర్శన్ వంటి ప్రజాసంఘాల కార్యకర్తలను, చివరికి తెరాస, తెదేపా వారిని సైతం కాల్చిచంపి ఎన్‌కౌంటర్ కథలల్లావు. జనశక్తి, ప్రజాప్రతిఘటన, సీపియుఎస్ఐ, తదితర సంస్థల కార్యకర్తలను, నాయకులను ట్రీట్‌మెంటుకో మరోపని మీదో బయటకు వెళ్ళినప్పుడు, నిరాయుధులుగా ఉన్నప్పుడు పట్టుకుని హత్యచేస్తూ మేం నిరాయుధ పోలీసులను హత్య చేస్తున్నామని గగ్గోలు చెడుతున్నావు.

ఒక పక్క చిన్న పిల్లలకు సైతం పై విషయాలు అర్థం అయ్యే విధంగా ఉన్నా నువ్వూ నీ మంత్రులూ, నీ క్రిమినల్ డీజీపి, రోజూ'చట్టపరంగానే, చట్టప్రకారమే' ఎన్‌కౌంటర్లు జరుగుతున్నాయని ప్రకటించడం చూస్తే హిట్లర్ సంతతి మన రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిందా అని అనుమానం కలగక మానదు. నీ దృష్టిలో నక్సలైట్లు ఎంత మూర్ఖులంటే కిట్ బ్యాగులు, తుపాకులు, తూటాలు కూడ వదిలేసి పోలీసులపై కాల్పులు జరిపి చనిపోయిన వారు చనిపోగా మిగిలినవారు పోలీసులు ఆత్మరక్షణార్థం చేసిన ఎదురుకాల్పుల ధాటికి తట్టుకోలేక పారిపోతారు. ఇటువంటి జుగుప్సాకరమైన కథలు ఆంధ్రరాష్ట్ర ప్రజలు గత మూడు దశాబ్దాలుగా వింటూనే ఉన్నారు. పోలీసు మెదళ్ళకు ఇంతకంటే మంచి కథలల్లడం ఎలాగు సాధ్యం కాదు. కాని నువ్వు, నీ హోంమంత్రి కూడా పోలీసు అధికారుల స్థాయికి దిగజారడం క్షమించరానిది. నువ్వు నరహంతక వెంగళ్రావు, జనార్థన్‌రెడ్డి, చంద్రబాబును మించిన నియంతగా అతి తక్కువ వ్యవధిలో రికార్డు సృష్టించదలుచుకున్నావు.

నువ్వు రెండవ దఫా చర్చలుంటాయని రోజూ ఊదరగొడుతూ, మా దళాలను ఏమరుపాటులో ఉంచి మొదటి దెబ్బ తీసావు. దీనికి నువ్వు, నీ పార్టీ, నీ పోలీసు అధికారులు మూల్యం చెల్లించుకోక తప్పదు. 1990 నాటి చెన్నారెడ్డి హయాంలో లభించిన వెసులుబాటులోనూ బలపడ్డాం. ఆ తరువాత జనార్థనరెడ్డి ఫాసిస్టు హయాంలో కూడా బలపడుతూనే వచ్చాం. గత 8 నెలలుగా మేం బలపడుతున్నాం అనీ, నిర్బంధ వసూళ్లు

చేస్తున్నామనీ- ఇవన్నీ నేరాలైనట్లు వాపోతున్న మీకు మరోసారి హెచ్చరిస్తున్నాం. ఇప్పుడు యుద్ధం ఆరంభమయ్యింది కాబట్టి మేం ఇక వసూళ్లు నిజంగానే చేసుకోవాల్సి వుంది. ఆయుధాలను సేకరించుకుంటాం. ఇన్‌ఫార్మర్లను, విధాన నిర్ణేతలను, క్రూర అధికారులను శిక్షిస్తాం. ప్రజలను వేధించే నీ పోలీసుల పుణ్యమా అని నిర్బంధం వలన 4మా రిక్రూటుమెంట్ మరింతగా పెరుగుతుందే తప్ప తగ్గదు. సామాజిక పరిష్కారంగా ప్రజలు ఎంచే నక్సలిజాన్ని శాంతి భద్రతలసమస్యగా మార్చిన నీకు తగిన విధంగా బుద్ధి చెప్తాం. మా పార్టీ పై యుద్ధాన్ని ప్రకటించిన నీ కాంగ్రేసు ప్రభుత్వానికి 1994 లోప్రజలు తగిన బుద్ధి చెప్పారు. అదే ముఖ్య అంశంగా ముందుకు తెచ్చిన చంద్రబాబు ప్రభుత్వానికి గత సంవత్సరం బుద్ధి చెప్పారు. మారిపోయినట్టు నటించిన నీ పార్టీకి ఓట్లు వేసి గెలిపించినా (అదీ తెదెపా విధానాలపైన కోపంతో) నువ్వు నేడు అమలుచేస్తున్న విధానాలకు ప్రజల మద్దతు ఏ కోశానా లేదనేది పచ్చి వాస్తవం. అది ఏ రూపంలో వ్య క్తమవనున్నదో అనతి కాలంలోనే చూస్తావు.

నువ్వు మా పార్టీపై నిషేధం విధించడానికి రంగం సిద్ధం చేయడం పిరికిపందల చర్యనే. అమెరికన్ సామ్రాజ్యవాదులు మా కొత్తపార్టీని నిషేధించారు. ఇక వారి తొత్తుగా నువ్వు ఎక్కువ కాలం తాత్సారం చేయవని తెలుసు. మొగిలిచర్ల నుండి గుత్తికొండబిలం వరకూ మా ప్రజాబలం ఏమిటో చూసిన నువ్వు నీ దోపిడీ పాలకవర్గాలు ప్రజాఉద్యమాలను అణచడానికి ఇదే మార్గాన్ని ఎంచుకుంటారని మాకు ముందే తెలుసు. ఎలాగూ నేడు మా పై అప్రకటిత నిషేధం కొనసాగుతూనే ఉంది. నిషేధం కేవలం ప్రజలను భయపెట్టడానికేనని అందరికీ తెలుసు. కానీ నీలాంటి ఫాసిస్టు పాలకులు ఆశించినట్టు ప్రజలు భయపడరు. మాపార్టీలో, ప్రజాసైన్యంలో, రహస్య ప్రజాసంఘాలలో పెద్ద ఎత్తున చేరుతూనే ఉంటారు. నీ ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఉద్యమాలను చేపడ్తారు. నిషేధం విధించినా మాకు ప్రజలలో పూర్తి మద్దతు ఉంటుంది, మా సాయుధ పోరాటానికి సాధికారత ఉంటుంది. నీ నిషేధాన్ని నవ్వులపాలు చేస్తారు. అరెస్టులు, చిత్రహింసలు, నిషేధాలు, బూటకపు ఎన్‌కౌంటర్లు ప్రజలను కానీ, మాకార్యకర్తలను కానీ భయపెడ్తాయనుకోవడం నీ లాంటి ఫాసిస్టు పాలకుల పగటికలే. చరిత్ర ఇప్పటికే ఈ సత్యాన్ని చాలా సార్లు రుజువు చేసినా నీ వర్గ ప్రయోజనాలు నిన్ను చూడనివ్వదు. అందుకే చివరికి చరిత్ర పెంటకుప్పలోకి నిర్దాక్షిణ్యంగా నెట్టబడతావు. నీ కిరాయి పోలీసు మూకలు పశుబలంతో భయోత్పాతాన్ని సృష్టించినా ప్రజలు, ప్రజల తరఫున మేం తగిన పాఠం చెప్తాం.

మాది గెరిల్లా యుద్ధం. గెరిల్లా పద్ధతులలోనే సంఖ్యలోనూ, ఆయుధాలలోనూ అనేక రెట్లు ఎక్కువగా ఉన్న శత్రుమూకలను ఎదుర్కొంటాం. నీ పోలీసులు పెద్ద ఎత్తున దాడికి

పాల్పడితే మేం తప్పుకుంటాం. మాకనుకూలమైన సమయంలో మాకనుకూలమైన చోట దాడి చేస్తాం. అమరులైన మా కామ్రేడ్స్ సాక్షిగా చెప్తున్నాం. నీ రక్తపు బాకీని వడ్డీతో సహా తీర్చుకుంటాం. మరో నాలుగేళ్ళు నువ్వు బతికి బట్ట కట్టడం అసంభవమని ఘంటాపథంగా చెప్తున్నాం. మేం యుద్ధానికి ఎప్పుడూ సిద్ధమే. నిజమైన ఎన్‌కౌంటర్లైతే నీ పోలీసులపై, నీపై మాకు కంప్లైంట్స్ ఏమీ ఉండవు. కానీ కుట్ర పద్ధతుల్లో మా కామ్రేడ్స్‌ను పట్టుకుని కాల్చేస్తున్న నీకు నీ పార్టీ లోని విధాన నిర్ణేతలకు, క్రూరమైన పోలీసు అధికారులకు తగిన శిక్ష విధించకుండా ఎలా ఉండగలం? పిరికి చర్య అనో, అమాయకులను చంపామనో నువ్వు, నీ హోంమంత్రీ, పోలీసు అధికారులు ఎంత అరచి గీపెట్టినా ప్రజామోదంతోనే మేం మహేష్‌చంద్ర లద్దా వంటి అధికారులను, నీ పార్టీ నాయకులను మరింత పకడ్బందీ పథకంతో మట్టుపెడ్తాం. మా కార్యాచరణలో తప్పులు జరిగితే ప్రజలను క్షమాపణ కోరతాం. సత్యాన్ని ప్రకటిస్తాం. ఎప్పుడూ అబద్ధాలు తప్ప మరొకటి మాట్లాడలేని, మా నాయకుల పేర్లతో ప్రకటనలివ్వకపోతే మనలేని నీ ప్రభుత్వానికి, ప్రజల ప్రయోజనం తప్ప మరోప్రయోజనం లేని మా నిజాయితీ నిబద్ధతలకు మధ్య తేడాను మా సిద్ధాంతాన్ని, మార్గాన్ని ఒప్పుకోని వారు సైతం అర్థం చేసుకుంటారు.

మా పార్టీ నేడు దేశవ్యాప్తంగా విస్తరించి ఉంది. ఆంధ్ర రాష్ట్రంలోని మా పార్టీకి మా కేంద్ర కమిటీ, పొలిట్‌బ్యూరోలు పూర్తి అండదండలందిస్తాయి. నీ పాశవిక దాడిని దీటుగా ఎదుర్కొనేలా మా శక్తులకు అన్ని విధాలా తర్ఫీదునిస్తాయి. మరి కొన్ని నష్టాలు జరిగినా వాటిని పూడ్చుకుని నీ హయాంలో మరింతగా బలపడ్తాం. నీ దాడి పుణ్యమా అని మా శక్తులు నేడు రాష్ట్రవ్యాప్తంగా కొత్త ప్రదేశాలకు సైతం విస్తరిస్తున్నాయి. మరింత రహస్య పద్ధతులను అలవాటు చేసుకుంటున్నాయి. గెరిల్లా పద్ధతులను మరింత నిశితంగా అమలు చేయడం నేర్చుకుంటున్నాయి. నీ చుట్టుపక్కనే మా రహస్య పార్టీ నిర్మించబడుతోంది. నీ దాడి ఎంత దుర్మార్గంగా ఉంటే అంతే రహస్యంగా మా పార్టీ నగర నడిబొడ్డులోనే బలపడుతుంది. ఇది బహిరంగంగానే ప్రకటిస్తున్నాం. మా రహస్య పార్టీని నువ్వు తలకిందులు తపస్సు చేసినా విఛ్ఛిన్నం చేయలేవు.

ప్రకాష్,

పొలిట్‌బ్యూరో,

సిపిఐ (మావోయిస్టు)

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# కేంద్ర కమిటీ

**10-6-2005**

## తెరాస నేతలకు మేం ఇచ్చిన జూన్ 15 అల్టిమేటం గురించి

కాంగ్రెసుతో తెగతెంపులు చేసుకుని జూన్ 15 నాటికి ఆ ప్రభుత్వం నుండి తెరాస నాయకులు బయటకు రాకపోతే ప్రజలు ఆ పార్టీ నేతలకు తగిన బుద్ధి చెప్పాలనీ, గ్రామాలకు రానివ్వవద్దని మేం 10 రోజులు క్రితం పిలుపునిచ్చాము. అలాగే ప్రత్యేక తెలంగాణా డిమాండ్‌పై వివిధ పార్టీల వైఖరులను మా ప్రకటన ఎండగట్టింది.

మా పార్టీ వైఖరిని స్పష్టం చేస్తూ ప్రకటన వెలువడిన నాటినుండి మీడియాలో తెలంగాణా రాష్ట్ర సమితికి మేము యిచ్చిన అల్టిమేటం గురించి విభిన్న స్పందనలు, ఖండనలు, వక్రీకరణలు వచ్చాయి. సహజంగానే వైఎస్ తదితర కాంగ్రెసు నాయకులు భావస్వేచ్ఛను హరించివేసే వారిగా మమ్మల్ని చిత్రించబూనుకున్నారు. సి.పి.ఐ పార్టీ నాయకుడైన సురవరం గారుప్రాంతీయ బోర్డుల ఏర్పాటుకు తమ పార్టీ మద్దతునీయడం ప్రజాస్వామిక హక్కంటూ దానిని విమర్శించే హక్కు మరొకరికి లేదన్నట్లు మాట్లాడారు. 'ప్రజాస్వామ్యం'లో ఏ పార్టీకైనా ఒక విషయంపై స్వేచ్ఛగా వైఖరి తీసుకునే హక్కు వుంటుందనీ,కాంగ్రెసు ప్రభుత్వంలో పాల్గొనాలా లేదా అనేది తెరాస నిర్ణయించుకోవాల్సిందే తప్ప మరొకరు నిర్దేశించేది కాదనీ, అలాచేయడం అప్రజాస్వామికమనీ వాపోయారు.

మరో పక్క పోలీసు అధికారులు తెరాస నేతలకు భద్రత కల్పించడంలో మునిగిపోయారు. మొత్తంగా చూస్తే జూన్ 15 గడువు పూర్తవగానే మా పార్టీ, ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం, తెరాస కార్యకర్తలు, నాయకులపై భౌతికపరమైన దాడులు చేస్తాయనే పద్ధతిలో ప్రచారం సాగుతోంది.

మేం మరొకసారి స్పష్టం చేయదలుచుకున్నదేమంటే, జూన్ 15 లోగా కాంగ్రెసు ప్రభుత్వంతో తెగతెంపులు చేసుకోకపోతే భౌతిక దాడులు చేస్తామని మేము ప్రకటించలేదు. అది మా ఉద్దేశం కాదు. అయితే ప్రత్యేక తెలంగాణా డిమాండ్‌పై ఏ ప్రజలనైతే నమ్మించి ఓట్లుపొంది గెలిచారో, ఆ ప్రజల ఆకాంక్షలకు వ్యతిరేకంగా కాంగ్రెసు, ముఖ్యంగా దానికి

నాయకుడైన వైఎస్ఆర్, అతి స్పష్టంగా తెలంగాణాను వ్యతిరేకిస్తున్నా, యింకా వారితో అధికారంలో పాలుపంచుకోవడం, రేపో మాపో తెలంగాణా ఏర్పడబోతుందంటూ గత సంవత్సర కాలంగా ప్రజలను ఉద్యమించకుండా మభ్యపెట్టొండడం, అధికార సుఖాలకు అలవాటు పడిపోయి, ప్రత్యేక తెలంగాణా డిమాండును నీరుకారుస్తూ, 'నక్సలైట్ల ఎజెండానే మా ఎజెండా' అంటూ ఎన్నికల్లో సీట్లు సంపాదించుకొని, తెలంగాణాలోనూ, రాష్ట్రంలోని యితర ప్రాంతాలలో మాపై హత్యాకాండ కొనసాగిస్తున్న ప్రభుత్వంలో భాగస్వాములవడం - వీటన్నింటి దృష్ట్యా తెరాస నాయకులు గ్రామాలకు వస్తే తరిమికొట్టాలని మేము ప్రజలకు పిలుపునిచ్చాం.

మేం యిచ్చిన పిలుపు సరియైనది, ప్రజాస్వామ్యబద్ధమైనది అని మరోసారి స్పష్టం చేస్తున్నాం. ఏ ప్రజలైతే ఒక పార్టీని లేదా వ్యక్తిని ఎన్నుకుంటారో వాళ్లను ప్రశ్నించే హక్కు, నిలదీసే హక్కు, ద్రోహం చేసినప్పుడు తరిమికొట్టే హక్కు కూడా ఆ ప్రజలకుంటుందని మేం గాఢంగా విశ్వసిస్తున్నాం. ప్రజల తరఫున నిలబడే మా పార్టీ, ప్రజా సైన్యం (పిఎల్జిఏ) ద్రోహం చేసిన నేతలకు తగిన బుద్ధి చెప్తాయి.

'భావ స్వేచ్ఛ' అనేది ఊకదంపుడు ఉపన్యాసాలతో సిద్ధించేది కాదు. ప్రత్యేక తెలంగాణాను సమర్థించేవారికి, వ్యతిరేకించేవారికి మధ్య, 1/70 చట్టాన్ని సమర్థించేవారికి, వ్యతిరేకించే వారికి మధ్య, ఆర్టీసి కార్మికుల లేదా జూనియర్ డాక్టర్ల సమ్మెను సమర్థించే వారికి, వ్యతిరేకించే వారికి మధ్య, ఇలా ప్రజల ప్రయోజనాలకు ప్రజా వ్యతిరేక ధోరణులకు మధ్య ఘర్షణ తప్పనిసరి. ఈ ఘర్షణ వివిధ రూపాల్లో ఉంటుంది. భావస్వేచ్ఛ పేరుతో తమ వైఖరి ప్రజావ్యతిరేకమైనప్పటికీ దానిని ఎవరూ వ్యతిరేకించకూడదనే ధోరణి అత్యంత అప్రజాస్వామికమైనది.

మా పార్టీని, ప్రజాసంఘాలను సభలు, సమావేశాలు జరుపుకోనివ్వకుండా, సంవిధానంలో పొందుపరిచిన కనీస ప్రజాస్వామిక హక్కులను సైతం వాటికి నిరాకరిస్తూ నిరంకుశ పాలనను కొనసాగిస్తున్న వైఎస్, జానారెడ్లకు ఇతర పార్టీల భావస్వేచ్ఛను మేం హరించి వేస్తున్నామని మాట్లాడే నైతికహక్కు లేదు. దోపిడీవర్గాలకు ప్రాతినిధ్యం వహించే కాంగ్రేసు, తెదేపా వంటి పార్టీలకు - దోపిడీ వర్గాలకు, దోపిడీకి గురయ్యేవారికీ మధ్య రాజీలు కుదిర్చే సీపీఐ వంటి పార్టీలకూ - మేం చెప్పేది అప్రజాస్వామికంగా కన్పించడంలో ఆశ్చర్యమేమీ లేదు.

ఇప్పటికైనా మేం మరోసారి తెరాస కార్యకర్తలకు, నాయకులకు మనవి చేసేదేమంటే కాంగ్రెసు ప్రభుత్వంతో సంబంధాలు తెగతెంపులు చేసుకోండి. ప్రజలకు ద్రోహం చేసే విధానాలకు స్వస్తి చెప్పి ప్రజలను కదిలిస్తూ, ప్రత్యేక తెలంగాణా ఉద్యమ నిర్మాణానికి ముందుకు రండి. లేకుంటే ప్రజలు, ప్రజల తరఫున నిలబడే మా పార్టీ, పిఎల్‌జిఏలు తప్పకుండా మీకు తగిన బుద్ధి చెప్తాయి.

తెరాస నాయకత్వం ఇదే వైఖరిని కొనసాగిస్తూ కాంగ్రెసు ప్రభుత్వంతో తెగతెంపులు చేసుకోకుంటే  ఆ పార్టీ నుండి బయటకు రావాలనీ, పోరాడే సంస్థలతో కలవాలని ఆ పార్టీ కార్యకర్తలకు విజ్ఞప్తి చేస్తున్నాం. ప్రజా వ్యతిరేక విధానాలను కొనసాగిస్తున్న ప్రభుత్వంలో పోలీసు రక్షణలో కొనసాగుతారో లేక ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఆ ప్రభుత్వం నుండి వైదొలుగుతారో తేల్చుకోవాలని తెరాస నాయకులకు చివరిసారిగా హెచ్చరిస్తున్నాం.

**ప్రకాష్,**
**పొలిట్‌బ్యూరో తరఫున,**
**సీపీఐ (మావోయిస్టు)**

పత్రికా ప్రకటన

# ఎస్ఐబి అబద్ధాల కుప్ప!

# ప్రభుత్వపు దుష్ప్రచారాల దుర్మార్గాన్ని ఎదిరించండి!

అబద్ధాలు, అభూత కల్పనలు సృష్టించడంలో, దుష్ప్రచారం చేయడంలో, దారుణమైన హత్యలను ఎదురుకాల్పులుగా చూపడంలో, కిరాయి హంతకులను పోషించడంలో నైపుణ్యం సంపాదించిన రాష్ట్ర పోలీసు యంత్రాంగం, ముఖ్యంగా స్టేట్ ఇంటిలిజెన్స్ బ్యూరో, ఒక వారం రోజులుగా మరెన్నో అబద్ధాలను ఉద్దేశ్యపూర్వకంగా, కుట్రబుద్ధితో పత్రికలకు, ఛానెళ్ళకు లీక్ చేస్తోంది. ఎవరో ముఖ్యులను లక్ష్యంగా పెట్టుకుని యాక్షన్ టీంలు రంగంలోకి దిగాయని, యాక్షన్ టీంలలో ఫలానా వాళ్ళున్నారని, కేంద్రకమిటీలో ఫలానా వాళ్ళున్నారని, ముంబాయిలో నేపాల్ మావోయిస్టులతో రహస్య సమావేశం జరిగిందని, విప్లవ రచయిత వరవరరావు కేంద్రకమిటీ సభ్యుడని పచ్చి అబద్ధాలు, తామే సృష్టించిన అభూతకల్పనలు పోలీసులు ప్రచారం చేస్తున్నారు. గతంలో మా ఆం.ప్ర. రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పేరుతోనూ, అధికార ప్రతినిధి బలరాం పేరుతోనూ అబద్ధపు ప్రకటనలు సృష్టించిన పోలీసులకు ఈ కుట్ర పద్ధతులు అలవాటే.

వరవరరావును మా కేంద్రకమిటీ సభ్యుడిగా ప్రకటించడం పోలీసుల దుర్మార్గానికి చిహ్నం. ఆయనకు మా పార్టీతో, కేంద్రకమిటీతో ఎటువంటి సంబంధం లేదు. మేం ప్రభుత్వంతో చర్చలు జరపబోయినప్పుడు విధివిధానాల రూపకల్పన కోసం నలభై సంవత్సరాలుగా ప్రజా జీవితంలో ఉన్న మేధావిగా ఆయనను ప్రతినిధిగా ఎంచుకున్నాం. ఆయనతోపాటే అదే కారణం వల్ల గద్దర్, కళ్యాణరావులను కూడా ఎంచుకున్నాం.పూర్తికాలం పనిచేసే కార్యకర్తలు కుటుంబ సంబంధాలు వదులుకున్న కార్యకర్తలు మాత్రమే మా పార్టీలో ఏ స్థాయిలోనైనా కమిటీలలో, నాయకత్వ స్థానాలలో ఉంటారు. ఇక బహిరంగ ప్రజా జీవితంలో ఉండి, నలభై సంవత్సరాల పాటు అధ్యాపక వృత్తిలో ఉండి, రిటైరయి, రచయితగా, మేధావిగా బహిరంగంగా ఉన్న వరవరరావు మా పార్టీ కేంద్ర కమిటీలో ఉండే అవకాశం ఎంత ఉందో అందరికి అర్థమయ్యే విషయమే.

చర్చల సమయంలో, కేంద్రకమిటీ, పొలిట్‌బ్యూరోల తరపున నేను చర్చల సరళిని గైడ్ చేసే బాధ్యతలో ఉన్నాను. ఆ విషయం 2004 జులైలో నల్లమలలో పత్రికల వారికి నేను వివరించే ఉన్నాను. ఆ బాధ్యతలో భాగంగానే నేను చర్చల ప్రతినిధులతో, మధ్యవర్తులతో, దూతలతో, ప్రభుత్వంతో, పత్రికా విలేకరులతో ఉత్తర ప్రత్యుత్తరాలు నడిపాను, సంభాషణలు జరిపాను. అది సాకుగా, వరవరరావుకు నేను రాసిన ఉత్తరాలు సాక్ష్యంగా చూపుతూ, ఇప్పుడు ఈ అబద్ధ ప్రచారం చేయడం ప్రభుత్వ దుర్మార్గానికి చిహ్నం. పైగా వరవరరావుకు నేను రాసిన ఉత్తరంలో లేని మాటలు కల్పించే దుష్టత్వానికి కూడా పోలీసులు పాల్పడుతున్నారు. మాపై నిషేధం విధించిన ఫాసిస్టు వైఎస్ఆర్ – జానారెడ్డి – స్వరణ్‌జిత్ సేన్ ప్రభుత్వం, దూతలుగా వ్యవహరించిన ఆ ముగ్గురిపై కూడా కక్షసాధింపు ప్రారంభించింది. అనారోగ్య పీడితులుగా ఉన్న వరవరరావు, కళ్యాణరావులు జైలు నుంచి బైటికి రాకుండా చేయడానికి కేసుల మీద కేసులు బనాయిస్తోంది. వారికి ఏ మాత్రం సంబంధం ఉండడానికి వీలులేని చిలకలూరిపేట పోలీస్ స్టేషన్ పై దాడి వంటి అబద్ధపు కేసులు బనాయిస్తోంది. ఒక కేసు నుంచి మరో కేసుకు రాష్ట్రమంతా తిప్పుతూ వారి ఆరోగ్యాలకు, ప్రాణాలకు ప్రమాదకరంగా వ్యవహరిస్తోంది. 35 సంవత్సరాలుగా రచనలకు, ఉపన్యాసాలకు పరిమితమై, ప్రజా సమస్యలను ఎత్తి చూపుతూ, ప్రజా పోరాటాలకు మద్దతు ఇస్తున్న విప్లవ రచయితల సంఘాన్ని నిషేధించి వైఎస్ఆర్ – జానారెడ్డి – స్వరణ్‌జిత్‌సేన్ ప్రభుత్వం చరిత్రలో హిట్లర్, ముస్సోలినీలు కూడా చేయలేని పని చేశారనే రికార్డు స్థాపించుకున్నారు.

ప్రజల పట్ల, ప్రజా ఉద్యమాల పట్ల, ప్రజాసాహిత్యం పట్ల, ప్రజా రచయితల పట్ల వైఎస్ఆర్ – జానారెడ్డి – స్వరణ్‌జిత్ సేన్ ప్రభుత్వం సాగిస్తున్న ఈ దుర్మార్గానికి వారు తగిన మూల్యం చెల్లించక తప్పదు.

తనను తాను ప్రజాస్వామిక ప్రభుత్వమని చెప్పుకుంటున్న ఈ ప్రభుత్వం అందుకు అర్హత సంపాదించాలంటే తక్షణమే ఈ కింది పనులు చేయాలని మేం డిమాండ్ చేస్తున్నాం.

విరసంపైన, ఇతర ప్రజాసంఘాలపైన, మా పార్టీ పైన నిషేధాన్ని తొలగించాలి.

వరవరరావు, కళ్యాణరావు, గద్దర్‌ల పైన అబద్ధపు కేసులన్నిటినీ వెంటనే ఉపసంహరించుకుని, వరవరరావు, కళ్యాణరావులను విడుదల చేయాలి.

నర్సాకోబ్రాస్, కాకతీయ కోబ్రాస్ తమ సృష్టి కాదని నిరూపించుకునేందుకైనా, వారిని తక్షణమే అరెస్టు చేసి హత్య, హత్యాయత్నం, బెదిరింపు వంటి నేరాల కేసులు పెట్టాలి.

**గంగాధర్**
పొలిట్‌బ్యూరో మెంబర్
కేంద్రకమిటి
**భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్ట్)**
9.09.2005

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# కేంద్ర కమిటీ

**2-11-2005**

## మావోయిస్టు పార్టీని, పీఎల్‌జీఏని ఎదుర్కోలేని దోపిడీ పాలక వర్గాలు, ఎస్‌ఐబీ వంటి ప్రజావ్యతిరేక సంస్థలు పచ్చి అబద్ధాలతో దుష్ప్రచారానికి దిగడం, సత్యమూర్తి దానికి వంతపాడడం అత్యంత నీచమైన, హేయమైన చర్య. ప్రజలు, ప్రజాస్వామికవాదులు, మీడియా ఈ కుట్రలను ఖండించాలని మా పార్టీ విజ్ఞప్తి.

**'మావోయిస్టు ప్రముఖుడి లొంగుబాటు'?** అని అక్టోబర్ 28 నాటి వార్త దినపత్రికలోనూ, 'మావోయిస్టు అగ్రనేత ఉనికిపై అనుమానాలు' అనే శీర్షికతో 29 నాటి ఈనాడు దినపత్రికలోనూ పోలీసు వార్తలు వెలువడగా దానిపై విప్లవ ద్రోహి సత్యమూర్తి స్పందిస్తూ లొంగిపోబోయే మావోయిస్టు నాయకుడు మల్లోజుల కోటేశ్వరరావు అలియాస్ ప్రహ్లాద్ అయిఉంటాడని మతి చలించిన వాడిలా వ్యాఖ్యానించాడు. ప్రహ్లాద్ పోలీసుల అదుపులోనే ఉన్నాడనీ, ప్రభుత్వంతో రహస్య మంతనాలాడుతున్నాడనీ అసత్యమూర్తి గారు ప్రజలను నమ్మించ ప్రయత్నించాడు. నాయకుల మధ్య తలెత్తిన విభేదాల మూలంగానూ, అనారోగ్యం మూలంగానూ ఒక ముఖ్య నాయకుడు లొంగిపోతున్నట్లు 'విశ్వసనీయంగా' తెలియవచ్చిందంటూ పత్రికలు రాసాయి.

ఇటువంటి అబద్ధాలను ప్రచారంలో పెట్టడం మన దేశ పాలక వర్గాలకు, ముఖ్యంగా మన రాష్ట్రంలోని పాలక వర్గ పార్టీలకు ఎస్‌ఐబీ, గ్రేహౌండ్స్ తదితర ప్రజావ్యతిరేక కిరాయి బలగాలకు వెన్నతో పెట్టిన విద్యనే. మానవరహిత విమానాలు, అత్యంతాధునిక ఆయుధాలు, వేలాది సాయుధ బలగాలను కలిగి ఉన్నా మావోయిస్టులను అణచడంలో పూర్తిగా విఫలమైన దోపిడీ పాలక వర్గాలు, మావోయిస్టులతో వారి ప్రజా విముక్తి గెరిల్లా సైన్యంతో ప్రత్యక్ష యుద్ధానికి దిగే మానసిక స్థైర్యం లేని వారి కిరాయి పోలీసు బలగాలు పచ్చి కట్టుకథలను, అబద్ధాలను మీడియా ద్వారా ప్రచారంలో పెట్టి విప్లవ క్యాంపును, అశేష ప్రజానీకాన్ని గందరగోళ పరచే విఫలయత్నం చేస్తున్నారు.

ఇటీవలి కాలంలో వీరు చేసిన దుష్ప్రచారం చూస్తే మావోయిస్టులనెదుర్కోలేని నైరాశ్యం ఎంత గాఢంగా వీరినావరించిందో అర్థమవుతుంది. గత మార్చ్-ఏప్రిల్ నెలల్లో రామకృష్ణ పేరు మీద బలరాం పేరు మీద ఎస్ఐబీ వారిచ్చిన ప్రకటనలను ఆంధ్ర రాష్ట్ర ప్రజలింకా మరచిపోలేదు. ఇప్పుడు కేంద్ర స్థాయి నాయకత్వంపై తమ ప్రచారస్త్రాన్ని గురిపెడుతూ సెప్టెంబర్ మధ్య నుండి ప్రహ్లాద్ అనే మా కేంద్ర కమిటీ సభ్యుడు అరెస్టయ్యాడనే వదంతులు సృష్టించారు. అంతకు ముందే ఆయనకు తూటా తగిలి గాయమయ్యిందనీ ఛత్తీస్‌ఘడ్‌లోని ఒక హాస్పటల్‌లో చికిత్స పొందుతున్నాడనీ కట్టుకథను ప్రచారంలో పెట్టారు. ఈ వదంతుల వలన విప్లవ క్యాంపులో ఒక మేరకు గందరగోళం సృష్టించగలిగారు. ఈ వార్తలు నిజమనుకుని మా పార్టీ కమిటీలు సైతం 'అరెస్టు'ను ఖండిస్తూ ప్రకటనలిచ్చాయి. మా పార్టీ నాయకత్వం అత్యంత రహస్యంగా ఫంక్షన్ అవుతూ ఉండడం వలన ఇటువంటి కట్టుకథలు మీడియాలో రాగానే వెంటనే వివరణ ఇవ్వలేకపోతున్నాం. ఈ బలహీనతనాసరా చేసుకునే ఎస్ఐబీ కానీ ఇతర రాష్ట్రాల ఇంటెలిజెన్స్ విభాగాలు కానీ మీడియాలో తప్పుడు వార్తలను నిరంతరం ఫ్లోట్ చేస్తున్నారు.

మేము ఈ తప్పుడు వార్తలను కొంత వరకూ రేడియో ద్వారా వినగలుగుతున్నాం కానీ వెంటనే ఖండిస్తూ లేదా స్పష్టీకరిస్తూ ప్రకటన పంపలేక పోతున్నాం. ఇటువంటి దుర్మార్గపు దుష్ప్రచార దాడి, విస్తృత గాలింపుల మధ్యనే మా పార్టీ కేంద్ర కమిటీ రెండవ సమావేశం జయప్రదంగా ముగిసింది. మాకున్న కొన్ని ఇబ్బందుల వలన కామ్రేడ్ ప్రహ్లాద్ గురించి వచ్చిన తప్పుడు వార్తలను ఖండిస్తూ వెంటనే ప్రకటన పంపలేకపోయాం. కామ్రేడ్ గణపతి పేరు మీద కామ్రేడ్ గద్దర్ గురించి ఎస్ఐబీ పోలీసులు ప్రకటన విడుదల చేసినప్పుడు సైతం మేం వెంటనే ప్రకటన పంపలేకపోయాం. కొంత ఆలస్యమైనప్పటికీ ఇటువంటి అబద్ధాలను ఎండగడుతూ వాస్తవాలను ప్రజల ముందు ఉంచుతామని తెలియచేస్తున్నాం. సత్యమూర్తి వంటి వారు పోలీసు ప్రచారానికి మరింత విశ్వసనీయతను కలుగచేసే ప్రయత్నం చేస్తూ పాలకవర్గ ఏజెంటు పాత్రను పోషిస్తున్నారు. ఇటువంటి దుష్ప్రచారాన్ని సాగించే పాలక వర్గాల-పోలీసుల నిజ స్వరూపాన్ని, వారికి విశ్వసనీయ ఏజెంట్లుగా పని చేసే సత్యమూర్తి వంటి వారి పాత్రనూ ప్రజలు గ్రహించవలసిందిగా సీపీఐ(మావోయిస్టు) పార్టీ విజ్ఞప్తి చేస్తోంది.

అబద్ధాలను నిజాలుగా ప్రచారం చేయడానికి ఎస్ఐబీ పోలీసులు, పాలక పార్టీలు ప్రయత్నిస్తున్న నేపథ్యంలో మీడియా పాత్ర చాలా బాధ్యతాయుతమైనదిగా ఉంటుందని

మేం చెప్పనవసరం లేదు. మీడియాకందే వార్తల సోర్స్ గురించి స్పష్టత లేకపోతే వాటికి ప్రామఖ్యతనీయడం వలన అబద్ధాలను ప్రచారం చేయడమే అవుతుంది. అబద్ధాలని రుజువైన తరువాత అటువంటి అబద్ధాలు ఎక్కడి నుండి, ఎవరి నుండి వచ్చాయో మీడియా బయట పెట్టడం ద్వారా అందరికీ ఉపయోగపడుతుంది. మీడియా ఇటువంటి బాధ్యతాయుతమైన పాత్రను పోషించగలిగితే అబద్ధాలను ఫ్లోట్ చేసేవారికి కొంత కష్టమే అవుతుంది. 'మావోయిస్టు ప్రముఖుడి లొంగుబాటు' అని మొన్న వచ్చిన 'వార్త'ను ఎవరు ఎందుకు ఇచ్చారో వాటిని ప్రచురించిన దినపత్రికలు, టీవీ ఛానళ్ళు ఇప్పటికైనా విశ్లేషించి ఆ వార్తల మూలాలను ప్రజల ముందు ఉంచడం భావ్యంగా ఉంటుంది. అలాగే పోలీసు ప్రచారానికి వత్తాసు పలుకుతూ మావోయిస్టు పార్టీ నాయకత్వంపై నిందారోపణలు చేస్తూ, అబద్ధాలతో ప్రజలను పక్కదోవ పట్టించడానికి ప్రయత్నించిన సత్యమూర్తి ప్రజలకు, పార్టీకి క్షమాపణ చెప్పాలి. తిరిగి ఇటువంటి అబద్ధాలకు ఒడిగట్టననీ, పోలీసులకు ఉపయోగపడే విధంగా నడుచుకోననీ హామీ ఇవ్వాలి. ఇది ఆయన కనీస బాధ్యత.

ప్రకాష్,
పొలిట్‌బ్యూరో తరఫున,
సీపీఐ (మావోయిస్టు)

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)

# కేంద్ర కమిటీ

**1-3-2006**

## దంతేవాడ జిల్లాలోని డోర్నాపాల్ ఘటనకు రమణ్‌సింగ్ ప్రభుత్వమూ, మహేంద్ర కర్మ నాయకత్వంలోని కాంగ్రేస్ పార్టీలదే పూర్తి బాధ్యత

## సల్వాజుడుం పేరుతో సీఆర్‌పీ-నాగా ఫోర్స్-కర్మ గూండాల సర్కారీ జులుంను నిలపకపోతే మా దాడులు మరింత తీవ్రస్థాయిలో కొనసాగుతాయి

మంగళవారం నాడు ఛత్తీస్‌ఘడ్‌లోని డోర్నాపాల్ వద్ద మా పీఎల్‌జీఏ నాయకత్వంలో వందలాది మంది ప్రజలు దాడిచేసిన సంఘటనలో 24 మంది సల్వాజుడుం కార్యకర్తలు చనిపోగా మరి కొందరు గాయపడ్డారు. ఇది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గత జూన్ మాసం నుండి మావోయిస్టు పార్టీపై ఆదివాసీ ప్రజానీకంపై కొనసాగిస్తున్న దుర్మార్గపు అణచివేత క్యాంపెయిన్ ఫలితమే. దీనికి పూర్తి బాధ్యత వహించాల్సింది రమణ్‌సింగ్-మహేంద్రకర్మలే. ఈ ఘటనలో కొందరు అమాయకులు మృతి చెందడంపై మేం విచారం వ్యక్తం చేస్తూనే దండకారణ్యంలో విప్లవోద్యమానికి వ్యతిరేకంగా ఉన్న తెగ పెద్దలు, దోపిడీదార్లను సంఘటితం చేస్తూ అమాయక ప్రజలపై సీఆర్‌పీ-నాగా ఫోర్స్ గూండాలు ఊచకోతను దౌర్జన్యాలను కొనసాగించినంత కాలం ఇటువంటి దాడులు కొనసాగుతూనే ఉంటాయని మరోసారి హెచ్చరిస్తున్నాం. మహేంద్ర కర్మ గూండాలు, పోలీసులు సల్వాజుడుంలో పాల్గొనవలసిందిగా ఆదివాసీ ప్రజలపై వత్తిడి తెచ్చినా వారిని ఎదిరించాలనీ, ఆదివాసీ వ్యతిరేక సభలను బహిష్కరించాలనీ దండకారణ్య ప్రజలకు మా పార్టీ పిలుపునిస్తోంది.

శాంతియాత్ర (సల్వాజుడుం) పేరుతో దంతేవాడ, బస్తర్, కాంకేర్ జిల్లాలలో 9 నెలల నుండి అత్యంత క్రూరమైన అణచివేత క్యాంపెయిన్‌ను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టాయి. సీఆర్‌పీ-నాగా బెటాలియన్ పోలీసులు ఊళ్ళకు ఊళ్ళే తగలబెట్టి 20,000 మందిని నిర్వాసితులను చేసారు. 120 మందికి పైగా అమాయక ఆదివాసీలను అమానుషంగా హత్యగావించారు. 50 మందికి పైగా మహిళలపై అత్యాచారం జరిపారు. తమ దుర్మార్గపు

చర్యలు బయటకు పొక్కకుండా మీడియాపై సైతం ఆంక్షలు విధించారు. ఇవన్నీ తెలిసి కూడ పోలీసు కథనాన్ని మాత్రమే వినిపిస్తూ, ఆదివాసీలు 'అన్నలకు వ్యతిరేకంగా తిరగబడ్డార'ని కట్టుకథలు రాస్తున్న మీడియాకు నేడు డోర్నపాల్ ఘటన ఆదివాసీలకు వ్యతిరేకంగా కనపడడంలో ఆశ్చర్యమేమీ లేదు. సల్వాజుడుం వెనుక వాస్తవాలను వెలికి తీయడంలోనూ, కేంద్ర రాష్ట్ర పోలీసు బలగాల దుర్మార్గపు చర్యలను బహిర్గతపరచడంలోనూ మీడియా పూర్తిగా విఫలమవడమే కాక విప్లవోద్యమంపై దోపిడీ పాలకవర్గాలు కొనసాగిస్తున్న దుష్ప్రచారానికి సాధికారతనివ్వడం ద్వారా అది కూడ సల్వాజుడుంలో పరోక్ష భాగస్వామిగా మారిపోయింది. ఉదాహరణకు గత జూన్‌లో కోత్రపాల్‌లో సలవాజుడుం గూండాలపై ప్రజలు తిరగబడగా 12 మందిని హత్య చేసామని (కొన్ని పత్రికలైతే వందలాది మంది అని రాసాయి, వాస్తవానికి ఒక్కరు కూడ చనిపోలేదు) దుష్ప్రచారం చేసాయి. వాస్తవాలు బయటకొచ్చిన తరువాత కూడ నేటికీ అదే ప్రచారం కొనసాగిస్తున్నాయి.

గత 9 నెలలుగా ఛత్తీస్‌ఘడ్‌లో సల్వాజుడుం పేరుతో కొనసాగుతున్నది వాస్తవానికి సర్కారీ జులుం. తమ ప్రజావ్యతిరేక చర్యలవలన విప్లవోద్యమంచే శిక్షించబడినవారూ, అనేక గ్రామాలలో ఏర్పడిన జనతన సర్కారు వలన తమ పెత్తందారీ అధికారాన్ని కోల్పోయిన కొందరు తెగపెద్దలూ, ప్రభుత్వ నిధులను స్వాహాచేసే అవకాశాన్ని కోల్పోయినవారూ , ప్రభుత్వాధికారులుతో మొదటినుండీ మిలాఖత్తైనవారూ, విప్లవోద్యమానికి బయట ఉన్న గ్రామాలవారూ, మహేంద్రకర్మ నాయకత్వంలో ఏకమయ్యారు. శాంతియాత్ర పేరుతో ఆదివాసీలపై దండయాత్రకు బయలుదేరారు. తమ అభియాన్‌ను ఆదివాసీల తిరుగుబాటుగా చిత్రిస్తూ తమ పాశవిక అణచివేతకు సాధికారతను పొందే ప్రయత్నం చేసారు. ఈ అణచివేత క్యాంపెయిన్‌కు స్థానిక తెగ పెద్దలు, దోపిడీదారులు నాయకత్వం వహిస్తుండగా బడా కాంట్రాక్టర్లు, దళారీ రాజకీయ నాయకులు, ప్రత్యేకించి రుయియా (ఎస్సార్ స్టీల్), టాటా, మిత్తల్, జిందాల్ వంటి బడా పెట్టుబడిదారులు, పెద్ద ఎత్తున నిధులను సమకూర్చారు. ఛత్తీస్‌ఘడ్‌లోని ఖనిజ సంపదను కొల్లగొట్టాలంటే దానికి అడ్డంకిగా ఉన్న విప్లవోద్యమాన్ని దెబ్బతీయకుండా సాధ్యం కాదు. అందుకే వీరు కేంద్ర ప్రత్యేక బలగాలను రప్పించి ఊచకోతకు సిద్ధపడ్డారు. ఛత్తీస్‌ఘడ్ ప్రభుత్వం గత సంవత్సర కాలంలోనే ఈ పెట్టుబడిదారులతో 60,000 కోట్ల రూపాయల విలువ చేసే ఎంఓయూలపై సంతకాలు చేసింది. వెనువెంటనే బర్బర దాడికుపక్రమించింది. ఝార్ఖండ్, ఒరిస్సా రాష్ట్రాలలోని ఖనిజ సంపదను దోచుకోవడానికి కూడ ఇదే తరహా కార్యక్రమాన్ని సెంద్రా, శాంతి సేన పేర్లతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టాయి.

సల్వాజుడుం పేరుతో ఛత్తీస్‌ఘడ్‌లో, ప్రత్యేకించి దంతేవాడ జిల్లాలో, కేంద్ర రాష్ట్ర

ప్రభుత్వాలు కొనసాగిస్తున్న పాశవిక అణచివేతను ప్రజలు ప్రజాస్వామికవాదులందరూ ఖండించాలి. దండకారణ్యంలో శాంతి నెలకొనాలంటే సల్వాజుడుం అణచివేత క్యాంపెయిన్‌ని వెంటనే నిలిపివేయడం, కేంద్ర పోలీసు బలగాలు, ముఖ్యంగా నాగా బెటాలియన్ వారు జరుపుతున్న గూండాయిజం, అత్యాచారాలపై న్యాయవిచారణ జరిపి దోషులను శిక్షించడం, పోలీసులు, సల్వాజుడుం గూండాలు కలిసి తగలపెట్టిన 60 ఊర్లను తిరిగి పునర్నిర్మించాలి, ధ్వంసం చేసిన దాదాపు నాలుగు కోట్ల రూపాయల ప్రజల ఆస్తికి నష్టపరిహారం చెల్లించాలి. బలవంతంగా ప్రజలను క్యాంపులలో నిర్బంధించడం నిలిపివేసి పోలీసుల, సల్వాజుడుం గూండాల భయం లేకుండా వారి ఊర్లలో ఉండే స్థితి కల్పించాలి. వీటి అమలుకై దేశంలోని ప్రజలందరూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై వత్తిడి తేవాలి.

ఎస్సార్-టాటా-మిత్తల్ వంటి పెట్టుబడిదారులు, దళారీ రాజకీయ నాయకులు, లంచగొండి ప్రభుత్వాధికారులు, బడా కాంట్రాక్టర్లు, తెగ పెద్దల ప్రయోజనాలకై సల్వాజుడుం పేరుతో అణచివేత కొనసాగినంత కాలం మేం వివిధ రూపాలలో దాడులకు పూనుకోక తప్పదు. కేంద్ర-రాష్ట్ర ప్రత్యేక పోలీసు బలగాలు, స్థానిక పెత్తందార్లే మా ప్రధాన లక్ష్య మైనా వారితో కలిసి దౌర్జన్యాలు చేస్తున్న సల్వాజుడుం నాయకులు, కార్యకర్తలను కూడ విడిచిపెట్టం. మేం చేసే ప్రతి దాడిలో వందల వేల సంఖ్యలో ఆదివాసీ ప్రజలు స్వఛ్ఛందంగా పాల్గొంటున్నారన్న వాస్తవాన్ని విస్మరించడం సరికాదు. వేలాది సంఖ్యలో ప్రజలను సమీకరించి వివిధ రూపాలలో, అవసరమైవ దగ్గర పెద్ద దాడుల ద్వారా కూడ, సల్వాజుడుం అణచివేత క్యాంపెయిన్‌ను అడ్డుకుంటాం. కేంద్ర-రాష్ట్ర పోలీసు బలగాలకు, మహేంద్ర కర్మ గూండావాహినికి తగిన బుద్ధి చెప్తాం. నేడు మావోయిస్టులు అమాయకులను చంపారంటూ గొంతు చించుకుని అరచి గీపెడుతున్న వారు దంతేవాడ జిల్లాలోని గ్రామాలకు వెళ్ల సాహసిస్తే కనీస వాస్తవాలను తెలుసుకోవడానికి ఉపయోగపడుతుంది. మావోయిస్టు పార్టీకి పేద ప్రజల ప్రయోజనాలను సంరక్షించడమే, వారిని విముక్తి చేయడమే లక్ష్యం కాబట్టి ఎవరినీ అనవసరంగా చంపదు. డోర్నపాల్‌లో మేం సల్వాజుడుం కార్యకర్తలపైనే దాడి జరిపాం. ఇక ముందు కూడ దాడులను పెద్ద ఎత్తునే జరుపుతాం. సల్వాజుడుం గూండాల, పోలీసుల వత్తిడికి లొంగి వారితో కలిసి మావోయిస్టు వ్యతిరేక సభలకు, గ్రామాలపై దాడులకు వెళ్ళవద్దని మరోసారి ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాం.

**ఆజాద్**

**అధికార ప్రతినిధి**

**కేంద్ర కమిటీ**

**సీపీఐ (మావోయిస్టు)**

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)

# కేంద్ర కమిటీ

**12-9-2007**

## అగస్టు 24 వతేదీన ముంబైనుండి అపహరించుకుపోయిన సీటీసి కామ్రేడ్ సంతోష్ (వినోద్)ను వెంటనే కోర్టులో హాజరుపరచాలి!

అగస్టు 24న ముంబాయిలో తను అద్దెకుంటున్న ఇంటినుండి సీటీసి సభ్యుడైన కామ్రేడ్ సంతోష్‌ను ఏపీఎస్ఐబి పోలీసులు దొంగలవలె రహస్యంగా అపహరించుకుని ఆంధ్రప్రదేశ్ తీసుకెళ్ళారు. అంతకు 5 రోజుల ముందు ఏపీ పోలీసుల సహాయంతో మహారాష్ట్ర పోలీసులు అక్కడి రాష్ట్ర కమిటీ సెక్రటరీ మరియు సీసీ సభ్యుడైన కామ్రేడ్ విజయ్ ఇంటిపై దాడి చేసి ఆయనను పట్టుకుపోయిన విషయం తెలిసిందే. నేటికి మూడు వారాలు కావస్తున్నా ఆయనను కోర్టులో ప్రవేశపెట్టలేదు. అరస్టు చేసినట్లు కూడ ప్రకటించలేదు.

ఏపీ ఎస్ఐబి పోలీసులు తమ చేతికి చిక్కిన వారిని ఎంత క్రూరంగా చిత్రహింసలకు గురిచేసి చివరికి హత్యగావిస్తారో తెలియనివారు లేరు. కా. సంతోష్‌ను కూడ గత 20 రోజులుగా తీవ్రంగా హింసిస్తున్న ఎస్ఐబి పోలీసు బృందం ఆయనను ఎప్పుడైనా హత్యగావించే ప్రమాదం ఉంది. ఆయనను వెంటనే కోర్టులో ప్రవేశపెట్టవలసిందిగా సీపీఐ(మావోయిస్టు) కేంద్ర కమిటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తోంది. కా. సంతోష్‌కు ఏమైనా హాని జరిగితే దానికి పూర్తి బాధ్యత నేడు ఆంధ్ర రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రేసు ప్రభుత్వానిదేననీ, దీనికి కాంగ్రేసు పార్టీ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదనీ మా పార్టీ కేంద్ర కమిటి తీవ్రంగా హెచ్చరిస్తుంది.

కా. సంతోష్‌ను వెంటనే కోర్టులో హాజరుపరచాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వం పై వత్తిడి తీసుకురావలసిందిగా ప్రజలను ప్రజాస్వామ్యవాదులను కోరుతున్నాం. చట్టబద్ధ పరిపాలనకే బద్ధులమై ఉన్నామంటూ కారుకూతలు కూసే వైఎస్ఆర్, తదితర కాంగ్రేసు నాయకులు తమ ప్రభుత్వ పోలీసులు అరస్టు చేసిన వారిని కనీసం కోర్టులో కూడ ప్రవేశపెట్టకుండా చట్టాలను

నిస్సిగ్గుగా తుంగలో తొక్కుతుంటే పెదవి విప్పడంలేదు. 30 ఏండ్లకు పైగా విప్లవోద్యమ పురోగమనానికి నిర్విరామంగా పనిచేస్తున్న కా. సంతోష్‌కు ప్రాణహాని జరిగితే కాంగ్రేసు నాయకులందరూ దానికి బాధ్యులుగా మా పార్టీ పరిగణిస్తుందని మరోసారి హెచ్చరిస్తున్నాం.

**ఆజాద్**

**అధికార ప్రతినిధి**

**కేంద్ర కమిటీ**

**సీపీఐ (మావోయిస్టు)**

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# సెంట్రల్ రీజినల్ బ్యూరో

**23-6-2009**

## వీరోచితమైన లాల్‌గఢ్ పోరాటానికి దేశవ్యాప్తంగా సంఘీభావాన్ని ప్రకటించండి!

## లాల్‌గఢ్ పోరాటంపై ఊచకోతకు పాల్పడుతున్న సోషల్ ఫాసిస్టులనూ, కేంద్ర ప్రభుత్వాన్ని ఎండగట్టండి!!

చారిత్రాత్మక నక్సల్బరీ వసంతమేఘ గర్జనతో భారతదేశ విప్లవానికి నూతన ప్రజాస్వామిక వెలుగును చూపించిన పశ్చిమ బెంగాల్ మరోసారి విప్లవ వెల్లువై చారిత్రక రంగం మీదికి వచ్చింది. ఈ సారి ఈ విప్లవ వెల్లువకు లాల్‌గఢ్ చిరునామా అయింది. నక్సల్బరీకి సగర్వమైన కొనసాగింపయింది. 'నక్సల్బరీ'ని పాశవికంగా అణచివేసిన రివిజనిస్టు, సోషల్ ఫాసిస్ట్ సి.పి.ఎం. ఇప్పుడు లాల్‌గఢ్ పోరాటాన్ని అణచివేయడానికి పూనుకుంది. కేంద్ర ప్రభుత్వ సహాయంతో సి.ఆర్.పి.ఎఫ్., కోబ్రా బెటాలియన్లను మోహరిస్తూ రక్తపుటేరులు పారించడానికి దుష్ట పథకాలు రచిస్తోంది.

పశ్చిమ బెంగాల్‌లో గత 40 ఏళ్లుగా రాజ్యమేలుతున్న రివిజనిస్టులు ప్రజలపై నిరంకుశ అధికారాన్ని చెలాయిస్తూ సోషల్ ఫాసిస్టులుగా తయారయ్యారు. ఒక వైపు సోషలిజం కబుర్లు చెప్తూ, మరోవైపు రాష్ట్రాన్ని దోపిడీ వర్గాలకు దోచిపెడ్తున్నారు. తాము అధికారంలో లేని రాష్ట్రాల్లో సామ్రాజ్యవాద అభివృద్ధి నమూనాను వ్యతిరేకిస్తున్నట్టుగా నటిస్తూ, తాము అధికారంలో వున్నచోట అదే అభివృద్ధి నమూనాను మరింత దూకుడుగా అమలు చేస్తున్నారు. అందులో భాగంగానే సింగూర్లో కార్ల ఫ్యాక్టరీ ఏర్పాటుకు టాటాకు వేల ఎకరాల భూములను కట్టబెట్టడానికి చూసారు. నందిగ్రాంలో డౌ కెమికల్ హబ్‌ను ఏర్పాటు చేయడం కోసం వేల ఎకరాల భూములను లాక్కునే ప్రయత్నం చేశారు. కానీ తెభాగ, నక్సల్బరీలకు వారసులైన ప్రజలు వీరోచితంగా పోరాడి తీవ్రమైన దమనకాండను ఓడించి టాటాను తరిమి కొట్టారు. నందిగ్రాంలో

సెజ్‌ను అడ్డుకున్నారు. ఇలా తమ పోరాటం ద్వారా ప్రపంచీకరణలో భాగంగా నిర్వాసితమవుతున్న దేశ ప్రజలందరికీ ఒక అనుసరణీయమైన మార్గాన్ని చూపించారు. ఇది సామ్రాజ్యవాదులకూ, దళారీ నిరంకుశ బూర్జువాలకూ, ఈ వర్గాలకు నిస్సిగ్గుగా పాదసేవ చేస్తోన్న రివిజనిస్టు సి.పి.ఎం.కూ కంటగింపైంది.

తాను అనుసరిస్తున్న విధానాలను ప్రజలు ఇంతగా వ్యతిరేకిస్తున్నారనీ, తిరగబడ్తున్నారనీ స్పష్టంగా అర్థమవుతున్నా బుద్ధి తెచ్చుకోని బుద్ధదేవ్ దోపిడీ వర్గాల పాదసేవలో మరింత సాగిలా పడ్తూ పశ్చిమ మిడ్నాపూర్ జిల్లాలోని సల్బనీ ప్రాంతంలో 35 వేల కోట్ల పెట్టుబడితో ఉక్కు ఫ్యాక్టరీ నిర్మించడానికి జిందాల్‌కు అనుమతినిచ్చాడు. 2008, నవంబర్ 2న అట్టహాసంగా ఈ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవాన్ని ముగించుకొని వస్తున్న బుద్ధదేవ్, రాం విలాస్ పాశ్వాన్‌ల కాన్వాయ్‌పై ప్రజల ఆగ్రహం మందుపాతరై పేలింది. ప్రజల ప్రగాఢమైన ఆకాంక్ష మేరకు పి.ఎల్.జి.ఎ. లాల్‌గఢ్‌కు సమీపంలో ఈ చర్యకు పాల్పడింది. కానీ బుద్ధదేవ్ తృటిలో ప్రాణాలతో బయటపడ్డాడు. ఆ తర్వాత ప్రతీకారంతో రగిలిపోతూ లాల్‌గఢ్ ప్రాంత ప్రజలపై విరుచుకుపడ్డాడు. ఇండ్లను తగులబెట్టి పెద్దఎత్తున విధ్వంసం సృష్టించారు. మహిళలపై అత్యాచారాలు చేశారు, కొందరు పురుషులను అరెస్టు చేశారు. అయితే ప్రజలు పెద్ద ఎత్తున ప్రభుత్వ దమనకాండను ప్రతిఘటించారు. ఈ పోరాటం మూడు దశలుగా నడిచింది. 2008 నవంబర్ 5 నుండి డిసెంబర్ 5 వరకూ నడిచిన మొదటి దశలో ప్రజలు పెద్ద ఎత్తున కదిలి రోడ్లను తవ్వేసారు. చెట్లను కూల్చి, రోడ్లపై ఆటంకాలను కల్పించి ఒక్క పోలీసునుకానీ, సి.పి.ఎం. గూండాలను కానీ అడుగుపెట్టనీయలేదు. లాల్‌గఢ్ పోలీస్ స్టేషన్‌పై సాంప్రదాయక ఆయుధాలతో దాడి చేశారు, వాహనాలను తగులబెట్టారు. ఈ ప్రాంతంలోని నాలుగు వందల గ్రామాలతో బయట ప్రపంచానికి గల సంబంధాన్ని తెంచేశారు. క్రమంగా ఈ పోరాటం పురూలియా, బంకూర, పశ్చిమ్ సింగ్‌భూమ్ జిల్లాలలోని 18 బ్లాకులకు వ్యాపించింది. డిసెంబర్ 5 నుంచి 25 వరకూ నడిచిన రెండవ దశ పోరాటంలో శత్రు దాడి తీవ్రతరం అయింది. సి.పి.ఎం. ప్రభుత్వం సల్వాజుడుం తరహాలో దాడులను ప్రారంభించింది. జనప్రతిరోధ్ అనే పేరుతో ఒక సంస్థను సృష్టించి మాంజీ మర్రాడా అనే జె.ఎం.ఎం. నాయకుడిని ముందుపెట్టి దాడులు చేయించింది. ఇంకా అనేక కొత్త సంస్థలను పుట్టించి దాడులకు పాల్పడింది. మరోవైపు కుట్రపూరితంగా ఆదివాసీ సాంప్రదాయక నాయకులతో

సంప్రదింపులు జరిపి వాళ్లను లోబర్చుకుని, వారిచేత పోరాటాన్ని విరమింపచేయాలని మోసపూరిత ప్రకటనలు ఇప్పించింది. అనేక సభలూ, ర్యాలీలు జరిపి ఆ పోరాటంపై ప్రజావ్యతిరేకతను కూడగట్టాలని చూసింది. కానీ ప్రజల న్యాయమైన పోరాటం ముందు ప్రభుత్వ కుటిల ఎత్తుగడలేవీ సఫలం కాలేకపోయాయి. ఆ తర్వాత మూడవ దశలో సి.పి.ఎం. ప్రభుత్వం హరమద్ వాహిని అనే తన ప్రయివేట్ గూండా సేనతో దాడులు చేయించింది.

అయినప్పటికీ, లాల్‌గఢ్ మహిళలపై అత్యాచారానికి పాల్పడ్డ సి.పి.ఎం. గూండాలనూ, పోలీసులను శిక్షించాలనీ, పోలీసుల కూంబింగ్‌లను నిలిపివేయాలనీ పశ్చిమ మిడ్నాపూర్, పురూలియా, బంకూరా జిల్లాల్లో ఆదివాసీల మీద పదేళ్లుగా పెట్టిన తప్పుడు కేసులను ఎత్తివేయాలనీ, మావోయిస్టు కేసులను బనాయించి జైళ్లల్లో పెట్టిన ప్రజలను విడుదల చేయాలనీ, పోలీసు క్యాంపులను ఎత్తివేయాలనీ, కనీస వసతులు కల్పించాలనీ, ఈ ప్రాంతపు వెనుకబాటుతనానికి సి.పి.ఎం. బాధ్యత వహించాలని డిమాండ్ చేస్తూ లాల్‌గఢ్ పోరాటం నేటికీ అప్రతిహతంగా కొనసాగుతోంది.

ప్రస్తుతం జరుగుతున్న ఈ పోరాటం నాల్గవ దశ అని చెప్పుకోవాలి. దీన్ని అణచడానికి బలగాలను పంపమని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. తమ మధ్య ఎన్ని వైరుధ్యాలున్నా ప్రజా ఉద్యమాలను అణచడంలో దోపిడీవర్గాలు, పార్టీలు ఏకమవుతాయి. అందుకే రాష్ట్ర ప్రభుత్వం కోరిందే తడవుగా కేంద్ర ప్రభుత్వం అయిదు కంపెనీల సి.ఆర్.పి.ఎఫ్.ను, బి.ఎస్.ఎఫ్.ను జూన్ 18న పంపింది. మావోయిస్టు అణచివేతకోసమే ఏర్పాటు చేసిన కోబ్రా బెటాలియన్‌ను కూడా పంపింది. ఈ బలగాలు మొదటి రోజున ప్రతిఘటిస్తోన్న ప్రజలపై విచక్షణా రహితమైన లాఠీచార్జీకీ, భాష్ప వాయు ప్రయోగాలకు పాల్పడ్డాయనీ, తరువాత రోజున ప్రజలపై కాల్పులు జరిపాయని తెలుస్తోంది. జూన్ 20న ముగ్గుర్ని చంపి అనేక మందిని గాయపరిచారు. ఇంకా ఈ దారుణాలు మరింతగా పెరిగే ప్రమాదం వుంది. మరిన్ని బలగాల కోసం బుద్ధదేవ్ మన్మోహన్‌ను కోరాడు. జమ్మూ-కాశ్మీర్ తర్వాత బి.ఎస్.ఎఫ్.ను ఉపయోగించడం ఇదే మొదటిసారి.

ఇంత పెద్ద ఎత్తున బలగాలు తరలి వస్తోన్నా ప్రజలు- స్త్రీలూ, పురుషులూ,

వృద్ధులూ, పిల్లలు - అందరూ కలిసి మానవహారాలుగా ఏర్పడి బలగాలను ఎదిరిస్తున్నారు. సాంప్రదాయక ఆయుధాలతో ప్రతిఘటిస్తున్నారు పోలీసు అత్యాచారాల వ్యతిరేక పోరాట కమిటీగా ఏర్పడి నిలదీస్తున్నారు. ఇలా చరిత్ర పుటలపై వీరోచిత అధ్యయనాన్ని రచిస్తున్నారు. భారతదేశ నూతన ప్రజాస్వామిక విప్లవ పోరాటాన్ని ముందుకు తీసుకుపోతున్నారు. మా పార్టీ ఈ పోరాటానికి నాయకత్వం వహిస్తోంది.

ఇన్నాళ్లు ప్రభుత్వ చిన్న చూపుకు గురయి అభివృద్ధికి దూరంగా వున్న ఈ ఆదివాసీ ప్రజలను ఇప్పుడు ప్రభుత్వం అభివృద్ధి పేరుతో నిర్వాసితులను చేస్తోంది. వాళ్ల భూమినీ, అడవినీ, ప్రకృతి సంపదలను దోచుకోవడానికీ, సామ్రాజ్యవాదానికి దోచిపెట్టడానికి పథకాలు వేస్తోంది. ఈ దోపిడీని వ్యతిరేకిస్తున్నందుకే ప్రజలను ఊచకోత కోయడానికి సిద్ధపడుతోంది. ఈ ఊచకోతకు సాధికారతను కల్పించుకోవడం కోసం ప్రజలు పెద్ద ఎత్తున సాయుధంగా తిరగబడుతున్నారనీ, మావోయిస్టులు దీన్ని విముక్తి ప్రాంతంగా ప్రకటించారని ప్రచారానికి పాల్పడుతోంది. కానీ ప్రజలు సాంప్రదాయక ఆయుధాలతో మాత్రమే పోరాడుతున్నారు. చాలా మంది ప్రజలు నిరాయుధంగానే పోరాడుతున్నారు. మావోయిస్టుల ఏరివేత పేరుతో పెద్ద ఎత్తున సాయుధ బలగాలను మోహరించి ఆదివాసీ ప్రజలను తమ అడవుల నుంచీ, తమ భూముల నుంచీ పారదోలే దుష్టపన్నాగం యిది.

ప్రస్తుతం సి.పి.ఎం. మా పార్టీని నిషేధించాలని ఆలోచిస్తోంది. ఇన్నాళ్లూ అధికారికంగా నిషేధించకపోయినా అదెప్పుడూ మా పార్టీని నిషేధిత పార్టీగానే చూసింది. నక్సల్బరీ కాలం నుండి నేటి వరకూ తీవ్రమైన అణచివేతనే ప్రయోగిస్తోంది. ఇప్పుడు అధికారికంగా కూడా నిషేధించి పేరుకైనా వామపక్షం అని చెప్పుకునే అర్హతను అది కోల్పోతుంది. అంతేగానీ నిషేధాలూ, నిర్బంధాలు ప్రజా పోరాటాలను ఆపలేవు.

ప్రస్తుత ప్రభుత్వ అణచివేతలో తృణమూల్ కాంగ్రెస్ (టి.ఎం.సి.)కి కూడా భాగస్వామ్యం వుంది. నందిగ్రాం, సింగూరు వంటి పోరాటాల్లో ప్రజల పక్షపాతిగా నటించిన టి.ఎం.సి.నీ, దాని అధినేత్రి మమతా బెనర్జీని ఇటీవలి పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు గెలిపించారు. మమతా బెనర్జీ తదితర టి.ఎం.సి. నాయకులు మంత్రులు కావడానికీ, యు.పి.ఎ.లో దానికి చెప్పుకోదగిన స్థానం లభించడానికి ప్రజాపోరాటాల పట్ల ఆ పార్టీ ఇన్నాళ్లూ తీసుకున్న వైఖరే కారణం. సి.పి.ఎం.పై, అది అమలుచేస్తున్న

అనుకూల విధానాలపై ప్రజల్లో వున్న తీవ్రమైన వ్యతిరేకతను తనకు అనుకూలంగా మలుచుకోవడంలో టి.ఎం.సి. విజయం సాధించింది. కానీ నేడది ఏరు దాటి తెప్ప తగిలేసింది. 2008 నవంబర్‌లో మొదలైన లాల్‌గఢ్ పోరాటాన్ని ఎన్నికల ముందువరకూ సమర్థించిన, ఆందోళనల్లో ప్రత్యక్షంగా పాల్గొన్న మమతా బెనర్జీ నేడు కేబినెట్ మంత్రి కాగానే అదే పోరాటాన్ని అణచడానికి పెద్ద ఎత్తున బలగాలను పంపడంలో సూత్రధారి అయ్యింది. నందిగ్రాం, సింగూర్‌లలో పోలీసు బలగాల మోహరింపును వ్యతిరేకించిన ఆమె, నేడు మరింత పెద్ద స్థాయిలో బలగాల మోహరింపులో భాగస్వామురాలయింది. అంతేకాదు మా పార్టీని నిషేధించాలని మాట్లాడుతూ తన వర్గ స్వభావాన్ని స్పష్టంగా బయటపెట్టుకుంది. తన 'ప్రేమ' ప్రజలపైన కాదనీ, అధికారం పైనేనని చాటుకుంది. ప్రజలు ఇటువంటి కుటిల నాయకులను ఎన్నటికీ క్షమించలేరు. తమ పోరాటాలనుంచే ప్రజలు నాయకులను సృష్టించుకుంటారు. ఆ నాయకులు వెన్నుపోటుకు ప్రయత్నిస్తే వారిని చరిత్ర పెంట కుప్పపై విసిరేసి సరైన, నూతన నాయకులను సృష్టించుకుంటారు.

నేడు లాల్‌గఢ్ ప్రజలు చేస్తున్న పోరాటం ఈ ప్రాంతానికి మాత్రమే సంబంధించిన పోరాటం కాదు. దేశ సార్వభౌమత్వాన్నీ, సాధికారతనూ, స్వావలంబనను సామ్రాజ్యవాదులకు తాకట్టు పెడుతోన్న దోపిడీ భారత పాలకవర్గాలకు, భారత పాలకవర్గాలను కీలు బొమ్మలుగా ఆడిస్తున్న సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా లాల్‌గఢ్ ప్రజలు మహోన్నతమైన చైతన్యంతో చారిత్రక కర్తవ్యాన్ని స్వీకరించి ముందుకు తీసుకెళ్తున్నారు. కాబట్టి ఈ పోరాటం పీడిత ప్రజలది, సామ్రాజ్యవాద వ్యతిరేక శక్తులది, ప్రజాస్వామికవాదులది.

ఈ పోరాటాన్ని అణచడానికి రివిజనిస్టులూ, సామ్రాజ్యవాద తొత్తులు పాల్పడుతున్న దమనకాండను దేశవ్యాప్తంగా ప్రజలూ, ప్రజాస్వామికవాదులూ, మేధావులు ఖండించాలని మేం విజ్ఞప్తి చేస్తున్నాం. ఈ పోరాటాన్ని బలపరచాలనీ, ఈ పోరాటానికి మద్దతుగా దేశవ్యాప్తంగా విస్తృతమైన ప్రజా ఉద్యమాలను చేపట్టాలని పిలుపునిస్తున్నాం. లాల్‌గఢ్‌ను ఒక నమూనాగా స్వీకరించి దేశవ్యాప్తంగా గెరిల్లా జోన్ ప్రాంతాల్లో పోరాటాలను తీవ్రతరం చేయాలనీ, ఆదివాసీ ప్రాంతంలో సాగుతున్న ఈ పోరాటాన్ని మైదాన ప్రాంతాలకూ, పట్టణాలకు వ్యాపింప చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిస్తున్నాం.

ఈ పోరాటానికి మద్దతుగా జూన్ 22, 23 తేదీలలో పశ్చిమ బెంగాల్, ఛత్తీస్‌గఢ్, ఒడిస్సా, బీహార్, జార్ఖండ్ రాష్ట్రాలలో బంద్‌ను పాటించి, బలమైన సంఘీభావాన్ని ప్రకటించిన ప్రజలకూ, ప్రజాస్వామికవాదులకు విప్లవాభివందనాలు తెలుపుతున్నాం.

తమ పార్టీ నిజస్వరూపాన్ని గుర్తించవలసిందిగా సి.పి.ఐ., సి.పి.ఎం. సాధారణ కార్యకర్తలకు మేము విజ్ఞప్తి చేస్తున్నాం. సామ్రాజ్యవాదుల, భారత దోపిడీ వర్గాల పక్షాన చేరిన రివిజనిస్టు పార్టీలను ఛీ కొట్టి, ప్రజల పక్షాన నిలబడి పోరాడవలసిందిగా కోరుతున్నాం.

**ప్రతాప్,**

**అధికార ప్రతినిధి,**

**సెంట్రల్ రీజనల్ బ్యూరో**

**సీపీఐ (మావోయిస్టు)**

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# సెంట్రల్ రీజినల్ బ్యూరో

**8-3-2010**

## శ్రీకృష్ణ కమిటీ అధ్యయనం బూటకం!
## ప్రజలంతా ఒక్కటిగా చేయాలి కమిటీ బహిష్కారం!!

## తెలంగాణ సమస్యకు రాజీలేని పోరాటమే పరిష్కారం!!!

ప్రత్యేక తెలంగాణ ఉద్యమం నానాటికీ ఉధృతం అవుతున్న స్థితిలో సమస్యకు పరిష్కారం కనుగొనడానికంటూ కేంద్ర ప్రభుత్వం ఫిబ్రవరి 3వ తేదీన శ్రీకృష్ణ కమిటీని నియమించి, ఆ తర్వాత తొమ్మిది రోజులకు కమిటీ విధి విధానాలను వెల్లడించింది. కమిటీ విధి విధానాలను పరిశీలిస్తే సమస్యను పరిష్కరించాలనే చిత్తశుద్ధి కేంద్ర ప్రభుత్వానికి లేదనేది స్పష్టమవుతోంది. విధి విధానాల్లో అటువంటి ప్రయత్నం కనిపించడంలేదు. రాష్ట్రంలోఉధృతంగా కొనసాగుతున్న పోరాటాన్ని నీరు కార్చడానికీ, ఉద్యమం మరింతగా తీవ్ర రూపం దాల్చితే రాష్ట్రంలో తెలంగాణా సమస్యపై ఉద్యమం జరుగుతుండటం వల్ల కమిటీ వేయవలసిన అవసరం ఏర్పడింది. కమిటీ దీనికి సంబంధించిన పరిష్కారాన్ని కనుగొనవలసి వుంది. కానీ అణచివేయడానికి ఉద్దేశించిన కమిటీ ఇది. శాంతి భద్రతలను విధి విధానాల్లో ఒక అంశంగా చేర్చింది ఈ ఉద్దేశ్యంతోనే.

విధి విధానాల్లో కమిటీ దేని గురించి పరిశీలించాలో సూటిగా దేనిపై కేంద్రానికి సిఫారసు చేయాలో, ఖచ్చితంగా ఏ సమస్యకు పరిష్కారం కనుగొని నివేదించాలో ఎక్కడా స్పష్టంగా లేదు. పైగా తెలంగాణా ఉద్యమానికి వ్యతిరేకమైన అంశాలు ఇందులో వున్నాయి. ఉదాహరణకు సమైక్యాంధ్ర గురించి, తెలంగాణాలో అవిభాజ్యమైన హైదరాబాద్ స్టేటస్‌ను ఎలా నిర్ణయించాలనే దానిపై స్థానిక ప్రజల అభిప్రాయాలను తెల్సుకోవాలనే అంశాలు ఇందులో వున్నాయి. సమైక్యాంధ్ర వాదుల కనుసన్నల్లోనే ఈ అంశాలు చోటు చేసుకున్నాయనేది స్పష్టం. ఆకుకు అందని పోకకు పొందని విధి విధానాలను రూపొందించి పదిన్నర నెలల సమయం కేటాయించడం సమస్యను సత్వరం పరిష్కరించడం కోసం కాకుండా, సాధ్యమయినంత ఎక్కువ కాలం సాగదీయడం కోసమేననేది ఎవరికైనా ఇట్టే అర్థమవుతుంది. ఈ గడువు ఇంకా పొడిగించబడదనే గ్యారెంటీ ఏమీ లేదు.

50 ఏళ్లకు పైగా తెలంగాణ సమస్యపై కాంగ్రెస్ అనుసరిస్తున్న వైఖరి దీన్నే స్పష్టం చేస్తున్నది. మొట్ట మొదట చెన్నారెడ్డి తెలంగాణ ఉద్యమానికి ద్రోహం చేశాడు. ఆ తర్వాత క్రితంసారి అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలోకి వస్తే తెలంగాణ ఇస్తానని టి.ఆర్.ఎస్.తో పొత్తు పెట్టుకున్న కాంగ్రెస్ 2004 అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి, అధికారం సాధించాక తెలంగాణకు ద్రోహం చేసింది. రెండవ ఎస్.ఆర్.సి. అనీ, ప్రణబ్‌ముఖర్జీ కమిటీ, రోశయ్య కమిటీ అని అయిదేళ్లు సాగదీసింది. ఇప్పుడు ప్రత్యేక తెలంగాణ ఉద్యమం ఉధృతం అయ్యాక మళ్లీ శ్రీకృష్ణ కమిటీని ముందుకు తెచ్చింది.

తెలంగాణ ప్రక్రియ ప్రారంభిస్తున్నామని అందులో భాగంగా రాష్ట్ర శాసనసభలో తీర్మానం జరుగుతుందని కేంద్ర హోంమంత్రి డిసెంబర్ 9న స్పష్టంగా ప్రకటించాడు. ఇప్పుడు శ్రీకృష్ణ కమిటీని వేసి తెలంగాణ సమస్యను ఇంకా అధ్యయనం జరగవలసినదానిగా ప్రభుత్వం మార్చి వేసింది. స్పష్టమైన ప్రకటన చేసిన తర్వాత ఆవైపుగా చర్యలు ప్రారంభించకుండా ఇంకా కమిటీ అంటూ సాగదీయడం తెలంగాణ సమస్యను అటకెక్కించడానికి తప్పా మరొకటి కాదు. అసలు శ్రీకృష్ణ కమిటీకి పార్లమెంట్ బాధ్యత వహించడం లేదు. పార్లమెంటులో దీనిపై తీర్మానం జరిగి ఆ మేరకు ఏర్పడిన కమిటీ కాదు. ఇది కాంగ్రెస్ అధిష్టాన రాష్ట్ర కాంగ్రెస్ మంత్రులు కలిసి వేయించిన కమిటీ. ఈ కమిటీ అందించే నివేదికకు పార్లమెంటు జవాబుదారీ కాదు. కమిటీకి పార్లమెంటరీ చట్టబద్ధత లేదు. అటువంటప్పుడు ఈ కమిటీ ఒట్టి బూటకము. దాని విచారణ అంతా నాటకం తప్ప మరొకటి కాదు. దేశంలో ప్రజా ఉద్యమాలకూ, నిరసనలకు కారణం అయిన అనేక సమస్యలపై వేసిన కమిటీలూ, కమీషన్‌లు, జరిపిన విచారణలు ఎంత బూటకంగా, ప్రహసనంగా మారాయో ప్రజలందరికీ తెలుసు. బాబ్రీ మసీదు విధ్వంసంపై విచారణ పేరిట 18 ఏళ్లుగా సమస్యను సాగదీసి లిబర్‌హాన్ కమీషన్ సమర్పించిన తాజా నివేదిక సాధించిన ఘనకార్యం ఇందుకు చక్కని ఉదాహరణ. బోఫోర్స్ కుంభకోణం, షేర్ల కుంభకోణం, ఎరువులు, స్టాంపుల కుంభకోణాలపై 1984 సిక్కుల ఊచకోతపైన, గుజరాత్ అల్లరులపై విచారణ కమిటీలు సాధించిందేమిటో ప్రజలకు తెలియంది కాదు. మొత్తం తెలంగాణా ప్రజానీకమంతా ప్రత్యేక రాష్ట్రం కోసం ఏక కంఠంతో డిమాండ్ చేస్తూ ఉద్యమిస్తుండగా కేంద్ర ప్రభుత్వం విచారణ జరిపి, పరిష్కారం చూపించడానికంటూ శ్రీకృష్ణ కమిటీని వేయడం తెలంగాణ ప్రజలను అవమానించడమే. సమైక్య ఆంధ్రవాదులు, సీమాంధ్ర నాయకులు కాంగ్రెస్ అధిష్టానానికి సన్నిహితంగా వుండే నేతలు ముఖ్యమైన పదవుల్లో వున్నవారు తప్ప ఎవరూ ఈ కమిటీని స్వాగతించడంలేదు. తెలంగాణలోని అన్ని పక్షాల ప్రజలు దీన్ని వ్యతిరేకిస్తున్నారు. వ్యతిరేకంగా

ఆందోళనలూ, బందులూ, నిరసనలూ రోజు రోజుకు పెరుగుతున్నాయి. తెలంగాణను డిమాండ్ చేస్తున్న పార్టీల ఎం.ఎల్.ఎ.లు రాజీనామాలు చేయగా, తెలంగాణ కాంగ్రెస్ ఎం.ఎల్.ఎ.లు అధిష్టానం బెదిరింపులకు తలొగ్గారు. జె.ఎ.సి. నుంచి వైదొలగి ఉద్యమానికి మరొక మారు ద్రోహం చేయడానికి సిద్ధమయ్యారు. విచారణలో శ్రీకృష్ణ కమిటీకి సహకరిస్తామని అంటున్నారు.

తెలంగాణ జె.ఎ.సి., విద్యార్థి సంఘాల జె.ఎ.సి.లు శ్రీకృష్ణ కమిటీ గోబ్యాక్ అంటూ కమిటీని బహిష్కరించాయి. కాగా టి.ఆర్.ఎస్. నాయకుడు చంద్రశేఖర్ రావు కమిటీకి నివేదిక సమర్పిస్తామంటున్నాడు. తెలంగాణ కోసం ఉద్యమించే ప్రజానీకం, ప్రజా సంఘాలు అన్నీ ఏక కంఠంతో కె.సి.ఆర్. రెండు నాల్కల వైఖరిని వ్యతిరేకించి తగిన బుద్ధి చెప్పాలి. కమిటీని స్వాగతిస్తామంటున్న తెలంగాణ కాంగ్రెస్ నాయకులను ప్రజల ముందుకు ఈడ్చి తగిన గుణపాఠం నేర్పాలి. సమైక్యాంధ్రకు ప్రజల మద్దతు లేకున్నా ఆంధ్ర, రాయలసీమ ప్రజలను రెచ్చగొట్టి తమ పబ్బం గడుపుకోజూస్తున్న సమైక్యాంధ్ర వాద, సీమాంధ్ర పెట్టుబడిదారులకూ, నాయకులకు తెలంగాణ ప్రజల సంఘటిత పోరాట శక్తిని ప్రదర్శించి శ్రీకృష్ణ కమిటీని బహిష్కరించాలి. ఈ రోజు తెలంగాణలో ఎవరిని కదిలించినా ప్రత్యేక తెలంగాణపై తమ బలమైన గొంతును వినిపిస్తారు. అటువంటి తెలంగాణ సమస్యపై ఇంకా విచారణ కమిటీ అంటూ కాలం గడిపి ఉద్యమాన్ని నిర్వీర్యం చేయాలనుకుంటున్న కేంద్ర ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా శ్రీకృష్ణ కమిటీని బహిష్కరిస్తూ గోబ్యాక్ అంటూ ప్రజలంతా ఐక్యంగా ఉద్యమించాలి. కమిటీలతో సమస్యలు పరిష్కారం కావు. ప్రజల రాజీలేని పోరాటాలే తెలంగాణ సాధనకు ఏకైక పరిష్కారం. ఇది చరిత్ర నిరూపించిన సత్యం. ఇందుకు తెలంగాణలోని కార్మికులు, కర్షకులు, విద్యార్థులు, ఉద్యోగులు, మేధావులు, ప్రజాస్వామికవాదులతో సహా సమస్త తెలంగాణ ప్రజానీకం సమైక్యంగా పోరాడాలి. ఇప్పటికే పోరాడుతున్న తెలంగాణ జె.ఎ.సి., విద్యార్థుల జె.ఎ.సి.లతో ప్రజలంతా సంఘటితమై మిలిటెంట్ పోరాటాలతో తెలంగాణను సాధించాలి.

ఉద్యమాభివందనాలతో

ప్రతాప్,

అధికార ప్రతినిధి,

**సెంట్రల్ రీజనల్ బ్యూరో**

**సీపీఐ (మావోయిస్టు)**

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# కేంద్ర కమిటీ

**4-7-2010**

## భారత విప్లవోద్యమ నేత, పొలిట్‌బ్యూరో సభ్యుడు
## కామ్రేడ్ ఆజాద్ అమర్ రహే!
## ఆపరేషన్ గ్రీన్‌హంట్ - ప్రజలకు వ్యతిరేకంగా యుద్ధంలో భాగంగా జరిగిన ఈ బూటకపు ఎన్‌కౌంటర్‌ను ముక్తకంఠంతో ఖండించండి!!
## జూలై 8 నుండి 14 వరకు నిరసన వారాన్ని, దానిలో భాగంగా 13-14 తేదీలలో 'భారత్ బంద్'ను విజయవంతం చేయండి!!!

భారత విప్లవోద్యమంలో ఒక మహోజ్వల తార నేలరాలింది. దాదాపు నాలుగు దశాబ్దాలుగా భారత విప్లవోద్యమంలో కీలక పాత్ర పోషించిన ఉత్తమోత్తమ కార్మికవర్గ నాయకుడు, భారత కమ్యూనిస్ట్ పార్టీ (మావోయిస్టు) కేంద్రకమిటీ సభ్యుడూ, పొలిట్‌బ్యూరో సభ్యుడు, కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి, భారత ప్రజల ప్రియతమ నేత కామ్రేడ్ చెరుకూరి రాజ్‌కుమార్ (ఆజాద్)ను, ఆయనతో పాటు హేమచంద్ర పాండే అనే స్వతంత్ర పత్రికా విలేకరినీ సామ్రాజ్యవాదుల కాపలా కుక్కలైన భారత పాలక వర్గాలు మూడు రోజుల క్రితం అత్యంత క్రూరంగా హత్య చేశాయి.

కామ్రేడ్ ఆజాద్ పార్టీ కార్యకర్తలకు రాజకీయ అర్థశాస్త్ర పాఠాలు చెప్పడం కోసం జూలై మొదటి వారంలో దండకారణ్యానికి రావల్సి వుండింది. ఇందుకోసం ఆయన జూలై 1వ తేదీన దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీతో నాగపూర్ నగరంలో కాంటాక్టు పెట్టుకున్నాడు. తాను బయలుదేరుతున్నట్టు ఆయన జూన్ 30న దండకారణ్య కామ్రేడ్స్‌కు సందేశం కూడా పంపించాడు. ఆయనను తీసుకెళ్లడానికి దండకారణ్య కమిటీ ఒక కామ్రేడ్‌ను పంపించింది. అయితే నిర్ణీత సమయానికి, స్థలానికి ఆయన రాకపోవడంతో ఆ కామ్రేడ్ వెనక్కి వచ్చాడు. 1-2 తేదీల మధ్యరాత్రిలోనే పోలీసులు ఆజాద్‌ను హేమచంద్ర పాండేతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని ఆదిలాబాద్ అడవుల్లో ఎన్‌కౌంటర్ పేరుతో హత్య చేశారు. తాను బయలుదేరుతున్నట్టు 30వ తేదీన సమాచారం ఇచ్చిన కామ్రేడ్ ఆజాద్ 1వ తేదీన కాంటాక్టుకు రాలేదంటే ఆయన తానున్న స్థలం నుండి నాగపూర్‌కు బయలుదేరగా ప్రయాణం మధ్యలోనో లేదా నాగపూర్‌లో దిగిన తర్వాతనో మానవ రక్తం రుచి మరిగిన ఏపీఎస్ఐబి హంతకులు

వాళ్లిద్దరినీ పట్టుకున్నారు. క్రూరమైన చిత్రహింసలకు గురి చేసి ఆ రాత్రే వాళ్లిద్దరినీ ఆదిలాబాద్ జిల్లాకు తీసుకెళ్లి కాల్చి చంపారు.

ఈ పాశవిక హత్యను ప్రతి ఒక్కరూ ముక్త కంఠంతో ఖండించాలని మేం విజ్ఞప్తి చేస్తున్నాం. ప్రజల పక్షాన నిలబడ్డవాళ్లను వెంటాడి వేటాడి పట్టుకొని మధ్య యుగాల్ని మరిపించేలా చిత్రహింసలు పెట్టి క్రూరంగా హత్య చేసి పచ్చినెత్తురు తాగుతూ, నెత్తుటి తుంపరలు రాలే నోటితోనే ప్రజాస్వామ్యం, శాంతి, చట్టం, న్యాయం అని వల్లెవేస్తూ దేశప్రజలను వంచిస్తున్న పాలకవర్గాల పాశవిక దమన నీతికి వ్యతిరేకంగా ఉద్యమించాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

ప్రజలందరికీ చెందిన, చెందాల్సిన మన ప్రియతమ భారత దేశాన్ని కొంత మంది దోపిడీ శక్తులు అమాంతం తమ జేబులో వేసుకోవాలనీ, లేదా తమ యజమానులైన సామ్రాజ్యవాదులకు తాకట్టు పెట్టాలనీ, ఏకంగా అమ్మిపారేయాలనీ కూడా తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. అందులో భాగంగానే మన అడవుల్నీ, మన భూగర్భ ఖనిజాలనూ, మన నదీ నదాలను సామ్రాజ్యవాదులకు ధారాదత్తం చేస్తున్నారు. ఇందుకు మన పాలక వర్గాలు సామ్రాజ్యవాద దేశాలతో, బహుళ జాతి కంపెనీలతో కుదుర్చుకున్న అసంఖ్యాక అవగాహనా ఒప్పందాలే ప్రత్యక్ష సాక్ష్యం. అణు ఒప్పందం సహా మరెన్నో ఒప్పందాలూ సాక్ష్యం. నేడు మన దేశంలో గనులను తవ్వి ఖనిజాలు వెలికి తీస్తున్నది ఈ దోపిడీలో భాగంగానే. మన నదులపై నిర్మిస్తున్న, నిర్మించదల్చుకున్న భారీ ప్రాజెక్టులు నౌకల ద్వారా సామ్రాజ్యవాదులు మన సంపదను వేగంగా తరలించుకు పోవడానికే. వేస్తున్న విశాలమైన రహదారులు నిజమైన అర్థంలో దోపిడీకి రాచబాటలే. ఏర్పాటు చేస్తున్న సెజ్‌లూ, కార్పోరేట్ వ్యవసాయ క్షేత్రాలూ సామ్రాజ్యవాదుల ప్రయోజనాల కోసమే. ఈ దోపిడీకి పాలక వర్గాలు పెట్టిన ముద్దుపేరు అభివృద్ధి. ఈ 'అభివృద్ధి' కేవలం దోపిడీ వర్గాలకే. ఇందులో ఒక్క శాతం కూడా విశాల భారత ప్రజలకు చెందదనేది ఎవరూ కాదనలేని వాస్తవం. ఈ అభివృద్ధిలో మన భూములు మనవి కాకుండా పోతున్నాయి. మన పంటలు మనకు దక్కకుండా పోతున్నాయి. మన నీళ్లు మనవి కాకుండా పోతున్నాయి. మన సంస్కృతి మనది కాకుండా పోతోంది. భారత పాలక వర్గాలు అనుసరిస్తున్న ఈ లొంగుబాటుతనం మనందరికీ ఎంతో అవమానకరమైనది, మనందరినీ బానిసత్వంలోకి నెట్టివేసేది. తరతరాలుగా మనకు వారసత్వంగా వచ్చిన, మనం గర్వించదగిన మన ప్రియమైన మాతృభూమిని మనది కాకుండా చేసేది. ఇలా దేశాన్ని అమ్మిపారేస్తున్న ఈ దోపిడీ శక్తులు నిస్సిగ్గుగా తమల్ని తాము దేశభక్తులుగా కూడా చెప్పుకుంటున్నారు.

దేశభక్తి ముసుగులో ఈ దేశద్రోహులు చేస్తున్న కుట్రలను భగ్నం చేయడానికి భారత పీడిత ప్రజలు నడుం బిగించారు. అందులో భాగంగానే పోరుమార్గాన్ని ఎంచుకున్నారు. ఈ దేశానికి నిజమైన వారసులూ, దేశభక్తులూ అయిన కార్మికులు, కర్షకులు, ఆదివాసీలు, విద్యార్థులు, మేధావులూ, మహిళలూ, మైనారిటీలు ఈ పోరాటంలో చురుకైన భాగస్వామ్యాన్ని

వహిస్తున్నారు. ఈ మహత్తర పోరాటానికి భారత కమ్యూనిస్ట్ పార్టీ (మావోయిస్టు) ప్రేరణగా నిలుస్తున్నది, సంఘీభావ శక్తిగా నిలుస్తున్నది, సగర్వంగా నాయకత్వం కూడా వహిస్తున్నది.

ఈ కారణంగానే, కేవలం ఈ కారణంగా మాత్రమే సామ్రాజ్యవాదులకు అత్యంత విశ్వాసనీయ బంటులైన సోనియా-మన్మోహన్-చిదంబరం ముఠా దృష్టిలో మావోయిస్టు పార్టీ 'దేశ అంతర్గత భద్రతకు అతి పెద్ద ముప్పు'గా మారింది. మావోయిస్టు పార్టీ దేశ అంతర్గత భద్రతకు ముప్పు కాదనీ, తమ భద్రతకూ, తమ దోపిడీ ప్రయోజనాలకు మాత్రమే తీవ్రమైన ముప్పనీ ఈ ముఠాకూ, ఈ ముఠాను తమ చెప్పుచేతుల్లో పెట్టుకున్న సామ్రాజ్యవాదులకూ చాలా స్పష్టంగా తెలుసు. ఈ వాస్తవానికి మసి పూసి మారేడుకాయ చేసి దేశ భద్రత సమస్యగా ముందుకు తెస్తూ ఈ ముఠా భారత ప్రజలను మోసం చేయదల్చుకుంది. ఆ విధంగా పోరాడుతున్న ప్రజలపై అది ప్రయోగిస్తోన్న పాశవిక దమనకాండకు సాధికారత దొరుకుతుందని పగటి కల కంటున్నది. ప్రత్యేకించి ఈ ముఠా దేశ అంతర్గత భద్రతకు ముప్పుగా ప్రకటించిన నాటి నుండి మావోయిస్టు పార్టీ మీద, పార్టీ నాయకత్వంలో పోరాడుతున్న ప్రజల మీద తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగిస్తున్న విషయం అందరికీ తెల్సిందే. అంతే కాదు మొదట మావోయిస్టు పార్టీని అంతర్గత ముప్పుగా నమ్మింపజేస్తే ఇక ఆ తర్వాత తన దోపిడీ విధానాలను వ్యతిరేకించే ఎవరిపైనైనా మావోయిస్టు ముద్ర వేసి నిర్బంధాన్ని ప్రయోగించవచ్చు అనుకుంటోంది. మావోయిస్టు పార్టీతో ఎటువంటి సంబంధం లేని ప్రజా ఉద్యమాలపై కూడా మావోయిస్టు ముద్ర వేసి నిర్బంధాన్ని ప్రయోగించడం కూడా మనం చూస్తున్నదే.

నేడు నెలకొని తీవ్రమైన ఆర్థిక సంక్షోభం నుండి బయటపడ్డానికి సామ్రాజ్యవాదానికి దోపిడీని తీవ్రతరం చేయడం తప్ప మరో మార్గం లేదు. అందులో భాగంగా మన దేశంలోని అటవీ ప్రాంతాల్లోని సంపదను దోచుకుపోవడానికి సామ్రాజ్యవాదులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ముఖ్యంగా ఎన్నో విలువైన ఖనిజ సంపదలున్న దండకారణ్యాం, ఒడిశా, బీహార్, ఝార్ఖండ్, పశ్చిమబెంగాల్, ఆంధ్రప్రదేశ్ అటవీ ప్రాంతంపై వీళ్ల కన్ను పడింది. అయితే మావోయిసట్ట పార్టీ ప్రాబల్యం వున్న ఈ ప్రాంతాల నుండి సంపదను తరలించుకుపోవడం వీళ్లకు అసాధ్యం. అందుకే నిన్న సల్వాజుడుం, సేంద్ర తదితర పేర్లతో ఇక్కడి ఉద్యమాన్ని అణచడానికి ప్రయత్నించారు. వీరోచిత ప్రతిఘటన ద్వారా ప్రజలూ, మా పార్టీ ఆ దాడిని ఓడించడంతో నేడు గ్రీన్‌హంట్‌ను ముందుకు తెచ్చారు. గ్రీన్ హంట్‌లో గత పది నెలలుగా దేశవ్యాప్తంగా వందల మంది సాధారణ ప్రజలను, పసిపిల్లల నుండి వృద్ధుల వరకూ అత్యంత పాశవికంగా చంపేశారు. ఇంకా చంపుతూనే వున్నారు. మహిళలపై సామూహిక అత్యాచారాలకు పాల్పడుతున్నారు. వందల గ్రామాలను తగులబెడుతున్నారు. ప్రజల ఆస్తులను ధ్వంసం చేస్తున్నారు. ఒక్క దండకారణ్యంలోనే 150 మంది సాధారణ ప్రజలను పొట్టన బెట్టుకున్నారు. లెక్కలేనన్ని గ్రామాల్ని కాలబెట్టారు. వందల సంఖ్యలో

మహిళలపై లైంగిక అత్యాచారాలకు పాల్పడ్డారు.

ఇలా ఒకవైపు సామాన్య ప్రజలను చంపుతూ, ప్రజలకు నాయకత్వం లేకుండా చేయడానికి మావోయిస్టు పార్టీ నాయకత్వాన్ని వెంటాడి వేటాడి చంపుతోంది. అందులో భాగంగానే నేడు కామ్రేడ్ ఆజాద్‌ను పట్టుకొని క్రూరంగా కాల్చిచంపారు. కామ్రేడ్ ఆజాద్ నాలుగు దశాబ్దాలుగా భారత విప్లవోద్యమంలో ఎనలేని కృషి చేశారు. రాడికల్ విద్యార్థిగా మొదలైన ఆయన ఉద్యమ ప్రస్థానం అనతికాలంలోనే అనేక రంగాలకు విస్తరించింది. వరంగల్ రీజనల్ ఇంజనీరింగ్ కాలేజీలో ఎం.టెక్. పూర్తి చేసిన ఆజాద్ అమరుడు సూరపనేని జనార్దన్, ఆనాటి విప్లవనాయకుడైన కొండపల్లి సీతారామయ్యల ప్రేరణతో తన జీవితాన్ని విప్లవానికి అంకితం చేసుకున్నాడు. చిన్నతనం నుండీ చదువుల్లో అసాధారణ ప్రతిభాపాటవాలు ప్రదర్శించిన ఆయన విప్లవ సిద్ధాంత అధ్యయనంలో, అన్వయింపులో, విప్లవాచరణలో కూడా అదే స్థాయిలో నిలిచాడు. ఆయన కర్నాటక రాష్ట్రంలో విప్లవోద్యమ నిర్మాణానికి పునాదులు వేశాడు. ఆ తర్వాత ఆయన కేంద్రకమిటీలోకి ఎన్నికై, పొలిట్‌బ్యూరో సభ్యుడై సిద్ధాంత, రాజకీయ, నిర్మాణ తదితర అనేక రంగాల్లో, అనేక ప్రాంతాల్లో విశేషమైన కృషి చేస్తూనే పార్టీకి అధికార ప్రతినిధిగా వుండి దోపిడీ పాలక వర్గాలకు వ్యతిరేకంగా ఎక్కుపెట్టిన పీడిత ప్రజల వాణి అయ్యాడు.

ముఖ్యంగా కామ్రేడ్ ఆజాద్‌ను పట్టుకొని హత్య చేసిన సందర్భం కూడా ప్రత్యేకించి గమనించదగినది. గత కొంత కాలంగా హోంమంత్రి చిదంబరం 'నక్సలైట్లు హింసకు స్వస్తి చెప్పాల'ని వూదర గొడుతూ తాము ప్రజలపై సాగిస్తున్న అంతులేని అమానవీయ హింసను మరుగుపరుస్తుండగా, దేశప్రజలపై అన్యాయమైన యుద్ధం చేస్తూ తాము ప్రతిక్షణం పాల్పడుతున్న అసంఖ్యాక అకృత్యాలను కప్పిపెడ్తూ విప్లవ శక్తుల ప్రతిఘటనా చర్యలపై విపరీత స్థాయిలో దుష్ప్రచారానికి పాల్పడుతుండగా కామ్రేడ్ ఆజాద్ ఎప్పటికప్పుడు పార్టీ వైఖరినీ, పీడిత ప్రజల గొంతునూ ప్రపంచానికి నిరంతరాయంగా వినిపిస్తూ వచ్చాడు. ఈ మధ్యన స్వామి అగ్నివేష్‌తో పాటు మరి కొందరు ప్రజాస్వామ్యవాదులు శాంతి ప్రతిపాదనలతో ముందుకు వచ్చినపుడు తాను పార్టీ వైఖరిని వాళ్ల ముందు వుంచాడు. సమస్య పరిష్కారానికి ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను ఆపెయ్యాలనీ, ఇరుపక్షాలు ఏక సమయంలో కాల్పుల విరమణ చేయాలనీ ప్రతిపాదించాడు. కానీ ఒకవైపు ఈ ప్రక్రియను కొనసాగిస్తున్నట్టు నటిస్తూనే, ప్రజల్ని మభ్యపెడుతూనే కామ్రేడ్ ఆజాద్‌ను హత్య చేయడానికి సోనియా-మన్మోహన్-చిదంబరం ముఠా నిర్ణయం తీసుకుంది. ఆ నిర్ణయం ప్రకారమే స్వామి అగ్నివేష్ తీసుకున్న చొరవకు చిదంబరం మధ్యలోనే విఘాతం కల్పించాడు. అట్లా కామ్రేడ్ ఆజాద్ హత్య ఒక పెద్ద కుట్రలో భాగంగానే జరిగిందనేది స్పష్టం. దీనిని బట్టి పాలక ముఠాకు శాంతి పట్లా, చర్చల పట్లా, ప్రజా సమస్యల పరిష్కారం పట్లా ఏ మాత్రం చిత్తశుద్ధి లేదనే విషయం మరోసారి తేటతెల్లమవుతున్నది.

ఆజాద్‌తో పాటు ప్రయాణిస్తున్న హేమచంద్ర పాండే అనే ఫ్రీలాన్స్ జర్నలిస్టును కూడా వదిలిపెట్టకుండా హత్య చేయడానికి ముఖ్య కారణం ఆజాద్ హత్యకు ఎలాంటి సాక్ష్యం మిగలకుండా చేయడమే. అలాగే ఇది ప్రజాపక్షం వహిస్తున్న జర్నలిస్టులకూ, ప్రజాస్వామ్య వాదులకూ దేశ పాలకముఠా చేస్తున్న హెచ్చరిక కూడా. ఇటీవలి కాలంలో దండకారణ్యాన్ని సందర్శించి ఇక్కడి వాస్తవ పరిస్థితులను కొందరు జర్నలిస్టులు, మేధావులు ప్రపంచానికి చాటిన విషయం చిదంబరం ముఠాకు మింగుడు పడడం లేదు. ఏపీ ఎస్ఐబీకి గులాం రసూల్ వంటి విలేకరులనూ, పురుషోత్తం వంటి ఎందరో ప్రజాస్వామిక వాదులనూ హతమార్చిన హీన చరిత్ర ఉంది. దానికి కొనసాగింపే హేమచంద్ర పాండే దారుణ హత్య. పత్రికా స్వేచ్ఛకు వాళ్లెంత బద్ద వ్యతిరేకులో అర్థం చేసుకోవడానికి మరో ఉదాహరణ ఇది.

విప్లవోద్యమ నేతలను హతమార్చి ఉద్యమాలను లేకుండా చేయగలమని దోపిడీ పాలకవర్గాలు పగటికలలు గంటున్నాయి. ఆజాద్ హత్యతో భారత విప్లవం, భారత పీడిత ప్రజానీకం ఒక గొప్ప విప్లవ మేధావినీ, ఉత్తమ కమ్యూనిస్టు యోధుడినీ, గొప్ప మార్క్సిస్టు సిద్ధాంతవేత్తనూ కోల్పోయింది. ఇది చాలా పెద్ద నష్టమే. అయితే ప్రజలూ, విప్లవోద్యమమే ఆజాద్ వంటి ఒక గొప్ప నాయకుడిని సృష్టించుకున్నారు. ఇక ముందూ సృష్టించుకుంటారు. దేశంలోని వేలాది మంది నవ యువతీయువకులు ఆజాద్ చూపించిన మార్గంలో ముందుకు నడిచి ఆయన లేని లోటును తప్పక తీర్చుతారు. భారత విప్లవోద్యమాన్ని విజయపథాన నడిపిస్తారు. ఇది తిరుగులేని చారిత్రక సత్యం.

కామ్రేడ్ ఆజాద్ హత్యకు నిరసనగా జూలై 8 నుండి 14వ తేదీ వరకు నిరసన వారం పాటించాల్సిందిగా మా కేంద్రకమిటీ దేశ ప్రజలకూ, ప్రజాస్వామికవాదులకూ విజ్ఞప్తి చేస్తున్నది. ఈ సందర్భంగా 8వ తేదీ నుండి 12వ తేదీ వరకు ఐదు రోజుల పాటు నిరసన ప్రదర్శనలు, ధర్నాలు, సభలు, సమావేశాలు నిర్వహించాలనీ, 13-14 తేదీలలో 48 గంటల పాటు 'భారత్ బంద్'ను విజయవంతం చేయాలనీ విజ్ఞప్తి చేస్తున్నాం. వైద్యం తదితర అత్యవసర సేవలను బంద్ నుండి మినహాయిస్తున్నాం. ఈ వారం రోజుల నిరసన కార్యక్రమంలో ఈ బూటకపు ఎన్‌కౌంటర్‌పై పూర్తి స్థాయి న్యాయవిచారణ జరిపించాలనీ, దోషులను కఠినంగా శిక్షించాలనీ, ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను తక్షణమే వెనక్కి తీసుకోవాలనీ వివిధ రూపాల్లో డిమాండ్ చేయాల్సిందిగా దేశ ప్రజలందరికీ విజ్ఞప్తి చేస్తున్నాం.

**సోను,**

**పొలిట్‌బ్యూరో సభ్యుడు**

**కేంద్ర కమిటీ తరఫున**

**సీపీఐ (మావోయిస్టు)**

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# కేంద్ర కమిటీ

**30-7-2010**

## కాశ్మీర్ ప్రజలపై ప్రతి నిత్యం కాల్పులకూ, దాడులకూ పాల్పడుతూ యువతరాన్ని దారుణంగా హత్య చేస్తున్న భారత ప్రభుత్వ సాయుధ బలగాల దురాగతాల్ని ముక్త కంఠంతో ఖండించండి!

## కాశ్మీర్ కాశ్మీర్‌వాసులదే! కాశ్మీరీ ప్రజల న్యాయమైన జాతి విముక్తి పోరాటాన్ని నిర్ద్వంద్వంగా సమర్థించండి!!

గత నెల రోజులుగా మరోసారి కాశ్మీర్ భగ్గున మండుతోంది. ప్రతి రోజూ భారత ప్రభుత్వ పోలీసు/సీఆర్‌పీఎఫ్ బలగాలు అక్కడి ప్రజలపై విచ్చలవిడి కాల్పులకు పాల్పడుతూ ఇప్పటికి 19 మందిని (ఇందులో ఎక్కువ మంది టీనేజర్లే) పొట్టన బెట్టుకున్నాయి. అనేక వందల మంది గాయపడ్డారు. తాజాగా ఈరోజు జూలై 30న కాశ్మీర్ లోయలో అనేక చోట్ల జరిగిన ప్రజా ప్రదర్శనలపై పోలీసులు, పారా మిలిటరీ బలగాలు కాల్పులు జరిపి కనీసం మరో నలుగురిని బలిగొన్నాయి. వందకు పైగా మందిని గాయపర్చాయి. కాశ్మీర్‌లో మిలిటెన్సీ సమసిపోయిందనీ, అక్కడి 'వేర్పాటువాద' సంస్థలను అణిచేసామని భారత పాలకవర్గాలు గొప్పలు చెప్పుకుంటున్నప్పటికీ కాశ్మీర్ ప్రజలు ప్రతి నిత్యం ఏదో ఒక సమస్యపై పోరాడుతూనే వున్నారు. 2008లో అమర్‌నాథ్ ఆలయ బోర్డు వివాదం, 2009లో షోపియన్ పట్టణంలో ఇద్దరు మహిళలపై అత్యాచారం జరిపి హత్య చేసిన ఉదంతం దరిమిలా కాశ్మీర్ ప్రజలు పెద్ద ఎత్తున వీధుల్లోకి వచ్చి పోలీసు/పారా మిలిటరీ బలగాల కాల్పుల్ని లెక్కచెయ్యకుండా, కర్ఫ్యూనూ, ఆంక్షల్నీ లక్ష్యపెట్టకుండా ఒక వెల్లువలా వరుసగా అనేక రోజుల పాటు పోరాడారు. ఈసారి జూన్ 11న పోలీసులు ప్రయోగించిన ఒక టియర్‌గ్యాస్ షెల్ మూలంగా ఒక స్కూలు విద్యార్థి చనిపోయిన సంఘటనతో ఈ తాజా నిరసనోద్యమం మొదలైంది. కాశ్మీర్ ప్రజల శాంతియుత, ప్రజాస్వామ్యబద్ధమైన నిరసన పోరాటాల్ని కూడా సహించలేని భారత ప్రభుత్వం, దానికి తొత్తుగా వ్యవహరిస్తున్న ఒమర్ అబ్దుల్లా ప్రభుత్వం ఇప్పటికే ఎన్నో మార్లు కాల్పులు జరిపి, కర్ఫ్యూ

విధించి, లాఠీచార్జ్, టియర్‌గ్యాస్ ప్రయోగాలు జరిపి మరెందరినో హత్య చేసినప్పటికీ ఈ ఉద్యమం ఆగడం లేదు.

కాశ్మీర్‌లో ఏ రూపంలో, ఏ సమస్యపై ప్రజల నిరసన పోరాటం మొదలైనప్పటికీ అందులో 'ఆజాదీ' (స్వాతంత్ర్యం) నినాదమే ప్రధానంగా చోటు చేసుకోవడం ప్రత్యేకించి గమనించాల్సిన విషయం. ఇది కాశ్మీర్ ప్రజల హృదయాల్లో తమ జాతి విముక్తి పట్ల, తమ స్వాతంత్ర్యం పట్ల పాతుకుపోయిన మొక్కవోని ఆకాంక్షకు ప్రతిబింబం. 'కాశ్మీర్ భారతదేశంలో విడదీయరాని భాగం' అంటూ భారత విస్తరణవాద పాలకులు మీడియా ద్వారా ఎంతగా ప్రచారం చేసినప్పటికీ చరిత్ర తెలిసిన విజ్ఞులెవరూ కాశ్మీర్ ఎప్పుడూ భారతదేశంలో భాగంగా లేదనీ, అదొక ప్రత్యేక దేశంగానే అనేక ఏళ్లుగా కొనసాగుతూ వుండిందనే వాస్తవాన్ని కాదనలేరు. మాట్లాడడం వచ్చిన పసివాళ్లు మొదలుకొని కాశ్మీర్ సమాజంలోని ప్రతి ఒక్కరూ 'ఆజాదీ' కోసం పరితపించడాన్ని కేవలం లష్కర్-ఏ-తోయిబా ప్రోద్బలంతోనో, లేక విదేశీ శక్తులు డబ్బులు గుమ్మరించడం వల్లనో చోటు చేసుకున్న పరిణామంగా వక్రీకరించడం కాశ్మీరీ ప్రజల ఆకాంక్షల్ని, ఆత్మగౌరవాన్ని ఘోరంగా అవమానించడమే. 7 లక్షలకు పైగా వివిధ సాయుధ బలగాల మోహరింపుతో ప్రపంచంలోనే అత్యంత సైన్యీకరించబడిన ప్రాంతంగా వున్న కాశ్మీర్‌లో సాయుధ పోరాట సంస్థలు బలహీనపడినప్పటికీ ప్రజలు, ముఖ్యంగా యువతరం చేతికందిన రాళ్లనే ఆయుధాలుగా ప్రయోగిస్తూ పోలీసు, పారా మిలిటరీ బలగాల్తో తలపడడాన్ని వాళ్లలో నిక్షిప్తమైన తీవ్ర స్వాతంత్ర్యేచ్ఛకు వ్యక్తీకరణగా చూడకుండా భారత పాలకులు ఆఖరుకు రాళ్లు కూడా విదేశాల నుండే దిగుమతవుతున్నాయన్నట్టుగా దుష్ప్రచారం చేస్తున్నారు. బంతిని ఎంత బలంగా నేలకేసి కొడితే అంతే పైకి లేస్తుందన్నట్టుగా ఎంత దారుణమైన నిర్బంధం అమలవుతున్నా తలవంచక పోరాడుతున్న కాశ్మీరీ ప్రజల ముందు ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లాతో సహా పాలక నేషనల్ కాన్ఫరెన్స్ ముఠా, ప్రతిపక్ష పీడీపీ, ఆఖరుకు హురియత్‌లోని మితవాద వర్గం కూడా పూర్తిగా ఒంటరైపోయాయి. ప్రజల తీవ్ర అసహ్యానికి గురై దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాయి. కాశ్మీరీ ప్రజలు వాళ్లను 'భారతీయ కుక్కలు'గా అభివర్ణిస్తూ మొఖం మీదనే ఛీకొడుతున్నారు.

నిరంతర కర్ఫ్యూలనూ, కాల్పులనూ, 'ఎన్‌కౌంటర్' హత్యలనూ, మాయం చెయ్యడాలనూ, అడుగడుగునా ఎదురయ్యే అవమానకరమైన సోదాలనూ వేటినీ లెక్కచేయకుండా పోలీసు కాల్పుల్లో బలైన యువతీయువకుల శవయాత్రలలో వేలాది సంఖ్యలో కదులుతూ లోయనంతా రణరంగంగా మల్చి హంతక పోలీసు/పారా మిలిటరీ బలగాలతో బాహాబాహీ తలపడుతున్న

కాశ్మీరీలకు భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) హృదయపూర్వక విప్లవాభినందనలు తెలుపుతున్నది. సీఆర్‌పీఎఫ్, పోలీసు బలగాలు కాశ్మీర్‌లో నిరాయుధ యువతరాన్ని విచ్చలవిడిగా కాల్చి చంపుతున్నట్టుగానే ఇక్కడ మా పార్టీ నాయకత్వంలోని విప్లవోద్యమ ప్రాంతాలలో, ముఖ్యంగా దండకారణ్యంలో ఎందరో నిరాయుధ ఆదివాసీలను మూకుమ్మడి హత్యాకాండలకు బలి చేస్తున్నాయి. గ్రామాల్ని వల్లకాడులుగా మారుస్తూ మహిళలపై లెక్కలేనన్ని ఘోరకృత్యాలకు పాల్పడుతున్నాయి. మీరక్కడ బండరాళ్లతోనే కిరాయి బలగాల అత్యాధునిక ఆయుధాలకు ఎదురునిలిచి పోరాడుతుంటే ఇక్కడ మా ప్రజలు విల్లమ్ములతో పోరాడుతున్నారు. ఇక్కడి ప్రజలకు అండగా మా పార్టీ నాయకత్వంలోని ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం వున్నందువల్ల హంతక బలగాలపై గట్టి దెబ్బలు తీయగలుగుతున్నాం. అక్కడా, ఇక్కడా మన శత్రువులొక్కరే. దోపిడీ పాలకవర్గాలైన భూస్వాములూ, బడా పెట్టుబడిదార్లతో పాటు వాళ్లకు అండగా నిలబడ్డ సామ్రాజ్యవాదులే అక్కడా, ఇక్కడా పోలీసు/పారా మిలిటరీ బలగాల్ని ప్రజలపై ఉసిగొల్పుతున్నారు. విప్లవోద్యమ సమూల నిర్మూలనా లక్ష్యంతో 'ఆపరేషన్ గ్రీన్‌హంట్' పేరుతో ప్రజలపై సాగిస్తున్న యుద్ధంలో భాగంగా ఎన్నో దారుణాలకు పాల్పడుతున్నారు. ఈ ఉమ్మడి శత్రు బలగాలకు వ్యతిరేకంగా మీరు చేస్తున్న పోరాటాలన్నిటికీ మా పార్టీ, ప్రజా సైన్యం, విప్లవ ప్రజానీకమంతా బాసటగా నిలబడుతామని హామీ ఇస్తున్నాం.

కాశ్మీర్ పూర్తిగా కాశ్మీరీ ప్రజలదే. దాని భవితవ్యాన్ని నిర్ణయించుకునే హక్కు కేవలం కాశ్మీరీయులకే ఉండాలి. భారత ప్రభుత్వానికి గానీ, పాకిస్తాన్‌కు గానీ కాశ్మీర్‌పై ఎలాంటి హక్కూ లేదు. కాశ్మీరీ ప్రజల 'ఆజాదీ' ఉద్యమం పూర్తిగా న్యాయమైంది. కాశ్మీరీ ప్రజల స్వాతంత్ర్య కాంక్షను దెబ్బతీయడానికే భారత పాలకవర్గాలు నీచమైన దుష్ప్రచారానికి పాల్పడుతూ అంతులేని నిర్బంధకాండ, ఫాసిస్టు హత్యాకాండ కొనసాగిస్తున్నాయి. అందులో భాగమే వరుసగా కొనసాగిస్తున్న కాల్పులు... కాశ్మీరీ యువకులను దారుణంగా కాల్చి చంపుతున్న ఉదంతాలు. కాశ్మీర్ నుండి పారా మిలిటరీ, సైనిక బలగాలన్నిటినీ వెనక్కి తీసుకోవాలనీ, కాశ్మీరీ యువతరాన్ని పొట్టనబెట్టుకుంటున్న పోలీసు/పారా మిలిటరీ బలగాలపై, అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలనీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేయ్యాలని మేం దేశ ప్రజలనూ, ప్రజాస్వామిక వాదులనూ అందరినీ కోరుతున్నాం. కాశ్మీర్ ప్రజలకు వ్యతిరేకంగా, వాళ్లు కొనసాగిస్తున్న న్యాయమైన పోరాటాలకు వ్యతిరేకంగా దోపిడీ పాలకవర్గాలు, ప్రత్యేకించి కాషాయ టెర్రరిస్టు ముఠా పథకం ప్రకారం చేస్తున్న ఉద్రేకపూరిత దుష్ప్రచారానికి లోను కావద్దనీ, నిజానిజాల్ని తెలుసుకొని న్యాయం

వైపు గట్టిగా నిలబడాలని మేం ప్రజలందరినీ కోరుతున్నాం. బ్రహ్మాండమైన కాశ్మీర్ ప్రజా పోరాటం ముందు నైతికంగా ఘోరంగా ఓడిపోయి, ఆపరేషన్ గ్రీన్‌హంట్ పేరిట ఆదివాసులపై అంతులేని హింసోన్మాదానికి పాల్పడినప్పటికీ ఎదురవుతున్న తీవ్ర ప్రజా ప్రతిఘటనతో దిక్కుతోచని చిదంబరం ముఠా 'చర్చల'నీ, 'శాంతి' అనీ చేస్తున్న ప్రేలాపనలకు ఎవరూ మోసపోవద్దనీ మేం దేశ ప్రజలందరినీ కోరుతున్నాం. ప్రజల నిజమైన శాంతీ సౌభాగ్యాలకూ, స్వేచ్ఛా ఆకాంక్షలకూ భారత పాలకవర్గాలే, వాటితో పెనవేసుకున్న సామ్రాజ్యవాదులే అతి పెద్ద శత్రువులనే వాస్తవాన్ని గుర్తించాలని మా పార్టీ ప్రజలందరికీ విజ్ఞప్తి చేస్తున్నది. ఈ ఉమ్మడి శత్రువులకు వ్యతిరేకంగా అన్ని వర్గాల, అన్ని జాతుల ప్రజలు అన్ని రూపాల్లో పోరాటాల్ని తీవ్రతరం చేయడం ద్వారానే, వాళ్లకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ దోపిడీ వ్యవస్థను కూకటివేళ్లతో పెకిలించడం ద్వారానే నిజమైన శాంతి, సౌభ్రాతృత్వం వెల్లివిరుస్తాయనీ, ప్రజలందరికీ తిండి, గూడు, గుడ్డ, స్వేచ్ఛ, గౌరవం, సమానత్వం లభిస్తాయని మేం ప్రజలందరికీ స్పష్టం చేస్తున్నాం.

**అభయ్**

**అధికార ప్రతినిధి**

**కేంద్ర కమిటీ**

**సీపీఐ (మావోయిస్టు)**

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# కేంద్ర కమిటీ

**23-9-2010**

## తమ స్వాతంత్ర్యం కోసం ఉద్యమిస్తున్న కాశ్మీరీయులను హతమారుస్తున్న భారత పాలక వర్గాల దుశ్చర్యలను ఖండించండి!
## ప్రభుత్వ సాయుధ బలగాలు సాగిస్తున్న హత్యాకాండకు వ్యతిరేకంగా, కాశ్మీరీయుల న్యాయమైన ఉద్యమానికి మద్దతుగా...
## సెప్టెంబర్ 30 వ తేదీన 24 గంటల 'భారత్ బంద్'ను విజయవంతం చేయండి!!

కాశ్మీర్‌లో ప్రభుత్వ హత్యాకాండ పేట్రేగి పోతున్నది. ప్రభుత్వ సాయుధ బలగాలు సాగిస్తున్న విచ్చలవిడి కాల్పులనూ, అత్యాచారాలనూ, ఎడతెరిపి లేకుండా విధిస్తున్న కర్ఫ్యూలనూ ధిక్కరిస్తూ మొత్తం కాశ్మీర్ లోయ అంతటా నిరసన ప్రదర్శనలు జరుగుతున్నాయి. 'ఆజాదీ' (స్వాతంత్ర్యం) అనే నినాదంతో లోయ మారుమోగుతున్నది. జూన్ 11వ తేదీన మొదలై నిరంతరాయంగా సాగుతున్న కాశ్మీరీ ప్రజల న్యాయమైన పోరాటాన్ని అణచివెయ్యడానికి పారా మిలిటరీ, సైనిక బలగాలు, పోలీసులు జరుపుతున్న కాల్పుల్లో ఇప్పటికి వందకు పైగా మంది అసువులు బాసారు. (వీరిలో అత్యధికులు ఇరవై ఏళ్ల లోపు యువకులూ, పిల్లలే.) వందలాది మంది గాయపడ్డారు. నిరాయుధంగా, శాంతియుతంగా, న్యాయబద్ధంగా ప్రదర్శనలు చేస్తున్న కాశ్మీరీ ప్రజలపై ప్రపంచంలోనే తమది అతి పెద్ద ప్రజాస్వామ్యమని చెప్పుకునే భారత విస్తరణవాద, దోపిడీ పాలకవర్గాలు నిస్సిగ్గుగా సాయుధ బలగాలను ఎగదోసి అత్యంత క్రూరంగా అణచివేస్తున్నాయి. కాంగ్రెస్ నాయకత్వంలోని యూపీఏ ప్రభుత్వం, వామపక్షీయులమని చెప్పుకునే సీపీఎం, సీపీఐ సహా పాలక పార్టీలన్నీ ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా కాశ్మీరీ ప్రజలపై సాగుతున్న దమనకాండను సమర్థిస్తుండగా, హిందూ మత దురహంకార బీజేపీ కాశ్మీరీ ప్రజలను అత్యంత క్రూరంగా అణచాలని ప్రభుత్వాన్ని పదే పదే రెచ్చగొడుతున్నది. కేంద్ర ప్రభుత్వం కాశ్మీరీ ప్రజలపై సాగిస్తున్న హింసాకాండలో పాలు పంచుకుంటూ భారత పాలకవర్గాల బంటు ఒమర్ అబ్దుల్లా ప్రభుత్వం ప్రజల నుండి పూర్తిగా వేరుపడి మరింతగా వారి అసహ్యానికి గురవుతున్నది. లాఠీచార్జ్‌లు, భాష్పవాయువు ప్రయోగంతో పాటు ప్రతి ప్రదర్శనపైనా కాల్పులు జరపడం ఆనవాయితీగా

మారింది. ఈ నేపథ్యంలోనే కాశ్మీరీ ప్రజలు, ముఖ్యంగా యువకులు చేతికందిన రాళ్లతోనే ఎదురుదాడి చేస్తున్నారు. అమానుషమైన ఈ దమనకాండను వ్యతిరేకిస్తూ తమ ఆత్మరక్షణ కోసం చేస్తున్న ఈ ప్రతిఘటన సంపూర్ణంగా న్యాయమైనదీ, ప్రజాస్వామికమైనదీ.

కాశ్మీర్ ప్రజలు ఎన్నడూ తాము భారతదేశంలో అంతర్భాగమని భావించలేదు. 1947లో బ్రిటిష్ పాలకులు భారత్‌కూ, పాకిస్తాన్‌కూ బూటకపు స్వాతంత్ర్యం దఖలు పర్చిన నాటికి రాజా హరిసింగ్ పాలనలో కాశ్మీర్ ఒక స్వతంత్ర రాజ్యంగా వుండింది. అయితే కుటిలనీతిలో ఆరితేరిన బ్రిటిష్ సామ్రాజ్యవాదుల బడితొత్తులైన భారత్, పాకిస్తాన్ దోపిడీ పాలకవర్గాలు తమ తమ ప్రయోజనాల రీత్యా కాశ్మీరీయుల అభీష్టానికీ, ఆకాంక్షలకూ పూర్తి విరుద్ధంగా కాశ్మీర్‌ను తమ తమ దేశాల్లో కలిపేసుకున్నారు. ఒక భాగాన్ని భారత విస్తరణవాదులు ఆక్రమించుకోగా మిగిలిన సగాన్ని పాకిస్తాన్ తనలో కలిపేసుకుంది. ఈ విధంగా అతి దుర్మార్గంగా వీరు కాశ్మీర్‌ను రెండు ముక్కలుగా విభజించారు. ఆనాడు కాశ్మీరీయుల నిరసనను చల్లబర్చడానికి నెహ్రూ ప్రభుత్వం కాశ్మీర్‌లో ప్లెబిసైట్ (ప్రజాభిప్రాయ సేకరణ) జరిపి ప్రజలు విడిపోతామని కోరుకుంటే స్వాతంత్ర్యాన్ని ఇస్తామని కాశ్మీర్ ప్రజలకూ, ఐక్య రాజ్య సమితికీ లిఖితపూర్వకంగా వాగ్దానం చేసింది. ఈ వాగ్దానాన్ని నెహ్రూ అనేక సందర్భాల్లో పునరుద్ఘాటించాడు. కానీ అనతికాలంలోనే నెహ్రూ తన సైన్యాల పదఘట్టనల కింద నలిపెయ్యడం ఆరంభించాడు. ఆ వాగ్దానాన్ని నాటి నెహ్రూ నుండీ ఇప్పటి సోనియా–మన్మోహన్‌సింగ్ దాకా ఢిల్లీలో అధికారం చేపట్టిన ప్రతి పాలక పార్టీ తుంగలో తొక్కుతూనే వస్తున్నది. స్వాతంత్రం కోసం గొంతెత్తిన ప్రతిసారీ కాశ్మీరీయులపై భారత విస్తరణవాద ప్రభుత్వాలు నిర్బంధాన్నే ప్రయోగిస్తూ వచ్చాయి. కళ్ల ముందరి చరిత్రనూ, చేసిన వాగ్దానాలనూ మరుగుపరుస్తూ 'కాశ్మీర్ భారతదేశంలో విడదీయరాని భాగం' అనే ప్రచారాన్ని భారత పాలకులు ఒక పథకం ప్రకారమే చేస్తూ వచ్చారు. ఆనాటి నుండీ కాశ్మీరీయుల హృదయాల్లో రగులుతూ వచ్చిన స్వాతంత్ర్యేచ్ఛ 1990వ దశకంలో మిలిటెంట్ సాయుధ పోరాట ఉద్యమంగా రూపు దిద్దుకుంది. అనేక మిలిటెంట్ సంస్థలు సాయుధ పోరాటం నిర్వహించాయి. ఈ సంస్థల రాజకీయ లక్ష్యాలలో కొద్ది తేడాలు వున్నప్పటికీ కాశ్మీరీల జాతీయ విముక్తి ఆకాంక్షలను అవి వ్యక్తీకరించినందు వల్లనే ఆ సంస్థలకు ప్రజల మద్దతు దొరికింది. అయితే ఆ పోరాటాన్ని అణచెయ్యడానికి భారత ఫాసిస్టు పాలకవర్గాలు 7 లక్షలకు పైగా సైన్యాన్నీ, పారా మిలిటరీనీ దించి కాశ్మీర్ లోయనంతా సైన్యీకరించి ఇప్పటికే 80 వేలకు పైగా కాశ్మీరీ ప్రజలను పొట్టన బెట్టుకున్నాయి. వేలాది మందిని రాజ్యం మాయం చేసింది. ప్రపంచంలోని ఏ జాతి పోరాటంపైన కూడా ఇంత సుదీర్ఘ కాలం, ఇంత తీవ్ర స్థాయిలో, ఇంత భారీ సంఖ్యలో తన సాయుధ బలగాలను మోహరించి ఇంత క్రూరమైన అణచివేతను అమలు చేసిన ప్రభుత్వం మరొకటి లేదంటే అతిశయోక్తి కాదు. మిలిటెంట్ వుద్యమం తీవ్రమవుతున్నపుడే భారత పాలక వర్గాలు అనేక కుట్రలకూ, కుహకాలకూ పాల్పడి

'విభజించు-పాలించు' విధానం ప్రకారం కాశ్మీరీ హిందువులకూ, ముస్లింలకూ మధ్య చిచ్చు రేపాయి. కాశ్మీరీ ప్రజల న్యాయమైన ఉద్యమానికి వ్యతిరేకంగా కాశ్మీరీ పండితులను నిలబెట్టే కుట్రలు పన్నుతూనే వున్నాయి. ఇందులో ప్రత్యేకించి విస్తరణవాద దేశీయ దురహంకార కాంగ్రెస్ పాత్ర, కాషాయ హిందూ మత దురహంకార ఫాసిస్టు ముఠా అయిన సంఘ్ పరివార్ పోషించిన, పోషిస్తున్న పాత్ర చాలా నీచమైంది. 'మిలిటెన్సీ'గా పేరుగాంచిన కాశ్మీరీయుల పోరాటంలో పాకిస్తాన్ అనుకూల శక్తులు, ఇస్లామిక్ శక్తులు కొన్ని వున్నాయనే నెపంతో కాశ్మీరీ జాతి విముక్తి ఉద్యమాన్ని మొత్తంగానే పాక్ ప్రోద్భలంతో జరుగుతున్న ఉద్యమంగా, కాశ్మీరీయుల ఆందోళన భారత్ నుండి విడిపోయి పాకిస్తాన్‌లో విలీనం కావడానికే అని భారత్ పాలకులు చేస్తున్న ప్రచారం పచ్చి అబద్ధం. కాశ్మీరీ ప్రజల ఆకాంక్ష తొలి నుండీ కూడా తమ జాతి స్వాతంత్ర్యాన్ని సాధించుకోవడమే. అందుకే నేడు భారత పాలకులు కాశ్మీర్‌లో మిలిటెన్సీని రూపు మాపామని పదే పదే చెబుతున్నప్పటికీ నిజానికి ఈ పోరాటం ఆగనే లేదు. వేర్వేరు సమయాల్లో విభిన్న సమస్యలకు స్పందనగా ఈ వుద్యమం వెల్లువెత్తుతున్నప్పటికీ 'ఆజాదీ' నినాదమే అందులో ప్రధానాంశంగా వుండడమనే వాస్తవమే ఇందుకు ప్రబల సాక్ష్యం. జాతి స్వాతంత్ర్యం కోసం, స్వయం నిర్ణయాధికారం కోసం కాశ్మీరీ ప్రజలు సాగిస్తున్న ఉద్యమం పూర్తిగా న్యాయమైనదనీ, కాశ్మీర్‌పై భారత్‌కు గానీ పాకిస్తాన్‌కు గానీ ఎలాంటి అధికారం లేదనీ భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) దృఢంగా ప్రకటిస్తున్నది.

**స్వతంత్రాభిలాషులైన కాశ్మీర్ ప్రజలారా!**

స్వాతంత్ర్యం కోసం, స్వయంనిర్ణయాధికారం కోసం భారత విస్తరణవాద పాలకవర్గాలకు వ్యతిరేకంగా మీరు చేస్తున్న పోరాటాన్ని మా పార్టీ బలపరుస్తున్నది, పూర్తిగా బాసటగా నిలుస్తుంది. కాల్పులనూ, లాఠీచార్జ్‌లనూ, కర్ఫ్యూలనూ, నిరంతర సోదాలనూ, అంతులేని అవమానాలనూ ఎదిరిస్తూ మీరు దృఢ దీక్షతో చేస్తున్న పోరాటానికి మొత్తం భారత విప్లవ, ప్రజాస్వామిక, పోరాట ప్రజానీకమంతటి తరఫునా మా పార్టీ విప్లవ జేజేలు చెబుతున్నది. విచ్చలవిడిగా కాల్పులు జరుపుతూ డజన్ల సంఖ్యలో యువతీయువకుల్ని హతమారుస్తున్నా అమరవీరుల శవాల్ని భుజానకెత్తుకొని, అంతిమయాత్రల్లో వేలాది సంఖ్యలో పాల్గొంటూ 'ఆజాదీ' కోసం నినదిస్తున్న మీ పట్టుదల, త్యాగనిరతి చరిత్రలో సదా నిలిచిపోతాయి. భారత విస్తరణవాదుల కిరాయి సాయుధ బలగాల కాల్పుల్లో అసువులు బాసిన అమరుల కుటుంబాలకూ, బంధు మిత్రులకూ, మొత్తం కాశ్మీర్ సమాజానికీ మా పార్టీ ప్రగాఢ సానుభూతిని తెలుపుతున్నది. మీ పోరాటాన్ని విచ్ఛిన్నకర వుద్యమంగా, దేశద్రోహకరమైందిగా ముద్రవేసి, మిమల్ని ఒంటరి చేసే దుష్ట తలంపుతో విచ్చలవిడి హింసాకాండ కొనసాగిస్తున్న భారత పాలకవర్గాలే నేడు భారతదేశంలోని యావత్తు పీడిత ప్రజానీకానికీ, భారత ఉపఖండంలోని పీడిత జాతులకూ, విశాల ప్రజానీకానికీ శత్రువులు. కాబట్టి మన ఈ ఉమ్మడి శత్రువులకు వ్యతిరేకంగా మనందరం

సమైక్యంగా పోరాడుదాం. ఈ పోరాటాన్ని తీవ్రతరం చేద్దాం.

**న్యాయాన్ని కాంక్షించే భారత ప్రజలారా!**

కాశ్మీర్ ప్రజల న్యాయమైన పోరాటానికి వ్యతిరేకంగా భారత దోపిడీ పాలకవర్గాలు, ప్రత్యేకించి కాంగీ, కాషాయ టెర్రరిస్టు ముఠా పథకం ప్రకారం చేస్తున్న ఉద్రేకపూరిత దుష్ప్రచారానికి లోను కావద్దనీ, నిజానిజాల్ని తెలుసుకొని న్యాయం వైపు గట్టిగా నిలబడాలని మా పార్టీ మిమ్మలందరినీ కోరుతున్నది. కాశ్మీర్ ప్రజలపై ప్రభుత్వ సాయుధ బలగాలు కొనసాగిస్తున్న హత్యాకాండకు వ్యతిరేకంగా, కాశ్మీరీయుల న్యాయమైన పోరాటానికి సంఘీభావం ప్రకటిస్తూ మీరంతా సెప్టెంబర్ 30వ తేదీన 24 గంటల పాటు 'భారత్ బంద్'ను విజయవంతం చేయాలని పిలుపునిస్తున్నది.

**ఈ సందర్భంగా మా పార్టీ చేస్తున్న నిర్దిష్ట డిమాండ్లు ఇవి –**

***1) కాశ్మీర్‌లో భారత ప్రభుత్వ సాయుధ బలగాలు సాగిస్తున్న హత్యాకాండను వెంటనే నిలిపివెయ్యాలి!***

***2) కాశ్మీర్ నుండి అర్ధ సైనిక/సైనిక బలగాలను వెంటనే వెనక్కి రప్పించాలి!***

***3) సైన్య బలగాలకు ప్రజలను విచ్చలవిడిగా చంపేసే అధికారాన్నిచ్చే ఫాసిస్టు చట్టం 'సాయుధ బలగాల ప్రత్యేక అధికారాల చట్టాన్ని (ఏఎఫ్‌పీఎస్‌ఏ)' వెంటనే రద్దు చేయాలి!***

***4) కాశ్మీర్‌లో ప్లెబిసైట్‌ను నిర్వహించి కాశ్మీరీయులకు తమ భవిష్యత్తును తామే నిర్ణయించుకునే అధికారం ఇవ్వాలి!***

***5) రాజకీయ ఖైదీలందరినీ బేషరతుగా విడుదల చేయాలి!***

ఈ 'భారత్ బంద్'లో భాగంగా ఆరు రాష్ట్రాలు – బీహార్, ఝార్ఖండ్, పశ్చిమ బెంగాల్, ఛత్తీస్‌గఢ్, ఒడిషా, ఆంధ్రప్రదేశ్‌లతో పాటు మహారాష్ట్రలోని గడ్చిరోలి, గోందియా, చంద్రపూర్ జిల్లాల్లో, మధ్యప్రదేశ్‌లోని బాలాఘాట్ జిల్లాలో రైల్వే, రోడ్లు, బ్యాంకులు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, పరిశ్రమలు, విద్యా, వ్యాపార సంస్థలన్నీ మూసెయ్యాలనీ, వాటికి హాజరు కావద్దనీ మేం ప్రజలకు పిలుపునిస్తున్నాం. అయితే వైద్యం తదితర అత్యావశ్యక సేవల్ని బంద్ నుండి మినహాయిస్తున్నాం.

**ఆనంద్**
**సెంట్రల్ రీజనల్ బ్యూరో కార్యదర్శి,**
**కేంద్ర కమిటీ**
**సీపీఐ (మావోయిస్టు)**

**అభయ్**
**అధికార ప్రతినిధి**
**కేంద్ర కమిటీ**
**సీపీఐ (మావోయిస్టు)**

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# కేంద్ర కమిటీ

**31-10-2010**

## ప్రపంచ ప్రజల నెంబర్ వన్ శత్రువైన అమెరికా సామ్రాజ్యవాదుల సర్దార్ బరాక్ ఒబామా భారత పర్యటనను గట్టిగా వ్యతిరేకించండి! 'ఒబామా! గో బ్యాక్!!' అని ఊరూరా, వాడ వాడా గొంతెత్తి నినదించండి!!

నవంబర్ 6వ తేదీన అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా మన దేశం వస్తున్నాడు. మన దేశ దళారీ పాలకులు ఒబామాకు ఎర్ర తివాచీ పరచి స్వాగతం చెప్పడానికి ముంబాయి, ఢిల్లీ మహానగరాల్ని ముస్తాబు చేస్తున్నారు. ఇది ప్రజాస్వామ్యప్రియులూ, శాంతిప్రియులూ, దేశభక్తులూ అయిన మన దేశ ప్రజలందరికీ చాలా అవమానకరం. ప్రపంచంలోని వెనుకబడిన దేశాల్ని అత్యంత దారుణంగా దోచుకుంటూ, పీడిత జాతులను అణచివేస్తూ, పేరుమోసిన హంతక నియంతలను అధికారంలో నిలబెడుతూ, తమకు సహకరించని దేశాల్ని నిరంతరం బెదిరిస్తూ, ప్రపంచంలోని చమురు సంపదల్నీ, ఖనిజ తదితర సహజ వనరుల్నీ చేజిక్కించుకోవడం కోసం ఎంతటి దుర్మార్గానికైనా బరితెగించే అమెరికా సామ్రాజ్యవాదం ప్రపంచ ప్రజలకు నంబర్ వన్ శత్రువు. దీనికి నాయకత్వం వహిస్తున్న బరాక్ ఒబామా ప్రపంచ ప్రజలంతా ఛీకొట్టాల్సిన వ్యక్తి. మునుపటి జార్జ్ బుష్ ప్రపంచవ్యాప్తంగా ప్రజల తీవ్ర అసహ్యానికి గురైన నేపథ్యంలో ఒంటి రంగుతో ప్రజల్ని మోసం చెయ్యవచ్చుననే పథకంతోనే అమెరికన్ సామ్రాజ్యవాద ప్రభువులు బరాక్ ఒబామాను ముందుకు తెచ్చారు. ఒబామా బుష్ విధానాల్ని వ్యతిరేకిస్తున్నట్టు ఎంతగా మాట్లాడినప్పటికీ ఆయన వైట్‌హౌజ్‌లోకి ప్రవేశించిన మరుక్షణం నుండి ఇప్పటి దాకా ఆయన అనుసరించిన విధానాలూ, తీసుకున్న నిర్ణయాలూ అన్నీ కూడా బుష్ పాలనకు కొనసాగింపుగానే వున్నాయి. నిజానికి జార్జ్ బుష్‌కూ, బరాక్ ఒబామాకూ ఒంటి రంగులో, వాళ్ళు ప్రాతినిధ్యం వహించే పార్టీల పేర్లలో మాత్రమే తేడా వుంది తప్ప ప్రపంచ ప్రజల్నీ, పీడిత జాతుల్నీ, దేశాల్నీ, అమెరికన్ కార్మికవర్గాన్నీ దోచుకోవడంలో, అణిచెయ్యడంలో మౌలికమైన తేడా ఏమీ లేదు. అమెరికన్ సామ్రాజ్యవాద వ్యవస్థను శాసించే, నడిపించే కరడుగట్టిన కార్పొరేట్ గుత్త సంస్థల తెల్ల జాతి ప్రభువులే ఈ నల్ల రంగు రాష్ట్రపతిని ఎంపిక చేశారనేది కాదనలేని వాస్తవం.

నేడు అఫ్ఘనిస్తాన్‌లో, పశ్చిమ పాకిస్తాన్‌లో అమెరికన్ సామ్రాజ్యవాదులు ప్రతి రోజూ యుద్ధ విమానాలతో బాంబులు కురిపిస్తూ, డ్రోన్ దాడులు చేస్తూ అమాయక పౌరుల్ని హతమారుస్తున్నారు. ఇరాక్‌లో దారుణ మారణహోమం ఇంకా కొనసాగుతూనే వున్నది. ఒబామా పాలనలో అఫ్ఘనిస్తాన్‌కు కొత్తగా 30 వేల మంది అమెరికన్ సైన్యాలను పంపించి తన యుద్ధపిపాసను చాటుకున్నాడు. భూమండలాన్ని పదిసార్లు నాశనం చెయ్యగల అతి వినాశకర ఆయుధాల గుట్టలపై నిలబడ్డ అమెరికన్ సామ్రాజ్యవాదం, తన ఆర్థికవ్యవస్థలో పెద్ద భాగం ఆక్రమించే యుద్ధ పరిశ్రమ సంక్షోభంలో పడకుండా వుండడం కోసం యుద్ధాల్ని రెచ్చగొడుతూ, స్వయంగా యుద్ధాలు చేస్తూ వస్తున్నది. మరోవైపు అది అణు సామర్థ్యాన్ని సమకూర్చుకుంటున్నారనే పేరుతో ఇరాన్, ఉత్తర కొరియాలను నిరంతరం బెదిరిస్తున్నది. అల్ కాయిదాకు అండగా నిలబడుతున్నదంటూ యెమెన్‌పై గురి పెడుతున్నది. 9/11 దాడుల తర్వాత 'టెర్రరిజంపై యుద్ధం' పేరుతో జార్జ్ బుష్ మొదలుపెట్టిన ఫాసిస్టు హత్యాకాండను, హింసాకాండను ఒబామా ఎలాంటి మినహాయింపు లేకుండా కొనసాగిస్తూ అల్‌కాయిదాను, తాలిబాన్లను, ఇస్లామిక్ వుగ్రవాదుల్ని అణచివేసే పేరుతో విచ్చలవిడి దాడులకు పాల్పడుతున్నాడు. గాజాను భూతల నరకంగా మార్చివేసి ఇజ్రాయిల్ యూదు దురహంకారులు చేసిన పాశవిక దాడులను, దాని పేరుమోసిన హంతక సంస్థ మొసాద్ పాల్పడుతున్న కుట్రపూరిత హత్యలను ఆపడానికి ప్రయత్నించకుండా, ఖండించకుండా ఒబామా వందలాది పాలస్తీనీయుల మరణానికి కారకుడయ్యాడు.

అమెరికన్ గూఢచర్య సంస్థ ఐన ఎఫ్‌బీఐ నీచమైన అకృత్యాలకు పాల్పడుతూ స్టింగ్ ఆపరేషన్స్ ద్వారా అమాయక అమెరికన్ ముస్లిం యువకులనూ, ప్రత్యేకించి పాకిస్తానీ మూలాలకు చెందిన అమెరికన్ యువకులనూ రెచ్చగొట్టి దాడులకు ప్రేరేపించి, కోవర్ట్ ఆపరేషన్స్‌తో చివరకు వాళ్లను సాక్ష్యాలతో సహా అరెస్టు చేసి పెద్ద విజయాల్ని సాధించినట్టుగా ప్రచారం చేసుకోవడం బుష్ వారసత్వంగా ఒబామా పాలనలో చాలా స్పష్టంగా ముందుకొచ్చిన పరిణామం. ఇలా అమెరికన్ ప్రజల్లో ఒకవైపు అభద్రతా భావాన్ని నిరంతం కొనసాగేలా చేస్తూ, మరోవైపు ప్రజల్నుండి రాబట్టిన నిధుల్ని అది భారీగా తన 'టెర్రరిజంపై యుద్ధం'లోకి మళ్లిస్తున్నది. అలా అది అమెరికాలోని ముస్లిం సమాజంలో, మొత్తంగా అమెరికన్ శ్రామిక ప్రజలలో అంతులేని నిరాశా, నిస్పృహల్ని వ్యాపింపజేస్తున్నది.

నేడు అమెరికన్ ఆర్థికవ్యవస్థ దారీతెన్నూ కానరాని తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయి వున్నది. సబ్ ప్రైమ్ సంక్షోభంగా బద్దలైన ఈ సంక్షోభం 1930వ దశకం తర్వాత ఎన్నడూ లేనంత తీవ్రరూపం దాల్చింది. 10 శాతానికి పైగా పెరిగిపోయిన నిరుద్యోగం దాని చరిత్రలోనే ఎన్నడూ ఎరగనిది. కానీ ఒబామా మాత్రం బెయిల్-ఔట్ల పేరుతో వందల బిలియన్ల డాలర్ల

ప్రజా ధనాన్ని తెగబలిసిన కార్పొరేట్ గుత్త సంస్థల బొక్కసాలలోకి మళ్లిస్తూ అమెరికన్ ప్రజానీకాన్ని, ముఖ్యంగా శ్రామిక, మధ్య తరగతి ప్రజల్ని ఎన్నో ఇక్కట్ల పాలు చేస్తున్నాడు. ప్రజా సంక్షేమం కోసం అమలుచేసే ఎన్నో పథకాల్లో కోత విధించాడు. అయినా కూడా ఈ సంక్షోభ సుడిగుండం లోంచి బయట పడలేని తన ఆర్థికవ్యవస్థకు ప్రాణం పొయ్యడం కోసం వెనుకబడిన, పేద దేశాల నుండి వనరుల దోపిడీని మరింత తీవ్రతరం చెయ్యడానికి ప్రయత్నిస్తున్నాడు. ఇప్పుడు ఒబామాతో పాటు బలిసిన కార్పొరేట్ ప్రభువులంతా మన దేశానికి వస్తున్నది ముంబాయి, ఢిల్లీ నగరాల అందాన్ని చూసి మురిసిపోవడానికి కాదు. ఇక్కడికి మరిన్ని పెట్టుబడుల్ని తరలించి, ఈ దేశ మూలుగుల్ని మరింత దారుణంగా పీల్చివేసే ఎన్నో ఒప్పందాలు చేసుకోవడానికే. తద్వారా తమ సంక్షోభ భారాన్ని భారతదేశంపై మరింతగా నెట్టివేసే పథక రచన చెయ్యడానికే. ఈ దేశ వనరుల్ని విచ్చలవిడిగా కొల్లగొట్టడానికి ప్రధాన అడ్డంకిగా వున్న మావోయిస్టు వుద్యమం సహా ప్రజా వుద్యమాలన్నిటినీ మరింత క్రూరంగా అణిచేసేందుకు సలహాలివ్వడానికే.

భారత భూస్వామ్య, బడా పెట్టుబడిదారీ పాలకవర్గాల ప్రతినిధి అయిన యూపీఏ ప్రభుత్వం, దానికి నాయకత్వం వహిస్తున్న మన్మోహన్ సింగ్ తన తొలి దశ పాలనలోనే ప్రజల వ్యతిరేకతను ఏ మాత్రం లెక్క చెయ్యకుండా అమెరికాతో పౌర అణు ఒప్పందం కుదుర్చుకొని అమెరికన్ సామ్రాజ్యవాదులకు నమ్మినబంటుగా లొంగుబాటును ప్రదర్శించాడు. ఇటీవల పార్లమెంటు ఆమోదించిన 'అణు పరిహార బిల్లు' ఈ విధానానికి కొనసాగింపే. వేల మంది దుర్మరణానికీ, లక్షలాది ప్రజల జీవితాలు చీకటిమయం కావడానికీ దారితీసిన భోపాల్ గ్యాస్‌లీక్ దుర్ఘటన భారత ప్రజల మెదళ్లలో ఇంకా పచ్చి పుండులా సలుపుతూనే వున్నా, మరెన్నో 'భోపాల్'లు తలెత్తడానికీ, అటువంటి ఘోర ప్రమాదాలు జరిగినా దానికి కారకులైన విదేశీ పెట్టుబడిదార్లకు వీలైనంత తక్కువ 'పరిహారం' చెల్లించి తేలిగ్గా తప్పుకోగలిగేలా (వారెన్ ఆండర్సన్‌కూ, డౌ కెమికన్స్‌కూ కల్పించినట్టుగా) వీలు కల్పించడానికీ యూపీఏ ప్రభుత్వం నిర్లజ్జగా, బరితెగింపుగా ఈ బిల్లుకు రూపకల్పన చేసింది. ఈ బిల్లు ఆమోదం పొందడంలో బీజేపీ దానికి తోడు దొంగలా సాయపడగా, కమ్యూనిస్టులమని చెప్పుకునే ఎన్నికల వామపక్ష పార్టీలు ఈ దేశద్రోహకర బిల్లును దృఢంగా వ్యతిరేకించకుండా, దీనికి వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాల్ని నిర్వహించకుండా తమ దళారీ స్వభావాన్ని మరోసారి తేటతెల్లం చేశాయి. ఒబామా రాకకు ముందుగానే ఈ బిల్లు ఆమోదం పొందేలా మన్మోహన్‌సింగ్ నడుం బిగించి మరీ పాటుపడ్డాడు.

ఇటీవలి కాలంలో అంతర్జాతీయ పెట్టుబడిదారీ రంగంలో ముందుకు దూసుకు వస్తున్న చైనాను చుట్టివేసే అమెరికన్ జియోపొలిటికల్ వ్యూహంలో భారత ప్రభుత్వం అమెరికాకు పావుగా పని చేస్తున్నది. ఈ ప్రాంతంలోని భారత్, పాక్ రెంటినీ అమెరికా తన చెప్పుచేతల్లో వుంచుకొంటూనే, మరోవైపు ఈ రెండింటి మధ్య వైరుధ్యాలు సమసిపోకుండా చూస్తున్నది.

రెండు దేశాలకూ ఆయుధాలు అమ్ముకుంటూ రెండు దేశాల మార్కెట్లను కొల్లగొడుతున్నది. మొత్తంగా ఈ ప్రాంతాన్నంతా తన అదుపాజ్ఞల్లో వుంచుకొని తన గ్లోబల్ ఆధిపత్య వ్యూహాన్ని అమలు చేస్తున్నది. అమెరికా అఫ్గాన్‌లో, పశ్చిమ పాకిస్తాన్‌లో ప్రతి రోజూ బాంబుల వర్షం కురిపిస్తున్నా భారత పాలకవర్గాలు ఏ మాత్రం వ్యతిరేకత తెలపకుండా సమర్థిస్తున్నాయి. అందుకు బదులుగా భారత ప్రభుత్వం దక్షిణాసియాలో అనుసరించే జోక్యందారీ విధానాలకూ, దోపిడీ విధానాలకూ అమెరికా పూర్తి అండదండలు అందిస్తున్నది. ఈ కుమ్మక్కు రాజకీయాల్లో భాగమే ఒబామా పర్యటనా, దానికి ఇక్కడి దళారీ పాలకులు, వివిధ ప్రతిపక్ష పార్టీలు పాడుతున్న స్వాగతగీతాలు.

పార్లమెంటరీ వామపక్షాలు ఒబామా పర్యటనను నిర్ద్వంద్వంగా వ్యతిరేకించకుండా పార్లమెంటులో ఈ యుద్ధోన్మాది ప్రసంగాన్ని శ్రద్ధగా వినడానికి పులకించిపోతున్నాయి. బుష్‌కూ, ఒబామాకూ తేడా వుందని వల్లిస్తూ ప్రజల్ని మోసగిస్తున్నాయి. వీళ్లిద్దరి మధ్య వున్నది ఒక గజదొంగకూ, ఒక బందిపోటుకూ మధ్య వుండే తేడాయేనన్న విషయాన్ని దాచిపెడుతున్నాయి. బీజేపీ తన కరడుగట్టిన దళారీ స్వభావానికి అనుగుణంగానే అది కాంగ్రెస్‌తో పాటుగానే ఒబామాకు స్వాగతం పలుకుతున్నది.

ప్రజలారా! ప్రజాసామ్యవాదులారా! ఒబామాకు స్వాగతం పలకడం అంటే సార్వభౌమత్వం, స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, స్వావలంబన, శాంతి, న్యాయం, ప్రజాస్వామ్యం వంటి విలువలకు ద్రోహం చెయ్యడమే. ఒబామాకు స్వాగతం పలకడం అంటే దాని యుద్ధోన్మాద, దురాక్రమణదారు, లూటీకోరు, ఆధిపత్యవాద ధోరణులకు లొంగుబాటు ప్రదర్శించడమే. అందుకే ఒబామా రాక సందర్భంగా వివిధ రూపాల్లో నిరసన తెలపాలనీ, 'ఒబామా! వెనక్కి పో' అని నినదించాలనీ భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) కేంద్ర కమిటీ ప్రజలకూ, విప్లవ, ప్రజాస్వామిక సంస్థలకూ, దేశభక్తియుత శక్తులందరికీ పిలుపునిస్తున్నది. ఈ సందర్భంగా కరపత్రాలు, పోస్టర్లు, బ్యానర్లతో, సభలు-సమావేశాలు నిర్వహించి ఒబామా రాకకు నిరసన తెలపాలనీ, అమెరికా సామ్రాజ్యవాదుల ముందు మోకరిల్లుతూ దేశ సార్వభౌమత్వాన్ని సైతం అపహాస్యం చేస్తున్న దళారీ యూపీఏ ప్రభుత్వాన్నీ, దానికి వంత పాడుతున్న ఇతర దళారీ పార్లమెంటరీ పార్టీల దగాకోరుతనాన్నీ తీవ్రంగా వ్యతిరేకించాలనీ మేం పిలుపునిస్తున్నాం.

**అభయ్**

**అధికార ప్రతినిధి**

**కేంద్ర కమిటీ**

**సీపీఐ (మావోయిస్టు)**

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# సెంట్రల్ రీజినల్ బ్యూరో

**25-11-2010**

## 'నక్సల్ ప్రభావిత' ప్రాంతాల్లో సైనిక రిక్రూట్‌మెంట్ క్యాంపెయిన్లను తక్షణం నిలిపివేయాలి!

'నక్సల్ ప్రభావిత' ప్రాంతాల్లో సైనిక రిక్రూట్‌మెంట్ క్యాంపెయిన్లను మా పార్టీ, భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) తీవ్రంగా ఖండిస్తోంది. యువతను నక్సల్స్ ప్రభావం నుంచి బయటపడేయటానికి సైనిక రిక్రూట్‌మెంట్ క్యాంపెయిన్లు ఎంతగానో ఉపయోగపడతాయని, వరంగల్, కరీంనగర్ జిల్లాల్లో జరుగుతున్న సైనిక రిక్రూట్‌మెంట్‌ను రాష్ట్రంలోని నక్సల్ ప్రభావిత ప్రాంతాలన్నింటికీ విస్తరించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి రోశయ్య పేర్కొనటాన్ని బట్టి నక్సల్ సమస్య పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరి ఏమిటో స్పష్టమవుతోంది.

ఇప్పటికే ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌లో సైనిక హెడ్‌క్వార్టర్స్, వాయుసేన హెడ్‌క్వార్టర్స్‌ను ఏర్పర్చారు. నక్సల్ ప్రభావిత రాష్ట్రాల్లో యూనిఫైడ్ కమాండ్లను ఏర్పరచి వీటికి సైనిక అధికారులే నేతృత్వం వహించాలని నిర్ణయించారు. ఈ ప్రాంతాలలో మోహరిస్తున్న పారామిలటరీ, స్పెషల్ బలగాలన్నింటికీ సైనిక అధికార్ల నేతృత్వంలోనే శిక్షణ నిచ్చి పంపుతున్నారు. మొత్తం నక్సల్ వ్యతిరేక ఆపరేషన్లన్నింటినీ సైనిక నిపుణులే సన్నిహితంగా గైడ్ చేస్తున్నారు. 'ముకరం' (తాడిమెట్ల) ఆంబుష్‌లో మా సాహసిక పిఎల్‌జిఏ దాడిలో 76మంది భద్రతా సిబ్బంది హతమైన నేపథ్యంలో సైన్యం మినహా మరే బలగాలూ నక్సల్ సమస్య పరిష్కారానికి సరిపోవనే అవగాహనతో కేంద్ర ప్రభుత్వం ప్రత్యక్షంగా సైన్యాన్ని మోహరించాలనే సన్నాహాలు తీవ్రతరం చేసింది. అందులో భాగమే రక్షణశాఖ చేపట్టిన ఈ సైనిక రిక్రూట్‌మెంట్ కాంపెయిన్లు.

నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో ప్రస్తుతం సైన్యాన్ని మోహరించటానికి బలగాల కొరతను ఎదుర్కొంటున్న కేంద్ర రక్షణశాఖ రానున్న రెండు, మూడు ఏళ్లలో సైనిక రిక్రూట్‌మెంట్‌ను వీలైనంత మేరకు పెంచుకొని ఈ కొరతను పూరించుకోవాలని చూస్తోంది. నక్సలైటు ఉద్యమాన్ని సమూలంగా నిర్మూలించాలంటే స్థానిక, భౌగోళిక పరిస్థితి, ప్రజల భాష, సంస్కృతి తెలిసిన స్థానిక యువతరం అవసరం చాలా వుందని, వీరి నుంచి రిక్రూట్‌మెంట్

పెంచుకోకుండా నక్సలైటు ఉద్యమాన్ని ఎదుర్కోలేమని భావించిన రక్షణశాఖ కుట్రపూరితంగానే ఈ రిక్రూట్‌మెంట్ క్యాంపెయిన్లు చేపడుతోంది. ఎల్ఐసి (తక్కువ తీవ్రత కలిగిన యుద్ధం) వ్యూహం-ఎత్తుగడల్లో భాగంగా ప్రజల మధ్య చిచ్చుబెట్టి, వారి మధ్య విభజన తీసుకొచ్చి, వారి ఐక్యతను దెబ్బతీయటం కోసం, విప్లవోద్యమ ప్రాంతాల్లో పుట్టి పెరిగిన యువతరాన్ని 'ఉద్యోగాల ఆశ' చూపి సైనిక రిక్రూట్‌మెంట్లు కొనసాగించాలని చూస్తోంది. తద్వారా సైన్యంతో నక్సల్ సమస్యను పరిష్కరించాలనేదే భారత పాలకవర్గాలు వాంఛిస్తున్నాయి.

2005లో ఛత్తీస్‌గఢ్‌లో ఇదే లక్ష్యంతో చేపట్టిన విప్లవ ప్రతీఘాతుక 'సల్వాజుడుం'లో భాగంగా వేలాది మంది ఎస్‌పిఓలను స్థానిక ఆదివాసీల నుంచి ఆ రాష్ట్ర ప్రభుత్వం రిక్రూట్ చేసుకొని ప్రజల మధ్య 'అంతర్యుద్ధాన్ని' రగిలించింది. కాని 'సల్వాజుడుం' ఏవిధంగా ఓటమి పాలైందీ నేడు దేశ ప్రజానీకానికి అందరికీ తెలుసు. సల్వాజుడుం పేరుతో సృష్టించిన తెల్ల బీభత్సాన్ని ఆదివాసీ ప్రజలు ముక్తకంఠంతో వ్యతిరేకించటమే కాక, అది సృష్టించిన ఎస్‌పిఓ వ్యవస్థపై పెద్దయెత్తున దాడులు చేసి దెబ్బతీశారు. ప్రజల మధ్య చిచ్చుబెట్టే 'ఎస్‌పిఓ నౌకరి' మాకు వద్దని యువతరం ముక్తకంఠంతో నినదించింది.

కాని దీని నుంచి ఏమాత్రం గుణపాఠం తీసుకోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 'జల్-జంగల్-జమీన్' (నీరు-అడవి-భూమి) కోసం, దేశ విముక్తి కోసం ఉద్యమిస్తున్న ప్రజల మౌలిక సమస్యలను పరిష్కరించకుండా, యువతకు ఉద్యోగాల ఆశ చూపి సైన్యంలో చేర్చుకోవాలనే దివాళాకోరు విధానాలను అనుసరిస్తున్నాయి. దీనిని ప్రజాస్వామికవాదులు, దేశభక్తయుత శక్తులు, ఆదివాసీ ప్రజా సంస్థలతో సహా దేశంలోని అన్ని సెక్షన్ల ప్రజలు వ్యతిరేకించాల్సిందిగా మా పార్టీ పిలుపు నిస్తోంది. ఆదివాసీలు ప్రబలంగా వున్న ప్రాంతాల్లో అపార వన, ఖనిజ సంపదలను కారుచౌకగా బహుళజాతి కంపెనీలకు, భారత దళారీ నిరంకుశ బూర్జువా వర్గానికి అప్పజెప్పేందుకు వందలాది ఎంఓయు (MoU)లను కుదుర్చుకున్న ప్రభుత్వాలు, సరిగ్గా అదే ఆదివాసీ ప్రాంతాల్లో బలంగా వున్న విప్లవోద్యమాన్ని నిర్మూలించటమే ఈ సైనిక రిక్రూట్‌మెంట్ల లక్ష్యం. తద్వారా స్థానికంగా రిక్రూటయిన యువకులను అడ్డం పెట్టుకొని ఈ ప్రాంతాల్లో యథేచ్ఛగా ప్రజలపై, విప్లవకారులపై దాడిచేసి, నక్సలైటు ఉద్యమాన్ని రూపుమాపటం, అడవుల నుంచి ఆదివాసీలను పారదోలటం, అక్కడ నిరాఘాటంగా తమ దోపిడిని సాగించుకోవటం వారి అంతిమ లక్ష్యం. ఆదివాసీలను, పీడిత ప్రజలను అణచివేసి నిర్మూలించడానికి ఆ సెక్షన్ల నుండే సైన్యాన్ని తయారు చేయడాన్ని వ్యతిరేకించాలి.

కాబట్టి, ఆదివాసీలను, పీడిత ప్రజలను అణచివేసి నిర్మూలించడానికి ఆ సెక్షన్ల నుండే

సైన్యాన్ని తయారు చేయడాన్ని ప్రజలంతా వ్యతిరేకించాల్సిందిగా మా పార్టీ కోరుతోంది. ఈ సైనిక రిక్రూట్‌మెంట్ క్యాంపెయిన్లను బహిష్కరించాల్సిందిగా యువతరానికి మా పార్టీ పిలుపు నిస్తోంది. ఇప్పటికే సెలక్టు అయిన పక్షంలో తమ ప్రజల ప్రయోజనాలను, తమ వర్గ ప్రయోజనాలను శిరోధార్యంగా భావించి ఆ సెలక్షన్‌ను రద్దు చేసుకోవాల్సిందిగా కోరుతోంది. దేశభక్తిని, 'ఆంతరంగిక భద్రతకు పెనుముప్పు' అనే పేరుతో నక్సలైట్ల పట్ల తీవ్ర వ్యతిరేకతను యువతరంలోకి ఎక్కించి వారిని బలిపశువులుగా చేసి భారత దోపిడి పాలకవర్గాలు తమ ప్రయోజనాలను ఈడేర్చుకోవాలని చూస్తున్నాయి. సైన్యం వస్తే ఏమవుతుందో నేడు కాశ్మీరు, ఈశాన్య భారత రాష్ట్రాల ప్రజల నడిగితే చెబుతారు. సైన్యం వస్తే జరిగేది ఏమంటే - ప్రజలను చంపటం, చిత్రహింసలకు గురిచేయటం, శిబిరాల్లో బంధించటం, మహిళలపై అంతులేని అత్యాచారాలకు పాల్పడటం, వేలాది మందిని అరెస్టు చేసి జైళ్లలో బంధించటం తప్ప ప్రజలను రక్షించటం అనేది ఎక్కడా జరగలేదనేది చరిత్ర చెబుతున్న సత్యం. కాబట్టి, తమ తల్లిదండ్రుల, అన్నదమ్ముల, అక్క-చెల్లెళ్ల మాన, ప్రాణ, ఆస్తి నష్టానికి, అంతిమంగా ప్రజల వినాశనానికి దారితీసే సైన్యంలో చేరి, తమ వారికి తాము శత్రువులుగా మారవద్దని విజ్ఞప్తి చేస్తోంది.

నిరుద్యోగ సమస్య పరిష్కారానికి, నిరుద్యోగ యువతరం, నిరుద్యోగ సంఘాలు, విద్యార్థులు, విద్యార్థి-యువజన సంఘాలు పెద్దయెత్తున సంయుక్త కార్యాచరణకు దిగాల్సిందిగా మా పార్టీ పిలుపు నిస్తోంది. 'పోలీసులు, హోంగార్డులు, సైనికుల ఉద్యోగాలు కాక' 'మరే ఉ ద్యోగమైనా ఇవ్వండి', 'అర్హులైన వారందరికీ పని కల్పించాలి', 'నరేగా (మహాత్మాగాంధి గ్రామీణ రోజ్‌గార్ యోజన) పథకంలోని అవినీతిని అరికట్టాలి', 'దానికి అధికంగా నిధులు కేటాయించి యువతకు ఉపాధి కల్పించాలి' అనే నినాదాలతో పోరాడాల్సిందిగా యువతను మా పార్టీ కోరుతోంది. నిరుద్యోగం, ఆకలి, అనారోగ్యం, అవిద్య, దారిద్ర్యం, అవినీతి, నిర్వాసిత సమస్యలకు వ్యతిరేకంగా పోరాడాలి. భూమి, అడవి, నీరుపై హక్కులు, నిర్వాసిత సమస్య వంటి అనేక మౌలిక సమస్యల పరిష్కారం ఈ దేశ విముక్తితో ముడిపడి వుందనే విషయాన్ని యువతరం గుర్తించి, ప్రజల కోసం తమ ప్రాణాలు సైతం ధారబోస్తున్న ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం (పిఎల్‌జిఏ)లో వేలాదిగా చేరాల్సిందిగా కోరుతోంది.

ప్రతాప్,

అధికార ప్రతినిధి,

**సెంట్రల్ రీజనల్ బ్యూరో**

**సీపీఐ (మావోయిస్టు)**

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# కేంద్ర కమిటీ

**27-11-2010**

## విప్లవోద్యమ అణచివేత లక్ష్యంగా నక్సల్ ప్రాంతాల 'అభివృద్ధి' పేరుతో ముందుకు తెచ్చిన యూనిఫైడ్ యాక్షన్ ప్లాన్ ప్రజల మౌలిక సమస్యలేవీ పరిష్కరించదు!
## వేల కోట్ల రూపాయల కుంభకోణాలకు పాల్పడుతూ దేశ ప్రజల కష్టార్జితాన్ని కొల్లగొడుతున్న దేశద్రోహులకు తగిన బుద్ధి చెప్పండి!!

నక్సల్ ప్రభావిత జిల్లాల్లో 'అభివృద్ధి' కోసమని చెప్పి కేంద్ర ప్లానింగ్ కమిషన్ రూపొందించిన 13,742 కోట్ల రూపాయల 'యూనిఫైడ్ యాక్షన్ ప్లాన్'కు కేంద్ర ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ నిన్న, నవంబర్ 26న ఆమోదం తెలిపింది. రెండేళ్ల పాటు కొనసాగే దీని మొదటి దశలో తొమ్మిది నక్సల్ ప్రభావిత రాష్ట్రాలలోని 60 జిల్లాలకు 2010-11 సంవత్సరంలో జిల్లాకు 25 కోట్ల చొప్పున, 2011-12లో జిల్లాకు 30 కోట్ల చొప్పున డబ్బు మంజూరు చేసి మొత్తం 3,300 కోట్ల ఆర్థిక ప్యాకేజ్‌ను కేంద్ర హోంమంత్రి చిదంబరం ప్రకటించాడు. రెండేళ్ల తర్వాత దీన్ని సమీక్షించాలని క్యాబినెట్ కమిటీ నిర్ణయించినట్లుగా చెప్పాడు. 50 శాతానికి పైగా ప్రజలు దారిద్ర్యరేఖకు దిగువన నివసిస్తున్న ఈ పేద, ఆదివాసీ బాహుళ్యం గల జిల్లాల్లో మౌలిక సదుపాయాల కల్పన ద్వారా అభివృద్ధి సాధించడం, తద్వారా నక్సలైటు సమస్యను పరిష్కరించడం తమ లక్ష్యంగా పాలకులు చెప్పుకుంటున్నారు. వీళ్లు చెబుతున్న మౌలిక 'సదుపాయాల్లో' మొదటిది రోడ్లు, ఆ తర్వాత పంచాయితీ భవనాలు, విద్యుత్తు, స్కూలు భవనాలు, విద్య, వైద్యం వున్నాయి. ఒకవైపు 'ఆపరేషన్ గ్రీన్‌హంట్' పేరుతో గత సంవత్సర కాలంగా ఈ ప్రాంతాల్లో రెండు లక్షలకు పైగా వివిధ పారామిలిటరీ బలగాల్ని మోహరించి వందలాది ఆదివాసుల్ని ఊచకోత కోస్తున్న పాలకులు ఇప్పుడు అవే ప్రాంతాల్లో కోట్ల కొద్దీ డబ్బు కుమ్మరిస్తామనడం ప్రజల ప్రయోజనాల కోసమా? ప్రజలపై సాగిస్తున్న అణచివేత చర్యలను మరింత ముమ్మరం చేయడం కోసమా? దీన్ని అర్థం చేసుకోవడం పెద్ద కష్టమేమీ కాదు. ఈ ప్రకటన చేస్తూ చిదంబరం వచ్చే మార్చి నెల లోగానే కేటాయించిన డబ్బంతా ఖర్చు చేసి వెంటనే 'అభివృద్ధి'ని చూపిస్తామని నొక్కి చెప్పాడు. ఈ పథకాన్ని అమలు చేయడంలో పోలీసు

శాఖను కూడా భాగం చేస్తూ జిల్లా ఎస్‌పీలను కూడా కమిటీల్లో వుంచాలని నిర్ణయం చెయ్యడం తాము ఇప్పటికే అమలు చేస్తున్న ఫాసిస్టు నిర్బంధ విధానాలకు 'అభివృద్ధి' ముసుగు వేసే ప్రయత్నమే. రోడ్లు, భవనాలు నిర్మించేది 'దారిద్ర్యరేఖకు దిగువన నివసిస్తున్న పేద ప్రజల' కోసమా? లేదా వాళ్ల జీవించే హక్కును కాలరాచివేస్తూ విచ్చలవిడి హత్యాకాండలకు పాల్పడుతున్న ప్రభుత్వ సాయుధ బలగాల సౌకర్యం కోసమా అనేది ఈ ప్రాంతాల్లో ఏ ఆదివాసీనడిగినా చెప్పగలడు. ఇప్పటికి వున్న విద్యాలయాలనే తమ అడ్డాలుగా మార్చుకున్న సాయుధ బలగాలు ఇక్కడ విద్యావ్యాప్తికి అతి పెద్ద అడ్డంకిగా మారిన వాస్తవాన్ని దాచిపెట్టి కోట్ల రూపాయలతో విద్యా సౌకర్యాల్ని కల్పిస్తామని చెప్పడం దగానే. వాంతులు, విరోచనాల లాంటి చిన్న చిన్న వ్యాధులతో ప్రతి ఏటా వందల, వేల సంఖ్యలో అకాల మరణాల పాలవుతున్న ఆదివాసులను ఏనాడూ పట్టించుకోని పాలకులు ఇప్పుడు ఈ ప్యాకేజీతో ప్రజలకు వైద్య సదుపాయాలు కల్పిస్తామని ఎంత చెప్పినా ఎవరూ నమ్మరు.

వాస్తవానికి, ముఖ్యంగా గత రెండు నెలలుగా కుంభకోణాల గురించి చర్చ జరగని రోజే లేదు. వేల కోట్ల రూపాయల ప్రజాధనం అవినీతిపరులైన రాజకీయ నేతల, మంత్రుల, పెద్ద పెద్ద అధికారుల, కార్పొరేట్ ప్రభువుల, పేరున్న మీడియా బ్యారన్స్ బొక్కసాల్లోకి ఎలా చేరిపోతున్నదో, దేశ ప్రజలు కళ్లారా చూస్తున్నారు. మావోయిస్టు వుద్యమం దేశ ఆంతరంగిక భద్రతకు అతిపెద్ద ముప్పు అని పదే పదే గొంతు చించుకునే పాలకులు, వాళ్లకు బాకాలూదే కుహనా మేధావులు స్వయంగా ఎంత పెద్ద గజదొంగలో అర్థం చేసుకోవడానికి మరీ చరిత్ర పుటల్లోకి పోవల్సిన అవసరం లేకుండా కామన్‌వెల్త్ గేమ్స్ కుంభకోణం (దాదాపు లక్ష కోట్ల రూపాయలు), 2జీ స్పెక్ట్రమ్ కుంభకోణం (1 లక్ష 76 కోట్లు), ఆదర్శ్ హౌజింగ్ సొసైటీ అవకతవకలు, కర్నాటక భూముల కుంభకోణం వంటి కొన్ని తాజా వుదాహరణలు సరిపోతాయి. కాంగ్రెస్, బీజేపీ, డీఎంకే, జనతాదళ్ వగైరా దోపిడీ వర్గ పార్టీలన్నీ కూడా మినహాయింపు లేకుండా ఈ నిలువుదోపిడీలో భాగమయ్యాయి. ఈ కుంభకోణాలన్నీ ఈ కుళ్లిన వ్యవస్థను మరింత నగ్నంగా ప్రజల ముందు ఆవిష్కరిస్తున్నాయి. వ్యవస్థీకృతమైన అవినీతితో నిండిన ఈ దోపిడీ వ్యవస్థను కూలదోయడం తప్ప మరో మార్గం లేదనే మావోయిస్టు అవగాహనకు దేశ ప్రజల ఆమోదం రోజురోజుకూ మరింతగా లభిస్తున్నది. వాస్తవానికి ఇదే దోపిడీ పాలకవర్గాలకు అతి పెద్ద ప్రమాదంగా మారింది.

ఈ తాజా అవినీతి బాగోతం ఇంత కళ్లకు గట్టినట్టు కనిపిస్తుంటే ఈ ఆర్థిక ప్యాకేజ్‌లో విడుదలయ్యే కోట్ల డబ్బు ఎవరి జేబుల్లోకి ఎంత పోతుందో వూహించడం కష్టం కాదు. వాస్తవానికి ఈనాటి పరిస్థితిలో ఆర్థిక ప్యాకేజీలతో ప్రజల అభివృద్ధి జరుగుతుందని చెబితే ప్రజలు నవ్విపోతారనే భయమైనా లేకుండా పాలకులు దీన్ని ప్రకటించడం గమనార్హం. ఈ యూనిఫైడ్ యాక్షన్ ప్లాన్‌కు రూపకల్పన చేసిన ప్లానింగ్ కమిషన్ వుపాధ్యక్షుడు మాంటెక్‌సింగ్

అహ్లువాలియా గానీ, దీనికి ఆమోదం తెలిపిన చిదంబరం గానీ సామ్రాజ్యవాద ద్రవ్య సంస్థల్లో, సామ్రాజ్యవాద కార్పొరేట్ సంస్థల సేవలో ఎంతో విశ్వాసపాత్రులనీ, ఈ పాలకముఠాకు నాయకత్వం వహిస్తున్న ప్రధాని మన్మోహన్ సింగ్ తన జీవిత కాలంలో చాలా భాగం సామ్రాజ్యవాద ద్రవ్య సంస్థల సేవలోనే గడిపిన వాడనీ గుర్తు తెచ్చుకుంటే వీళ్లు రూపొందించే పథకాలు ఎవరి ప్రయోజనాల కోసమో స్పష్టంగానే అర్థం చేసుకోవచ్చు. దేశంలోని ఆదివాసీ ప్రాంతాల్లో విచ్చలవిడి వనరుల దోపిడీకి వీలు కల్పిస్తూ కార్పొరేట్ సంస్థలతో పదుల వేల కోట్ల రూపాయల ఎంవోయూలపై సంతకాలు చేస్తూ ఆదివాసీ ప్రజల అస్తిత్వానికే ముప్పు తెచ్చే కుట్రలకు పాల్పడుతూ, వాటిని ప్రజల ముందు బహిర్గతపర్చాలనీ, రద్దు చేయాలనీ దేశవ్యాప్తంగా ప్రజల నుండీ, ప్రజాస్వామిక వాదుల నుండీ వస్తున్న డిమాండ్‌నూ పెడచెవిన పెడుతూ మరోవైపు 'అభివృద్ధి' అని మాట్లాడడం హాస్యాస్పదం.

మా పార్టీ సీపీఐ (మావోయిస్టు) కేంద్రకమిటీ ఈ ప్రజా వ్యతిరేక 'యూనిఫైడ్ యాక్షన్ ప్లాన్'ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నది. ఇది కేంద్ర-రాష్ట్రాల ప్రభుత్వాలు ఆపరేషన్ గ్రీన్‌హంట్ పేరుతో అమలు చేస్తున్న ఫాసిస్టు అణచివేత క్యాంపెయిన్‌లో భాగమేనని, అందుకు మరింత తోడ్పడేదేనని మా కేంద్రకమిటీ భావిస్తున్నది. దీనితో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి జరుగుతుందని చెప్పేదంతా పచ్చి బూటకం, మోసం. ఆదివాసుల, నిరుపేద ప్రజల అభివృద్ధి పట్ల ఏ మాత్రం చిత్తశుద్ధి వున్నా ప్రభుత్వాలు చేయాల్సింది ఈ విశాల అటవీ ప్రాంతాల్లో జల్-జంగల్-జమీన్‌పై ఆదివాసులకు, పీడిత ప్రజలకు అధికారం కల్పించడం; ఎంఎన్‌సీలతోనూ, బడా పెట్టుబడిదారీ కంపెనీలతోనూ చేసుకున్న ఎంవోయూలను రద్దు చేయడం; భారీ డ్యాంలు, గనులు, అభయారణ్యాలు, భారీ స్టీల్ ప్లాంట్‌లు, సెజ్‌ల మూలంగా లక్షలాది మందిని నిర్వాసితుల్ని చేసే పథకాలన్నీ వెంటనే నిలుపు చెయ్యడం; ఆదివాసుల నరమేధాలకు పాల్పడుతున్న ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను వెంటనే ఆపెయ్యడం.

కామన్‌వెల్త్ గేమ్స్ కుంభకోణం, 2జి స్పెక్ట్రమ్ కుంభకోణం, ఆదర్శ్ హౌజింగ్ కుంభకోణం, కర్నాటక భూముల కుంభకోణంలో భాగస్తులైన రాజకీయ నాయకుల్ని, మంత్రుల్ని, కార్పొరేట్ సంస్థల యాజమానులనూ; మాలెగాం, అజ్‌మేర్ షరీఫ్, మక్కామసీద్ తదితర బాంబుపేలుళ్ల సంఘటనలకు బాధ్యులైన కాషాయ టెర్రరిస్టు నాయకులనూ వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఈ సందర్భంగా మా కేంద్ర కమిటీ డిమాండ్ చేస్తున్నది.

**అభయ్**

**అధికార ప్రతినిధి**

**కేంద్ర కమిటీ**

**సీపీఐ (మావోయిస్టు)**

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# కేంద్ర కమిటీ

**4-12-2010**

## డిసెంబర్ 6న హిందూ మతతత్వానికి వ్యతిరేకంగా నిరసన దినం పాటించండి!
## బాబ్రీ మసీదును అదే స్థలంలో పునర్నిర్మించాలి!
## హిందూ ఫాసిస్టు శక్తులను ఒంటరి చేసి ఓడించాలి!!
## మాలెగాం, మక్కా మసీదు, అజ్మీర్ షరీఫ్, సమ్‌ఝౌతా ఎక్స్‌ప్రెస్ తదితర బాంబు పేలుళ్లకు బాధ్యులైన కాషాయ టెర్రరిస్టుల్ని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలి!

18 ఏళ్ల క్రితం 1992 డిసెంబర్ 6న సంఘ్ ముఠాకు చెందిన హిందూ మతతత్వ ఫాసిస్టు గుండాలు కేంద్రంలోని ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వ ప్రత్యక్ష/పరోక్ష మద్దతుతో అయోధ్యలోని బాబ్రీ మసీదును నేలమట్టం చేశారు. దాదాపు 500 ఏళ్లుగా ముస్లింల ప్రార్థనా స్థలంగా వునికిలో వున్న బాబ్రీ మసీదు మొదట రాముడి జన్మ స్థలమనే వివాదాన్ని సృష్టించి, హిందూ మతతత్వ ఫాసిస్టులు ఆ పేరుతో పలు దఫాలు దేశంలో మత ఘర్షణలు రెచ్చగొట్టి వేలాది ముస్లింల ప్రాణాలు తీశారు. మన దేశ చరిత్రలో మతతత్వ ఫాసిస్టులు పాల్పడ్డ అతి పెద్ద ఘాతుకం బాబ్రీ విధ్వంసం. ఇందులో ప్రత్యక్షంగా పాల్గొన్న ఎల్‌కే అద్వానీ, అశోక్ సింఘల్, మురళిమనోహర్ జోషి, ప్రవీణ్ తొగడియా, ఉమాభారతి, సాధ్వి ఋతుంబరలకు ఈ దేశ న్యాయస్థానాలు ఈనాటి వరకూ ఏ శిక్షా వెయ్యలేదు. వివాదిత స్థలం యాజమాన్యం విషయమై 61 ఏళ్లుగా పెండింగ్‌లో వున్న కేసుపై సెప్టెంబర్ 30న తీర్పు వెలువరిస్తూ అలహాబాద్ హైకోర్టు లక్నో బెంచ్ తన బ్రాహ్మణవాద హిందూమత భావజాలానికి అనుగుణంగానే ముస్లింలకు అన్యాయం చేసింది. ఎలాంటి చారిత్రక ఆధారాలూ, పురాతత్వ సాక్ష్యాలూ లేకుండానే ఆ స్థలాన్ని రాముడి జన్మస్థలంగా అది వ్యాఖ్యానించింది. బాబ్రీ మసీదును ఆక్రమించి, దాన్ని కూలగొట్టి ఇప్పుడు మసీదు వుండిన స్థలంలో చట్టబద్ధంగా మందిరం నిర్మించుకునే తీర్పునిస్తూ ఆ స్థలాన్ని మసీదును కూలగొట్టిన శక్తులకు అప్పజెప్పడం ద్వారా భారత రాజ్యవ్యవస్థ హిందూ ఫాసిస్టు స్వభావం తేటతెల్లమవుతున్నది. ఈ తీర్పుతో ఈ దేశ న్యాయస్థానాలు దోపిడీ వర్గ,

బ్రాహ్మణవాద హిందూమత అనుకూలమైనవే తప్ప రైతుకూలీలకూ, కార్మికులకూ, దళితులకూ, మహిళలకూ, మతపరమైన మైనారిటీలకూ న్యాయం చేయవనే విషయం మరోసారి రుజువైంది. కోర్టు తీర్పులతో ఇది పరిష్కారమయ్యేది కాదని, ప్రస్తుత వ్యవస్థను సమూలంగా మార్చివేసి నూతన ప్రజాస్వామిక రాజ్యవ్యవస్థను నెలకొల్పడం ద్వారానే ఇది పరిష్కారమవుతుందని మరోసారి స్పష్టమైంది.

ఇటీవలి కాలంలో మాలెగాం, అజ్‌మేర్ షరీఫ్, హైదరాబాద్ మక్కామసీదు, సమ్‌ఝౌతా ఎక్స్‌ప్రెస్ తదితర బాంబు పేలుళ్ల కేసులలో సంఘ్ ముఠాకు చెందిన కాషాయ టెర్రరిస్టు గ్రూపుల హస్తం వున్నట్టు ఎన్నో సాక్ష్యాధారాలు బైటపడ్డాయి. 'అభినవ్ భారత్' తదితర మారుపేర్లతో విహెచ్‌పీ, ఆర్‌ఎస్‌ఎస్, బజరంగ్‌దళ్ తదితర సంస్థల నాయకులే ఎన్నో కుట్రలకూ, కుతంత్రాలకూ పాల్పడి, బాంబు పేలుళ్లు జరిపి ఎంతో మంది అమాయకుల ప్రాణాలు తీశారు. ఎక్కడ ఏ బాంబు పేలుడు జరిగినా, ఆఖరుకు మసీదుల్లో పేలుళ్లు జరిగినా వెంటనే ముస్లింలనే దోషులుగా నిలబెట్టడం మన దేశ పోలీసు, ఇంటలిజెన్స్ సంస్థలకు మామూలై పోయింది. వందలాది ముస్లిం యువకుల్ని అకారణంగా అరెస్టు చేసి తీవ్ర చిత్రహింసలకు గురి చెయ్యడం, బూటకపు ఎన్‌కౌంటర్లలో హత్య చెయ్యడం, బూటకపు కేసుల్లో ఇరికించి, ఐఎస్‌ఐతో సంబంధాలున్నాయనే ఆరోపణలు చేసి వాళ్ల జీవితాలతోనే చెలగాటమాడడం ప్రభుత్వాల మతతత్వ ఫాసిస్టు విధానాల్లో భాగమే. ముస్లింలంటేనే టెర్రరిస్టులనే విధంగా మీడియా ద్వారా ప్రచారం చేస్తూ వాళ్లను అన్ని విధాలుగా అణచివేస్తున్నారు. ముంబాయి దాడుల్లో పాల్గొన్న అజ్మల్ కసాబ్‌ను ఉరి తీయాలని డిమాండ్ చేసే వాళ్లు, అదే సమయంలో సంఘ్ ముఠా హిందూ మతతత్వ హంతకుల గురించి మాత్రం మౌనం వహించడం లేదా గట్టిగా గొంతెత్తకపోవడం ప్రమాదకరమైన సంకేతం. ప్రభుత్వాలు ఈ కాషాయ టెర్రరిస్టుల్ని అరెస్టు చెయ్యకుండా, కొన్ని సందర్భాల్లో అరెస్టు చేసినా పైపై విచారణలు జరిపించి తిరిగి విడుదల చేస్తూ నిర్దోషులుగా తీర్పులిస్తున్నాయి. మరోవైపు ఈ హిందూ మతతత్వ శక్తులకు వ్యతిరేకంగా గొంతు విప్పిన మేధావుల పైనా, జర్నలిస్టుల పైనా, మీడియా సంస్థలపైనా, పత్రికలపైనా, కళాకారుల పైనా సంఘ్ ముఠా అనేక చోట్ల దాడులకు పాల్పడుతున్నది. మొత్తంగా చూసినపుడు భారత రాజ్యవ్యవస్థలో రోజురోజుకూ మతతత్వ ఫాసిస్టు పోకడలు తీవ్రరూపం దాలుస్తున్నాయి.

హిందూ మతతత్వ ఫాసిజానికి వ్యతిరేకంగా అన్ని మతాలకు చెందిన లౌకిక శక్తులు, ప్రజాస్వామికవాదులు, అభ్యుదయ భావాలు గల వాళ్లు అంతా సంఘటితంగా పోరాడాలి. హిందూ ఫాసిస్టు శక్తులు ముస్లింలపై, క్రైస్తవులపై, తదితర మతపర మైనారిటీలందరిపై చేస్తున్న దాడుల్ని తీవ్రంగా వ్యతిరేకించాలి. అదే సమయంలో అన్ని రకాల మత ఛాందసవాదాల్ని

వ్యతిరేకించాలి.

బాబ్రీ మసీదు వుండిన స్థలం ముస్లింలదేననీ, అది ముస్లింలకే చెందాలనీ, బాబ్రీ మసీదును తిరిగి అదే స్థలంలో నిర్మించాలనీ, దాన్ని కూల్చిన సంఘ్ ముఠా ఫాసిస్టు నేతలను కఠినంగా శిక్షించాలనీ మా పార్టీ మొదటి నుండీ డిమాండ్ చేస్తూ వస్తున్నది. ఈ డిమాండ్‌ను బలపర్చాలనీ ప్రజాస్వామిక, లౌకిక, ప్రగతిశీల, విప్లవకర శక్తులనూ, సంస్థలనూ, పార్టీలనూ అందరినీ మా కేంద్ర కమిటీ కోరుతున్నది. డిసెంబర్ 6న హిందూ మతోన్మాదానికి వ్యతిరేకంగా నిరసన దినం (బ్లాక్ డే) జరపాలనీ, ఈ సందర్భంగా సభలు, సమావేశాలు, వూరేగింపులు నిర్వహించాలనీ, నల్ల బాడ్జీలను ధరించాలనీ మా కేంద్ర కమిటీ ప్రజలందరికీ విజ్ఞప్తి చేస్తున్నది.

**అభయ్**

**అధికార ప్రతినిధి, కేంద్ర కమిటీ**

**సీపీఐ (మావోయిస్టు)**

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# కేంద్ర కమిటీ

**24-12-2010**

## ప్రజాసేవ కుట్ర కాదు! ప్రజాపక్షం వహించడం దేశద్రోహం కానే కాదు!!
## కుంభకోణాల్లో లక్షల కోట్ల ప్రజాధనాన్ని స్వాహా చేస్తున్న స్కామ్‌స్టర్లే దేశద్రోహులు!
## దేశ సంపదల్ని సామ్రాజ్యవాదులకు కట్టబెడుతున్న గ్యాంగ్‌స్టర్లే కుట్రదారులు!!

### పౌరహక్కుల కార్యకర్త డాక్టర్ బినాయక్ సేన్, మావోయిస్టు నేత కామ్రేడ్ నారాయణ సన్యాల్, వ్యాపారి పియూష్ గుహలకు దేశద్రోహ నేరం కింద జీవితఖైదు; పత్రికా సంపాదకుడు అసిత్ సేన్‌గుప్తాకు ఎనిమిదేళ్ల ఖైదు విధించిన ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వ ఫాసిస్టు కోర్టు తీర్పులకు వ్యతిరేకంగా 2011 జనవరి 2-8 వరకు నిరసన వారం పాటించండి!

డిసెంబర్ 24వ తేదీన రాయ్‌పూర్ జిల్లా అదనపు సెషన్స్ కోర్టు పౌరహక్కుల కార్యకర్త డాక్టర్ బినాయక్ సేన్, మా పార్టీ పోలిట్‌బ్యూరో సభ్యుడు కామ్రేడ్ నారాయణ్ సన్యాల్, వ్యాపారి పియూష్ గుహలను తప్పుడు కేసుల్లో ఇరికించి ఐ.పి.సి., ఛత్తీస్‌గఢ్ ప్రత్యేక ప్రజా రక్షణ చట్టం, యూఏపీఏల కింద యావజ్జీవ శిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది. ఐ.పి.సి. సెక్షన్ 124 (దేశద్రోహం), 120 బి (కుట్ర) కింద యావజ్జీవ శిక్షలు, చత్తీస్‌గఢ్ ప్రత్యేక ప్రజా రక్షణ చట్టం, చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టాల్లోని పలు సెక్షన్ల కింద వివిధ శిక్షలు విధిస్తూ బి.పి. వర్మ ఇచ్చిన తీర్పు ఈ దేశ పాలకవర్గాల ప్రజా వ్యతిరేక, ఫాసిస్టు విధానాలకు తాజా వుదాహరణగా నిలుస్తుంది.

మా పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కామ్రేడ్ నారాయణ సన్యాల్‌తో పాటుగా గత 30 ఏళ్లుగా నిస్వార్థంగా పేద ప్రజల సేవకు అంకితమైన డాక్టర్‌గా, మానవహక్కుల కార్యకర్తగా ప్రఖ్యాతి

గాంచిన పి.యు.సి.ఎల్. వుపాధ్యక్షుడు బినాయక్‌సేన్‌కు, కలకత్తాకు చెందిన వ్యాపారి పియూష్ గుహకు యావజ్జీవ శిక్ష విధించడం తమది ప్రపంచంలో అతి పెద్ద ప్రజాస్వామ్యమని చెప్పుకునే పాలకులకు సిగ్గుచేటు. ప్రభుత్వ నిర్బంధ విధానాలను, ఫాసిస్టు సల్వాజుడుంను వ్యతిరేకిస్తూ, నల్లచట్టమైన సి.ఎస్.పి.ఎస్.ఏ.ను రద్దు చేయాలని గొంతెత్తుతూ, న్యాయమైన ప్రజా వుద్యమాలకు అండగా నిలబడ్డందుకే డాక్టర్ బినాయక్ సేన్‌కు ఈ శిక్ష విధించారన్నది తేటతెల్లం. మే 2007లో ఆయనను అరెస్టు చేసి రెండేళ్ల పాటు జైలులో బంధించినపుడు దేశీయంగా, అంతర్జాతీయంగా ప్రజాస్వామిక సెక్షన్ల నుండీ, వైద్య సముదాయం నుండీ, నోబెల్ గ్రహీతల నుండీ పెద్ద ఎత్తున వచ్చిన నిరసనను సైతం లెక్క చేయకుండా ఇప్పుడు ఈ శిక్ష విధించడాన్ని దేశ ప్రజాస్వామిక, ప్రగతిశీల, దేశభక్తికర సెక్షన్లందరికీ ఫాసిస్టు పాలక ముఠా నిర్లజ్జగా, బరితెగింపుగా చేస్తున్న హెచ్చరికగానే చూడాలి. చట్టబద్ధంగా, ప్రజాస్వామ్యయుతంగా ప్రజా సమస్యల పట్ల స్పందిస్తూ, నిజాయితీగా ప్రజాసేవ చేయడం, ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాల్ని విమర్శించడమే దేశద్రోహమైతే ఈ దేశంలో అమలవుతున్నది ఏ రకమైన 'ప్రజాస్వామ్యమో', అది దేశ ప్రజలకు ఎంత ప్రమాదకరమో అర్థం చేసుకోవచ్చు. ప్రపంచవ్యాప్తంగా పలు భాషలలో ప్రచురితమయ్యే ఒక విప్లవ పత్రిక – 'ఏ వరల్డ్ టు విన్'ను హిందీలో వెలువరిస్తూ, అక్రమంగా అరెస్టయ్యి, గత మూడేళ్లుగా జైలులో మగ్గుతున్న అసిత్ సేన్‌గుప్తాకు కూడా ఇదే రోజున మరో అదనపు జిల్లా సెషన్స్ జడ్జి ఒ.పి. గుప్తా మావోయిస్టు కార్యకలాపాల్లో పాలుపంచుకున్నాడనే తప్పుడు ఆరోపణతో ఎనిమిదేళ్ల శిక్ష విధించడం పాలకులు వల్లించే పత్రికా స్వేచ్ఛకు గొడ్డలిపెట్టు. ఇటీవలే ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి రమన్‌సింగ్, డి.జి.పి. విశ్వరంజన్, బస్తర్ ఐ.జి. లాంగ్‌కుమేర్, దంతెవాడ ఎస్.పి. కల్లూరిల ముఠా 'మా దంతేశ్వరీ ఆదివాసీ స్వాభిమానీ మంచ్' అనే పేరుతో కరపత్రాలు ప్రచురించి ప్రజాస్వామికవాదులైన హిమాంశుకుమార్, అరుంధతి రాయ్‌లతో పాటు పత్రికా విలేకరులైన ఎన్.ఆర్.కె. పిళ్లై, అనిల్ శర్మ, యశ్వంత్ రావ్‌లను హత్య చేస్తామంటూ బాహాటంగా ప్రకటించడం వీళ్ల పచ్చి ఫాసిస్టు విధానాల కొనసాగింపులో భాగమే.

73 సంవత్సరాల వయోవృద్ధుడు, మా పార్టీ నాయకుడు కామ్రేడ్ నారాయణ్ సన్యాల్‌ను గత ఐదేళ్లుగా ఫాసిస్టు ఛత్తీస్‌గఢ్ రమన్‌సింగ్ ప్రభుత్వం చీకటికొట్టాల్లో బంధించి అనేక తప్పుడు కేసుల్లో ఇరికించింది. 1968లో విప్లవపయనం ప్రారంభించి గత నాలుగు దశాబ్దాలకు పైగా పీడిత ప్రజల విముక్తి కోసం తన జీవితాన్ని అర్పించిన సీనియర్ కమ్యూనిస్టు నాయకుడాయన. ఆయన అనేక అనారోగ్య సమస్యలతో జైలు గోడల మధ్య చిత్రహింసలనుభవిస్తున్నాడు. సోనియా–మన్మోహన్‌సింగ్–చిదంబరం–రమన్‌సింగ్ టెర్రరిస్టు పాలక ముఠా విప్లవోద్యమ నేతలను కుట్రపూరితంగా పట్టుకొని ఒకవైపు బూటకపు ఎన్‌కౌంటర్లలో హతమారుస్తూ, మరో వైపు బూటకపు కేసుల్లో ఇరికించి నల్లచట్టాల కింద కఠిన శిక్షలు విధిస్తున్నది. జైళ్లల్లో అమానవీయ

పరిస్థితుల మధ్య వాళ్లను అనేక శారీరక, మానసిక చిత్రహింసలకు గురి చేస్తున్నది.

ఛత్తీస్‌గఢ్ ఎమ్మెల్యేలకు మావోయిస్టు ప్రచార సీడీలు పంపారన్న కేసులో గత జూలై 29వ తేదీన మా పార్టీ కార్యకర్త కామ్రేడ్ మాలతి ఎలియాస్ శాంతిప్రియకూ, సురేంద్ర కోసరియా అనే కార్మికుడికీ ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం దొంగ సాక్ష్యాలతో పదేళ్ల శిక్ష విధించింది. ఝార్ఖండ్ రాష్ట్రంలోని రాంచీ జైలులో వున్న మా పార్టీ మరో పోలిట్‌బ్యూరో సభ్యుడైన కామ్రేడ్ అమితాబ్ బాగ్చీ, బెంగాల్ రాష్ట్రకమిటీ సభ్యుడు కామ్రేడ్ కార్తిక్‌లకు కూడా ప్రభుత్వం కుట్రపూరితంగా ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా జీవితఖైదు విధించింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అక్టోబర్ 29న అలిపిరి కేసులో బూటకపు సాక్ష్యాలతో కామ్రేడ్ పాండురంగారెడ్డి ఎలియాస్ సాగర్ సహా నలుగురికి ఏడేళ్ల శిక్ష విధించింది. ఇంకా పలు చోట్ల మరెందరో విప్లవ కార్యకర్తలకూ, సాధారణ ప్రజలకూ ఈ దోపిడీవర్గ న్యాయస్థానాలు ఉరిశిక్ష సహా వివిధ రకాల శిక్షలు విధించాయి. సీనియర్ నేతలు, వయోవృద్ధులు, తీవ్ర అనారోగ్యంతో బాధ పడుతున్న కామ్రేడ్స్ సుశీల్ రాయ్, కోబడ్ గాంధీలతో పాటు శోభ, పతిత్‌పావన్ హల్దార్, ప్రమోద్ మిశ్రా, విజయ్, ఆశుతోష్, బల్‌రాజ్, చింతన్, బిమాన్, బిధాన్, చండీ సర్కార్, బాలగణేష్ తదితర వేలాది మంది కామ్రేడ్స్‌ను, 'ఝార్ఖండ్ అభేన్' సాంస్కృతిక సంస్థ నాయకుడు జీతన్ మరాండి తదితర ప్రజా నాయకుల్ని సుదీర్ఘకాలంగా జైళ్లల్లో నిర్బంధించి, బెయిల్ మంజూరు చేయకుండా, వాళ్లపై వరుసగా బూటకపు కేసులు బనాయిస్తున్నారు. పశ్చిమ బెంగాల్లోని కలకత్తా జైలులో గత జనవరి నెలలో కామ్రేడ్ స్వపన్‌దాస్‌కు వైద్యం అందకుండా చేసి యూ.ఏ.పీ.ఏ. కింద తొలి హత్య చేశారు.

మన దేశ సహజ సంపదల్నీ, శ్రమశక్తినీ వేదాంత వంటి సామ్రాజ్యవాద బహుళజాతి కంపెనీలకూ, టాటా, ఎస్సార్, జిందల్, మిత్తల్ తదితర దళారీ పెట్టుబడిదార్లకూ దోచిపెట్టడానికి కంకణం కట్టుకున్న యూ.పీ.ఏ. ప్రభుత్వం ఈ విచ్చలవిడి దోపిడీకి అడ్డుగా నిల్చిన మావోయిస్టు వుద్యమాన్ని దేశ అంతర్గత భద్రతకు పెనుముప్పుగా ప్రకటించింది. ఇందులో భాగంగా తన ప్రచార సాధనాలతో విషపూరిత దుష్ప్రచార దాడిని కొనసాగిస్తున్నది. గత ఆగస్టు 2009 నుండి ఆపరేషన్ గ్రీన్ హంట్ పేరుతో ఛత్తీస్‌గఢ్, ఒడిశా, బీహార్, ఝార్ఖండ్, ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర తదితర రాష్ట్రాలలో కేంద్ర–రాష్ట్రాల ప్రభుత్వాలు విప్లవోద్యమంపై క్రూరమైన దాడికి పాల్పడుతూ, వేలాది పోలీసు, పారామిలిటరీ బలగాల్ని దించి, ముఖ్యంగా, ఆదివాసులను ఊచకోత కోస్తున్నాయి. ఈ దాడి సామ్రాజ్యవాదుల, ప్రత్యేకించి అమెరికన్ సామ్రాజ్యవాదుల మార్గదర్శకత్వంలో, పూర్తి అండదండలతో కొనసాగుతున్నది. ఈ దేశాన్ని సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ, భూస్వామ్య వర్గాల భల్లూకపు పట్టు లోంచి విముక్తి చేసి కార్మిక–కర్షక ఐక్యతా పునాదిపై ప్రజాస్వామిక వర్గాల ప్రజా పాలనను నెలకొల్పే

మహత్తర లక్ష్యంతో పోరాడుతున్న మా పార్టీని దోపిడీ పాలకులు టెర్రరిస్టులుగా, దేశద్రోహులుగా చిత్రించడానికి పడరాని పాట్లు పడుతున్నారు. ఒక వైపు రోజుకో కుంభకోణంలో భాగమవుతూ లక్షల కోట్ల రూపాయల్ని స్వాహా చేస్తూ, ప్రజల రక్తమాంసాల్ని పీల్చిపిప్పి చేసి దోచుకున్న సొమ్మును స్విస్ బ్యాంకుల్లో దాచుకుంటున్న మంత్రులపై, రాజకీయ నాయకులపై, బడా పెట్టుబడిదార్లపై, వాళ్ల దళారులపై దేశద్రోహం కేసు ఎందుకు పెట్టరు? బోపాల్ నరమేధానికి పాల్పడ్డ, తోడ్పడిన నేరస్తులు కుట్రదారులు ఎందుకు కారు? అణగారిన ప్రజల విముక్తి కోసం పాటుపడడం దేశద్రోహం ఎలా అవుతుంది? ప్రజా వుద్యమాలకు సంఘీభావం ప్రకటిస్తూ గొంతెత్తిన వాళ్లు, కలం పట్టిన వాళ్లు కుట్రదారులు ఎలా అవుతారు?

తాము సాగిస్తున్న ప్రజా వ్యతిరేక, దేశద్రోహకర, నీతిమాలిన నయా వుదారవాద ఆర్థిక విధానాలకు ఎలాంటి అడ్డూ లేకుండా చేసుకోవాలనే కుట్రలో భాగమే ఈ తీర్పులు. ఇది రాబోయే కాలంలో దేశంలో ఫాసిజం మరింతగా పేట్రేగిపోనున్నది అనడానికి సంకేతం. ఈ దేశంలో సాగుతున్నది ప్రజాస్వామ్యమని అమాయకంగా నమ్మే, మోసపోయే వాళ్లందరికీ ఈ తీర్పులు కనువిప్పు కావాలి. దేశ పాలక ముఠా మావోయిస్టు వుద్యమాన్నే తన దాడికి లక్ష్యంగా బైటికి ప్రకటిస్తున్నప్పటికీ, వాస్తవానికి అది మొత్తంగా దేశ ప్రయోజనాలను కాంక్షించే, ప్రజా శ్రేయస్సు కోరే ప్రగతిశీల, ప్రజాస్వామ్య శక్తులందరినీ అణచివేసే లక్ష్యంతో చేస్తున్న ఫాసిస్టు దాడి. అందుకే ఈ దాడికి వ్యతిరేకంగా ప్రజలంతా సమైక్యంగా నిలబడాలనీ, దృఢంగా పోరాడి ఓడించాలనీ మా పార్టీ విజ్ఞప్తి చేస్తున్నది.

దళారీ ప్రభుత్వాలు అమెరికన్ సామ్రాజ్యవాదులు అమలు చేస్తున్న హోంల్యాండ్ సెక్యూరిటీ వంటి నల్ల చట్టాల సరళిలోనే చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (యూ.ఏ.పి.ఏ), ఛత్తీస్‌గఢ్ ప్రత్యేక ప్రజా రక్షణ చట్టం (సీఎస్‌పీఎస్‌ఏ), మకోకా, సాయుధ బలగాల ప్రత్యేకాధికారాల చట్టం (ఏ.ఎఫ్.ఎస్.పి.ఏ) తదితర నల్ల చట్టాల కింద ప్రజా వుద్యమాలనూ, జాతి విముక్తి వుద్యమాలనూ అణచివెయ్యడానికి పూనుకుంటున్నాయి. మక్కా మసీదు, మాలెగాం, అజ్మీర్ షరీఫ్ తదితర బాంబుపేలుళ్లకు పాల్పడి వందలాది అమాయక ప్రజల ప్రాణాలు హరించిన కాషాయ టెర్రరిస్టులకూ, ఒక లక్షా 76 వేల కోట్ల రూపాయల 2జి స్పెక్ట్రమ్ కుంభకోణానికీ, కామన్‌వెల్త్ గేమ్స్, ఆదర్శ్ హౌజింగ్, కర్నాటక భూములు తదితర అనేకానేక కుంభకోణాలకు పాల్పడ్డ స్కామ్‌స్టర్స్‌కూ, రాజకీయ గ్యాంగ్‌స్టర్స్‌కూ ఏనాడూ ఏ శిక్షా వేయని కోర్టులు విప్లవకారులకూ, ప్రజా వుద్యమకారులకూ, ప్రజాస్వామిక వాదులకూ, కాశ్మీర్, ఈశాన్య ప్రాంతాల జాతి విముక్తి వుద్యమాల కార్యకర్తలకూ ఈ నల్ల చట్టాల కింద శిక్షలు విధిస్తున్నాయి.

ఛత్తీస్‌గఢ్‌లోని బీజేపీ ప్రభుత్వం, కేంద్రంలోని యూపీఏ ప్రభుత్వం కుమ్మక్కై తమ అభివృద్ధినిరోధక న్యాయవ్యవస్థ ద్వారా కుట్రపూరితంగా విధించిన ఈ శిక్షలను తీవ్రంగా

ఖండించాలనీ, ఈ తీర్పులకు వ్యతిరేకంగా వీధుల్లోకొచ్చి వుద్యమించాలనీ, ప్రజాస్వామ్యప్రియులైన, దేశభక్తియుత శక్తులకూ, జాతి విముక్తి వుద్యమకారులకూ – మానవ/పౌరహక్కుల కార్యకర్తలకూ, సంఘాలకూ, విద్యార్థులకూ, మేధావులకూ, అధ్యాపకులకూ, రచయితలకూ, కళాకారులకూ, వైద్యులకూ, న్యాయవాదులకూ, మీడియామిత్రులకూ, కార్మికులకూ, కర్షకులకూ అందరికీ మా కేంద్రకమిటీ విజ్ఞప్తి చేస్తున్నది. యూఏపీఏ, సిఎస్‌పీఎస్ఏ, మకోకా, ఏఎఫ్ఎస్‌పీఏలను వెంటనే రద్దు చేయాలని గట్టిగా డిమాండ్ చేస్తూ సమైక్యంగా వుద్యమించాలని కోరుతున్నది. వివిధ దేశాలకు చెందిన ప్రగతిశీల, ప్రజాస్వామిక, విప్లవ సంస్థలూ, సముదాయాలూ, వ్యక్తులూ భారత పాలకవర్గాల ఈ దుశ్చర్యను తీవ్రంగా ఖండించాలనీ, భారత ప్రభుత్వం పట్ల తమ తీవ్ర నిరసనను అనేక ఉద్యమ రూపాల్లో తెలియజెయ్యాలని కోరుతున్నాం. గతంలో డాక్టర్ బినాయక్‌సేన్ అక్రమ నిర్బంధాన్ని ఖండిస్తూ, ఆయన తక్షణ విడుదలను కోరుతూ భారత ప్రజా వుద్యమాలకు సంఘీభావంగా నిలిచిన అంతర్జాతీయ సముదాయం మరోసారి మరింత దృఢంగా ఆ పాత్రను నిర్వహించాల్సిన తరుణమిది. ఈ శిక్షలకు వ్యతిరేకంగా 2011 జనవరి 2 నుండి 8 వరకూ దేశవ్యాప్త నిరసన వారాన్ని పాటిస్తూ ప్రెస్ కాన్ఫరెన్స్‌లు, ప్రకటనలు, నిరసన ప్రదర్శనలు, ధర్నాలు, రాస్తారోకోలు, సభలు, సమావేశాలు, సంతకాల సేకరణ, నల్ల బ్యాడ్జీలు ధరించడం, దిష్టిబొమ్మల దగ్ధం తదితర కార్యక్రమాలు సృజనాత్మకంగా చేపట్టాలనీ, న్యాయ పోరాటాలకు పూనుకోవాలనీ, పాలకుల ప్రజా వ్యతిరేక, దేశద్రోహకర, ఫాసిస్టు విధానాలను గొంతెత్తి ఖండించాలని మా పార్టీ పిలుపునిస్తున్నది.

ఈ సందర్భంగా ప్రజలను పెద్ద ఎత్తున సమీకరించి వివిధ రూపాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని మా కేంద్రకమిటీ యావత్ పార్టీ శ్రేణులకూ, పీఎల్‌జీఏ బలగాలకూ, విప్లవ ప్రజా సంఘాలకూ పిలుపునిస్తున్నది.

ఈ నిరసన వారం సందర్భంగా 'బంద్' వుండబోదనీ, వీలైన అన్ని ప్రజాస్వామ్య పద్ధతుల్లో ప్రజా నిరసన కొనసాగుతుందనీ మా కేంద్రకమిటీ స్పష్టం చేస్తున్నది. దీనిని 'బంద్'గా చిత్రీకరించి ప్రభుత్వం–పోలీసులు ఉద్దేశ్యపూర్వకంగా చేసే ప్రచారాన్ని నమ్మవద్దని మేం ప్రజలకూ, మీడియాకూ విజ్ఞప్తి చేస్తున్నాం.

**అభయ్**

**అధికార ప్రతినిధి**

**కేంద్ర కమిటీ**

**సీపీఐ (మావోయిస్టు)**

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# కేంద్ర కమిటీ

**12-1-2011**

## ఒడిశాలో పోలీసు-పారామిలిటరీ బలగాలు సాగిస్తున్న విచ్చలవిడి హత్యలను, బూటకపు ఎదురుకాల్పులను ఖండించండి!

## మావోయిస్టు విప్లవోద్యమాన్ని రూపుమాపి ఒడిశా ప్రకృతి సంపదల్ని కార్పొరేట్ సంస్థలకు నిరాటంకంగా దోచిపెట్ట జూస్తున్న నవీన్ పట్నాయక్ కుట్రలను ప్రజలు తప్పక ఓడిస్తారు!!

మావోయిస్టు విప్లవోద్యమాన్ని సమూలంగా నిర్మూలించే లక్ష్యంతో కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో సాగిస్తున్న భారీ దాడి - ఆపరేషన్ గ్రీన్‌హంట్‌లో భాగంగా ఒడిశాలో గత రెండు నెలల కాలంలో ప్రత్యేక పోలీసు-పారామిలిటరీ బలగాలు విచ్చలవిడి హత్యాకాండలకు పాల్పడి వేర్వేరు ఘటనల్లో దాదాపు 25 మందిని పొట్టన బెట్టుకున్నాయి. ఇందులో చాలా వరకు బూటకపు ఎన్‌కౌంటర్లు కాగా, మరి కొన్ని గెరిల్లాలకు సంబంధించిన కచ్చితమైన సమాచారంతో వందల సంఖ్యలో పోలీసు, పారామిలిటరీ బలగాల్ని దించి గెరిల్లాలపై, వారితో కలిసున్న ప్రజలపై విచ్చలవిడిగా కాల్పులు జరిపి హతమార్చిన ఘటనలు.

తాజాగా జనవరి 12వ తేదీన క్యోంఝర్ జిల్లాలోని ఒక అటవీ ప్రాంతంలో జరిగిన 'ఎదురుకాల్పుల్లో' ఇద్దరు మావోయిస్టులు చనిపోగా, రాయగడ జిల్లాలోని నియంగిరి ప్రాంతానికి చెందిన బాంధ్‌కమాలీ పర్వతాల్లో జనవరి 9వ తేదీ పొద్దున జరిగినట్టుగా చెబుతున్న ఎన్‌కౌంటర్లో 9 మంది కామ్రేడ్స్ అమరులయ్యారు. చనిపోయిన తొమ్మిది మంది కామ్రేడ్లలో ఒకరైన కామ్రేడ్ రవి గత కొద్ది సంవత్సరాలుగా ఒడిశా పీడిత ప్రజల్లో పని చేస్తున్న ఒక ముఖ్యమైన నాయకుడు. ఆయన ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు గోదావరి జిల్లాకు చెందిన వాడు. అంతకు సరిగ్గా వారం రోజుల ముందు, జనవరి 2న జాజ్‌పూర్ జిల్లాలోని కళింగనగర్ ప్రాంతంలో రాయఘాటీ అడవుల్లో జరిగిందని చెబుతున్న మరో ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మహిళలతో సహా ఐదుగురు మావోయిస్టులు చనిపోయారు. చనిపోయిన వాళ్లలో ఒకరు కళింగనగర్ ప్రాంత ఏరియా పార్టీ కమిటీ సభ్యుడు. జనవరి 2వ తేదీన కళింగనగర్ ఆదివాసీ హత్యాకాండకు ఐదేళ్లు పూర్తవుతున్న సందర్భంగా తలపెట్టిన ప్రజా కార్యక్రమం ఏర్పాట్లలో

వుండగా ఈ సంఘటన జరిగింది. 29 డిసెంబర్ 2010న క్యెంఝర్ జిల్లాలోని తాల్‌పడా అడవిలో జరిగినట్టు చెబుతున్న ఒక ఎన్‌కౌంటర్‌లో ఒక మహిళా కామ్రేడ్ అమరురాలైంది. అంతకు ముందు, డిసెంబర్ నాల్గో వారంలో గజపతి జిల్లాలోని అడబ అటవీప్రాంతంలో జరిగిన మరో ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టులు చనిపోయారని పోలీసులు ప్రకటించారు. జనవరి ప్రారంభంలో బరగఢ్ జిల్లాలో జరిగినట్టుగా చెప్పిన ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన ఇద్దరు సాధారణ ప్రజలనీ, పోలీసులు వాళ్లను పట్టుకొని చంపారని ప్రజలు ప్రకటించారు. అంతకు ముందు గజపతి జిల్లాలో జరిగింది కూడా బూటకపు ఎన్‌కౌంటరేనని, చనిపోయింది సాధారణ ప్రజలని మీడియాలో వార్తలు వచ్చాయి. బూటకపు ఎన్‌కౌంటర్లపై ప్రజల నుండి, ప్రజాస్వామికవాదుల నుండి పెద్ద ఎత్తున నిరసన వస్తున్నప్పటికీ లెక్కచేయని నవీన్ ప్రభుత్వం మరింత దూకుడుగా, బరితెగించి విప్లవకారుల, సాధారణ ప్రజల హత్యలకు పూనుకుంటున్నది.

అపార ఖనిజ, జల, వన సంపదలతో తులతూగే ఒడిశా దుర్భర దారిద్ర్యానికి, ఆకలిచావులకు నెలవుగా మారిపోయింది. దేశంలో ఇనుము నిల్వలలో అగ్రస్థానంలో నిలిచే ఒడిశాలో మరెన్నో విలువైన ఖనిజాల నిల్వలున్నాయి. అయితే ఈ సంపదలన్నీ సంపన్నుల బొక్కసాల్లోకి చేరుతుండగా పేదలు మరింత పేదలుగా దిగజారిపోతున్నారు. స్వాతంత్ర్యం వచ్చిందని చెబుతున్న ఈ 63 సంవత్సరాల్లో ఒడిశా పీడిత ప్రజానీకం, ప్రత్యేకించి ఆదివాసులు దుర్భర భూస్వామ్య, సామ్రాజ్యవాద దోపిడీ కింద నలిగిపోతున్నారు. ఒడిశాను మైనింగ్ మాఫియాకు స్వర్గంగా మార్చివేసిన మైనింగ్ మాఫియా బాస్ నవీన్ పట్నాయక్ ప్రభుత్వం అనేక కార్పొరేట్ సంస్థలతో లెక్కలేనన్ని ఎంఓయూలు చేసుకున్నది. స్టీల్ ప్లాంటుల నిర్మాణానికి సంబంధించి 49కి పైగా అవగాహనా ఒప్పందాలు, 20కి పైగా బొగ్గు ఆధారిత పవర్ ప్లాంట్ల నిర్మాణానికి, కొన్ని అల్యూమినా రిఫైనరీ ప్రాజెక్టులు, ఒక ఒడరేవు నిర్మాణానికి సంబంధించిన ఒప్పందాలు చేసుకున్నది. దక్షిణ కొరియాకు చెందిన బహుళజాతి కంపెనీ పోస్కోతో 55 వేల కోట్ల రూపాయలతో చేసుకున్న ఒప్పందం దేశంలోనే అతి పెద్ద విదేశీ పెట్టుబడి. పోస్కోతో పాటు కళింగనగర్‌లో టాటాకు, నియంగిరి ప్రాంతంలో వేదాంతకు అనుమతులు మంజూరు చేయడంలో ఒడిశా ప్రభుత్వం తాను నిర్దేశించుకున్న చట్టాలను తానే నిర్లజ్జగా వుల్లంఘించింది. ఈ ఒప్పందాలన్నీ ఒడిశా ప్రజానీకానికి అంతులేని విషాదాన్ని కొని తెచ్చేవే. అక్కడి అడవుల్ని, భూముల్ని, నీటిని, పర్యావరణాన్ని, సకల జీవన పార్శ్వాల్ని వినాశనంలోకి నెట్టివేసేవే. ఇదంతా అతి పెద్ద మానవనిర్మిత విధ్వంసంగా మారబోతున్నది. అందుకే ఒడిశా ప్రజానీకం ఈ అన్యాయానికీ, కార్పొరేట్ నిలువుదోపిడీకీ వ్యతిరేకంగా పోరాడుతున్నారు.

టాటా, వేదాంత, పోస్కో తదితర బహుళ జాతి, బడా దళారీ కంపెనీల దోపిడీ దౌర్జన్యాలకు వ్యతిరేకంగా, కోరాపుట్ జిల్లాలోని నారాయణపట్నా ప్రాంతంలో భూస్వామ్య దోపిడీకి

వ్యతిరేకంగా ఇటీవలి కాలంలో ఒడిశా ప్రజలు అనేక పోరాటాలు చేశారు, చేస్తున్నారు. ఈ పోరాటాలపై ప్రభుత్వం తమ పశు బలగాన్ని ప్రయోగించి ఎందరో ప్రజల ప్రాణాల్ని పొట్టనబెట్టుకున్నది. **2** జనవరి **2006**న కళింగనగర్‌లో టాటా నిర్మిస్తున్న స్టీలు కంపెనీ కోసం తమ పంట భూములివ్వ నిరాకరించిన ఆదివాసీ ప్రజలపై కాల్పులు జరిపి పోలీసులు **14** మందికి పైగా ప్రాణాలు తీశారు. మరెన్నో సందర్భాల్లో, మరెన్నో చోట్ల పోలీసుల లాఠీలకు, తూటాలకు ప్రజలు ప్రాణాలు కోల్పోయారు, గాయపడ్డారు. నియంగిరి ప్రాంతంలో వేదాంత కంపెనీ తలపెట్టిన బాక్సైట్ గనుల్ని, లాంజీగఢ్‌లో వున్న వేదాంత అల్యూమినా రిఫైనరీని వ్యతిరేకిస్తూ ప్రజలు పోరాటం ప్రారంభించారు. ప్రజల పోరాటాల ముందు తలవంచి, నియమనిబంధనల వుల్లంఘన జరిగిందన్న కారణంగా కేంద్ర ప్రభుత్వం వేదాంతకు గనుల అనుమతిని రద్దు చేసింది. అయితే లాంజీగఢ్‌లో వేదాంత రిఫైనరీ వున్నంత దాకా తమ అస్తిత్వానికి ప్రమాదం వుండనే వుందని, ఈ రిఫైనరీ ద్వారా తమ భూములకూ, పర్యావరణానికీ ఎంతో నష్టం జరుగుతున్నదని ప్రజలు తమ పోరాటాన్ని ఇంకా కొనసాగిస్తున్నారు. ఇలా ఒడిశా అంతటా ప్రజలు అనేక చోట్ల పోరాడుతున్నారు. ఈ ప్రజా పోరాటాలకు చాలా చోట్ల మావోయిస్టు పార్టీ నాయకత్వం వహిస్తున్నది లేదా సమర్థిస్తున్నది. అంతకన్నా ముఖ్యంగా అనేక ప్రాంతాల ప్రజలు మావోయిస్టు పార్టీ నాయకత్వాన్ని కోరుకుంటున్నారు. ఆహ్వానిస్తున్నారు. తమపై సాగుతున్న భూస్వామ్య, సామ్రాజ్యవాద దోపిడీ పీడ విరగడ చేసుకోవడానికి మావోయిస్టు పార్టీ తప్ప మరో రాజకీయ పార్టీ ఏదీ లేదని ఒడిశా ప్రజానీకం గ్రహించారు. ఎన్నో కొత్త ప్రాంతాలకు మావోయిస్టు విప్లవోద్యమం విస్తరిస్తున్నది. ఈ వుద్యమం తాము సాగిస్తున్న వనరుల దోపిడీకి ప్రధాన అడ్డంకిగా వున్న కారణంగానే నవీన్ పట్నాయక్ ప్రభుత్వం కేంద్రంలోని యూపీఏ అండదండలతో ఈ హత్యాకాండలకు పాల్పడుతున్నది. ప్రత్యేకించి నియంగిరి ప్రాంతంలో పాశవిక దాడికి పాల్పడి తొమ్మిది మంది విప్లవకారుల్ని కాల్చిచంపిన సంఘటన 'వేదాంత' కనుసన్నల్లోనే, దాని విచ్చలవిడి దోపిడీకి దారుల్ని సుగమం చెయ్యడం కోసమే జరిగిందనేది ఎవరికైనా స్పష్టంగా కనిపించే సత్యం. అట్లాగే కళింగనగర్ ప్రాంతంలో (జాజ్‌పూర్, క్యెంఝర్ జిల్లాల్లో) నవీన్ ప్రభుత్వం సాగిస్తున్న ఫాసిస్టు హత్యాకాండ ఆ ప్రాంతాన్నంతా కబళించెయ్యడానికి పొంచి వున్న టాటా తదితర కార్పొరేట్ కంపెనీల దోపిడీకి అడ్డులేకుండా చెయ్యడం కోసమేననేది కూడా చాలా స్పష్టం. కార్పొరేట్ వర్గాలకు నమ్మినబంటుగా వేల కోట్ల రూపాయల కమిషన్లు దిగమింగుతున్న నవీన్ పట్నాయక్‌కు, అతని పాలక యంత్రాంగానికి మావోయిస్టు వుద్యమ విస్తరణ పక్కలో బల్లెంగా మారింది. అందుకే వేల కోట్ల ప్రజా ధనాన్ని ఖర్చుపెడుతూ పోలీసు, కమాండో (ఎస్ఓజీ), ఎస్పీవో, ఇన్‌ఫార్మర్ వ్యవస్థను భారీ ఎత్తున నిర్మిస్తూ ప్రజలపై, గెరిల్లా దళాలపై ఫాసిస్టు దాడులకు పాల్పడుతున్నారు.

హత్యలతో, దాడులతో, నిర్బంధకాండతో ప్రజా వుద్యమాల్ని అణచడం అసాధ్యమని చరిత్ర పదే పదే రుజువు చేసింది. మావోయిస్టు విప్లవోద్యమాన్ని అణచివెయ్యడం ద్వారా భూస్వామ్య, కార్పొరేట్ వర్గాల దోపిడీపీడనలకు ఎలాంటి అడ్డూ లేకుండా చేసుకోగమని దళారీ నవీన్ పట్నాయక్, వేదాంత మాజీ డైరెక్టర్, ప్రస్తుత ఆపరేషన్ గ్రీన్‌హంట్ సీఈవో చిదంబరం తదితర పాలక ప్రభువులు, వాళ్ల సామ్రాజ్యవాద యజమానులు కంటున్న కలలు పగటి కలలుగా రుజువుకాక తప్పదు. ప్రజలు ప్రజా వుద్యమాల్ని మరింత తీవ్రతరం చేయడానికి మరింత సమరశీలంగా ముందుకు రాక తప్పదు. ఇది గత కొద్ది రోజులుగా మావోయిస్టులకు వ్యతిరేకంగా ఉధృతమైన దాడి తీవ్రతను సూచిస్తున్నప్పటికీ, దీన్ని వాళ్ల దోపిడీకి వ్యతిరేకంగా సాగుతున్న ప్రజా వుద్యమాలన్నింటిపై సాగుతున్న ఉమ్మడి దాడిలో భాగంగానే చూడాలి. కార్పొరేట్ దోపిడీకి, నరహంతక నవీన్ పట్నాయక్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక, సామ్రాజ్యవాద అనుకూల విధానాలకు వ్యతిరేకంగా సమైక్యంగా, సాయుధమై పోరాడడం ద్వారా మాత్రమే ఈ హత్యాకాండల్ని ఆపగలం.

ఒడిశాలో నవీన్ పట్నాయక్ ప్రభుత్వం సాగిస్తున్న హత్యాకాండనూ, బూటకపు ఎదురుకాల్పుల్నీ ముక్తకంఠంతో ఖండించాలని మేం దేశ ప్రజలనూ, ప్రజాస్వామిక వాదులనూ కోరుతున్నాం. ఇప్పటి వరకు జరిగిన కాల్పుల సంఘటనలన్నిటిపై స్వతంత్ర న్యాయవిచారణ జరిపించి దోషులైన పోలీసు అధికారులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేయాలని మేం ప్రజలందరికీ విజ్ఞప్తి చేస్తున్నాం. ఈ దాడులు, హత్యాకాండలు మావోయిస్టు వుద్యమంపై మాత్రమే జరుగుతున్నవి కావని, ఈ దాడి కార్పొరేట్ దోపిడీకి వ్యతిరేకంగా గొంతెత్తే/ పోరాడే వాళ్లందరిపైనా  అని గ్రహించాలని మా పార్టీ విజ్ఞప్తి చేస్తున్నది. కాబట్టి ప్రజాస్వామిక, ప్రగతిశీల, దేశభక్తియుత శక్తులన్నీ సమైక్యమై కార్పొరేట్ దోపిడీకి, ఆ దోపిడీ సాఫీగా సాగడం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న హత్యాకాండలకు, ఆపరేషన్ గ్రీన్‌హంట్‌కు వ్యతిరేకంగా పోరాడాలని మా కేంద్ర కమిటీ పిలుపునిస్తున్నది.

**అభయ్**

**అధికార ప్రతినిధి**

**కేంద్ర కమిటీ**

**సీపీఐ (మావోయిస్టు)**

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# సెంట్రల్ రీజినల్ బ్యూరో

**16-3-2011**

## 'మిలియన్ మార్చ్'ను ఎత్తిపట్టండి

ప్రత్యేక తెలంగాణ సమస్యపై కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి వహించి, తెలంగాణ ఏర్పాటును ఎలాగైనా అటకెక్కించాలని ప్రయత్నిస్తున్నది. తెలంగాణ సమస్యకు పరిష్కారాల కోసం ఏర్పాటు చేసిన శ్రీకృష్ణ కమిటి, దాని నివేదిక అంతా బూటకమని తేటతెల్లమైంది. దేశంలో ఒక రాష్ట్రం ఏర్పాటు కోసం ముందెన్నడూ లేని స్థాయిలో ఉద్యమం జరుగుతూ, నాలుగుకోట్ల తెలంగాణ ప్రజానీకం ముక్తకంఠంతో ప్రత్యేక తెలంగాణ ఏర్పాటును డిమాండ్ చేస్తున్నప్పటికీ, తెలంగాణ సమస్య సున్నితం, జటిలమైనది, ఏకాభిప్రాయ సాధన అవసరం అంటూ ప్రధానమంత్రి మన్మోహన్ రాగాలు తీస్తున్నాడు. దీనర్థం తెలంగాణ సమస్యను ఇంకా నాన్చి, ఉద్యమాన్ని నీరుగార్చాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదనేది స్పష్టం. కాంగ్రెస్ నాయకత్వంలోని యు.పి.ఎ ప్రభుత్వ మోసపూరిత కుట్రలను అర్థం చేసుకున్న తెలంగాణ ప్రజలు తెలంగాణ సాధనకు పోరాటమే ఏకైక మార్గంగా ఎంచుకున్నారు. ఈ నేపథ్యంలో ఉద్యమం నానాటికీ తీవ్రరూపం దాల్చుతున్నది.

ఈ క్రమంలో 'రచ్చబండ' కార్యక్రమంలో గ్రామగ్రామాన తెలంగాణ ప్రజలు ప్రభుత్వ నిర్లక్ష్య, మోసపూరిత వైఖరిని తమ ఆగ్రహావేశాలతో రచ్చకీడ్చారు. ఆ తరువాత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను స్థంభింప చేయడానికి ఉద్యమం 'సహాయ నిరాకరణ' రూపం తీసుకుంది. సహాయ నిరాకరణలో యావత్తు తెలంగాణ ప్రజానీకం, అన్ని ప్రభుత్వ సంస్థలకు చెందిన లక్షలాది ఉద్యోగులు, ఉపాధ్యాయులు స్వచ్ఛందంగా పాల్గొని ప్రభుత్వానికి కాలు చేయి ఆడకుండా చేశారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, విద్యాసంస్థలు, ఫ్యాక్టరీలు అన్నింటిలో పనులు స్థంభించాయి. ప్రభుత్వం రెవిన్యూ, పన్నులు, విద్యుత్, ఆర్.టి.సి ఛార్జీల రూపంలో వచ్చే కోట్ల రూపాయల ఆదాయం కోల్పోయింది. తెలంగాణ వ్యాప్తంగా ప్రైవేటు వ్యాపార, వాణిజ్య సంస్థలు, సినిమాహాళ్ళు బంద్ చేసి నిర్వాహకులు స్వచ్ఛందంగా సహాయ నిరాకరణలో పాలుపంచుకున్నారు. రాష్ట్రంలో అనేక రైళ్ళు దారి మళ్ళింపు, సర్వీసుల స్థంభనకు గురయ్యాయి. మొత్తం మీద సహాయ నిరాకరణతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్యకలాపాలను ఏ విధంగా స్థంభింప జేయగలరనేది తెలంగాణ ప్రజలు రుజువు చేసి చూపించారు. ఇప్పటివరకు ఇన్ని రూపాల్లో ప్రజలు శాంతియుతంగా నిరసనలు తెలుపుతూ, తెలంగాణ

ఆకాంక్షను బలంగా వ్యక్తం చేస్తున్నప్పటికీ దోపిడీ, దళారీ వర్గాల కొమ్ముకాసే యు.పి.ఎ ప్రభుత్వం దీన్ని ఎలా నీరుగార్చాలా అని కుట్రలు చేస్తున్నది.

అంతేగాక, ఉద్యమ అణచివేతకు పథకాలు వేస్తున్నది. మార్చి 10న లక్షలాది ప్రజలు శాంతియుతంగా నిర్వహించ తలపెట్టిన 'మిలియన్ మార్చ్'ను నిర్బంధంతో అడ్డుకోవాలని ప్రభుత్వం చివరిదాకా విఫల ప్రయత్నాలు అనేకం చేసింది. మిలియన్ మార్చ్‌కు అనుమతినీయకుండా, మార్చ్‌కు పిట్టను కూడా రానివ్వబోమంటూ యావత్తు తెలంగాణపై వేయికళ్ళతో నిఘా వేసింది. మిలియన్ మార్చ్‌కు వస్తున్న లక్షకు పైగా ప్రజలను అరెస్టులు చేసి, వాహనాలను అడ్డుకొని, లాఠీఛార్జిలు జరిపి భగ్నం చేయాలని చూసింది. ఇటువంటి దుర్మార్గమైన నిర్బంధ పథకాలను రూపొందించి, ఉద్యమ అణచివేతకు ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డి, గవర్నర్ నరసింహన్, డి.జి.పి అరవిందరావుల దుష్ట త్రయం నాయకత్వం వహిస్తున్నది. ప్రజల ఆగ్రహావేశాల్లో ఇలాంటి ఫాసిస్టులు నల్లుల్లా మాడిపోక తప్పదు.

ఎన్ని అడ్డంకులు కల్పించినా, ఎంత నిర్బంధం ప్రయోగించినా ఉవ్వెత్తున పొంగిన ఉద్యమ ఆకాంక్షల ముందు ఆంక్షలు ఆవిరయ్యాయి. వీటన్నింటిని ఛేదించుకొని తెలంగాణ ఉద్యమ ఊరేగింపు జనసాగరమై హుస్సేన్ సాగర్ ఒడ్డుకు చేరింది. 'ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం' సాధించుకు తీరతామని ప్రతినబూనింది. నిర్బంధాలతో, అణచివేతలతో ఏ శక్తీ తెలంగాణ గొంతును నొక్కలేదని ప్రజలు నిరూపించారు. మార్చి 10న హైదరాబాద్‌లో 'మిలియన్ మార్చ్'ను విజయవంతం చేశారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దుర్మార్గపు విధానాలకు వ్యతిరేకంగా పెల్లుబుకుతున్న ప్రజల ఆగ్రహావేశాలు హద్దులు దాటి ట్యాంకు బండ్‌పై మహనీయుల విగ్రహాల విధ్వంసానికి, మీడియాపై దాడికి దారితీయటం దురదృష్టకరం. ఇందుకు ప్రభుత్వానిదే పూర్తి బాధ్యత. నిర్బంధాలతో తెలంగాణ ఉద్యమాన్ని అడ్డుకోలేరనేది చరిత్రలో ఇప్పటికే ఎన్నోసార్లు రుజువయింది. అయినా సీమాంధ్ర పెట్టుబడిదారుల, దోపిడిదారుల కొమ్ముగాసే ప్రభుత్వం తన శుష్క ప్రయత్నాలు మానుకోవటం లేదు. శాంతియుతంగా జరిగే ఊరేగింపుకు అనుమతినిచ్చి వుంటే ఈ దురదృష్టకర పరిణామం జరిగివుండేది కాదు. తెలంగాణ పట్ల సీమాంధ్ర పాలకుల వివక్ష, దోపిడి, అణచివేతలు ప్రజల అసహనానికి, ఆగ్రహానికి కారణం. ట్యాంకుబండ్‌పై విగ్రహాల స్థాపనలో కూడా పాలకుల వివక్ష స్పష్టంగానే కన్పిస్తున్నది. పోరాటాల, రక్తతర్పణల చరిత్రతో ప్రపంచంలో పేరెన్నికగన్న తెలంగాణ గడ్డన ట్యాంక్‌బండ్‌పై స్థానం పొందగల మహనీయులే లేరా? ఇది వివక్ష కాక మరేమిటి? ప్రభుత్వ దుర్మార్గపూరిత విధానాలే ఉద్యమాన్ని విధ్వంసం వైపు నెడుతున్నాయి. సమాజంలో జరిగే అన్యాయాలు, అక్రమాలు, వాటికి వ్యతిరేకంగా ప్రజల పోరాటాలను ఏదో మేరకు ప్రపంచానికి చాటిచెప్పే మీడియాపైన దాడి కూడా సరైంది కాదు. ప్రజాస్వామిక ఆకాంక్షను ప్రతిబింబించే ప్రత్యేక తెలంగాణ ఉ

ద్యమం పత్రికా ప్రజాస్వామ్యాన్ని గౌరవించాలి. తెలంగాణ పేరు చెప్పుకొని బ్రతికే ఏ రాజకీయ పార్టీలను, దొంగ నాయకులను ప్రజలు నమ్మే స్థితి లేదు. ఇప్పుడు ఉద్యమం ప్రజల చేతుల్లో వుంది. ఇటువంటి ఉద్యమాల్లోకి రాజ్యం విధ్వంసకర శక్తులను చొప్పించి విచ్ఛిన్నానికి కుట్రలు పన్నే అవకాశాలున్నాయి. ఇటువంటి చర్యలను సాకుగా చూపించి ప్రభుత్వం అణచివేతకు సాధికారత కల్పించుకోవడానికి ప్రయత్నిస్తుంది. ఈ కుట్రల పట్ల ప్రజలు, ఉద్యమకారులు సదా అప్రమత్తంగా వుండాలి. ఏమైనప్పటికీ నాలుగుకోట్ల ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించే ఉద్యమంలో ఇటువంటి అపశృతులు దొర్లటం ఉద్యమానికి మంచిది కాదు. అన్ని ప్రాంతాల ప్రజల విశ్వాసాలను చూరగొన్న గొప్ప వ్యక్తుల విగ్రహాల విధ్వంసం ప్రజల్లో విభేధాలు, విద్వేషాలు రెచ్చగొట్టే శక్తులకు అవకాశాన్నిస్తుంది. ప్రజల విశ్వాసాలను దెబ్బతీస్తుంది. ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు పట్ల సుముఖతతో వున్న ఇతర ప్రాంతాల ప్రజలతో ఐక్యతను దెబ్బతీసే ఎటువంటి పొరపాట్లను కూడా ముందు ముందు జరుగకుండా ఉద్యమ నాయకత్వం, తెలంగాణ ప్రజలు జాగ్రత్త వహించాల్సి వుంది. ఎట్టి పరిస్థితుల్లో కూడా విచ్ఛిన్నకర శక్తులకు అవకాశం ఇవ్వకూడదు.

తమ అధికారాన్ని కాపాడుకోవడానికి ప్రత్యేక తెలంగాణను అడ్డుకోవాలని చూస్తున్న సీమాంధ్ర పాలకులను, పెట్టుబడిదారులను, తెలంగాణ వ్యతిరేక శక్తులను ఓడించాలి. తెలంగాణ ఉద్యమం కీలకదశకు చేరుకున్న తరుణంలో అన్ని ప్రాంతాల ప్రజల మద్దతును కూడగట్టుకొని ముందుకు కదలాలి. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనకు ఉస్మానియా విద్యార్థుల, న్యాయవాదుల, సహాయ నిరాకరణ, మిలియన్ మార్చ్ వంటి మిలిటెంట్ పోరాటాలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మెడలు వంచాలి. ఇందుకు తెలంగాణలోని అన్ని సెక్షన్ల ప్రజలు మరింత సంఘటితంగా తెలంగాణ ప్రజాశక్తిని నిరూపించాలి. ప్రజాస్వామిక ప్రత్యేక తెలంగాణ కోసం యిదే ఐక్యతతో యావత్తు తెలంగాణ ప్రజానీకం పోరాడాలి.

ప్రతాప్,

అధికార ప్రతినిధి,

**సెంట్రల్ రీజనల్ బ్యూరో**

**సీపీఐ (మావోయిస్టు)**

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# కేంద్ర కమిటీ

**31-3-2011**

## లిబియాపై అమెరికా-ఫ్రాన్స్-బ్రిటన్‌లు సాగిస్తున్న దురాక్రమణ యుద్ధాన్ని ఖండించండి!

## ప్రజాస్వామ్యం, స్వాతంత్రం కోసం ఉద్యమిస్తున్న ట్యునీషియా, ఈజిప్టు, యెమెన్, బహరైన్, అల్జీరియా, మొరాకో, జోర్డాన్ తదితర దేశాల ప్రజలకు సంఘీభావం తెలుపండి!

## అరబ్ దేశాల అంతర్గత వ్యవహారాల్లో సామ్రాజ్యవాదుల, ప్రత్యేకించి అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్ సామ్రాజ్యవాదుల జోక్యాన్ని వ్యతిరేకించండి!

గత కొంత కాలంగా అరబ్ ప్రపంచంలో ఎగిసిపడుతున్న ప్రజా ప్రభంజనం సామ్రాజ్యవాదాన్ని, ప్రత్యేకించి అమెరికాను కుదిపివేస్తుండగా, ప్రపంచ ప్రజానీకాన్ని ఎంతో ప్రభావితం చేస్తున్నది. ట్యునీషియాలో మొదలై ఎన్నో అరబ్ దేశాలకు వ్యాపించిన ఈ ప్రజా వెల్లువకు జడిసి 23 ఏళ్లుగా ప్రజలను పీడిస్తున్న ట్యునీషియా రాష్ట్రపతి బెన్ ఆలీ, 30 ఏళ్ళుగా ఈజిప్టులో రాజ్యమేలుతున్న హెూస్నీ ముబారక్ గద్దె దిగి పారిపోక తప్పలేదు. ఇంకా యెమెన్, బహరైన్, అల్జీరియా, మొరాకో, జోర్డాన్ తదితర దేశాల్లో ప్రజా వుద్యమాలు ఇదే ఒరవడిలో సాగుతున్నాయి. సామ్రాజ్యవాదులతో అంటకాగుతూ ప్రజలపై దశాబ్దాలుగా నియంతృత్వాన్ని సాగిస్తున్న పాలకులు గద్దె దిగాలని అరబ్ ప్రజ ముక్త కంఠంతో నినదిస్తున్నది. లక్షలాది అరబ్ ప్రజలు, ముఖ్యంగా యువతరం నిషేధాజ్ఞల్ని సైతం ధిక్కరిస్తూ వీధుల్లోకి వస్తున్నారు. వారాల తరబడి వీధులు, చౌరాస్తాలన్నీ ప్రజా సముద్రాలుగా మారిపోయాయి. ప్రజల ప్రదర్శనలపై ప్రభుత్వాలు జరిపిన దాడుల్లో వందలాది ప్రజలు ప్రాణాలర్పించారు. వేలాది మంది గాయపడ్డారు. అయితే ఇప్పుడు లిబియాపై అమెరికా నాయకత్వంలో నాటో దేశాలు ప్రారంభించిన దురాక్రమణ యుద్ధంతో అరబ్ ప్రపంచంలో మొత్తం పరిణామాలు ఒక కీలక మలుపును తీసుకున్నాయి.

లిబియాలో గద్దాఫీ పాలనకు వ్యతిరేకంగా తలెత్తిన తిరుగుబాటును అణిచేందుకు లిబియా ప్రభుత్వం తన సైన్య బలగాల్ని ప్రయోగించడాన్ని అడ్డుకునే పేరుతో భద్రతామండలి లిబియాపై 'నో-ఫ్లై జోన్' తీర్మానం చేసింది. భద్రతామండలిలో అమెరికా నాయకత్వంలోని నాటో దేశాలు తీర్మానానికి అనుకూలంగా వోటు చేయగా రష్యా, చైనా, జర్మనీ, బ్రెజిల్, భారతదేశం వోటింగ్‌లో పాల్గొనలేదు. వీటో అధికారం కలిగిన రష్యా, చైనాలు ఈ తీర్మానాన్ని అడ్డుకోవడానికి తమ అధికారాన్ని వుపయోగించలేదు. స్పష్టంగానే, తీర్మానాన్ని వ్యతిరేకించని ఈ దేశాలు లిబియాపై నాటో సైనిక చర్యకు పరోక్షంగా మద్దతు తెలిపాయి. ఈ దాడిని ఖండించకుండా కేవలం దీని పట్ల విచారం ప్రకటించి మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం దేశ, ప్రపంచ ప్రజలను మోసం చేస్తున్నది. ఇజ్రాయిల్ విషయంలో ఐక్యరాజ్యసమితి చేసిన డజన్ల కొద్దీ తీర్మానాల్ని తుంగలో తొక్కుతూ జియోనిస్ట్ పాలకులు పాలస్తీనీయుల్ని లెక్కలేనన్ని సార్లు విచ్చలవిడిగా హత్య చేసినప్పటికీ ఏనాడూ అభ్యంతరం చెప్పని, తన వీటో అధికారాన్ని ఇజ్రాయిల్ కోసం విచ్చలవిడిగా ప్రయోగించిన అమెరికా, ఇతర పశ్చిమ సామ్రాజ్యవాద దేశాలు లిబియా విషయంలో మాత్రం తీర్మానం జరిగిందే తడవుగా దాని అమలు కోసం బాంబుల వర్షం ప్రారంభించాయి. అంతర్జాతీయ క్యాంపెయిన్‌లో భాగమని చెప్పుకుంటున్న ఈ దురాక్రమణ దాడిని ప్రారంభించిన మొదటి రోజునే ఫ్రాన్స్‌కు చెందిన 18 బాంబర్ విమానాలు అనేక టార్గెట్లపై కనీసం 40 బాంబుల్ని కురిపించాయి. అమెరికన్, బ్రిటిష్ నావికా సైన్యాలు లిబియా రక్షణ వ్యవస్థను లక్ష్యంగా చేసుకొని అనేక క్రూజ్ మిసైళ్లు ప్రయోగించాయి. అమెరికన్ వాయుసైన్యానికి చెందిన పద్దెనిమిది బీ-2 యుద్ధ విమానాలు 100కు పైగా మిస్సైళ్లను ప్రయోగించాయి. అనేక లక్ష్యాలపై బాంబులు వేశాయి. గద్దాఫీ సైన్యాలు చేయగల మానవహననాన్ని నిరోధించే పేరుతో ప్రారంభించిన ఈ యుద్ధంలో గత మూడు వారాలలో వందలాది మంది పౌరులు చనిపోయారు. చనిపోయింది ఎవరి బాంబులతో అనే దానిపై ఆధారపడి లిబియన్ల ప్రాణాల (చావుల) విలువ మారుతుందని ప్రపంచాన్ని నమ్మబలికించాలనుకోవడం కన్నా దుర్మార్గం మరొకటి లేదు! చనిపోయిన వాళ్లలో చాలా మంది పిల్లలున్నట్టుగా మీడియానే చెప్పక తప్పలేదు. నిజానికి సామ్రాజ్యవాదుల బాకాలుగా పని చేసే మీడియా వాస్తవాల్ని మసిపూసి మారేడుకాయ చేసి తప్పుడు సమాచారాల్ని ప్రసారం చేస్తున్నాయి. ఈ దురాక్రమణ యుద్ధంలో మీడియా తన వర్గ స్వభావాన్ని మరోసారి ప్రదర్శిస్తున్నది.

తనను తాను తటస్థ సంస్థగా చెప్పుకునే ఐక్యరాజ్యసమితి అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్ తదితర సామ్రాజ్యవాద దేశాల జేబు సంస్థగా ఈ సందర్భంగా మరోసారి తేటతెల్లమైంది. దాని సెక్రటరీ జనరల్ బాన్‌కీ మూన్ అమెరికా కాళ్ల దగ్గర తోకాడించే కుక్కగా తనను తాను రుజువు చేసుకున్నాడు. డిసెంబర్ 2008లో ఇజ్రాయిల్ గాజాపై జరిపిన అమానుషమైన

యుద్ధంలో 1,417 మంది పాలస్తీనీయులు - వాళ్లలో ఎక్కువ మంది పిల్లలు, స్త్రీలు - ప్రాణాలు కోల్పోయి, మరెన్నో వేల మంది గాయాల పాలైనపుడు గానీ, ఇజ్రాయిల్ సైన్యం చట్టవిరుద్ధంగా వైట్ ఫాస్ఫరస్ వంటి అత్యంత ప్రమాదకరమైన రసాయనాలు ప్రయోగించి ఎందరో గాజావాసులు క్యాన్సర్ బారిన పడడానికి కారణమైనపుడు గానీ, అది ఎఫ్-16 విమానాల్ని ప్రయోగిస్తూ 'టార్గెటెడ్ కిల్లింగ్స్'కు పాల్పడుతున్నపుడు గానీ, కరెంటూ నీళ్లూ వంటి కనీస అవసరాల్ని కూడా తీరకుండా చేసి 15 లక్షల గాజా ప్రజలు 'బహిరంగ జైలు' వంటి దుర్భర పరిస్థితుల్లో మగ్గేలా చేస్తున్నందుకు గానీ 'నో-ఫ్లై జోన్' తీర్మానం చేయడానికి ఐరాస ఎన్నడూ సాహసించలేదు. నయా-నాజీ రాజపక్సే ప్రభుత్వం ఎల్‌టిటిఈని అంతమొందించే సంహారక యుద్ధాన్ని ప్రారంభించి పౌర ప్రాంతాలపై, జనావాసాలపై టన్నుల కొద్దీ బాంబుల్ని కురిపించినపుడు గానీ, యుద్ధం చివర్లో కేవలం రెండు రోజుల్లోనే 20 వేల మంది ప్రాణాల్ని హరించినపుడు గానీ, చనిపోయిన లేదా పట్టుబడ్డ మహిళా టైగర్లపై సింహళ జాత్యహంకార సైన్యాలు మాటల్లో వర్ణించలేని అత్యాచారాలకు పాల్పడుతున్నపుడు గానీ ఐరాస చేసిందేమీ లేదు. తమ స్వాతంత్రం కోసం పోరాడుతున్న కాశ్మీర్ ప్రజలపై ఉక్కుపాదం మోపుతూ భారత ప్రభుత్వం గత పాతికేళ్లుగా 80 వేలకు పైగా కాశ్మీరీయుల్ని పొట్టన పెట్టుకుంటుంటే కుంభకర్ణుడిలా నిద్రిస్తూ వుండిపోయిన ఐరాస ఇప్పుడు లిబియాలో గద్దాఫీకి వ్యతిరేకంగా పోరాడుతున్న ప్రజల్ని కాపాడడం కోసమే నడుం బిగించానని చెప్పుకుంటోంది. సిగ్గు! సిగ్గు!! మొత్తంగా చూసినపుడు అది పలు డజన్ల సందర్భాల్లో అమెరికా, ఇజ్రాయిల్, పశ్చిమ దేశాల ప్రయోజనాలకు భంగం వాటిల్లుతున్నట్టు భావించినపుడు చూపించిన శ్రద్ధ, ఆత్రుత మిగతా పీడిత దేశాల, జాతుల విషయంలో చూపిన దాఖలాలు లేవు.

అసలు లిబియా యుద్ధం ఐరాస చేసిన 'నో-ఫ్లై జోన్' తీర్మానం స్ఫూర్తికి కూడా పూర్తిగా విరుద్ధం. లిబియా తన వాయు సైన్యాన్ని వుపయోగించి తిరుగుబాటుదారులపై దాడులు చేయకుండా నిరోధించడానికి చేసిన భద్రతామండలి తీర్మానాన్ని అమలు చేస్తున్నామని చెప్పుకున్న అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్‌లు లిబియాపై విచ్చలవిడిగా బాంబులు కురిపించడం దురాక్రమణే తప్ప వేరే ఏమీ కాదు. గద్దాఫీని గద్దె దించి తమకు అనుకూలంగా వుండే పాలక ముఠాను అధికారంలోకి తీసుకొచ్చి లిబియాలోని చమురు నిల్వలను కొల్లగొట్టడమే వాటి అసలు లక్ష్యం. బహరైన్‌లో ప్రజా తిరుగుబాటును అణచడానికి దొడ్డి దారిన సౌదీ అరేబియా సైన్యాల్ని దింపిన ఒబామా లిబియా తిరుగుబాటుదార్ల ప్రాణాలను కాపాడడం కోసమే బాంబుల్ని కురిపించాల్సి వచ్చిందని మాట్లాడడం దగుల్బాజీతనానికి పరాకాష్ఠ. అఫ్గానిస్తాన్‌లో, పశ్చిమ పాకిస్తాన్‌లో రోజూ విచ్చలవిడి డ్రోన్ దాడులు చేస్తూ వందలాది ప్రజల ప్రాణాలు తీస్తున్న 'నోబెల్ శాంతి బహుమతి గ్రహీత'యైన ఈ రక్తపిపాసికి అసలు ప్రజల ప్రాణాల గురించి మాట్లాడే నైతిక హక్కే లేదు. ఇంకా సౌదీ అరేబియా, యెమెన్,

జోర్డాన్ తదితర దేశాల్లో తాము ఇన్నేళ్ళుగా సమర్థిస్తూ వచ్చిన దళారీ పాలకులు గద్దె దిగాలని పోరాడుతున్న ప్రజల్ని సాయుధ బలగాలు కాల్చి చంపుతున్నా మాట్లాడని పశ్చిమ దేశాలు గద్దాఫీ అధికారాన్ని కూలదొయ్యాలని మాట్లాడడం వాటి రెండు నాల్కల ధోరణికి మచ్చుతునక. నిఖార్సయిన సామ్రాజ్యవాద ద్వంద్వనీతి!

పశ్చిమ దేశాల సామ్రాజ్యవాదులతో, ముఖ్యంగా అమెరికాతో కుమ్మక్కైన తొత్తు పాలకులు - ట్యునీషియా రాష్ట్రపతి బెన్ అలీ, ఈజిప్టు రాష్ట్రపతి హోస్నీ ముబారక్, యెమెన్ రాష్ట్రపతి అలీ అబ్దుల్లా సాలెహ్, బహరైన్ అమీర్ ఇసా అల్ ఖలీఫా, జోర్డాన్ రాజు అబ్దుల్లా - తమ తమ దేశాల్లో పలు దశాబ్దాలుగా నియంతృత్వ పాలనను సాగిస్తున్నారు. పేరుకు ఎన్నికలు జరిపించినప్పటికీ అవి ఎంత బూటకమైనవో అర్థం చేసుకోవడానికి ట్యునీషియా ఉదాహరణ ఒక్కటి సరిపోతుంది - రాష్ట్రపతి బెన్ అలీకి ప్రతిసారీ 97% నుండి 99% వోట్లు పడేవి?! ప్రజలకు ఎలాంటి పౌర, రాజకీయ హక్కులు లేవు. పోలీసు, ఇంటలిజెన్స్ విభాగాలు ప్రజల ప్రతి కదలికనూ నియంత్రిస్తూ, ఎలాంటి నిరసన తలెత్తకుండా అణచివేస్తూ వుండినాయి. ఈ దేశాలన్నిటిలో నిరుద్యోగం విలయ తాండవం చేస్తున్నది. వుదాహరణకు యెమెన్‌లో 40 శాతం నిరుద్యోగం వుంది. మరోవైపు ఇక్కడి పాలకులు చమురు బావులపై పెత్తనం కలిగి లెక్క లేనన్ని సంపదలు పోగు చేసుకున్నారు. బిలియన్ల డాలర్ల డబ్బు విదేశీ బ్యాంకుల్లో దాచిపెట్టుకున్నారు. ట్యునీషియా నుండి పారిపోతూ బెన్ అలీ ఒకటిన్నర టన్నుల బంగారాన్ని కూడా తరలించుకు వెళ్లాడంటే ఒక్కో నియంత ప్రజల్ని ఎంతగా దోచుకుని సంపదల్ని గుట్టలుగా పేర్చుకున్నారో స్పష్టమవుతుంది. మరోవైపు 2008 నుండి ప్రపంచ ఆర్థికవ్యవస్థ ఎదుర్కొంటున్న సంక్షోభం ప్రభావం అరబ్ దేశాలపై కూడా పడుతున్న కారణంగా ప్రజలు చెప్పనలవి కాని ఇక్కట్లకు గురవుతున్నారు. జనాభాలో సగానికి పైగా రోజుకు రెండు డాలర్ల కన్నా తక్కువ సంపాదనతో నికృష్టంగా బతుకులీడుస్తున్నారు. ఈ దేశాల నియంతలు అమెరికా ప్రారంభించిన 'టెర్రరిజంపై యుద్ధం'లో భాగంగా అల్ కాయిదాను అణిచేసే పేరుతో ప్రజా ధనాన్ని విచ్చలవిడిగా ఖర్చు చేస్తున్నారు. యెమెన్ 75 కోట్ల డాలర్లతో కౌంటర్ టెర్రరిజం శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించింది. ప్రజలకు లభించే సౌకర్యాలపై కోత విధిస్తూ, ప్రజా ధనాన్ని ఇలా దుర్వినియోగం చేయడం వల్ల కూడా ప్రజల్లో అసంతృప్తి, ఆగ్రహం పెల్లుబికాయి. ఇంత కాలం మతం పేరుతో, షియా-సున్నీల మధ్యా, వివిధ జాతుల, తెగల మధ్యా వున్న వైరుధ్యాల్ని సొమ్ము చేసుకుంటూ సామ్రాజ్యవాదులు ఈ నియంతలందరికీ అండగా నిలుస్తూ వాళ్ళ ప్రజలపై అమలు చేస్తున్న దోపిడీ, పీడన, నిర్బంధ చర్యలు వగైరా అన్నిటికీ మద్దతు పలికారు. కానీ ప్రజా వెల్లువ తీవ్రతను గమనించి ఈ వయస్సు మీరిన గుర్రాల్ని వదిలించుకొని కొత్త వాటిని చూసుకోవడమే మేలని అనుకున్నారు. మెల్లగా ముబారక్, బెన్ అలీలను అధికారంలోంచి తప్పించి అక్కడి సైనిక జనరల్స్ చేతిల్లోకి అధికార మార్పిడి

జరిపించారు. ఇతర దేశాల్లో ఇప్పటికీ పాలకుల పక్షాన్నే పశ్చిమ దేశాలన్నీ నిలబడ్డాయి. 22 అరబ్ దేశాల కూటమి అరబ్ లీగ్ ఈ మొత్తం వ్యవహారంలో పశ్చిమ దేశాలకు తొత్తుగానే వ్యవహరిస్తున్నది తప్ప అరబ్ జాతీయవాదపు ఛాయల్ని ప్రదర్శించడం గానీ, అరబ్ ప్రజల సామ్రాజ్యవాద వ్యతిరేక ఆకాంక్షలకు గొంతునివ్వడం గానీ ఏ మాత్రం చేయడం లేదు.

ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్షల్ని నెరవేర్చి, ప్రజలందరినీ సమైక్యపర్చి, సామ్రాజ్యవాదాన్ని నిర్ద్వంద్వంగా వ్యతిరేకించే పాలకులే దేశ స్వాతంత్ర్యాన్ని కాపాడగల్గుతారు... దేశ సార్వభౌమత్వాన్ని నిలబెట్టగల్గుతారు. ప్రజలపై నియంతృత్వాన్ని అమలు చేసే పాలకులెవరైనా.... గద్దాఫీ గానీ, మరొకరు గానీ సామ్రాజ్యవాదంతో రాజీ లేని పోరాటం చేయలేరు. ప్రజలను సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా సమైక్యంగా నిలబెట్టలేరు. అపార చమురు నిల్వలకు నిలయమైన పశ్చిమాసియా, ఉత్తర ఆఫ్రికా ప్రాంతంపై తమ ఆధిపత్యం నెరపడం కోసం సామ్రాజ్యవాదులు తొలి నుండీ అనేక కుట్రలకూ, కుతంత్రాలకూ, దురాక్రమణ యుద్ధాలకూ పాల్పడుతున్నారు. తమకు లొంగి తమ ప్రయోజనాలకు పెద్ద పీట వేసే నియంతలకు అండగా నిలబడుతున్నారు. తమ ప్రయోజనాలకు ఏదో మేరకు ఆటంకంగా భావించిన నియంతల పట్ల 'యూజ్ అండ్ థ్రో' (ఉపయోగించు - పారవెయ్యి) నీతిని ప్రయోగిస్తున్నారు.

## అరబ్ దేశాల ప్రజలకు భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) పిలుపు :

అరబ్ దేశాల ప్రజలు నియంతలకూ, సామ్రాజ్యవాదులకూ వ్యతిరేకంగా తమ వుద్యమాల్ని గొప్ప పట్టుదలతో కొనసాగించాలి. సామ్రాజ్యవాదులు, ప్రత్యేకించి అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్‌లు ఈ వుద్యమాల్ని హైజాక్ చేయడానికి చేసే ప్రయత్నాల్ని దృఢంగా ఎదుర్కోవాలి. గద్దె దిగిపోయిన నియంతల స్థానంలో అధికారం చేపట్టిన సైనిక కౌన్సిళ్ల పట్ల అప్రమత్తంగా వుండాలి. ఇంతకాలం నియంతలకు కొమ్ముగాసిన సైనిక జనరల్స్ ప్రజాస్వామ్యానికి హామీ పడతారని నమ్మి మోసపోవద్దని మా పార్టీ అరబ్ ప్రజానీకానికంతా తెలియజెపుతున్నది. కార్మిక-కర్షకులతో సహా ప్రజాస్వామిక వర్గాలు, మధ్య తరగతి, దేశభక్తియుత, సామ్రాజ్యవాద వ్యతిరేక సెక్షన్లన్నీ సమైక్యం కావాలి. కార్మికవర్గ నాయకత్వం కింద సామ్రాజ్యవాదంతో రాజీ లేకుండా పోరాడడం తప్ప అరబ్ ప్రజలకు మరో మార్గం లేదు. పీడిత ప్రజరాశుల నిజమైన విముక్తికి మార్క్సిజం మార్గదర్శకత్వం, కార్మికవర్గ అగ్రగామి దళమైన విప్లవకర కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం అత్యావశ్యకమన్న సత్యాన్ని అరబ్ ప్రపంచపు పరిణామాలు మరోసారి స్పష్టంగా రుజువు చేస్తున్నాయి. వివిధ దేశాలకు లభించిన లాంఛనప్రాయమైన స్వాతంత్ర్యాల తర్వాత ఒకనాటి వలసవాదం స్థానంలో చోటు చేసుకున్న నయా-వలసవాదం ఎంతటి దుర్భర పరిస్థితులకు నెడుతుందో గత 40-50 ఏళ్లుగా అరబ్ ప్రాంత ప్రజలు కళ్లారా చూశారు.

నయా-వలసవాదాన్ని నిర్మూలించి నిజమైన స్వాతంత్ర్యాన్ని సాధించాలంటే అరబ్ ప్రజలు తమ కాళ్లపై తాము నిలబడుతూ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా దృఢంగా పోరాడాలి. లిబియాపై అన్యాయమైన యుద్ధానికి దిగిన అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్ సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా సమైక్యంగా పోరాడాలి. ఆయా దేశాలలో సామ్రాజ్యవాదుల మద్దతు కలిగిన నిరంకుశ దళారీ పాలకులకు వ్యతిరేకంగా చేసే పోరాటాలు తప్పనిసరిగా సామ్రాజ్యవాదాన్ని నిర్ద్వంద్వంగా వ్యతిరేకించే, దాని జోక్యాన్ని, అది రుద్దే అన్యాయమైన యుద్ధాల్ని దృఢంగా ప్రతిఘటించే పోరాటాలుగా ఎదగాలని, ఎదుగుతాయని సీపీఐ (మావోయిస్టు) ఆశిస్తున్నది. అప్పుడే అరబ్ ప్రపంచం నియంతల, సామ్రాజ్యవాదుల కబంధ హస్తాల నుండి విముక్తిని సాధించగలుగుతుంది.

**భారత ప్రజలకూ, ప్రపంచ ప్రజానీకానికీ భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) పిలుపు:**

అరబ్ దేశాల ప్రజలు స్వేచ్ఛ కోసం, ప్రజాస్వామ్యం కోసం చేస్తున్న వుద్యమాలు పూర్తిగా న్యాయమైనవి. ఈ ఉద్యమ శక్తుల్లో మత ఛాందసవాదులు, తదితర అభివృద్ధినిరోధకులు కొంత మేరకు భాగంగా వున్నప్పటికీ ఈ వుద్యమాలు ప్రజాస్వామికమైనవి, ప్రగతిశీలమైనవి. ఈ వుద్యమాలకు సంఘీభావం ప్రకటించాలి. అరబ్ ప్రాంత వ్యవహారాల్లో సామ్రాజ్యవాద జోక్యాన్ని, లిబియాపై పశ్చిమ దేశాల సామ్రాజ్యవాదులు రుద్దిన అన్యాయమైన యుద్ధాన్ని ముక్త కంఠంతో ఖండించాలి.

★ **లిబియాపై అమెరికా నాయకత్వంలో నాటో సాగిస్తున్న అన్యాయమైన యుద్ధాన్ని వెంటనే నిలిపివెయ్యాలి!**

★ **లిబియా అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకునే హక్కు సామ్రాజ్యవాదులకు లేనే లేదు!**

★ **అరబ్ ప్రపంచ వ్యవహారాల్లో సామ్రాజ్యవాదులు, ప్రత్యేకించి అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్‌లు అనుసరిస్తున్న జోక్యందారీ విధానాల్ని ఎండగట్టండి!**

★ **అరబ్ దేశాల్లో సాగుతున్న న్యాయమైన ప్రజా వుద్యమాలను బలపర్చండి!**

**అభయ్**

**అధికార ప్రతినిధి**

**కేంద్ర కమిటీ**

**సీపీఐ (మావోయిస్టు)**

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# కేంద్ర కమిటీ

**6-4-2011**

## ఐదు రాష్ట్రాల విధానసభ ఎన్నికల్ని బహిష్కరించండి!
## దోపిడీపీడనలకు, అవినీతికి, హింసకు, అత్యాచారాలకు, అవమానాలకు ఆలవాలమైన ప్రస్తుత అర్ధవలస-అర్ధభూస్వామ్య వ్యవస్థను కూకటివేళ్లతో పెకిలించి ప్రజల ప్రజాస్వామిక రాజ్యాన్ని నిర్మించడం కోసం ప్రజాయుద్ధాన్ని తీవ్రతరం చేయండి!!

ఐదు రాష్ట్రాలు - అస్సాం, తమిళనాడు, కేరళ, పాండిచ్చేరి, పశ్చిమ బెంగాల్ విధానసభలకు ఎన్నికల తతంగం మొదలైంది. అవినీతి, అధికధరలు, పేదరికం, ఆకలి, నిరుద్యోగం, వనరుల దోపిడి, విస్థాపన, పర్యావరణ వినాశనం వంటి సమస్యలతో దేశం అట్టుడికి పోతుండగా, పార్లమెంటరీ పార్టీలన్నీ మరోసారి ప్రజల్ని మభ్యపెట్టి ఎలాగైనా ఆయా రాష్ట్రాల్లో అధికారంలోకి రావాలని తహతహలాడుతున్నాయి. దేశంలో సామ్రాజ్యవాద-నిర్దేశిత ఆర్థిక విధానాల్ని అమలు చేయడంలో ముందు నిలిచిన కాంగ్రెస్, బిజెపి వంటి ప్రధాన దోపిడీవర్గ పార్టీలతో పాటు గత 30 ఏళ్లుగా పశ్చిమ బెంగాల్లో ఫాసిస్టు పాలనను అమలు చేస్తున్న సిపిఎం; అవినీతి, అక్రమాల్లో పేరుమోసిన డిఎంకె, ఏఐడిఎంకెలు; అస్సాం ప్రజల జాతీయ ఆకాంక్షలకు తీరని ద్రోహం చేసిన అస్సాం గణ పరిషత్ వగైరా పార్టీలన్నీ ఈ రాష్ట్రాల్లో అధికారం చేపట్టడానికి ప్రధానంగా పోటీ పడుతున్నాయి. ధనబలం, కండబలం, కులం, మతం వగైరా అన్ని ఆయుధాలను విచ్చలవిడిగా ప్రయోగించి వోట్లు రాబట్టుకోవడానికి ఎగబడుతున్నాయి. ప్రజల్ని మోసం చేయడానికి చీరల నుండి కంప్యూటర్ల వరకు ఏవోవో ఇస్తామని ఒకరిని మించి మరొకరు చౌకబారు వాగ్దానాలు చేస్తున్నారు. కోట్ల కొద్ది డబ్బు మూటల్ని కుమ్మరించి 'వోట్లు కొనుక్కోవడానికి' ప్రయత్నిస్తున్నారు.

గత 30 ఏళ్లుగా పశ్చిమ బెంగాల్లో సోషల్ ఫాసిస్టు పాలన సాగిస్తున్న సిపిఎం భూస్వామ్య, సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ దోపిడీకి అండగా నిల్చి ప్రజల్లో పూర్తిగా బట్టబయలైంది. టాటా, జిందల్ వంటి దళారీ పెట్టుబడిదార్ల కోసం, ఎస్ఈజెడ్ల కోసం రైతుల భూముల్ని తెగనమ్మడాన్ని వ్యతిరేకిస్తూ నందిగ్రాం, సింగూర్లలో ఉద్యమించిన ప్రజలపై, లాల్గఢ్ ప్రాంతంలో పోలీసు అత్యాచారాలకు వ్యతిరేకంగా వెల్లువెత్తిన ప్రజలపై సిపిఎం పోలీసు, పారామిలిటరీ బలగాలతో, తన గూండా బలగమైన 'హర్మద్ బాహిని'తో అమలు చేసిన క్రూర నిర్బంధం, అమానుష హత్యాకాండ, మహిళలపై అత్యాచారాలు చరిత్రలో

మాయని మచ్చలుగా నిల్చిపోతాయి. వామపక్ష కూటమిలోని సిపిఐ, ఫార్వర్డ్‌బ్లాక్ వంటి పార్టీలు కూడా సిపిఎం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను సమర్థిస్తున్న దివాళాకోరు పార్టీలుగా ప్రజల ముందు బహిర్గతమవుతున్నాయి. సిపిఎం పట్ల అన్ని వర్గాల ప్రజల్లో పెల్లుబుకుతున్న అసంతృప్తిని, ఆగ్రహాన్ని ఆసరా చేసుకొని మమతా బెనర్జీ నాయకత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ అధికారం కోసం పోటీ పడుతున్న ఒక బలమైన శక్తిగా ముందుకొచ్చింది. దాంతో ఈసారి సిపిఎం తన అధికారాన్ని కోల్పోయే ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నది. మమతా బెనర్జీ ఈరోజు పైకి ఏం మాట్లాడినా రేపు ఎన్నికల్లో గెల్చి చేయబోయే పాలన సిపిఎంకు మౌలికంగా భిన్నంగా ఏమీ వుండదు. కాంగ్రెస్‌తో పొత్తుతో ఆమె జరపబోయే పాలన సిపిఎం సహా ఇతర పాలకవర్గ పార్టీలు అనుసరిస్తూ వచ్చిన భూస్వామ్య అనుకూల, కార్పొరేట్ అనుకూల, ప్రజా వ్యతిరేక విధానాల కొనసాగింపుగానే వుంటుందనేది స్పష్టం. కాంగ్రెస్, బిజెపి, సిపిఎంలతో పాటు, తృణమూల్ కాంగ్రెస్ కూడా భూస్వామ్య, దళారీ పెట్టుబడిదారీ వర్గాలకు ప్రాతినిధ్యం వహించేదే. సామ్రాజ్యవాదానికి దాసోహం పలికేదే. కాబట్టి ఈ బూటకపు ఎన్నికల్ని బహిష్కరించి లాల్‌గఢ్ ప్రజల మహోజ్వల పోరాట స్ఫూర్తితో మావోయిస్టు ప్రజాయుద్ధం కేంద్రంగా మిలిటెంట్ ప్రజా వుద్యమాల్ని నిర్మించడమే బెంగాల్ ప్రజల ముందున్న మార్గం. చారిత్రాత్మక లాల్‌గఢ్ వుద్యమం ఫలితంగా బీజరూపంలో ముందుకు వచ్చిన ప్రత్యామ్నాయ ప్రజా పాలనాధికారాన్ని మరింత సంఘటితంగా, మరింత సమరశీలంగా విస్తరింపజెయ్యడమే అసలైన ప్రత్యామ్నాయం.

తమిళనాడు ముఖ్యమంత్రి కరుణానిధి, ఎ. రాజా, అతని బందిపోటు దొంగల వర్గం రాష్ట్రంలో, కేంద్రంలోని యూపీఏ కూటమిలో అధికార భాగస్వామ్యాన్ని వుపయోగించుకొని లక్షల కోట్ల రూపాయల కుంభకోణాలకు పాల్పడి ఇప్పుడు మరోసారి అధికారంలోకి రావడం కోసం కోట్ల రూపాయలు ఖర్చుపెడుతున్నది. కరుణానిధి ప్రభుత్వం దాదాపు 70 ఎస్ఈజెడ్‌లకు అనుమతులు మంజూరు చేసి వేల హెక్టార్ల భూముల్ని బహుళజాతి కంపెనీలకు కట్టబెట్టింది. రైతుల, కార్మికుల జీవితాన్ని దుర్భర పరిస్థితుల్లోకి నెట్టివేసింది. ఒక్క తిరుపూర్ పట్టణంలోనే గత రెండేళ్లలోనే వెయ్యి మందికి పైగా వస్త్ర పరిశ్రమ కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నారు. అక్కడ గత రెండేళ్లలో 25 వేల మంది కార్మికుల్ని పనిలోంచి తీసేశారు. ప్రస్తుతం డిఎంకెపై ప్రజల్లో పెరిగిన అసంతృప్తిని వుపయోగించుకొని జయలలిత నాయకత్వంలోని అన్నా డిఎంకే ఎలాగైనా అధికారం కైవసం చేసుకోవాలని చూస్తున్నది. అయితే గతంలో జయలలిత కూడా అధికారాన్ని వుపయోగించుకొని వేల కోట్ల రూపాయల ఆస్తుల్ని దిగమింగిన చరిత్ర గలిగిన గజదొంగే అన్న విషయం అందరికీ తెలిసిందే. తమిళజాతి ఆకాంక్షలకు ప్రాతినిధ్యం వహిస్తామని చెప్పుకునే డిఎంకె, అన్నా డిఎంకె రెండూ కూడా శ్రీలంకలో సింహళ జాత్యహంకార రాజపక్సే ప్రభుత్వం భారత్, చైనా, అమెరికాల మద్దతుతో ఎల్‌టిటిఈని నిర్మూలించే లక్ష్యంతో సాగించిన అన్యాయమైన యుద్ధానికి, తమిళుల ఊచకోతకు పరోక్షంగా మద్దతు తెలిపినవే. ఈ రెండు పార్టీలనూ, వాటితో అంటకాగుతున్న

మిగతా పార్టీలనూ తిరస్కరించి ప్రజా వుద్యమాలను, విప్లవ పోరాటాలను తీవ్రతరం చేయడమే తమిళనాడు ప్రజల ముందున్న ప్రత్యామ్నాయం.

కేరళలో సిపిఎం నాయకత్వంలోని అధికార వామపక్ష కూటమి అనేక అవినీతి కుంభకోణాల్లో భాగమై, కార్పొరేట్ వర్గాల ప్రయోజనాల్ని నెరవేరుస్తూ ప్రజల అసహ్యానికి గురైంది. ప్రజల అసంతృప్తిని ఆసరా చేసుకొని అక్కడ కాంగ్రెస్ నాయకత్వంలోని యూడిఎఫ్ ఎలాగైనా అధికారంలోకి రావడం కోసం పడరాని పాట్లు పడుతున్నది. గతంలో అస్సాం ప్రజల జాతీయ ఆకాంక్షలకు ప్రాతినిధ్యం వహిస్తూ వుద్యమాల్ని నడిపిన చరిత్ర గల అస్సాం గణ పరిషత్ జాతి ప్రయోజనాల్ని పూర్తిగా తుంగలో తొక్కి అధికారం కోసం పాకులాడుతున్నది. ఉల్ఫా, బోడో తదితర న్యాయమైన జాతి విముక్తి వుద్యమాల్ని అణచడంలో అది కాంగ్రెస్‌తో కుమ్మక్కయ్యింది.

ప్రత్యేకించి గత కొంత కాలంగా దేశంలో అనేక అవినీతి కుంభకోణాలు బైటపడ్తూ దేశ రాజకీయ వ్యవస్థ అసలు రూపం రోజురోజుకూ నగ్నంగా బైటపడుతున్నది. అన్ని పార్టీల మంత్రులు, నేతలు, కార్పొరేట్ సంస్థల అధిపతులు, మీడియా సామ్రాట్‌లు ఎలా కుమ్మక్కయ్యి లక్షల కోట్ల రూపాయలు దిగమింగుతున్నారో ఇటీవల వెలుగులోకి వచ్చిన 2జి స్పెక్ట్రమ్ తదితర కుంభకోణాల ద్వారా మరింత స్పష్టమైంది. తమ సమస్యలపై వుద్యమిస్తున్న వివిధ సెక్షన్ల ప్రజలను, ప్రజా వుద్యమాలను, విప్లవోద్యమాలను అణచివేసే లక్ష్యంతో దోపిడీ పాలకులు ఒకవైపు సాయుధ బలగాలతో నిర్బంధ క్యాంపెయిన్లను అమలు చేస్తున్నారు, మరోవైపు ఫాసిస్టు చట్టాల్ని రూపొందించి ప్రజలను, ఉద్యమకారులను విచారణ లేకుండా ఏళ్ల తరబడి జైళ్లల్లో నిర్బంధిస్తున్నారు. కఠిన శిక్షలు విధిస్తున్నారు. రాజ్యాంగం ఇచ్చిందని చెప్పే జీవించే హక్కుతో సహా ప్రజల ప్రాథమిక హక్కులన్నింటినీ హరించి వేస్తున్నారు.

ఈ ఎన్నికలను 'సజావుగా' (అంటే హింస, అత్యాచారాలు, ప్రజలపై కాల్పులు, అరెస్టులు, రిగ్గింగ్‌గా అర్థం చేసుకోవాలి) నడపడం కోసమని కేంద్ర ప్రభుత్వం 800కి పైగా కంపెనీల పారామిలిటరీ బలగాల్ని దించింది. ఇందులో 600 కంపెనీలకు పైగా బలగాలు మావోయిస్టు వుద్యమం సాపేక్షికంగా బలంగా వున్న పశ్చిమ బెంగాల్ కోసమేననేది గమనార్హం. ఎన్నికలకు చాలా ముందుగానే సిపిఎం తన గుండా సైన్యమైన హర్మద్ బాహినికి చెందిన వేలాది సాయుధ మూకల్ని ఇప్పటికే ప్రత్యేకించి జంగల్‌మహల్ ప్రాంతంలోని డజన్ల కొద్దీ గ్రామాల్లో మోహరించింది. ఈ సాయుధ గూండా మూకలు, సంయుక్త బలగాలు ఇప్పటికే చెప్పనలవి కాని పాశవిక అత్యాచారాలకు, హింసకు పాల్పడుతున్నాయి. అంటే వోట్లు వెయ్య నిరాకరించే ప్రజలను తుపాకీ మొనలతో పోలింగ్ బూత్‌లలోకి తరలించడానికీ, కనీ వినీ ఎరగనంతటి భారీ రిగ్గింగ్‌కీ ఏర్పాట్లు పూర్తయ్యాయని అర్థం. ముఖ్యంగా పశ్చిమ బెంగాల్‌లో ఎలాగైనా అధికారంలో కొనసాగడం కోసం పెద్ద ఎత్తున హింసకు పాల్పడడానికి సిపిఎం సర్వసన్నద్ధంగా వుంది.

అధికారంలో వున్న ఏ పార్టీ లేదా ఏ కూటమి గానీ, ఎన్నికల్లో గెలిచి అధికారాన్ని చేపట్టాలని

చూస్తున్న ఏ పార్టీ లేదా కూటమి గానీ భూస్వామ్య, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ, సామ్రాజ్యవాద వర్గాల ప్రయోజనాలనే నెరవేరుస్తాయి తప్ప నూటికి 95 శాతంగా వున్న కార్మిక, కర్షక, వుద్యోగ, విద్యార్థి, మహిళ, దళిత తదితర పీడిత వర్గాల/సెక్షన్ల మేలు కోసం పాటు పడవనేది గత 64 సంవత్సరాల సోకాల్డ్ స్వతంత్ర భారత చరిత్రలో తేలిపోయిన సత్యం. అసలు ఈ ఎన్నికలే ఒక పెద్ద మోసం. దోపిడీ వర్గాల పరిపాలనను స్థిరీకరించడానికి జరిపే తంతు. ఈ ఎన్నికల్తో పాలక ముఠా రంగులోనో లేదా అది ప్రాతినిధ్యం వహించే పార్టీలోనో మార్పు వస్తుంది తప్ప ప్రస్తుత వ్యవస్థలో మౌలికమైన మార్పేమీ రాదు. ఆకలి, పేదరికం, నిరుద్యోగం, అధికధరలు వంటి ప్రజల మౌలిక సమస్యలు పరిష్కారం కానే కావు. ఎన్నికల్లో పెట్టుబడిగా పెడుతున్నదీ డబ్బే, పార్లమెంటు/అసెంబ్లీలను నడిపించేదీ డబ్బు గలవాళ్లే, తిరిగి ఎన్నికైన తర్వాత పోగు చేసుకునేదీ అంతకు ఎన్నో రెట్ల డబ్బే. ఎన్నికల్లో పోటీ చేస్తున్న అన్ని పార్టీల వాళ్లలో హత్య, కిడ్నాప్, రేప్ వంటి దారుణాలకు పాల్పడ్డ నేరచరితుల సంఖ్య పెరుగుతూ వుండడం వాటి స్వభావానికి మరింతగా అద్దం పడుతున్నది. అందుకే పార్లమెంటు, అసెంబ్లీలు 'పందుల దొడ్లు' తప్ప మరేమీ కావనే మా పార్టీ స్పష్టం చేస్తున్నది. ఈ వ్యవస్థను సమూలంగా మార్చకుండా ప్రజల బతుకులు మారవు. నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని పరిపూర్తి చేసి కార్మిక-కర్షక ఐక్యతా పునాదిపై సమస్త పీడిత ప్రజల ప్రజాస్వామిక రాజ్యవ్యవస్థను నిర్మించడమే అసలైన ప్రత్యామ్నాయం. అందుకు మా పార్టీ నాయకత్వంలో సాగుతున్న ప్రజాయుద్ధంలో ప్రజలందరూ సమీకృతం కావాలని మా కేంద్ర కమిటీ పిలుపునిస్తున్నది.

ప్రియమైన ప్రజలారా! ప్రస్తుత ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్ని బహిష్కరించండి! 'ప్రజాస్వామ్యం' అని చెప్పుకునే దేశంలో వోటు వేసే హక్కుతో పాటు వోటు వెయ్యకుండా వుండే హక్కు కూడా వుండాలి. ఆ హక్కును హరించడానికి వ్యతిరేకంగా వుద్యమించాలి. సాయుధ పహారాలతో ప్రజల్ని బలవంతంగా పోలింగ్ బూత్‌లకు తరలించడానికి వ్యతిరేకంగా గొంతు విప్పాలి. అవినీతి-కుంభకోణాలతో కుళ్లిపోయిన ఈ బూటకపు పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థను తిరస్కరించాలి. దండకారణ్యం, బీహార్-ఝార్ఖండ్, ఒడిశా, బెంగాల్ తదితర చోట్ల మా పార్టీ నాయకత్వంలో ప్రాథమిక స్థాయిలో రూపు దిద్దుకుంటున్న ప్రజల ప్రత్యామ్నాయ ప్రజాస్వామిక రాజ్యవ్యవస్థకు స్వాగతం పలుకుతూ దేశం నలుమూలలా ప్రజల అధికారం నెలకొల్పడానికి నడుం బిగించాలి.

**అభయ్**

**అధికార ప్రతినిధి**

**కేంద్ర కమిటీ**

**సీపీఐ (మావోయిస్టు)**

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# కేంద్ర కమిటీ

**13-4-2011**

## వ్యవస్థీకృతమైన అవినీతిని అంతం చేయడానికి
## ప్రజాపోరాటాల్ని తీవ్రతరం చెయ్యండి!

ఇటీవల 2జి స్పెక్ట్రమ్, కామన్‌వెల్త్ గేమ్స్, ఆదర్శ్ హౌజింగ్ సొసైటీ, కర్నాటక భూముల కుంభకోణం, ఎస్-బ్యాండ్ స్పెక్ట్రమ్ తదితర భారీ కుంభకోణాలు వెలుగులోకి రావడంతో అవినీతి అనే అంశం ఒక ముఖ్య సమస్యగా ముందుకొచ్చింది. కార్మికులు, కర్షకులు, ఆదివాసులు, దళితులు, మహిళలు, ముఖ్యంగా పట్టణ మధ్య తరగతి వగైరా అన్ని వర్గాల, అన్ని సెక్షన్ల ప్రజలు అవినీతికి వ్యతిరేకంగా తమ ఆగ్రహావేశాల్ని ప్రకటిస్తున్నారు. ప్రజల్లో అవినీతి పట్ల, అవినీతికర రాజకీయ పార్టీల పట్ల, వాటి నాయకుల పట్ల గూడుకట్టుకున్న అసంతృప్తి ఫలితమే ఇటీవల అన్నా హజారే చేసిన నిరాహార దీక్షకు దేశవ్యాప్తంగా ప్రజల నుండి వచ్చిన భారీ స్పందన. నిరాహారదీక్షకు సంబంధించిన డిమాండ్ జన్ లోక్‌పాల్ బిల్లు అయినప్పటికీ దేశం నలుమూలల నుండి స్పందించిన ప్రజల ఆకాంక్ష మాత్రం అవినీతిని పూర్తిగా అంతం చెయ్యాలనే.

లోక్‌పాల్ బిల్లు రూపొందించడం కోసం ప్రభుత్వం కమిటీ ఏర్పాటు చేసి అందులో సగం మందిని పౌర సమాజం నుండి ఎంపిక చెయ్యడంతోనే ఈ సమస్యకు పరిష్కారం అయినట్టు లేదా అవుతుందని ఎవరు భావించినా అది అమాయకత్వమే అవుతుంది. నిజానికి ఇప్పటి దాకా అవినీతి ఊడలు దిగిపోయి అంతు లేకుండా పెరిగిపోతున్నది ఎలాంటి చట్టాలూ, నియమాలూ లేకపోవడం వల్ల కాదు. చట్టాలెన్ని వున్నా వాటిని అమలు చేసే, చేయించే వ్యవస్థనే దోపిడీ వర్గాల చేతుల్లో వుండడం వల్ల ఈ దుస్థితి దాపురించింది. ఒకనాటి జీపు కుంభకోణం, లాక్‌హీడ్ విమానాల కొనుగోలు కుంభకోణం నుండి మొదలై రాజీవ్ కాలం నాటి బోఫోర్స్ వగైరా ఎన్నెన్నో కుంభకోణాల చరిత్ర మన దేశానికి వుంది. పదుల కోట్ల రూపాయలతో మొదలై ఈరోజు లక్షల కోట్ల రూపాయల వరకు ఇవి చేరుకున్నాయి. కాంగ్రెస్, బిజెపి వంటి ప్రధాన పార్లమెంటరీ పార్టీలతో పాటు ఆర్‌జెడి, బీఎస్పీ, ఎస్పీ, డీఎంకే, ఏఐడీఎంకే, తెలుగుదేశం తదితర అన్ని జాతీయ/ప్రాంతీయ పార్లమెంటరీ పార్టీలకు చెందిన నాయకులు, మంత్రులు, వాళ్లకు తొత్తులుగా పని చేసే అధికార్లందరూ అవినీతిలో కూరుకుపోయిన చరిత్ర గలవాళ్లే. దేశంలో ఇప్పటికే అమలులో వున్న చట్టాలను సరిగా అమలు చేయడం

ద్వారా, వివిధ అవినీతి నిరోధక శాఖలను సరిగా పని చేయించడం ద్వారా ఇలాంటి అవినీతి కుంభకోణాల్ని అరికట్టవచ్చు. వాటికి బాధ్యులైన వాళ్లను కఠినంగా శిక్షించవచ్చు. కానీ గత **64** సంవత్సరాల 'స్వతంత్ర' భారత చరిత్రలో అవినీతిపరులైన రాజకీయ నాయకులకు, మంత్రులకు, కార్పొరేట్ సంస్థల యజమానులకు, బ్యూరాక్రట్లకు శిక్షలు పడిన వుదాహరణ ఒక్కటైనా కానరాదు. ప్రజల, ప్రతిపక్షాల వత్తిడి వల్ల అరుదైన సంఘటనల్లో ఎవరినైనా అరెస్టు చేసినా ఏళ్ల తరబడి సాగే విచారణ తర్వాత కేసుల్ని నిర్వీర్యపర్చి శిక్షలేమీ లేకుండా లేదా తూతూ మంత్రంగా శిక్షలు వేసి వదిలెయ్యడం సాధారణం. ఎందుకంటే దేశ న్యాయవ్యవస్థ కూడా ప్రస్తుత దోపిడీ రాజ్యవ్యవస్థలో విడదీయరాని భాగమే కనుక. చట్టాల ద్వారా, న్యాయస్థానాల ద్వారా అవినీతి అంతమవుతుందని ఆశించడం ఎండమావుల్లో నీరు దొరుకుతుందని ఆశించడమే.

అవినీతి అనేది కొందరు చెడ్డవాళ్ల లేదా దురాశాపరుల ఆచరణకు సంబంధించిన సమస్య కాదనేది మొదట గుర్తించాల్సిన విషయం. లాభార్జనే ఏకైక మంత్రంగా నడిచే పెట్టుబడిదారీ వ్యవస్థ వికృత ఫలితమే అవినీతి-కుంభకోణాలు. పైకి ఇది ప్రజాస్వామ్యం అని ముసుగేసుకొని స్వేచ్ఛ, సమానత్వం వంటి విలువల్ని వల్లె వేస్తుంది కానీ వాస్తవంలో ఇది దుర్భర శ్రమ దోపిడీ, లంచగొండితనం, కమిషన్లు దిగమింగడం వంటి అక్రమాలతో నిండి వుంటుంది. కాబట్టి అవినీతి, అక్రమాలు సమూలంగా అంతం కావడమనేది ఈ వ్యవస్థ మార్పుతో ముడివడి వున్న అంశం. మనదేశంలో అమలులో వున్న అర్ధవలస - అర్ధభూస్వామ్య వ్యవస్థను యదాతథంగా వుంచి, కొన్ని మెరుగైన చట్టాల్ని తీసుకొచ్చి ఈ సమస్యను పూర్తిగా పరిష్కారం చేయగలమనుకుంటే అది కేవలం భ్రమే అవుతుంది.

నిజానికి కుంభకోణాలుగా వెలుగులోకి వచ్చిన వాటికంటే ఏ మాత్రం బైటికి రాకుండానే వుండిపోతున్నవే ఎన్నో రెట్లు ఎక్కువ. వుదాహరణకు మరణించిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి, ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి రమన్‌సింగ్, ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్, ఝార్ఖండ్ ముఖ్యమంత్రులు మధు కోడా, శిబూ సోరేన్, అర్జున్ ముండాలు, కర్నాటక ముఖ్యమంత్రి యదియూరప్ప ఇంకా మరెందరో ఎన్నో మైనింగ్ ఒప్పందాల్లో కమిషన్లు దిగమింగి, ఎన్నో బడా కంపెనీలతో రహస్యంగా ఎంవోయూలు చేసుకొని కమిషన్లు మింగి వేల కోట్ల రూపాయలు అక్రమంగా ఆర్జించిన విషయం పత్రికలు సైతం రాస్తున్నాయి. ప్రభుత్వాలు అమలు చేస్తున్న వుదారీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ విధానాలే ఇలాంటి ఎన్నో అవినీతి, కుంభకోణాలకు, దేశ సంపదల్ని అడ్డగోలుగా కొల్లగొట్టడానికి ద్వారాలు తెరిచిపెట్టాయి. కాబట్టి ఈ సామ్రాజ్యవాద అనుకూల, ప్రజా వ్యతిరేక ప్రభుత్వ విధానాల్ని నిర్ద్వంద్వంగా వ్యతిరేకించకుండానే, వాటికి వ్యతిరేకంగా పోరాటాల్ని ఎక్కుపెట్టకుండానే అవినీతి రూపుమాసిపోవాలని కోరుకోవడం, మాట్లాడడం ప్రజల్ని పక్కదారి పట్టించడమే అవుతుంది.

ప్రభుత్వం లోక్‌పాల్ బిల్లుకు వుమ్మడి కమిటీ ఏర్పాటు ప్రకటన చేయగానే అన్నా హజారే తన దీక్షను విరమించినప్పటికీ ఈ దీక్షకు మద్దతుగా దేశవ్యాప్తంగా ముందుకొచ్చిన ప్రజాస్పందనకు మాత్రం దీనితో న్యాయం జరగలేదు. నిజానికి ప్రభుత్వం ఈ డిమాండ్‌ను ఒప్పుకున్నది అన్నా దీక్షకు భయపడి కాదు, ఆయనకు మద్దతుగా వెలువడిన ప్రజాగ్రహాన్ని చల్లార్చడం కోసమే. అంతకన్నా ముఖ్యంగా, ఇలాంటి చట్టాలెన్ని చేసినా ప్రస్తుత వ్యవస్థకు కలిగే నష్టమేమీ లేదు కనుకనే పాలకవర్గాలు ఇందుకు నిర్భయంగానే సంసిద్ధత ప్రకటించాయన్నది గమనార్హం.

అవినీతికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా వెల్లువెత్తిన ప్రజాస్పందనకు భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) కేంద్రకమిటీ స్వాగతం పలుకుతున్నది. అవినీతి వ్యతిరేక పోరాటానికి మా పార్టీ పూర్తిగా మద్దతు తెలుపుతున్నది. ప్రజల సమైక్య, సంఘటిత, సమరశీల పోరాటాల ద్వారానే అవినీతిని అంతం చెయ్యడం సాధ్యమవుతుందని మా పార్టీ విశ్వసిస్తున్నది. ప్రభుత్వం కంటితుడుపుగా ప్రకటించే చట్టాలతో, చట్టాల రూపకల్పనకు ఏర్పాటు చేసే కమిటీల నియామకంతో సంతృప్తిపడి ఈ పోరాటాలు ఆగిపోకూడదని, పట్టు విడవకుండా కొనసాగాలని మా పార్టీ దేశ ప్రజలందరినీ కోరుతున్నది. కార్మికులు, కర్షకులు, విద్యార్థులు, మేధావులు, వుద్యోగులు, ప్రజా సంక్షేమాన్ని కోరుకునే గాంధీవాదులతో సహా దేశభక్తియుత సెక్షన్లందరూ మన దేశాన్ని క్యాన్సర్‌లా పట్టి పీడిస్తున్న అవినీతికి వ్యతిరేకంగా విశాల ఐక్య సంఘటనను ఏర్పర్చి వీధుల్లోకి రావల్సిందిగా మా పార్టీ పిలుపునిస్తున్నది. అంతులేని అవినీతి, అక్రమాలకు పాల్పడుతూ, దేశ ప్రజల మూలుగుల్ని పీల్చుతూ లక్షల కోట్ల రూపాయల నల్ల ధనాన్ని స్విస్ బ్యాంకుల్లో దాచుకుంటున్న బందిపోట్లకూ, గజదొంగలకూ ఒక్క నిమిషం కూడా అధికారంలో కొనసాగే అర్హత లేదని గొంతెత్తి నినదించాలని మా పార్టీ విజ్ఞప్తి చేస్తున్నది.

**అభయ్**

**అధికార ప్రతినిధి**

**కేంద్ర కమిటీ**

**సీపీఐ (మావోయిస్టు)**

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# కేంద్ర కమిటీ

**28-4-2011**

## జైతాపూర్ అణు విద్యుత్తు కేంద్ర స్థాపనకు వ్యతిరేకంగా పోరాడుతున్న ప్రజలపై పోలీసుల కాల్పులనూ, అరెస్టులనూ ఖండించండి!
## జైతాపూర్ కేంద్రం సహా దేశంలో ప్రతిపాదిత అణు విద్యుత్తు కేంద్రాలన్నిటినీ రద్దు చేయాలని పోరాడండి!

2011, ఏప్రిల్ 18న పోలీసులు మహారాష్ట్రలోని జైతాపూర్‌లో ప్రతిపాదిత 9,900 మెగావాట్ల అణు విద్యుత్తు కేంద్రానికి వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న ప్రజలపై కాల్పులు జరిపి నాటె గ్రామానికి చెందిన తబ్రేజ్ సోయ్‌కర్ (32) అనే అణు వ్యతిరేక కార్యకర్తను చంపివేశారు. అతని కుటుంబానికి అతనే ప్రధాన ఆధారం. మరో ఎనిమిదిమంది కార్యకర్తలు తీవ్రంగా గాయపడ్డారు. ప్రభుత్వం నిష్పాక్షికంగా శవపరీక్షను జరిపిస్తుందన్న నమ్మకం కోల్పోయిన ఆందోళనకారులు శవపరీక్షను ఆపడానికి ఆసుపత్రిని ధ్వంసం చేశారు. నాలుగేళ్లుగా కొనసాగుతూ, జపాన్‌లోని ఫుకుషిమా అణు విద్యుత్తు కేంద్రంలో జరిగిన అణుప్రమాదం మరింత తీవ్రతరమైన ఈ ఆందోళనకు ఇలా నమ్మకం కోల్పోవడానికి ప్రభుత్వ అమానుషత్వం గురించి తగినంత ప్రత్యక్ష అనుభవం వచ్చింది.

పెరుగుతున్న నిరసనల్ని బేఖాతరు చేస్తూ, బాధితులకు నష్టపరిహారం ఇవ్వడానికి గానీ, వారికి ఆశ్వాసన కలిగించడానికి గానీ ఎటువంటి ప్రయత్నమూ చేయకుండా, సామ్రాజ్యవాదుల నమ్మిన బంట్లయిన పర్యావరణ మంత్రి జైరాం రమేష్, మహారాష్ట్ర ప్రభుత్వమూ ఆరు రియాక్టర్లతో 'ప్రపంచంలోనే అతి పెద్ద అణు విద్యుత్తు కాంప్లెక్స్' నిర్మాణాన్ని ఆపం అని మరోసారి ప్రకటించారు. వాస్తవానికి, ఫుకుషిమా విషాదాన్ని ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం చేస్తూ 'ఏమన్నా గానీ' అణువిద్యుత్తు కేంద్రాన్ని మాత్రం నిర్మిస్తామని ప్రభుత్వం తీసుకున్న వైఖరికి వ్యతిరేకంగానే పై నిరసన పెల్లుబుకింది.

భారతదేశంలో మొదటి అణువిద్యుత్తు కేంద్రం అయిన తారాపూర్ నుండి జైతాపూర్ వరకు ఏప్రిల్ 23 నుండి 25 వరకు తలపెట్టిన దేశవ్యాప్త అణు వ్యతిరేక యాత్రలో

పాల్గొనడానికి దేశం నలుమూలల నుండి (మహారాష్ట్ర, గుజరాత్, తమిళనాడు, ఝార్ఖండ్, పశ్చిమ బెంగాల్, హర్యానా, మధ్యప్రదేశ్) వచ్చిన దాదాపు వందమంది ప్రజల్నీ, ప్రముఖ కార్యకర్తల్నీ పోలీసులు చట్టవ్యతిరేకంగా అరెస్టులు చేశారు. వాస్తవానికి ఫుకుషిమా తర్వాత కొత్తగానూ, గతంలో జరుగుతున్న ఆందోళనలకు కొనసాగింపుగానూ కూడా దేశం నలుమూలలా, ముఖ్యంగా హర్యానా, పశ్చిమ బెంగాల్, ఆంధ్రప్రదేశ్‌లలో అణు వ్యతిరేక నిరసనలు వెల్లువెత్తాయి, కానీ మన పెడచెవుల పాలకులు వాటిని వింటారనుకోగలమా ?

ఈ అణు విద్యుత్తు కాంప్లెక్స్ భూకంపాల ప్రమాదం గల జైతాపూర్ (రత్నగిరి జిల్లా, మహారాష్ట్ర)ప్రాంతంలో ఐదు గ్రామాల్లో విస్తరించి వుంటుంది. అవి మడ్‌బన్, నివేలి, మిత్‌గవనె, కరెల్, సఖరి నాటె. దీని కోసం **968** హెక్టార్ల భూమిని లాక్కుంటారు. **2,400** కుటుంబాలు దీని బారిన పడతాయి. దీని వల్ల **40,000** మంది ప్రజల జీవనాధారం దెబ్బ తింటుంది, వారిలో **16,000** మంది చేపలు పట్టి జీవించేవారు.

ఫుకుషిమా తర్వాత చాలా దేశాలు తమ అణు కార్యక్రమాల గురించి పునరాలోచిస్తుండగా, భారతదేశ ప్రభుత్వం మాత్రం ఎలాగైనా దాన్ని కొనసాగించాలని కంకణం కట్టుకుంది. భారతదేశ రియాక్టర్లను ప్రపంచంలోనే అసమర్థమైనవిగా, అత్యంత ప్రమాదకరమైనవిగా భావిస్తారనే వాస్తవాన్ని దాచి పెట్టి, కొందరు ప్రజావ్యతిరేక శాస్త్రవేత్తలు భారత రక్షణ ప్రమాణాలు జపాన్‌కంటే మెరుగైనవని పచ్చిగా బుకాయిస్తూ ప్రజల్ని తప్పు దోవ పట్టిస్తున్నారు. పర్యావరణ అనుకూల మంత్రిగా ముసుగు వేసుకున్న జైరాం రమేష్ తన అసలైన కార్పొరేట్ అనుకూల ముఖాన్ని బైటపెట్టుకుంటూ అణు విద్యుత్తు తప్ప ప్రత్యామ్నాయం లేదంటూ మన్మోహన్ సింగ్‌కు వంత పాడుతున్నాడు. ఈ పెద్దమనిషి కోట్లాది రూపాయల లంచాల్ని వెదజల్లి ఓట్లను కొనుక్కుని భారత-అమెరికా అణు ఒప్పందాన్ని ఆమోదింపజేయడానికి ఎలా పడరాని పాట్లు పడ్డాడో దేశప్రజలు ఇంకా మరిచిపోలేదు. ప్రపంచమంతా ప్రత్యామ్నాయ విద్యుచ్ఛక్తి వనరుల గురించి ఆలోచిస్తూ ప్రయోగాలు చేస్తూ వుంటే ఈయనగారు దానికి ప్రత్యామ్నాయమే లేదని బుకాయిస్తే ఆ చెత్తనంతా నమ్మేంత బడుద్దాయిలు మన దేశ ప్రజలు అని ఆయన అనుకుంటున్నాడు. మౌలికమైన విద్యుత్ అవసరాల్ని మాత్రం తీర్చాలంటే (పరిశ్రమలు, వ్యవసాయం, ప్రజల అవసరాలకు) అన్నీ సాధ్యమే అవుతాయి. కానీ నెలకు దాదాపు **71** లక్షల విద్యుత్ బిల్లును చెల్లించే ముకేష్ అంబానీలు, ఎంత విద్యుత్ గంగపాలవుతోందన్న స్పృహ లేకుండా పగలూ, రాత్రీ క్రికెట్ మ్యాచ్‌లు ఒకవైపూ, విద్యుత్ లేమి అనే కారణం వల్ల కూడా వ్యవసాయ సంక్షోభానికి బలై ప్రాణాలు తీసుకుంటున్న రైతులూ, మినుకు మినుకుమనే చిన్న బల్బు వెలిగించుకునే అవకాశం లేకుండా చీకటి బతుకులు వెళ్లదీస్తున్న లక్షలాది ప్రజానీకం మరోవైపూ వున్న మనలాంటి దేశంలో ఎవరి, ఎటువంటి విద్యుత్ అవసరాల గురించి మంత్రిగారు శెలవిస్తున్నారో వూహించడం కష్టం

కాదు. దళారీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విశాల అటవీ, గ్రామీణ ప్రాంతాల్లోని అపార సంపదను కొల్లగొట్టే గనుల తవ్వకాన్నీ, వివిధ పరిశ్రమల స్థాపననూ అనుమతించే వందలాది ఎంఓయూల్ని కార్పొరేట్ బహుళ జాతి కంపెనీలతో చేసుకున్నాయి. వీటికి బ్రహ్మాండమైన విద్యుత్ అవసరాలున్నాయి. వీటి విద్యుత్ దాహాన్ని తీర్చడానికే జైరాంలూ, మన్మోహన్‌లూ అంగలారుస్తూ పరుగులు పెడ్తూ ప్రజల నుండి పెల్లెత్తున నిరసనలు వస్తున్నా పెడచెవిన పెడ్తున్నారు. ఉద్యమకారులు లేవనెత్తుతున్న జీవితాల, జీవనాధారాల, దేశ పర్యావరణ సమస్యలు వారికేమీ కావు. వారికి తెల్సిన ఒకే ఒక పరిష్కారం వాటన్నిటినీ 'శాంతి భద్రతల సమస్య'గా చూడ్డం.

అంతే కాదు, ఫ్రాన్స్‌కు చెందిన అరెవా లాంటి కుఖ్యాత కార్పొరేషన్లు మన దళారీ పాలకులకు ఎన్ని లంచాలు మేపాయో మనకెన్నటికీ తెలీదు - మళ్లీ ఏ 'వికీ'నో లీక్ అయితే తప్ప. అణు అనుకూల దేశాలయిన అమెరికా, బ్రిటన్ వంటి దేశాలు డిజైన్ క్లియరెన్స్ ఇవ్వడానికి నిరాకరించిన ఘన చరిత్ర అరెవాది. ఇది నిర్మించ తలపెట్టిన ఇపిఆర్ (ఇవల్యూషనరీ ప్రెషరైజ్‌డ్ రియాక్టర్) ఇప్పటివరకు ప్రపంచంలో ఎక్కడా నిర్మించింది గానీ దానికి సురక్షా పరీక్షలు నిర్వహించింది గానీ లేదు. అందువల్ల అవి అత్యంత నమ్మదగని, ప్రమాదకరమైన ఎంపికే అవుతాయి. కానీ తమ సామ్రాజ్యవాద యజమానుల పాదాలు నాకే మన పాలకులు మాత్రం ఎటువంటి మానవ, పర్యావరణ హాని కలుగుతుందనే కనీసమైన స్పృహ లేకుండా వాటిని కొనడానికి పరుగులు పెడ్తున్నారు.

ఫుకుషిమా ప్రమాదం లక్షలాది ప్రజలను ప్రభావితం చేసింది, దాని ప్రమాదకరమైన అణుధార్మికత ప్రభావం పదుల వేల సంవత్సరాల వరకు వుంటుంది. స్వతంత్ర యూరోపియన్ నిపుణులు ఆ రియాక్టర్‌కు 200 కిమీల పరిధిలో రాబోయే దశాబ్దాల్లో నాలుగు లక్షలకంటే ఎక్కువమంది కాన్సర్ బారిన పడతారనీ, దీని ప్రభావం ప్రపంచం అంతా వ్యాపించిందనీ అంచనా వెలువరించారు. 25 ఏళ్ల క్రితం జరిగిన చెర్నోబిల్ ప్రమాదం తర్వాత నాలుగు లక్షలమందిని తరలించారు.మరెన్నో లక్షలాదిమంది తాము ఎప్పుడైనా కాన్సర్ బారిన పడవచ్చునీ, తమ ముని ముని మనవలు కూడా లోపాలతో పుట్టవచ్చునే నిరంతర భయాలతో బతుకులీడుస్తున్నారు. ఆలస్యంగా పొడసూపిన ఆరోగ్య ప్రభావాల వల్ల దాదాపు పది లక్షలమంది ఇప్పటికే మరణించారు, ఈ సంఖ్య పెరుగుతూనే వుంటుంది. జైతాపూర్‌లో కనుక ఏదైనా పెద్ద ప్రమాదం జరిగితే మొత్తం రత్నగిరి జిల్లాని ఖాళీ చేయాల్సి వస్తుంది. పుణే, ముంబయ్‌లు సహా పశ్చిమ మహారాష్ట్ర పదుల వేల సంవత్సరాలు అణు ధార్మిక కాలుష్యం బారిన పడుతుంది.

ఈ దుష్పరిణామాలన్నిటి గురించిన చైతన్యం కలిగిన జైతాపూర్ కొంకణ్ ప్రజలు, ముఖ్యంగా ఫుకుషిమా తర్వాత, అణు కర్మాగారానికి వ్యతిరేకంగా దృఢంగా పోరాడుతున్నారు. ప్రభుత్వం ఈ పోరాటాన్ని అణచడానికి ఒక పాశవికమైన నిర్బంధ క్యాంపెయిన్ చేపట్టింది

- లాఠీచార్జిలు, అరెస్టులు, వందలాది కార్యకర్తలపై తప్పుడు కేసులు బనాయించడం (హత్యాయత్నం కూడా ఒకటుంది!), తాజాగా పోలీసు కాల్పులు. ఆ ప్రాంతానికి చెందిన ప్రముఖ కార్యకర్తలను రత్నగిరి జిల్లాలో అడుగు పెట్టద్దని ఉత్తర్వులు, అడుగు పెడితే ప్రాణాలతో తిరిగి వెళ్లరు అని నారాయణ్ రాణేగారి బెదిరింపులు ! ఇప్పటికే బద్‌నాం అయిన పాత చింతకాయ పచ్చడి ఎత్తుగడని కూడా ప్రయోగిస్తూ 'జైతాపూర్ ఆందోళనకు నక్సలైట్లతో సంబంధాలున్నాయేమో'నని పరిశీలిస్తున్నాం అని కూడా పోలీసులు మీడియా చెవిన వేశారు. ఆందోళనకు మద్దతునిచ్చినందుకు ఈ ప్రాంతానికి చెందిన ప్రముఖ పౌరుల్ని జిల్లాలో ప్రవేశించకుండా నిషేధించారు. అయితే ఇవేవీ జైతాపూర్ ఆందోళనకారుల్ని భయపెట్టలేకపోయాయి. వివిధ జీవన్మరణ సమస్యలపై దేశవ్యాప్తంగా చెలరేగుతున్న మొక్కవోని పోరాటాల్లో ఒకటిగా జైతాపూర్ కూడా వేగంగా గుర్తింపు పొందుతోంది.

నాలుగేళ్ల ఆందోళనా కాలంలో నోరిప్పని శివసేన, నారాయణ్ రాణే పార్టీ ఫిరాయించాక కొంకణ్‌లో కోల్పోయిన ప్రాభవాన్ని తిరిగి దక్కించుకునే అవకాశాన్ని కనిపెట్టి ఈ ఆందోళనలోకి యిప్పుడు ప్రవేశించింది. ఎన్‌రాన్‌ను అరేబియా సముద్రంలోకి విసిరేస్తామని ప్రగల్భాలు పలికి అధికారంలోకి రాగానే ప్లేటు ఫిరాయించిన ఇలాంటి అవకాశవాదులు తమ న్యాయమైన పోరాటాల్ని స్వప్రయోజనాల కోసం హైజాక్ చేయడాన్ని రాజకీయంగా చైతన్యవంతులైన జైతాపూర్ ప్రజలు అనుమతించకోడదు. తనను తాను అణు ఒప్పందం సమస్యలో మొనగాడుగా చిత్రించుకున్న సిపిఎం అణువిద్యుత్తే ఏకైక ప్రత్యామ్నాయం అనే ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా సంఘటితపడ్తున్న పోరాట రంగస్థలంలో ఎక్కడా కానరావడం లేదు. ఆంధ్రప్రదేశ్‌లో టిడిపి వంటి ప్రతిపక్ష పార్టీలు విద్యుత్ ప్లాంట్ల నిర్మాణాన్ని వ్యతిరేకించే గ్రామస్తులపై కాల్పులు జరిపి వారిని చంపినప్పుడు మొసలి కన్నీరు కారుస్తున్నా దాని తొమ్మిదేళ్ల పాలనలో అది నిరూపించుకున్నట్టుగా, అధికారంలోకి వస్తే మాత్రం ఇప్పటి పాలకులకంటే భిన్నంగా ఏం ప్రవర్తించదు. అణువిద్యుత్తు కర్మాగారాలను వ్యతిరేకించే అన్ని రకాల శక్తులనూ ఐక్యం చేస్తూ విశాల ప్రాతిపదికన పోరాటాన్ని చైతన్యవంతంగా నిర్మించాల్సిన అవసరం వుంది. అయితే తమ స్వార్థ ప్రయోజనాల కోసం, ఓటుబ్యాంక్ రాజకీయాల కోసం పోరాటాన్ని అసలు సమస్య నుండి పక్కదోవ పట్టించే వివిధ రకాల కుట్రల పట్ల ప్రజలు అప్రమత్తంగా వుండాలి.

సిపిఐ (మావోయిస్టు) జైతాపూర్ అణువిద్యుత్ కాంప్లెక్స్ సహా దేశంలో ప్రతిపాదిత అణు విద్యుత్ కర్మాగారాలన్నిటినీ రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నది. తమ జీవితాల్నీ, పర్యావరణాన్నీ పరిరక్షించుకోవడానికి కొంకణ్ ప్రజలు చేస్తున్న న్యాయమైన పోరాటాన్ని అణచడానికి ప్రభుత్వం ప్రయోగిస్తున్న దౌర్జన్యాన్ని అది తీవ్రంగా ఖండిస్తోంది. ఏప్రిల్ 18 నాటి పోలీసు కాల్పులపై న్యాయవిచారణ జరపాలనీ, కాల్పులకు ఆదేశాలిచ్చిన అధికారులపై,

ఆఫీసర్లపై తక్షణం చర్య తీసుకోవాలనీ డిమాండ్ చేస్తోంది. అణు వ్యతిరేక కార్యకర్తలపై పెట్టిన తప్పుడు కేసులూ, చట్టవ్యతిరేక జిల్లా బహిష్కారాలూ, ప్రవేశంపై నిషేదాజ్ఞలు వంటివాటిని వెనక్కి తీసుకోవాలి. వాస్తవానికి, అపార సంపదలు గల కొంకణ్ తీరప్రాంతాన్ని సామ్రాజ్యవాదులకు ఎలాగైనా అమ్మి పారేయాలని చూస్తూ, తమ జీవనాధారాల్ని నాశనం చేయదల్చుకున్న నారాయణ్ రాణేల వంటివారికే తమ ప్రాంతంలో అడుగు పెట్టే అర్హత లేదు తప్ప నిస్వార్థంగా తమ కోసం పోరాడుతున్న అణు వ్యతిరేక కార్యకర్తలకు కాదు అని రత్నగిరి ప్రజలు ప్రకటించాలి.

తమకు ఎలాంటి అభివృద్ధి కావాలో, ఎటువంటి విద్యుత్ వనరులు కావాలో తేల్చుకునే హక్కు కేవలం ఈ దేశప్రజలకే వుంది తప్ప సామ్రాజ్యవాద బహుళజాతి కంపెనీలకు నమ్మిన బంట్లలా వ్యవహరించే అవినీతిపరులైన రాజకీయ నాయకులకు లేదు అని ప్రకటిద్దాం. కొంకణ్ ప్రజల సమరశీలమైన అణు విద్యుత్ వ్యతిరేక పోరాటానికి దృఢమైన మద్దతునందిస్తూ పాలకవర్గాలు బలవంతంగా ముందుకు తెస్తున్న సురక్షితం కాని, ప్రమాదకరమైన అణు విద్యుత్ ప్రత్యామ్నాయానికి వ్యతిరేకంగా దేశవ్యాప్త క్యాంపెయిన్‌ను నిర్మిద్దాం. రత్నగిరి ప్రజలు ప్రకటించినట్టుగా తబ్రేజ్‌ల త్యాగాల్ని వృధా కానివ్వకుండా ఉద్యమిద్దాం.

జల్, జంగల్, జమీన్, నిజమైన ప్రజాస్వామ్యం, ప్రగతి, స్వావలంబనల్ని కేంద్రంగా చేసుకుని నేడు వివిధ సమస్యలపై సమరశీల పోరాటాల వెల్లువ దేశం నలుమూలల్నీ ముంచెత్తుతోంది. తీవ్రమైన ప్రభుత్వ నిర్బంధం ముందు తలొంచకుండా ప్రజలు శాంతియుతంగా, సమరశీలంగా (కొన్ని పోరాటాలయితే సంవత్సరాలుగా కొనసాగుతున్నాయి) పోరాడుతున్నారు. ఈ పోరాటాలన్నీ ఒకదాని నుండి మరొకటి ఉత్తేజాన్ని కూడా పొందుతున్నాయి. ఈ పోరాటాలన్నీ ఒకదానికొకటి దృఢమైన సంఘీభావాన్ని తెలుపుతూ, అండగా నిలుస్తూ ప్రజా వ్యతిరేక విధానాల్ని అమలుపరుస్తూ, పోరాడే ప్రజల్ని అణిచేస్తున్న సామ్రాజ్యవాదుల్నీ, భారత బడా కార్పొరేట్ తిమింగలాల్నీ, భూస్వాముల్నీ ఎదిరించడానికి ఒక ఉమ్మడి వేదికపైకి రావాల్సిన ఆవశ్యకత నేటి అవసరం. పోరాడే ప్రజలందరితో కూడిన ఒక విశాలమైన, ఐక్య, మిలిటెంట్ ఉద్యమం మాత్రమే ఈ దేశాన్నీ, ప్రజల్నీ ప్రజాశత్రువులు మనల్ని తోసేయాలని కుట్ర పన్నుతున్న అఖండ దారిద్ర్యం నుండి కాపాడగలదు.

**అభయ్**

**అధికార ప్రతినిధి**

**కేంద్ర కమిటీ**

**సీపీఐ (మావోయిస్టు)**

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# కేంద్ర కమిటీ

**4-5-2011**

## యుద్ధపిపాసి, మానవ రక్తం తాగే హంతకుడు ఒబామాయే ప్రపంచ శాంతికి ముప్పుగా పరిణమించిన నెంబర్ వన్ ప్రపంచ టెర్రరిస్టు తప్ప ఒసామా కాదు!
## ప్రపంచవ్యాప్తంగా యావత్ పీడిత జాతులూ, ప్రజలే కాక అమెరికా ప్రజలు కూడా ఎదుర్కొంటున్న అతి పెద్ద ముప్పు అమెరికా సామ్రాజ్యవాదమే తప్ప అల్ కాయిదా కాదు!
## ప్రపంచ పోలీసు సిఐఎ కోవర్టు ఆపరేషన్ ద్వారా ఒసామా బిన్ లాడెన్‌ను దారుణంగా హత్య చేయడాన్ని ఖండించండి!

2011 మే 2న, పాకిస్తాన్‌లోని అబోట్టాబాద్‌లో అల్ కాయిదా నాయకుడు ఒసామా బిన్ లాడెన్ నివసిస్తున్న భవనంపై హెలికాప్టర్లతో దాడి చేసి అమెరికా సామ్రాజ్యవాదులు ఆయనను హత్య చేశారు. అమెరికా పాకిస్తాన్ సార్వభౌమత్వాన్ని తుంగలో తొక్కుతూ పాకిస్తాన్ ప్రభుత్వానికి కనీసమైన సమాచారం కూడా లేకుండా నేరుగా ఈ ఆపరేషన్‌ను కొనసాగించింది. వాళ్లు పాకిస్తాన్ రాడార్లను జామ్ చేసి, నాలుగు హెలికాప్టర్లతో దాని గగనతలంలోకి ప్రవేశించి, భవనంపై దాడి చేసి 'శస్త్రచికిత్స చేసినంత సునిశితంగా' ఈ ఆపరేషన్‌ను పూర్తి చేశారు. ఆ భవనంలోని ఒక స్త్రీ, ఇద్దరు పురుషులు కూడా మరణించగా, ఒసామా భార్య కూడా గాయపడిందన్నారు. ఈ నలభై నిమిషాల ఆపరేషన్‌లో వాళ్ల పాప కేవలం అనుకోకుండా మరణాన్ని తప్పించుకున్నట్లు తోస్తుంది. ఒబామా ప్రభుత్వ అమానుషత్వం ఏ స్థాయిలో ఉందంటే చనిపోయాక కూడా కక్షపూరిత చర్యగా ఒసామా మృతదేహాన్ని ఆయన కుటుంబ సభ్యులకు అందజేయకుండా అరేబియా సముద్రంలో పడేశారు! పుండు మీద కారం చల్లుతూ చేసిన ఈ అకృత్యం ప్రపంచవ్యాప్తంగా ముస్లింలకు ఎంత అవమానకరంగా, ఆగ్రహాన్ని కలిగించేదిగా వుంటుందో వారికి తెలిసే జరిగింది.

ఒబామా ఇకిలించుకుంటూ అల్ కాయిదా నాయకుని మరణాన్ని ప్రకటించగానే, అమెరికా ప్రభుత్వ సహా ఫాసిస్టులు - సామ్రాజ్యవాద దేశాల అధినేతలూ, మూడవ ప్రపంచంలోని వారి తొత్తు ఏలికలూ ప్రపంచవ్యాప్త టెర్రరిస్టు వ్యతిరేక యుద్ధంలో ఇది గొప్ప విజయంగా వర్ణించడానికి పోటీ పడ్డారు. భారత దళారీ పాలకవర్గాలు ఇటువంటి 'ప్రమాదకరమైన వ్యక్తి'కి తన నేల మీద ఆశ్రయం ఇచ్చినందుకు పాకిస్తాన్ మీద విసుర్లు విసరడానికి ఈ అవకాశాన్ని ఆబగా అందిపుచ్చుకున్నది. తోటి సార్క్ దేశం పైన జరిగిన ఈ ఏకపక్ష దాడిని ఖండిస్తూ ఒక్క ముక్క మాట్లాడలేదు, అసలు అమెరికా యుద్ధ యంత్రాంగానికి ఉపఖండంలో ఏం పని అనే ప్రశ్న లేదు. నిజానికి భారత దళారుల ప్రతిస్పందన ఆశ్యర్యకరమైందేమీ కాదు, ఎందుకంటే మూడో ప్రపంచ దేశాల సార్వభౌమత్వాన్ని వెయ్యిన్నారు విధాలుగా ఉల్లంఘిస్తూ సామ్రాజ్యవాదులు (ముఖ్యంగా అమెరికా, నాటో కూటములు) చేస్తున్న దురాక్రమణ యుద్ధాల్నీ, జోక్యాల్నీ వారు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో మెజారిటీగా సమర్థిస్తూ, స్వయంగా తామూ అమెరికా సామ్రాజ్యవాదులకు దాసోహం అంటున్న చరిత్ర వారిది.

ఈ సోకాల్డ్ 'టెర్రరిజంపై యుద్ధం'లో పాకిస్తాన్ 'సహకారాన్ని పొందడం' కోసం 2001లో ఆఫ్ఘనిస్తాన్‌పై నాటో దాడుల నుండి మొదలుకొని అమెరికా పాకిస్తాన్ ప్రభుత్వాన్ని నయానా భయానా లొంగదీసుకోవడం, దానిపై స్వారీ చేయడం రోజురోజుకూ పెరుగుతూ చివరికి పాకిస్తాన్ ఈ యుద్ధంలో అమెరికాకి పెరటిదొడ్డిగా తయారైంది. గత దశాబ్దంగా పాకిస్తాన్‌లో అడ్డూఆపూ లేని అమెరికా ఆంబోతు వీరంగానికి లెక్కలేనన్ని అనేక ఉదాహరణల్లో ఈ ఆపరేషన్ అన్నిటికంటే కొట్టొచ్చినట్టు కనిపించే సంఘటన మాత్రమే. పాకిస్తాన్ దళారీ పాలకుల లొంగుబాటు ఎంత సంపూర్ణంగా వుందంటే అంతర్జాతీయ రివాజుల్ని బేఖాతరు చేస్తూ ఇటువంటి అవమానకరమైన చర్య జరిగిన తర్వాత కూడా అది నిర్ద్వంద్వంగా ఈ దాడిని ఖండించడం లేదు. పాకిస్తాన్‌వ్యాప్తంగా విస్తృతమైన నిరసనలు వ్యక్తమయ్యాక గానీ అది ఈ దాడి చట్టవ్యతిరేకమైనదనీ, తనకు తెలీకుండా జరిగిందనీ వినబడీ వినబడకుండా గొణిగింది. యజమాని 'అయితే ఏంటంట, నేను నీకు క్షమాపణ చెప్పను పో' అనగానే నౌకరు నోరు మూసుకున్నాడు. పాకిస్తాన్ అమెరికా సామ్రాజ్యవాదులకు తోకూపుకుంటూ సంపూర్ణంగా దాసోహం అంటున్న చరిత్రను చూసినప్పుడు ఇది కూడా నిజానికి ఆశ్యర్యకరం కాదు. ప్రపంచ నెంబర్ వన్ టెర్రరిస్టు పగలూ రాత్రీ పాకిస్తాన్ పష్తూన్ గిరిజన ప్రాంతాలపై లెక్కలేనన్ని డ్రోన్ దాడులు చేస్తూ వందలాది పాకిస్తాన్ పౌరుల్ని (అందులో అత్యధికులు స్త్రీలూ, పిల్లలే) చంపుతున్నాడు. పాకిస్తాన్ వీధుల్లో డజన్ల కొద్దీ కాబోయే రేమండ్ డేవిస్‌లు బోర విరుచుకుని తిరుగుతూ పాకిస్తాన్ సాధారణ పౌరుల రక్తాన్ని తాగడానికి సిద్ధంగా వున్నారు. కానీ సిగ్గూ శరమూ, వెన్నెముకా లేని పాకిస్తాన్ పాలకవర్గాలు నరహంతక 'నోబెల్ శాంతి బహుమతి

గ్రహీత'కు పాకిస్తాన్ పౌరుల రక్తంతో తడిసిన ఎర్ర తివాచీల్ని పరచడానికి తొక్కిసలాడుతున్నారు.

ఒసామా బిన్ లాడెన్ నాయకత్వంలో అల్ కాయిదా చేసిందని ఆరోపిస్తున్న సెప్టెంబర్ 11 దాడుల తర్వాత నుండి అప్పటి అమెరికా అధ్యక్షుడు జార్జి బుష్ నేతృత్వంలో అమెరికా సామ్రాజ్యవాదులు ముస్లింలకు వ్యతిరేకంగా ప్రపంచవ్యాప్తంగా విషప్రచారాన్ని లంకించుకుని ఆఫ్ఘనిస్తాన్‌పై, ఇరాక్‌పై దురాక్రమణ యుద్ధాలకు పాల్పడ్డారు. లక్షలాది సామాన్య ప్రజానీకం ఈ అన్యాయ యుద్ధాల్లో ప్రాణాల్నీ, శరీరాంగాల్నీ కోల్పోయారు మహిళలూ, పిల్లలూ ఎదుర్కొన్న దారుణాలకు అంతే లేదు. టెర్రరిజంపై యుద్ధం పేరుతో ప్రపంచవ్యాప్తంగా ముస్లింలను టార్గెట్ చేస్తూ వారిని అంతులేని అకృత్యాలకు బలి చేశారు. అల్ కాయిదాను 'టెర్రరిజానికి' ప్రతీకగా మార్చేసి, ఒసామాని అమెరికాకీ, ప్రపంచానికీ నెంబర్ వన్ శత్రువుగా చిత్రీకరించి ఆయన్ని భూతద్దంలో చూపించసాగారు. ముస్లింలపై చేసే దారుణాలన్నిటినీ సమర్థించుకునే ప్రయత్నంలో భాగంగా ప్రతి టెర్రరిస్టు దాడి వెనకాల వున్న బూచిగా అల్ కాయిదాని అనేకరెట్లు పెంచేసి ప్రచారం చేశారు. ఒసామా కోసం, ఇతర అల్ కాయిదా నాయకుల కోసం మానవవేటను ఆరంభించి లక్షలకొలది డాలర్లను కుమ్మరించారు. ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్‌లలో తోలుబొమ్మ ప్రభుత్వాలను స్థాపించారు పాకిస్తాన్ అయితే దాదాపు ఒక వలసదేశాన్ని పోలి ఉంది. టెర్రరిజంపై యుద్ధ రథచక్రాలు ముస్లిం జనాభాని లక్షల్లో తన ఇనుప పాదాల కింద తొక్కేస్తూ తన బీభత్సయాత్ర కొనసాగిస్తూనే ఉంది.

ఒక సంస్థ పుట్టడానికి గల మూలకారణాల్ని నిర్మూలించకుండా - ఈ సందర్భంలో అవి సామ్రాజ్యవాద దోపిడీ, అణచివేత, జోక్యం, అవమానం - కేవలం ఒక నాయకుడ్ని చంపడం ద్వారా ఏ సంస్థనూ అంతం చేయలేరనేది చరిత్రలో పదేపదే రుజువైన సత్యం. సామ్రాజ్యవాదుల పట్ల, ప్రత్యేకించి అమెరికా సామ్రాజ్యవాదుల పట్లా, జియోనిస్టు ఇజ్రాయిల్ పట్లా ముస్లిం ప్రజలలో వున్న తీవ్ర క్రోధం, అసంతృప్తి అనేక రూపాల్లో వ్యక్తీకరణ పొందుతోంది, అల్ కాయిదా కూడా వాటిలో ఒకటి. అరబ్ ప్రపంచంలోని వెల్లువలు ఈ ఆగ్రహానికి మరొక వ్యక్తీకరణ - అవి తమ దేశ నియంతలకూ, సామ్రాజ్యవాదానికీ రెంటికీ వ్యతిరేకంగా వెల్లువెత్తినవి. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా చేసే పోరాటంలో అల్ కాయిదా వంటి సంస్థలు ఎంచుకునే కొన్ని పద్ధతులు సామాన్య పౌరులకు హాని కలిగిస్తున్నాయి అమాయకుల ప్రాణాలను బలిగొన్నప్పుడు అవి ఖండించతగినవే. కానీ వాటిని మనం సందర్భం నుండి విడదీసి అమెరికా ప్రభుత్వం తన పౌరులు నమ్మాలని కోరుకుంటున్నట్టుగా ఎవరో కొందరు మతిలేనివారు 'అమెరికాపై అకారణ ద్వేషం'తో చేసే దాడులుగా చూడకోడదు. సామ్రాజ్యవాద జోక్యాలూ, దురాక్రమణ యుద్ధాలూ లేకుంటే అల్ కాయిదాలూ వుండవు. బుష్, ఒబామాల వంటి నరహంతకులు లేకుంటే ఒసామాలూ వుండరు.

అమెరికా సామ్రాజ్యవాదుల చేతుల్లో ఒసామా బిన్ లాదెన్ దారుణ హత్యను ఖండించవలసిందిగా సిపిఐ (మావోయిస్టు) ప్రపంచ ప్రజలను కోరుతోంది. 'టెర్రరిజంపై యుద్ధం' పేరుతో ముస్లిం ప్రజానీకంపై చేస్తున్న అన్ని రకాల దాడుల్నీ తక్షణం నిలిపివేయాలని డిమాండ్ చేస్తోంది.

ప్రపంచంలోని అన్ని రకాల దోపిడీ, పీడనల్ని సమూలంగా నిర్మూలించగలిగే ఏకైక సిద్ధాంతం మార్క్సిజం-లెనినిజం-మావోయిజమేనని సిపిఐ (మావోయిస్టు) మరోసారి దృఢంగా ప్రకటిస్తోంది. కార్మికవర్గమూ, దానికి ప్రాతినిధ్యం వహించే కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో మాత్రమే నియంతల, 'ప్రజాస్వామ్యాలు'గా పిలవబడే బూర్జువా నియంతృత్వాల, సామ్రాజ్యవాదుల పదఘట్టనల కింద నలిగిపోతున్న పీడిత జాతులూ, ప్రజలూ సంపూర్ణ విముక్తిని సాధించగల్గుతారు. అల్ కాయిదా గానీ, దానిలాంటి ఇతర సంస్థలుగానీ ఎన్ని చర్యలు చేసినా అవి సామ్రాజ్యవాద దురాక్రమణల నుండి, వారి జోక్యం నుండి వారికి స్వాతంత్ర్యాన్ని, సార్వభౌమత్వాన్నీ సాధించలేవు. పాలస్తీనా ప్రజల పోరాటం సహా అరబ్ ప్రపంచం వెల్లువలూ, ఆ సంస్థల మొక్కవోని పోరాటం, త్యాగాలూ సామ్రాజ్యవాదం, భూస్వామ్యం, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ విధానాలకు వ్యతిరేకంగా ప్రజాయుద్ధాలుగా సంఘటితం కాకుండా గమ్యాన్ని చేరుకోలేవు.

ప్రపంచవ్యాప్తంగా ముస్లిం ప్రజానీకాన్ని టార్గెట్ చేస్తూ సామ్రాజ్యవాదులు, ప్రత్యేకించి అమెరికా సామ్రాజ్యవాదులు అన్యాయంగా ఎక్కుపెట్టిన సోకాల్డ్ టెర్రరిజంపై యుద్ధాన్ని ఐక్యంగా తిప్పి కొట్టాలని ప్రపంచ పీడిత జాతులకూ, ప్రజలకూ సిపిఐ (మావోయిస్టు) పిలుపునిస్తోంది. తమ పాలకులు మూడవ ప్రపంచ దేశాల్లో అమలు చేస్తున్న పాశవికమైన సామ్రాజ్యవాద విధానాలే అమెరికా ప్రజల ప్రాణాలకు ముప్పు ఏర్పడుతోంది తప్ప టెర్రరిస్టుల వల్ల కాదు అనీ, తమ సంక్షేమానికి హాని కలిగిస్తూ, తమను నిరుద్యోగులుగా మారుస్తూ పదే పదే వచ్చే ఆర్థిక సంక్షోభాలు పెట్టుబడిదారీ ఆర్థిక విధానాల ఫలితం తప్ప వలస వచ్చిన ప్రజలు దానికి కారణం కాదు అనీ గుర్తించాలని మేం వారికి విజ్ఞప్తి చేస్తున్నాం. అమెరికా ప్రజానీకం తమ గళాల్ని విప్పి ఉమ్మడి శత్రువుపై వాడి ఇంటి ముంగిట్లోనే పోరాటానికి దిగాలని మేం విజ్ఞప్తి చేస్తున్నాం. మీ దేశ పాలకులు అణచివేస్తున్న ప్రజల న్యాయమైన పోరాటాలకు మద్దతుగా నిలవడం మీ విముక్తికి కూడా బాటలు వేస్తుంది. గుత్త పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరేకంగా అమెరికా సహా అన్ని సామ్రాజ్యవాద దేశాలలోని కార్మికవర్గమూ, ప్రజలూ చేసే పోరాటాలూ, మూడో ప్రపంచ దేశాల పీడిత జాతులూ, ప్రజానీకం చేసే పోరాటాలూ ఐక్యమై మన ఉమ్మడి శత్రువును ముంచెత్తే బ్రహ్మాండమైన తుఫానుగా మారుతాయని మేం హృదయపూర్వకంగా ఆశిస్తున్నాం.

ఆఫ్ఘనిస్తాన్‌లోనూ, పాకిస్తాన్‌లోనూ అమెరికా నాయకత్వంలోని నాటో బలగాలు చేస్తున్న దారుణాలకు వ్యతిరేకంగా గొంతెత్తాలనీ, అక్కడి నుండి వాటి తక్షణ ఉపసంహరణను డిమాండ్ చేయాలనీ సిపిఐ (మావోయిస్టు) ప్రత్యేకించి దక్షిణాసియా ప్రజలకు పిలుపునిస్తోంది. తమ నేలపై అమెరికా సామ్రాజ్యవాదుల చేస్తున్న దాడులకు వ్యతిరేకంగా, సామ్రాజ్యవాద ఒత్తిడి, జోక్యాల నుండి స్వాతంత్రం కోసం పోరాడుతున్న పాకిస్తాన్ ప్రజలకు మద్దతునివ్వండి.

అమెరికా సామ్రాజ్యవాదమే ప్రపంచ శాంతికీ, మూడో ప్రపంచ దేశాల సార్వభౌమత్వానికీ, వాటి ప్రగతికీ ముప్పుగా వున్న ప్రపంచ ప్రజల నెంబర్ వన్ శత్రువు అని గుర్తిద్దాం. దోపిడీ, పీడనలు నుండి విముక్తి పొంది ఆత్మగౌరవంతో, సగర్వంగా తలెత్తి జీవించే రోజుల కోసం సామ్రాజ్యవాదులకూ, మన దేశాల్లోని వారి దళారులకూ వ్యతిరేకంగా పోరాడుదాం.

**అభయ్**
**అధికార ప్రతినిధి**
**కేంద్ర కమిటీ**
**సీపీఐ (మావోయిస్టు)**

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# కేంద్ర కమిటీ

**11-5-2011**

## బీహార్‌లో పోలీసులు అరెస్టు చేసిన మావోయిస్టు నాయకుల్ని బేషరతుగా విడుదల చేయాలి!

## సీపీఐ (మావోయిస్టు) కేంద్రకమిటీ నాయకుల అరెస్టులకూ, దేశ పాలక ముఠా ప్రజలపై సాగిస్తున్న అన్యాయమైన యుద్ధానికీ, అందులో భాగంగానే ఉత్తరప్రదేశ్ రైతులపై సాగిస్తున్న అణచివేతకు వ్యతిరేకంగా మే 21-22 తేదీలలో 'భారత్ బంద్'ను విజయవంతం చేయండి!

ఏప్రిల్ 29న బీహార్‌లోని కటిహార్ జిల్లాలోని బార్‌సోయి గ్రామంలో కేంద్ర ఇంటలిజెన్స్ సంస్థలు, ఆంధ్రప్రదేశ్, బీహార్, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాల ఇంటలిజెన్స్ సంస్థలు పథకం ప్రకారం దాడి చేసి మా పార్టీకి చెందిన ముగ్గురు సీసీ సభ్యులతో సహా మొత్తం ఏడుగురిని అరెస్టు చేశారు. అరెస్టయిన కామ్రేడ్స్‌లో కేంద్రకమిటీ సభ్యులైన పులేందు శేఖర్ ముఖర్జీ ఎలియాస్ సాహెబ్ దా, వారణాసి సుబ్రహ్మణ్యం ఎలియాస్ విమల్ ఎలియాస్ శ్రీకాంత్, విజయ్ కుమార్ ఆర్య ఎలియాస్ జస్‌పాల్‌జీ సహా బీహార్-ఝార్ఖండ్ స్పెషల్ ఏరియా పరిధిలోని ఉత్తర బీహార్-ఉత్తర ప్రదేశ్ రీజియనల్ బ్యూరో కార్యదర్శి అభిమన్యు ఎలియాస్ ఉమేష్ యాదవ్, నోఖేలాల్ చౌధరి, శ్యాంజీ రుషి, ఇంటి యజమాని అనిరుద్ధ్ రవిదాస్‌లు వున్నారు. విప్లవకారుల్ని వెంటాడి హతమార్చడంలో కుఖ్యాతి గాంచిన ఏపీఎస్ఐబీ కామ్రేడ్ సుబ్రహ్మణ్యంను గత కొన్ని నెలలుగా వెంటాడుతున్నది. గత సంవత్సరం జూలై ఆఖరులో ఆయన వాళ్ల దాడి నుండి త్రుటిలో తప్పుకున్నాడు. ఈ కామ్రేడ్స్ ఒక సమావేశం కోసం కలుసుకున్న సందర్భంలో కేంద్ర-రాష్ట్రాల ఇంటలిజెన్స్ సంస్థలు అందజేసిన పక్కా సమాచారంతో బీహార్ ఎస్‌టిఎఫ్ అధికారులు వాళ్లను అరెస్టు చేశారు.

పార్టీలో సాహెబ్‌దా, గగన్ దా, ఆకాశ్ దా అనే పేర్లతో పిలవబడే 67 సంవత్సరాల సీనియర్ మావోయిస్టు నేత కామ్రేడ్ పులేందు శేఖర్ ముఖర్జీ దాదాపు గత 45 ఏళ్లుగా విప్లవోద్యమానికి నాయకత్వం వహిస్తున్నాడు. కలకత్తా నగరంలో పుట్టిన సాహెబ్‌దా నక్సల్బరీ వుద్యమ ప్రేరణతో వున్నత విద్యను వదిలేసి విప్లవ పోరాటంలోకి దూకి ప్రజాయుద్ధ పురోగమనం

కోసం తన సర్వస్వాన్ని ధారపోశాడు. తన సుదీర్ఘ విప్లవ జీవితంలో ఆయన బెంగాల్ సహా దేశంలోని వివిధ ప్రాంతాల్లో విప్లవోద్యమ నిర్మాణం కోసం, నిజమైన విప్లవకారుల, కమ్యూనిస్టు సంస్థల ఐక్యత కోసం గణనీయంగా కృషి చేశాడు. ఆస్థమా, అల్సర్ తదితర వ్యాధులతో తీవ్రంగా బాధపడుతూనే ఆయన కర్తవ్య నిర్వహణలో పాలు పంచుకుంటూ వున్నాడు.

విమల్ అనే పేరుతో ఆంధ్రప్రదేశ్ విప్లవ శ్రేణుల్లో, శ్రీకాంత్ పేరుతో దేశవ్యాప్తంగా పార్టీ శ్రేణుల్లో సుపరిచితుడైన కామ్రేడ్ వారణాసి సుబ్రహ్మణ్యం విశాఖపట్నంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయంలో వున్నత విద్యను పూర్తి చేసి విప్లవ కార్యకలాపాల్లోకి ప్రవేశించాడు. **1970**వ దశకంలో రాడికల్ విద్యార్థి సంఘానికీ, తదనంతరం రాడికల్ యువజన సంఘం, సింగరేణి కార్మిక సమాఖ్యలకూ ఆయన నాయకత్వం వహించాడు. పార్టీ పిలుపుపై ఉత్తర భారతానికి తరలివెళ్లి ఆయన అక్కడ అనేక రాష్ట్రాల్లో విప్లవోద్యమ నిర్మాణానికి ఎనలేని కృషి చేశాడు. తీవ్ర అనారోగ్యాన్ని లెక్కచేయకుండా వివిధ స్థాయిల్లో, వివిధ రంగాల్లో ఆయన నిర్విరామంగా కృషి చేశాడు.

విజయ్ కుమార్ ఆర్యగా బీహార్ ప్రజానీకానికి సుపరిచితుడైన కామ్రేడ్ జస్‌పాల్‌జీ రైతాంగంలోనూ, సాంస్కృతిక రంగంలోనూ నాయకత్వం వహిస్తూ విప్లవోద్యమంలో కీలక పాత్ర పోషించిన కామ్రేడ్. గత మూడు దశాబ్దాలకు పైగా వివిధ రంగాల్లో, వివిధ ప్రాంతాల్లో ఆయన విప్లవ కార్యకలాపాలకు నాయకత్వం వహిస్తూ, ప్రజాందోళనలు నిర్మిస్తూ వచ్చాడు.

హద్దుల్లేని క్రూరత్వానికి పేరుమోసిన సీఐఏ, మొస్సాద్ వంటి విదేశీ ఇంటలిజెన్స్ సంస్థల నుండి శిక్షణ పొందిన భారత ఇంటలిజెన్స్ అధికారులు విప్లవోద్యమానికి సుదీర్ఘకాలంగా నాయకత్వం వహిస్తున్న కామ్రేడ్స్‌ను టార్గెట్ చేసి వెంటాడి, వేటాడి పట్టుకుంటున్నారు. నిజానికి అమెరికాకు చెందిన సీఐఏ, ఎఫ్‌బీఐలే మన దేశంలోని ఇంటలిజెన్స్ సంస్థల్ని నడిపిస్తున్నాయి. గత రెండేళ్ల కాలంలో పట్టుబడిన అగ్రనేతలలో కామ్రేడ్స్ పటేల్ సుధాకర్, శాఖమూరి అప్పారావు, ఆజాద్‌లను ఇంటలిజెన్స్ సంస్థలు హత్య గావించాయి. మరి కొందరు కేంద్ర, రాష్ట్ర స్థాయి నాయకత్వ కామ్రేడ్స్‌ను అరెస్టు చేసి జైళ్లల్లో నిర్బంధించాయి. వీళ్లను వేర్వేరు రాష్ట్రాల్లో బూటకపు కేసుల్లో ఇరికించి సుదీర్ఘ కాలం పాటు ఎలాంటి బెయిల్ ఇవ్వకుండా జైళ్లల్లో మగ్గేలా చేస్తున్నారు. తప్పుడు సాక్ష్యాలు చెప్పించి కఠిన శిక్షలు, జీవితఖైదు విధిస్తున్నారు. వివిధ రాష్ట్రాల్లోని జైళ్లల్లో బందీలుగా వున్న మహిళా నేతలను, కార్యకర్తలను మరింత అమానవీయ శారీరక, మానసిక హింసలకు గురి చేస్తున్నారు. జైళ్లల్లో తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న కామ్రేడ్స్ సుశీల్ రాయ్, షీలా దీదీ, నారాయణ్ సాన్యాల్, కోబాడ్ గాంధీ, అమితాబ్ బాగ్చీ తదితర కామ్రేడ్స్‌కు వైద్య సహాయం అందకుండా చేస్తూ వేధిస్తున్నారు.

ప్రపంచ ఆర్థికవ్యవస్థ ఎదుర్కొంటున్న తీవ్ర సంక్షోభం నుండి బైటపడడం కోసం సామ్రాజ్యవాదులు వెనుకబడిన దేశాలపై వనరుల దోపిడీని తీవ్రతరం చేస్తున్నారు. తమ ప్రయోజనాలకు ఆటంకంగా భావించిన దేశాలపై బెదిరింపులకు పాల్పడుతున్నారు. వినకుంటే ఏకంగా బాంబులు కురిపిస్తూ అన్యాయమైన యుద్ధాలు చేస్తున్నారు. భారత భూస్వామ్య,

దళారీ పెట్టుబడిదారీ పాలకవర్గాలు దేశంపై సంక్షోభ ప్రభావం ఏమీ లేదని ఒకవైపు బుకాయిస్తూనే రోజురోజుకూ మరింతగా సంక్షోభపు లోతుల్లోకి కూరుకుపోతున్నాయి. సామ్రాజ్యవాద దోపిడీకి తలుపులు బార్లా తెరుస్తూ నయా వుదార విధానాల్ని బరితెగించి అమలు చేస్తున్నాయి. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో బహుళజాతి కంపెనీలతో లక్షల కోట్ల రూపాయల ఎంఓయూలు చేసుకొని దేశంలోని సహజ సంపదలన్నీ తెగనమ్ముతున్నాయి. ఎస్‌ఈజెడ్‌లు, పరమాణు విద్యుత్ రియాక్టర్ల స్థాపన, థర్మల్ విద్యుత్ ప్రాజెక్టులు, భారీ డ్యాంలు, ఎక్స్‌ప్రెస్ హైవేలు, అభయారణ్యాలు వంటి పథకాలతో ప్రజల నుండి బలవంతంగా భూముల్ని లాక్కుంటున్నాయి. అడవుల్నీ, నీటినీ, భూముల్నీ, మొత్తంగా పర్యావణాన్నీ వినాశనం గావిస్తూ ప్రజల్ని, ముఖ్యంగా ఆదివాసుల్ని నిలువనీడ లేకుండా చేస్తున్నాయి. ఈ విధానాల చాటునే మంత్రులు, ముఖ్యమంత్రులు, బడా అధికార్లు పెద్ద ఎత్తున అవినీతి కుంభకోణాలకు పాల్పడుతూ లక్షల కోట్ల రూపాయల్ని దిగమింగుతున్నారు. ఇలా పోగు చేసుకున్న నల్లధనాన్ని స్విస్ బ్యాంకుల్లో దాచి పెడుతున్నారు. కార్మికుల, రైతుల, వుద్యోగుల, మధ్యతరగతి ప్రజల బతుకుల్ని దుర్భరం చేస్తున్నారు. ఒకవైపు టాటాలు, బిర్లాలు, అంబానీలు, జిందల్‌లు, మిత్తల్‌లు, మహేంద్రలు, రూయియాలు, నికో జైస్వాల్, సన్ నెట్‌వర్క్‌లు తమ ఆస్తుల్ని వేల, లక్షల కోట్లల్లో పెంచుకుంటుండగా దేశంలోని 77 శాతం మంది ప్రజలు రోజుకు 20 రూపాయలైనా సంపాదించలేక ఆకలితో అలమటిస్తున్నారు. ఆకలిచావులు, అధికధరలు, నిరుద్యోగం, విస్థాపన, రోగాలు, పోషకారలోపం వంటి సమస్యల సుడిగుండంలో దేశ ప్రజానీకం కొట్టుమిట్టాడుతున్నారు. దీనిని ప్రశ్నించే, దీనికి వ్యతిరేకంగా వుద్యమించే ప్రజల్ని ఉక్కుపాదంతో పాలకులు అణిచివెయ్యడానికి లక్షలాది పోలీసు, పారామిలిటరీ బలగాల్ని ప్రయోగిస్తున్నారు. పౌర, ప్రజాస్వామిక హక్కుల్ని నేలరాస్తూ నల్లచట్టాల్ని రూపొందిస్తున్నారు. లక్షల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని నీళ్లలా ఖర్చు చేసి ప్రజల్ని అణచివేసే యంత్రాంగం కోరల్ని పదునుదేరుస్తున్నారు.

దోపిడీ పాలకవర్గాల పట్ల ప్రజల్లో కట్టలు తెంచుకుంటున్న అసంతృప్తి, అవేశాలు మావోయిస్టు వుద్యమం బలోపేతం కావడానికి వుపయోగపడుతున్నాయనే వాస్తవాన్ని గుర్తించిన పాలకవర్గాలు ఒక పథకం ప్రకారమే 'మావోయిస్టు వుద్యమం దేశ అంతర్గత భద్రతకు అతి పెద్ద ప్రమాదమ'ని ప్రచారం మొదలుపెట్టాయి. మావోయిస్టు వుద్యమాన్ని హింసావాదంగా, మావోయిస్టు పార్టీని టెర్రరిస్టు సంస్థగా చిత్రీకరిస్తూ పెద్ద ఎత్తున దుష్ప్రచారం చేస్తున్నాయి. తమ సామ్రాజ్యవాద-అనుకూల విధానాల కొనసాగింపుకు, అందులో భాగంగా వనరుల దోపిడీకి అతి పెద్ద అడ్డంకిగా భావిస్తున్న మావోయిస్టు పార్టీని సమూలంగా నిర్మూలించే లక్ష్యంతో ముఖ్యంగా గత రెండేళ్లుగా 'ఆపరేషన్ గ్రీన్‌హంట్' పేరుతో అత్యంత పాశవిక ఫాసిస్టు దాడిని ప్రారంభించాయి. మావోయిస్టు వుద్యమ ప్రాంతాల్లో వివిధ స్థాయిల్లో పెంపొందుతున్న ప్రత్యామ్నాయ ప్రజా రాజ్యవ్యవస్థను నాశనం చేసే లక్ష్యం కూడా కలిగిన ఈ దాడిని జనవరి 2011 నుండి మరింత తీవ్రతరం చేసి దీనిని 'ఆపరేషన్ గ్రీన్ హంట్-2'గా

పేర్కొంటున్నారు. ఇందులో భాగంగా వుద్యమ ప్రాంతాల్లో పోలీసు, పారామిలిటరీ బలగాలు, ప్రత్యేక బలగాలు ఇవి తయారు చేసిన విప్లవ ప్రతీఘాతుక గూండా మూకలు బూటకపు ఎన్‌కౌంటర్లు, విచ్చలవిడి హత్యలు, గ్రామదహనాలు, లూటీలు, మహిళలపై అత్యాచారాలు, అరెస్టులు, చిత్రహింసల పరంపరను తీవ్రతరం చేశాయి. ఛత్తీస్‌గఢ్‌లో సైన్యాన్ని మోహరించడానికి పూర్తి సన్నాహాలు చేస్తూ మాడ్ ప్రాంతంలో 800 చదరపు కిలోమీటర్ల భూమిని స్వాధీనం చేసుకోబోతున్నారు. మాడ్ ప్రాంతంలోనూ, ఛత్తీస్‌గఢ్-ఒడిషా సరిహద్దులోనూ రెండు సైనిక శిక్షణా కేంద్రాలను స్థాపించబోతున్నారు. వాయుసైనిక బేస్ నిర్మాణం కోసం కూడా సన్నాహాలు చేయడంతో పాటు 'ఆత్మరక్షణ' పేరుతో వాయుసైన్యానికి దాడులు చేసే అధికారం కూడా ఇచ్చారు.

దండకారణ్యం (ఛత్తీస్‌గఢ్) లోని చింతల్‌నార్ ప్రాంతంలో మార్చ్ 11 నుండి 16 మధ్యలో 350 మంది కోబ్రా కమాండోలు, కోయ కమాండోలు, వందలాది ఎస్‌టిఎఫ్ బలగాలు మొర్‌పల్లి, తిమ్మాపురం, తాడిమెట్ల గ్రామాల్లో విచ్చలవిడి విధ్వంసకాండ సాగించి 300 ఇండ్లు కాలబెట్టారు. వేల క్వింటాళ్ల ధాన్యం తగులబెట్టారు. ఇంటింటినీ దోచుకున్నారు. ముగ్గురు గ్రామీణులను కాల్చిచంపారు. ఇద్దరిని మాయం చేశారు. ఐదుగురు మహిళలపై అత్యాచారం చేసి దాదాపు 50 మంది గ్రామస్తుల్ని తీవ్రంగా హింసించారు. దీనిపై విచారణ కోసం వెళ్లిన ప్రజాస్వామికవాదులపై, రిపోర్టింగ్ కోసం వెళ్లిన మీడియా ప్రతినిధులపై, బాధితులకు సహాయ సామగ్రిని తీసుకెళ్తున్న సామాజిక కార్యకర్తలపై ఫాసిస్టు ముఖ్యమంత్రి రమన్‌సింగ్, పాలకవర్గాల కావలికుక్కలైన డిజిపి విశ్వరంజన్, బస్తర్ ఐజి లాంగ్‌కుమేర్, దంతెవాడ ఎస్‌ఎస్‌పి కల్లూరిలు కుట్రపన్ని సల్వాజుడుం గూండాలతో దాడులు చేయించి వాళ్లను ఆ ప్రాంతానికి వెళ్లకుండా అడ్డుకున్నారు. ఈ సంఘటనలపై రాష్ట్రంలోనూ, దేశంలోనూ బాగా ప్రచారం జరిగిన నేపథ్యంలో తప్పనిసరై రమన్‌సింగ్ తాడిమెట్ల గ్రామాన్ని పర్యటించాడు. ఆ సందర్భంగా ఒక వైపు ముఖ్యమంత్రి సభ జరుగుతుండగానే అదే గ్రామంలో మరో మూలన కోయ కమాండోలు మరో 15 ఇండ్లల్లో లూటీకి పాల్పడి కొందరిని కొట్టి ఒక మహిళపై అత్యాచారం చేశారంటే ఛత్తీస్‌గఢ్‌లో ఫాసిస్టు బీభత్సకాండ ఏ స్థాయిలో పేట్రేగిపోతున్నదో అర్థం చేసుకోవచ్చు. ఈ తరహా దాడుల్ని బస్తర్ ప్రాంతంతో పాటు మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో కూడా నిత్యం కొనసాగిస్తూనే వున్నారు. అంతే కాకుండా ఈ ప్రాంతాల్లో రహస్య హంతక ముఠాల్ని ఎగదోసి ప్రజా సంఘాల కార్యకర్తల్ని, పార్టీ కార్యకర్తల్ని హత్య చేయిస్తున్నారు. మహిళా కార్యకర్తలపై అత్యాచారాలూ, దాడులూ ప్రత్యేకించి చేయిస్తున్నారు. ఏప్రిల్ 19న నారాయణ్‌పూర్ జిల్లాలోని చినారీ గ్రామంలో 14 ఏళ్ల బాలుడు రజ్జును కాల్చి చంపి ఎన్‌కౌంటర్ కథల్లారు. ఇవి దండకారణ్యంలో రోజువారీగా జరుగుతున్న తీవ్ర నిర్బంధకాండలో కొన్ని తాజా వుదాహరణలు మాత్రమే.

మార్చ్ 14న బీహార్‌లోని తూర్పు చంపారణ్ జిల్లాలో పోలీసులు ముగ్గురు మహిళలతో సహా ఆరుగురు మావోయిస్టు కార్యకర్తల్ని కాల్చి చంపారు. మరి కొందరిని అరెస్టు చేశారు.

ఝార్ఖండ్ ప్రభుత్వం మావోయిస్టు నేతల్ని హతమార్చే లక్ష్యంతో వేలాది సంఖ్యలో పోలీసు, పారామిలిటరీ బలగాల్ని దించి దాడులకు పాల్పడుతున్నది. విచ్చలవిడి అరెస్టుల్ని కొనసాగిస్తున్నది. విస్థాపన, భూముల బలవంతపు స్వాధీనానికి వ్యతిరేకంగా వుద్యమిస్తున్న ప్రజలపై ఫాసిస్టు దాడులు చేస్తున్నది. ఒడిశాలో దళారీ నవీన్ పట్నాయక్ ప్రభుత్వం రాష్ట్రం నలుమూలలా బూటకపు ఎన్‌కౌంటర్లు సాగించి గత **4** నెలల్లోనే **25** మందికి పైగా మావోయిస్టు కార్యకర్తల్ని, గనుల తవ్వకాల్ని వ్యతిరేకించే కార్యకర్తల్ని, సాధారణ ప్రజల్ని కాల్చి చంపింది. వీరిలో **12** ఏళ్ల బాలిక జాంగ, మరి కొందరు టీనేజ్ బాలికలు వున్నారంటే పట్నాయక్ సాగిస్తున్న ఫాసిస్టు దమనకాండను అర్థం చేసుకోవచ్చు.

గత **34** ఏళ్లుగా సాగించిన ఫాసిస్టు పాలనను ఎలాగైనా నిలబెట్టుకోవాలనే లక్ష్యంతో పశ్చిమ బెంగాల్ సీపీఎం ప్రభుత్వం ఎన్నికలకు ముందుగా ప్రజలపై, మావోయిస్టులపై దాడిని తీవ్రతరం చేసింది. పోలీసు, పారామిలిటరీ బలగాలతో, తన గుండా మూకలైన హర్మద్ బాహినితో అది హత్యాకాండలకు, అత్యంత దారుణ కృత్యాలకు పాల్పడుతున్నది. నెతాయి హత్యాకాండ, శశధర్ మహతో హత్య వంటివి కొన్ని తాజా వుదాహరణలు మాత్రమే. అరెస్టయిన మావోయిస్టు నాయకులపై, ముఖ్యంగా మహిళలపై అది అమానవీయమైన హింసకు పాల్పడుతున్నది. ఇటీవల మేదినీపూర్ జైలులో సమ్మెకు దిగిన రాజకీయ ఖైదీలపై అది పోలీసు బలగాల్ని వుసిగొల్పి దారుణంగా దాడి చేయించింది. రాష్ట్రంలో మావోయిస్టు వుద్యమాన్ని తుడిచిపెట్టామని గొప్పలు చెప్పుకునే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తన పోలీసు బలగాల్ని పెద్ద ఎత్తున పెంచుతూనే వున్నది. మావోయిస్టు వుద్యమ నేతల్ని వెంటాడి వేటాడే ఫాసిస్టు విధానాల్ని వుధృతం చేసింది. ప్రత్యేక తెలంగాణా రాష్ట్రం కోసం వుద్యమిస్తున్న ప్రజలను అణిచివేస్తున్నది. హంతక ముఠాలతో హత్యలు చేయిస్తున్నది. మహారాష్ట్ర ప్రభుత్వం ఆదివాసీ వుద్యమ ప్రాంతాల్లో సీ-**60** కమాండోలతో దమనకాండను యదావిధిగా కొనసాగిస్తోంది. పట్టణాల్లో మావోయిస్టు నేతలను, ప్రజాస్వామిక వాదుల్ని అరెస్టు చేసి బూటకపు కేసుల్లో ఇరికిస్తున్నది.

ఈ ఫాసిస్టు దాడి కేవలం మావోయిస్టు వుద్యమంపైననే సాగడం లేదు. దోపిడీ పాలకవర్గాలు ప్రతి ప్రజాస్వామిక వుద్యమంపైనా ఫాసిస్టు అణచివేతనే అమలు చేస్తున్నారు. గత నెల **18**వ తేదీన మహారాష్ట్రలోని జైతాపూర్‌లో అణు విద్యుత్ కేంద్రం స్థాపనకు వ్యతిరేకంగా వుద్యమిస్తున్న ప్రజలపై పోలీసులు కాల్పులు జరిపి ఒక తబ్‌రేజ్ అనే ప్రదర్శనకారుడిని పొట్టన పెట్టుకున్నారు. కాగా తాజాగా ఉత్తర ప్రదేశ్‌లో గ్రేటర్ నోయిడా నుండి ఆగ్రా వరకు నిర్మిస్తున్న ఎక్స్‌ప్రెస్ హైవే కోసం తమ భూముల్ని ఇవ్వమని వుద్యమిస్తున్న రైతాంగంపై పోలీసు బలగాలు పాశవిక నిర్బంధాన్ని అమలు చేస్తున్నాయి. పోలీసుల లాఠీచార్జ్‌లో, కాల్పులలో ఎందరో గాయపడ్డారు. కనీసం ఇద్దరు రైతులు చనిపోయారు. పోలీసుల జులుంను భట్టా పరసౌల్, దాని పరిసర గ్రామాల ప్రజలు వీరోచితంగా ప్రతిఘటించారు. అందులో ఇద్దరు పోలీసులు చనిపోగా మరి కొందరు పోలీసులు, అధికారులు గాయపడ్డారు. మరుసటి రోజు

ఆగ్రా, అలీగఢ్ ప్రాంతాల్లో కూడా ప్రజలు వుద్యమాన్ని తీవ్రతరం చేశారు. పోలీసు జులుంను ఎదిరించారు. దీన్ని సాకుగా చేసుకొని ఫాసిస్టు మాయావతి ప్రభుత్వం ఉత్తర ప్రదేశ్ రైతాంగంపై తీవ్ర అణచివేతను ప్రయోగిస్తున్నది. గ్రామాల్ని దిగ్బంధించి అనేక అకృత్యాలకు పాల్పడుతున్నది.

ప్రజలారా! ప్రజాస్వామికవాదులారా! దేశభక్తులారా! పై ఫాసిస్టు నిర్బంధ చర్యలు, మావోయిస్టు నేతల అరెస్టులు ఆపరేషన్ గ్రీన్‌హంట్ పేరుతో సోనియా-మన్మోహన్‌సింగ్-చిదంబరంల దేశ పాలక ముఠా సామ్రాజ్యవాదుల దన్నుతో ప్రజలపై సాగిస్తున్న యుద్ధంలో భాగమే. ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ ఎదుర్కొంటున్న తీవ్ర సంక్షోభపు ప్రభావం దేశంలోని సకల రంగాలపై పడుతున్న నేపథ్యంలోనే ఈ రాజకీయ దమనకాండను, హత్యాకాండల్ని, పౌరహక్కులపై దాడుల్ని చూడాలి. మావోయిస్టు విప్లవోద్యమాన్ని సమూలంగా నిర్మూలించి తమ సామ్రాజ్యవాద-అనుకూల, ప్రజావ్యతిరేక విధానాల్ని యదేచ్ఛగా కొనసాగించాలనే కుట్రలో భాగమే ఇదంతా. అణచివేత ప్రతిఘటనకు దారితీస్తుందనేది చారిత్రక సత్యం. హత్యలతో, అరెస్టులతో, నిర్బంధ క్యాంపెయిన్లతో ప్రజా వుద్యమాల్ని, విప్లవోద్యమాల్ని అణిచెయ్యగలమని సోనియా-మన్మోహన్‌సింగ్-చిదంబరం పాలక ముఠా కంటున్న కలలు పగటి కలలు కాకతప్పదు. కార్పొరేట్ వర్గాలకు అమిత లాభాల్ని చేకూర్చి రైతుల్ని, ఆదివాసుల్ని నిలువనీడ లేకుండా చేసే బూటకపు 'అభివృద్ధి' నమూనాను దేశప్రజలపై రుద్దుతూ, దేశాన్ని తెగనమ్మివేస్తున్న భూస్వామ్య, దళారీ పెట్టుబడిదారీ పాలకవర్గాలూ, వాళ్లను నడిపిస్తున్న సామ్రాజ్యవాదులే మన దేశ వికాసానికి, స్వావలంబనకు, సార్వభౌమత్వానికి, స్వాతంత్ర్యానికి, ప్రజల సంక్షేమానికి అతి పెద్ద శత్రువులు. వీళ్లను సమూలంగా నిర్మూలించే లక్ష్యంతో మా పార్టీ నాయకత్వంలో సాగుతున్న ప్రజాయుద్ధంలో, నూతన ప్రజాస్వామిక విప్లవంలో పెద్ద ఎత్తున సమీకృతం కావల్సిందిగా మా కేంద్రకమిటీ పిలుపునిస్తున్నది. పౌరహక్కుల కార్యకర్తలు, మేధావులు, ప్రజాస్వామికవాదులు, శాంతి చర్చలు జరగాలని కోరుకుంటున్న వాళ్లు అందరూ మా వుద్యమ ప్రాంతాలను పర్యటించి ఇక్కడ జరుగుతున్న అమానుష దమనకాండను, హత్యాకాండను స్వయంగా పరిశీలించాలని మా కేంద్ర కమిటీ విజ్ఞప్తి చేస్తున్నది. 'ప్రపంచంలో అతి పెద్ద ప్రజాస్వామ్యం' అని చెప్పుకునే ఈ దేశం నడిబొడ్డున అత్యంత పేద ప్రజలపై, ఆదివాసులపై సాగుతున్న ప్రభుత్వ ఫాసిస్టు హింసకు సంబంధించిన వాస్తవాలను దేశ ప్రజలందరి ముందు ఉంచాలని మా కేంద్ర కమిటీ కోరుతున్నది.

ఈ అరెస్టులను, హత్యాకాండల్ని, పోలీసు జులుంను, విధ్వంసకాండను, లూటీలను, అత్యాచారాల్ని, దుష్ప్రచారాన్ని, రాజ్య ఫాసిస్టీకరణను, బలవంతపు భూముల స్వాధీనాన్ని, యూఏపీఏ వంటి నల్లచట్టాల్ని ఖండించాలనీ, దీనికి వ్యతిరేకంగా సమైక్యంగా పోరాడాలని మా కేంద్ర కమిటీ ప్రజలకు, ప్రజాస్వామికవాదులకు పిలుపునిస్తున్నది. మావోయిస్టు నేతల్ని బేషరతుగా విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నది. ప్రభుత్వ ఫాసిస్టు బీభత్సకాండను సమైక్యంగా, సమరశీలంగా ప్రతిఘటించడమే మార్గమని, అందుకు సాహసంగా

ముందుకు రావాలని మా కేంద్ర కమిటీ విప్లవ ప్రజలందరినీ కోరుతున్నది. పార్టీ, పీఎల్జీఏ నాయకత్వంలో సాగుతున్న ప్రజా ప్రతిఘటనోద్యమాన్ని మరింత తీవ్రతరం చేయడం ద్వారానే, ఇందులోకి వేల, లక్షల సంఖ్యలో సమీకృతం కావడం ద్వారానే మనం ఈ దాడిని ఓడించగల్గుతామని స్పష్టం చేస్తున్నది.

మావోయిస్టు వుద్యమ నేతల అరెస్టుకు, ప్రజలపై దేశ పాలకముఠా సాగిస్తున్న యుద్ధానికి, ఉత్తరప్రదేశ్ రైతులపై సాగిస్తున్న అణచివేతకు నిరసనగా మే 21-22 తేదీల్లో 48 గంటల పాటు జరిగే 'భారత్ బంద్'ను విజయవంతం చేయాల్సిందిగా మా కేంద్రకమిటీ దేశ ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నది. ఈ బంద్ ప్రధానంగా 6 రాష్ట్రాల్లో - ఝార్ఖండ్, బీహార్, పశ్చిమ బెంగాల్, ఒడిషా, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలతో పాటు మహారాష్ట్రలోని 3 జిల్లాలు - గడ్చిరోలి, చంద్రపూర్, గోందియాలలో, ఉత్తరప్రదేశ్ లోని బీహార్ సరిహద్దు జిల్లాల్లో, మధ్యప్రదేశ్‌లోని బాలాఘాట్ జిల్లాలో జరుగుతుంది. మిగతా రాష్ట్రాలలో వివిధ రూపాల్లో నిరసన సాగుతుంది. అయితే వైద్యం, విద్యార్థుల పరీక్షలు, ఇంటర్వ్యూలు వంటి అత్యవసర సేవల్ని ఈ బంద్ నుండి మినహాయిస్తున్నాం.

**అభయ్**

**అధికార ప్రతినిధి**

**కేంద్ర కమిటీ**

**సీపీఐ (మావోయిస్టు)**

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# కేంద్ర కమిటీ

**4-6-2011**

## శిక్షణా స్కూల్స్ పేరుతో సైన్యాన్ని దింపడం
## బస్తర్‌లోని మూలవాసుల, బస్తర్‌వాసుల
## జీవించే హక్కుకే ముప్పుగా పరిణమిస్తుంది !
## అడవిపై హక్కు మూలవాసులదే - ప్రభుత్వానికి
## దానిలో ఒక్క అంగుళంపై హక్కు కూడా లేదు !
## భారత సైన్యమా వెనకకు మళ్లు - నీ స్వంత పౌరుల
## ప్రాణాలను హరించకు !

సంవత్సరం పొడుగూతా తమ పిల్లలనూ, తమ కుటుంబాలనూ పోషించుకోవడానికి ఒకవైపు బస్తర్‌లోని ఆదివాసీ రైతాంగం భూముల్ని దున్నుకుంటూ వర్షాలకై ఎదురుచూస్తుంటే, వారికి తెలీకుండా, దొంగతనంగా, కుట్రపూరితంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారిపై మరోరకం వర్షాలను కురిపించడానికి సన్నాహాలు పూర్తి చేసుకున్నాయి. ఈ వానలు వర్షించేది నీటిని కాదు, అవి బుల్లెట్లనూ, షెల్స్‌నూ, రాకెట్లనూ, ఫిరంగి గుండ్లనూ కురిపిస్తాయి. వారి భూముల్లో సాగునీటిని కాక పిల్లల, స్త్రీ పురుషుల, ముసలివాళ్ల రక్తాన్ని పారిస్తాయి. ఈ వర్షాలు జీవితకాలానికి సరిపడా శాంతినీ, సంపదనూ వాగ్దానం చేస్తున్నాయి. అవును, అది శాంతే - ఒక స్మశానం ఎంత శాంతియుతంగా వుండగలుగుతుందో అంత శాంతియుతంగా వుంటుందది. అది జీవితకాలం పాటు వుంటుంది కూడా, ఎందుకంటే ఆ జీవితాలు అక్కడితో అంతం అవుతాయి కనుక. ఇక సంపదకూ కొదువేముండదు, కాకపోతే అది సామ్రాజ్యవాదులకూ, వారి పెంపుడు కుక్కలైన భారత పాలకవర్గాలకూ, కార్పొరేట్ గద్దలకూ, ఎంఎన్‌సి తిమింగలాలకూ, మహత్తర భారతదేశ దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ ఉమ్మడి కుటుంబంలో భాగమైన ముఖ్యమంత్రులకూ, మంత్రులకూ, ఎంఎల్ఏలకూ, ఎంపిలకూ, ఐఎఎస్, ఐపిఎస్, ఐఎఫ్ఎస్,ప్రభుత్వ అధికారులూ వగైరా వగైరాలందరికీ అది అంతులేని

సంపదల్ని కురిపిస్తుంది. ఎందుకంటే అప్పుడిక ఆ స్మశానం కింద నిక్షిప్తమై ఉన్న అపారమైన సంపదల్ని కబ్జా చేయడానికి ఈ ఆశపోతులకు అడ్డం వచ్చేవారు ఎవరూ మిగలరు.

మావోయిస్టు ప్రాంతాల్లో 'క్లియర్, హోల్డ్, బిల్డు' అనే విధానాన్ని చేపడ్తామని హోంమంత్రిత్వశాఖ ప్రకటిస్తోంది. మన దేశంలో పదాలకు వాటి అసలు అర్థం పోయి చాలా కాలమైపోయింది. ఈ కొత్త పదకోశం ఇలా వుంటుంది - 'క్లియర్' అంటే ఊచకోతలూ, అన్నిటినీ ధ్వంసం చేసే మాపింగ్ అప్ క్యాంపెయిన్‌లూ 'హోల్డ్' అంటే దురాక్రమణ యుద్ధం 'బిల్డ్' అంటే ప్రజల వనరుల్ని సంపూర్ణంగా దోపిడీ చేయడం. ఇదంతా ప్రజలను బానిసల్లాంటి అస్థిత్వంలోకి నెట్టేస్తుంది, వారు సామ్రాజ్యవాద బానిస యజమానులకు సంపూర్ణ గులాములుగా మారిపోతారు. దీనికి దాని పదం దానికుంది, దీన్ని 'అభివృద్ధి' అంటారు. కేవలం పదాలే కాదు, సంస్థలు కూడా వాటికి ఉంటాయని అందరూ అనుకునే తమ కర్తవ్యాల్ని మార్చేసుకుని కూడా చాలా రోజులే అయిపోయింది. (నిజానికి, తాము ఎందుకోసం సృష్టించబడ్డాయో వాటిని నెరవేర్చడానికి అనుకోవచ్చు). ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి ఏ మాత్రం బాధ్యతపడదు, వారిని దోపిడీ చేసేవారి ప్రయోజనాలను నెరవేర్చడానికి మాత్రం తోకూపుకుంటూ, చొంగ కార్చుకుంటూ అంగలారుస్తుంది న్యాయవ్యవస్థ ప్రజల హక్కులను కాపాడదు - వాటిని ప్రజలకు అందకుండా చేయడానికి మహగొప్ప చాకచక్యాన్ని ప్రదర్శిస్తూ ఉంటుంది పోలీసులు తామే 'చట్టం', 'చట్టం' అంటే తామే అని భావిస్తూ, దుడ్డుకర్రతో దాన్ని అమలు చేయడమే భద్రతను కల్పించడంగా చెలామణీ చేస్తుంటారు ఇక భారత సాయుధ బలగాలు తమ నిఖార్సయిన నైపుణ్యంతో కూలిపోయిన ఆదివాసుల గుడిశెల్లో, దివాళా తీసిన రైతుల ఖాళీ గరిసెల్లో లేదా మురికికంపు కొట్టే కార్మికుల బస్తీల్లో 'దేశ శత్రువుల్ని' కనిపెడుతూ ఉంటాయి. కాశ్మీర్‌లో, ఈశాన్య రాష్ట్రాల్లో అడుగడుగునా వుండే 'శత్రువుల్ని' ఎలాగూ కనిపెడతారనుకోండి.

జూన్ మొదటివారంలో, వెయ్యిమంది భారత సైనికులు బస్తర్ గుండెలపైకి తమ ఉక్కుపాదాలతో అడుగుపెట్టారు. అంటే భౌతికంగా మాత్రమే ఇప్పుడు అడుగుపెట్టారు అనాలి. ఎందుకంటే దాదాపు ఒక దశాబ్దకాలంగా భారత సైన్యం పరోక్షంగా బస్తర్‌వాసుల అణచివేతలో భాగం పంచుకుంటూనే ఉంది. మావోయిస్టులను తుడిచిపెట్టడానికి తయారైన అన్ని కౌంటర్-ఇన్‌సర్జన్సీ ఆపరేషన్లలోనూ వారు భాగస్వాములుగా వుండడమే కాక ఈ పని చేసే వందలాది కిరాయి సైనికులకు వారు శిక్షణనిచ్చారు. కేవలం నారాయణపూర్‌లోనే సైన్యానికి (శిక్షణా స్కూలుకు) కేటాయించిన భూమి 750 చ.కి.మీ.లు. నిజానికి మూడు జిల్లాల్లో మూడు శిక్షణా స్కూళ్ల గురించి వాళ్లు మాట్లాడుతున్నారు (నారాయణపూర్, కాంకేర్, బస్తర్). దీనికి

గతంలో సైన్యానికీ, వాయుసేనకూ చేసిన కేటాయింపులను కూడా చేరిస్తే కొన్ని వేల చ.కి.మీల ప్రజల భూమి సైన్యం వశమౌతుంది.

"అబ్బే, ఇది కేవలం సైనిక శిక్షణా స్కూలు మాత్రమే, మేం మావోయిస్టులకు వ్యతిరేకంగా ఆపరేషన్లలో పాల్గొనం, ఇది కేవలం వారిపై మానసిక యుద్ధం చేయడానికి ఉద్దేశించినదే, అంటే 'చూడండి, మీ ఇంటి గుమ్మం ముందే సింహం కూర్చుని వుంది' అని వాళ్లపై మానసిక ఒత్తిడి తేవడానికి మాత్రమే'' అంటోంది సైన్యం. రాజాధిరాజ పరమ నిరంకుశ మన్మోహన్ సింగ్‌గారిని వారి చింకిపాతల పౌరులు వినమ్రంగా 'అసలు ఈ శిక్షణ ఎందుకోసమండీ' అనే ఒక సాధారణ ప్రశ్న అడగవచ్చా? ఎందుకంటే 'దేశ అంతర్గత భద్రతకు అతి పెద్ద ముప్పు' మావోయిస్టులే అనే గొప్ప సత్యాన్ని బ్రహ్మాండమైన ముందుచూపుతో కనిపెట్టింది ఏలినవారే కదా! ఎవరిని మోసం చేద్దామనుకుంటున్నారు వీళ్లు? మూర్ఖులు మాత్రమే సింహం మన మీదకు దూకకుండా గుమ్మం ముందు గమ్మున కూచుంటుంది అని నమ్మగలుగుతారు. ఈ సింహం కాశ్మీర్‌లో, ఈశాన్య రాష్ట్రాల్లో మానవరక్తం రుచి మరిగి ఆవురుమంటూ తిరుగుతున్న మృగం అనే విషయాన్ని మనం మరవద్దు. ఒక విషయాన్ని స్పష్టంగా గుర్తిద్దాం - ఈ శిక్షణ అనేది ఏదో ఆషామాషీ శిక్షణ కానేకాదు, ఇది 'గెరిల్లాలతో గెరిల్లాలాగా పోరాడడానికి' ఇచ్చే కౌంటర్-ఇన్‌సర్జన్సీ శిక్షణ. మధ్య, తూర్పు భారతదేశంలో అత్యంత పేదరికంలో వుండే ప్రజలు చేస్తున్న సాయుధ ప్రతిఘటనను తమ పోలీసు, పారామిలటరీ బలగాలతో అదుపు చేయడంలో విఫలమైన పాలకవర్గాలు ఇప్పుడిక తాము 'ప్రజలపై యుద్ధం చేయడం' కోసమే శిక్షణనిస్తూ వచ్చిన సైన్యాన్ని దింపుతున్నారు. ఇప్పటికే దేశంలో అనేక శిక్షణా కేంద్రాలుండగా మళ్లీ ఇంకోదాని అవసరమేమిటి? అంతకంటే ముఖ్యంగా, మధ్య భారతంలోనే దానినెందుకు నెలకొల్పుతున్నారు?

విషయం తేటతెల్లమే - అది శిక్షణా స్కూలే కానీ అది శిక్షణతోనే ఆగదు, ఒక బ్యాచ్ శిక్షణ ముగియగానే అది తన బూట్లూ, శిరస్త్రాణాలూ, గన్నులూ, గ్రెనేడ్లూ పట్టుకొని తనను ఎక్కడకు పంపిస్తే అక్కడకు పోయి మావోయిస్టులతో పోరాడ్డానికి సిద్ధంగా వుంటుందన్న మాట. అలాగే వారిని కేవలం ఛత్తీస్‌గఢ్‌కే కాదు, మహారాష్ట్ర, బీహార్, ఝార్ఖండ్, మధ్యప్రదేశ్, పశ్చిమ కనుమలు, పశ్చిమ బెంగాల్, ఒడిషా, ఆంధ్రప్రదేశ్‌లకు పంపుతారు. మధ్యభారతంలో ఎందుకు అనేదానికి సమాధానం ఇదీ.

'నీటిని తోడేసి చేపల్ని పట్టే' విధానానికి అనుగుణంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ యజమానులైన అమెరికా సామ్రాజ్యవాదుల కనుసన్నల్లో 'ఎల్‌ఐసీ' (తక్కువ తీవ్రతగల ఘర్షణ) వ్యూహాన్ని భారతదేశ నిర్దిష్ట పరిస్థితులకు 'సృజనాత్మకంగా' అన్వయిస్తూ అమలు

చేస్తున్నాయి. అంటే అది ఈ కింది విధమైన 'దేశీ' పద్ధతుల్లో ఉండచ్చన్న మాట - సైన్యాన్ని దించడానికి సన్నాహాల్లో భాగంగా, 'నీళ్లను తోడెయ్యడం'లో భాగంగా ఇప్పుడు మాడ్ ఆదివాసులకు తమ గూడేల వద్ద ఎక్కడా కొనుక్కోడానికి బియ్యం దొరకదు. వాటిని వారు పట్టణాల్లోని దుకాణాలనబడే పోలీసు క్యాంపుల నుండి తెచ్చుకోవాలి, అందులోనూ మావోయిస్టులకు తిండి పెట్టడానికి సరిపడనంత పరిమాణాల్లోనే తెచ్చుకోవాలి. గూడేల్లో నామమాత్రంగా మాత్రమే ఉన్న పాఠశాలల్ని కూడా ఇప్పుడు రోడ్డుపక్కనుండే పక్కా బిల్డింగ్‌లలోకి మారుస్తున్నారు, అంటే ఆ గూడేనికి అరవై నుండి వంద కిలోమీటర్ల దూరంలో అసలు గూడెం పిల్లలకు కనీసం అది ఎక్కడుందో కూడా తెలీకుండా అక్కడ అదే గూడెం పేరుతో స్కూలు వెలుస్తుంది. ఇక తర్వాత సైన్యం రంగంలోకి దిగి అడవిని 'క్లియర్' చేయడంలో భాగంగా అక్కడ నివసించేవారందరినీ 'వ్యూహాత్మక గ్రామాల్లో'కి తోలేస్తుంది. నిజానికి ఇవి కాన్‌సంట్రేషన్ క్యాంపులకు పెట్టిన ముద్దుపేర్లు. ఇక పైస్థాయిలో ఇటీవల భారత, అమెరికా పాలకవర్గాలు 'హోంల్యాండ్ సెక్యూరిటీ' పేరిట ఒకరికొకరు సహాయం చేసుకోవడానికి చేసిన విన్యాసాలు ఆపరేషన్ గ్రీన్‌హంట్ రెండో దశగా పిలవబడ్తున్న ప్రజలపై  యుద్ధంలోని ఈ దశను మరింత క్రూరంగా ఎలా అమలు జరపాలనేదానికి సన్నాహాల్లో ఒక భాగమే.

ప్రపంచంలోని ఏ ప్రజలైనాగానీ తమకంటూ ఒక భూభాగం లేకుండా శత్రువుతో నిలబడి కొట్లాడలేరు. ఇంకెవరికంటే కూడా పాలకవర్గాలకు ఈ నిజం తెలుసు అందుకనే సరిగ్గా ఆ పని చేయడానికే వారు పూనుకున్నారు. శిక్షణా స్కూళ్ల పేరుతో ప్రభుత్వం వేల చ.కి.మీ.ల స్థలాన్ని దురాక్రమిస్తోంది, వ్యూహాత్మక గ్రామాల పేరుతో అది ఆదివాసులకూ, అడవిలో నివసించేవారికీ నిలువనీడ లేకుండా చేస్తోంది. వీరందరికీ అడవే నిలువనీడ, ఇల్లూ అన్నీ అనేది అందరికీ తెలిసిందే. కాబట్టి, విప్లవకారులూ, ప్రజాస్వామికవాదులూ, పౌరహక్కుల కార్యకర్తలూ, ప్రత్యేకించి ఆదివాసీ సంఘాలూ  శిక్షణా స్కూళ్లు అనే ఈ మేలిముసుగు వెనుకగల అసలు కుట్రను గుర్తించాలి. జల్, జంగల్, జమీన్‌పై హక్కు ప్రపంచంలోనే అత్యంత ప్రాచీనమైన వాసుల్లో ఒకరైన బస్తర్ మూలవాసులదే అనీ, మధ్య, తూర్పు భారతదేశంలోని మూలవాసులదే అనీ గట్టిగా నినదించాల్సిన సమయం ఇది.

ప్రభుత్వాన్ని భూఆక్రమణ గురించీ, ఆదివాసీ ప్రాంతాలకు సంబంధించిన అన్ని చట్టాలనూ గాలికొదిలేయడాన్ని గురించీ (5వ షెడ్యూల్, పెసా, అటవీ హక్కుల చట్టం మొ॥) ప్రశ్నించాల్సిందే. ఇలా నేరుగా దాన్ని కాలరు పట్టుకోని నిలదీయాల్సిన అవసరం వున్నప్పటికీ, అది 'తన చట్టాల్ని తాను పాటిస్తే అడవిని ఆక్రమించుకోవచ్చు' అనే విధంగా దానికి చట్టబద్ధత లభించకుండా కూడా చూసుకోవాల్సిన అవసరం ఉంది. నిజానికి, భూ

ఆక్రమణ చట్టం ద్వారా 'చట్టబద్ధంగా' కార్పొరేట్లకు రైతాంగం భూమిని అందించే ఒక కుట్ర కూడా నేడు నడుస్తోంది. అది ఒక చేతి నుండి మరో చేతికి భూమి శాంతియుతంగా మారడానికి ఏం దారి తీయదనీ, రైతాంగం రక్తాన్ని పారించడకుండా, వారి జీవనాధారాల్ని ధ్వంసం చేయకుండా అమలు కాదనీ, అది నగ్నంగా భూమిని దురాక్రమించే చట్టంగానే వుంటుందనీ నేటి పరిణామాల్ని చూసేవారెవరికైనా అర్థం అవుతుంది. అందుకనే అన్నిటికంటే ముందుగా, గట్టిగా, చేయాల్సిన పని ఏంటంటే అడవి మూలవాసులకే దక్కుతుందనీ, వారికి దాన్ని పంపకం చేసుకోవడానికి 'ప్రభుత్వం' పేరుగల పెద్దన్నలెవరూ లేరనీ బిగ్గరగా, ధాటీగా ప్రకటించడం!

మా పార్టీ పదేపదే చెప్తూ వస్తున్నట్టుగా, నిజమైన ప్రజాస్వామికవాదులందరూ ఘోషిస్తున్నట్టుగా ఈ ఆపరేషన్ గ్రీన్‌హంట్‌లూ, క్లియర్-హోల్డ్-బిల్డ్ పాలసీలూ అన్నీ మధ్య, తూర్పు భారతదేశంలో గల అపారమైన ఖనిజ సంపదల్నీ, ఇతర సహజ సంపదల్నీ దోచుకుపోవడానికే. ఇందుకోసం ఒక మొత్తం సముదాయం తుడిచిపెట్టుకుపోయినా వారికేం లేదు, ఒక మొత్తం నాగరికత మట్టికొట్టుకుపోయినా వారికేం లేదు. అదంతా వారి పాత బాస్ బుష్‌గారు లేదా కొత్త యజమాని ఒబామాగారు ఉద్ఘాటిస్తున్నట్టుగా 'కొలాటరల్ డ్యామేజి' (అదనంగా జరిగే నష్టం) మాత్రమే.

తమ జీవితాల్నీ, జీవన విధానాల్నీ పరిరక్షించుకోవడానికీ, తమ పిల్లలకభవిష్యత్తును కాపాడుకోవడానికీ, తమ అడవితల్లిని కాపాడుకోవడానికీ, ప్రపంచంలోనే అత్యంత ప్రాచీనమైన సంస్కృతుల్లో ఒకదాన్ని దాని సగర్వ వారసులుగా కాపాడుకోవడానికీ బస్తర్, ఛత్తీస్‌గఢ్ ప్రజలు భారత సైన్యాన్ని ఎదిరించి పోరాడాలని సిపిఐ (మావోయిస్టు) వారికి పిలుపునిస్తోంది.

అడవిపై హక్కు మూలవాసులదే, అందులో ఒక్క అంగుళం కూడా సోనియాలకూ-మన్మోహన్‌లకూ-చిదంబరంలకూ ఇవ్వం, ముఖ్యమంత్రులు, మంత్రుల రూపంలో తిరుగుతున్న రక్తపిపాసులైన భూఆక్రమణదారులకూ ఇవ్వం, బహుళజాతి తిమింగలాలకూ, భారత కార్పొరేట్ గద్దలకూ ఇవ్వం, మైనింగ్ మాఫియాలకూ ఇవ్వం అని నినాదాలు మధ్య, తూర్పు భారతదేశం నలుమూలలా మారుమోగిద్దాం. మన కుటుంబాల్లోని ప్రతి ఒక్కరినీ, పిల్లలనూ-పెద్దలనూ, స్త్రీలనూ-పురుషులనూ, ముసలీ-ముతకా అందరినీ 'భారత సైన్యమా వెనక్కి మళ్లు - నీ స్వంత పౌరుల ప్రాణాల్నే హరించకు' అనే నినాదంతో సమీకరిద్దాం.

మనం ఎన్నో సాయుధ దాడుల్ని చూశాం కానీ ఈ కొత్త దాడి మధ్య, తూర్పు భారతదేశంలోని మూలవాసుల, అడవి నివాసుల ఉనికినే ప్రశ్నార్థకంగా మార్చేసి ప్రమాదంలో పడదోస్తుంది. అది జీవన్మరణ సమస్యగా మారింది. వారిని గెలవనిస్తే ఫలితాలు చాలా

విషాదకరంగా వుండి అనేక సంవత్సరాల అంధయుగానికి దారి తీయచ్చు. త్యాగాలూ, సాహసకృత్యాలూ మనకు కొత్త కాదు. మన దేశంలో బ్రిటిష్ వలసవాదులకు వ్యతిరేకంగా జరిగిన అత్యంత సమరశీలమైన, అత్యంత నిబద్ధమైన, నిరంతరాయమైన పోరాటాలను ఆదివాసులే చేయడం అనేది మన దేశంలో వలసపాలనకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాల చరిత్రకున్న విశిష్ట లక్షణం. అందులోని అత్యంత జ్వాజ్వల్యమానమైన అధ్యాయాల్ని రచించినది సంథాల్ తిరుగుబాట్లలో, 1910 నాటి మహాన్ భూంకాల్‌లో పాల్గొన్న సంథాలీ, బస్తర్ ఆదివాసులే. మనకు విలువైన ప్రతీదాన్నీ, మన హృదయాలకు దగ్గరైన ప్రతిదాన్నీ, మనల్ని స్వేచ్ఛగా ఊపిరి పీల్చుకోనిస్తున్న ప్రతీదాన్నీ కాపాడుకోవాలంటే మనమిప్పుడు గుర్తు చేసుకోవల్సింది ఆ పోరాట వారసత్వాన్నే. మన చివరి ఊపిరి వరకూ ఈ ప్రజాశత్రువులకు వ్యతిరేకంగా పోరాడుదాం. 'అభివృద్ధి' పేరుతో మనల్ని బానిసలుగా చేయడానికి జరుగుతున్న ప్రతి ప్రయత్నాన్నీ అడ్డుకుందాం.

మన దేశంలోనూ, ఇతర దేశాల్లోనూ ఉన్న అన్ని విప్లవ, ప్రజాస్వామిక, దేశభక్త సంస్థలకూ, ముఖ్యంగా ఆదివాసీ సంస్థలకూ మధ్య, తూర్పు భారతదేశంలో సైన్యాన్ని దింపడాన్ని ముక్తకంఠంతో ఎదిరించాలనీ, తన స్వంత పౌరులపై భారత పాలకవర్గాలు ఎక్కుపెట్టిన ఈ అన్యాయ యుద్ధాన్ని తమకు వీలైన అన్ని మార్గాల్లో బహిర్గతం చేసి, ఎదిరించి పోరాడి దాన్ని ఆపడానికి కృషి చేయాలనీ మా పార్టీ విజ్ఞప్తి చేస్తోంది.

**అభయ్**

**అధికార ప్రతినిధి**

**కేంద్ర కమిటీ**

**సీపీఐ (మావోయిస్టు)**

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# కేంద్ర కమిటీ

**13-6-2011**

## భారత విప్లవోద్యమ సీనియర్ నేత, పీడిత ప్రజల ప్రియతమ నాయకుడు కామ్రేడ్ జగదీష్ మాస్టర్ ఎలియాస్ భూపేష్‌జీని బేషరతుగా విడుదల చేయాలి!

## కామ్రేడ్ జగదీష్ మాస్టర్ అరెస్టుకూ, విప్లవోద్యమంపై దోపిడీ పాలక వర్గాలు సాగిస్తున్న ఫాసిస్టు అణచివేతకూ వ్యతిరేకంగా జూన్ 23న 'భారత్ బంద్'ను విజయవంతం చేయండి!

కామ్రేడ్ 'జగదీష్ మాస్టర్'గా బీహార్ పీడిత ప్రజానీకానికి సుపరిచితుడు, సీపీఐ (మావోయిస్టు) పొలిట్‌బ్యూరో సభ్యుడు, పార్టీ సీనియర్ నేతల్లో ఒకరైన కామ్రేడ్ భూపేష్‌జీని బీహార్‌లోని గయా జిల్లాలో గురార్ అనే చోట జూన్ 11న పోలీసులు అరెస్టు చేశారు. 72 సంవత్సరాల వయోవృద్ధుడు, దాదాపు పదేళ్లుగా తీవ్ర అనారోగ్యంతో బాధ పడుతూ ప్రజల మధ్య, ప్రజా పోరాటాలే వూపిరిగా జీవిస్తున్న కామ్రేడ్ భూపేష్‌జీ వైద్యం కోసం వెళ్తున్న క్రమంలో సాదా బట్టల్లో వచ్చిన బీహార్, కేంద్ర ఫాసిస్టు ఇంటలిజెన్స్ గూండాలు ఆయనను అరెస్టు చేశారు. తాము పాటిస్తామని చెప్పుకునే రాజ్యాంగాన్నీ, చట్టాల్నీ తామే వుల్లంఘిస్తూ 24 గంటలు దాటినప్పటికీ ఆయనను కోర్టులో హాజరు పర్చకుండా రకరకాల హింసలకూ, వేధింపులకూ గురి చేశారు.

పార్టీ శ్రేణులలో 'కామ్రేడ్ భూపేష్‌జీ' పేరుతో సుపరిచితుడైన కామ్రేడ్ జగదీష్ మాస్టర్ గత నాలుగు దశాబ్దాలుగా విప్లవోద్యమ నిర్మాణం కోసం ఎనలేని కృషి చేసిన ముఖ్యమైన నాయకుడు. ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న కాలంలో భారత విప్లవోద్యమ మహా నేతల్లో ఒకరైన అమరుడు కామ్రేడ్ కన్హయ్య చటర్జీ ప్రేరణతో విప్లవ రాజకీయాల వైపు ఆకర్షితుడై 1970ల తొలినాళ్ల నుండి పూర్తికాలం విప్లవకారుడిగా పని ప్రారంభించాడు. భూస్వామ్య దోపిడీకి, పీడిత కులాల ప్రజలపై అగ్రకుల భూస్వామ్య సేనల బర్బర దాడులకు నెలవుగా

వున్న బీహార్‌లో ఆయన పీడిత ప్రజల సమరశీల నాయకుడిగా నిలబడి ఎన్నో ప్రజా పోరాటాలకు నాయకత్వం వహించాడు. ఈ అరెస్టు ద్వారా నయా భూస్వాములైన నితీష్ కుమార్, సోనియా-మన్మోహన్‌సింగ్-చిదంబరంల ముఠా బీహార్ రైతాంగాన్ని తిరిగి చీకటి యుగాల్లోకి తీసుకుపోదల్చారు. భూస్వాముల నుండి వేలాది ఎకరాల భూముల్ని స్వాధీనం చేసుకొని భూమిలేని, పేద రైతాంగానికి పంచడంలో, వాళ్లపై సాగే సామాజిక అణచివేతను ఎదిరించి వాళ్లు ఆత్మగౌరవంతో తలెత్తుకొని తిరగగలిగే స్థితిని తీసుకురావడంలో కామ్రేడ్ భూపేష్‌జీ పాత్ర ఎంతో గొప్పది. వృద్ధాప్యాన్నీ, తీవ్ర అనారోగ్యాన్నీ లెక్క చేయకుండా శత్రువు చేతికి చిక్కేంత వరకూ ప్రజల మధ్యనే జీవిస్తూ ప్రజలకూ, కేడర్లకూ, నూతన తరాలకూ వుత్తేజాన్నీ, ప్రేరణనూ అందిస్తూ వచ్చిన కామ్రేడ్ భూపేష్‌జీ అరెస్టు ప్రజలకూ, విప్లవ శ్రేణులకూ ఎంతో బాధాకరమైంది.

మావోయిస్టు విప్లవోద్యమాన్ని అతి పెద్ద శత్రువుగా పరిగణిస్తున్న దేశ పాలకవర్గాలు దానికి నాయకత్వం వహిస్తున్న కేంద్ర, రాష్ట్ర నాయకుల్ని అరెస్టు చేయడం, ఎన్‌కౌంటర్ పేరుతో కాల్చి చంపడం వంటి హేయమైన చర్యలకు పాల్పడుతున్నాయి. ముఖ్యంగా గత రెండు సంవత్సరాలుగా 'ఆపరేషన్ గ్రీన్ హంట్' పేరుతో సాగిస్తున్న దేశవ్యాప్త దాడిలో భాగంగా ఒకవైపు కీలక నాయకత్వాన్ని టార్గెట్ చేసి దెబ్బ తీస్తూనే మరోవైపు వుద్యమ ప్రాంతాల్లో ఫాసిస్టు దమనకాండను కొనసాగిస్తున్నారు. ఎన్‌కౌంటర్ల పేరుతో విచ్చలవిడిగా నిరాయుధ ప్రజల్ని కాల్చి చంపడం, గ్రామాలను కాల్చివెయ్యడం, మహిళలపై అత్యాచారాలు, ఆస్తుల విధ్వంసం, లూటీ, తీవ్రంగా కొట్టడం, అక్రమ కేసులలో జైలుపాలు చేసి ఏళ్ల తరబడి విచారణ, జామీను లేకుండా మగ్గిపోయేలా చెయ్యడం వంటి మధ్య యుగాల క్రూర అణిచివేత పద్ధతుల్లో, నాజీ తరహా ఫాసిస్టు రూపాల్లో ఈ దాడి - ఆపరేషన్ గ్రీన్‌హంట్ - కొనసాగుతున్నది. ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్, బీహార్, బెంగాల్, ఒడిషా, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, వుత్తరప్రదేశ్ రాష్ట్రాల్లోని విప్లవోద్యమ ప్రాంతాలు పోలీసు, పారామిలిటరీ బలగాల ఇనుప బూట్ల కింద నలిగిపోతున్నాయి.

జనవరి **2011** నుండి రెండో దశగా చెబుతున్న ఆపరేషన్ గ్రీన్‌హంట్‌లో భాగంగా ప్రభుత్వాలు ఒక వైపు గ్రామాలపై, ప్రజలపై బీభత్సకర దాడులకు పాల్పడుతూనే, మరోవైపు ఈ దాడికి వ్యతిరేకంగా గొంతు విప్పిన రచయితలనూ, కళాకారులనూ, ప్రజాస్వామికవాదులనూ, మానవహక్కుల కార్యకర్తలనూ అణిచెయ్యడానికి పచ్చి ఫాసిస్టు దాడులకు పాల్పడుతున్నాయి. ఛత్తీస్‌గఢ్‌లో ప్రజా డాక్టర్, మానవహక్కుల కార్యకర్త డాక్టర్ బినాయక్ సేన్‌కు యావజ్జీవ శిక్ష విధించడం; చింతల్‌నార్ ప్రాంతంలో ప్రభుత్వ సాయుధ బలగాలు సాగించిన విచ్చలవిడి బీభత్సకాండను ప్రత్యక్షంగా పరిశీలించడం కోసం వెళ్లిన

స్వామి అగ్నివేష్ తదితరులపై దాడి; పీయూసీఎల్‌పై నిషేధం విధిస్తామనే బెదిరింపులు; రచయితలపై, పత్రికా విలేకరులపై తప్పుడు కేసులు బనాయించడం, దాడులకు పాల్పడడం; ఒడిషాలో కార్పొరేట్ కంపెనీలు పాల్పడుతున్న బలవంతపు భూముల స్వాధీనానికి వ్యతిరేకంగా వుద్యమిస్తున్న ప్రజలపై దమనకాండ; ఎన్‌కౌంటర్ల పేరుతో మైనింగ్ వ్యతిరేక కార్యకర్తలను కాల్చి చంపడం; బీహార్‌లో ప్రజలపై కాల్పులు, హత్యలు; ఝార్ఖండ్‌లో అక్రమ కబ్జా పేరుతో ప్రజలను విస్థాపితుల్ని చేసే ప్రభుత్వ చర్యల్ని వ్యతిరేకించే ప్రజలపై పోలీసు కాల్పులు, దౌర్జన్యం; పంజాబ్‌లో పత్రికా సంపాదకుడు, ప్రజా సంఘ నాయకుడు హర్బిందర్ సింగ్ జలాల్ అరెస్టు, చిత్రహింసలు; ఉత్తరప్రదేశ్‌లో పాలకవర్గాల బూటకపు అభివృద్ధి నమూనాను వ్యతిరేకిస్తున్న రైతాంగంపై నిర్బంధకాండ, మహారాష్ట్రలో దళిత ఉద్యమ కార్యకర్త, పత్రికా సంపాదకుడు సుధీర్ ధవళేను రాజద్రోహం కేసులో అరెస్టు చేయడం; ఆంధ్రప్రదేశ్‌లో ప్రత్యేక తెలంగాణా వుద్యమంపై వివిధ రూపాల్లో సాగుతున్న నిర్బంధం వంటివి మచ్చుకు కొన్ని వుదాహరణలు.

దేశ సంపదల్ని సామ్రాజ్యవాద, దళారీ పెట్టుబడిదార్ల కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టడం కోసం కంకణం కట్టుకున్న భారత పాలకవర్గాలు ఇందుకు అతి పెద్ద అడ్డంకిగా వున్న మావోయిస్టు వుద్యమాన్ని నిర్మూలించే లక్ష్యంతో ఇప్పుడు ఈ అన్యాయమైన యుద్ధంలోకి సైన్యాన్ని దించింది. ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ ప్రాంతంలో సైనిక బలగాలు 'శిక్షణ' పేరుతో రంగంలోకి దిగాయి. దేశ సరిహద్దుల్లో శత్రు దేశాల సైన్యాలతో పోరాడుతుందని చెప్పే భారత సైన్యాన్ని ఇప్పుడు దేశం నడిబొడ్డున దేశప్రజలకు వ్యతిరేకంగా సాగుతున్న యుద్ధంలోకి ఈడుస్తున్నారు. సైనిక బలగాల శిక్షణ పేరుతో బస్తర్‌లోని మాడ్ ప్రాంతంలో 750 చదరపు కిలోమీటర్ల భూమిని అప్పజెప్పాలని రమన్‌సింగ్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మాడ్ ప్రాంతంలో దాదాపు ఐదో వంతు భూభాగాన్ని కబళించివేస్తుంది. మరోవైపు కార్పొరేట్ కంపెనీల ప్రాజెక్టులు వేలాది ఎకరాల భూముల్ని కబళించే పథకాలతో ముందుకు వస్తున్నాయి. ఇలా విప్లవోద్యమ ప్రాంతాల్లో ప్రజల్ని బలవంతంగా నిర్వాసితుల్ని చేసే కుట్రలు పెద్ద ఎత్తున సాగుతున్నాయి.

ఒకవైపు దేశంలో పెచ్చరిల్లిపోతున్న అవినీతి, కుంభకోణాల్లో కాంగ్రెస్, బీజేపీ తదితర పాలకవర్గ పార్టీల అవినీతికర నేతలు, కార్పొరేట్ బందిపోట్లు, బడా అధికారులు వేల, లక్షల కోట్ల రూపాయలు దిగమింగి దేశ ప్రజల అసహ్యానికి గురవుతున్నారు. అధికధరలు, ఆకలిచావులు, కరువు, అంటువ్యాధులు, విస్థాపన, వనరుల దోపిడీ వంటి సమస్యలతో కోట్లాది ప్రజలు సతమతమవుతున్నారు. ప్రజల మౌలిక సమస్యలేవీ పరిష్కరించలేని ప్రభుత్వాలు న్యాయమైన ప్రజా వుద్యమాల్ని అణచివేసే లక్ష్యంతో ఫాసిస్టు నిర్బంధానికి,

హత్యాకాండలకు పాల్పడుతున్నది. ప్రజల కోసం నిస్వార్థంగా, అంకితభావంతో, నిర్విరామంగా పని చేస్తున్న విప్లవ నేతలను జైలుపాలు చేస్తున్నది, హతమారుస్తున్నది. కామ్రేడ్ భూపేష్‌జీ అరెస్టు ఇందులో భాగమే.

కామ్రేడ్ భూపేష్‌జీ అరెస్టుకు నిరసనగా, విప్లవోద్యమానికి వ్యతిరేకంగా పాలకవర్గాలు సాగిస్తున్న ఫాసిస్టు అణచివేతకు వ్యతిరేకంగా జూన్ 23న 24 గంటల పాటు జరిగే 'భారత్ బంద్'ను విజయవంతం చేయాల్సిందిగా మా కేంద్రకమిటీ దేశ ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నది. ఈ బంద్ ప్రధానంగా 6 రాష్ట్రాల్లో - ఝార్ఖండ్, బీహార్, పశ్చిమ బెంగాల్, ఒడిషా, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలతో పాటు మహారాష్ట్రలోని 3 జిల్లాలు - గడ్చిరోలి, చంద్రపూర్, గోందియాలలో, ఉత్తరప్రదేశ్ లోని బీహార్ సరిహద్దు జిల్లాల్లో, మధ్యప్రదేశ్‌లోని బాలాఘాట్ జిల్లాలో జరుగుతుంది. మిగతా రాష్ట్రాలలో వివిధ రూపాల్లో నిరసన సాగుతుంది. అయితే వైద్యం, విద్యార్థుల పరీక్షలు, ఇంటర్వ్యూలు వంటి అత్యవసర సేవల్ని ఈ బంద్ నుండి మినహాయిస్తున్నాం.

**అభయ్**

**అధికార ప్రతినిధి**

**కేంద్ర కమిటీ**

**సీపీఐ (మావోయిస్టు)**

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# కేంద్ర కమిటీ

**15-6-2011**

## ఛత్తీస్‌గఢ్, ఒడిషాలలో ఆపరేషన్ గ్రీన్‌హంట్ రెండవ దశలో భాగంగా ఎక్కుపెట్టిన నూతన ప్రభుత్వ దాడిని ఎదిరించి పోరాడండి !
## దేశాన్ని లూటీ చేసే లక్ష్యంతో చేపట్టిన ఎటువంటి ఫాసిస్టు దాడి అయినా ఆత్మగౌరవం గల ప్రజల వీరోచిత ప్రతిఘటనతో ఓడిపోక తప్పదు !!

14-06-2011న కేంద్ర హోంమంత్రి చిదంబరం ఛత్తీస్‌గఢ్, ఒడిషా రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ఒక ఉన్నత స్థాయి సమావేశాన్ని నిర్వహించి ఈ రెండు రాష్ట్రాల్లో 'వామపక్ష తీవ్రవాదాన్ని' అదుపు చేయడానికి ఒక పాశవికమైన నూతన దాడిని చేపడతామని ప్రకటించాడు.హోంమంత్రి పదే పదే పాడే తన పాచినోటి పాటనే మరోసారి పాడుతూ 'అభివృద్ధి - పోలీస్ యాక్షన్' అనే రెండు కోణాల వ్యూహం పేరుతో జరిపే ఈ క్రూరమైన దాడి నిర్వహణలో రెండు రాష్ట్రాలకూ కేంద్రం తన పూర్తి మద్దతును అందిస్తుందనీ, కనుక వాళ్ల దూకుడుగా ముందుకు పోవాలనీ రెచ్చగొట్టాడు. కళింగనగర్ మొదలు నియంగిరి వరకూ వందలాది ఒడిషా ప్రజలను 'అభివృద్ధి దేవత'కు నరబలి గావించిన నరహంతక నవీన్ పట్నాయక్ ఇప్పుడిక పేద ఆదివాసీలపై బాంబులు కురిపించడానికి హెలికాప్టర్లు కావాలని కోరాడు. ఇక ప్రపంచంలోనే అత్యంత ప్రాచీన వాసుల్లో ఒకరైన బస్తర్ ఆదివాసులను నామరూపాలు లేకుండా చేసిన ఘనుడుగా చరిత్రలో (అప)కీర్తిని మూటకట్టుకోబోతున్న కాషాయ ఫాసిస్టు రమన్ సింగ్ తన రాష్ట్రంలో పెరుగుతున్న ప్రజల వీరోచిత సాయుధ ప్రతిఘటనను చూసి బెంబేలెత్తినా పైకి మాత్రం మేకపోతు గాంభీర్యంతో మావోయిస్టులను ఎలా మట్టుబెట్టాలో ఉపన్యాసాలు దంచాడు. కొద్ది రోజులు క్రితమే జూన్ మొదటి వారంలో (అంటే 'మావోయిస్టు ప్రభావిత' రాష్ట్రాల ముఖ్యమంత్రులతో మరో సమావేశాన్ని ప్రధానమంత్రి, హోంమంత్రులు నిర్వహించిన ఒక వారం తర్వాత) ఒడిషా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు ఆంధ్రప్రదేశ్-ఒడిషా సరిహద్దు (ఎఒబి) ప్రాంతంలో మావోయిస్టులను మట్టుపెట్టడానికి మూడునెలలపాటు సాగే ఒక భారీ దాడిని మొదలుపెట్టబోతున్నామని ప్రకటించాయి. వారు

తాము ఆధునిక టెక్నాలజీనీ, 'నేలపైనా, నీటిలోనూ, గాలిలోనూ' దాడులు నిర్వహించే నూతన పద్ధతులనూ, ఎత్తుగడలనూ ఉపయోగిస్తామని ప్రకటించారు. పారాట్రూపర్లను కూడా వినియోగించవచ్చని అన్నారు. ఇక మరోవైపు ఛత్తీస్‌గఢ్‌లోకి సైన్యం 'శిక్షణ' సాకుతో ప్రవేశించినదనేది జగద్విదితమై.

పై ప్రకటన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బస్తర్‌లో రావ్‌ఘాట్ గనుల్ని ప్రైవేటీకరిస్తాం అనే ప్రకటన వెలువడిన కొద్దిరోజులకే వెలువడింది. దేశంలోనే 'అతి పెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి' (అంటే చరిత్రలోనే ఒకానొక అతి పెద్ద సహజ వనరుల దోపిడీ అని అసలు అర్థం)అయిన పోస్కో ప్రాజెక్టుకు భూదాహానికి వ్యతిరేకంగా ఒడిషా ప్రజలు తమ తీవ్ర ధిక్కారాన్నీ, ప్రతిఘటననూ ప్రకటించిన కొద్ది రోజులకే ఈ ప్రకటన వెలువడింది. అలాగే దండకారణ్యంలోని ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర భాగాల్లో కేంద్ర, రాష్ట్ర భద్రతా బలగాలపై మా పిఎల్‌జిఏ బలగాలు వరుస దాడులు జరిపిన కొద్దిరోజులకే ఈ ప్రకటన వెలువడింది. తమ హద్దుల్లేని దోపిడీని కొనసాగించడం కోసం పాలకవర్గాలు మావోయిస్టు ఉద్యమం బలంగా ఉన్న రాష్ట్రాల సరిహద్దుల మీద కేంద్రీకరిస్తున్నాయి; తమ లూటీని విస్తారంగా అడ్డులేకుండా కొనసాగించడం కోసం మావోయిస్టులు విస్తరిస్తున్న ప్రాంతాలపై అవి కేంద్రీకరిస్తున్నాయి. ఉదాహరణకు గతంలోనూ ఒడిషా-ఝార్ఖండ్ సరిహద్దుల వద్ద, పశ్చిమ బెంగాల్-ఝార్ఖండ్ సరిహద్దుల వద్ద, ఛత్తీస్‌గఢ్-మహారాష్ట్ర సరిహద్దుల వద్ద, ఛత్తీస్‌గఢ్-ఎపి-మహారాష్ట్ర సరిహద్దుల వద్ద కేంద్రీకరించారు. కార్యకారణ సంబంధం అందరికీ తేటతెల్లమే.

అసలు వాస్తవం ఏంటంటే భారతదేశం నలుమూలలా, ప్రత్యేకించి మధ్య ప్రాంతంలో ప్రజలు దృఢంగా దళారీ పాలకవర్గాల 'అభివృద్ధి నమూనా'ను తిరస్కరించిన నేపథ్యంలో ఈ ప్రకటన వెలువడింది. దేశాన్ని అమ్మివేసే, లూటీ చేసే ప్రతి ఒక్క 'అభివృద్ధి' ప్రాజెక్టు విషయంలోనూ బీహార్-ఝార్ఖండ్, ఒడిషా, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, ఈశాన్య రాష్ట్రాలు వంటి ప్రతి రాష్ట్రంలోని ప్రజల నుండి ప్రతిఘటన పెరుగుతోందనేది కాదనలేని సత్యం. చూపును హరించే 'అభివృద్ధి' కళ్లద్దాలను పెట్టుకున్నవాళ్లకు మాత్రం ఇదంతా కనబడదు. 'జల్-జంగల్-జమీన్ హమారా హై' అనీ, 'ఈ వక్ర అభివృద్ధి నమూనా మాకొద్దు' అనీ చెవులు చిల్లులు పడేలా అరుస్తున్న ప్రజల ఘోష 'పోలీస్ యాక్షన్' ఇనుపబూట్ల మార్చింగ్‌ను మాత్రమే వినడానికిష్టపడే చెవులకు వినిపించడం అసాధ్యమే.

బహుళజాతి కంపెనీల, దళారీ బడా బూర్జువా రాబందుల నుండి ఈ దేశాన్ని రక్షించడానికి ఈ దేశంలోని పేదల్లోకెల్లా పేద ప్రజలు చేస్తున్న హింసాత్మక-అహింసా రూపాల, సమరశీల-శాంతియుత రూపాల, సాయుధ-నిరాయుధ రూపాల వీరోచిత ప్రతిఘటన అనేది నిజమైన దేశభక్త పౌరులందరికీ గర్వకారణంగా ఉంటుంది. తమ పిల్లలే కాక ఈ దేశ పౌరులందరూ ఆత్మగౌరవంతో జీవించడం కోసం వారు చేస్తున్న త్యాగాలకు ఎవరైనా

వినమ్రంగా, గౌరవంగా తలవంచి నివాళులర్పిస్తారు. కానీ మన దేశ పాలకులకు మాత్రం ఇదంతా కారం రాసుకున్నట్టుగా ఉంది. వారికి కోపంగా, ఆందోళనగా వుంది. ఒక మూలకి నెట్టివేయబడినట్టుగా ఉండి ఈ ప్రతిఘటనల పట్ల అంతులేని ద్వేషాన్ని ప్రదర్శిస్తున్నారు. ఎందుకంటే తమ సామ్రాజ్యవాద యజమానులకూ, తమ వర్గసోదరులకూ దేశసంపదలను అప్పనంగా దోచిపెడతామని వారు చేసిన 'వాగ్దానాల'ను నెరవేర్చనివ్వకుండా ఈ దళారులను ప్రజావుద్యమాలు అడ్డుకుంటున్నాయి. పీకలమొయ్యా మెక్కిన లంచాల సొమ్ముకు ఇప్పుడు 'ఫలితాలను చూపమని' వారి యజమానులేమో నెత్తినెక్కి తంతున్నారు. అందుకని ఈ ప్రతిఘటనలను అణచివేయడానికి ఈ నూతన దాడులతో మన పాలకులు బయల్దేరారు.

అన్నిటికంటే ముందుగా గుర్తించాల్సిన విషయమేమిటంటే ఈ దాడులను కేవలం మావోయిస్టులను అణచివేయడం కోసం చేస్తున్నాం అని వాళ్ళు చెప్తున్నది పచ్చి అబద్ధం అని. ఈ ప్రాంతాలలోని రైతాంగాన్నీ, ఆదివాసులనూ, కార్మికులనూ; పిల్లల్నీ, స్త్రీలనూ, పురుషులనూ, ముసలివారినీ; ప్రజాస్వామికవాదులనూ, దేశభక్తులనూ, విప్లవకారులనూ - ఒక్క మాటలో చెప్పాలంటే ఈ దేశ సంపదల మీద హక్కుగల పౌరులందరి మీదా ఈ దాడి ఎక్కుపెట్టబడిందని గుర్తించి వీటిని ఐక్యంగా ఒక్క మనిషిగా, ఒక్క గొంతుతో ఎదిరించకపోతే మన ప్రియమైన దేశాన్ని సామ్రాజ్యవాదులకు అమ్మాలనే వారి కుట్రలను మనం ఓడించలేము.

ఇప్పుడు అడగాల్సిన ప్రశ్నలు ఇవి - తమ పేరు మీద తీసుకువస్తున్న 'అభివృద్ధి నమూనా'ను అదే ప్రజలు నిర్ద్వంద్వంగా తిరస్కరించేసిన తర్వాత దాన్ని అమలు చేసే అధికారం ఈ ప్రభుత్వాలకు ఎక్కడిది? ఈ దేశ ప్రజలు చెమటోడ్చి సంపాదించిన సొమ్మును ఇదే దేశ పౌరుల్ని చంపడానికి ఖర్చు పెట్టే అధికారం ఈ ప్రభుత్వాలకు ఎక్కడిది? తమ ప్రయోజనాల కోసమో, తమ జీవితాల మెరుగుదల కోసమో కాక సామ్రాజ్యవాదుల, దళారీ పెట్టుబడిదారుల, భూస్వాముల ప్రయోజనాల కోసం జరిగే యుద్ధంలో లక్షలాది భద్రతా బలగాలను బలిపశువులను చేసే అధికారం ఈ ప్రభుత్వాలకు ఎక్కడిది? అన్నిటికంటే ముఖ్యంగా తమ జీవనోపాధి కోసం, తమ ఉనికి కోసం పోరాడుతున్న ప్రజల మీద ఊచకోతలూ, గృహదహనాలూ, అత్యాచారాలూ, బూటకపు ఎన్‌కౌంటర్లూ, లాకప్పు హత్యలూ మొదలైన దౌర్జన్యకాండ చేసే అధికారం ఈ ప్రభుత్వాలకు ఎక్కడిది?

మావోయిస్టు ప్రాంతాల్లో, ప్రత్యేకించి ఇటీవల ఛత్తీస్‌గఢ్‌లో దెబ్బ మీద దెబ్బ తింటున్న తన బలగాల నైతిక స్థైర్యాన్ని నిలబెట్టుకోడానికి పడరాని పాట్లు పడుతూ హోంమంత్రి వారు మావోయిస్టులను ఎంతో వీరోచితంగా ఎదుర్కొంటున్నారనీ, ఈ సంవత్సరం 125 ఎన్‌కౌంటర్లలో 78 మంది తీవ్రవాదుల్ని వాళ్ళు మట్టుబెట్టారనీ భుజం తట్టాడు. ఈ సంఖ్యలు నిజం కాదనీ, రక్తపిపాసులైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేసిన ఊచకోతల్లో, బూటకపు ఎన్‌కౌంటర్లలో ప్రాణాల్ని కోల్పోయింది వందలాది నిరాయుధ ప్రజలే అనేది (వారు

మావోయిస్టు ఉద్యమ సానుభూతిపరులు లేదా కార్యకర్తలు కావచ్చు, కాకపోవచ్చు) అసలు వాస్తవమని దేశప్రజల దృష్టికీ, ప్రపంచ ప్రజల దృష్టికీ మేం తేదల్చుకున్నాం.

గూండా ముఖ్యమంత్రుల, బందిపోటు డిజిపిల ప్రతి సమావేశంలోనూ రాష్ట్రంలో మావోయిస్టు ఉద్యమాన్ని ప్రతిభావంతంగా అణచివేసినందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి కితాబులు అందుతూనే వున్నాయి. నాలుగు దశాబ్దాలపాటు వరుసగా ఫాసిస్టు దాడులను చేపట్టి, విప్లవకారుల, ప్రజల, ముఖ్యంగా తెలంగాణ ప్రజల రక్తాన్ని ఏరులుగా పారించి ఈ 'విజయాన్ని' వాళ్లు సాధించారు. ఇప్పుడిక ప్రతి రాష్ట్రమూ ఈ ఫాసిస్టు నమూనాను అమలు చేయాలని రెచ్చగొడుతున్నారు. మావోయిస్టుల మీదా, సరిహద్దుల్లోని ఆదివాసీ గూడేల పైనా దాడులు చేయడానికి ఎపి గ్రేహౌండ్స్ బలగాలు బాజాప్తుగా ఒడిషా, ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోకి చొచ్చుకుపోతూ ఉంటాయి. దేశంలో ఏ రాష్ట్రంలోనైనా గానీ జరిగిన మావోయిస్టు నేతల ప్రతి అరెస్టు వెనుకా, ప్రతి బూటకపు ఎన్‌కౌంటరు వెనుకా ఎపిఎస్‌ఐబి హస్తం వుంది. అందుకని కేంద్ర ప్రభుత్వ పూర్తి మద్దతుతో ఎఓబిలో ఎపి, ఒడిషా ప్రభుత్వాలు సమన్వయంతో జరుపబోయే మూడు నెలల భారీ దాడిని మనం గట్టి ప్రతిఘటనతో ఆపకపోతే చరిత్రలోనే అత్యంత రక్తసిక్తమైన వాటిల్లో అది ఒకటిగా మారిపోయే ప్రమాదం వుంది. సల్వాజుడుంలకూ, శాంతి సేనలకూ, భద్రతా బలగాల అన్ని రకాల అత్యాచారాలకూ కుఖ్యాతి గడించిన ఛత్తీస్‌గఢ్, ఒడిషాల్లో కూడా ఈ దాడి అత్యంత క్రూరంగా కొనసాగుతుంది ఎందుకంటే సామ్రాజ్యవాద అనుకూల ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఆ రాష్ట్రాల్లో మన దేశంలోకెల్లా గట్టి సాయుధ, నిరాయుధ ప్రజా ప్రతిఘటనలు కొనసాగుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఇప్పుడిక ఈ రెండు రాష్ట్రాల మీదా కేంద్రీకరిస్తూ ఎపి సరిహద్దులను కూడా వీటికి కలిపింది. ఈ విశాల ప్రాంతంలోని ప్రతిఘటనను అణచివేసి అప్పుడు మళ్లీ వేరేవాటికి వెళ్తారు. అయితే దీనర్థం ఒక ఝార్ఖండ్‌లోనో లేక ఇంకో పశ్చిమ బెంగాల్‌లోనో దాడులు ఆగుతాయని కాదు. ప్రజల మీద దేశవ్యాప్త యుద్ధంలోని ఈ దశలో ఇప్పుడు ఈ ప్రాంతం మీద కేంద్రీకరణ ఎక్కువగా వుంటుందని మాత్రమే దానర్థం.

భారతదేశంలోని పోరాడే ప్రజలు తమ జీవితం కోసం, తమ ఉనికి కోసం చేస్తున్న పోరాటానికి ఈ దేశ ప్రజలూ, ప్రపంచ ప్రజలూ మద్దతుగా నిలిచారు, నిలుస్తున్నారు. దేశ పాలకవర్గాలు చేపడుతున్న ఈ నూతన ఫాసిస్టు దాడుల సందర్భంగా వారి మద్దతు ఎంతో కీలకమైనది. అందుకని భారత పాలకవర్గాలు కుట్రలను ఎండగట్టి, దానికి వ్యతిరేకంగా తమకు వీలైన అన్ని పద్ధతుల్లో పోరాడమని మన దేశంలోని, ప్రపంచంలోని నిజమైన ప్రజాస్వామిక శక్తులన్నిటికీ మేం విజ్ఞప్తి చేస్తున్నాం. ఉద్యమ ప్రాంతాల్లో సైన్యాన్ని దించడాన్ని ఆపుచేయాలనీ, ఆర్థిక, రాజకీయ, సైనిక, మానసిక దాడులను ఆపివేయాలనీ డిమాండ్ చేస్తూ ఉద్యమాల్ని నిర్మించాల్సిందిగా కోరుతున్నాం.

ఈ సరికొత్త ఫాసిస్టు దాడిని సమైక్యంగా తిప్పికొడుతూ పోరాడమని ఛత్తీస్‌గఢ్-ఒడిషా సరిహద్దు ప్రజలకూ, ఎపి-ఒడిషా సరిహద్దు ప్రజలకూ, ఛత్తీస్‌గఢ్-ఎపి సరిహద్దు ప్రజలకూ సిపిఐ (మావోయిస్టు) కేంద్రకమిటీ పిలుపునిస్తోంది. మొత్తం పార్టీ, పిఎల్‌జిఎ బలగాలూ ఈ విశాల ప్రాంతంలోని ప్రజలను భాగస్వాములను చేస్తూ అన్ని రంగాల్లోనూ ఈ శత్రుదాడిని ప్రతిఘటిస్తూ సాయుధ ప్రతిఘటనను మరింత తీవ్రతరం చేయాలి.

- ✶ **ఛత్తీస్‌గఢ్–ఒడిషా, ఒడిషా–ఎపి, ఛత్తీస్‌గఢ్–ఎపి సరిహద్దులపై ఎక్కుపెట్టిన నూతన ఫాసిస్టు దాడిని తక్షణం నిలిపివేయాలి!**
- ✶ **ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను తక్షణం నిలిపివేయాలి!**
- ✶ **పోస్కో కోసం, రావ్‌ఘాట్ రైల్వే లైన్, గనుల కోసం భూఆక్రమణను నిలిపివేయాలి!**
- ✶ **పోస్కో ప్రాజెక్టుకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న ప్రజలపై ప్రభుత్వ నిర్బంధకాండను ఖండించండి!**

**అభయ్**

**అధికార ప్రతినిధి, కేంద్ర కమిటీ**

**సీపీఐ (మావోయిస్టు)**

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# కేంద్ర కమిటీ

**18-6-2011**

## జూలై 4 నుండి 11 వరకు మధ్య రీజియన్‌లో నిరసన వారాన్ని జయప్రదం చేయండి!

## నారాయణ్‌పూర్ జిల్లా (మాడ్ ప్రాంతం) నడిమధ్యలో నెలకొల్పబోతున్న సైనిక శిక్షణా కేంద్రాన్ని వెంటనే ఆపెయ్యాలి!

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని నారాయణపూర్ జిల్లాలో 750 చదరపు కిలోమీటర్ల వైశాల్యంలో భారత సైన్యం ఒక కౌంటర్-గెరిల్లా శిక్షణా కేంద్రాన్ని నెలకొల్పబోతున్నది. ఈ ప్రాంతం ప్రాచీన ఆదివాసీ సముదాయానికి పుట్టినిల్లు. గత రెండు దశాబ్దాలుగా ప్రభుత్వం ఈ ఆదివాసుల గురించి అంతరించిపోతున్న మానవ సమాజంగా పేర్కొంటున్నది. నేడు ఇక్కడ ఒక పెద్ద భూభాగంపై సైనిక కేంద్రాన్ని నెలకొల్పడమంటే ఈ ప్రక్రియను మరింత త్వరితం చెయ్యడమే. ఇక్కడి పర్వతాల్లో మావోయిస్టుల అగ్రనేతలు తలదాచుకుంటున్నారనీ, వాళ్లు బాహాటంగా తమ కార్యకలాపాలను కొనసాగిస్తున్నారనీ ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం గత ఐదేళ్లుగా ప్రచారం చేస్తూ, దీన్ని సైనిక శిబిరంగా మల్చింది. గత రెండేళ్లుగా ఇక్కడ పాశవిక ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను నడుపుతున్నది. నేడిక్కడ సైనిక శిక్షణా కేంద్రాన్ని నెలకొల్పడం వల్ల ఇక్కడి ఆదివాసుల అస్తిత్వానికి తీవ్రమైన ముప్పు ఏర్పడింది. నిజానికి ఇక్కడ నిక్షిప్తమై వున్న విలువైన ఖనిజ సంపదల్ని దోచుకుపోవడమే దీనంతటి వెనుక వాళ్ల అసలు లక్ష్యం. ఇక్కడి ప్రజలు దీన్ని బాగా వ్యతిరేకిస్తున్నారు. ప్రజల తీవ్ర నిరసనను అణిచేసే కుట్రలో భాగంగానే సైన్యాన్ని దించారు. మా పార్టీ దీన్ని తీవ్రంగా ఖండిస్తోంది. దీనికి వ్యతిరేకంగా ప్రజా పోరాటాల్ని తీవ్రతరం చేయాలని మా పార్టీ ప్రజలకు పిలుపునిస్తున్నది.

మాడ్ ప్రాంతంలో సైనిక శిక్షణా కేంద్రం స్థాపన ప్రతిపాదనను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జూలై 4 నుండి 11 వరకు మధ్య రీజియన్‌లో - ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్-ఒడిషా సరిహద్దు ప్రాంతంలో నిర్వహించబోయే 'నిరసన వారాన్ని'

విజయవంతం చేయాలని మా పార్టీ పిలుపునిస్తున్నది. ఈ నిరసన వారాన్ని విజయవంతం చేయాల్సిందిగా మా పార్టీ భారత ప్రజనీకానికీ, ప్రజాస్వామ్యప్రియులందరికీ, ఆదివాసుల శ్రేయోభిలాషులకూ విజ్ఞప్తి చేస్తున్నది.

దోపిడీ పాలక వర్గాల ప్రయోజనాల కోసం ఆదివాసీ ప్రజలకు వ్యతిరేకంగా యుద్ధం చేయవద్దని భారత సైనిక జవాన్లకు మా పార్టీ విజ్ఞప్తి చేస్తున్నది. మావోయిస్టుల పేరుతో ఆదివాసీ ప్రజలపై కాల్పులు జరపొద్దని మా విజ్ఞప్తి.

**ఆనంద్**
**సెంట్రల్ రీజనల్ బ్యూరో కార్యదర్శి**
**కేంద్ర కమిటీ**
**సీపీఐ (మావోయిస్టు)**

**అభయ్**
**అధికార ప్రతినిధి**
**కేంద్ర కమిటీ**
**సీపీఐ (మావోయిస్టు)**

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# కేంద్ర కమిటీ

**20-6-2011**

## ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల ఉద్యమ సంస్థాపక నేతల్లో ఒకరైన కామ్రేడ్ పత్తిపాటి వెంకటేశ్వర్లుకు అరుణారుణ జోహార్లు!

ప్రజా న్యాయవాది, ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం (ఏపీసీఎల్‌సీ) సంస్థాపక కార్యదర్శి పత్తిపాటి వెంకటేశ్వర్లు జూన్ 11, 2011న తుదిశ్వాస విడిచారు. ఆయన మరణంతో భారత పీడిత ప్రజానీకం, ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్ ప్రజానీకం ఒక శ్రేయోభిలాషినీ, ప్రజా న్యాయవాదినీ, తమ హక్కుల కోసం అవిశ్రాంతంగా పోరాడిన పౌరహక్కుల నేతనూ కోల్పోయారు. భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) కేంద్రకమిటీ పత్తిపాటికి అరుణారుణ జోహార్లు అర్పిస్తున్నది. ఆయన కుటుంబసభ్యులకూ, స్నేహితులకూ, బంధువులకూ, పౌరహక్కుల వుద్యమ సహచరులకూ తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నది.

పత్తిపాటి 1934లో ప్రకాశం జిల్లాలోని టంగుటూరులో జన్మించారు. దేశంలో మహత్తర నక్సల్బరీ పోరాట కాలంలో, ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్‌లో శ్రీకాకుళం పోరాటం సందర్భంగా పీడిత ప్రజల, పోరాడే ప్రజల హక్కుల కోసం వుద్యమించడానికి ముందుకొచ్చిన అనేక ప్రజాసంఘ నాయకుల్లో పత్తిపాటి ఒకరు. వెంగళరావు ఫాసిస్టు పాలనలో శ్రీకాకుళ వుద్యమాన్ని అణిచివెయ్యడం కోసం బూటకపు ఎన్‌కౌంటర్లు తీవ్రతరం కావడం, విప్లవకారులపై, సామాన్య ప్రజలపై పోలీసు, పారామిలిటరీ కిరాయి మూకలు లెక్కలేనన్ని హింసాదౌర్జన్యాలకు, అరెస్టులకు పాల్పడడంతో 1970వ దశకంలో పౌరహక్కుల వుద్యమం ఆవశ్యకత మునుపెన్నటికన్నా బాగా ముందుకొచ్చింది. 1973లో ఏర్పడిన ఏపీసీఎల్‌సీకి పత్తిపాటి తొలి కార్యదర్శి కాగా, మహాకవి కవి శ్రీశ్రీ దానికి తొలి అధ్యక్షులయ్యారు. వాళ్లిద్దరూ ఆంధ్రప్రదేశ్ నలుమూలలా పర్యటించి బలమైన పౌరహక్కుల వుద్యమాన్ని నిర్మించడానికి ఎంతో పాటుపడ్డారు. ఆ కాలంలో వాళ్లిద్దరి పేర్లు హక్కుల వుద్యమానికి చిరునామాగా మారాయి. పత్తిపాటి తన ఉత్తేజకరమైన వుపన్యాసాలకు ప్రసిద్ధి. ప్రభుత్వ క్రూర ముఖాన్నీ, దాని ఫాసిస్టు అణిచివేత స్వభావాన్నీ ఆయన తన ప్రసంగాల్లో బాగా ఎండగట్టేవారు. ఆయన రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో ఏపీసీఎల్‌సీ యూనిట్లను నిర్మించడానికీ, సంస్థను బలోపేతం చేయడానికీ ఏకవ్యక్తి సైన్యంగా పాటుపడ్డారంటే అతిశయోక్తి కాదు. 1970 నుండి 1975 మధ్య కాలంలో రాజ్యహింస

బాధితులంతా ఆయన వద్దకే వెళ్లేవారు ఎందుకంటే ఆయన ఒక న్యాయవాదే కాకుండా వాళ్లకోసం అంకితమై పోరాడే ఫైర్‌బ్రాండ్ పౌరహక్కుల నేత కూడా. హైద్రాబాద్‌లో ఇసామియా బాజార్‌లోని ఆయన ఇల్లు ప్రజాసంఘాల కార్యకర్తలు, రాజ్యహింస పీడితులు, తప్పుడు కేసుల్లో ఇరికించబడ్డవాళ్లు, విప్లవ రచయితలు, పౌరహక్కుల కార్యకర్తలు మొదలైన వాళ్లందరికీ ఒక సమావేశస్థలంగా వుండేది. దాదాపు ప్రతిరోజూ ఎందరో అక్కడ ఆయనతో కలిసి వున్నదేదో తిని, ఆశ్రయం పొందుతూ, విప్లవ భావాల్ని ఇచ్చిపుచ్చుకునేవారు.

1974లో ఉరిశిక్ష విధించబడ్డ విప్లవ రైతాంగ వుద్యమ కార్యకర్తలు కామ్రేడ్స్ భూమయ్య, కిష్టగౌడ్‌ల శిక్షలను రద్దు చేయాలనే డిమాండ్‌తో జరిగిన పోరాటంలో, దాన్ని దేశవ్యాప్త సమస్యగా మల్చడంలో పత్తిపాటి పోషించిన పాత్ర చిరస్మరణీయంగా నిలుస్తుంది. వాళ్ల ఉరిశిక్ష రద్దు కోసం సాగిన వుద్యమంలో జయప్రకాశ్ నారాయణ, చండ్ర రాజేశ్వరరావు, భూపేష్ గుప్తా, వాజ్‌పేయి, జార్జ్ ఫెర్నాండెజ్ తదితర వేర్వేరు రాజకీయ పార్టీల నాయకుల్ని కూడా కలుపుకురావడంలో ఆయన కీలకపాత్ర పోషించారు. ఈ డిమాండ్‌తో ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి దాన్ని ఆయన హైద్రాబాద్ నుండి సమన్వయించారు. ప్రత్యేకించి ఈ డిమాండ్‌కు అంతర్జాతీయ స్థాయిలో సంఘీభావాన్ని కూడగట్టడంలో ఆయన చేసిన కృషి ఎంతో ప్రశంసనీయమైంది. ఈ డిమాండ్‌కు మద్దతుగా ప్రపంచవ్యాప్తంగా 300కు పైగా మేధావులు (జీన్ పాల్ సార్త్రే, తారిఖ్ అలీ సహా) ఫ్రాన్స్, అమెరికా తదితర దేశాల్లో ప్రదర్శనలు జరిపారు. ఆయన ఈ కేసును వాదించడంతో పాటు, మొదటిసారి వాళ్లను వురి తీయాలని ప్రభుత్వం ప్రయత్నించినపుడు స్టే తెప్పించాడు. ప్రపంచవ్యాప్తంగా మరణశిక్షలకు వ్యతిరేకంగా నిర్మాణమవుతున్న వుద్యమాలు ఆయనను సదా స్మరించుకుంటాయి.

1975 జూన్ 25-26 మధ్యరాత్రి ఎమర్జెన్సీ విధించిన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో అరెస్టయిన మొట్టమొదటి రాజకీయ కార్యకర్త, పౌరహక్కుల నాయకుడు పత్తిపాటి గారే. ఆయన కుటుంబం పూర్తిగా ఆయన పైననే ఆధారపడేది కావడం వల్ల ఆయన జైలు నిర్బంధంలో వున్న కాలంలో వారు ఎన్నో ఇబ్బందులకు, కష్టాలకు గురయ్యారు. జైలులో వున్న కాలంలో కూడా పత్తిపాటి ఫోన్‌కాల్స్ చేస్తూ, వుత్తరాలు రాస్తూ, టెలిగ్రాంలు పంపుతూ పౌరహక్కుల కార్యకలాపాల్ని సమన్వయించడంతో ప్రభుత్వం వీటిని నిషేధిస్తూ ఒక ప్రత్యేక జీ.వో.ను జారీ చేయాల్సి వచ్చింది. 1970-77 మధ్య కాలంలో ఎందరో విప్లవకారులు, వందలాది కార్యకర్తలు అక్రమంగా అరెస్టయ్యి, ప్రభుత్వం చేత 'ఎన్‌కౌంటర్' అయ్యే ప్రమాదాన్ని ఎదుర్కొన్న సందర్భాల్లో ఒక న్యాయవాదిగా ఆయన ఎందరినో కాపాడారు. ఎమర్జెన్సీ ఎత్తేసిన తర్వాత పత్తిపాటి ఒక న్యాయవాదిగా కొనసాగుతూ చివరి ఊపిరి దాకా 'పని హక్కు'ను ప్రాథమిక హక్కులలో భాగం చేయాలని డిమాండ్ చేస్తూ వచ్చారు. ఆయన చివరి వరకూ

ప్రజా న్యాయవాదిగా కొనసాగారు.

ఎమర్జెన్సీని ఎత్తేసిన తర్వాత పత్తిపాటి పౌరహక్కుల ఉద్యమంలో క్రియాశీలంగా లేనప్పటికీ విప్లవోద్యమం పట్ల సానుభూతి కలిగివుంటూ, మార్క్సిజాన్ని విశ్వసిస్తూ వచ్చారు. ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల ఉద్యమంలో పత్తిపాటి పోషించిన పాత్రను ఎత్తిపడుతూ, అత్యంత చీకటిమయమైన నిర్బంధకాలాల్లో ఒకటైన 1970-77 మధ్య కాలంలో ఒక ప్రజా న్యాయవాదిగా ఆయన చేసిన కృషిని గుర్తు చేసుకుంటూ సీపీఐ (మావోయిస్టు) కేంద్రకమిటీ ఆయనకు ఘనంగా నివాళులర్పిస్తున్నది. పీడిత ప్రజల ప్రజాస్వామిక హక్కుల కోసం పత్తిపాటి వంటి కామ్రేడ్స్, పౌరహక్కుల సంస్థలు చేసిన కృషిని మా పార్టీ మొత్తంగా భూస్వామ్య విధానానికీ, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ విధానానికీ, సామ్రాజ్యవాదానికీ వ్యతిరేకంగా, పీడిత ప్రజలకు అన్ని హక్కుల్ని హామీ ఇచ్చే నూతన ప్రజాస్వామ్య వ్యవస్థను నిర్మించడం కోసం సాగే పోరాటంలో విడదీయరాని భాగంగా చూస్తుంది. ఆపరేషన్ గ్రీన్ హంట్ పేరుతో 'ప్రజలపై యుద్ధం' రూపంలో భారత ఫాసిస్టు పాలకవర్గాలు అపూర్వస్థాయిలో దేశవ్యాప్త, బహుముఖ దాడిని కొనసాగిస్తున్న నేటి సందర్భంలో, ప్రజలూ, పౌరహక్కుల ఉద్యమాలూ అనేక సంవత్సరాలపాటు ఎన్నో ప్రయాసలకోర్చి సాగించిన ఉద్యమాల ఫలితంగా గెల్చుకున్న ప్రతి హక్కూ హరించివేయబడుతున్న సమయంలో, ఈ హక్కుల కోసం పోరాడిన పత్తిపాటి లాంటి పౌరహక్కుల నాయకుల సేవల్ని గుర్తు చేసుకోవడం చాలా అవసరం. దేశంలో పౌరహక్కుల ఉద్యమం మునుపెన్నటికన్నా క్రియాశీలంగా కొనసాగాల్సిన ఆవశ్యకత ముందుకొచ్చిన ప్రస్తుత సమయంలో ప్రజలలో పౌరహక్కుల విషయంలో నేడు నెలకొన్న మెరుగైన, ఉన్నతమైన ప్రజాస్వామిక చైతన్యాన్ని తేవడం కోసం పాటుపడ్డ వివిధ సంస్థలూ, వ్యక్తులూ చేసిన పోరాటాల్ని, అందించిన సేవల్ని ప్రచారం చేయాల్సిన అవసరం ఎంతో వుంది. దేశ పీడిత ప్రజల కోసం ఆయన చేసిన కృషిని ఆదర్శంగా స్వీకరించాలనీ, ప్రచారం చెయ్యాలనీ మా కేంద్రకమిటీ ఆయన కుటుంబసభ్యులకూ, స్నేహితులకూ, పౌరహక్కుల ఉద్యమ సహచరులకూ, ప్రజా న్యాయవాదులకూ విజ్ఞప్తి చేస్తున్నది. తద్వారా ఆ పోరాట వారసులుగా నేటి యువతరం ప్రజల హక్కుల కోసం పాటుపడేలా వుత్తేజం పొందగలరని మా కేంద్రకమిటీ భావిస్తున్నది.

**అభయ్**

**అధికార ప్రతినిధి**

**కేంద్ర కమిటీ**

**సీపీఐ (మావోయిస్టు)**

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# కేంద్ర కమిటీ

**22-6-2011**

## తమ భూముల్నే కాక తమ పిల్లల భవిష్యత్తును కూడా లాక్కోవాలని చూస్తున్న పోస్కో ప్రాజెక్టును వీరోచితంగా ప్రతిఘటిస్తున్న పోస్కో వ్యతిరేక ఆందోళనకారులకు జేజేలు!
## తమకు ఎటువంటి ప్రాజెక్టులు కావాలో నిర్ణయించుకునే హక్కు ప్రజలకు మాత్రమే వుంది, దళారీ నియంత పాలకులైన నవీన్ పట్నాయక్‌లకు గానీ, సోనియా-మన్మోహన్-జైరాం రమేష్-చిదంబరంలకు గానీ ఆ హక్కు లేదు!
## పోస్కో వ్యతిరేక ఆందోళనకు మద్దతుగా దేశవ్యాప్తంగా విస్తృతమైన ఆందోళనలను చేపట్టండి!

ఆధునిక భారతదేశ చరిత్రలో ఒక సామ్రాజ్యవాద బహుళజాతి ప్రాజెక్టుకు వ్యతిరేకంగా జరుగుతున్న అత్యంత దృఢమైన, నిక్కచ్చి అయిన ఓ పోరాటాన్ని ఒడిషాలోని జగత్సింగ్‌పూర్ జిల్లాలోని 'పోస్కో వ్యతిరేక ఆందోళన' రూపంలో భారత దేశ ప్రజలు ఒక వారంగా చూస్తున్నారు. 52,000 కోట్ల రూపాయల విలువైన 'అతి పెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి' అంటూ ఊదరగొడుతున్న ఈ ప్రాజెక్టును ఎట్టి పరిస్థితిలోనూ ప్రవేశించనివ్వం అని పట్టుదలగా పోరాడుతున్న ఒడిషా ప్రజలకు సిపిఐ (మావోయిస్టు) జేజేలు పలుకుతూ వారికి తన పూర్తి మద్దతును తెలుపుతోంది.

కేంద్ర ప్రభుత్వం 15-05-2007న చాలా హడావుడిగా పోస్కో ప్రాజెక్టుకు అనుమతిని మంజూరు చేసింది. దానికి వ్యతిరేకంగా ప్రజల్లో పెద్దెత్తున పెల్లుబికిన వ్యతిరేకతను లెక్క చేయకుండా మన్మోహన్ స్వయంగా దక్షిణ కొరియా ప్రభుత్వానికి దాన్ని నిర్మించడానికి శాయశక్తులా కృషి చేస్తానని హామీ ఇచ్చి వచ్చాడు. అటవీ హక్కుల చట్టం కింద పాటించాల్సిన నియమాలనూ, 2009 ఆగస్టులో వెలువరించిన పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ మార్గదర్శకత్వాలనూ ఒడిషా ప్రభుత్వమూ, స్వయంగా ఆ మంత్రిత్వ శాఖ కూడా తుంగలో తొక్కేశాయి. నిజానికి 2010 ఆగస్టు 5న ప్రాజెక్టు పనిని ఆపేయాలని ఈ మంత్రిత్వ శాఖ

ఇచ్చిన ఆదేశాలకు ప్రాతిపదిక ఇవే. రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాంతంలో ఆదివాసులు నివసిస్తున్నారనే విషయాన్నే పదే పదే నిరాకరిస్తూ వస్తోంది. కానీ సక్సేనా కమిటీ, మీనా గుప్తా కమిటీలు ఇక్కడ చేసిన నిజనిర్ధారణలో చాలా స్పష్టంగా ప్రతిపాదిత ప్రాంతంలో సంప్రదాయక అటవీవాసులున్నారనీ, వారు తమ జీవనానికి సంప్రదాయకంగా అడవి మీదనే ఆధారపడ్డున్నారని తిరుగులేని విధంగా రుజువులు చూపాయి. అక్కడ అటవీ హక్కులున్నాయనీ, కానీ రాష్ట్ర ప్రభుత్వం అటవీ హక్కులను అమలు చేయడం లేదనీ అవి ఆరోపించాయి. 65 శాతానికి పైగా ధింకియా, గోవిందపూర్ గ్రామస్తులు తమ పల్లీ సభల్లో (గ్రామసభల్లో) ఎటువంటి భూఆక్రమణకైనా తాము వ్యతిరేకమని కచ్చితంగా ఓటు చేయగా, వాస్తవాల్ని నిస్సిగ్గుగా కప్పిపుచ్చుతూ అసలు ఆ తీర్మానాలే బూటకమైనవని రాష్ట్ర ప్రభుత్వం పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖకిచ్చిన నివేదికలో బొంకింది. రాష్ట్ర ప్రభుత్వం ఇలా పచ్చి అబద్ధాలు చెప్తూ వాస్తవాలనూ, గణాంకాలనూ కప్పెడుతున్న దాఖలాలు కోకొల్లలుగా ఉన్నాయి. మీనా గుప్తా కమిటీ సిఫారసుల మీద ఆధారపడి ఫారెస్టు అడ్వయిజరీ కమిటీ అటవీ అనుమతిని వెనక్కి తీసుకోవాలని సిఫారసు చేసింది. కానీ వీటన్నిటినీ ఉల్లంఘిస్తూ మే 2న జైరాం రమేష్ దీనికి పర్యావరణ అనుమతిని మంజూరు చేసేశాడు. వెంటనే జూన్‌లో రాష్ట్ర ప్రభుత్వం తన పోలీసు బలగాల్ని భూఆక్రమణకై మోహరించేసింది.

ఈ మొత్తం కాలంలో ఈ 12 మిలియన్ టన్నుల స్టీలు ప్రాజెక్టుకు వ్యతిరేకంగా, సుందర్‌గఢ్ జిల్లాలో ఈ కంపెనీ ఇనుప గనులకు వ్యతిరేకంగా, పారాదీప్ రేవుకు 12 కిమీల దూరంలో ప్రతిపాదిత స్టీల్ ప్లాంటుకు దగ్గరలో పోస్కో నిర్మించతలపెట్టిన ప్రైవేటు పోర్టుకు వ్యతిరేకంగా పోరాడుతూ ప్రజలు ఎటువంటి భూఆక్రమణనైనా తీవ్రంగా వ్యతిరేకిస్తూ వచ్చారు. వాస్తవం ఏంటంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ ఈ కుట్రకు పాల్పడ్డాయి. పర్యావరణ అనుమతి ఇవ్వడం అంటే బలవంతంగా భూమిని లాక్కోమని కాదని జైరాం అనడం గానీ, కాంగ్రెస్‌వారు ఆ వుద్యమానికి మద్దతిస్తామంటూ గోవింద్‌పూర్‌కు బైల్దేరడం గానీ పచ్చి మోసం తప్ప మరొకటి కాదు. జైరాం రమేష్ 'ప్రజాస్వామ్యయుతంగా' భూముల్ని తీసుకోవాలని ఒడిషా ప్రభుత్వానికి హితవు పలుకుతున్నాడు. ఈయన మార్కు 'ప్రజాస్వామ్యం'లో అబద్ధాలాడడం, నోరు మూసుకోవడానికి బహుళజాతి కంపెనీల నుండి లంచాలు మేయడం ఉంటాయి కామోసు. ఇటువంటి ప్రాజెక్టులను వ్యతిరేకించే ప్రజలకు (అందులో మెజారిటీ ఆదివాసులే) తెలిసిన 'ప్రజాస్వామ్య' రూపాలు మాత్రం బూటకపు ఎన్‌కౌంటర్లూ, చిత్రహింసలూ, విచారణ లేకుండా ఏండ్ల తరబడి జైళ్లల్లో బంధింపబడడమూ మాత్రమే !

కేంద్ర హోం కార్యదర్శి జికె పిళ్లై ఇటీవల ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో ప్రజలు ప్లానింగ్ కమిషన్ వారి వెబ్‌సైట్‌లోకి వెళ్లి వెనకబడిన ప్రాంతాల్లో (ముఖ్యంగా 'మావోయిస్టు' ప్రాంతాల్లో) 'అభివృద్ధి' ఎంత వేగంగా రోడ్లు, అంగన్‌వాడీ, స్కూలు భవనాల రూపంలో జరిగిపోతోందో

తెలుసుకోవడానికి అక్కడి ఫోటోల్ని చూడాలని అన్నాడు. 'ఫోటోలే నిజం మాట్లాడతాయి' అన్నాడు. నవీన్ పట్నాయక్ 'లైసెన్సుడ్ హంతకుల' దౌర్జన్యపూరితమైన అండతో బహుళజాతి తిమింగళం పోస్కో తమ భూముల్ని లాక్కోకుండా ఆపడానికి కనిపించేంత దూరం వరుసలు, వరుసలుగా పిల్లలూ, స్త్రీలూ, ముసలివాళ్లూ నేలమీద పడుకోని ఉన్న ఫోటోల్ని జికె పిళ్లై ముతా చూసిందో లేదో? ఈ ఫోటోలు ఏ నిజాన్ని అయినా చెబుతున్నాయా?

పోస్కోని ప్రవేశించనివ్వకోడదని వేలాది ఆందోళనకారులు ఎందుకు ఒక జీవన్మరణ పోరాటాన్ని చేస్తున్నారు? దళారీ పాలకులు నయా వలసవాదులకు దేశ సంపదల్ని అమ్మేయడానికి ప్రయత్నం చేసిన ప్రతిసారీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న ప్రజల సంఖ్య ఇబ్బడి ముబ్బడిగా ఎందుకు పెరుగుతోంది? ఈ సంఖ్యలు ఏ నిజాన్ని అయినా వెల్లడి చేస్తున్నాయా?

సింగూరు, నందిగ్రాం, లాల్‌గఢ్, నారాయణపట్నా, భట్టా పర్సోల్, శ్రీకాకుళం, బస్తర్, లోహర్‌దగ్గాలలోనే కాదు, మన దేశంలోని ప్రతి రాష్ట్రంలోనూ అనేక గ్రామాల్లో, పట్టణాల్లో విశాల ప్రజానీకం వెల్లువలా కదిలి చేస్తున్న ఆందోళనలు ఎందుకని ఆగకుండా పుట్టుకొస్తూనే ఉన్నాయి? ఇటీవలి కాలంలో చెలరేగుతున్న ఈ ఆందోళనల సుదీర్ఘ జాబితా ఏ నిజాన్ని అయినా మాట్లాడుతున్నాయా?

సింగూరులోని తపసి మలిక్ నుండి జైతాపూర్‌లోని తబ్రేజ్ వరకూ, కళింగనగర్‌లోని 13 మంది ఆదివాసులు మొదలుకొని, సోంపేట, కాకరాపల్లిలోని రైతాంగం వరకూ ఇటువంటి ఆందోళనల్లో తమ ప్రాణాల్ని కోల్పోయిన ప్రజానాయకులు, ఆందోళనకారుల త్యాగాలూ, వారి అంత్యక్రియలకు ప్రజలు వేలాదిగా తరలిరావడం అనే విషయాలు ఏ నిజాన్ని అయినా చాటుతున్నాయా? ఒరిగిపోయిన ఈ వీరుల స్థానాల్ని మౌనంగా, పట్టుదలగా భర్తీ చేస్తూ 'జల్, జంగల్, జమీన్ హమారా హై' అనే నినాదంతో వేలాది ప్రజలు ఎందుకు వచ్చి పోరాటశ్రేణుల్లో చేరుతూనే వున్నారు?

వినాలనుకున్నవారికి సందేశం స్పష్టంగానే వినిపిస్తుంది. దేశ జనాభాలోని అత్యధిక మెజారిటీ ప్రజలు లాభాలను కేంద్రం చేసుకున్న, సామ్రాజ్యవాద అనుకూల అభివృద్ధి నమూనాను నిరాకరిస్తూ ప్రజల ప్రయోజనాలను కేంద్రం చేసుకున్న, ప్రజానుకూల అభివృద్ధి నమూనాను అక్కున చేర్చుకుంటున్నారు. పాలకవర్గాలవైపు నుండి కూడా సందేశం స్పష్టంగానే వుంది. ప్రజలుగానీ, దేశంగానీ ఎంతైనా నష్టపోనీ, సామ్రాజ్యవాదుల మార్గదర్శకత్వంలో, వారి పూర్తి మద్దతుతో దళారీ పాలకులు తమ లూటీనీ, దోపిడీనీ కొనసాగించి తీరుతారు. ఈ 'నష్టం' 'భౌతికం'గా భూమి, నీరు, గాలి, సముద్రాలు, రేవులు, సహజ వనరులు, అడవులు, పర్యావరణం, అరుదైన వృక్ష, జంతుజాలాలు, పురాతన నాగరికతలు, ఆస్తులు, కాల్జేతులూ, ప్రాణాలూ వంటి వాటిని కోల్పోవడం రూపంలోనే కాక మానవులుగా మనల్ని మనం గుర్తించుకోవడానికి తప్పనిసరి అని మనం అనుకుంటున్న ఆత్మగౌరవం, సార్వభౌమత్వం,

స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, తలవంచనితనం వంటి వాటిని కోల్పోవడం రూపంలో కూడా వుంటుంది.

జగత్సింగ్‌పూర్ ప్రజలు ఒక సామాన్యమైన ప్రశ్నను అడుగుతున్నారు - మరి మేం ఇవన్నీ ఎందుకు కోల్పోవాలి, అసలు మేం ఇవన్నీ కోల్పోవాలి అని నిర్ణయించడానికి వాళ్లెవరు? అని. వారు ఒక అందరికీ తెలిసి ఉండాల్సిన ఒక నిజాన్ని పేర్కొంటున్నారు - తమకు కావల్సిందేదో నిర్ణయించుకునే హక్కు ప్రజలకే ఉంటుంది అని. వారు పాలకవర్గాలకు నేరుగా ఒక సవాలును విసురుతున్నారు - ప్రజల ఆగ్రహాన్ని ఎదుర్కోవడానికి సిద్ధం కండి, మేం లొంగిపోదల్చుకోలేదు అని. మొత్తం ప్రపంచం వినేలా ఒక సూత్రబద్ధమైన వైఖరిని వారు ప్రకటిస్తున్నారు - భారత దేశ ప్రజలు బానిసల్లాంటి బతుకుల్లోకి నెట్టబడడాన్ని నిరాకరిస్తున్నారు అని.

ఫోటోలు కూడా ఒకోసారి నిజాన్ని మాట్లాడలేవనిపిస్తుంది. ఉదాహరణకు, 'మావోయిస్టు ప్రాంతాల్లోని' స్కూలు భవనాల ఫోటోలు అవి పూర్తవగానే వాటిల్లోకి చేరడానికి సిద్ధంగా పొజిషన్‌లో ఉన్న ప్రభుత్వ సాయుధ బలగాల నిజాన్ని మాట్లాడవు. కానీ సంవత్సరాల తరబడి, తమ సర్వస్వాన్నీ పణం పెట్టి లక్షలాది ప్రజలు ఆందోళన చేయడం అనేది తప్పకుండా ఒక నిజాన్ని మాట్లాడుతుంది. ఆ నిజం ప్రస్తుతం మన దేశంలో ఇంక దేనికంటే కూడా మిన్నగా మాట్లాడాల్సిన, వినాల్సిన ఒక నిజం. మన దేశ భవిష్యత్తును నిర్ణయించే ఒక నిజం. ఇదే నిజాన్ని 19వ, 20వ శతాబ్దంలో బ్రిటిష్ వలసవాదులకు వ్యతిరేకంగా అసంఖ్యాకంగా జరిగిన రైతాంగ, ఆదివాసీ తిరుగుబాట్లు, పోరాటాలు (ఎక్కువశాతం సాయుధమైనవే) కూడా మాట్లాడాయి. ఇది అన్ని రకాల వలస/నయావలస దోపిడీనీ, అణచివేతనూ అంతం చేయాలనుకునే ఒక నిజం. బ్రిటిష్‌వారు ఈ నిజాన్ని చూడకుండా, వినకుండా కళ్లూ, చెవులూ మూసుకుని పాశవిక బలంతో వాటిని అణచివేయాలని చూశారు. భారత పాలకవర్గాలు కూడా వారి బాటలోనే నడుస్తున్నారు. వారు తమ 'అన్యాయమైన, పాశవికమైన ప్రజల మీద యుద్ధా'ల్ని ఇలాగే కొనసాగిస్తూ పోతే మాత్రం ఆ బాట అచ్చం వారి సామ్రాజ్యవాద యజమానులను తీసుకుపోయినట్టే వారినీ వారి బొందలవద్దకే తీసుకుపోతుంది. ఆపరేషన్ గ్రీన్‌హంట్ పేరిట మావోయిస్టు ప్రాంతాల్లో పోలీసు, పారామిలటరీ (ఇప్పుడు సైన్యం కూడా)లను మోహరించడం గావచ్చు, లేదా ఓ భట్టా పర్సోల్‌లోనో, ఇంకో గోవిందపూర్‌లోనో పోలీసు, పారామిలటరీల్ని దించడం కావచ్చు - ఇవన్నీ న్యాయమైన ప్రజాపోరాటాల్ని అణచివేయడానికే. నవీన్ పట్నాయక్ ప్రభుత్వం 2010 డిసెంబర్ నుండి 25 మందికి పైగా మైనింగ్ వ్యతిరేక కార్యకర్తలను చంపడం గానీ, నవీన్ పట్నాయక్, రమన్ సింగ్‌లతో పి.చిదంబరం ఇటీవల ఒడిషా, ఛత్తీస్‌గఢ్‌లలో చేపట్టాల్సిన మావోయిస్టు అణచివేత చర్యల గురించి సమావేశం కావడం గానీ ప్రజోద్యమాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎలా అణచివేయదల్చుకున్నాయో సూచిస్తున్నాయి.

భూదురాక్రమణలకూ, సహజ సంపదల దోపిడీకీ వ్యతిరేకంగా జరుగుతున్న ఇతర అనేక

పోరాటాలతోపాటు పోస్కో వ్యతిరేక ఆందోళనకు, అడ్డూ అదుపూ లేకుండా దేశంలోకి ప్రవేశిస్తున్న విదేశీ పెట్టుబడుల భవిష్యత్తును నిర్ణయించగల శక్తి వున్నది. తమ పోరాటాన్ని మొక్కవోని దీక్షతో, దృఢమైన పట్టుదలతో కొనసాగిస్తూ ముందుకేగమని ఒడిషా ప్రజలకు సిపిఐ (మావోయిస్టు) కేంద్రకమిటీ పిలుపునిస్తోంది. ఈ సాహసమైన ప్రజానీకానికి మద్దతుగా ఆందోళనలను నిర్మించమని భారతదేశ ప్రజలందరికీ అది పిలుపునిస్తోంది. తమకు మద్దతుగా వస్తున్న అన్ని రాజకీయ పార్టీల, పౌరబృందాల మద్దతును తీసుకోవడం జగత్సింగ్‌పూర్ ప్రజలకు అవసరమే, అయితే వాటిలో కొన్ని, ముఖ్యంగా పార్లమెంటరీ పార్టీలు ఈ పోరాటాన్ని పక్కదోవ పట్టించడానికి చేసే కుట్రలూ, కుహకాల విషయంలో వారు జాగరూకతతో ఉండాలి. ఈ పార్లమెంటరీ పార్టీలన్నీ తాము అధికారంలో ఉన్న చోట, లేదా అందులో భాగస్వాములుగా ఉన్న చోట ఇలాంటి సామ్రాజ్యవాద అనుకూల విధానాల్నే అనుసరిస్తూ వున్నాయి అనే వాస్తవాన్ని మరువరాదు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూడా అవి పరోక్షంగా వీటికి మద్దతు పలుకుతూనే ఉన్నాయి.

జగత్సింగ్‌పూర్‌కు వెళ్లి పోస్కో వ్యతిరేక ఆందోళనకు మద్దతునివ్వడమేకాక, ఎక్కడికక్కడ కూడా ప్రతి రాష్ట్రంలో వారికి మద్దతుగా ప్రచారాందోళన రూపాల్ని తీసుకోవాల్సిన అవసరం వున్నది. భారత దేశ ప్రజలూ, ప్రపంచ ప్రజలూ ఈ వీరోచిత పోరాటానికి విశాల మద్దతును కూడగట్టాలని సిపిఐ (మావోయిస్టు) విజ్ఞప్తి చేస్తోంది. ఇటువంటి పోరాటాలన్నీ విశాల ప్రాతిపదికన ఒక్కటై పోస్కోవంటి ప్రాజెక్టుల రద్దు కోసమే కాక మొత్తంగా మన దేశం నుండి అన్ని రకాల సామ్రాజ్యవాద దోపిడీ, అదుపు, పీడనల్ని తన్ని తరిమేయడానికి పోరాడే ఐక్యవేదికలుగా ఏర్పడాల్సిన నేటి తక్షణ అవసరం.

- ✶ **పోస్కోకై చేస్తున్న భూదురాక్రమణల్ని తక్షణం నిలిపివేయాలి !**
- ✶ **జగత్సింగ్‌పూర్ జిల్లా నుండి తక్షణం పోలీసు, పారామిలటరీ బలగాల్ని ఉపసంహరించాలి, ప్రజలను లొంగదీయడానికి చేసే అన్ని రకాల దౌర్జన్యకాండలనూ నిలిపివేయాలి !**
- ✶ **ప్రజలకు, ప్రజలకు మాత్రమే చెందిన దేశ సహజ సంపదల్ని లూటీ చేయడానికి అనుమతినిస్తూ, దేశాన్ని అమ్మివేయడానికి బహుళజాతి కంపెనీలతో చేసుకున్న అన్ని రకాల ఎంవోయూలనూ రద్దు చేయాలి!**

**అభయ్**

**అధికార ప్రతినిధి**

**కేంద్ర కమిటీ**

**సీపీఐ (మావోయిస్టు)**

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# కేంద్ర కమిటీ

**24-6-2011**

## రాష్ట్రపతి చేసిన శాంతిచర్చల ప్రతిపాదన ప్రజలను పక్కదారి పట్టించే మరో మాయోపాయమే!

ఈరోజు, 2011 జూన్ 24న ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయపూర్ పర్యటనకు వచ్చిన రాష్ట్రపతి ప్రతిభా పాటిల్ 'మావోయిస్టులు హింసను విడనాడి చర్చల కోసం ముందుకు రావాల'నీ, 'జనజీవన స్రవంతిలో కలిసిపోయి ఆదివాసుల అభివృద్ధి కోసం పాటు పడాల'ని ప్రతిపాదన చేశారు. రాష్ట్రపతి నుండి ఈ ప్రతిపాదన వచ్చింది సరిగ్గా బస్తర్ ప్రాంతంలో భారత సైన్యానికి చెందిన దాదాపు వెయ్యి మంది జవాన్లు డేరా వేసి దేశంలోని అత్యంత పేద ప్రజలకు వ్యతిరేకంగా సాగుతున్న యుద్ధం - ఆపరేషన్ గ్రీన్ హంట్‌లో పాల్గొనబోతున్న సందర్భంలో. ఖనిజ సంపదలతో అలరారే దేశంలోని అనేక ప్రాంతాల్లోంచి సహజ వనరుల్ని కొల్లగొట్టడం కోసం ప్రభుత్వాలకూ, కార్పొరేట్ కంపెనీలకూ మధ్య ఎన్నో దఫాల చర్చలు పూర్తయ్యి, లక్షల కోట్ల రూపాయల ఎంవోయూలపై సంతకాలు జరిగిన నేపథ్యంలో రాష్ట్రపతి 'చర్చల' గురించి మాట్లాడుతున్నారు. మాడియా ఆదివాసీ సముదాయానికి చెందిన డజన్ల గ్రామాల్ని, వేలాది ప్రజల్ని లేకుండా చేస్తూ బస్తర్‌లో 750 చదరపు కిలోమీటర్ల అటవీ ప్రాంతాన్ని సైన్యానికి అప్పజెప్పాలని ఎలాంటి 'చర్చలు' జరపకుండానే నిర్ణయం తీసుకున్న సమయంలోనే సరిగ్గా ఆమె ఈ 'చర్చల' ప్రతిపాదన చేస్తున్నారు.

దేశంలో మొట్టమొదటి మహిళా రాష్ట్రపతి అయిన ప్రతిభా పాటిల్, ఇదే ఛత్తీస్‌గఢ్ దక్షిణ కొసకున్న తాడిమెట్ల, మొర్‌పల్లి, ఫులాన్‌పాడు, తిమ్మాపురం గ్రామాల్లో ప్రభుత్వ బలగాల చేతుల్లో పాశవిక అత్యాచారాలకు, హింసకు గురైన మహిళల దేహాలపై గాయాలైనా మానక ముందే హింస విడనాడాలని మాకు హితబోధ చేస్తున్నారు. ఇంకా కేవలం ఈ గ్రామాల్లోనే కాకుండా, దండకారణ్యంలో, బీహార్-ఝార్ఖండ్‌లో, ఒడిషాలో, మహారాష్ట్రలో, ఇంకా అనేక ప్రాంతాల్లో, ముఖ్యంగా మావోయిస్టు వుద్యమ ప్రాంతాల్లో లేదా ఆదివాసీ ప్రాంతాల్లో ప్రభుత్వ హింస ఒక దైనందిన వాస్తవంగా కొనసాగుతున్న సమయంలో ఆమె హింసను విడనాడమని

మాకు చెబుతున్నారు. నిజానికి ప్రభుత్వ హింసకు బహురూపాలున్నాయి. వేర్వేరు సమయాల్లో అది వేర్వేరు విధాలుగా కొనసాగుతూ వుంటుంది. వుదాహరణకు ఇవ్వాళ్టి ఉదంతాన్నే తీసుకుంటే రాత్రికి రాత్రే కిరోసిన్‌పై రెండు రూపాయలు, డీజిల్‌పై మూడు రూపాయలు, వంటగ్యాస్‌పై 50 రూపాయల రేటు పెంచి ఇప్పటికే అధికధరల భారంతో మూల్గుతున్న పేద, మధ్య తరగతి ప్రజల నడ్డి విరిచెయ్యడం రూపంలో కూడా ఈ హింసను మనం చూడొచ్చు. కానీ రాష్ట్రపతికి ఇలాంటి 'హింస'లతో ఏ సమస్యా లేదు.

ఇంకా భారత ప్రథమ పౌరురాలు మమ్మల్ని 'ప్రధాన స్రవంతి'లోకి రావాలని కూడా కోరుతున్నారు. ఆమె చెబుతున్న 'ప్రధాన స్రవంతి'కి చెందిన 'కథా నాయకుల్ని' - అవినీతిపరులు, కుంభకోణాల చరితులైన మంత్రుల్నీ, నాయకుల్నీ, కార్పొరేట్ తిమింగళాల్నీ, వాళ్ల దళారుల్నీ ఢిల్లీ నుండి పల్లెపట్టులోని గల్లీల దాకా ప్రజలంతా ఛీకొడుతున్నారు. ఆమె మమ్మల్ని రమ్మని పిలుస్తున్న 'ప్రధాన స్రవంతి'లో కార్మికులకూ, కర్షకులకూ, ఆదివాసులకూ, దళితులకూ, మైనారిటీలకూ, మహిళలకూ మొదలైన వాళ్లకు అన్యాయం, అత్యాచారాలు, అవమానాలు తప్ప మరేమి మిగల్లేదు.

శ్రీమతి ప్రతిభా పాటిల్ గారు మమ్మల్ని చర్చలకు రమ్మని పిలుస్తున్న నేపథ్యాన్ని గమనిస్తే, ఇలాంటి ప్రతిపాదనకు స్పందనగానే ప్రభుత్వానికి మా వైఖరిని వెల్లడించిన మా పార్టీ అధికార ప్రతినిధి, పొలిట్‌బ్యూరో సభ్యుడు కామ్రేడ్ ఆజాద్‌ను ఇదే ప్రభుత్వం బూటకపు ఎన్‌కౌంటర్‌లో హత్య చేసింది. సందర్భవశాత్తు ఆయన తొలి వర్ధంతికి సరిగ్గా వారం రోజుల ముందు రాష్ట్రపతి ఈ ప్రతిపాదన చేస్తున్నారు. సంవత్సరం క్రితం దాదాపు ఇవే రోజుల్లో చిదంబరం, అతని హంతక ఇంటలిజెన్స్-పోలీసు జాగిలాల ముఠా ఆయన్ని చంపే కుట్రకు తుది రూపం ఇస్తూ వుండి వుంటారు. చర్చల పట్ల మా పార్టీ వైఖరి ఏమిటో కామ్రేడ్ ఆజాద్ దేశ, ప్రపంచ ప్రజల ముందు స్పష్టంగా వుంచినందుకు ఈ రాష్ట్రపతి అధినాయకత్వం వహిస్తున్న రాజ్యం ఆయన హత్య ద్వారానే జవాబు చెప్పింది. ఆ తర్వాత కూడా ఎందరో సీనియర్ మావోయిస్టు నాయకుల్ని పట్టుకొని జైళ్లల్లో ఖైదు చేసే విధానాన్ని నిరంతరాయంగా కొనసాగిస్తూనే వస్తున్నది. 60-70 సంవత్సరాల వయోవృద్ధ మావోయిస్టు నేతల్ని జైళ్లల్లో బంధించి చిత్రహింసలకు గురి చేయడమే కాకుండా వాళ్లకు కనీస వైద్య సదుపాయాలు కూడా అందకుండా వేధిస్తున్నది. వాళ్లపై పదేసి, పదిహేనేసి రాష్ట్రాల్లో ఎన్నెన్నో తప్పుడు కేసుల్ని మోపి వాళ్ల జీవితాంతం చీకటి కొట్టాల్లోనే మగ్గిపోయేలా చేస్తున్నది.

**కనుక, దేశప్రజలందరికీ మా హృదయపూర్వక విజ్ఞప్తి ఇది -**

'శాంతి చర్చల' ప్రతిపాదన చేసే ముందర ప్రభుత్వం ప్రజలపై సాగిస్తున్న యుద్ధం - ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను నిలిపివెయ్యాలనీ, బస్తర్‌లో సైనిక శిక్షణను ఆపాలనీ, మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలన్నిటి నుండి సైన్యాన్నీ, అర్ధసైనిక బలగాల్నీ వెనక్కి రప్పించమనీ రాష్ట్రపతి గారిని డిమాండ్ చేయండి. ఒకవేళ ప్రభుత్వం ఇందుకు సిద్ధమైతే ప్రజలు ఆత్మరక్షణార్థం చేస్తున్న ప్రతిహింస మరుసటి రోజు నుండే నిలిచిపోతుంది!

'అభివృద్ధి' గురించి మాట్లాడే ముందర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకూ, ప్రభుత్వాలకూ మధ్య జరిగిన ఎంవోయూలన్నీ రద్దు చేయాలనీ, బలవంతంగా భూముల్ని లాక్కునే ప్రాజెక్టులన్నిటినీ వెంటనే ఆపాలనీ, తమకెలాంటి అభివృద్ధి కావాలో నిర్ణయించుకునే హక్కు ప్రజలకే వుండాలనే విషయాన్ని ప్రభుత్వం ఒప్పుకోవాలనీ రాష్ట్రపతి గారిని డిమాండ్ చేయండి!

మావోయిస్టులు 'ప్రధాన స్రవంతి'లో చేరాలని కోరే ముందర ప్రభుత్వం అవినీతి-కుంభకోణాలకు పాల్పడ్డ వాళ్లందరినీ అరెస్టు చేసి శిక్షించాలనీ, విదేశీ బ్యాంకుల్లో వున్న నల్ల ధనాన్నంతా వెనక్కి తీసుకురావాలనీ, అవినీతిలో, అక్రమార్జనలో దోషులైన మంత్రుల్ని, నాయకుల్ని పదవుల్లోంచి తప్పించి బహిరంగంగా శిక్షించాలనీ రాష్ట్రపతి గారిని డిమాండ్ చేయండి!

**అభయ్**

**అధికార ప్రతినిధి**

**కేంద్ర కమిటీ**

**సీపీఐ (మావోయిస్టు)**

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# కేంద్ర కమిటీ

**27-6-2011**

## ప్రముఖ మార్క్సిస్టు ఆర్థికశాస్త్రవేత్త, భారత విప్లవానికి గొప్ప మిత్రుడు కామ్రేడ్ ప్రొఫెసర్ ఆర్.ఎస్.రావుకు అరుణారుణ జోహార్లు!

2011 జూన్ 17న ప్రముఖ మార్క్సిస్టు ఆర్థికశాస్త్రవేత్త, భారత విప్లవానికి గొప్ప మిత్రడు ప్రొఫెసర్ ఆర్.ఎస్.రావు (74) కొత్త ఢిల్లీలోని ఒక ఆసుపత్రిలో తుది శ్వాస విడిచారు. ఆయన మరణంతో భారత ప్రజలు తమ గొప్ప శ్రేయోభిలాషుల్లో ఒకరినీ, భారత విప్లవం తన గొప్ప మిత్రుల్లో ఒకరినీ కోల్పోయారు. ఆయన మరణం విప్లవ క్యాంపు అంతటా విషాదాన్ని నింపింది. పీడిత ప్రజానీకం పక్షాన, నక్సల్బరీ నాటి నుండీ ఈ దేశంలో చెలరేగుతున్న మావోయిస్టు విప్లవోద్యమంతో దృఢంగా నిలిచిన ఈ అచంచలమైన మార్క్సిస్టుకు సిపిఐ (మావోయిస్టు) కేంద్రకమిటీ వినమ్రంగా అరుణాంజలి ఘటిస్తోంది.

ఆర్.ఎస్.రావు ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లాలో జన్మించారు. ఆయన జీవితంలో అత్యధిక భాగం ఒడిషాలోని సంబల్‌పూర్‌లో గడిచింది. పెద్ద ఆనకట్టల వల్ల విస్థాపనకు గురైన ఈ ఆదివాసీ బహుళ ప్రాంతాన్ని ఆయన తన పనికి ఎన్నుకోవడం అనేదే ఆయనకు అత్యంత పీడితులైన ఈ దేశప్రజల పట్ల గల లోతైన అక్కరకు ఒక సూచిక. ఈ లోతైన అక్కర, పీడిత తాడిత ప్రజానీకం పట్ల, ముఖ్యంగా ఆదివాసుల పట్ల నిబద్ధత అనేవి ఆయనలో చివరివరకూ కొనసాగాయి. నక్సల్బరీ ఆయన జీవితంలో ఒక మలుపు. ఇక్కడి భూస్వామ్య దోపిడీ, అణచివేతలకు వ్యతిరేకంగా పోరాడే ఉద్యమం మాత్రమే ఈ దేశాన్ని విముక్తం చేయగల్గుతుంది అని ఆయన లోతుగా, దృఢంగా విశ్వసించారు. ఆయన రచనల్లోనూ, ఉపన్యాసాలలోనూ ఆయన మన దేశంలోని అర్ధ-భూస్వామ్య సంబంధాలకేసి దృష్టిని ఆకర్షిస్తూ, వాటి నుండి విముక్తం కావల్సిన అవసరాన్ని ఎత్తిచూపేవారు. మార్క్సిస్టు బృందాల్లో భారతదేశంలో పెట్టుబడిదారీ సంబంధాలు ప్రవేశించాయా అనే చర్చోపచర్చలు జరిగిన సమయాల్లో ఆయన దేశంలోని ఉత్పత్తి సంబంధాలను మార్క్సిస్టు దృక్పథంతో విశ్లేషించి వాటికిగల అర్ధ-భూస్వామ్య స్వభావాన్ని నొక్కిచెప్పారు. అందుకనే ఆయన ఈ దోపిడీ ఉత్పత్తి సంబంధాలను కూలదోయగల నూతన ప్రజాస్వామిక విప్లవ ఆవశ్యకతను గురించి

నిరంతరం విశ్వసించారు, రాశారు. 'టువర్డ్స్ అండర్‌స్టాండింగ్ సెమీ ఫ్యూడల్ సెమీ కలోనియల్ సొసైటీ: స్టడీస్ ఇన్ పొలిటికల్ ఎకానమీ' అనే ఆయన పుస్తకం, ఆయన ఇతర రచనలూ నూతన ప్రజాస్వామిక విప్లవానికై కృషి చేసే సీరియస్ రాజకీయ కార్యకర్తలందరూ తప్పక అధ్యయనం చేయదగ్గవి. సాధారణ కార్యకర్తలూ, ప్రజలూ క్లిష్టమైన ఆర్థికశాస్త్ర పదజాలాన్ని కూడా సామాన్య పదాల్లో వివరించగల ఆయన నైపుణ్యాన్నీ, స్పష్టంగా రాసే శైలినీ మనసుకు హత్తుకున్నారు.

భారత పాలకవర్గాల సామ్రాజ్యవాద నిర్దేశిత అభివృద్ధి నమూనాను ప్రశ్నించిన మొట్టమొదటివారిలో ఆర్.ఎస్.రావు ఒకరు. భాక్రానంగల్, హిరాకుడ్ వంటి భారీ ప్రాజెక్టులు ప్రజలను విస్థాపితులను చేసిన కాలం నుండే ఆయన అభివృద్ధి వెలుగునీడలు అనే భావనను ముందుకు తెచ్చారు. నెహ్రూ పెద్ద ఆనకట్టలను 'ఆధునిక దేవాలయాలు' అన్నప్పుడు ఆయన అవును అవి ఆధునిక దేవాలయాలే, అందుకే అవి కట్టినవారికి వాటిలోకి ప్రవేశం లేదు అన్నారు. ఈ భావనను వివరించిన ఆయన అద్భుతమైన రచన 'అభివృద్ధి వెలుగునీడలు' ఇప్పటికీ దేశం ఎటువంటి అభివృద్ధి నమూనాను అమలు చేయాలి అని జరిగే రాజకీయ చర్చలను ప్రభావితం చేస్తూనే వున్నది. ఆయన అనేకమంది యువ పరిశోధకులకు మార్గదర్శకత్వం వహించారు, గ్రామీణ ప్రాంతాల్లో జరిగిన సామాజిక, ఆర్థిక పరిణామాలను, ప్రత్యేకించి పాత మావోయిస్టు ఉద్యమ ప్రాంతాల్లో అధ్యయనం చేయమని ప్రోత్సహించారు. ఒక సీనియర్ మార్క్సిస్టుగా ఆయన గతితార్కిక పద్ధతిని ఉపయోగించి దేనినైనా వాటి చలనంలో అధ్యయనం చేయడానికి ప్రయత్నిస్తూ వాటి సారాంశాన్ని గ్రహించే ప్రయత్నం చేశాడు.

ఇటీవల ఆయన మల్కన్‌గిరి కలెక్టర్ వినీల్ కృష్ణ, జూనియర్ ఇంజినీర్ పబిత్ర మాఝీలను బంధించిన సందర్భంగా ఒడిషా ప్రభుత్వానికీ, సిపిఐ (మావోయిస్టు)కూ మధ్య ముగ్గురు మధ్యవర్తుల్లో ఒకరిగా కీలకమైన పాత్రను పోషించారు. తాము వారిద్దరినీ విడిపించగలిగాం గానీ కామ్రేడ్ సీతన్న ఏమైయిండనే కనీసమైన సమాచారాన్ని కూడా ప్రభుత్వం నుండి రాబట్టలేకపోయాం అనీ, ఇక ప్రభుత్వం ఈ సందర్భంగా చేసిన వాగ్దానాలను నెరవేర్చడం గురించి చెప్పడానికేముంది అనీ ఆయన ఆవేదన చెందారు.

నక్సల్బరీ కాలం నుండి ఆర్.ఎస్.రావు పీడిత ప్రజలకూ, దేశంలోని మావోయిస్టు ఉద్యమానికీ గొప్ప మిత్రుడిగా, శ్రేయోభిలాషిగా వుంటూ వచ్చారు. అనేక రకాల సైద్ధాంతిక చర్చల నేపథ్యంలో, ప్రత్యేకించి సోవియట్ అగ్రరాజ్యం కుప్పకూలిన సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా ప్రతీఘాతుకులూ, పోస్ట్ మాడర్నిస్టులూ మార్క్సిజం మీద దాడిని ఎక్కుపెట్టిన సందర్భంలో ఆయన ఉద్యమంతోనూ, మార్క్సిజంతోనూ దృఢంగా మొక్కవోకుండా నిలిచారు. ఆర్.ఎస్. రావు వంటి గొప్ప మార్క్సిస్టు తనకు రిఫరెన్స్‌గా సిపిఐ (మావోయిస్టు)

అధికార రాజకీయ పత్రికలను భావించేవారు అనేది తనకు గౌరవప్రదమైన విషయంగా మా పార్టీ భావిస్తున్నది. ప్రజాపక్షపాతి అయిన నమూనా మేధావిగా ఆర్.ఎస్.రావు సేవలను సిపిఐ (మావోయిస్టు) కొనియాడుతుంది. ప్రజల ప్రయోజనాలకు విలువిచ్చే ఏ మేధావి అయినా ఆయన నమూనాను అనుసరించాలని భావిస్తున్నది. వారు తమ మేధస్సునూ, రచనాశక్తినీ మన దేశ పీడిత ప్రజల ప్రయోజనాలను పరిరక్షించడానికి ఉపయోగించాలి. మన దేశ సహజ సంపదలను అడ్డూ ఆపూ లేకుండా దోచుకోవడానికి ప్రజలపై బహుముఖ, దేశవ్యాప్త యుద్ధానికి తెగబడిన ఈ కీలకమైన సమయంలో ఈ అవసరం మరింతగా ముందుకొచ్చింది. భారతదేశ పీడిత ప్రజలు, ప్రత్యేకించి ఆదివాసీ ప్రజలూ ఆర్.ఎస్. రావు చేసిన సేవలను ఎన్నటికీ మరువరు. పాలకవర్గాల విధానాలను నిర్దాక్షిణ్యంగా చీల్చిచెండాడే ఈ మృదుభాషి, కోమల స్వభావం గల మేధావిని వారు ఎల్లప్పుడూ ఆప్యాయంగా గుర్తు చేసుకుంటారు.

యావత్ విప్లవ క్యాంపు తరఫున సిపిఐ (మావోయిస్టు) కేంద్ర కమిటీ భారతిగారికీ, వారి కుటుంబానికీ, స్నేహితులకూ, ఉద్యమ మిత్రులకూ సంతాపాన్ని తెలుపుతున్నది. ఆయన రచనలనూ, ఆయన జీవితంలో ఎత్తిపట్టిన విలువలనూ దేశాన్ని విముక్తి చేయాలని కోరుకునే యువతరం అనుసరించే విధంగా వారు ప్రచారం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నది. విప్లవోద్యమానికి ఆర్.ఎస్.రావు వంటి మేధావులు అందించే తోడ్పాటు దాని మనుగడకూ, అభివృద్ధికీ ఒక కీలకమైన పాత్రను పోషిస్తుంది. ఇటువంటి రచయితలూ, మేధావులూ అందించే తోడ్పాటునూ, సంఘీభావాన్నీ మా పార్టీ మనఃస్ఫూర్తిగా మదిలో నిలుపుకుంటుంది. ఆర్.ఎస్.రావుకు అందించగల నిజమైన నివాళి ఆయన తన జీవితంలో పాటించిన, ప్రచారం చేసిన విలువలనూ, ఆదర్శాలనూ అనుసరించడం, దేశంలోని ఉత్పత్తి సంబంధాలను వాటిని మార్చే ఉద్దేశ్యంతో పటిష్టమైన మార్క్సిస్టు దృక్పథంతో అధ్యయనం చేయడం, మన దేశాన్ని భూస్వామ్య, దళారీ నిరంకుశ బూర్జువా, సామ్రాజ్యవాద సంకెళ్ల నుండి విముక్తి చేసే లక్ష్యంతో పని చేసే ఉద్యమాలతో దృఢంగా నిలవడమే అవుతుంది. మా పార్టీ ఇటువంటి మేధావుల కృషినంతటినీ నూతన ప్రజాస్వామిక భారతదేశ స్థాపనకై జరిగే మొత్తం కృషిలో భాగంగా చూస్తుంది. ప్రజలకు నిజమైన ప్రజాస్వామ్యమూ, నిజమైన అభివృద్ధీ అందుబాటులోకి రావాలని ఆయన కన్న కలలను నిజం చేయడానికి ఆయన చేసిన కృషినీ, ఆయన ఆదర్శాలనూ కొనసాగించాలనీ ఆయన మిత్రులకూ, సహచరులకూ మేం విజ్ఞప్తి చేస్తున్నాం.

**అభయ్**

**అధికార ప్రతినిధి**

**కేంద్ర కమిటీ**

**సీపీఐ (మావోయిస్టు)**

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# కేంద్ర కమిటీ

**2-7-2011**

## ఆదివాసీ, దళిత సాంస్కృతిక కార్యకర్తలూ, నాయకులూ కామ్రేడ్స్ జీతన్ మరాండీ, అనిల్ రామ్, మనోజ్ రాజ్‌వర్, ఛత్రపతి మండల్‌లకు విధించిన మరణదండనలను తక్షణం రద్దు చేయాలి!

జూన్ 23న ఝార్ఖండ్‌లోని గిరిడీ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి ఇంద్రదేవ్ మిశ్రా జీతన్ మరాండీ, అనిల్ రామ్, మనోజ్ రాజ్‌వర్, ఛత్రపతి మండల్‌లకు 2007లో 19మంది హత్య జరిగిన ఛిల్కారీ కేసులో మరణదండనను విధించాడు. తద్వారా రాజ్యం మరోసారి తన ఫాసిస్టు నైజాన్ని బయటపెట్టుకుంది. జీతన్ మరాండీ, ఇతరులూ ఎల్లప్పుడూ బహిరంగంగానే పని చేస్తూ వచ్చారు, వారు పని చేస్తున్న సంస్థలు కూడా నిషేధిత సంస్థలు ఏమీ కావు. వారికి ఎటువంటి సంబంధమూ లేని ఒక కేసులో వారికి మరణ దండన విధించడం అంటే తమ ఆట, పాటల ద్వారా సామ్రాజ్యవాద వ్యతిరేక, భూస్వామ్య వ్యతిరేక, ప్రత్యేకించి విస్థాపన వ్యతిరేక ప్రజాపోరాటాలకు వారు దృఢమైన అండగా నిలుస్తున్నందుకు చేపట్టిన కక్షసాధింపు చర్యే ఇది అనేది స్పష్టమౌతోంది.. దేశంలో మావోయిస్టు ఉద్యమాన్ని, ముఖ్యంగా మధ్య, తూర్పు భారతాల్లో, అణచివేయడానికి చేపట్టిన ఆపరేషన్ గ్రీన్‌హంట్‌లో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదల్లోకెల్లా పేదలైన ఆదివాసులపై అత్యంత హీనమైన, పాశవికమైన అత్యాచారాలకు పాల్పడుతున్నాయి, ఈ మరణదండనలు ఇందుకు మరో సాక్ష్యం. ఆపరేషన్ గ్రీన్‌హంట్ అత్యంత పాశవికమైన రూపాలు ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్, ఒడిషాల్లో, అందులోనూ మావోయిస్టు ఉద్యమం ఆ రాష్ట్రాల్లో బలంగా ఉన్న ఆదివాసీ ప్రాంతాల్లో అమలవుతున్నాయి.

జీతన్ మరాండీ ప్రముఖ ఆదివాసీ సాంస్కృతిక కళాకారుడు, ఝార్ఖండ్ అభేన్ అనే సాంస్కృతిక సంస్థ నాయకుడు, అఖిల భారత విప్లవ సాంస్కృతిక సమాఖ్య నాయకుడు. విప్లవ గానాల్నీ, సంస్కృతినీ ప్రచారం చేస్తూ ఆయన దేశవ్యాప్తంగా పర్యటించారు. అనిల్ రామ్, మనోజ్ రాజ్‌వర్, ఛత్రపతి మండల్‌లు కూడా ఆదివాసీ, దళిత సాంస్కృతిక కళాకారులు. జీతన్ చిన్నతనం నుండే సాంస్కృతిక ప్రతిభను కనబరిచాడు. క్రమంగా ఆయన మన దేశంలోనే అత్యుత్తమ కళాకారుల్లో ఒకరిగా ఎదిగారు. చైతన్యవంతమైన పిల్లవాడిగా ఆయన తాను భాగమైన ఆదివాసీ సమాజ స్థితిగతులను పట్టించుకోకుండా వుండలేకపోయాడు. ఆదివాసుల దారిద్ర్యానికీ, దోపిడీకీ, అణచివేతకూ మూలకారణాలను తెలుసుకోవడానికి

ఆయన చేసిన సామాజిక పరిశోధన సహజంగానే ఆయనను విప్లవ రాజకీయాలకేసి తీసుకుని పోయింది. ఆయనా, ఆయన సాంస్కృతిక సంస్థ ప్రజల చైతన్యాన్ని పెంపొందించడానికి విప్లవ రాజకీయాలను ప్రచారం చేస్తాయి.

తమ భావాలను బహిరంగంగా ప్రచారం చేయడం నేరం కాదు, అందుకు ఎవరూ శిక్షార్హులు కారు. భారతదేశ పాలకవర్గాలు ఎటువంటి నిరసననూ సహించడానికి సిద్ధంగా లేక ప్రజల సహజ వనరులనూ, అపారమైన ఖనిజ సంపదనూ లూటీ చేయడానికి ఉద్దేశించిన సామ్రాజ్యవాద అనుకూల, ప్రజావ్యతిరేక విధానాలను వ్యతిరేకించే గళాలన్నిటినీ నొక్కేయడానికి అన్ని రకాల కుయుక్తులకూ పాల్పడుతున్నాయి. నిజమైన ప్రజా కళాకారులుగా వారు దేశ పాలకవర్గాల విస్థాపన విధానాలకు అత్యంత దృఢమైన ప్రతిఘటనల్లో ఒకటిగా నిలుస్తున్న ఝార్ఖండ్‌లోని విస్థాపన వ్యతిరేక ఉద్యమానికి ముందుపీఠీన నిలిచారు. రాజ్యం వారిని ఈ రాజకీయ కార్యకలాపాల కోసమే శిక్షిస్తోంది తప్ప ఏదో ఛిల్కారీ కేసు కోసం కాదనేది తేటతెల్లమే. ఎందుకంటే ఛిల్కారీ సహా వారి మీద పెట్టిన డజన్లకొద్దీ కేసులన్నీ తప్పుడువే అనేది అందరికీ తెలిసినదే. బీహార్, ఝార్ఖండ్‌లలో జరిగిన భూస్వామ్య వ్యతిరేక పోరాటాల్లో భూస్వాములు తమ ప్రైవేటు సైన్యాల ద్వారా రైతాంగంపై, ప్రత్యేకించి దళితులపై ఊచకోతలు సాగించారు. రైతాంగం ఆత్మరక్షణలో భాగంగా ప్రతిహింసను చేపట్టక తప్పలేదు. ఛిల్కారీ వంటి ఘటనలు అందులో భాగమే. ఇటువంటి సంఘటనలకు గల మూలకారణాలను వెతకకుండా రాజ్యం వీటిని ఉపయోగించుకుని ప్రజాసంఘాలపై తప్పుడు కేసులను బనాయించి, వారి గొంతు నులమడానికి ప్రయత్నిస్తోంది. మొదటగా వారు రాంచీలోని రాజ్‌భవన్ ముందు రాజకీయ ఖైదీల సమస్యపై రెచ్చగొట్టే ప్రసంగాలు చేశాడనే సాకుతో జీతన్ మరాండీపై 2007లో ఒక రాజద్రోహ కేసును పెట్టారు. అప్పటినుంచీ ఆయనను జైల్లో పడేసి తప్పుడు కేసులతో వేధిస్తున్నారు. అంతకు ముందు కూడా ఆయనను చాలాసార్లు అరెస్టు చేసి కొన్నిసార్లు దారుణంగా కొట్టారు కూడా. చివరిగా ఆప్పుడీ కుట్రలన్నిటికీ పరాకాష్టగా మరణదండన విధించి ఆయన గొంతును శాశ్వతంగా నొక్కేయాలని చూస్తున్నారు. రాజ్యం ఎంత సిగ్గుమాలినతనంగా వుందంటే ఆయనను తానే స్వయంగా జైల్లో బంధించి ఉన్నప్పుడు జరిగిన పీర్టాండ్, తీస్రీ పోలీస్ స్టేషన్‌ల కేసులను కూడా ఆయనపై బనాయించింది !

మన దేశం 200 ఏండ్ల సుదీర్ఘకాలం బ్రిటిష్‌వారి వలసపాలనలో మగ్గిపోయింది. ఫలితంగా ఎన్నో ఆదివాసీ తిరుగుబాట్లకు సాక్ష్యంగా నిలిచింది. బ్రిటన్ సామ్రాజ్యవాదం ఆధునిక ఆయుధాల దన్నుతో పాశవిక బలాన్ని ప్రయోగించి ఈ తిరుగుబాట్లను అణచివేయ బూనుకున్నది. తిరుగుబాట్ల నాయకులను ఉరితీయడం అనేది అది అత్యధికంగా వుపయోగించిన అణచివేత ఎత్తుగడల్లో ఒకటి. వలస పాలకుల అణచివేత యంత్రాంగానికి వారసులైన దళారీ భారత పాలకవర్గాలు వారి అడుగజాడల్లోనే నడుస్తున్నారు. కామ్రేడ్స్ భూమయ్య, కిష్టాగౌడ్‌లు 'స్వతంత్ర' భారతావనిలో ఉరితీయబడిన మొదటి విప్లవ రైతాంగ

కార్యకర్తలు. ఆ తర్వాత అనేకమంది విప్లవ కార్యకర్తలను, ప్రత్యేకించి (ఇప్పటి ఝార్ఖండ్‌ను కూడా కలిపి ఉన్న) బీహార్ విప్లవ రైతాంగ కార్యకర్తలను తప్పుడు కేసుల్లో ఇరికించి మరణదండన విధించిన ఘటనలు అనేకం జరిగాయి. ప్రజాలాయర్లు, పౌరహక్కుల నాయకులూ అయిన కెజి కన్నాబిరాన్, పత్తిపాటి వంటివారు తమ పౌరహక్కుల సంఘాల్లో భాగంగా కోర్టుల్లోనూ, బయటా కూడా ప్రత్యేకమైన మరణదండనల్ని రద్దు చేయాలని పోరాడ్డమే కాక, మొత్తంగానే మరణదండనలను రద్దు చేయాలని విశాల ఉద్యమాల్ని నిర్మించారు. రాజ్యం ఆదివాసీ గూడేల్లో రోజువారీగా ఊచకోతలనూ, బూటకపు ఎన్‌కౌంటర్లనూ, అత్యాచారాలనూ కొనసాగిస్తూనే మరింతగా ఉరిశిక్షల వంటి ఫాసిస్టు చర్యలకు కూడా పాల్పడుతుందనేది తేటతెల్లమౌతున్న ఈ తరుణంలో ఈ పోరాటాన్ని మరింత విశాల ప్రాతిపదికన చేపట్టాల్సిన అవసరం వుంది. నారాయణపట్నాకు చెందిన సింగన్నను పోలీసులు సూటిగా గురిచూసి కాల్చి చంపారు. లాల్‌గఢ్‌కు చెందిన లాల్‌మోహన్ టుడును బూటకపు ఎన్‌కౌంటర్లో కాల్చి చంపారు. ఇప్పుడు ఝార్ఖండ్‌కు చెందిన జీతన్ మరాండీకి ఉరిశిక్ష వేశారు. భూస్వామ్యానికీ, దళారీ నిరంకుశ బూర్జువా వర్గానికీ, సామ్రాజ్యవాదానికీ వ్యతిరేకంగా జరుగుతున్న ప్రజాఉద్యమాల నుండి నాయకులుగా ఎదిగి ముందుకొస్తున్న వారిని హతమార్చాలనే కుట్రలో భాగంగానే ఇదంతా జరుగుతోంది. ప్రజాపోరాటాలకు నాయకత్వాన్ని లేకుండా చేయడం ద్వారా ఆదివాసీ ప్రాంతాలలోని సహజసంపదల్ని అడ్డూ ఆపూ లేకుండా దోచుకోవడానికి గల అడ్డంకుల్ని తొలగించుకోవాలని వారి ప్రయత్నం.

తమకు మరణదండన విధించగానే జీతన్, కోర్టులో గల మరికొందరు ప్రజలూ పాడినట్టుగా - రాజ్యం అమలు చేస్తున్న ఈ ఫాసిస్టు చర్యలన్నీ ప్రజాప్రభంజనాల ద్వారా 'అంతమయ్యే రోజు తప్పక వస్తుంది'. చెరసాలలు, ఉరికొయ్యలు ప్రజల నిజమైన నాయకుల విప్లవచేవను గొంతు నులమలేవు, వారు చివరకంటా పోరాడుతారు.

జీతన్ మరాండీ, అనిల్ రామ్, మనోజ్ రాజ్‌వర్, ఛత్రపతి మండల్‌లకు విధించిన మరణదండనలను తక్షణం రద్దు చేయాలని సిపిఐ (మావోయిస్టు) డిమాండ్ చేస్తోంది. అన్ని ప్రజాస్వామిక, పౌరహక్కుల సంఘాలకూ, రాజకీయ ఖైదీల విడుదలకై పోరాడే సంఘాలకూ, ప్రత్యేకించి కళా, సాహిత్య సంఘాలకూ, ఆదివాసీ సాంస్కృతిక సంస్థలకూ మరణదండనల రద్దుకై, ఈ ప్రజా కళాకారుల విడుదలకై విశాల ఉద్యమాలను నిర్మించాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం. మొత్తంగా మరణదండనల రద్దు కోసం జరిగే ఉద్యమంగా దీన్ని విశాల ప్రాతిపదికన కొనసాగిద్దాం.

**అభయ్**

**అధికార ప్రతినిధి, కేంద్ర కమిటీ**

**సీపీఐ (మావోయిస్టు)**

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# కేంద్ర కమిటీ

**17-7-2011**

## ముంబాయిలో జరిగిన హేయమైన బాంబు దాడుల్ని తీవ్రంగా ఖండించండి! మక్కా మసీదు, మాలెగాం, సమ్‌ఝౌతా ఎక్స్‌ప్రెస్ సహా బాంబు పేలుళ్ల సంఘటనలన్నిటిపై నిష్పాక్షిక, స్వతంత్ర న్యాయవిచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేయండి!!

జూలై 13, 2011న ముంబాయిలో జరిగిన బాంబు దాడుల్ని భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) తీవ్రంగా ఖండిస్తోంది. దాదాపు 20 మంది సామాన్య ప్రజలు ప్రాణాలు కోల్పోవడానికి, 80 మందికి పైగా గాయపడడానికి దారితీసిన ఈ వరుస బాంబు పేలుళ్ల సంఘటనను అమానవీయమైనదిగా పరిగణిస్తుంది. నిర్దిష్టంగా ఈ బాంబు పేలుళ్లకు పాల్పడింది ఎవరనేది ఇంకా స్పష్టం కాకుండానే, విచారణ సైతం ప్రారంభం కాకముందే మావోయిస్టు పార్టీకి కూడా ఇందులో ప్రమేయం వుండొచ్చని దోపిడీ పాలకవర్గాలు, వాటి పోలీస్/ఇంటెలిజెన్స్ సంస్థలు కుట్రపూరితంగా, నిరాధారంగా చేస్తున్న ఆరోపణల్ని మా పార్టీ తీవ్రాతితీవ్రంగా ఖండిస్తోంది. పీడిత ప్రజల విముక్తి లక్ష్యంగా పోరాడే మా పార్టీ సామాన్య ప్రజలను టార్గెట్ చేసే, వాళ్లకు ప్రాణనష్టం కలిగించే దాడులకు పాల్పడదని దేశ పీడిత ప్రజానీకానికి స్పష్టంగా తెలుసు. మా పార్టీని టెర్రరిస్టు సంస్థగా, మా న్యాయమైన ప్రజా వుద్యమాన్ని టెర్రరిస్టు ఉద్యమంగా చిత్రించాలనీ, తద్వారా తాము సాగిస్తున్న దారుణ అణచివేతకు, ప్రజలపై సాగిస్తున్న యుద్ధం (ఆపరేషన్ గ్రీన్‌హంట్) రెండో దశలో భాగంగా ప్రస్తుతం చేస్తున్న సైన్యం మోహరింపుకు ఆమోదముద్రను పొందాలనే దురుద్దేశ్యంతోనే దోపిడీ పాలకవర్గాలు, వాటికి వంతపాడే కార్పొరేట్ మీడియా మాపై కావాలని నింద మోపుతున్నాయి.

ఇప్పటి వరకు మన దేశంలో జరిగిన బాంబు పేలుళ్ల సంఘటనలన్నిటినీ పరిశీలిస్తే చాలా వాటిలో అసలు దోషులెవరో, బైటికి దోషులుగా చూపెట్టబడుతున్న వాళ్ల వెనుక దాగున్న అసలు నేరస్తులెవరో తేలనే లేదు. హిందూమత పక్షపాతియైన భారత రాజ్యం, దాని ఇంటెలిజెన్స్/నేర విచారణ సంస్థలు, కార్పొరేట్ మీడియా ఇలాంటి పేలుళ్ల సంఘటనలు జరిగిన వెంటనే ఎలాంటి ఆధారాలు లేకుండానే వాటికి బాధ్యులుగా ముస్లింలను, సోకాల్డ్ ఇస్లామిక్ టెర్రరిస్టు సంస్థలను చూపించడం పరిపాటి అయ్యింది. ఇలాంటి దాడులన్నిటికీ

ముస్లిం సమాజాన్ని దోషిగా నిలబెట్ట జూసే భారత రాజ్యం, కాంగ్రెస్, బీజేపీ వంటి పాలకపార్టీల నేతలు పన్నిన కుట్రలో భాగంగా, స్వయంగా ఐబీ సృష్టించిన ఇండియన్ ముజాహిదీన్ అనే ఒక బూటకపు సంస్థను ఇటీవల జరిగిన ప్రతి బాంబు పేలుడు సంఘటనలోనూ దోషిగా ప్రచారం చేస్తున్నారు. ఈ ఆరోపణల్లో సత్యాసత్యాల్ని ప్రశ్నించే వాళ్లపై, వీటిపై సమగ్ర/నిష్పక్ష న్యాయవిచారణ జరగాలని కోరేవాళ్లపై ఏకంగా దేశద్రోహులనే ముద్ర వేస్తూ కార్పొరేట్ మీడియా ప్రభువులు, పాలకవర్గాల తొత్తు మేధావులు నిర్హేతుకంగా, ఆవేశపూరితంగా, దాడిపూర్వకంగా విరుచుకుపడుతున్నారు. దాంతో అసలు వాస్తవాలేమిటో తెలుసుకునే అవకాశం మెజారిటీ ప్రజలకు కలగకుండానే పోతున్నది. నిజానిజాల్ని వెలికితీయాలని అడగకుండా వుండడం దేశభక్తికి, అడగడం దేశద్రోహానికి గీటురాయిగా మారిపోవడం ప్రపంచంలో అతి పెద్ద ప్రజాస్వామ్యం అని చెప్పబడే మన దేశంలో అతి పెద్ద విచిత్రం!

గతంలో జరిగిన మక్కా మసీదు, మాలెగాం, సమ్‌ఝౌతా ఎక్స్‌ప్రెస్ బాంబు పేలుళ్ల కేసుల్లో పోలీసులు వందలాది నిర్దోషులైన ముస్లింలను, ముఖ్యంగా యువకుల్ని అరెస్టు చేసి, అమానవీయ హింసలకు గురి చేసి తప్పుడు కేసుల్లో జైలుపాలు చేశారు. ఎంతో మందిని బూటకపు ఎన్‌కౌంటర్లలో చంపేశారు. తర్వాతి కాలంలో ఈ దారుణ సంఘటనలకు పాల్పడ్డది సంఘ్ ముఠా (ఆర్‌ఎస్‌ఎస్)కు చెందిన హిందూ మత దురహంకార సంస్థలని అనేక ఆధారాలు లభించినా బాధిత ముస్లింలకు న్యాయం జరగనే లేదు. అభినవ్ భారత్, హిందూ డిఫెన్స్ ఫోర్స్, రాష్ట్రీయ జాగరణ్ మంచ్, బజరంగ్ దళ్, విశ్వహిందూ పరిషత్ తదితర హిందూ టెర్రరిస్టు సంస్థల నేతలెవరికీ ఇప్పటి వరకు శిక్ష పడింది లేదు. అదే సమయంలో పార్లమెంట్‌పై దాడి కేసులో అఫ్జల్ గురుకు, గత మార్చ్ 1న గోధ్రా రైలు దహనకాండ కేసులో 11 మంది ముస్లింలకు ఉరిశిక్ష విధిస్తూ తీర్పులివ్వడం రాజ్యం ముస్లిం వ్యతిరేక, హిందూ మతతత్వ అనుకూల స్వభావానికి మచ్చుతునకలు. రెండు వేల మందికి పైగా అమాయక ముస్లింల నరమేధానికి బాధ్యులైన నరేంద్ర మోది వంటి హంతకులు బోర విరుచుకొని ఊరేగుతుండగా, అసంబద్ధమైన, అరకొర సాక్ష్యాలతో ముస్లింలకు శిక్షలు విధించడం ద్వారా రాజ్యం ముస్లిం ప్రజలను తీవ్ర అసంతృప్తికి, ఆక్రోశానికి గురి చేసింది.

బాబ్రీ మసీదు విధ్వంసం, గుజరాత్ నరమేధం తదితర కారణాలతో ముస్లిం సమాజంలో, ముఖ్యంగా యువజనులలో ఒక పెద్ద సెక్షన్ భారత పాలక వర్గాలపై తీవ్ర అసంతృప్తితో వున్నారనేది ఒక వాస్తవం. ఈ అసంతృప్తి నుండి కొన్ని ఇస్లామిక్ సంస్థలు పుట్టుకువచ్చాయనేది నిరాకరించ వీలు లేని మరో వాస్తవం. ఈ పరిస్థితిని ఆసరా చేసుకొని, ఇలాంటి సంస్థలను చేరదీసి లేదా వాటిని కుట్రపూరితంగా తప్పు తోవ పట్టించి, కొన్ని కొత్త సంస్థల్ని పుట్టించి భారత్, పాకిస్తాన్ రెండింటికీ చెందిన ఆర్‌ఏడబ్ల్యూ (రా), ఐబీ, ఐఎస్ఐ వంటి గూఢచర్య సంస్థలు తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం రెండు దేశాల్లోనూ ఇలాంటి బాంబు పేలుళ్లు, దాడులు చేయిస్తున్నాయి. అసంతృప్తి, ఆవేశాలతో వున్న ముస్లిం యువకులు

ఎందరో ఈ వుచ్చులో చిక్కుకొని తమ అసలు శత్రువులెవరో తెలుసుకోలేక, ఇలాంటి మతిలేని హింసాత్మక చర్యలలో పాల్గొంటున్నారు. సామాన్య ప్రజల దుర్మరణానికి కారకులవుతున్నారు. ఇది ఎలాంటి విషవలయం అంటే ఈ యువకులకు తమను పరదా చాటు నుండి నడిపిస్తున్నది ఎవరనే విషయం గానీ, ఇలాంటి దాడులతో ఏ వర్గాలకు ప్రయోజనం కలుగుతున్నదనే విషయం గానీ తెలియదు కూడా.

మరోవైపు మాలెగాం, మక్కా మసీదు, సమ్‌ఝౌతా ఎక్స్‌ప్రెస్ పేలుళ్ల సంఘటనలకు పాల్పడ్డది 'అభినవ్ భారత్' అనే సంఘ్ ముఠా (ఆర్ఎస్ఎస్)కు చెందిన సంస్థ అని స్పష్టమైన ఆధారాలు లభించిన తర్వాత కాషాయ టెర్రరిజాన్ని ఒక ప్రమాదకరమైన ధోరణిగా దేశ ప్రజలు గుర్తించే క్రమం మొదలైంది. ఆ తర్వాత అజ్మేర్ షెరీఫ్ పేలుడుకు పాల్పడింది కూడా కాషాయ టెర్రరిస్టులేనని బైట పడిన తర్వాత మొత్తంగానే మన దేశంలో వివిధ చోట్లలో జరిగిన పేలుళ్ల సంఘటలపై ఇప్పటి వరకు జరిగిన విచారణలన్నిటినీ సమీక్షించాలనే డిమాండ్ ముందుకొచ్చింది. మాలెగాం, హైద్రాబాద్‌లకు చెందిన పోలీసు అత్యాచారాలకు గురైన ముస్లిం యువజనులు ప్రభుత్వం తమకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నాయకత్వంలోని యూపీఏ ప్రభుత్వం పైకి మాట్లాడేది ఏమైనప్పటికీ తన స్వార్థ రాజకీయ ప్రయోజనాల రీత్యా కాషాయ టెర్రరిజంతో అంటకాగుతూ ఈ డిమాండ్లను పెడచెవిన పెడుతూ వస్తున్నది. సాధారణంగా హిందూ మతతత్వానికి వత్తాసు పలికే కార్పొరేట్ మీడియా ఆధారాలు లేకుండానే ముస్లింలపై, ఇస్లామిక్ సంస్థలపై ఎంతైతే దూకుడుగా విరుచుకుపడుతుందో, అదే సమయంలో వివిధ బాంబు పేలుళ్ల సంఘటనలలో కాషాయ టెర్రరిస్టు సంస్థల ప్రమేయం వుందని స్పష్టమైన ఆధారాలు బైటపడినప్పటికీ దానిపై వీలైనంత తక్కువ రిపోర్ట్ చేస్తున్నది లేదా తొక్కిపడుతున్నది.

ఈ నేపథ్యం నుండి చూసినపుడు జూలై 13 ముంబాయి బాంబు పేలుళ్లకు పాల్పడింది కూడా కాషాయ టెర్రరిస్టు సంస్థలు లేదా స్వయంగా ఐబీ, రా వంటి గూఢచర్య సంస్థలు ప్రాయోజితం చేసిన సోకాల్డ్ ఇస్లామిక్ మిలిటెంట్ సంస్థలు కావడానికి అవకాశాలున్నాయి. లేదా పోలీసు అధికారులతో, పాలకవర్గ రాజకీయ నాయకులతో కుమ్మక్కయిన మాఫియా ముఠాలు కూడా ఈ దాడులకు పాల్పడి వుండొచ్చు. చేసింది ఎవరైనా ఇలాంటి మతిలేని హింసాత్మక చర్యల ద్వారా పాలకవర్గాలకే ప్రయోజనాలున్నాయి. మొదటిది, తక్షణం దేశంలో మండుతున్న సమస్యలుగా ముందున్న అధికధరలు, అవినీతి, కుంభకోణాలు, నల్లధనం, స్విస్ బ్యాంక్ ఖాతాలు వంటి వాటి నుండి ప్రజల దృష్టిని మళ్లించడం. రెండోది, టెర్రరిజాన్ని అతి పెద్ద ప్రమాదంగా చూపెట్టి మరిన్ని క్రూర చట్టాల్ని తేవడం, లక్షల కోట్ల ప్రజా ధనాన్ని దుర్వినియోగపర్చుతూ సామ్రాజ్యవాద దేశాల నుండి పెద్ద ఎత్తున ఆయుధాల్ని, సాంకేతిక పరిజ్ఞానాన్ని కొనుగోలు చేసి అణిచివేత యంత్రాంగం కోరల్ని మరింత పదునుదేర్చడం. మూడోది, అమెరికన్ సామ్రాజ్యవాదం 'టెర్రరిజంపై యుద్ధం' పేరుతో ప్రారంభించిన

దురాక్రమణ యుద్ధాలకు, దాడులకు, బెదిరింపులకు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో మద్దతు తెలుపుతూ దక్షిణాసియా ప్రాంతంలో దానికి జూనియర్ భాగస్వామిగా వ్యవహరిస్తున్న భారత రాజ్యం హోంల్యాండ్ సెక్యూరిటీ, పౌర అణు ఒప్పందం తదితర దేశద్రోహకర ఒప్పందాలతో దేశాన్ని మరింతగా సామ్రాజ్యవాదానికి దాసోహం చేయడం. నాల్గోది, ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక, సామ్రాజ్యవాద అనుకూల నయా ఉదార విధానాలకు వ్యతిరేకంగా పెల్లుబుకుతున్న ప్రజా వుద్యమాల్ని, పెంపొందుతున్న మావోయిస్టు విప్లవోద్యమాన్ని సైనికంగా అణచివెయ్యడానికి టెర్రరిజం బూచిని చూపెట్టి ప్రజాభీష్టాన్ని అనుకూలంగా మల్చుకోవడం. ఇక ఆధారాలు లేనప్పటికీ ప్రతిసారీ ఇలాంటి పేలుళ్లకు ముస్లింలను, ఇస్లామిక్ సంస్థలను బాధ్యులుగా చేయడం ద్వారా హిందూ వోట్‌బ్యాంకును సంఘటితపర్చుకోవడం, మొత్తంగానే దేశ ప్రజల మౌలిక సమస్యలైన తిండి, బట్ట, గూడు, అధికధరలు, నిరుద్యోగం, పేదరికం, ఆకలిచావులు, విస్థాపన వంటి వాటి నుండి దృష్టిని మళ్లించి తమ దోపిడీ పాలనను నిరాటంకంగా కొనసాగించడం కాంగ్రెస్, బీజేపీ రెండింటికీ, అవి ప్రాతినిధ్యం వహిస్తున్న భూస్వామ్య, దళారీ పెట్టుబడిదారీ వర్గాలకూ అవసరం.

కాబట్టి ముంబాయి పేలుళ్లకు బాధ్యులెవరనేది నిష్పక్షపాతమైన, స్వతంత్రమైన విచారణ ద్వారానే తేలగలదని భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) అభిప్రాయపడుతున్నది. పాలకవర్గాలు, వాళ్ల ఇంటలిజెన్స్ సంస్థలు, కార్పొరేట్ మీడియా ఉన్మాదపూరితంగా, ఏకపక్షంగా, నిర్హేతుకంగా చేసే ప్రచారానికి, అపోహలకు, పూర్వభావనలకు బలి కావద్దని మా పార్టీ దేశ ప్రజలకు, ప్రజాస్వామికవాదులకు విజ్ఞప్తి చేస్తున్నది. ఈ పేలుళ్లకు బాధ్యులైన వాళ్లను బైటికి ఈడ్చి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేయాలని మా పార్టీ కోరుతున్నది. అదే సమయంలో 1992 నుండి ఇప్పటి వరకు జరిగిన బాంబు పేలుళ్ల సంఘటనలన్నిటిపై నిష్పక్షపాత, స్వతంత్ర పునర్విచారణ జరపాలని, తప్పుడు కేసులతో జైళ్లల్లో మగ్గుతున్న ముస్లింలను, క్రైస్తవులను బేషరతుగా విడుదల చేయాలని ప్రభుత్వాల్ని డిమాండ్ చేయాలని మా పార్టీ దేశ ప్రజలకు పిలుపునిస్తున్నది. బాబ్రీ మసీదు విధ్వంసానికి, గుజరాత్ నరమేధం, కంధమాల్ (ఒడిషా) దాడులు సహా దేశంలో మైనారిటీ మతస్తులపై జరిగిన దాడులన్నిటికీ బాధ్యులైన కాషాయ టెర్రరిస్టు నేతలను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేయాలనీ, హిందూ మత దురహంకారాన్ని, అన్ని రకాల మత ఛాందసవాదాల్ని ఖండించాలనీ మా పార్టీ దేశ ప్రజలందరినీ కోరుతున్నది.

**అభయ్**

**అధికార ప్రతినిధి**

**కేంద్ర కమిటీ**

**సీపీఐ (మావోయిస్టు)**

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# కేంద్ర కమిటీ

**19-8-2011**

## మావోయిస్టు విప్లవోద్యమ నాయకత్వంపై దోపిడీ పాలకవర్గాలు, కార్పొరేట్ మీడియా సాగిస్తున్న విషపూరిత దుష్ప్రచారాన్ని చెత్తకుప్పపైకి విసరెయ్యండి!

నేడు భారత విప్లవోద్యమం కఠిన సవాళ్లను ఎదుర్కొంటూ గెలుపు-ఓటమి-గెలుపు మార్గంలో పురోగమిస్తున్నది. ఈ విప్లవోద్యమాన్ని సమూలంగా నిర్మూలించే లక్ష్యంతో దోపిడీ పాలకవర్గాలు సామ్రాజ్యవాదుల పూర్తి అండదండలతో క్రూరమైన అణచివేత యుద్ధాన్ని కొనసాగిస్తున్నాయి. ముఖ్యంగా అమెరికన్ సామ్రాజ్యవాదులు రూపొందించిన ఎల్ఐసీ (తక్కువ తీవ్రత గల ఘర్షణ) వ్యూహాన్ని అనుసరిస్తూ ఈ ఫాసిస్టులు ప్రతిఘాతుక యుద్ధాన్ని కొనసాగిస్తున్నారు. ప్రత్యేకించి 2009 నుండి యూపీఏ ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో 'ఆపరేషన్ గ్రీన్‌హంట్' పేరుతో దేశవ్యాప్తంగా అణచివేత యుద్ధాన్ని కొనసాగిస్తున్నది. సోనియా-మన్‌మోహన్‌సింగ్- చిదంబరం-ప్రణబ్ ముఖర్జీల ముఠా నాయకత్వంలో దేశ ప్రజలపై కొనసాగుతున్న ఈ అన్యాయమైన యుద్ధంలో 'అణచివేత-అభివృద్ధి'ని (ప్రజల అణచివేత, కార్పొరేట్ సంస్థల అభివృద్ధి అని చదువుకోవాలి) తమ వ్యూహంగా చెబుతున్నారు. ఇందులో భాగంగా విప్లవోద్యమ నాయకత్వానికి వ్యతిరేకంగా దుష్ప్రచారం కీలక అంశంగా సాగే మానసిక యుద్ధాన్ని ఒక వ్యూహాత్మక అస్త్రంగానే వుపయోగిస్తున్నారు. ఈ మానసిక యుద్ధానికి ఒక ముఖ్యమైన వాహికగా మీడియాను వుపయోగించుకుంటున్నారు. కార్పొరేట్ వర్గాలకు ప్రాతినిధ్యం వహించే మీడియా ప్రతినిధులు, దోపిడీవర్గాల భావజాలాన్ని సమర్థించే కుహనా మేధావులు మావోయిస్టు వుద్యమంపై బురద జల్లే క్యాంపెయిన్‌ను కొనసాగిస్తూ శత్రు మానసిక యుద్ధంలో చురుగ్గా పాలు పంచుకుంటున్నారు.

విప్లవోద్యమానికి ఎంత చరిత్ర వుందో విప్లవ వ్యతిరేక దుష్ప్రచారానికీ అంతే చరిత్ర వుంది. ఒక అబద్ధాన్ని వందసార్లు చెబితే అది నిజమై తీరుతుందని చెప్పిన జర్మన్ ఫాసిస్టు ప్రచార మంత్రి గోబెల్స్‌కు సిసలైన ఇండియన్ అవతార్స్‌గా ముందుకు వచ్చిన సోనియా, మన్మోహన్ సింగ్, చిదంబరం, ప్రణబ్ ముఖర్జీ, రమన్‌సింగ్, నవీన్ పట్నాయక్, నితీష్ కుమార్,

కిరణ్‌కుమార్ తదితర పాలకులు, వాళ్ల వంతగాళ్లయిన అర్నాబ్ గోస్వామి, చందన్ మిత్రా తదితరులు మీడియాలో వివిధ రూపాల్లో దుష్ప్రచార క్యాంపెయిన్ నడుపుతున్నారు. విప్లవ సిద్ధాంతమైన మార్క్సిజానికి కాలం చెల్లిందనే ప్రచారం మొదలుకొని మావోయిస్టు నేతల మధ్య తీవ్ర విభేదాలున్నాయనే దాకా విప్లవోద్యమ నాయకత్వానికి, నాయకత్వ సంస్థలకు వ్యతిరేకంగా అభూత కల్పనలతో, అసత్యాలతో, అర్ధసత్యాలతో వార్తల్ని ప్రతిరోజూ ప్రచురిస్తున్నారు, ప్రసారం చేస్తున్నారు. విప్లవ సిద్ధాంతంపై, విప్లవోద్యమానికి నాయకత్వం వహిస్తున్న మా పార్టీపై, పార్టీ నాయకత్వంపై అపోహల్ని, అనుమానాల్ని, భ్రమల్ని సృష్టించి ప్రజలను, విప్లవ శ్రేణుల్ని గందరగోళపర్చడం, నిరాశను, అవిశ్వాసాన్ని వ్యాపింపజెయ్యడం ఈ దుష్ప్రచార క్యాంపెయిన్ ఏకైక లక్ష్యం. ఇలా ప్రజల్ని మోసపుచ్చి తమ దోపిడీ వర్గ పాలనను నిరాటంకంగా కొనసాగించగలమని, సామ్రాజ్యవాద అనుకూల ఆర్థిక విధానాలను అడ్డూఆపూ లేకుండా అమలు చేయగలమని దోపిడీపాలకులు, వాళ్లకు వంతపాడే కుహనా మేధావులు కల గంటున్నారు. ఈ కోవలోకి వచ్చే కొందరు జర్నలిస్టులు ఇంటలిజెన్స్ అధికారులతో కుమ్మక్కయ్యి, కార్పొరేట్ మీడియా సంస్థల ద్వారా మావోయిస్టు విప్లవోద్యమంపై బురదజల్లే చెత్తను ప్రసారం, ప్రచారం చేస్తున్నారు. ఇందులో భాగమే 2011 జూలై 17న 'టైమ్స్ ఆఫ్ ఇండియా' పత్రికలో 'బిట్టర్ డిఫరెన్సెస్ క్రాప్ అప్ బిట్వీన్ మావోయిస్ట్ పీడబ్ల్యూ అండ్ ఎంసీసీ ఫాక్ష్యన్స్' అనే పేరుతో ప్రచురితమైన వికృత కట్టుకథ.

దేశ ఇంటలిజెన్స్ సంస్థలు రూపొందించిన, రాఖీ చక్రవర్తి రాసిన ఈ కట్టుకథలో మావోయిస్టు పార్టీ నాయకత్వాన్ని వ్యక్తిగతంగా టార్గెట్ చేయడమే గాకుండా పార్టీలో పీడబ్ల్యూ, ఎంసీసీ ఫ్యాక్షన్లను కృత్రిమంగా పుట్టించి, వాటి మధ్య తీవ్ర విభేదాలున్నట్టు రాశారు. దేశ పీడిత ప్రజల, ప్రపంచవ్యాప్త విప్లవ శ్రేణుల చిరకాల ఆకాంక్షల ఫలితంగా, ఎన్నో సుసంపన్నమైన అనుభవాలతో, చీకటి అధ్యాయంగా పేర్కొన్న ఒక అత్యంత బాధాకరమైన పీరియడ్‌ను అధిగమించి సాధించిన రెండు విప్లవ పార్టీల ఐక్యత మన దేశ విప్లవోద్యమ చరిత్రలోనే ఒక మహోజ్వల ఘట్టం. కేవలం నిజమైన, నిస్వార్థపరులైన విప్లవకారులు మాత్రమే ఇలా బహిరంగంగా తమ తప్పుల్ని అంగీకరించి, ప్రజలను క్షమాపణలు కోరుతారు. వాటిని పునరావృతం కానివ్వకుండా దృఢ సంకల్పంతో పని చేస్తారు. అందుకే ఈ నిజమైన ఐక్యతతో దేశంలోనూ, ప్రపంచంలోనూ పీడిత ప్రజానీకం, విప్లవ శ్రేణులు ఎంతగా ఉత్సాహపడ్డాయో భారత దోపిడీ పాలకవర్గాలు, వాళ్ల యజమానులైన సామ్రాజ్యవాదులు అంతగా కలవరపడ్డారు. భయభ్రాంతులయ్యారు. సామ్రాజ్యవాదుల నమ్మిన బంటు, దేశ ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ మావోయిస్టు వుద్యమాన్ని దేశ ఆంతరంగిక భద్రతకు అతి పెద్ద ప్రమాదం అని అభివర్ణించడం మొదలుపెట్టింది ఈ చారిత్రాత్మక ఐక్యత నేపథ్యంలోనే అన్నది గమనార్హం. రెండు పార్టీల మధ్య ఐక్యత పూర్తయిన నాటి నుండి దేశ పాలక ముఠా

విప్లవోద్యమంపై ఫాసిస్టు దాడిని మరింత బరితెగింపుతో పెంచింది కూడా ఒక కాదనలేని వాస్తవం.

విప్లవ పార్టీల ఉన్నత నాయకుల మధ్య ఊహాజనిత విభేదాల్ని సృష్టించడమన్నది పాలక వర్గాలు ఎప్పటి నుండో అనుసరిస్తున్న పాత ఎత్తుగడ. విప్లవోద్యమ నాయకుల్లో నెలకొన్న ఇలాంటి కెరీరిజాలతో, వైరుధ్యాలతో ఈ పార్టీలు కూడా తమకు సరిగా నాయకత్వం వహించలేవని ప్రజలు నమ్మేలా చేయడం దీని ఉద్దేశ్యం. ప్రపంచ వ్యాప్తంగా ఇలాంటి వుదాహరణలు ఎన్నయినా చెప్పవచ్చు. టైమ్స్ ఆఫ్ ఇండియాలో ప్రచురితమైన ఈ వార్త ఎన్నో దశాబ్దాలుగా ప్రజలకు నిస్వార్థంగా సేవ చేస్తున్న మా నాయకులకు వ్యతిరేకంగా ఎక్కుపెట్టిన అత్యంత విషపూరిత దుష్ప్రచారాల్లో ఒకటి. వాళ్లలో కొందరు ప్రస్తుతం జైళ్లల్లో మగ్గుతుండగా రాజ్యం వాళ్లకు ఎలాంటి సదుపాయాలు అందకుండా, వృద్ధాప్యంలో సైతం ఎలాంటి వైద్య సహాయం దొరక్కుండా చేసి అమానవీయంగా వ్యవహరిస్తున్నది. పీడిత ప్రజల విముక్తి కోసం తమ సర్వస్వాన్ని అర్పించిన మా నాయకుల పట్ల రాజ్యం అనుసరిస్తున్న దమననీతి రోజురోజుకూ ఎన్నడూ చూడనంత దారుణ స్థాయికి చేరుతున్నది. ఒక రకంగా చూస్తే, విప్లవ రాజకీయాల ప్రభావం పెరిగిపోతుండడం పట్ల రాజ్యం ఎలా భయపడుతున్నదో, దీన్ని తగ్గించడం కోసం ఎంత నిరర్థకంగా కుయుక్తులు పన్నుతున్నదో దీని ద్వారా అర్థమవుతున్నది. మా నాయకత్వంపై చేస్తున్న ఈ ఆరోపణలన్నిటినీ మా పార్టీ పూర్తిగా తోసిపుచ్చుతున్నది. వీటిలో ఒక్క పదాన్ని కూడా నమ్మవద్దని పీడిత ప్రజలకూ, విప్లవ శిబిరానికీ విజ్ఞప్తి చేస్తున్నది.

నిజమైన విప్లవ పార్టీలన్నిటిలోనూ అనేక అభిప్రాయ భేదాలుంటాయి. వాటి సభ్యులలో సిద్ధాంత, రాజకీయ, నిర్మాణపరమైన, సైనిక, సాంస్కృతిక తదితర విషయాలపై విభిన్న అభిప్రాయాలుంటాయి. విభిన్న భావాలు చర్చకు వస్తాయి. ప్రతి సభ్యుడు/సభ్యురాలు వాటిపై తమ అభిప్రాయాల్ని వెలిబుచ్చిన తర్వాత మెజారిటీతో అవి తుది రూపం పొందుతాయి. విప్లవ పార్టీలు అనుసరించే ఈ ప్రజాస్వామిక ప్రక్రియను పాలక వర్గ పార్టీలలో ఎన్నడూ చూడలేం. అవి దీన్ని ఎన్నడూ అర్థం చేసుకోలేవు. ఇలాంటి చర్చలు, విమర్శ-ఆత్మవిమర్శల ద్వారానే ఒక విప్లవ పార్టీ తన విప్లవకర స్వభావాన్ని నిలబెట్టుకోగల్గుతుంది తప్ప బూర్జువా పార్టీల మాదిరి ఎవరో ఒక నేతను గుడ్డిగా అనుసరించడం ద్వారా కాదు. వర్గ పోరాట కొలిమిలో రాటుదేలడం ద్వారానూ, పలు విమర్శ-ఆత్మవిమర్శ సెషన్స్‌లో పాలు పంచుకోవడం ద్వారానూ విప్లవకారులు తమను రాటుదేల్చుకుంటారు. ఇంటలిజెన్స్ సంస్థలు పార్టీలో కొనసాగే ఈ ఆరోగ్యకరమైన వాతావరణాన్ని వక్రీకరించి సరిగ్గా దానికి విరుద్ధంగా చిత్రించడానికి ప్రయత్నిస్తున్నాయి. పార్టీ లోపల, అది కూడా పీడబ్ల్యూ, ఎంసీసీ వర్గాల మధ్య తీవ్రమైన విభేదాలున్నాయని ప్రచారం చేయడం ద్వారా ప్రజలను, శ్రేణులను గందరగోళపర్చడానికి

ప్రయత్నిస్తున్నాయి. దీన్ని ముక్తకంఠంతో ఖండించాలనీ, రాజ్యం పన్నే కుట్రల పట్ల అప్రమత్తంగా వుండాలనీ, ఈ దుష్ప్రచారాన్ని పెంటకుప్పపైకి తోసేసి విప్లవోద్యమానికి సంఘీభావంగా దృఢంగా నిలబడాలని భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) కేంద్రకమిటీ దేశ, ప్రపంచ ప్రజానీకానికీ, ప్రజాస్వామికవాదులకూ, విప్లవ శ్రేణులకూ విజ్ఞప్తి చేస్తున్నది.

చివరగా, మా పార్టీ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ గణపతి నిరుడు అక్టోబర్ నెలలో ఇచ్చిన ఇంటర్వ్యూలో పార్టీలో మునుపటి పీడబ్ల్యూ, ఎంసీసీ వాళ్ల మధ్య విభేదాలున్నట్టు జరుగుతున్న దుష్ప్రచారంపై వ్యాఖ్యానిస్తూ మాట్లాడిన విషయం ఈ సందర్భానికి కూడా వర్తిస్తుందని భావిస్తూ మా కేంద్ర కమిటీ ఈ విషయాన్ని మరోసారి నొక్కి చెబుతున్నది.

"...పార్టీలో సరైన భావాలకూ, తప్పుడు భావాలకూ సంఘర్షణ నిరంతరం వుంటుంది. అభిప్రాయభేదాలను కేంద్రీకృత ప్రజాస్వామ్యానికి కట్టుబడి, మార్క్సిజం-లెనినిజం-మావోయిజం వెలుగులో మేం పరిష్కరించుకుంటాం. అది పార్టీ అభివృద్ధికే దారి తీస్తుంది. విలీనంతో మేం గొప్ప ఐక్యతను సాధించాం. ఇప్పుడు మా పార్టీలో ఏ చర్చలు జరిగినా, ఎన్ని భావ సంఘర్షణలు జరిగినా అవి ఒక ఐక్య పార్టీలో జరిగే రాజకీయ, సైద్ధాంతిక చర్చలుగానే వుంటాయి తప్ప మునుపటి సిపిఐ (ఎంఎల్) (పీపుల్స్‌వార్), మునుపటి ఎంసీసీఐల మధ్య విభేదాలుగా ఎంతమాత్రం వుండవు. విలీనం ముందునాటి ఘర్షణల రూపం ఎన్నటికీ తీసుకోదు అని మేం నిర్ద్వంద్వంగా చెప్తున్నాం."

**అభయ్**

**అధికార ప్రతినిధి**

**కేంద్ర కమిటీ**

**సీపీఐ (మావోయిస్టు)**

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# కేంద్ర కమిటీ

**1-10-2011**

## ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని వెంటనే ఏర్పాటు చేయాలి!
## 'సకల జనుల సమ్మె'కు మద్దతుగా 2011 అక్టోబర్ 11న
## 'భారత్ బంద్'ను విజయవంతం చేయండి!

ప్రత్యేక తెలంగాణ ప్రజాస్వామిక ఆకాంక్ష మునుపెన్నడూ లేనివిధంగా ఉవ్వెత్తున ఎగిసి పడుతున్నది. తెలంగాణ ప్రజల ఐక్యత వెల్లివిరుస్తున్నది. ఉద్యోగులు, సింగరేణి, ఆర్‌టిసి, విద్యుచ్ఛక్తి కార్మికులు, విద్యార్థులు, లాయర్లు, ఉపాధ్యాయులు ముందు పీఠీన నిలబడి ప్రారంభించిన 'సకల జనుల సమ్మె'లో చేతి వృత్తుల ప్రజలు, ఆటో డ్రైవర్లు, అసంఘటిత కార్మికులు, మున్సిపల్ కార్మికులు, వ్యాపారస్తులు, పూజారులు, రైతాంగంతో పాటు అన్ని సెక్షన్ల ప్రజలు, కళాకారులు, మేధావులు, ప్రజాస్వామికవాదులు పాల్గొనడంతో నిజమైన సకల జనుల సాధారణ సమ్మెగా మారి రోజు రోజుకూ ఉధృతమవుతున్నది. ఇందులో పాల్గొంటున్న సకల జనుల కుటుంబాలలోని వృద్ధుల నుంచి మహిళలు, పిల్లల వరకు భాగం కావడం ఈ పోరాటం యొక్క విస్తృతిని తెలియజేస్తున్నది. సకల జనుల సమ్మె ప్రభావంతో ప్రజల నుంచి వేరుపడతామేమోననే భయాందోళనలతో తెలంగాణలోని పాలకవర్గ పార్టీలైన కాంగ్రెస్, తెలుగుదేశం, బిజెపి ఒకదానిని మించి మరొకటి 'ఆమోదం పొందని' రాజీనామాలతో నాటకాలాడుతున్నాయి. కాంగ్రెస్ తమ అధిష్టాన వర్గం మీద ఒత్తిడి చేస్తూ తెలంగాణ సాధన కోసం ప్రయత్నిస్తున్నట్లుగా ప్రజల ముందు ప్రదర్శించుకుంటున్నది. సమ్మె వుధృతం కావడంతో కాంగ్రెస్ నాయకులు హుటాహుటిన ఢిల్లీలో తెలంగాణ సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు చెప్పుకుంటున్న గులామ్ నబీ ఆజాద్‌తో మంతనాలు జరిపారు. ఆయన తన రిపోర్టులో షరా మామూలుగానే తెలంగాణా ఏర్పాటు గురించి నిర్ణయం చేయడానికి 'మరింత సమయం' అవసరమని ప్రకటించి తన ద్రోహబుద్ధిని చాటుకున్నాడు. మరోవైపు రకరకాల రాజకీయ ఊహాగానాలు ముందుకు వస్తున్నాయి. సీమాంధ్ర సంపన్న వర్గాల మాటతో మాట కలిపిన కాంగ్రెస్ అధిష్టాన వర్గం ముందు నిర్ణయించుకున్న పథకాలను ముందుకు తెచ్చే యోచనలో ఉంది. అందులో భాగమే హైదరాబాద్‌ను తెలంగాణ నుండి విడదీసి కేంద్ర పాలిత ప్రాంతంగా లేదా రెండు రాష్ట్రాలకు ఉమ్మడి రాజధానిగా ఏర్పాటు చేసే కుట్ర. అందులో మరొక ప్రతిపాదనగా హైదరాబాద్‌ను విడదీసి తక్కిన తెలంగాణతో కర్నూల్‌ను కలిపి ప్రత్యేక రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలని ప్రచారం చేస్తున్నారు. వీటిని వేటినీ

తెలంగాణ ప్రజలు సమేమిరా ఆమోదించరు. హైదరాబాద్ తెలంగాణలో అంతర్భాగమనే విషయం ఎన్నటికీ కాదనలేని చారిత్రక సత్యం. హైదరాబాద్ లేని తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పర్చజూసే కుట్రలను తెలంగాణ ప్రజలంతా సమైక్యంగా నిలిచి ఓడించాలి.

18 రోజులుగా మహోధృతంగా సాగుతున్న సకల జనుల సమ్మెను అణచడానికి ప్రభుత్వం తీవ్ర నిర్బంధకాండ కొనసాగిస్తున్నది. కార్మికుల, ఉద్యోగుల హక్కుల్ని కాలరాచి వేస్తూ ఎస్మా ప్రయోగం, ఫ్యాక్టరీలను, గనులను, ఆఫీసులను పోలీసు క్యాంపులుగా మార్చివేయడం, ప్రదర్శనలపై లాఠీచార్జి, రబ్బరు తూటాలను ప్రయోగించడం, అక్రమ అరెస్టులు చేయడం, బెదిరింపులకు పాల్పడడం చేస్తున్నది. మరోవైపు తెలంగాణ ప్రజలకు, ఆంధ్ర సెటిలర్స్‌కు మధ్య చిచ్చుపెట్టి ఉద్యమాన్ని అణచివేయ ప్రయత్నిస్తున్నది. అందులో భాగమే సమ్మెలో విచ్ఛిన్నకారుల్ని చొరగొట్టి కార్మికులపై దాడులు చేయిస్తున్నది. ఇందులో భాగమే ఎన్‌జిఓ నాయకులు స్వామి గౌడ్‌పై దాడి. ఈ కుట్రలో భాగంగానే లగడపాటి రాజగోపాల్ హైదరాబాద్‌లో ఆర్‌టిసి కార్మికులను పరామర్శించే పేరిట రావడమే కాక, సీమాంధ్ర నుంచి డ్రైవర్లను కిరాయికి తెచ్చి ఆర్‌టిసి సమ్మెను విచ్ఛిన్నం చేసే ప్రయత్నాలలో ముందున్నాడు. గవర్నర్ నర్సింహన్, ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డి, డిజిపి దినేష్ రెడ్డి కలిసి కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో సకల జనుల సమ్మెను అణచివేసేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. హైదరాబాద్‌లోని కాంగ్రెస్ మంత్రులు దానం నాగేందర్, ముఖేష్ గౌడ్, మజ్లీస్ నాయకులైన ఓవైసి బ్రదర్స్ ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి వ్యతిరేకంగా తెలంగాణ ద్రోహులుగా పనిచేస్తున్నారు. అత్యంత ఉన్నతస్థాయిలో జరుగుతున్న 'సకల జనుల సమ్మె' ఆంధ్రప్రదేశ్‌లోనూ, దేశంలోని ఇతర రాష్ట్రాలలోనూ ప్రచారం జరగకుండా చూడాలనే 'శ్రీకృష్ణ కమిటి' 8వ అధ్యాయం సూచనల ప్రకారం ప్రభుత్వాలు, పాలకవర్గాలు మీడియాను కంట్రోల్ చేస్తున్నాయి. దీని ద్వారా దేశ ప్రజలను అంధకారంలో ఉంచి తమ పబ్బం గడుపుకో జూస్తున్నాయి.

ప్రజలారా! సకల జనుల సమ్మెను మరింత పట్టుదలగా, ఉధృతంగా కొనసాగించాలి. తెలంగాణ రాష్ట్ర సాధన కష్టతరమైన పోరాటాలకు సిద్ధపడడం ద్వారానే సాధ్యమవుతుంది. ప్రజల కనీస హక్కులను కూడా కాలరాచివేసే ఈ పాలకవర్గాలు సులభంగా ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ప్రక్రియను ప్రారంభిస్తారని ఆశించడం ఇసక నుంచి తైలం తీయడం లాంటిదే. గత చరిత్ర చూసినా తెలంగాణ ప్రజలు తమ కనీస హక్కుల సాధనకు ఎంత రక్తం ధారపోయవలసి వచ్చిందో తెలిసిందే. దీర్ఘకాలిక, సమైక్య, మిలిటెంట్ ఆందోళనలకు సిద్ధం కావడం, పోరాటమే ఏకైక మార్గంగా ముందుకు సాగడం ద్వారానే కేంద్ర ప్రభుత్వం మెడలు వంచి తెలంగాణ సాధించడం సాధ్యమవుతుంది. పాలకవర్గ పార్టీలు వాటి నాయకులు నిరంతరం రాజీ బేరాలతో అవకాశం దొరికినప్పుడు ఉద్యమాన్ని నీరుగార్చేందుకు ప్రయత్నిస్తారనేది తెలిసిందే. ఎప్పటికప్పుడు ఈ కుట్రలను బహిర్గతపర్చి ఓడించాలి. ఉద్యమం దీర్ఘకాలికంగా సాగుతున్న క్రమంలో ఉద్యమ నాయకత్వంలో వచ్చే ఊగిసలాటలను ఎప్పటికప్పుడు ఎదుర్కొంటూ ఉ

ద్యమాన్ని సజీవంగా నిలబెట్టాలి. లాబీయింగ్ ద్వారా తెలంగాణ సాధించవచ్చునని బలంగా నమ్మే టిఆర్ఎస్ గత్యంతరంలేని పరిస్థితిలో ప్రజల నుంచి వేరుపడిపోకుండా ఉండడం కోసం సకల జనుల సమ్మెలో పాల్గొంటున్నది. కాని మరోవైపు బాన్సువాడ ఉపఎన్నికలో టిడిపి నుంచి ప్లేట్ ఫిరాయించిన తన అభ్యర్థిని గెలిపించుకోవడానికి ప్రయత్నించడం సకల జనుల సమ్మెను పక్కదారి పట్టించడానికే. తెలంగాణకే కట్టుబడి ఉన్నామని చెప్పే కాంగ్రెస్ ఈ ఎన్నికల పోటీకి నిలబడి తన అవకాశవాదాన్ని బయటపెట్టుకుంది. తొలి నుండి తెలంగాణకు వ్యతిరేకంగా ఉన్న టిడిపి, నేడు తెలంగాణ వచ్చే వరకూ ఎన్నికల్లో పాల్గొనేది లేదని చెప్పి బాన్సువాడ ఉపఎన్నికను బహిష్కరించడం దాని పచ్చి అవకాశవాదానికి నిదర్శనం. అలాగే వివిధ జెఏసిలు ఈ సకల జనుల సమ్మెలో తెలంగాణ ప్రజలలో వ్యక్తమైన బలమైన పోరాట సమైక్యతకు అనుగుణంగా మరింత విశ్వాసంతో ముందుకు సాగుతూ, ఆయా సందర్భాలలో తమలో వ్యక్తమవుతున్న ఊగిసలాటలను పక్కకు పెట్టి ప్రజల మిలిటెంట్ ఆందోళనకు సరియైన నాయకత్వాన్ని అందించాలని ఈ సందర్భంగా మా పార్టీ అన్ని జెఏసిలకు విజ్ఞప్తి చేస్తోంది.

'సకల జనుల సమ్మె' పోరాట ప్రభావం దేశవ్యాప్తంగా ప్రజల్లో ఒక మంచి ప్రభావాన్ని వేస్తోంది. అనేక ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాలకు బలమైన ప్రేరణను అందిస్తోంది. ప్రస్తుతం తెలంగాణ ప్రజలకు మద్దతుగా నిలబడడం దేశ ప్రజల ముందున్న ఒక ముఖ్య కర్తవ్యం. సకల జనుల సమ్మెలో ఫరిఢవిల్లిన తెలంగాణ ప్రజల ఆకాంక్షలను గౌరవించి ప్రత్యేక రాష్ట్ర డిమాండ్‌కు మద్దతు నివ్వాలని, దోపిడి పాలకవర్గాలు తమ ప్రయోజనాల కోసం తెలంగాణ, సీమాంధ్ర ప్రజల మధ్య చీలికలు సృష్టించాలని చేస్తున్న కుట్రలకు బలికాకుండా, ఈ ప్రజాస్వామిక డిమాండ్‌ను స్వాగతించాలని సీమాంధ్ర ప్రజలకు మా పార్టీ హృదయపూర్వకంగా విజ్ఞప్తి చేస్తోంది.

ఈ సందర్భంగా తెలంగాణ ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్న ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని తక్షణం ఏర్పర్చాలని డిమాండ్ చేస్తూ, 2011 అక్టోబర్ 11న సకల జనుల సమ్మెకు మద్దతుగా, భారత్ బంద్‌కు మా పార్టీ పిలుపు నిస్తోంది. కార్మికులు, కర్షకులు, విద్యార్థులు, మేధావులు, మహిళలు, ప్రజాస్వామికవాదులు, ప్రగతిశీల ప్రజాసంఘాలు, ప్రగతిశీల శక్తులు, కవులు, కళాకారులు, అశేష ప్రజానీకం పాల్గొని బంద్‌ను పూర్తిగా విజయవంతం చేయాల్సిందిగా కోరుతున్నాం. ఆఫీసులు, విద్యా సంస్థలు, వ్యాపార సంస్థలు వగైరా అన్నింటినీ మూసివేసి తెలంగాణ ప్రజల ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి సంఘీభావం ప్రకటించాలని దేశ ప్రజలందరికీ విజ్ఞప్తి చేస్తున్నాం.

**అభయ్**

**అధికార ప్రతినిధి, కేంద్ర కమిటీ**

**సీపీఐ (మావోయిస్టు)**

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# కేంద్ర కమిటీ

**25-11-2011**

## పీడిత ప్రజల ప్రియతమ నాయకుడు, భారత విప్లవోద్యమ నేత, సీపీఐ (మావోయిస్టు) పొలిట్‌బ్యూరో సభ్యుడు కామ్రేడ్ మల్లోజుల కోటేశ్వరరావు (కిషన్‌జీ/రాంజీ) క్రూర హత్యను ముక్తకంఠంతో ఖండించండి! నవంబర్ 29 నుండి డిసెంబర్ 5 వరకు దేశవ్యాప్త నిరసన వారాన్ని, డిసెంబర్ 4-5 తేదీలలో 48 గంటల 'భారత్ బంద్'ను విజయవంతం చేయండి!!

నవంబర్ 24, 2011 భారత విప్లవోద్యమ చరిత్రలో చీకటిదినంగా మిగిలిపోతుంది. సీపీఐ (మావోయిస్టు)ను 'దేశ అంతర్గత భద్రతకు అతి పెద్ద ప్రమాదం'గా ప్రచారం చేస్తూ దేశవ్యాప్త దమనకాండను, పీడిత ప్రజలకు వ్యతిరేకంగా అన్యాయమైన యుద్ధాన్ని సాగిస్తున్న ఫాసిస్టు సోనియా-మన్మోహన్‌సింగ్-ప్రణబ్-చిదంబరం-జయరాం రమేష్‌ల పాలక ముఠా బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీతో కుమ్మక్కయ్యి కామ్రేడ్ మల్లోజుల కోటేశ్వరరావును కుట్రపూరితంగా సజీవంగా పట్టుకొని హత్య చేసింది. గత సంవత్సరం జూలై 1న పార్టీ అధికార ప్రతినిధి కామ్రేడ్ ఆజాద్‌ను హత్య చేసిన ఈ ముఠా మరోసారి పంజా విసురుతూ తన రక్తదాహాన్ని తీర్చుకుంది. అధికారంలోకి రాకముందు కామ్రేడ్ ఆజాద్ హత్యపై మొసలి కన్నీరు కార్చిన మమతా బెనర్జీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక వైపు మావోయిస్టు పార్టీతో చర్చల నాటకం ఆడుతూనే మరో అగ్రనేత కామ్రేడ్ కోటేశ్వరరావును హతమార్చి తన ప్రజావ్యతిరేక, ఫాసిస్టు ముఖాన్ని బైటపెట్టుకుంది. కేంద్ర ఇంటలిజెన్స్ సంస్థలు, పశ్చిమ బెంగాల్, ఆంధ్రప్రదేశ్ హంతక ఇంటలిజెన్స్ సంస్థలు చాలా పథకం ప్రకారం ఆయన వెంటబడి సంయుక్త ఆపరేషన్‌లో భాగంగా పిరికిగా హత్య చేసి ఎన్‌కౌంటర్ అనే కట్టుకథను ప్రచారం చేస్తున్నాయి. కేంద్ర హోంశాఖ కార్యదర్శి ఆర్.కే. సింగ్ ఎన్‌కౌంటర్‌లో చనిపోయింది ఎవరో నూటికి నూరు శాతం ఇంకా తెలియదనీ, శవాన్ని గుర్తుపట్టాల్సి వుందనీ అంటూనే మావోయిస్టు వుద్యమానికి ఇది గట్టి దెబ్బ అని ప్రకటించడం ద్వారా ఈ హత్య వెనుక వున్న కుట్రను

తనంతట తానే బైటపెట్టాడు. విప్లవోద్యమ అగ్ర నాయకత్వాన్ని మట్టుబెట్టడం ద్వారా మావోయిస్టు పార్టీని సమూలంగా నిర్మూలించగలమని పగటి కలలు గంటున్న దోపిడీ పాలకవర్గాలకు, వారికి మార్గదర్శకత్వం వహిస్తున్న సామ్రాజ్యవాదులకు పీడిత ప్రజలు ప్రజాయుద్ధంతో తప్పక గోరీ కడతారు.

పార్టీలో, ప్రజలలో ప్రహ్లాద్‌గా, రాంజీగా, కిషన్‌జీగా, బిమల్‌గా సుపరిచితుడైన కామ్రేడ్ కోటేశ్వర్ భారత విప్లవోద్యమ కీలక నేతల్లో ఒకరు. గత 37 సంవత్సరాలుగా అలుపెరుగని యోధుడిగా, ఎత్తిన తుపాకీ దించకుండా పీడిత ప్రజల విముక్తి కోసం పోరాడుతూ నమ్మిన సిద్ధాంతం కోసం నిండు ప్రాణాలర్పించిన కామ్రేడ్ కోటేశ్వర్ 1954లో ఉత్తర తెలంగాణాలోని కరీంనగర్ జిల్లాకు చెందిన పెద్దపల్లి పట్టణంలో జన్మించాడు. స్వాతంత్ర సమరయోధుడైన తండ్రి వెంకటయ్య, అభ్యుదయ భావాలు గల తల్లి మధురమ్మల పెంపకంలో పెరిగి పెద్దవాడైన కామ్రేడ్ కోటేశ్వరరావు చిన్నతనం నుండే దేశం పట్ల, పీడిత ప్రజల పట్ల ప్రేమను పెంచుకున్నాడు. పెద్దపల్లి పట్టణంలో హైస్కూలు విద్యను అభ్యసిస్తున్న సమయంలో 1969లో వెల్లువెత్తిన ప్రత్యేక తెలంగాణా వుద్యమంలో చురుగ్గా పాల్గొన్నాడు. కరీంనగర్‌లోని ఎస్‌ఆర్‌ఆర్ కళాశాలలో డిగ్రీ చదువుతూ మహత్తర నక్సల్బరీ, శ్రీకాకుళ వుద్యమాల ప్రేరణతో విప్లవోద్యమంలో చేరాడు. 1974 నుండి పార్టీలో క్రియాశీల కార్యకర్తగా పని చేయడం ప్రారంభించాడు. ఎమర్జెన్సీ చీకటి రోజుల్లో కొంతకాలం జైలు నిర్బంధానికి గురైన కామ్రేడ్ కోటేశ్వర్‌రావు ఆ తర్వాత పార్టీ ఆర్గనైజర్‌గా తన స్వంత జిల్లాయైన కరీంనగర్‌లో ప్రజల్లో కృషిని ప్రారంభించాడు. పార్టీ ఇచ్చిన 'గ్రామాలకు తరలండి' పిలుపును అందుకొని ఆయన గ్రామాలకు వెళ్లి రైతాంగంతో పరిచయాలు ఏర్పర్చుకున్నాడు. 1978లో 'జగిత్యాల జైత్రయాత్ర'గా ప్రసిద్ధి గాంచిన రైతాంగ వుద్యమ వెల్లువలో ప్రముఖ పాత్ర పోషించిన వాళ్లలో ఆయన ఒకరు. ఆ క్రమంలో అప్పటి సీపీఐ (ఎం-ఎల్) ఆదిలాబాద్-కరీంనగర్ సంయుక్త జిల్లా కమిటీ సభ్యుడిగా ఎన్నికయ్యాడు. 1979లో ఆ కమిటీ రెండు జిల్లా కమిటీలుగా విడిపోయినపుడు ఆయన కరీంనగర్ జిల్లా కమిటీ కార్యదర్శి అయ్యాడు. 1980లో జరిగిన పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర 12వ మహాసభలో పాల్గొని రాష్ట్రకమిటీలోకి ఎన్నికయ్యి కార్యదర్శి బాధ్యతలు చేపట్టాడు.

1985 వరకు ఏపి రాష్ట్రకమిటీ నాయకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా వుద్యమాన్ని విస్తరింపజెయ్యడంలో, గెరిల్లాజోన్ లక్ష్యంతో కొనసాగుతున్న ఉత్తర తెలంగాణా వుద్యమాన్ని అభివృద్ధి చెయ్యడంలో కీలక పాత్ర పోషించాడు. 1980లో దండకారణ్యానికి విప్లవోద్యమాన్ని విస్తరింపజెయ్యడంలో, అభివృద్ధి చెయ్యడంలో ఆయనది ప్రముఖ పాత్ర. 1986లో ఆయన దండకారణ్య వుద్యమానికి బదిలీ అయ్యి ఫారెస్ట్ కమిటీ సభ్యుడిగా బాధ్యతలు చేపట్టాడు.

దండకారణ్యంలో ఆయన గెరిల్లా దళాలకు, ప్రజలకు నాయకత్వం, మార్గదర్శకత్వం వహించాడు. 1993లో ఆయన అప్పటి కేంద్ర ఆర్గనైజింగ్ కమిటీ (సీవోసీ)లోకి సభ్యుడిగా కో-ఆప్ట్ చేసుకోబడ్డాడు.

1994 నుండి ఆయన ప్రధానంగా బెంగాల్ సహా తూర్పు, ఉత్తర భారతంలో విప్లవోద్యమ విస్తరణలో, అభివృద్ధిలో ఎనలేని కృషి చేశాడు. ముఖ్యంగా పశ్చిమ బెంగాల్‌లో నక్సల్బరీ వుద్యమ వెనుకంజ తర్వాత ముక్కలు చెక్కలైన విప్లవ శక్తుల్ని కూడగట్టి విప్లవోద్యమాన్ని పునర్మించడంలో ఆయన పోషించిన పాత్ర ఎంతో గొప్పది. ఆయన బెంగాల్ పీడిత ప్రజలతో, విప్లవ శిబిరంలోని వివిధ సెక్షన్లతో గాఢంగా మమేకమై, బంగ్లా భాషను పట్టుదలగా నేర్చుకొని అక్కడి ప్రజల హృదయాల్లో చెరగని ముద్రవేశాడు. పలు విప్లవ గ్రూపులతో ఐక్యతను సాధించడంలో, పార్టీని బలోపేతం చేయడంలో ఆయన విరామమెరుగక కృషి చేశాడు. 1995లో జరిగిన మునుపటి సీపీఐ (ఎం-ఎల్) (పీపుల్స్‌వార్) ప్రత్యేక కాన్ఫరెన్స్‌లో కామ్రేడ్ కోటేశ్వరరావు కేంద్రకమిటీ సభ్యుడిగా ఎన్నికయ్యాడు. 1998లో పీపుల్స్‌వార్, పార్టీయూనిటీ పార్టీల ఐక్యత కోసం ఆయన పట్టుదలగా కృషి చేశాడు. 2001లో జరిగిన మునుపటి పీపుల్స్‌వార్ పార్టీ కాంగ్రెస్‌లో తిరిగి కేంద్రకమిటీ సభ్యుడిగా ఎన్నికై పొలిట్‌బ్యూరో సభ్యుడిగా ఎన్నికయ్యాడు. ఉత్తర రీజినల్ బ్యూరో కార్యదర్శి బాధ్యత చేపట్టి బీహార్, ఝార్ఖండ్, పశ్చిమ బెంగాల్, ఢిల్లీ, హర్యానా, పంజాబ్ రాష్ట్రాలలో విప్లవోద్యమానికి నాయకత్వం వహించాడు. అదే సమయంలో మునుపటి పీపుల్స్‌వార్, ఎంసీసీఐల మధ్య జరిగిన ఐక్యతా చర్చలలో ఆయన కీలక పాత్ర పోషించాడు. 2004లో రెండు పార్టీల విలీనం తర్వాత ఏర్పడిన ఐక్య కేంద్రకమిటీలో, పొలిట్‌బ్యూరోలో సభ్యుడిగా వుంటూ తూర్పు రీజనల్ బ్యూరోలో భాగంగా పని చేశాడు. పశ్చిమ బెంగాల్ రాష్ట్ర వుద్యమంపై ప్రధానంగా కేంద్రీకరిస్తూ ఆయన ఈఆర్‌బీ అధికార ప్రతినిధిగా కొనసాగాడు.

ఆయన పార్టీలో పత్రికల పనిలో, రాజకీయ విద్యా రంగంలో ప్రముఖ పాత్ర పోషించాడు. 'క్రాంతి', 'ఎర్రజెండా', 'జంగ్', 'ప్రభాత్', 'వ్యాన్‌గార్డ్' తదితర పత్రికల నిర్వహణలో పాలు పంచుకున్నాడు. పశ్చిమ బెంగాల్ నుండి వెలువడిన పలు విప్లవ పత్రికల నిర్వహణలో ఆయన ప్రత్యేక కృషి వుంది. ఈ పత్రికల్లో ఆయన ఎన్నో సిద్ధాంత, రాజకీయ వ్యాసాలు రాసాడు. రాజకీయ విద్యపై ఏర్పడిన కేంద్ర సబ్-కమిటీలో సభ్యుడిగా వుంటూ పార్టీ శ్రేణులకు మార్క్సిజం-లెనినిజం-మావోయిజం సిద్ధాంతాన్ని బోధించే కృషిలో ప్రముఖ పాత్ర పోషించాడు. మొత్తం పార్టీ చరిత్రలో విప్లవోద్యమ విస్తరణలో, పార్టీ డాక్యుమెంట్లను సంపద్వంతం చేసే కృషిలో, వుద్యమాన్ని అభివృద్ధి చేయడంలో ఆయన మరపురాని పాత్ర పోషించాడు. 2007

జనవరిలో జరిగిన పార్టీ ఐక్యతా కాంగ్రెస్ - 9వ కాంగ్రెస్‌లో తిరిగి కేంద్రకమిటీ సభ్యుడిగా ఎన్నికై పొలిట్‌బ్యూరో సభ్యుడిగా, తూర్పు రీజనల్ బ్యూరో సభ్యుడిగా కొనసాగాడు.

పశ్చిమ బెంగాల్‌లో సోషల్ ఫాసిస్టు సీపీఎం ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలకు వ్యతిరేకంగా 2007 నుండి పెల్లుబికిన సింగూర్, నందిగ్రాం ప్రజా వుద్యమాలకు, ప్రత్యేకించి పోలీసు అత్యాచారాలకు వ్యతిరేకంగా పశ్చిమ బెంగాల్‌లోని లాల్‌గఢ్ ప్రాంతంలో వెల్లువెత్తిన గొప్ప ప్రజా తిరుగుబాటుకు ఆయన అందించిన రాజకీయ మార్గదర్శకత్వం ప్రముఖమైంది. బెంగాల్ రాష్ట్రకమిటీని, పార్టీ శ్రేణుల్ని ఈ వుద్యమాలకు నాయకత్వం వహించేలా నడిపిస్తూ మరోవైపు మీడియా ద్వారా కూడా ఆయన పార్టీ ప్రచారాన్ని చొరవగా నిర్వహించాడు. 2009లో చిదంబరం ముఠా చర్చల పేరుతో, కాల్పుల విరమణ పేరుతో ప్రజల్ని, ముఖ్యంగా మధ్యతరగతిని పక్కదారి పట్టించడానికి ప్రయత్నిస్తుంటే ఆయన దాన్ని ఎండగట్టడానికి విశేషంగా కృషి చేశాడు. ప్రజాయుద్ధం ప్రాముఖ్యతను అడుగడుగునా ఎత్తిపడుతూ విప్లవ రాజకీయాల్ని విశాల ప్రజల్లోకి వ్యాపింపజేయడానికి ఎనలేని కృషి చేశాడు. ఇలా దాదాపు నాలుగు దశాబ్దాలుగా అప్రతిహతంగా సాగిన ఆయన విప్లవ ప్రస్థానం నవంబర్ 24, 2011న అర్ధాంతరంగా ముగిసింది.

**ప్రజలారా! ప్రజాస్వామికవాదులారా!**

ఈ దారుణ హత్యను ప్రతి ఒక్కరూ ఖండించాలి. విప్లవోద్యమ నాయకత్వాన్ని నిర్మూలించి దేశ పీడిత ప్రజలకు సరైన మార్గదర్శకత్వం, కార్మికవర్గ నాయకత్వం లేకుండా చేయాలనేదే పాలకుల కుట్ర. దేశాన్ని నిట్టనిలువుగా దోచుకోవడానికి, ఇక్కడి నీటినీ, భూముల్నీ, అడవుల్నీ బడా, విదేశీ పెట్టుబడిదార్లకు ధారాదత్తం చేసి తమ వంతు ముడుపుల్ని స్విస్ బ్యాంకుల్లో దాచుకోవడానికి ఈ బడాచోర్లకు, దళారీలకు మావోయిస్టు వుద్యమమే అతి పెద్ద అడ్డంకిగా వుందనేది తెలిసిందే. అందుకే ఆపరేషన్ గ్రీన్‌హంట్ పేరుతో గత రెండేళ్లుగా సాగిస్తున్న బహుముఖ, దేశవ్యాప్త క్రూర దాడి. అందులో భాగమే ఈ దారుణ హత్య. విప్లవోద్యమాన్ని, విప్లవోద్యమ నాయకత్వాన్ని కంటికి రెప్పలా కాపాడుకోవడం నేడు దేశభక్తులైన, స్వాతంత్రప్రియులైన ప్రజలందరి కర్తవ్యం. ఇలా కాపాడుకోవడమంటే మన దేశ భవిష్యత్తును, మన భావి తరాల భవిష్యత్తును కాపాడుకోవడమే.

57 సంవత్సరాల వయస్సులోనూ కష్టభరితమైన గెరిల్లా జీవితంలో యువతీయువకులతో పోటీ పడుతూ, తను ఎక్కడున్నా చుట్టూ కేడర్లలో, ప్రజల్లో ఉత్సాహాన్ని రేకెత్తించే కామ్రేడ్ కోటేశ్వరరావు జీవితం ప్రత్యేకించి నేటి యువతరానికి గొప్ప ప్రేరణగా నిలుస్తుంది. ఆయన

విసుగూ, విరామం లేకుండా గంటల తరబడి అధ్యయనంలో, పార్టీ పనిలో పాలు పంచుకునే వాడు. దూరభారాల్ని లెక్క చేయకుండా, చాలా తక్కువగా నిద్రపోతూ, సాదాసీదాగా జీవిస్తూ, ఎక్కువగా కష్టించే వాడు. అన్ని వయస్సుల వాళ్లతో, అన్ని రకాల సామాజిక నేపథ్యాలు గల వాళ్లతో సులువుగా కలిసిపోతూ, అందరిలోనూ విప్లవోత్సాహాన్ని ఇనుమడింపజేసేవాడు. కామ్రేడ్ కోటేశ్వరరావు మృతితో భారత విప్లవోద్యమానికి తీవ్ర నష్టం జరిగిందనడంలో సందేహం లేదు. అయితే ప్రజలు చాలా గొప్పవాళ్లు. చరిత్ర నిర్మాతలు. ప్రజలూ, ప్రజా వుద్యమాలే కోటేశ్వరరావు వంటి సాహసికులైన, అంకితభావం గల విప్లవకారుల్ని సృష్టించాయి. కోటేశ్వరరావు అందించి వెళ్లిన ఆశయస్ఫూర్తితో, జగిత్యాల నుండి జంగల్‌మహల్ అడవుల దాకా వెదజల్లి పోయిన విప్లవ పరిమళాలతో సాయుధమైన కార్మికకర్షకులు, విప్లవకారులు భారత నూతన ప్రజాస్వామిక విప్లవోద్యమాన్ని తప్పక విజయపథంలో పురోగమింపజేస్తారు. సామ్రాజ్యవాదుల్ని, వారి తాబేదార్లయిన భారత భూస్వామ్య, దళారీ పెట్టుబడిదారీ వర్గాల్ని, వాళ్ల ప్రతినిధులైన సోనియా, మన్మోహన్‌సింగ్, చిదంబరం, మమతా బెనర్జీ తదితర దళారీ పాలకుల్ని నామరూపాలు లేకుండా చేస్తారు.

కామ్రేడ్ కోటేశ్వరరావు దారుణ హత్యకు నిరసనగా నవంబర్ 29 నుండి డిసెంబర్ 5 వరకు నిరసన వారం, డిసెంబర్ 4-5 తేదీలలో 48 గంటల 'భారత్ బంద్'ను విజయవంతం చేయాలని మా కేంద్రకమిటీ దేశ ప్రజానీకానికి విజ్ఞప్తి చేస్తున్నది. నిరసన వారం సందర్భంగా సభలు, ఊరేగింపులు, ధర్నాలు, నల్లబ్యాడ్జీలు ధరించడం, చక్కాజాంలు వంటి వివిధ కార్యక్రమాల్ని చేపట్టాలని కోరుతున్నాం. డిసెంబర్ 4-5 తేదీలలో జరిగే భారత్ బంద్‌లో భాగంగా రైళ్లు, రోడ్లు, విద్యా, వ్యాపార సంస్థల్ని మూసివెయ్యాలని, అన్ని రకాల పారిశ్రామిక కార్యకలాపాల్ని నిలిపివెయ్యాలని కోరుతున్నాం. వైద్య సేవల్ని బంద్ నుండి మినహాయిస్తున్నాం.

**ఆనంద్**
**సెంట్రల్ రీజనల్ బ్యూరో కార్యదర్శి**
**కేంద్ర కమిటీ**
**సీపీఐ (మావోయిస్టు)**

**అభయ్**
**అధికార ప్రతినిధి**
**కేంద్ర కమిటీ**
**సీపీఐ (మావోయిస్టు)**

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# కేంద్ర కమిటీ

**13-1-2012**

## భారత విప్లవోద్యమ మిత్రులకూ, శ్రేయోభిలాషులకూ సీపీఐ (మావోయిస్టు) విప్లవాభివందనాలు!

**కామ్రేడ్స్, మిత్రులారా!**

2011 నవంబర్ 24వ తేదీన భారత విప్లవం తన గొప్ప నాయకుడినీ, భారత పీడిత ప్రజానీకం తమ అత్యంత విశ్వసనీయమైన సేవకుడినీ కోల్పోయాయి. నవంబర్ 24 భారత విప్లవోద్యమ చరిత్రలో ఒక చీకటి రోజుగా మిగిలిపోతుంది. 2010 జూలై 1న మా పోలిట్‌బ్యూరో సభ్యుడు, స్పోక్స్‌పర్సన్ కామ్రేడ్ ఆజాద్‌ను పట్టుకొని హత్య చేసిన భారత పాలకవర్గాలు సంవత్సరంన్నర కాకుండానే మరో పోలిట్‌బ్యూరో సభ్యుడైన కామ్రేడ్ కోటేశ్వర్లును (కోటన్న, ప్రహ్లాద్, రాంజీ, కిషన్‌జీ, బిమల్ పేర్లతో ప్రజలకు, పార్టీ శ్రేణులకు సుపరిచితుడు) ఒక కోవర్ట్ ఆపరేషన్‌లో సజీవంగా పట్టుకొని దారుణ చిత్రహింసలకు గురిచేసి బూటకపు ఎన్‌కౌంటర్‌లో హత్య చేశాయి. దేశంలో సాగుతున్న ప్రజాస్వామిక, జాతీయ విముక్తి వుద్యమాలను, విప్లవోద్యమాన్ని ఉక్కుపాదంతో అణచివెయ్యడానికి ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్యంగా చెప్పుకునే భారత భూస్వామ్య, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ పాలకవర్గాలు సామ్రాజ్యవాదుల, ప్రత్యేకించి అమెరికా సామ్రాజ్యవాదుల దన్నుతో ప్రయత్నిస్తున్నాయి. ముఖ్యంగా 2009 నుండి 'ఆపరేషన్ గ్రీన్‌హంట్' పేరుతో ప్రజలపై అన్యాయమైన యుద్ధాన్ని కొనసాగిస్తున్నాయి. తాము రాసుకున్న రాజ్యాంగాన్నీ, చట్టాలను కూడా నిర్లజ్జగా వుల్లంఘిస్తూ ప్రజలనూ, వుద్యమకారులనూ, వుద్యమ నేతలనూ కాల్చి చంపుతున్నాయి. బ్రిటిష్ వలసవాద పాలకుల అడుగుజాడల్లో నడుస్తూ 'ఎన్‌కౌంటర్' అనే అబద్ధంతో తమ చట్టవిరుద్ధ హత్యలన్నిటినీ సమర్థించుకోవడానికి విఫల ప్రయత్నం చేస్తున్నాయి. దేశంలో ఎక్కడైనా నేడు 'ఎన్‌కౌంటర్' అంటే అర్థం రాజ్యం కుట్రపూరితంగా చేసే హత్యగా స్థిరపడిపోయింది.

1954 నవంబర్ 26న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మహత్తర తెలంగాణా సాయుధ పోరాట వారసత్వం గల కరీంనగర్ జిల్లాకు చెందిన పెద్దపల్లి పట్టణంలో జన్మించిన కామ్రేడ్ కోటేశ్వర్లు దాదాపు గత నాలుగు దశాబ్దాలుగా భారత విప్లవోద్యమానికి నాయకత్వం వహిస్తూ వచ్చాడు. ప్రజాస్వామ్య భావాలు గల తల్లిదండ్రుల పెంపకంలో పెరిగిన కామ్రేడ్ కోటేశ్వర్లుకు బాల్యం

నుండే దేశభక్తి, పీడిత ప్రజల పట్ల ప్రేమ అలవడ్డాయి. మహత్తర నక్సల్బరీ తిరుగుబాటు తర్వాతి తరానికి చెందిన అగ్రశ్రేణి ప్రతినిధి ఆయన. భారత విప్లవానికి మావోయిస్టు దీర్ఘకాల ప్రజాయుద్ధ పంథానే మార్గమని నిర్దేశించిన నక్సల్బరీ తిరుగుబాటు కొద్ది సంవత్సరాల్లోనే అణచివేతకు గురైనప్పటికీ అది దేశం నలుమూలలా వేసిన ప్రభావం చాలా గొప్పది. దాని ఒరవడిలో అనేక ప్రాంతాల్లో రైతాంగ పోరాటాలు చెలరేగాయి. కాలేజీల్లో, విశ్వవిద్యాలయాల్లో విద్యార్థిలోకాన్ని అది తట్టి లేపింది. 'నక్సల్బరీ ఏక్ హీ రాస్తా' అనే నినాదం దేశం నలుమూలలా మారుమోగింది. ఈ నేపథ్యమే కామ్రేడ్ కోటేశ్వర్లును మావోయిస్టు విప్లవకారుడిగా మలిచింది. మొట్టమొదట 1970 దశాబ్దం చివరలో తన స్వంత జిల్లాయైన కరీంనగర్‌లో కరడుగట్టిన భూస్వామ్యానికి వ్యతిరేకంగా రైతాంగాన్ని సంఘటితం చేసి పలు పోరాటాలకు ఆయన నాయకత్వం వహించాడు. 'జగిత్యాల జైత్రయాత్ర'గా సుప్రసిద్ధమైన రైతాంగ ఉద్యమంలో ఆయన కీలక పాత్ర పోషించాడు. అనతి కాలంలోనే అది కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలతో పాటు మొత్తం వుత్తర తెలంగాణా అంతా పాకిపోయింది. ఒకవైపు రైతాంగాన్ని భూస్వామ్య వ్యతిరేక పోరాటాల్లోకి సమీకరిస్తూనే విద్యార్థులను, రచయితలను, మేధావులను, కార్మికులను... అన్ని పీడిత వర్గాలనూ, సెక్షన్లనూ విప్లవ పోరాటాల్లోకి ఆకర్షించడానికి ఆయన విశేషంగా కృషి చేశాడు. ఆ క్రమంలో ఆయన మొదట పార్టీ ఆర్గనైజర్‌గా పని చేస్తూ, జిల్లా కమిటీ కార్యదర్శిగా, ఆ తర్వాత 1980లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రకమిటీ కార్యదర్శిగా ఎన్నికై ప్రజల, పార్టీ శ్రేణుల మన్ననలందుకున్నాడు. 1986 నుండి ఆయన ఆంధ్రప్రదేశ్ సరిహద్దుల్ని దాటి మధ్య, తూర్పు, ఉత్తర భారతంలో విప్లవోద్యమ అభివృద్ధిలో, విస్తరణలో కీలక పాత్ర పోషించాడు. దండకారణ్యంలో దాదాపు ఎనిమిదేళ్ల పాటు, పశ్చిమ బెంగాల్‌లో దాదాపు 18 ఏళ్లు ప్రత్యేకించి కేంద్రీకరించి పని చేశాడు. 1993 నుండి తుదిశ్వాస విడిచే వరకూ ఆయన కేంద్రకమిటీ సభ్యుడిగా, ఆ తర్వాత పొలిట్‌బ్యూరో సభ్యుడిగా, ఉత్తర, తూర్పు రీజియనల్ బ్యూరోలకు బాధ్యత వహిస్తూ పని చేశాడు. పార్టీలో రాజకీయ విద్య, పత్రికా, ప్రచార రంగం తదితర అనేక రంగాల్లో విశేషంగా కృషి చేసి బహుముఖ ప్రజ్ఞాశాలిగా వెలుగొందాడు. పార్టీ డాక్యుమెంట్లను సంపద్వంతం చేయడంలో, పార్టీ రాజకీయ-సైనిక పంథాను, పాలసీలను అభివృద్ధి చేయడంలో ఆయన ప్రముఖ పాత్ర పోషించాడు. వివిధ జాతి విముక్తి పోరాట సంస్థలతో, దక్షిణాసియాలోని మావోయిస్టు శక్తులతో జరిగిన సమావేశాల్లో, ద్వైపాక్షిక చర్చలలో కేంద్రకమిటీకి ప్రాతినిధ్యం వహించాడు. నక్సల్బరీ వెనుకంజ తర్వాత ముక్కలు చెక్కలైన మార్క్సిస్టు-లెనినిస్టు గ్రూపులను, వ్యక్తులను సమైక్యం చేయడంలో, ముఖ్యంగా నక్సల్బరీ కాలం నుండి విడివిడిగా రెండు స్రవంతులుగా కొనసాగిన మా-లె, ఎంసీసీ సంస్థల మధ్య ఐక్యతను సాధించడం కోసం ఆయన ఎంతగానో కృషి చేశాడు. అలా ఆయన పాత్ర భారత విప్లవోద్యమ చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోతుంది.

1970 దశకం చివరలో జగిత్యాల రైతాంగ వుద్యమంలో కీలక పాత్ర పోషించిన కామ్రేడ్ కోటేశ్వర్లు 21వ శతాబ్దపు తొలి దశాబ్దం చివరలో ప్రఖ్యాతి గాంచిన లాల్‌గఢ్ ప్రజా తిరుగుబాటుకు రూపశిల్పిగా నిలిచాడు. భారత విప్లవోద్యమం ఎదుర్కొన్న అనేక ఆటుపోట్ల మధ్య సాహసంగా, చొరవగా, నిబ్బరంగా నిలిచి ఎల్లప్పుడూ ప్రజలను, కేడర్లను అంటి పెట్టుకొని పని చేసిన ఉత్తేజకరమైన నాయకుడాయన. ఆయన ఒక చొరవ గల ఆర్గనైజర్, యోధుడైన కమాండర్, ఆత్మీయతను పంచే గైడ్. వర్గ శత్రువులకు ఆయన వునికి మొదటి నుండి కొరకరాని కొయ్యగానే వుండింది. ఆయన తనపై జరిగిన ఎన్నో దాడులను, హత్యా ప్రయత్నాలను విజయవంతంగా ఎదుర్కొన్నాడు. శత్రువుపై రాజకీయంగా, సైనికంగా దాడి చేసే ఏ అవకాశాన్నీ చేజారిపోనివ్వకుండా నిరంతరాయంగా, రాజీ లేకుండా పోరాడిన అలుపెరుగని యోధుడాయన. అందుకే సోనియా-మన్మోహన్-చిదంబరం-ప్రణబ్-జయరాంల నాయకత్వంలోని దేశ పాలక ముఠా పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీతో కుమ్మక్కయ్యి కుట్ర పన్ని అత్యంత పాశవికంగా హత్య చేసింది. ఆయన మృతదేహంపై వున్న అమానుష చిత్రహింసల గుర్తులు శత్రువు ఫాసిస్టు స్వభావానికి, పిరికితనానికి, ఓటమికి సంకేతాలుగా నిలుస్తాయి. మరోవైపు ఆయన శత్రు చేతిలో దారుణ హింసలన్నిటినీ భరించి మృత్యువు ముంగిట్లో కూడా విజేతగా నిలిచాడు. జంగల్‌మహల్ అడవుల్లో ఆయన చిందించిన రక్తంతో అంతర్జాతీయ శ్రామికవర్గ అరుణ పతాకం మరింత ఎరుపెక్కింది.

కామ్రేడ్ కోటేశ్వర్లు ఎలియాస్ కిషన్‌జీ హత్యతో భారత విప్లవోద్యమం ఒక గొప్ప నాయకుణ్ని కోల్పోయింది. ఇది మా పార్టీకి చాలా పెద్ద నష్టం. వరుసగా గత కొద్ది సంవత్సరాలుగా ప్రధాన నాయకత్వ శక్తుల్ని నష్టపోతూ వస్తున్న మా పార్టీకి ఈ పరిస్థితుల్లో ఇది పూడ్చుకోలేని నష్టమే. అయినప్పటికీ ఈ నష్టాల్ని అధిగమించి భారత విప్లవోద్యమాన్ని విజయపథంలో దృఢంగా పురోగమింపజెయ్యడానికి మా పార్టీ దృఢంగా పోరాడుతుంది. నాయకుల్ని హతమార్చి వుద్యమాల్ని రూపుమాపగలమని పగటి కలలు గంటున్న దోపిడీ పాలకవర్గాలకు ప్రజలూ, ప్రజా వుద్యమాలే కోటేశ్వర్లు, ఆజాద్‌ల వంటి వందల, వేల నాయకుల్ని సృష్టిస్తారనే సత్యం అర్థం కాదు. దోపిడీపీడనలు, అణచివేతలు వున్నంత కాలం ప్రజలు విప్లవిస్తూనే వుంటారు. కోటేశ్వర్లు వంటి యోధులు పుట్టుకొస్తూనే వుంటారు. అందుకు కోటేశ్వర్లు సహా వేలాది అమరవీరులు నెలకొల్పిన ఆదర్శాలు, వాళ్లు నిర్వహించిన త్యాగపూరిత పోరాటాలు ప్రేరణగా నిలుస్తాయి.

అమరుడు కామ్రేడ్ కోటేశ్వర్లుకు మా కేంద్ర కమిటీ అశ్రు నయనాలతో తలవంచి వినమ్రంగా నివాళులర్పిస్తున్నది. పుత్రశోకంతో విలపిస్తూనే తన కొడుకు బాటలో పోరాడాలని పిలుపునిస్తున్న అమ్మ మధురమ్మకు, ఇతర కుటుంబ సభ్యులకూ, స్నేహితులకూ మా కేంద్ర కమిటీ ప్రగాఢ సానుభూతిని ప్రకటిస్తున్నది. కామ్రేడ్ కోటేశ్వర్లు దారుణ హత్యతో

ఆవేదనకు, దుఃఖానికి గురైన పార్టీ, పీఎల్‌జీఏ, ప్రజా సంఘాల కార్యకర్తలకూ, విప్లవ ప్రజానీకానికీ దీనిని అధిగమిస్తూ ప్రజాయుద్ధాన్ని తీవ్రతరం చేయాలని పిలుపునిస్తున్నది. కామ్రేడ్ కోటేశ్వర్లు ఆశయ సాధన కోసం ఆయన బాటలో నడవాలనీ, పార్టీలో, ప్రజాసైన్యంలో విస్తృతంగా చేరాలని యువతరానికి పిలుపునిస్తున్నది. ప్రభుత్వాలు, పోలీసు బలగాలు విధించిన అనేక ఆంక్షలను, దిగ్బంధాలను ఎదిరించి కామ్రేడ్ కోటేశ్వర్లు మృతదేహాన్ని పశ్చిమ బెంగాల్ నుండి పెద్దపల్లికి తీసుకొచ్చిన ప్రజాస్వామికవాదులకు, విప్లవాభిమానులకు, అంతిమయాత్రలో పెద్ద ఎత్తున పాల్గొని మృతవీరుడికి నివాళులర్పించిన ప్రజలకు మా పార్టీ విప్లవాభివందనాలు తెలుపుతున్నది. కామ్రేడ్ కిషన్‌జీ దారుణ హత్యను ఖండించిన వివిధ ప్రజా సంఘాలకూ, పౌరహక్కుల సంఘాలకూ, వివిధ విప్లవ పార్టీలకూ, ప్రజాస్వామికవాదులకూ, రచయితలకూ, పాత్రికేయులకూ, మీడియామిత్రులకూ, కళాకారులకూ, ప్రత్యేక తెలంగాణా వుద్యమకారులకూ, మా కేంద్రకమిటీ వినమ్రంగా కృతజ్ఞతలు తెలుపుతున్నది. ఈ హత్యను నిర్ద్వంద్వంగా ఖండిస్తూ వ్యాసాలు, రిపోర్టులు రాసిన రచయితలకు, మేధావులకు అరుణాభివందనాలు తెలుపుతున్నది. కామ్రేడ్ కిషన్‌జీ హత్యను, భారత ప్రభుత్వం తన దేశ ప్రజలపై సాగిస్తున్న యుద్ధాన్ని ఖండిస్తూ, మా పార్టీకి సంతాప సందేశాలు పంపిన వివిధ దేశాల విప్లవ, ప్రజాస్వామిక సంస్థలకు మా కేంద్రకమిటీ విప్లవాభివందనాలు తెలియజేస్తున్నది.

అసంపూర్తిగా మిగిలిపోయిన కామ్రేడ్ కిషన్‌జీ సహా వేలాది అమరవీరుల ఆశయాన్ని తుదకంటా కొనసాగిస్తామని, భారత నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని జయప్రదం చేసి సోషలిజం, కమ్యూనిజం సాధించే బాటలో అడ్డంకులన్నిటినీ అధిగమిస్తూ పురోగమిస్తామని యావత్తు పార్టీ, పీఎల్‌జీఏ, విప్లవ ప్రజా సంఘాలు, భారత విప్లవ ప్రజానీకం తరఫున మా కేంద్ర కమిటీ మరోసారి దృఢంగా ప్రతిన బూనుతున్నది. భూస్వామ్యాన్ని, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ విధానాన్నీ సామ్రాజ్యవాదాన్ని భూస్థాపితం చేసే దాకా, అన్ని రకాల విప్లవ ప్రతీఘాతుకత్వాన్ని అంతమొందించే దాకా విశ్రమించబోమని భారత పీడిత ప్రజానీకానికి, ప్రపంచ పీడిత ప్రజలందరికీ హామీ ఇస్తున్నది.

- కామ్రేడ్ కిషన్‌జీ అమర్ రహే!
- మార్క్సిజం-లెనినిజం-మావోయిజం వర్ధిల్లాలి!
- కార్మికవర్గ అంతర్జాతీయతత్వం వర్ధిల్లాలి!

**అభయ్**

**అధికార ప్రతినిధి**

**కేంద్ర కమిటీ**

**సీపీఐ (మావోయిస్టు)**

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# కేంద్ర కమిటీ

**2-5-2012**

## ప్రజావ్యతిరేక, నిరంకుశ, ఫాసిస్టు ఎన్.సి.టి.సి.ని రద్దు చేయాలి!

2012 మే 5న కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల ముఖ్యమంత్రులతో నేషనల్ కౌంటర్ టెర్రరిజం సెంటర్ (ఎన్.సి.టి.సి.) ఏర్పాటు విషయంలో తుది నిర్ణయం తీసుకోవడానికి, అందులో భాగంగా పోలీసు, ఇంటలిజెన్స్ వ్యవస్థల్లో కొన్ని మార్పులు చేయడానికీ ఒక సమావేశాన్ని ఏర్పాటు చేసింది. సామ్రాజ్యవాదుల, ప్రత్యేకించి అమెరికా సామ్రాజ్యవాదుల సలహాతో, వారి మార్గదర్శకత్వంలో, వారి నమూనాలో ఏర్పడబోతున్న ఎన్.సి.టి.సి. అనేది ఒక పచ్చి ఫాసిస్టు సంస్థ. దీన్ని ఏర్పాటు చేయడం ద్వారా భారతదేశ పాలకవర్గాలు తమ సమస్యలపై, ప్రజాస్వామిక హక్కులకై పోరాడుతున్న దేశ ప్రజలను, విడిపోయే హక్కుతో సహా జాతుల స్వయంనిర్ణయాధికారానికై పోరాడుతున్న జాతుల పోరాటాలను, హిందూ మతోన్మాద దాడులను, హిందూ మత దురహంకారాన్నీ వేర్వేరు రూపాల్లో నిరసిస్తూ ప్రతిఘటిస్తున్న ముస్లిం మైనారిటీలను, ప్రత్యేకించి ప్రభుత్వ బూటకపు అభివృద్ధి నమూనాను తిరస్కరిస్తూ ప్రజల ప్రత్యామ్నాయ అభివృద్ధి నమూనాను నిర్మిస్తూ నూతన ప్రజాస్వామ్య విప్లవం ద్వారా భారతదేశ పీడిత ప్రజలందరి విముక్తికై పోరాడుతున్న మావోయిస్టు ఉద్యమాన్నీ మరింత క్రూరంగా, మరింత కేంద్రీకృతమైన పద్ధతుల్లో అణచివేయాలని చూస్తున్నాయి. గతంలోని అణచివేత చట్టాలన్నిటికన్నా మరింత క్రూరంగా ప్రజల ప్రజాస్వామిక హక్కులన్నిటినీ హరించివేసే యుఎపిఎ చట్టంలో ప్రభుత్వ సాయుధ బలగాలకు కట్టబెట్టిన విచ్చలవిడి అధికారాల ఆధారంగా ఏర్పడబోయే ఈ సంస్థ 'దేశప్రజల సార్వభౌమత్వానికీ, శాంతికీ, భద్రతకూ, స్వేచ్ఛకూ, ప్రజాస్వామ్యానికీ, జీవించే హక్కుకూ అతి పెద్ద ముప్పు'గా పరిణమించనుంది.

2009 డిసెంబర్‌లో ఎన్.సి.టి.సి. ఏర్పాటు గురించిన ప్రతిపాదనను చేస్తూ కేంద్ర హోంమంత్రి చిదంబరం శాంతిభద్రతలనూ, పరిశోధక విభాగాల్నీ విడదీయాలనీ, దేశం నేడు ఎదుర్కొంటున్న, రాబోయే 5-10 ఏండ్లలో ఎదుర్కొనబోయే అంతర్గత భద్రతా సవాళ్లను దృష్టిలో ఉంచుకున్నప్పుడు హోంమంత్రిత్వ శాఖ బాధ్యతల్ని విడగొట్టాలనీ, హోంమంత్రి కీలక బాధ్యత అయిన అంతర్గత భద్రత పైనే పూర్తిగా కేంద్రీకరించాలనీ అన్నాడు. "దేశ స్థాయిలో భద్రతా వ్యవస్థను సమూలంగా పునర్నిర్మించాల" ని అన్నాడు. దేశం ఎదుర్కొంటున్న అని ఇతను చెబుతున్న అంతర్గత భద్రతా సవాళ్లన్నీ నిజానికి సామ్రాజ్యవాదుల, భూస్వాముల,

దళారీ నిరంకుశ బూర్జువాలు మన దేశ సహజ వనరులనూ, సంపదలనూ విచ్చలవిడిగా దోచుకోవడంలో ఎదుర్కొంటున్న అడ్డంకులే. ఆ సవాళ్లు మన దేశంలోని అత్యంత పేదవారూ, అత్యంత పీడితులూ అయిన ప్రజలు కార్పొరేట్ సంస్థలకు దేశాన్ని తెగనమ్మకుండా అడ్డుకుంటూ చేస్తున్న పోరాటాలే. ప్రత్యేకించి నేడు సిపిఐ (మావోయిస్టు) నేతృత్వంలో అత్యధికంగా ఆదివాసులూ, దళితులూ అయిన కార్మిక-కర్షక ప్రజానీకం తమపై దోపిడీ, పీడనల్ని ఎదిరిస్తూ చేస్తున్న సాయుధ ప్రతిఘటన ఆ సవాళ్లలో ముఖ్యమైనది. సామ్రాజ్యవాదులకు దేశం తలుపులను బార్లా తెరిచిన నూతన ఆర్థిక విధానాలను ప్రవేశపెట్టిన తర్వాత, సామ్రాజ్యవాద ఎల్‌ఐసీ వ్యూహానికనుగుణంగా దేశంలోని అన్ని రంగాలనూ పునర్నిర్మాణం (రీస్ట్రక్చర్) చేయడం జరుగుతోంది. అందులో భాగమే దేశస్థాయిలో అంతర్గత భద్రతా వ్యవస్థను పునర్నిర్మాణం చేయాలనే ఈ ప్రతిపాదన. అన్ని రంగాల్లో జరుగుతున్న ఈ పునర్నిర్మాణాల ఏకైక లక్ష్యం సామ్రాజ్యవాద బహుళజాతి సంస్థలకు, దళారీ నిరంకుశ బూర్జువా కార్పొరేట్ సంస్థలకు సూపర్ లాభాలను సమకూర్చడమే. ఆ లాభాలకు అడ్డం వచ్చే ఏవైనా పాలకవర్గాల రథచక్రాల కింద నలిగిపోవల్సిందే - అది ప్రజాస్వామ్యమే గానీ, దేశ సార్వభౌమత్వమే గానీ, ప్రజలు పోరాడి సాధించుకున్న హక్కులే గానీ. ఈ పునర్నిర్మాణాల స్వాభావిక లక్షణం మరింత ఫాసిజీకరణ, మరిన్ని కేంద్రీకృత అధికారాలు - అన్ని రంగాల్లోనూ, అన్ని పార్శ్వాల్లోనూ.

ఈ ప్రతిపాదన కేంద్ర హోంమంత్రిని అంతర్గత భద్రత విషయంలో ఎదురులేని చక్రవర్తిగా చేసేస్తుంది. దేశంలోని ఇంటలిజెన్స్ వ్యవస్థలన్నీ దీని కిందకి వచ్చేస్తాయి. మన దేశ రాజ్యాంగంలో నామమాత్రంగా వున్న ఫెడరల్ వ్యవస్థకు కూడా ఇది ఇక ముసుగుల్ని చించేసి సంపూర్ణంగా కేంద్రానికి అధికారాల్ని కట్టబెడుతుంది. రాష్ట్రాల్ని సంపూర్ణంగా అదుపు చేయడానికి కేంద్రానికి జేబుసంస్థగా ఇది వుంటుంది. అన్ని కౌంటర్ టెర్రరిజం చర్యలనూ ఇది అదుపు చేస్తుంది, సమన్వయం చేస్తుంది. రాష్ట్ర ప్రభుత్వ అంగాలు (పోలీసులు సహా) దీనికి సమాచారం, డాక్యుమెంట్లు, రిపోర్టులు సమర్పించాలి. రక్షణ, ఆర్థిక మంత్రిత్వ శాఖల ఇంటలిజెన్స్ సంస్థలు కూడా దీనికి తమ ప్రతినిధుల్ని పంపాలి. సోకాల్డ్ టెర్రరిజాన్ని అణచివేయడంలో పాల్గొంటున్నఏ సంస్థలనైనా ఆ మేరకు దీని పరిధి, అదుపులోకి తీసుకురావాలని చూస్తున్నారు. ఇది ఐబి కింద వుంటుంది కనుక ఐబి చేతికి, ఎన్.సి.టి.సి. డైరక్టర్ చేతికి అపరిమితమైన అధికారాల్ని ఇది కట్టబెడుతుంది. దేశ అంతర్గత భద్రతకు సంబంధించిన అన్ని విషయాలకూ ఇతనే జవాబుదారీ అవుతాడు అని హోంమంత్రి పేర్కొన్నాడు. ఇంటలిజెన్స్, పరిశోధన, ఆపరేషన్స్ కూడా దీని పరిధిలోకి వస్తాయి. ఇంకా మరెన్నో విచ్చలవిడి అధికారాలతో పారదర్శకత లేని, జవాబుదారీ లేని పరమ నిరంకుశ రాజ్యాంగేతర సంస్థగా దీన్ని తీర్చిదిద్ది పాలకవర్గాలు తమ స్వంత రాజ్యాంగంలో రాసుకున్న నామమాత్రపు ప్రజాస్వామిక సూత్రాలను కూడా ఘోరంగా ఉల్లంఘిస్తున్నాయి. మరింత ఆందోళనకరమైన విషయం ఏంటంటే అన్ని రకాల రాజకీయ ఉద్యమాలనూ పాలకవర్గాలు 'టెర్రరిజం' అని ముద్ర వేస్తున్నాయి. ప్రజల మౌలిక సమస్యలన్నిటి

నుండి, సామ్రాజ్యవాద అనుకూల విధానాల్లో భాగంగా విస్థాపన, అణు విద్యుత్, సెజ్ తదితర మందుతున్న సమస్యల నుండి దృష్టిని మళ్లిస్తూ 'టెర్రరిజం' అనేదాన్నే భూతంలా చూపిస్తున్నారు. అందుకని అన్ని కౌంటర్ టెర్రరిజం చర్యలనూ దీని కిందకు తీసుకురావడం అంటే రాజకీయ ఉద్యమాలన్నిటినీ టెర్రరిజం పేరు పెట్టి అణచివేయడమేనని అర్థం చేసుకోవాలి.

ఇంత కేంద్రీకృతమైన అధికారాలు నిజానికి రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోకి వచ్చే శాంతి భద్రతల అంశాన్ని అపహాస్యం చేస్తున్నాయి. దీనిని పట్టుకునే మమతా బెనర్జీ, నవీన్ పట్నాయక్, నరేంద్ర మోడీ, ప్రకాష్ సింగ్ బాదల్, జయలలిత వంటి కాంగ్రెసేతర ముఖ్యమంత్రులు రాష్ట్ర ప్రభుత్వాల హక్కుల్ని ఇది తుంగలో తొక్కుతుందనీ, ఫెడరల్ వ్యవస్థకు ఇది భంగకరం అనీ గగ్గోలు పెడుతున్నారు. వారి నిజమైన బాధ ఫెడరల్ వ్యవస్థకు భంగం అనేనా? ముమ్మాటికీ కాదు. ప్రజలపై ఇది మరింత అణచివేతకు దారి తీస్తుందని అసలే కాదు. అసలా అంశమే వారి ప్రస్తావనలో లేదు. నిజానికి అధికార కాంగ్రెస్‌గానీ, కాంగ్రెసేతర పాలక పార్టీలు గానీ ప్రజల పచ్చినెత్తురు తాగే పరమ నియంతలే. ఒక్కొక్కరి చరిత్రా ప్రజా ఉద్యమాల్ని రక్తపుటేరుల్లో ముంచి, మట్టి నుండి వికసించిన స్థానిక ప్రజల నాయకులనూ, విప్లవోద్యమ నాయకులనూ నిర్దాక్షిణ్యంగా నిర్మూలిస్తున్న చరిత్రే. వారందరిదీ కార్పొరేట్ సంస్థలకముందు సాష్టాంగపడుతూ, వారి ముడుపులను పీకల నిండా మెక్కుతూ, వారి ప్రయోజనాలతో తమ ప్రయోజనాలను పీటముడి వేసుకుంటూ, దాన్ని ప్రతిఘటించే అన్ని రకాల ప్రజాస్వామిక, విప్లవ శక్తులను అడ్డం తొలగించడానికి ఎంతకైనా బరి తెగిస్తున్న చరిత్రే. మరి ఎన్.సి.టి.సి. ని వ్యతిరేకిస్తున్నట్టుగా ఎందుకింత హంగామా? చిదంబరంగారు బందిపోట్ల నాయకుడిగా వారి మధ్య ఉన్న పంపకాల, హక్కుల ఒప్పందాలను ఉల్లంఘిస్తూ తమ పరిధిలోకి కూడా దూరిపోయి తాము చేయాల్సిన అణచివేతను కూడా ఆయనే చేస్తాననడమే వారి అసలు బాధ. ఎవరికీ జవాబుదారీ లేకుండా పరమ నిరంకుశంగా పాలన సాగించే వీరు ఆ మేరకు కేంద్ర హోంమంత్రిత్వ శాఖకు జవాబుదారీ కావల్సి వుంటుంది కనుక ఈ ఆందోళన. దొంగలు దోపిడీ సొమ్మును పంచుకోవడంలో ఎదురయ్యే కొట్లాటలాంటిదే ఇది తప్ప మరొకటి కాదు. ఈ ఎన్.సి.టి.సి.కి అపరిమిత అధికారాల్ని కట్టబెట్టడానికి ఆధారపడిన యుఎపిఎ చట్టానికి చేసిన సవరణల్ని 2008 డిసెంబర్‌లో వీరంతా ఏకగ్రీవంగా, ఎటువంటి చర్చా, ఎదిరింపు లేకుండా పార్లమెంటులో ఆమోదించిన అత్యంత అప్రజాస్వామికమైన పద్ధతి చాలు వీరంతా ఎంత తోడుదొంగలో అర్థం కావడానికి. నిస్సందేహంగా మే 5న ఈ బందిపోట్లందరూ తమ మధ్య ఉన్న సోకాల్డ్ 'విభేదాల్ని' 'సామరస్యంగా' 'సుహృద్భావ' వాతావరణంలో పరిష్కరించుకుని మరింత 'ఐక్యంగా' తెర మీద కనిపించబోతున్నారు. ఈ ఐక్యత 'ప్రజల మీద యుద్ధా'న్ని మరింత 'ఐక్యంగా' తీవ్రతరం చేయడానికే అనేది వేరే చెప్పనవసరం లేదు.

**ప్రజలారా! ప్రజాస్వామికవాదులారా!**

ఇప్పటికే 'ప్రజల మీద యుద్ధం' అయిన ఆపరేషన్ గ్రీన్‌హంట్‌లో భాగంగా రోజురోజుకూ ప్రజాస్వామిక హక్కులు హరించవేయబడుతూ వస్తున్నాయి. ప్రభుత్వ సాయుధ బలగాలు అన్ని రకాల ప్రతిఘటనలనూ (సాయుధ, నిరాయుధ) ఉక్కుపాదంతో అణచివేస్తూనే ఉన్నాయి. ఎన్.సి.టి.సి. కనుక ఏర్పడితే ఇప్పటికే యుఎపిఎ కింద నిషేధానికి గురైన మా పార్టీ వంటివాటితో పాటు ఇక ప్రతి పోరాడే సంస్థా నిషేధానికి గురవుతుంది, ప్రజల ప్రతి నిరసనా నేరం అవుతుంది. ప్రతి పోరాటం చట్టవిరుద్ధం అవుతుంది. పోరాట ప్రాంతాలన్నీ కాన్‌సంట్రేషన్ క్యాంపులవుతాయి. భారతదేశం హిట్లర్ పాలనలోని జర్మనీ అవుతుంది. దేశ వ్యవహారాలన్నిటిలో ముఖ్యంగా అంతర్గత భద్రతా సంబంధిత విషయాల్లో అమెరికా జోక్యం మరింతగా పెరుగుతుంది.

అందువల్ల  దేశాన్ని బహుళజాతి కంపెనీలకు అమ్మివేయడానికి, వారితో చేసుకున్న వందలాది ఎంఓయూల్ని అమలులోకి తేవడాన్ని అడ్డుకుంటున్న సంస్థలన్నిటినీ సమూలంగా నిర్మూలించడానికి మార్గాన్ని సుగమం చేసుకోవడానికి పచ్చి ఫాసిస్టు సంస్థగా పాలకవర్గాలు ముందుకు తెస్తున్న ఈ ఎన్.సి.టి.సి. ప్రతిపాదనను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ పెద్దెత్తున ఉద్యమాన్ని నిర్మించాల్సిందిగా సిపిఐ (మావోయిస్టు) కేంద్రకమిటీ పిలుపునిస్తోంది. అమెరికా హోంల్యాండ్ సెక్యూరిటీ నమూనాలో, దేశ ప్రయోజనాలను అమెరికా భద్రతా, ఇంటలిజెన్స్ సంస్థలకు ముడివేస్తూ రూపొందించబడుతున్న ఈ సంస్థ 'టెర్రరిజంపై యుద్ధం' పేరుతో పోరాడే సంస్థలను నిషేధించడం, ప్రజల ప్రజాస్వామిక హక్కులను కాలరాచివేయడం ద్వారా దేశంలో కార్పొరేట్ దోపిడీకి ఎటువంటి ప్రజాప్రతిఘటన అనేదే లేకుండా చేయాలని చూస్తోంది. ప్రజాఉద్యమాల, ప్రత్యేకించి విప్లవోద్యమాల నాయకత్వాన్ని నిర్మూలించడానికి, తద్వారా ఇలాంటి ప్రజాప్రతిఘటనకు నాయకత్వం లేకుండా చేయడానికి కంకణం కట్టుకుని ప్రయత్నం చేస్తోంది. ఈ కుట్రలను గ్రహించి కార్మికులూ, కర్షకులూ, విద్యార్థులూ, మేధావులూ, రచయితలూ, జర్నలిస్టులూ, వృత్తి పనివారూ, మీడియా మిత్రులూ, మహిళలూ, మైనారిటీలూ, ఆదివాసులూ, దళితులూ, ప్రజాస్వామికవాదులూ, ప్రగతిశీలురూ, దేశభక్తులూ, ప్రతి ఒక్కరూ ఈ నిరంకుశ ఎన్.సి.టి.సి. రద్దును ముక్తకంఠంతో డిమాండ్ చేస్తూ ఆ కుట్రలను వమ్ము చేయాల్సిందిగా ప్రజలకు పిలుపునిస్తోంది. ఎన్.సి.టి.సి.కి ఆధారంగా తీసుకున్న యుఎపిఎనీ, ఎఎఫ్ఎస్‌పిఎ, సిజిఎస్‌పిఎస్ఎ, మకోకా తదితర అణచివేత చట్టాలను కూడా తక్షణం రద్దు చేయాలని కోరుతూ పెద్దెత్తున కదలి రావల్సిందిగా కోరుతోంది.

**అభయ్**

**అధికార ప్రతినిధి**

**కేంద్ర కమిటీ**

**సీపీఐ (మావోయిస్టు)**

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# కేంద్ర కమిటీ

**10-5-2012**

## బుటువాన్ రెయిడ్‌లో 66 ఆయుధాలు స్వాధీనం చేసుకున్న నూతన ప్రజా సైన్యానికి భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) విప్లవాభినందనలు!

ఫిలిప్పైన్స్‌లో మిండనావో ద్వీపంలోని బుటువాన్ నగరంలో ఒక భద్రతా ఏజెన్సీ ఆధ్వర్యంలోని ఆయుధాగారంపై 2012 ఏప్రిల్ 22న నూతన ప్రజా సైన్యం (ఎన్‌పిఏ) ఉత్తర-మధ్య మిండనావో కమాండ్ కింద ఉన్న 4వ ఫ్రంట్ పరిధిలోని బలగాలు విజయవంతంగా నిర్వహించిన రెయిడ్‌లో 66 ఆధునిక రైఫిళ్లను స్వాధీనం చేసుకున్నందుకు ఎన్‌పిఏ కమాండర్లను, ఎర్రపోరాటయోధులను భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) అభినందిస్తున్నది. ఎన్‌పిఏ స్వాధీనం చేసుకున్న ఆయుధాలలో అధికంగా ఏకె-47 రైఫిళ్లు ఉండగా, కొన్ని స్నైపర్ రైఫిళ్లు, పిస్టళ్లు ఉండడం విశేషం.

బుటువాన్ నగరంలోని లిబెర్టడ్ బరంగేలో మైనింగ్ కంపెనీలు ఏర్పర్చుకున్న ఎర్త్‌సేవర్ భద్రతా ఏజెన్సీ నుంచి ఎన్‌పిఏ ఈ ఆధునిక ఆయుధాల్ని స్వాధీనం చేసుకుంది.

ఈ సాహసిక ఎన్‌పిఏ రెయిడ్ ఫిలిపినో ప్రజల్ని, ఫిలిపినో విప్లవ బలగాలను ఎంతగానో ఉత్సాహపరిచింది. ఫిలిప్పైన్స్ దేశవ్యాప్తంగా ఉన్న ఇతర ఎన్‌పిఏ యూనిట్లకు ఈ దాడి ఒక నమూనాగా నిలిచింది. ప్రజలు, ఎన్‌పిఏ బలగాలు ఉత్తర-మధ్య కమాండ్‌లోని ఎన్‌పిఏ బలగాలకు జేజేలు పలికారు. ఈ దాడితో ఉత్సాహం పొందిన అనేక మంది యువతీ, యువకులు ఎన్‌పిఏలోకి చేరేందుకు ముందుకు వస్తున్నారు. తమ దేశంలో సాయుధ వ్యవసాయ విప్లవాన్ని పురోగమింపజేసేందుకు పూనుకుంటున్నారు. ఈ సంతోషంలో మా పార్టీ సిపిఐ (మావోయిస్టు) కూడా పాలుపంచుకుంటోంది. ఫిలిప్పైన్స్, భారతదేశం, టర్కీ తదితర దేశాలలో పురోగమిస్తున్న విప్లవోద్యమాలను ఈ ఘటన ఎంతగానో ఉత్సాహపరిచింది.

గత కొద్ది సంవత్సరాలుగా ఫిలిప్పైన్స్ కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలోని ఎన్‌పిఏ విప్లవ గెరిల్లాలు ఫిలిప్పైన్స్ అభివృద్ధి నిరోధక పోలీసు (ఏపిపి), సైనిక బలగాలపై (ఏఎఫ్‌పి) వందలాది ఎత్తుగడల ఎదురుదాడులు నిర్వహించారు. వందలాది ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడులు ఫిలిప్పైన్స్ ప్రజాయుద్ధాన్ని పురోగమింపజేయడంలో కీలకమైన పాత్ర పోషించాయి.

ప్రస్తుతం ఫిలిప్పైన్స్ విప్లవం వ్యూహాత్మక ఆత్మరక్షణా దశ నుంచి వ్యూహాత్మక ప్రతిష్టంబన దశకు పథకం ప్రకారం పురోగమించేందుకు కృషి సాగిస్తోంది. ఇందులో భాగంగానే ఎన్‌పిఏ విప్లవ గెరిల్లా బలగాలు బుటువాన్ రెయిడ్ నిర్వహించాయి. ఈ ఘటన జరిగిన కొద్ది రోజులలోనే, 2012 ఏప్రిల్ 25న ఇఫుగావో ప్రాంతంలో ఎన్‌పిఏ నిర్వహించిన ఒక వీరోచిత ఆంబుష్‌లో 86వ ఇన్‌ఫాంట్రీ బెటాలియన్‌కు చెందిన ఆపరేషన్స్ ఆఫీసర్‌తో సహా 11 మంది సైనికులు మట్టిగరిచారు. ఈ సంవత్సరంలో ఫిలిప్పైన్స్ సైన్యానికి ఇది మరో పెద్ద దెబ్బ.

దోపిడి వ్యవస్థను కూలదోసి నూతన ప్రజాస్వామిక వ్యవస్థను స్థాపించడంలో శత్రు నిర్మూలన, ఆయుధాల స్వాధీనం అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తాయని మార్క్సిస్టు మహోపాధ్యాయుడు మావో పదే పదే మనకు బోధించాడు. ఒక వైపు పెద్ద సంఖ్యలో శత్రువును నిర్మూలిస్తూనే, మరోవైపు శత్రు బలగాల నుంచి స్వాధీనం చేసుకున్న ఆయుధాలతో విప్లవ ప్రజా సైన్యాలను నిర్మాణం చేయడం, శిక్షణ ఇవ్వడం, ప్రజాయుద్ధాన్ని మరింత పురోగమింపజేయడం, ప్రత్యామ్నాయ ప్రజా రాజ్యాధికారాన్ని స్థాపించడం నేడు అంతర్జాతీయంగా దీర్ఘకాల ప్రజాయుద్ధ పంథాను అనుసరిస్తున్న విప్లవకారుల ముందున్న కర్తవ్యం. ప్రపంచ సోషలిస్టు విప్లవ పురోగమనానికి బుటువాన్ లాంటి చర్యలు అనేకం నిర్వహించాల్సిన అవసరం నేడు ఉంది. తద్వారా ప్రజా రాజ్యాధికారాన్ని నిర్మిస్తూ, పటిష్టం చేస్తూ విస్తరింపజేయాలి. బుటువాన్ రెయిడ్ ద్వారా ప్రపంచ విప్లవకారుల ముందు ఒక నమూనాను నిలిపిన ఎన్‌పిఏకూ, ఫిలిప్పైన్స్ కమ్యూనిస్టు పార్టీకి మా పార్టీ విప్లవాభినందనలు తెలియజేస్తోంది. మావో రూపొందించిన ప్రజాయుద్ధం మార్గంలో పయనిస్తున్న కమ్యూనిస్టు విప్లవ పార్టీలు, గ్రూపులు, విప్లవకారులు బుటువాన్ రెయిడ్‌ను తప్పక ఆదర్శంగా తీసుకొని ముందుకు పురోగమిస్తారు.

**అభయ్**

**అధికార ప్రతినిధి**

**కేంద్ర కమిటీ**

**సీపీఐ (మావోయిస్టు)**

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# కేంద్ర కమిటీ

**4-6-2012**

## ప్రపంచ ప్రఖ్యాత రచయితల్లో ఒకరైన కామ్రేడ్ యాన్ మిర్దాల్ భారత పర్యటనలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేయ తలపెట్టడాన్ని ఖండిస్తున్నాం!

కామ్రేడ్ యాన్ మిర్దాల్ స్వీడన్ దేశస్థుడు. ఆయన ప్రపంచ ప్రఖ్యాత రచయితల్లో ఒకరు. ఆయన జనచైనా సహా ప్రపంచంలోని అనేక దేశాలను పర్యటించి ప్రపంచ పీడిత ప్రజల పక్షాన నిలిచి కళలు, సంస్కృతి, చరిత్ర, పర్యావరణం మొదలైన అనేక అంశాలపై గత ఆరు దశాబ్దాలకు పైగా ఆయన తన రచనా వ్యాసంగాన్ని కొనసాగిస్తున్నారు. ఆయన తన 82 ఏండ్ల వృద్ధాప్యంలో ఒక ప్రజాస్వామిక కార్యక్రమానికి హాజరు కావడానికై భారతదేశాన్ని సందర్శించి ఇక్కడ భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) నాయకత్వంలో కొనసాగుతున్న విప్లవోద్యమ ప్రాంతంలో పర్యటించి "భారతదేశంపై అరుణతార" పుస్తకాన్ని రచించారు. భారత కమూనిస్టు పార్టీ (మావోయిస్టు) అగ్రశ్రేణి నాయకత్వాన్ని కలిశారు. ఆ పుస్తక ఆవిష్కరణ సందర్భంగా మరోసారి ఆయన మన భారతదేశంలోని రాజధాని ఢిల్లీ సహా వివిధ పట్టణాల్లో పర్యటించి తన భావాలను అనేకమంది రచయితలతో, ప్రజాస్వామిక వాదులతో, విద్యార్థులతో, పాత్రికేయులతో పంచుకున్నారు. ఆయన పర్యటనలు గానీ, ప్రచురణలు గానీ అన్నీ బహిరంగంగా అందరికీ తెలిసి కొనసాగుతున్నవే. అలాగే ఆయన భావాలూ అందరికీ తేటతెల్లమే. ఆయన తను ఒక కమ్యూనిస్టునని స్పష్టంగానే చెప్పుకున్నారు. భారతదేశంలో దోపిడీ పాలకవర్గాలు సుదీర్ఘకాలంగా విప్లవోద్యమ అణచివేత చర్యలను కొనసాగించడాన్ని ఆయన స్పష్టంగా గత మూడు దశాబ్దాలకు పైగా పరిశీలిస్తున్నారు. 1980ల మొదట్లో ఆయన ఆంధ్రప్రదేశ్ పర్యటించి 'ఇండియా అవేట్స్' పుస్తకాన్ని రచించారు. భారత ప్రజాతంత్ర విప్లవోద్యమానికి సంఘీభావంగా గత కొంత కాలంగా ప్రపంచ వ్యాప్తంగా ప్రజాస్వామిక శక్తులను కూడగట్టడానికి కృషి చేస్తున్న వారికి ఆయన యిస్తున్న మద్దతు శ్లాఘనీయమైనది. పీడిత ప్రజల పక్షాన నిలిచి ఆయన తన రచనా పటిమతో తన సామ్రాజ్యవాద వ్యతిరేక, ప్రజాస్వామిక, కమ్యూనిస్టు భావాలను నిర్భయంగా వెల్లడిస్తున్నారు. అమెరికా సామ్రాజ్యవాదం కఠినమైన నిబంధనలు పెట్టడం ద్వారా ఆయన్ని అమెరికాకు రాకుండా పరోక్షంగా నిషేధించిన విషయం జగద్విదితమే. ప్రస్తుతం నయా ఫాసిస్టు అమెరికా రాజ్యం అడుగుజాడల్లో భారతప్రభుత్వం ఆయన భారత పర్యటనపై నిషేధాన్ని విధించ పూనుకోవడం దాని ప్రజాస్వామ్య ముసుగును

పూర్తిగా బహిర్గతం చేస్తూ, ఫాసిస్టు స్వభావాన్ని, నిజాల వెల్లడింతల పట్ల పిరికితనాన్ని స్పష్టం చేస్తుంది. ప్రపంచ సుప్రసిద్ధ రచయిత పట్ల భారత ప్రభుత్వం అనుసరిస్తున్న ఫాసిస్టు వైఖరిని మా పార్టీ నిర్ద్వంద్వంగా ఖండిస్తోంది. దేశంలోని మేధావులను, ప్రజాస్వామికవాదులను, రచయితలను, కళాకారులను, విద్యార్థులను, పాత్రికేయులను, అన్ని సముదాయాల ప్రజలను భారత ప్రభుత్వ నిరంకుశ వైఖరిని ఖండించాల్సిందిగా విజ్ఞప్తి చేస్తోంది.

భారతదేశంతో కామ్రేడ్ యాన్ మిర్డాల్‌కే కాకుండా ఆయన తండ్రి గున్నర్ మిర్డాల్, తల్లి ఆల్వా మిర్డాల్‌కు ఘనిష్ఠ సంబంధాలున్నాయి. నోబుల్ బహుమతి గ్రహీతలైన ఆయన తల్లిదండ్రులలో తల్లి స్వీడన్ రాయబారిగా భారతదేశంలో దాదాపు ఐదేళ్ళకాలం **(1955-61)** పనిచేసింది. ఈ జంటకు జవహర్‌లాల్ నెహ్రూ ఇంటర్నేషనల్ అండర్‌స్టాండింగ్ అవార్డ్‌ను భారత ప్రభుత్వం ఇచ్చి సత్కరించింది. వారి పుత్రుడైన కామ్రేడ్ మిర్డాల్ ఢిల్లీ విశ్వవిద్యాలయంలో అనేక విషయాలపై తరచుగా ప్రసంగాలు చేస్తున్నారు. ఈ రకంగా మన దేశంతో సుదీర్ఘకాలంగా సంబంధాలలో వుంటూ ఇక్కడి పీడిత ప్రజల సమస్యలను, వెతలను ప్రత్యక్షంగా తెలుసుకుంటూ తన శక్తి మేరకు వాటికి అక్షర రూపమిచ్చి ప్రపంచ ప్రజలకు అందజేస్తున్న భారత ప్రజల గొప్ప మిత్రుణ్ణి భారతదేశం రాకుండ అడ్డుకోవడానికి భారత ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి అత్యంత సిగ్గుచేటైనది. భారతదేశంలోని అతి విలువైన సంపదలను తమ ఇష్టానుసారంగా దోచుకుపోవడానికి బహుళజాతి కార్పోరేషన్‌లను, బడా పెట్టుబడిదారులను ఎర్ర తివాచీలు పరిచి ఆహ్వానిస్తున్న భారత ప్రభుత్వం మరోవైపు నిజమైన ప్రజాస్వామిక, ప్రగతిశీల భావాలతో వారిని అడ్డుకొంటున్న వారిని మాత్రం సహించలేక పోతున్నది. ఎన్‌రాన్, డోవ్ కెమికల్స్, పోస్కో, మోన్‌శాంటో, వేదాంత, అరెవా యింకా మరెన్నో అంతర్జాతీయ కార్పొరేట్ తిమింగలాలకు భారత ప్రభుత్వం ఆహ్వానాలు పలుకుతున్నది. వారిని అంటకాగే జిందల్, మిట్టల్, ఎస్సార్, టాటా, అంబానీలను ఆకాశానికెత్తుతూ వారికి సేవలు చేస్తున్నది. మన దేశంలోని విశాల ప్రాంతాల్లో నిక్షిప్తమై వున్న అతి విలువైన భూములు, అడవులు, కొండలు, నీరు, ఖనిజాలు, రకరకాల ఇతర ప్రాకృతిక వనరులను వారి దోపిడీ నుంచి కాపాడుకోవడానికి ఆదివాసీ ప్రజలు జీవన్మరణ పోరాటం చేస్తుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అడవుల్లో లక్షలాది పోలీసు, అర్ధసైనిక బలగాలను మోహరించి గత మూడేళు ళ్ళగా అత్యంత క్రూరంగా గ్రీన్‌హంట్ సైనికదాడులను కొనసాగిస్తూ రక్తపుటేరులను ప్రవహింప చేస్తున్నది. పట్టణాలలోకి, నగరాలలోకి గ్రీన్‌హంట్ దాడులు విస్తరించి, అక్కడి ప్రజాస్వామికవాదులను, ఆదివాసీ శ్రేయోభిలాషులను, ప్రజా రచయితలను, కళాకారులను, పాత్రికేయులను రకరకాలుగా వేధిస్తూ, అరెస్టులు చేస్తూ, ఇంటరాగేట్ చేస్తూ, అమానుషంగా హింసిస్తూ, తప్పుడు కేసుల్లో ఇరికిస్తోంది. ఇప్పుడు గ్రీన్‌హంట్ దాడులు దేశ సరిహద్దులు సైతం దాటాయనడానికి కామ్రేడ్ యాన్ మిర్డాల్‌పై సాగుతున్న దాడే ఒక ప్రత్యక్ష ఉదాహరణ. విప్లవోద్యమానికి నాయకత్వం వహిస్తున్న విప్లవ పార్టీని సమూలంగా నిర్మూలించడానికి మోహరించిన భద్రతా బలగాలకు తోడు భారత సైన్యాలను ఏ క్షణానైనా రంగంలోకి

దించడానికి భారత ప్రభుత్వం సిద్ధమైంది. ఇలాంటి ప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ, సామ్రాజ్యవాదుల అత్యంత ప్రమాదకర ధోరణులును వెల్లడిచేస్తూ పీడిత ప్రజల పట్ల, విప్లవోద్యమం పక్షం దృఢంగా నిలిచిన కామ్రేడ్ యాన్ మిర్డాల్ సరసన నిలిచి భారత ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా ప్రజా రచయితలు, కవులు, కళాకారులు, ప్రజాస్వామికవాదులు, ఆదివాసీ శ్రేయోభిలాషులు మరో మాటలో పీడిత జన పక్షపాతులంతా దృఢంగా పోరాడుతారని మా పార్టీ పూర్తిగా విశ్వసిస్తున్నది.

ఈ దేశంలోని పాలకవర్గాలు కళాకారుల పట్ల, రచయితల పట్ల, పాత్రికేయులు, సినీ నిర్మాతలు, దర్శకుల పట్ల ఫాసిస్టు స్వభావంతో వ్యవహరించటడం ఇవ్వాళ కొత్తేమీ కాదు. ఈ దేశంలో ఎంతో మంది రచయితలు, ప్రజాస్వామికవాదులు అసంఖ్యామైన కుట్ర కేసుల పాలై కటకటాలకు తోయబడ్డ వారున్నారు. ఇటీవలే 2010 జూలై 1 నాడు హేమచంద్ర పాండే అనే ఢిల్లీ పాత్రికేయుణ్ణి బూటకపు ఎన్‌కౌంటర్లో ఆంధ్రప్రదేశ్ పోలీసులు కాల్చిచంపారు. కాశ్మీరు ప్రజల న్యాయమైన పోరాటాన్ని సమర్ధించిన ఫలితానికి ప్రముఖ రచయిత్రి అరుంధతీరాయ్‌పై భారత శిక్షాస్మృతి పడగ విప్పింది. సుప్రీం కోర్టు న్యాయవాది ప్రశాంత భూషణ్‌పై మతోన్మాద గూండా శక్తులు చేయి చేసుకున్నాయి. గతంలో సప్దర్‌హష్మీని పొట్టనబెట్టుకొన్న రాజ్యం తాజాగా ప్రజా కళాకారుడు జీతేన్ మరాండికి మరణ శిక్ష విధించి ప్రజాపోరాట వత్తిడితో ఉపసంహరించుకొంది. ఈ మధ్యకాలంలోనే పశ్చిమ బెంగాల్ నయా ఫాసిస్టు సామ్రాజ్ఞి ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తనపై కార్టూన్ వేశాడన్న ఆగ్రహంతో ప్రొఫెసర్ అభిషేక్ మహాపాత్రను అరెస్ట్ చేయించింది. ఆ చర్యను ప్రశ్నించిన జాదవ్‌పూర్ యూనివర్శిటీ విద్యార్థులను మావోయిస్టు లంటూ వేధింపులకు గురి చేసింది. ఇలా దేశంలో రోజురోజుకూ పాలకవర్గాల ఫాసిస్టు దాడులు సర్వత్రా వ్యాపిస్తూ అత్యంత క్రూరంగా గ్రీన్‌హంట్ ప్రతాపాన్ని చూపుతున్నాయి. బ్రిటిష్ హయాంలో ఎందరెందరో రచయితలు, కళకారులు, విప్లవకారులు దేశభక్తిని చాటినందుకు ఉరికంబాలెక్కారు. ఆ సామ్రాజ్యవాదుల ప్రత్యేకించి ఈనాటి అమెరికా సామ్రాజ్యవాదుల అడుగులకు మడుగులొత్తుతూ భారత రాజ్యం దేశంలో అణచివేత చర్యలను తీవ్రతరం చేస్తోంది. కామ్రేడ్ యాన్ మిర్డాల్ కలానికి మరింత శక్తినిచ్చే ఒక విశాలమైన, బలమైన సంఘీభావ ఉద్యమాన్ని నిర్మించాల్సిందిగా, ఆయన భారత పర్యటన రద్దు వైఖరిని వెనక్కి తీసుకునేలా భారత ప్రభుత్వంపై పోరాడాల్సిందిగా మా పార్టీ విజ్ఞప్తి చేస్తోంది.

**అభయ్**

**అధికార ప్రతినిధి**

**కేంద్ర కమిటీ**

**సీపీఐ (మావోయిస్టు)**

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# కేంద్ర కమిటీ

**10-7-2012**

## బాసగూడ నరమేధానికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలి! బస్తర్ నుండి అన్ని పారామిలటరీ, మిలటరీ బలగాలను తక్షణం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేయండి!

28-6-2012న ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ ప్రాంతంలో ఇప్పటివరకు జరిగిన అతి పాశవికమైన నరమేధాల్లో ఒకటైన బాసగూడ నరమేధంలో 17మంది అమాయక, సాధారణ, నిరాయుధ గ్రామీణులు రక్తపిపాసులైన ఓ వెయ్యిమంది సిఆర్‌పిఎఫ్-కోబ్రా, రాష్ట్ర పోలీసు బలగాలు, కోయ కమాండోలు, ఎస్పీవోల కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయారు. ఈ కిరాయి బలగాలు సార్కిన్‌గూడ గ్రామంలో తమ పంటల గురించి, వాటికి సంబంధించిన పండుగల గురించి మాట్లాడుకోవడానికి ఒక దగ్గర జమ అయ్యి చర్చించుకుంటున్న ఆదివాసీ ప్రజలను చుట్టుముట్టి విచక్షణారహితంగా, ఏకపక్షంగా, క్రూరంగా కాల్పులు జరిపి అనేకమంది ప్రజలను చంపి జలియన్‌వాలాబాగ్ మారణకాండను తలపించారు. ఆ కాల్పుల్లో మరెంతోమంది గ్రామీణులు గాయపడ్డారు. చనిపోయినవారిలో తొమ్మిదిమంది 12 నుండి 16 సంవత్సరాల మధ్య వయస్సుగల పిల్లలు. గాయపడినవారిలో కూడా పిల్లలు, స్త్రీలు, వృద్ధులు వుండినారు. ఈ కిరాయి మూకలు రాత్రంతా తమ బీభత్సకాండను కొనసాగించి మరి కొంతమంది గ్రామస్తులను కాల్చి చంపారు, వారి ఇండ్లను లూటీ చేశారు, స్త్రీలపై లైంగిక దాడులకు పాల్పడ్డారు. గాయపడినవారికి సహాయం చేయబోయిన గ్రామీణులను 'మీకూ ఇదే గతి పడుతుంద'ని బెదిరించారు. అదే రోజు దగ్గరలోని సిమ్లిపెంట గ్రామంలో ఇవే ఫాసిస్టు ప్రభుత్వ బలగాలు మరో ఇద్దరు ఆదివాసీ గ్రామీణులను చంపడంతో చనిపోయిన ఆదివాసీ రైతాంగం సంఖ్య 19కి పెరిగింది.

సామ్రాజ్యవాదుల, ప్రత్యేకించి అమెరికా సామ్రాజ్యవాదుల సంపూర్ణ అండదండలతో, సహకారంతో భారత పాలకవర్గాలు 2009 మధ్య నుండి మొదలుపెట్టిన ఆపరేషన్ గ్రీన్‌హంట్ ప్రస్తుత రెండవ దశలో భాగంగా కిరాయి బలగాలు ఈ మారణకాండకు పాల్పడ్డాయి. పకడ్బందీ పథకం ప్రకారం జరిపిన ఈ నరమేధానికి బ్లూప్రింట్ సోనియా-మన్మోహన్-చిదంబరం-జైరాం రమేష్‌ల ఆధ్వర్యంలో, కేంద్రంలోనూ, ఛత్తీస్‌గఢ్‌లోనూ వారి 'నమ్మకస్తులైన లెఫ్టినెంట్లు' అయిన - హోంశాఖ కార్యదర్శి ఆర్.కె. సింగ్, సిఆర్‌పిఎఫ్ డిజి విజయ్ కుమార్-

రమన్ సింగ్-ననకీరాం కంవర్-లాంగ్‌కుమేర్-అనిల్ నవానీ-రాంనివాస్ మొదలైనవారి కనుసన్నల్లో తయారైంది. వీరంతా మావోయిస్టు ఉద్యమ ప్రాంతాల్లో ఈ దేశవ్యాప్త, బహుముఖ, విప్లవ ప్రతీఘాతుక భారీ సైనిక దాడిని అత్యంత దారుణంగా కొనసాగిస్తున్నవారే. సాధారణ గ్రామీణుల నరమేధం అనేది ఈ "ప్రజలపై యుద్ధం"లో అత్యంత సర్వసాధారణమైన అణచివేత చర్యల్లో ఒకటిగా మారిపోయింది. ఛత్తీస్‌గఢ్‌లో జూన్ నెలలో మావోయిస్టులపై ఒక భారీ దాడిని చేపడతామని రమన్ సింగ్, ననకీరాం కంవర్‌లు ఇచ్చిన ప్రకటనలు రాబోయే ముప్పుకు ముందస్తు హెచ్చరిక చేసినాయి. ఎందుకంటే "మావోయిస్టులపై దాడి" అంటేనే సామాన్యులు బూటకపు ఎన్‌కౌంటర్లు, లాకప్పు హత్యలు, నరమేధాల్లో ప్రాణాలు కోల్పోవడం అత్యంత సాధారణ దృశ్యంగా మారిపోతుంది అనేది ఇటువంటి దాడులను నిశితంగా పరిశీలించేవారందరికీ తెలిసిన విషయమే.

దండకారణ్యంలో జనవరి 2009 నాటి సింగారం నరమేధం మొదలుకొని వెచ్చాపాడ్, సింగన్‌మడుగు, పాలచెలిమ, గొంపాడ్, గుమియాపాల్, కోకవాడ, తాకిలోడ్, ఓంగ్‌నార్ మారణకాండలు, అలాగే తాడిమెట్ల-మోర్‌పల్లి-చింతల్‌నార్‌లో జరిగిన భారీ విధ్వంసం-హత్యలు దాకా కేంద్ర, రాష్ట్ర కిరాయి బలగాలు ఇప్పటివరకు ఆదివాసీలపై అనేక నరమేధాలకు పాల్పడినాయి. అయితే వీటికి పాల్పడినవారెవరికీ - అది ఈ యుద్ధానికి 'జనరల్స్' అయిన సోనియా, మన్మోహన్, చిదంబరం, రమన్ సింగ్, ననకీరాం కంవర్, విజయ్ కుమార్, లాంగ్‌కుమేర్ లేదా ఓ కల్లూరి వంటి వారు గానీ, ఘటనాస్థలంలోని పోలీసు-పారామిలటరీ అధికారులకు గానీ, వారి ఆదేశాలను పాటించే సాధారణ జవాన్లు గానీ - ఎవ్వరిపైనా కేసులు పెట్టిందీ లేదు, వారికి శిక్షలు పడిందీ లేదు. నేరస్తులందరూ న్యూఢిల్లీ, రాయ్‌పూర్‌లలోని అధికార కేంద్రాల్లో బోర విరుచుకుని తిరుగుతూనే ఉన్నారు. మధ్య భారతదేశంలో అచ్చోసిన ఆంబోతుల్లా పోలీసు-పారామిలటరీ బలగాలు రోజువారీగా తమ విధ్వంసకాండల్నీ, లూటీల్నీ, అరాచకాల్నీ, ఇండ్లను-ఆస్తుల్ని తగులబెట్టే కార్యక్రమాల్నీ, లైంగిక అత్యాచారాలను నిర్దాక్షిణ్యంగా కొనసాగిస్తూనే ఉన్నారు.

బాసగూడ నరమేధం పాలకవర్గాలు తాము చేసిన దారుణకాండను సమర్థించుకోవడానికి ఎంత అధోపాతాళానికి దిగజారగలవు, ఎన్ని అబద్ధాలు చెప్పి, వాస్తవాల్ని కప్పిపుచ్చి, తిమ్మిని బమ్మిని చేయగలవు అనేదానికి కూడా ఒక ఘోరమైన తార్కాణంగా వున్నది. మొదటగా వారు, వెయ్యిన్నొకటోసారి పాచిపళ్ల పాత పాటనే మళ్లీ పాడుతూ సాయుధ మావోయిస్టులు తమపై దాడి చేశారనీ, తాము ఎదురుకాల్పులు జరిపినప్పుడు ఈ 'మావోయిస్టులు' చనిపోయారనీ చెప్పారు. ఘటనాస్థలం నుండి ఆయుధాలు, పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్నామని కూడా బొంకారు. కాల్పులు జరిగాయనడానికి నిదర్శనంగా గాయపడిన ఆరుగురు జవాన్లను చూపించారు. 'ఇరవైమంది మావోయిస్టులు' చనిపోయారనగానే ఆనందం

పట్టలేక హిట్లర్ బంధుగణంలోని చిదంబరంగారు నిజాల్ని మాట్లాడే ఓ అరుదైన క్షణంలో ఇది సమాచారం పై ఆధారపడిన, 'పకడ్బందీ పథకం ప్రకారం జరిగిన దాడే' అని బైటపెట్టేశారు. అయితే ప్రతి ఒక్క వాస్తవమూ ఇది ఒక దారుణ మారణకాండ తప్ప మరొకటి కాదని ఘోషిస్తుండడంతో, ఆ గ్రామ ప్రజలు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలూ రోడ్ల మీదకు వచ్చి ప్రపంచానికంతా వాస్తవాల్ని చాటడంతో, ఛత్తీస్‌గఢ్‌లోని కాంగ్రెస్ పార్టీ కూడా దీనిపై ఎంక్వయిరీకి కమిటీని వేయక తప్పని స్థితిలో ఈ అపర భారత గొబెల్స్‌గారు తాను వాగిన చెత్తను వెనక్కి తీసుకోక తప్పలేదు. ఒక పక్క మొత్తం ఆ గ్రామ ప్రజానీకం, తన పార్టీ కూడా వాస్తవాల్ని బయటపెట్టినప్పటికీ, చిదంబరం సిగ్గులేకుండా, సమయానుకూలంగా రమన్ సింగ్ ప్రభుత్వంపైకి దోషం అంతా నెట్టేసి, దీనిపై ఎంక్వయిరీ అవసరమా లేదా తేల్చుకోవలసింది రాష్ట్ర ప్రభుత్వమేనంటూ, కేంద్ర ప్రభుత్వానికి దీనితో ఎటువంటి ప్రమేయం లేదంటూ చేతులు దులుపుకున్నాడు. తనని తానే ఖండించుకుంటూ ఒకవైపు ఇది 'పారదర్శకమైన, నిజాయితీతో కూడిన దాడి' అని చెప్తూనే మరోవైపు అమాయక ప్రజలు చనిపోయి వుంటే విచారిస్తున్నానని మొసలి కన్నీరు కార్చే సాహసం చేశాడు. తన తప్పుడు మాటల్ని ఏ బుర్ర వున్న మనిషి అయినా నమ్ముతాడా లేదా అనే సందేహం కూడా లేకుండా రమన్‌సింగ్ మావోయిస్టులు సామాన్య ప్రజల్ని మానవ కవచాలుగా ఉపయోగించుకున్నారనీ అందుకే వారు చనిపోయారనీ ప్రకటించాడు! యజమానికంటే ఎక్కువ విశ్వాసపాత్రమైన పెంపుడు కుక్కలా ననకీరాం కంవర్ అయితే ఏకంగా మావోయిస్టులతో ఎవరు వున్నా వారు మావోయిస్టులేనంటూ, 'మావోయిస్టులతో వున్నందుకు' గ్రామీణులు చనిపోతారు లేదా అందువల్ల వారు చనిపోదగ్గవారు అని ప్రకటించేశాడు.

నగ్నసత్యం ఏంటంటే అక్కడ గ్రామీణులతో ఏ మావోయిస్టులూ లేరు, అక్కడ ఎటువంటి ఎదురుకాల్పులూ జరగలేదు. కిరాయి బలగాలు గ్రామస్తుల్ని నలువైపుల నుండీ చుట్టుముట్టి వారిని కాల్చి చంపాయి, మరి కొందరిని వారి ఇండ్ల నుండి బైటకి లాగి కాల్చి పడేశాయి. జవాన్లకు అయ్యాయని చెప్తున్న గాయాలు కూడా గత కొన్ని సందర్భాల్లో జరిగినట్టు ఉత్త బూటకం అయినా అయి వుండాలి లేదా వారు తాము పరస్పరం జరుపుకున్న కాల్పుల్లో అయినా గాయపడి వుండాలి.

బస్తర్‌లో శిక్షణ పేరిట భారత సైన్యాన్ని దించిన, లాజిస్టికల్ సపోర్టు (యుద్ధరంగంలో సహాయకరంగా వుండడం) పేరిట, ఆత్మరక్షణ పేరిట వైమానిక దళాల దాడుల్ని ఆరంభించిన నేపథ్యంలో ఈ నరమేధం జరిగింది. జరగబోయే దారుణాలకు ఇది ఒక సంకేతం లాంటిది. అందుకని ఎవరూ కూడా దీన్ని యుద్ధరంగంలోని బలగాలు చేసిన పొరపాటుగా భావించే పొరపాటు అస్సలు చేయద్దు. ఈ దేశంలో ప్రజల పట్ల అక్కరగల ప్రజాస్వామికవాదులందరూ రోజురోజుకూ మరింతగా గుర్తిస్తున్నట్టుగా, మా పార్టీనే అనేకసార్లు ప్రకటించినట్టుగా ఈ

“ప్రజలపై యుద్ధం” అనేది మన దేశ అపార సహజ సంపదలను దోచుకునే ఏకైక లక్ష్యంతో, ఆ దోపిడీకి అడ్డంకిగా నిలిచే ఎటువంటి శక్తులనైనా అణచివేసే ఉద్దేశంతో కొనసాగుతోంది. సామ్రాజ్యవాదుల, భారత పాలకవర్గాల దృష్టిలో సిపిఐ (మావోయిస్టు) పార్టీ, దాని నాయకత్వంలోని ప్రజలూ మన దేశాన్ని దోచుకోవడానికి, ముఖ్యంగా ఆదివాసీ ప్రాంతాలను దోచుకోవడానికి సామ్రాజ్యవాదులకూ, మన దేశ దళారీ నిరంకుశ పెట్టుబడిదారులకూ, పెద్ద భూస్వాములకూ అతి పెద్ద ‘అడ్డంకి’గా (దోపిడీదార్ల ‘అంతర్గత భద్రత’కు అతి పెద్ద ముప్పు అని చదువుకోండి) కనిపిస్తున్నాయి. మా ఉద్యమ ప్రాంతాలపై భారీ మిలటరీ దాడి చేపట్టడానికి ఇదే కారణం. మావోయిస్టులను అణచివేయడం పేరుతో పాలకవర్గాలు దేశంలోని అన్ని రకాల ప్రజాస్వామిక, దేశభక్త శక్తులనూ అణగదొక్కుతున్నాయి. అందుకనే ఇది కేవలం మావోయిస్టులపై దాడి కాదనీ ఇది వాస్తవానికి “ప్రజలపై యుద్ధం” అని గుర్తించాలని మేం మరోసారి ప్రజలందరికీ విజ్ఞప్తి చేస్తున్నాం. బాసగూడ నరమేధానికి వెనుక వున్న వాస్తవం ఇదే.

పాలకవర్గాల దృష్టిలో దేశంలోని సామాన్య పౌరుల, ఆదివాసుల జీవితాలకు ఎటువంటి విలువా లేదనేది అనేక పోలీసు కాల్పుల ఘటనల్లో, ఇటువంటి నరమేధాల్లో వందలసార్లు రుజువైపోయింది. కొత్త విషయం ఏంటంటే వాళ్లిప్పుడు బహిరంగంగా ఆ విషయాన్ని ఇల్లెక్కి కూస్తున్నారు. మావోయిస్టులతో ఎవరు వున్నా వారు చనిపోవచ్చు అనీ, లేదా చనిపోదగినవారు అనీ వాళ్లు చెప్తున్న తలకిందులు తర్కాన్ని సంపూర్ణంగా ఎండగట్టాలి, ఖండించాలి. ఎందుకంటే ఇది ఈ దేశ పౌరుల ప్రాణాలకూ, ముఖ్యంగా ఆదివాసుల ప్రాణాలకూ ఎటువంటి రక్షణా వుండదనే ముసుగులు లేని బెదిరింపు తప్ప మరొకటి కాదు. పెద్దెత్తున డ్రోన్ దాడులకు చేసుకుంటున్న సన్నాహాలనూ, రేపు ఆ దాడుల్లో చనిపోబోయే ఆదివాసుల మరణాలనూ ఒక ఆఫ్ఘనిస్తాన్‌లో లాగానో, మరో పాకిస్తాన్‌లో లాగానో ‘కొల్లాటరల్ డామేజి’ (అనివార్యంగా జరిగే నష్టాలు) పేరుతో వారు సమర్థించుకుంటారు కూడా. ఇప్పటికే 2011 డిసెంబర్‌లో బస్తర్‌లోని పెద్ద కేడ్వాల్, చిన్న కేడ్వాల్ గ్రామాల్లో ప్రభుత్వ బలగాలు ఒక ఏరియల్ ఆపరేషన్‌ని జరిపి బలగాల మోహరింపు కోసం డజనుకు పైగా హెలికాప్టర్లను వినియోగించాయి. ఇటీవల దండకారణ్యం, బీహార్, ఝార్ఖండ్, ఛత్తీస్‌గఢ్-ఒడిశా సరిహద్దు, ఆంధ్రా-ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో బ్రిగేడ్ స్థాయి బలగాలతో చేసిన అన్ని భారీ మిలటరీ ఆపరేషన్లలో యుఎవి (మానవ రహిత విమానాలు) లను వినియోగించారు. రాబోయే కాలంలో మావోయిస్టు ప్రాంతాల్లో జరిగే దాడులన్నీ ఈ తరహాలోనే వుంటాయని వారు బహిరంగంగా ప్రకటించారు.

దేశంలోని పౌరులందరికీ, ప్రజాస్వామికవాదులకూ, ఆదివాసీ హితోభిలాషులకూ, అన్ని పౌరహక్కుల సంఘాలకూ బాసగూడ పాశవిక నరమేధాన్ని నిర్ద్వంద్వంగా ఖండించాలనీ, దానికి పాల్పడినవారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేయాలనీ విజ్ఞప్తి చేస్తున్నాం. బస్తర్

నుండి అన్ని పారామిలటరీ, మిలటరీ బలగాలనూ వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేయండి. మేం ప్రత్యేకించి మీడియావారికి ఈ నరమేధానికి సంబంధించిన వాస్తవాలని వెలికి తీసి వెలువరించాలని విజ్ఞప్తి చేస్తున్నాం. ఎందుకంటే కొందరు ప్రభుత్వ అనుకూల కార్పొరేట్ మీడియావారు వాస్తవాల్ని దాచడానికీ, 'ప్రభుత్వ బలగాలకూ, మావోయిస్టులకూ మధ్య నలిగిపోతున్న ప్రజల మరణాలు'గా ఈ నరమేధాన్ని చిత్రీకరించడానికీ ప్రయత్నిస్తున్నారు. పై డిమాండ్లతో దేశవ్యాప్తంగా ఒక విశాలమైన ఐక్య ఆందోళనను నిర్మించాల్సిందిగా మేం ప్రతి ఒక్కరికీ విజ్ఞప్తి చేస్తున్నాం. దేశంలోని, ప్రపంచంలోని విప్లవకర, ప్రజాస్వామిక శక్తులన్నిటికీ ఈ నరమేధాన్ని ఖండించాలనీ, భారతదేశంలో మావోయిస్టు ఉద్యమాన్ని అణచడానికి యుఎవిల మోహరింపును వ్యతిరేకించాలనీ, "ప్రజలపై యుద్ధం" అయిన ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను నిలిపివేయాలని డిమాండ్ చేయాలనీ విజ్ఞప్తి చేస్తున్నాం.

**అభయ్**

**అధికార ప్రతినిధి**

**కేంద్ర కమిటీ**

**సీపీఐ (మావోయిస్టు)**

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# కేంద్ర కమిటీ

**16-7-2012**

## సవ్యసాచి పండా పాలకవర్గాలతో గొంతు కలిపి మా పార్టీపై చేసిన విషపూరిత, నిరాధార, బూటకపు ఆరోపణలన్నింటినీ సిపిఐ (మావోయిస్టు) కేంద్రకమిటీ నిర్ద్వంద్వంగా తిరస్కరిస్తున్నది! విప్లవ విద్రోహానికై అతన్ని పార్టీ నుండి బహిష్కరిస్తున్నది!

మా ఒడిషా రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీ (ఎస్ఓసి) కార్యదర్శి సవ్యసాచి పండా మా పార్టీ ప్రధాన కార్యదర్శి పేరిట రాసిన 16 పేజీల ఉత్తరాన్ని 14-7-2012న మీడియాకు విడుదల చేశాడు. అందులో అతను పాలకవర్గాలతో గొంతు కలిపి సిపిఐ (మావోయిస్టు)పై, దాని నాయకత్వంలో నడిచే విప్లవోద్యమంపై విషం కక్కుతూ, అభూత కల్పనలతో అనేక నిరాధారమైన, తప్పుడు ఆరోపణలను చేశాడు. పార్టీనీ, విప్లవోద్యమాన్నీ విచ్ఛిన్నం చేసే దుష్ట తలంపుతో అతను ఈ ఉత్తరాన్ని విడుదల చేసి, మార్క్సిజం-లెనినిజం-మావోయిజం సిద్ధాంతాన్నీ, కార్మికవర్గ వాన్‌గార్డ్ పార్టీనీ విడిచిపెట్టాడు. పార్టీని విడిచిపెట్టాననీ, సంపూర్ణంగా ప్రజాయుద్ధ పంథాను-విప్లవాచరణను వదులుకున్నాననీ బహిరంగంగా ప్రకటించుకుని తన ఆధునిక రివిజనిస్టు రూపాన్ని బహిర్గతపరుచుకున్నాడు. అత్యంత గర్హనీయమైన, నీచమైన పద్ధతుల్లో కుట్రపూరితంగా అతను పార్టీకీ, విప్లవానికీ, పీడిత ప్రజల, ప్రత్యేకించి ఒడిషా పీడిత ప్రజల విముక్తితో ముడిపడిన మహత్తర ఆశయాలకూ ద్రోహం చేసి, తనను తాను రెనెగేడ్‌గా రుజువు చేసుకున్నాడు.

సవ్యసాచి పండా మొదట కొంతకాలం సిపిఎంలోనూ, తదుపరి సిపిఐ (ఎం.ఎల్.) (లిబరేషన్)లోనూ పని చేశాడు. అతను విప్లవోద్యమంచే ప్రభావితుడై మితవాద అవకాశవాద లిబరేషన్ పార్టీని వదిలి 1998లో సిపిఐ (ఎం.ఎల్.) (పార్టీ యూనిటీ)లో చేరాడు. పార్టీల ఐక్యత ద్వారా అతను మునుపటి సిపిఐ (ఎం.ఎల్) (పీపుల్స్‌వార్)లోనూ, తదుపరి సిపిఐ (మావోయిస్టు)లోనూ కొనసాగాడు. అతను 2003-05 మధ్యలో ఏవోబి ఎస్‌జెడ్‌సి సభ్యుడిగా, 2005 నుండి ఒడిషా రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీ సభ్యుడిగా, 2008 నుండి దాని కార్యదర్శిగా

పని చేశాడు. 15 ఏండ్ల కాలం అతను విప్లవ పార్టీలో పని చేసినప్పటికీ ఒక సిసలైన కార్మికవర్గ విప్లవకారుడిగా తనను తాను మలచుకోవడంలో విఫలమయ్యాడు. అతని విప్లవ వ్యతిరేక అవకాశవాద రాజకీయ అభిప్రాయాలనూ వైఖరులనూ, కార్యాచరణనూ అతని తోటి కామ్రేడ్స్, క్యాడర్, సిసి కామ్రేడ్స్ అనేకసార్లు విమర్శించారు. గత సంవత్సరం డిసెంబర్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి ప్రత్యేక ప్లీనంలో తనపై విమర్శలు వచ్చినప్పుడు కూడా అతను వాటిలో కొన్నింటిని మాత్రం నామమాత్రంగా ఆమోదించి, మరి కొన్నిటిని దాటవేశాడు. ఒక నిజమైన కార్మికవర్గ విప్లవకారుడిగా తన తప్పుల్ని నిజాయితీగా గుర్తించి వాటిని సరి చేసుకోవడానికి బదులుగా అతను విప్లవోద్యమాన్ని వదిలి పిరికిపందలా పారిపోయాడు.

తన 16 పేజీల ఉత్తరం నిండా అతను రాసినవన్నీ పచ్చి అబద్ధాలు, వక్రీకరణలు, వాస్తవాల్ని తిమ్మిని బమ్మిని చేసే కుయుక్తులే తప్ప వాటిలో ఇసుమంత కూడా వాస్తవం లేదు. ఇవన్నీ ఒడిషాలోని పార్టీనీ, విప్లవోద్యమాన్ని నీరుగార్చి, విచ్ఛిన్నం చేసి నాశనం చేయాలనే, మహత్తర విప్లవాశయానికి అంకితమైన, త్యాగనిరతిగల, నిస్వార్థపూరిత అనన్య త్యాగాలకు వెరవని పార్టీగా, దేశవిముక్తికి అంకితమైన పార్టీగా, పీడిత ప్రజలకు ఆశాజ్యోతిగా మా పార్టీకున్న ప్రతిష్టను దెబ్బ తీసి పాలకవర్గాలకు సేవ చేసే తన స్వార్థపూరిత రాజకీయాలను నేరవేర్చుకోవాలనే ఘోరమైన దురుద్దేశంతో రాసినవేననేది బహిరంగ రహస్యమే. విప్లవోద్యమంపై తాము చేసే దుష్ప్రచారానికి సాధికారత సాధించవచ్చుననే భ్రమతో పండాలాంటివారిని పాలకవర్గాలు ముందుకు తేవడం అనేది చరిత్రలో తరచుగా జరుగుతున్నదే. పండాలాంటి అవకాశవాదులను ముందుపెట్టి ఇలాంటి అభూతకల్పనలను విప్లవోద్యమం ఆరంభం నుండి ఎడతెరిపి లేకుండా కామ్రేడ్స్ చారు మజుందార్, కన్హయ్ చటర్జీ తదితర మా నాయకులు చాలామందిపై, పార్టీపై, విప్లవోద్యమంపై శత్రువు గుప్పిస్తూనే ఉన్నాడు.

పండా చేసిన ఆరోపణలలోకీ, వాటికి గల కారణాలలోకీ వెళ్లే ముందు మేం స్పష్టంగా చెప్పదల్చుకున్నదేమంటే మా పార్టీ ఎప్పటికప్పుడు తన కార్యాచరణను సరిదిద్దుకుని, మెరుగుపర్చుకుని మరింత ఉన్నత కర్తవ్యాలతో పురోగమించడానికి సమావేశాలు, ప్లీనాలు, కాన్ఫరెన్సులు నిర్వహిస్తుంది. తన తప్పులను గుర్తించి వాటిని విమర్శ-ఆత్మవిమర్శలు, సమీక్షలు, ప్రత్యేకంగా చేపట్టే దిద్దుబాటు క్యాంపెయిన్‌ల ద్వారా సరిదిద్దుకుంటుంది. ఇది నిరంతరంగా కొనసాగే ప్రక్రియ. ఈ విషయాలన్నీ తెలిసి కూడా పండా తన పదహారు పేజీల బూటకపు ఆరోపణలతో ప్రజల ముందుకు వచ్చాడంటే అతని దురుద్దేశాలు అర్థం

చేసుకోవచ్చు. అసలు విషయం ఏంటంటే యిలాంటి ప్రక్రియలో తనను తాను సరిదిద్దుకోడానికి సిద్ధపడకనే అతను పార్టీని వదిలిపెట్టడానికి నిశ్చయించుకున్నాడు.

పండాగారు చేసిన కుళ్లికంపు కొట్టే చెత్త ఆరోపణల జాబితా పెద్దదే గానీ వాటిలో ప్రముఖంగా ముందుకు తెచ్చిన కొన్ని ఆరోపణలు ఇలా ఉన్నాయి:

1. మావోయిస్టులకు మతిలేని హింస, అమాయక ప్రజలను చంపడం మామూలైపోయాయి అమాయక, నిరాయుధ పోలీసులను విచక్షణారహితంగా చంపాలని క్యాడర్‌కు ఆదేశాలిస్తున్నారు. 2. పార్టీలో తెలుగు, కోయ కామ్రేడ్స్ ఆధిపత్యం నడుస్తోంది 3. ఆదివాసులను మావోయిస్టులే అందరికంటే ఎక్కువ దోపిడీ చేస్తున్నారు, వారితో వంట చేయిస్తారు, బరువులు మోయిస్తారు  కార్యకర్తలను పండుగల సందర్భంగా కూడా కుటుంబాలను కలవనివ్వరు  ఆదివాసీ మహిళల్ని మావోయిస్టులు లైంగికంగా వేధిస్తున్నారు. 4. గణపతి బీభత్సంపై, భయంపై ఆధారపడిన ఒక నియంతృత్వాన్ని స్థాపించాలని చూస్తున్నాడు.

రాజ్యం తనకున్న సకల అస్త్రాలతోనూ తమ హక్కుల కొరకు పోరాడే ప్రజలపై అణచివేతకు పూనుకుంటుంది. ఇక ఆ పోరాటం ప్రజల విముక్తి కోసం, అంటే పీడిత ప్రజల రాజ్యాధికారం కోసం అయినప్పుడు రాజ్యం తీవ్రమైన అణచివేతకే పాల్పడుతుంది. దాని పోలీసు, పారామిలటరీ, మిలటరీలు ముందుండి ఆ దాడిని కొనసాగించగా, దాని ఇతర సకల అంగాలూ ఆ దాడిలో ఒక పథకం ప్రకారం సమన్వయంతో, అత్యంత క్రూరంగా, కుట్రపూరితంగా పాల్గొంటాయి. అందుకని ప్రజలకు ఈ హింసను ఎదిరించడానికి సాయుధ పోరాటం అత్యవసరమౌతుంది. మార్క్సిజం గురించి ఏ, బి, సి, డిలు తెల్సినవారెవరికైనా విప్లవ హింస గురించిన ఈ మౌలిక, ప్రాథమిక విషయం తెలిసే వుంటుంది. మితవాద అవకాశవాద సిపిఐ (ఎం.ఎల్.) లిబరేషన్ పార్టీని విడనాడి విప్లవ పార్టీ పంథాను ఆమోదించి పార్టీలో చేరి, ఐక్యతా కాంగ్రెస్ పంథాను ఆమోదించినప్పుడు పండాకు ఈ పార్టీ పంథా తెలవదనుకోలేం. అయితే పండా పార్టీ నుండి తనను తాను వేరుపరుచుకోవాలనుకున్నాడు కాబట్టి అవకాశవాదంతో మావోయిస్టులది మతిలేని హింస అనీ, అమాయక ప్రజలను చంపుతున్నారనీ విషం కక్కుతూ తను వీటన్నిటినీ వ్యతిరేకిస్తున్నట్టుగా చూపించుకోవడానికి తాపత్రయపడ్తూ, తద్వారా భారత రాజ్యం తన విషయంలో దయాపూరితమైన వైఖరిని తీసుకోవాలని ఆశిస్తున్నాడు.  ప్రజలను నానారకాలుగా హింసిస్తూ, వారి జీవితాలను సకల పార్శ్వాల్లో నాశనం చేస్తూ, హత్యలు చేస్తూ రాజ్య బీభత్స నిర్బంధకాండని కొనసాగిస్తున్న,

దానిలో పాలుపంచుకుంటున్న ప్రభుత్వ సాయుధ బలగాలు, అధికారులు, లక్ష్మణానంద, జగబంధులాంటి వర్గశత్రువులు అతనికి యిప్పుడు హఠాత్తుగా అమాయకులుగా కనిపిస్తున్నారు. పాలకవర్గాల పాదాల వద్ద మోకరిల్లడానికి అతను స్వామికి మించిన స్వామిభక్తిని ప్రదర్శిస్తూ అబద్ధపు కూతల్లో శత్రు దుష్ప్రచారాన్ని తలదన్నుతున్నాడు.

ఒడిషాలో తెలుగు, కోయ కామ్రేడ్స్ ఆధిపత్యం నడుస్తోంది అనే ఆరోపణ చేయడం ద్వారా పండా 'విభజించు, పాలించు' అనే బ్రిటిష్ వలసవాదుల, వారి అడుగుజాడల్లో నడుస్తున్న భారత పాలకవర్గాల అరిగిపోయిన, నీచమైన ఎత్తుగడనే తిరిగి అవలంబిస్తున్నాడు. దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథాననుసరించి సిపిఐ (మావోయిస్టు) వ్యూహాత్మక దృష్టితో ఒంటరి స్థలాల నుండి దేశవ్యాప్తంగా, చిన్నప్రాంతాల నుండి విశాల ప్రాంతాలకు విస్తరించడానికి చిన్న శక్తి నుండి బలమైన శక్తిగా ఎదుగుతూ అంతిమంగా దేశవ్యాపితంగా రాజ్యాధికారం స్వాధీనం చేసుకోవడానికి విప్లవోద్యమాన్ని నిర్మిస్తుంది. ఇందుకనుగుణంగా వ్యూహాత్మక దృష్టితో మొదటి నుండీ తన శక్తులను వివిధ ప్రాంతాలలో మోహరించి పని చేస్తుంది. స్థానికంగా ప్రజాపునాదిని పెంపొందించుకుంటూ పార్టీనీ, సైన్యాన్నీ అభివృద్ధి చేస్తూ ప్రాంతాలవారీగా అధికారాన్ని స్థాపిస్తుంది. ఈ పంథాలో సాగుతూ వ్యూహాత్మకంగా బలాబలాల్లో మార్పు తీసుకువస్తూ, అంతిమంగా పట్టణాలను చుట్టుముట్టి దేశవ్యాపితంగా రాజ్యాధికారం స్వాధీనం చేసుకుంటుంది. దీనిని దృష్టిలో పెట్టుకుని మా పార్టీలోని ప్రతి మెంబర్ దేశంలో ఎక్కడికైనా వెళ్లి పని చేయడానికి సిద్ధం కావల్సి ఉంటుంది. అంతేగాక అంతర్జాతీయవాదులైన కమ్యూనిస్టులు ప్రపంచంలోని ఏ దేశానికైనా-ప్రాంతానికైనా వెళ్లి అక్కడి ప్రజలతో భుజం భుజం కలిపి, వారి విముక్తికై పని చేయడానికి సిద్ధంగా వుండాలి. భారతదేశంలో విప్లవ చరిత్రను మొత్తంగా చూసినప్పుడు, తమ ప్రాంతాలనూ, రాష్ట్రాలనూ వదిలి ఇతర ప్రాంతాలకూ, రాష్ట్రాలకూ వెళ్లిన కామ్రేడ్స్ చేసిన దృఢమైన విప్లవ కృషి ఫలితంగానే విప్లవోద్యమం దేశంలోని వేర్వేరు ప్రాంతాలకు విస్తరించిందని తెలుస్తుంది. ఆ కామ్రేడ్స్ భాషల్ని నేర్చుకున్నారు, అక్కడి ప్రజల సంస్కృతిని గౌరవించారు, వారితో మమేకమయ్యారు. నూతన ప్రాంతాల్లో నిర్మితమైన ఉద్యమాలు ఇలాంటి కామ్రేడ్స్ సమిష్టిగా చేసిన కృషికి నిదర్శనంగా నిలుస్తున్నాయి. పండా ఈనాడే కాదు, తన సంకుచిత ప్రాంతీయవాద దృష్టివల్ల వేరే రాష్ట్రాల నుండి కామ్రేడ్స్ వచ్చి ఒడిషాలో పని చేయడాన్ని ఎన్నడూ జీర్ణించుకోలేకపోయాడు. ఆ కామ్రేడ్స్ నిస్వార్థాన్ని మెచ్చుకోవడానికి బదులుగా, అతను వారికీ, ఒడియా కామ్రేడ్స్‌కీ మధ్య విభేదాలు సృష్టించడానికి కుట్రపూరితంగా ముఠాకోరు పద్ధతుల్లో నిరంతరం ప్రయత్నించాడు. ఉ

ద్యమావసరాల రీత్యా ఇతర రాష్ట్రాల నుండి ఒడిషాలో పని చేయడానికి వచ్చిన కామ్రేడ్స్ విషయంలో అతను ప్రాంతీయ దురహంకారాన్ని ప్రదర్శిస్తూ పెత్తందారీతనంగా, అప్రజాస్వామికంగా, సెక్టేరియన్‌గా వ్యవహరించాడు. వాస్తవానికి ఒడియా ప్రజలూ, ఒడియా కామ్రేడ్స్ ఆంధ్రప్రదేశ్, ఝార్ఖండ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుండి కామ్రేడ్స్ తమ కోసం, తమతో కలిసి పని చేయడానికి వస్తున్నారనే విషయాన్ని సంతోషంగా ఆహ్వానించారు, ఆ వాస్తవాన్ని ఆమోదించారు. పండాతో వున్న కొద్దిమంది కామ్రేడ్స్ ప్రజాయుద్ధ పంథా గురించి పునరాలోచించి ఆయన చెప్తున్న అబద్ధాల్ని గ్రహిస్తారనీ, త్వరలోనే అతని కుట్రలను అర్థం చేసుకుని, అతన్ని ఎండగడ్తారనీ ఆశిస్తున్నాం.

విప్లవోద్యమంలో భాగంగా ఆదివాసీల విముక్తి లక్ష్యాన్నే వదిలిపెట్టేసిన పండా మావోయిస్టులచే 'ఆదివాసీల దోపిడీ' గురించి పాలకవర్గ నరహంతకుల్లా మా పార్టీపై ఆరోపణలు చేస్తూ మొసలి కన్నీరు కార్చడం అనేదాన్ని మించిన మోసం మరొకటుండదు. తాను పార్టీలో వున్నకాలంలో ఏనాడూ సమిష్టి శ్రమలో పాల్గొనని పండాగారి కళ్లకు పాలకవర్గాల కళ్లద్దాలు అమిరాక ఆదివాసీ కామ్రేడ్స్ స్వచ్ఛందంగా, అత్యున్నత విప్లవ చైతన్యంతో విప్లవం కోసం తమ శారీరక శక్తినంతటినీ వెలికితీస్తూ పాటుపడ్డం 'మావోయిస్టులు చేసే దోపిడీ'గా కనిపిస్తున్నది. ఇంతకీ మావోయిస్టులు ఎవరు? ఆదివాసులు ఎవరు? పార్టీలోని ఆదివాసీ కామ్రేడ్స్ మావోయిస్టులు కారా? విప్లవాన్ని వీడి పాలకవర్గాల వకాల్తా పుచ్చుకున్న అభినవ అవకాశవాది పండాకు విప్లవోద్యమ రోజువారీ జీవితంలో అవసరం అయ్యే వ్యక్తిగత శ్రమ, సమిష్టి జీవనంలో అవసరమయ్యే సైనిక, టెక్నికల్, ఉత్పత్తి-అభివృద్ధి, సంక్షేమ తదితర రంగాలలో అవసరమయ్యే శ్రమ, ప్రజా ఉద్యమంలో ప్రజలు చేసే వివిధ రకాల శ్రమ ఆదివాసీ ప్రజలను మావోయిస్టులు చేసే దోపిడీగా కనిపించడం మాకు ఆశ్చర్యం ఏమీ కలిగించలేదు. కార్మికవర్గ పార్టీలో ప్రతి ఒక్కరూ రోజువారీ జీవితంలో భాగంగా తమ, తమ పనులు చేసుకుంటారు. సమిష్టి శ్రమలో పాల్గొంటారు. బరువులూ మోస్తారు. అనారోగ్యంగా ఉన్నవాళ్లకూ, శారీరకంగా బలహీనంగా ఉన్నవారికీ, ప్రత్యేక పనులు ఉన్నవారికీ ఇతరులు సహాయం చేస్తారు. అసలు ప్రజాసైన్యం అంటేనే ప్రధానంగా అది యుద్ధం చేస్తూనే తనకవసరమైన వంట, బరువులు మోయడం లాంటి అనివార్యమైన పనులను తనకు తాను చేసుకుంటుంది. జాతి, లింగం, ప్రాంతం వగైరా ఎటువంటి భేదాలు లేకుండా ప్రతి ఒక్కరూ ప్రజాయుద్ధంలో పై పనులను చేయాల్సిందే, దేశంలోని వివిధ గెరిల్లాజోన్లలో అలాగే చేస్తూ వచ్చారు, చేస్తున్నారు కూడా. నిజానికి, మావోయిస్టు పార్టీది స్త్రీ పురుషుల మధ్యా, చదువుకున్నవారికీ చదువుకోనివారికీ

మధ్య, నాయకులకూ కార్యకర్తలకూ మధ్య తేడాల్ని చూపని ప్రజాస్వామిక, సోషలిస్టు సంస్కృతి. ఆదివాసులు మా పార్టీపట్ల పెద్దెత్తున ఆకర్షితులు కావడానికి ఇది ఒక ప్రధాన కారణం. మా పార్టీ ఇటువంటి సంస్కృతినే పెద్దెత్తున లక్షలాది ప్రజల్లోకి తీసుకెళుతున్నది.

పార్టీలోగల మహిళలపై/ఆదివాసీ మహిళలపై మావోయిస్టులు అత్యాచారాలను చేస్తున్నారనే, లైంగికంగా వేధిస్తున్నారనే ఆరోపణల్ని రాజ్యం పదే పదే చేస్తూనే ఉంది. విప్లవద్రోహిగా మారిన పండా పాలకవర్గాల్లాగానే అత్యంత నీచంగా కాకుండా మావోయిస్టులపై మరెలా దాడి చేస్తాడు? గతంలో మా పార్టీ అన్నిసార్లూ దానికి సమాధానంగా చెప్తూ వచ్చిన జవాబే నేడూ ఈ ఆరోపణకు జవాబు. అయితే ఆ ఆరోపణకు అత్యుత్తమంగా జవాబు యిచ్చింది, ఇస్తున్నది మాత్రం వందల సంఖ్యలో పార్టీలో చేరుతున్న మహిళా కామ్రేడ్స్, వేలాది-లక్షలాది విప్లవ మహిళా సంఘాల సభ్యులతోపాటు ఉద్యమ ప్రాంతాల మహిళలూ, నక్సల్బరీ నాటి నుండి **45** ఏండ్లుగా పీడిత ప్రజల ముక్తి కోసం తమ ప్రాణాల్ని అర్పించిన వందలాది మహిళా అమరులే.

**1925**లో భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీ ఏర్పడినప్పటి నుండి ఇప్పటివరకు చూసుకుంటే, **90** ఏండ్లకు పైబడిన భారత కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలో ప్రజలతో, వారి సంస్కృతితో, ప్రజాజీవనానికి సంబంధించిన అన్ని పార్శ్వాలతో కమ్యూనిస్టు పార్టీ యింతగా మమేకం అయినది గత పాతికేళ్లుగానే అంటే అతిశయోక్తి కాదు. మా పార్టీ మమేకం అవ్వడమే కాదు ప్రజా జీవనంలోని రాజకీయ, సాంస్కృతిక పార్శ్వాలలోని ప్రగతిశీల అంశాలన్నిటినీ ఎత్తిపట్టి, వాటిని తనలో లీనం చేసుకుని, వాటిని మరింత అభివృద్ధి చేసి విప్లవకరంగా మారుస్తున్నది. కార్యకర్తలు పండుగలకు ఇండ్లకు పోతామంటే పార్టీ వెళ్లనివ్వడం లేదని రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించిన పండాగారు ఆరోపణ చేయడాన్ని విప్లవ ప్రజానీకం ఎలాగూ నమ్మరు గానీ విప్లవోద్యమ వాస్తవాలతో అంతగా పరిచయం లేనివారికి విప్లవ పార్టీ ఇంత ఘోరంగా వుంటుందా అనే భావం కలిగించడానికి అవకాశవాదంతో చేసిన దాడికి ఇది మరొక నిదర్శనం మాత్రమే.

గణపతి బీభత్సంపై, భయంపై ఆధారపడిన నియంతృత్వాన్ని స్థాపించాలనుకుంటున్నారు అనే ఆరోపణ ఎంత హాస్యాస్పదమైనదంట నిజానికి దానికి వివరణ కూడా అవసరం లేదు. సిపిఐ (మావోయిస్టు) ఒక బూర్జువా పార్టీలాంటిది కానే కాదు. అది దేశంలోని నేటి అర్ధ వలస, అర్ధ భూస్వామ్య రాజ్యాన్ని విప్లవ హింస ద్వారా ధ్వంసం చేసి, నూతన ప్రజాస్వామిక

విప్లవ అధికారాన్ని, అంటే కార్మికవర్గ నాయకత్వాన, కార్మిక-కర్షక సమైక్యత పునాదిపై ఆధారపడిన నాలుగు వర్గాల - కార్మిక, కర్షక, పెటీబూర్జువా, జాతీయ బూర్జువా వర్గాల - ప్రజాస్వామిక నియంతృత్వాన్ని స్థాపించడాన్ని తక్షణ లక్ష్యంగా, తర్వాత సోషలిజం, కమ్యూనిజం స్థాపనను అంతిమ లక్ష్యంగా నిర్ణయించుకుంది. ఈ విషయం పండాగారికి తెలియందేమీ కాదు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యం ముసుగులో దేశంలో కనీవినీ ఎరుగని నిరంకుశ పాలనను చెలాయిస్తున్న, సామ్రాజ్యవాదులతో మిలాఖతు అయిన దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వర్గాల నియంతృత్వ వ్యవస్థతో రాజీపడి అందులో స్థానం సంపాదించుకునే స్వార్థపూరిత ఉద్దేశంతోనే పండా కామ్రేడ్ గణపతిపై, మా పార్టీపై తప్పుడు ఆరోపణను చేస్తున్నాడు.

వాస్తవానికి, పండానే ఒడిషాలో తన నియంతృత్వాన్ని స్థాపించాలని ప్రయత్నిస్తున్నాడు. రాష్ట్ర ప్రత్యేక ప్లీనంలో చేసిన సమీక్షలను, నిర్ణయాలను చూసిన అతను పార్టీ క్యాడర్ ఇకనెంతమాత్రం తన పెత్తనాన్ని అంగీకరించడానికి సిద్ధంగా లేరనే విషయాన్ని గ్రహించాడు. వారు అతని పెత్తందారీ వ్యవహారాన్నీ, ఇతర రాష్ట్రాల కామ్రేడ్స్ పట్ల అతని అప్రజాస్వామిక, సెక్టేరియన్ వైఖరినీ విమర్శించారు. తన పెత్తందారీ పద్ధతుల్ని ఇకనెంతమాత్రం కొనసాగించడం వీలుకాదని గుర్తించిన ఈ అవకాశవాది పార్టీని విడిచిపెట్టాలని నిర్ణయించుకుని అప్పటి నుండి అందుకవసరమైన సన్నాహాల్ని రెట్టించాడు.

నిజానికి, రాష్ట్ర స్థాయి ప్రత్యేక ప్లీనం ముగిశాక అతను ఒడిషా రాష్ట్ర ఇన్‌ఛార్జి సిసి కామ్రేడ్‌ను కాంటాక్టు చేయడమే మానివేశాడు. అప్పటి నుండి, దాదాపు అర్ధ సంవత్సరంపాటు అతను తన ప్రకటనల్లో, ఇంటర్వ్యూల్లో పార్టీపై విషాన్ని కక్కుతూ వచ్చాడు. అది పార్టీలో రాజకీయ, నిర్మాణపరమైన సమస్యల్ని సృష్టించి, ఒడిషా ఉద్యమానికి తీవ్ర నష్టాన్ని కలిగించింది. ఎందుకంటే అతను వాటిలో స్పెషల్ ప్లీనం నిర్ణయాలకు, పార్టీ పంథాకూ, విధానాలకూ వ్యతిరేకమైన వైఖరులను తీసుకుంటుండినాడు. తన నాయకత్వంలో ఇటలీ పర్యాటకులను బందీగా పట్టుకున్న సందర్భంలో అతను పచ్చి అవకాశవాద పద్ధతులకు పాల్పడ్డాడు. అతను మొత్తం ఒడిషా రాష్ట్రానికంతా ఏకపక్షంగా కాల్పుల విరమణ ప్రకటించాడు. కానీ నిజానికి ఒడిషా-దాని సరిహద్దులలోని గణనీయమైన ప్రాంతాల్లో రెండు రాష్ట్ర సరిహద్దు పార్టీ కమిటీలు పని చేస్తున్నప్పుడు అతను అలా ప్రకటించడం సరైందీ కాదు, అలా మిగతా రెండు కమిటీలకూ ఆదేశాలిచ్చే అధికారమూ అతనికి లేదు. తాను ఏకపక్ష కాల్పుల విరమణ

ప్రకటించాక ఏఓబి కామ్రేడ్స్ ఒక ఎంఎల్ఏని బందీగా పట్టుకున్న, ఒక ఎస్ఐని చంపిన సందర్భంగా అతను ఏఓబి కామ్రేడ్స్‌ను బహిరంగంగా విమర్శించడమే కాక వారికి చంపడం ఫ్యాషన్ అయిపోయింది అనేంతదాకా వెళ్లాడు.

ఒడిషా ఎస్ఓసి పరిధిలోని మొత్తం పార్టీ చేసిన సమీక్షల్ని పక్కకు బెట్టి, వర్గశత్రువులైన లక్ష్మణానంద, జగబంధుల్ని ఖతం చేయడం తప్పు అని ప్రకటించేశాడు. శత్రువుతో చేయి కలిపి కామ్రేడ్ నిఖిల్ పేరిట ప్రకటనలు ఇస్తూ వేర్వేరు సముదాయాల నుండీ, వేర్వేరు రాష్ట్రాల నుండీ వచ్చి పని చేస్తున్న కామ్రేడ్స్ మధ్య విభేదాల్ని సృష్టించే ప్రయత్నం చేస్తూ ఒక విషపూరిత క్యాంపెయిన్‌ను మొదలుపెట్టాడు. పండా పార్టీని వీడి వెళిపోతాడనీ, కొత్త గ్రూపును ఏర్పరుస్తాడనీ మీడియాలో వరుసగా కథనాలు వెలువడుతుంటే నిరంతరం మీడియా సంబంధంలో వుండే పండా ఎటువంటి వివరణ ఇవ్వకపోవడం అనేది యాదృచ్ఛికంగా జరిగినది కాదు. అతను ప్రత్యేక ప్లీనం తర్వాత నుండే పార్టీని వదిలిపోవడానికి పథకరచన చేస్తూ, అవకాశవాద పద్ధతులకూ, విచ్ఛిన్నకర కార్యకలాపాలకూ బాహాటంగా పాల్పడ్డాడనేది స్పష్టాతిస్పష్టం. తన దిగజారుడుతనానికి పరాకాష్టగా అతను చివరికి పార్టీని వదిలిపోయాడు.

ఒడిషా ఉద్యమ క్రమంలో ముందుకు వచ్చిన కొన్ని రాజకీయ సమస్యలపై పండా మితవాద అవకాశవాద వైఖరిని తీసుకుని చివరికి దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథాని తిరస్కరించే రివిజనిస్టు స్థాయికి దిగజారాడు. అతని సెక్టేరియన్, బ్యూరాక్రటిక్, అతిప్రజాస్వామ్య, క్రమశిక్షణారాహిత్య, ముఠాతత్వ, నిర్మాణరాహిత్య, కెరీరిస్టు, కీర్తికండూతి ధోరణులు ఒడిషా పార్టీకీ, ఉద్యమానికీ చాలా తీవ్రంగా నష్టం కలిగించాయి. అతను సుఖమైన జీవితాన్ని కోరుకునేవాడు, అతనిలో కష్టపడేతత్వం కూడా ఉండేది కాదు. సంఘటితక్రమంలో వున్న ఒడిషా రాష్ట్ర పార్టీకీ, రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీకీ తీవ్ర నష్టాలు కలిగిన పరిస్థితినీ, సిసిపై శత్రుదాడి కేంద్రీకృతమై తీవ్ర నష్టాలు కలిగిన పరిస్థితినీ ఈ అవకాశవాది రాష్ట్రంలో విచ్ఛిన్నకర కార్యకలాపాలు కొనసాగించడానికి వినియోగించుకున్నాడు. వీటన్నింటికి మూలం వ్యక్తిని కేంద్రంగా నిలిపే అతని శృతి మించిన వ్యక్తివాదంలో ఉంది. వీటితో పాటు విప్లవోద్యమంపై సామ్రాజ్యవాదుల, ప్రత్యేకించి అమెరికా సామ్రాజ్యవాదుల పూర్తి మద్దతుతో భారత పాలకవర్గాలు కొనసాగిస్తూ వచ్చిన విప్లవ ప్రతీఘాతుక యుద్ధంలో 2009 మధ్య నుండి ఆపరేషన్ గ్రీన్‌హంట్ పేరిట గణనీయమైన మార్పు వచ్చింది. అప్పటి నుండి మా ఉద్యమంపై దేశవ్యాప్త, బహుముఖ, భారీ సైనికదాడి కొనసాగుతున్న నేపథ్యంలోనే పండా

దిగజారుడుతనాన్నీ, విద్రోహాన్నీ చూడాల్సి ఉంటుంది. ఈ దాడిలో పార్టీకి దేశవ్యాప్తంగా తీవ్రమైన నష్టాలు జరిగాయి. ఒడిషాలో వర్గపోరాటం ఇప్పటికీ బలహీనంగానే వున్నప్పటికీ అది కూడా ఈ దాడికి తీవ్రంగానే గురయ్యింది. 2010 చివరి నుండి అది తీవ్రమైన నష్టాల్ని చవిచూసింది. ఈ దాడి యింకా తీవ్రతరం కానుంది. మన దేశంలాంటి వెనుకబడిన దేశాల సహజ సంపదలనూ-ముడి వనరుల్నీ దోచుకోవడానికి తమకు అడ్డం వచ్చే ప్రతి సంస్థనూ, ప్రజలనూ అణచివేయడానికి ప్రధాన కారణం బహుళజాతి, దేశ దళారీ కార్పొరేట్ ప్రయోజనాలే. ప్రపంచ ఆర్థిక వ్యవస్థని చుట్టుముట్టిన ఆర్థిక సంక్షోభం ఎంత తీవ్రతరమైతే దాని నుండి బయటపడ్డానికి విప్లవ పార్టీపై, దాని నాయకత్వంపై, పీడిత తాడిత ప్రజలపై కొనసాగించే దాడిని వారు అంతగా తీవ్రతరం చేస్తారు. విప్లవ పార్టీ నాయకులెవరికైనా గానీ ఇటువంటి నేపథ్యంలో విప్లవోద్యమాన్ని నడపడం అంటే కత్తి మీద సామే. నిజమైన పార్టీ నాయకులెవరైనా దేశంలోనూ, ప్రపంచంలోనూ నెలకొన్న అద్భుతమైన విప్లవ పరిస్థితులను ఉపయోగించుకుని ప్రజలను రాజకీయంగా సంసిద్ధం చేస్తూ, ప్రజాయుద్ధాన్ని అభివృద్ధి చేయడానికి, విప్లవానికి అనుకూలంగా మలచడానికి కృషి చేస్తారు. అందుకు విప్లవ సిద్ధాంతం పట్ల నిబద్ధత, గట్టి పట్టుదల, సాహసోపేతంగా నిర్ణయాలు తీసుకోవడం, పార్టీనీ, ప్రజాసైన్యాన్నీ, ప్రజలనూ ఏకతాటిపై కదిలించడం, త్యాగనిరతి అవసరమౌతాయి. విప్లవ అవసరాలకూ, కర్తవ్యాలకూ అనుగుణంగా తనను తాను మలుచుకోవడానికీ, పార్టీని మలచడానికీ ఉక్కులాంటి సంకల్పం అవసరమౌతుంది. ఇటువంటి లక్షణాలు ప్రదర్శించలేనివారు విప్లవానికి నాయకత్వాన్ని అందించడంలో విఫలమౌతారు లేదా అశక్తులవుతారు. అలాంటివారిలో కొందరు యుద్ధరంగం నుండి పిరికిపందల్లాగ పారిపోతారు లేదా శత్రుపంచన చేరిపోతారు. దీన్ని కప్పిపుచ్చుకోవడానికి ఈ అవకాశవాదులు, విప్లవ ద్రోహులు పాలకవర్గాల కొమ్ము కాస్తూ పార్టీపై, నాయకత్వంపై అన్ని రకాల ఆరోపణలను చేస్తారు. మా పార్టీ చరిత్రలోనే కాకుండా వివిధ దేశాల విప్లవాల్లో గతంలోనూ ఇటువంటి రెనెగేడ్లు వుండినారు, పండా అలాంటివారిలో చివరివాడూ కాదు.

పై విషయాలన్నిటినీ దృష్టిలో వుంచుకుని, అతనిపై వచ్చిన ఆరోపణలన్నిటినీ రాజకీయపరంగా అతని ముందు ఉంచి, అతనికి తన తప్పుల నుండి బయటపడ్డానికి అవకాశం ఇస్తూ అతన్ని సరిజేసేందుకు మా కేంద్రకమిటీ ప్రత్యేక కృషినారంభించింది. కానీ రాష్ట్ర ప్రత్యేక ప్లీనం తర్వాత నుండి అతను సంబంధిత సిసి కామ్రేడ్‌తో సంబంధాలు తెంచుకొని వరుసగా పార్టీపై, ఉద్యమంపై, నాయకత్వంపై బాహాటంగా దాడి చేస్తూ వచ్చాడు.

వీటన్నిటి పరాకాష్టగా అతను ఈ విషపూరితమైన లేఖను మీడియాకు విడుదల చేయడం ద్వారా తనను తాను రెనెగేడ్‌గా రుజువు చేసుకున్నాడు. అందువల్ల మా కేంద్రకమిటీ సవ్యసాచి పండాను పార్టీ నుండి బహిష్కరిస్తూ, ఆ విషయాన్ని ఒడిషాలోని మా పార్టీ కామ్రేడ్స్ అందరికీ, విప్లవ ప్రజానీకానికంతటికీ, దేశంలోని మొత్తం విప్లవ క్యాంపుకూ తెలియజేస్తోంది.

పండా మా పార్టీ, ఉద్యమం, నాయకత్వం పట్ల తీసుకున్న శత్రుపూరిత అవకాశవాద వైఖరిని, పాలకవర్గ అనుకూల, ప్రజావ్యతిరేక వైఖరులను ఖండించాలనీ, అతన్నీ, కుళ్లికంపు కొట్టే అతని ఆధునిక రివిజనిస్టు రాజకీయాలనూ, అతను చేసిన ఆరోపణలనూ తిరస్కరించాలని ఒడిషా కామ్రేడ్స్‌కూ, ప్రజాసంఘాలకూ, విప్లవ-ప్రజాస్వామిక ప్రజానీకానికీ మేం విజ్ఞప్తి చేస్తున్నాం. సాటిలేని విప్లవ మొనగాళ్లుగా తమను తామే చాటుకునే, పాలకవర్గాలచే అలా ఫోకస్ చేయబడే ఇటువంటి రెనెగేడ్లు చరిత్ర పెంటకుప్పల మీదకు విసిరివేయబడతారనీ, నిజమైన విప్లవ పార్టీ, దాని నాయకులూ, దాని నాయకత్వంలోని విప్లవ ప్రజానీకమూ అసమాన ధైర్యసాహసాలతో పెనుతుఫానుల మధ్యనుండే అంతిమ విజయంకేసి అప్రతిహతంగా పురోగమిస్తారనీ చరిత్ర అనేకసార్లు రుజువు చేసింది. పండాలాంటి కుహనా విప్లవకారులు కాదు, ప్రజలే చరిత్ర నిర్మాతలు. ఒడిషా పేరు చెప్పుకుని పబ్బం గడుపుకుంటూ పాలకవర్గాల పాదసేవలో తనివితీరా మునిగిపోయే పండాలాంటి ద్రోహుల్ని ఒడిషా విప్లవ ప్రజానీకం తప్పకుండా తిరస్కరిస్తారనీ, సిపిఐ (మావోయిస్టు) నాయకత్వంలో ఒడిషా కామ్రేడ్స్, అశేష పీడిత ప్రజానీకం విప్లవ మార్గంలో పయనిస్తారనీ మా పార్టీ సంపూర్ణ విశ్వాసంతో ఉన్నది.

**ఆనంద్**

**పొలిట్‌బ్యూరో సభ్యుడు, మధ్య రీజనల్ బ్యూరో కార్యదర్శి**

**కేంద్ర కమిటీ తరపున,**

**సీపీఐ (మావోయిస్టు)**

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# సెంట్రల్ రీజినల్ బ్యూరో

**19-7-2012**

## పీడిత ప్రజల పక్షపాతి, అవిశ్రాంత పోరాటకారుడు
## కామ్రేడ్ బిఎస్ఎ సత్యనారాయణకు అరుణారుణ జోహార్లు!

సుదీర్ఘ కాలం పీడిత ప్రజల పక్షాన నిలిచి పోరాడుతూ, ఆంధ్రప్రదేశ్ ప్రజా వుద్యమ చరిత్రలో ప్రత్యేక స్థానం పొందిన కామ్రేడ్ బిఎస్ఎ సత్యనారాయణ (72) జూన్ 22న గుండెపోటుతో మరణించారు. సిపిఐ (మావోయిస్టు) సభ్యుడిగా ఎల్లవేళలా ఎర్రజెండాను సమున్నతంగా ఎత్తిపట్టిన కామ్రేడ్ బీఎస్ఏకు మా పార్టీ, పిఎల్జిఏ, ప్రజాసంఘాలు తలవంచి వినమ్రంగా విప్లవ జోహార్లు అర్పిస్తున్నాయి. ఆయన ఆశయ సాధనలో పోరాటాన్ని ముందుకు తీసుకుపోవడానికి ప్రతిజ్ఞ చేస్తున్నాయి. ఆయన బంధు మిత్రులకు ప్రగాఢ సానుభూతిని తెలుపుతున్నాయి.

బిఎస్ఎగా సుప్రసిద్ధుడైన బొమ్మకంటి శ్రీ ఆంజనేయ సత్యనారాయణ పశ్చిమ గోదావరి జిల్లా అత్తిలిలో కమ్యూనిస్టు కుటుంబంలో 1940లో పుట్టారు. అప్పటి పోస్టల్ అండ్ టెలిగ్రాఫ్ శాఖలో రైల్వే మెయిల్ సార్టింగ్ వుద్యోగిగా చేరి 1950ల చివరిలో హైదరాబాద్‌కు వెళ్లారు. నక్సల్బరీ పోరాట ప్రభావంతో ఆయన పి అండ్ టి కార్మికోద్యమ నేత అయ్యారు. తన సహచరులు అమరుడు కామ్రేడ్ యు. శ్రీనివాసులు, ప్రస్తుతం జైలు ఖైదును అనుభవిస్తున్న కామ్రేడ్ ఎల్ఎస్ఎన్ మూర్తిలతో పాటు ఆయన కార్మిక, ఉద్యోగ రంగాల్లో అనేక పోరాటాలకు నాయకత్వం వహించారు. హైదరాబాద్ పబ్లిక్ సెక్టార్ పరిశ్రమలు, కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలే కాక కర్నూలు, ఆదోని వంటి పట్టణాల్లోనూ కార్మికరంగంలో విప్లవ రాజకీయాలను ఎత్తిపట్టారు. రాష్ట్రమంతటికీ మేడే సభల్లో వక్తగా వెళ్లేవారు. 1974లో జరిగిన రైల్వే సమ్మెలోనూ, 80 దశకంలో జరిగిన, దేశంలోనే అతి పెద్ద సమ్మెగా ప్రసిద్ధి చెందిన పి అండ్ టి సమ్మెలోనూ ఆయన చురుకైన పాత్ర వహించారు.

కార్మికరంగంలో పనిచేస్తూనే 1970 నుండి 75 వరకు హైదరాబాద్‌లో విద్యార్థి, యువజన, రచయితల సంఘాలకు సంబంధించిన ఏ సభలు జరిగినా ఆ నిర్వహణలో ఆయన తప్పకుండా చురుకైన పాత్ర వహించేవారు. నక్సల్బరీ, శ్రీకాకుళ వుద్యమాలు దెబ్బతిన్న తర్వాత వుద్యమాన్ని పునరుద్ధరింప చేయడానికి జరిగిన కృషిలో ఆయన భాగస్వామి అయ్యారు.

ఎమెర్జెన్సీ సమయంలో ఆయనను పోలీసులు అరెస్ట్ చేసి చిత్రహింసలు పెట్టారు. రెండు నెలల జైలు శిక్ష అనంతరం ఆయన విడుదలయ్యారు. అయితే అప్పటికే ఆయన నిర్వహిస్తున్న పోరాటాల పట్ల కక్షసాధింపుతో వున్న యాజమాన్యం, అరెస్టును సాకుగా తీసుకొని ఆయనను ఉద్యోగం నుండి సస్పెండ్ చేసింది. అరెస్టులు, చిత్రహింసలు, యాజమాన్య వేధింపుల కారణంగా విప్లవ స్ఫూర్తి ఏమాత్రం దెబ్బతినని ఆయన మార్క్సిస్టు బోధకుడిగా రాష్ట్రమంతా తిరుగుతూ పార్టీ, సంఘ కార్యకర్తలకు రాజకీయ తరగతుల ద్వారా విద్యగరపడంలో చురుకైన పాత్ర పోషించారు. ఆయన మార్క్సిస్టు తత్వశాస్త్రం, కార్మికోద్యమ చరిత్రలను బోధించేవారు. ఆ సమయంలో **1984**లో విజయవాడలో పార్టీ కార్యకర్తలకు రాజకీయ తరగతులు బోధిస్తుండగా పోలీసులు దాడి చేసి అందరితో పాటు ఆయనను కూడా అరెస్ట్ చేసి, కుట్రకేసు మోపి జైల్లో పెట్టారు. విడుదలైన తర్వాత ఆయన పూర్తికాలం మార్క్సిస్టు బోధకుడిగానే గాక కార్మిక పథం వంటి విప్లవ పత్రికల నిర్వహణలో భాగమయ్యారు.

**1990**లో ఆయన పోస్టల్ శాఖలో వుద్యోగంలో చేరారు. అదే సమయంలో లా చదివి న్యాయవాదిగా మారారు. న్యాయవాదిగా రాజకీయ ఖైదీల హక్కుల కోసం పోరాడారు. పౌర హక్కుల రంగంలో విశేషంగా కృషి చేస్తూ, గ్రామాలకు సైతం వెళ్లి న్యాయ సహాయం అందించేవారు. రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు, రాజశేఖర్ రెడ్డిల పాలనా కాలాల్లో పోలీసు నిర్బంధం, ప్రైవేటు హంతక ముఠాల హింసాకాండ మధ్య విప్లవకారులకు, ప్రజలకు న్యాయ సహాయం అందించిన అతి కొద్దిమంది న్యాయవాదులలో ఆయన ఒకరు. జుడీషియల్ కస్టడీ నుండి పోలీసు కస్టడీకి అప్పగించిన నిందితులను న్యాయవాదుల సమక్షంలోనే విచారించాలనే నిబంధనను ఎన్నడూ పాటించని పోలీసుల మెడలు వంచి కొందరు విప్లవకారుల విచారణలో ఆ నిబంధనను అమలు చేయించారు. తన జీవితంలోని చివరి మూడు రోజుల్లో కూడా పార్టీలో అత్యంత సీనియర్ మహిళా కామ్రేడ్ అయిన సీతక్క, ఆమెతో పాటు అరెస్టు అయిన కామ్రేడ్స్‌తోపాటు ఇటువంటి  పోలీసు విచారణ సమయంలో వుండి వారిని పోలీసుల అకృత్యాలకు బలి కాకుండా చూశారు. అట్లా పోలీసుల చిత్రహింసల నుండి ఎందరో ఖైదీలను కాపాడారు. తన వృత్తిలో భాగంగా జడ్జిలతోనూ, పబ్లిక్ ప్రాసిక్యూటర్లతోనూ నిక్కచ్చిగా వ్యవహరించేవారు. కోర్టు ధిక్కరణకు కూడా పాల్పడ్డారు.

మరో వైపు కార్మికోద్యమ పత్రిక 'శ్రమజీవి'ని  ప్రారంభించారు. కార్మికోద్యమ నేతగా, న్యాయవాదిగా ఆయనకున్న అనుభవం నుండి ఆ పత్రికను కార్మికోద్యమ కరదీపికగా తీర్చిదిద్దారు. ఆ పత్రికలో ఎన్నో విలువైన వ్యాసాలు రాశారు.

గత కొద్ది కాలంగా ఆయన రాజకీయ ఖైదీల విడుదల కమిటీ (సీఆర్‌పీపీ)కి ఆంధ్రప్రదేశ్‌లో ఉపాధ్యక్షుడిగా చురుకైన పాత్ర వహిస్తున్నారు. తన అనారోగ్య సమస్యలను లెక్క చేయకుండా రాజకీయ ఖైదీల విడుదల కొరకు ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, కర్నాటక

రాష్ట్రాల జైళ్లలో వున్న రాజకీయ ఖైదీలను కలిసి మనోధైర్యాన్ని అందించారు. వాళ్ల కేసులు త్వరగా పరిష్కారం అయ్యేలా ప్రయత్నించారు.

సుదీర్ఘ కాలం ప్రజల పక్షాన దృఢంగా నిలబడి, ప్రజా సంఘాల్లో చురుకైన పాత్ర వహిస్తున్న కామ్రేడ్ బీఎస్ఏ మంచి అధ్యయనశీలి, వక్త. ఉద్యోగంలో సస్పెన్షన్లు, కోర్టు ధిక్కరణ నేరాల పేరిట వేధింపులు. ఆర్థిక ఒడిదుడుకులు, అనారోగ్యాలు... వంటివేవీ ఆయన రాజకీయ నిబద్ధతను మాసిపోనీయలేదు. ఆయన వ్యక్తిగత జీవితంలో ఎన్నో విలువలు, ఆదర్శాలను పాటించారు. తినడానికి సరైన తిండి లేని పరిస్థితుల్లో కూడా ఆయన ఎన్నడూ విలువల విషయంలో, విప్లవ రాజకీయాల విషయంలో రాజీపడలేదు. ఆస్తులు, సౌకర్యాల కోసం తాపత్రయపడకుండా అత్యంత నిరాడంబరమైన జీవనశైలిని అనుసరించారు. ఆయన నిరాడంబరత అన్ని రకాల ప్రజా సంఘాల కార్యకర్తలకు, పార్టీ కార్యకర్తలకూ ఆదర్శంగా నిలిచిపోతుంది. కామ్రేడ్ బిఎస్ఎ వంటి 70ల నాటి విప్లవ కార్మిక నాయకులు, పార్ట్‌టైం పార్టీ సభ్యులైన కార్మికులు కొందరు వారంలో మూడు రోజులు పగలూ, రాత్రి ఓవర్‌టైం చేస్తూ, మిగిలిన మూడు రోజులు, శెలవు రోజులు అన్నిటినీ పార్టీ పని కోసమే వినియోగిస్తూ తమ శ్రమనూ, శక్తినీ, మేధస్సునూ ప్రజల సేవకు అంకితం చేస్తూ నెలకొల్పిన కమ్యూనిస్టు ఆదర్శం పార్టీ సభ్యులందరికీ అనుసరణీయమైన నమూనా.

ప్రస్తుతం భారత ప్రభుత్వం ప్రజలపై యుద్ధం ఎక్కుపెట్టి కొనసాగిస్తున్న పరిస్థితుల్లో, ప్రజల పక్షాన దృఢంగా నిలబడేడిన ఈ ఆదర్శవంతమైన ప్రజా నాయకుడి రాజీలేని, నిబద్ధత కలిగిన సుదీర్ఘకాల ఆచరణ నుండి నేర్చుకోవడం, దానిని అన్వయించుకుని ఆచరించడం ప్రజలకూ, ప్రజా సంఘాలకూ, ప్రజాస్వామిక ఉద్యమాలకూ మరింత అవసరం.

కామ్రేడ్ బీఎస్ఏ మొక్కవోని నిబద్ధతనూ, ఆదర్శాలనూ, పోరాటతత్వాన్ని పుణికిపుచ్చుకున్న విప్లవ ప్రజా సంఘాలు ప్రజా పోరాటాల్లో మరింత చురుకైన పాత్ర పోషిస్తూ ఆయన లేని లోటును తప్పక పూరిస్తాయని మా పార్టీ ప్రగాఢంగా విశ్వసిస్తున్నది.

- ★ **కామ్రేడ్ బిఎస్ఎ అమర్ రహే!**
- ★ **అమరుల ఆశయాలను కొనసాగిద్దాం!**
- ★ **మార్క్సిజం-లెనినిజం-మావోయిజం వర్ధిల్లాలి!**
- ★ **కార్మికవర్గ అంతర్జాతీయతత్వం వర్ధిల్లాలి!**

**ఆనంద్**

**కార్యదర్శి,**

**కేంద్ర రీజనల్ బ్యూరో**

**సీపీఐ (మావోయిస్టు)**

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# కేంద్ర కమిటీ

**29-7-2012**

## పోరాట యోధుడు, మొక్కవోని కమ్యూనిస్టు నిబద్ధతకు ప్రతీక కామ్రేడ్ గోరు మాధవరావుకు జోహార్లు!

మన దేశ విప్లవోద్యమం మరో గొప్ప పోరాటయోధుడ్ని కోల్పోయింది. శ్రీకాకుళ సాయుధ పోరాట జ్వాలల నుంచి ఎగసిన కమ్యూనిస్టు యోధుడు కామ్రేడ్ గోరు మాధవరావు తన స్వగ్రామం జింకిభద్రలో జూలై 18న వృద్ధాప్యంతో తుదిశ్వాస విడిచారు. నవ యువకుడిగా ఆనాటి 'తెగింపు సంఘం'లో భాగమైనప్పటి నుంచి చివరి ఊపిరి వరకూ ఆయన పీడిత ప్రజల పక్షాన నిలబడి కమ్యూనిస్టు యోధుడిగా దాదాపు ఐదు దశాబ్దాల పాటు విప్లవోద్యమానికి ఎనలేని సేవలు అందించారు. ఉద్యమానికి కొండంత అండగా నిలిచిన ఆయన అమరత్వం విప్లవోద్యమానికి తీరని లోటు.

కామ్రేడ్ మాధవరావు శ్రీకాకుళం జిల్లా సోంపేట మండలం జింకిభద్ర గ్రామంలో ఒక పేద కుటుంబంలో పుట్టారు. ఆ ప్రాంతంలో కమ్యూనిస్టు ఉద్యమం బలంగా ఉండడం వల్ల చిన్ననాటే ఆయనలో విప్లవ భావాలు నాటుకున్నాయి. ఈ ప్రాంతంలో విప్లవ ప్రజా నాయకుడిగా ప్రసిద్ధి చెందిన కామ్రేడ్ తామాడ గణపతి తదితర కామ్రేడ్స్ నాయకత్వంలో సాగుతున్న ఉద్యమ ప్రభావం ఆయనపై బలంగా పడింది. ఆనాడు 'తెగింపు సంఘాలు' గ్రామ గ్రామాన ఏర్పాడ్డాయి. యువకుడైన కామ్రేడ్ మాధవరావు 'తెగింపు సంఘం'లో చేరారు. అందులో క్రియాశీల కార్యకర్త అయ్యారు. అనతికాలంలోనే కమ్యూనిస్టు పార్టీ సభ్యుడిగా ఎదిగారు.

ఉద్యమంలో పనిచేస్తూనే ఆయన వివాహం చేసుకున్నారు. తన సహచరి ముత్యాలును కూడా ఉద్యమానికి పరిచయం చేశారు. కమ్యూనిస్టు రాజకీయాలను తన జీవితంగా నమ్మిన ఆయన వాటిని తన సహచరికి కూడా నేర్పడంలో శ్రద్ధ వహించారు. వారికి ఇద్దరు ఆడపిల్లలు.

కామ్రేడ్ చారుమజుందార్ నేతృత్వంలో సాగిన నక్సల్బరీ సాయుధ రైతాంగ తిరుగుబాటు దేశంలోని విప్లవకారులకు దిశానిర్దేశం చేయడంతో శ్రీకాకుళంలో కూడా సిపిఎం ఆధునిక రివిజనిజంతో తెగతెంపులు చేసుకుని నిజమైన విప్లవకారులు సాయుధ పోరాట బాటనెంచుకున్నారు. శ్రీకాకుళంలో సాయుధ పోరాటాన్ని ప్రారంభించాలా లేదా అనే చర్చ

ఎజెండా మీదికి వచ్చినపుడు మితవాద అవకాశవాదులు అనేక సాకులను చూపి సాయుధ పోరాటాన్ని వాయిదా వేయాలని చూశాయి. కమ్యూనిస్టు విప్లవకారులు తక్షణం సాయుధ పోరాటాన్ని ప్రారంభించాలని వాదించారు. కామ్రేడ్ మాధవరావు సాయుధ పోరాటం ప్రారంభించాలనే పక్షాన నిలిచి విప్లవ పంథా పట్ల స్పష్టమైన అవగాహనను తొలినాళ్లలోనే ప్రదర్శించారు. ఆ విధంగా తొలుత ఆధునిక రివిజనిజాన్ని తిరస్కరించి దాని నడ్డి విరచడంలోనూ, తర్వాత మితవాద అవవాశవాద రాజకీయాలను ఓడించి సాయుధ పోరాట పంథాను ఎత్తిపట్టడంలోనూ కామ్రేడ్ మాధవరావు, ఆనాటి శ్రీకాకుళ విప్లవకారులందరూ కలిసి చేసిన కృషి దేశంలో సరైన విప్లవ పంథాను స్థాపించడంలో ఎంతో కీలకమైనది. తరతరాల విప్లవకారులు ఆచరణకు మార్గదర్శకంగా తీసుకోదగినది.

జిల్లాలో సాయుధ పోరాటం మొదలు కాగానే పార్టీ పిలుపును అందుకొని కామ్రేడ్ మాధవరావు పూర్తికాలం కార్యకర్తగా మారారు. కామ్రేడ్ ముత్యాలు ఆయన నిర్ణయాన్ని స్వాగతించింది. వీరనారి కామ్రేడ్ పంచాది నిర్మల నేతృత్వంలోని గెరిల్లా దళంలో ఆయన సభ్యుడిగా చేరారు. ఆ దళం నిర్వహించిన అనేక విప్లవ కార్యకలాపాలలో ఆయన ముందు నిలిచారు. 1969 డిసెంబర్ 22 తెల్లవారు జామున ఆ దళాన్ని కిరాయి పోలీసు, పారా మిలటరీ బలగాలు ఇన్‌ఫార్మర్ ఇచ్చిన సమాచారంతో చుట్టుముట్టి కామ్రేడ్స్ పంచాది నిర్మల, అంకమ్మ, సరస్వతి, తామాడ చినబాబు, సుబ్బారావు పాణిగ్రాహి, రమేష్ చంద్ర సాహులను పట్టుకొని ఘోరమైన చిత్రహింసలకు గురిచేసి రంగమేటియా కొండల్లో దారుణంగా కాల్చిచంపారు. ఆ ఘటన జరిగిన నాటికి ఆ దళంలోనే ఉన్న కామ్రేడ్ మాధవరావు శత్రువు కళ్లుగప్పి తప్పుకోగలిగారు. ఆ తర్వాత ఆయన ఉద్దానం ప్రాంతంలో డాక్టర్ చాగంటి భాస్కరరావు, దేవినేని మల్లికార్జునరావులతో కలిసి పని చేశారు.

కామ్రేడ్ మాధవరావును 1971లో అరెస్టు చేసి దొంగ సాక్ష్యాలతో ఆయనకు యావజ్జీవ శిక్ష వేసి విశాఖపట్నం జైలులో బంధించారు. 1979లో జైలు నుంచి విడుదలైనప్పటి నుంచి తిరిగి ఉద్యమంలో పూర్తికాలం కార్యకర్తగా భాగమయ్యారు. కామ్రేడ్ ముత్యాలు కూడా పూర్తికాలం కార్యకర్తగా పని చేస్తూ 1990 వరకూ ఇద్దరూ పార్టీ టెక్నికల్ అవసరాలను ఎన్నింటినో తీర్చారు.

1980 సెప్టెంబర్‌లో జరిగిన మునుపటి సి.పి.ఐ. (ఎం-ఎల్) (పీపుల్స్‌వార్) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర 12వ మహాసభలలోనూ, 1987లో జరిగిన 13వ రాష్ట్ర మహాసభలలోనూ ఆయన ప్రతినిధిగా పాల్గొన్నారు. ఆయన 12వ రాష్ట్ర మహాసభలలో అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించగా, 13వ రాష్ట్ర మహాసభలలో పార్టీ జెండాను ఆవిష్కరించారు.

విప్లవోద్యమంపై శత్రు ఫాసిస్టు నిర్బంధం తీవ్రతరమై 'క్రాంతి' ప్రచురణలు, పీస్ బుక్ సెంటర్ తదితర విప్లవ ప్రచురణ, అమ్మకాల కేంద్రాలు శత్రువుకు లక్ష్యంగా మారిన సమయంలో ఆంధ్రప్రదేశ్‌లో విప్లవ సాహిత్యాన్ని ప్రచురించడంలో కామ్రేడ్ గోరు మాధవరావు ఒక కేంద్రంగా నిలిచారు. ప్రత్యేకించి ఏ సాహిత్యం ప్రజలకు అందకుండా చేయాలని పాలకవర్గాలు కుట్రలు చేస్తూ వచ్చాయో అలాంటి నిషేధిత విప్లవ సాహిత్యాన్ని ఆయన ప్రచురించి వారి కంట్లో నలుసుగా మారారు. మునుపటి సి.పి.ఐ. (ఎం-ఎల్) (పీపుల్స్‌వార్), ఆ తర్వాత సి.పి.ఐ. (మావోయిస్టు)కు చెందిన అనేక ప్రచురణలను తన చిరునామాతో ప్రచురించి విప్లవ సాహిత్య ప్రచారంలో గొప్ప పాత్రను నిర్వహించారు. నక్సలైట్ సాహిత్యం ప్రచురిస్తే జైల్లో పెడతామని ప్రభుత్వం పదే పదే హెచ్చరికలు చేసినా ఏమాత్రం లెక్కచేయక దృఢదీక్షతో ప్రజలకు విప్లవ సాహిత్యాన్ని నిర్విరామంగా అందించిన ఆయన విప్లవ నిబద్ధత అనుసరణీయం. వివిధ ప్రజాపోరాటాలలో, విద్యార్థి, యువజన, మహిళా ఉద్యమాలలో, ప్రచారంలో, ప్రజల ఐక్యకార్యాచరణ కార్యకలాపాలలో భాగస్వామి అవుతూ వాటిని పురోగమింపజేసేందుకు శక్తిమేరకు కృషి చేశారు.

కామ్రేడ్ మాధవరావుకు పార్టీ పంథా పట్ల అపారమైన విశ్వాసం ఉండేది. శ్రీకాకుళ సాయుధ పోరాటం వెనుకపట్టు పట్టినా, పుల్లారెడ్డి, నాగిరెడ్డి గ్రూపులు మితవాద అవకాశవాదంతో విప్లవ పంథాను నీరుగార్చాలని ప్రయత్నించినా, కామ్రేడ్ ఆదిభట్ల కైలాసం అమరత్వం తర్వాత పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన పైలా వాసుదేవరావు సత్యనారాయణ్ సింగ్‌తో కలిసిపోయి విచ్ఛిన్నకుడిగా మారినా, చౌదరి తేజేశ్వరరావు వంటి విచ్ఛిన్నకులు పార్టీని చీల్చేందుకు ప్రయత్నించినా కామ్రేడ్ గోరు మాధవరావు పార్టీని, విప్లవ పంథాను అంటిపెట్టుకొని ఉన్నారు. శ్రీకాకుళ ఉద్యమం దెబ్బతిని అనేక నష్టాలు పాలవుతూ, చాలా మంది విప్లవకారులు వెన్నుజూపి విప్లవానికి చెల్లుచీటి ఇస్తున్న పరిస్థితుల్లో విప్లవ పంథాను ఎత్తిపట్టిన అతితక్కువ మంది విప్లవకారులలో ఆయన ఒకరు. అలాగే జైలు నిర్బంధంలోనూ ఆయన విప్లవ పక్షాన దృఢంగా నిలిచారు. విప్లవ పంథాను దెబ్బతీసేందుకు ప్రయత్నిన మితవాద అవకాశవాదుల పద్ధతులను నిరంతరం తూర్పారబట్టేవారు. 1970ల చివరలో తిరిగి ఆంధ్రప్రదేశ్‌లో ప్రారంభమైన విప్లవ రైతాంగ వెల్లువను చూసి ఎంతో ఉత్తేజితుడైనారు. ఆయన పార్టీ 12వ రాష్ట్ర మహాసభకు హాజరైన నూతన తరం ప్రతినిధులకు శ్రీకాకుళ సాయుధ పోరాట అనుభవాలను అందించి వారిని ఎంతగానో ఉత్తేజితుల్ని చేశారు.

1985లో, 1991లో సత్యమూర్తి, కె.ఎస్.లు పార్టీలో అంతర్గత సంక్షోభాన్ని సృష్టించినపుడు కామ్రేడ్ మాధవరావు దృఢంగా విప్లవోద్యమం పక్షాన నిలబడ్డారు. 2006-2007లలో

ఆంధ్రప్రదేశ్ ఉద్యమం వెనుకపట్టు పట్టినా ఆయన ఆంధ్రప్రదేశ్‌లో పార్టీ జెండాను సమున్నతంగా ఎత్తిపడుతూ తన విప్లవ ఆచరణను కొనసాగించారు. రాష్ట్రంలోనూ, దేశంలో అనేక చోట్లకు వెళ్లి పార్టీ సందేశాన్ని అందిస్తూ విప్లవ శ్రేణులలో, ప్రజలలో విప్లవోద్యమం పట్ల విశ్వాసాన్ని పెంపొందించేందుకు తీవ్రంగా కృషి చేశారు.

కామ్రేడ్ గోరు మాధవరావు, ఆయన సహచరి ముత్యాలు ఇరువురూ ఉద్యమంలోనే ఉండడం వలన వారికి ఎటువంటి ఆస్తిపాస్తులూ లేవు. శ్రీకాకుళ పోరాటంలో కామ్రేడ్ మాధవరావు రహస్య జీవితానికి వెళ్లినపుడు కామ్రేడ్ ముత్యాలు చిన్న పిల్లలిద్దరితో ఎన్నో కష్టాలను నిబ్బరంగా ఎదుర్కొని నిలిచింది. అంతటి కష్టకాలంలోనూ ఇంటికొచ్చే విప్లవ కార్యకర్తలను కామ్రేడ్ ముత్యాలు అమ్మలాగా ఎంతో ఆప్యాయంగా ఆదరించేది. ఆమె కూడా పార్టీ సభ్యురాలు. తమ ఇద్దరు కూతుర్ల పెంపకం విషయంలో వారు ఫ్యూడల్ విలువలను తిరస్కరించారు. కామ్రేడ్ ముత్యాలు 1993 జూన్ 30న తుదిశ్వాస విడిచింది. కామ్రేడ్ మాధవరావు నిరాడంబరమైన సాదాసీదా జీవితం గడిపారు. అట్టడుగు పేద వర్గంలో పుట్టి పెరగిన ఆయన ఆదర్శ కమ్యూనిస్టు విలువల్ని జీర్ణం చేసుకున్నారు. అందుకనే ఉద్యమ అవసరాల కోసం ఆయన నిర్వహించిన అనేక డెన్‌లు కూడా అత్యంత సాదాసీదాగా ఉండేవి. ఆయన మాటల్లో, వ్యవహార శైలిలో వాగాడంబరం, డంబాచారం ఉండేవి కావు. ఆయన విప్లవోద్యమంలో అత్యంత సీనియర్ అయినప్పటికీ, ఉద్యమావసరాల కోసం పార్టీ అప్పగించిన అనేక బాధ్యతలు నిర్వహించినప్పటికీ పార్టీలో నా స్థాయి ఏమిటి అనేదాన్ని ఎన్నడూ ఆలోచించని నిస్వార్థపరుడు ఆయన. శ్రీకాకుళ పోరాటయోధుడు కావడం, పార్టీ పంథా పట్ల ఎనలేని విశ్వాసం ఉండడం వల్ల కోల్‌కత నగరంలో ఆయన నిర్వహించిన డెన్ భారతదేశంలో విప్లవకారుల ఐక్యతా చర్చలలో మునుపటి ఎంసిసి పార్టీకి ఒక విశ్వసనీయమైన కేంద్రంగా ఉండేది. మునుపటి ఎంసిసి స్రవంతి కామ్రేడ్స్‌కు ఆయన పట్ల అపార విశ్వాసం, గౌరవం ఉండేవి.

నక్సల్బరీ, శ్రీకాకుళ ఉద్యమాలు అందించిన పాఠాలు ఎలాగైతే వర్తమాన చరిత్రకు అత్యంత విలువైనవో, కామ్రేడ్ మాధవరావు వంటి నక్సల్బరీ తరం విప్లవకారుల కార్యాచరణ, ఆధునిక రివిజనిజం, అతివాద, మితవాదాలతో వారి రాజీలేని పోరాటం, పీడిత ప్రజల విముక్తి పట్ల మొక్కవోని నిబద్ధత, విప్లవ పార్టీ పంథా పట్ల అచంచల విశ్వాసం వంటి విలువలు తర్వాతి తరాలకు అలాగే అత్యంత విలువైనవి. ఆచరణయోగ్యమైనవి. భారతదేశ విప్లవోద్యమంలో అత్యంత సీనియర్ అయిన కామ్రేడ్ మాధవరావు జీవితం, కార్యాచరణల నుండి యువతరం విప్లవకారులే కాక మన దేశం భూస్వామ్య, దళారీ నిరంకుశ బూర్జువా, సామ్రాజ్యవాద దోపిడీ, పీడనల నుండి విముక్తి చెందాలని ఆకాంక్షించే ప్రతి ప్రజాస్వామికవాది, మేధావి కూడా

నేర్చుకోవలసింది ఎంతో వుంది. రకరకాల కారణాలతో, సాకులతో విప్లవోద్యమ క్రమంలో వచ్చే ఒడిదుడుకుల్నీ, కష్టనష్టాల్నీ, శత్రు నిర్బంధాన్నీ తట్టుకోలేక విప్లవబాటను వదిలేస్తున్నవారు ఉంటున్న నేపథ్యంలో కామ్రేడ్ మాధవరావు వంటి కమ్యూనిస్టులు దశాబ్దాలపాటు చివరికంటా విప్లవ పంథాలో కొనసాగడం అనే ఆదర్శాన్ని ప్రత్యేకించి ఉన్నతంగా ఎత్తిపడుతూ అనుసరణీయంగా తీసుకోవల్సిన, విస్తృతంగా ప్రచారం చేయాల్సిన అవసరం వున్నది.

కామ్రేడ్ గోరు మాధవరావు అమరత్వంతో ఐదు దశాబ్దాలకు పైగా పార్టీ పంథాను ఎత్తిపట్టిన గొప్ప విప్లవ యోధుడిని పార్టీ, విప్లవ ప్రజానీకం కోల్పోయారు. యావత్ విప్లవ శ్రేణుల తరఫున సిపిఐ (మావోయిస్టు) కేంద్రకమిటీ ఆయనకు తలవంచి విప్లవాంజలి ఘటిస్తోంది. ఆయన ఆశయాలను ముందుకు తీసుకుపోతానని శపథం చేస్తోంది.

**అభయ్**

**అధికార ప్రతినిధి**

**కేంద్ర కమిటీ**

**సీపీఐ (మావోయిస్టు)**

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# కేంద్ర కమిటీ

**20-9-2012**

## ప్రపంచవ్యాప్తంగా ముస్లిం ప్రజల మత మనోభావనలను గాయపరుస్తున్న
## అమెరికా సాంస్కృతిక సామ్రాజ్యవాదాన్ని ఖండించండి !

అమెరికాలో ముస్లిం వ్యతిరేక, ప్రతీఘాతుక క్రిస్టియన్ మత దురహంకారుల బృందం ఒకటి 'ఇన్నోసెన్స్ ఆఫ్ ముస్లిమ్స్' అనే విడియో సినిమాని తీసి ఇంటర్నెట్‌లో వివిధ విడియో పంపక సైట్లలో అందుబాటులో వుంచింది. ఇది మహమ్మద్ ప్రవక్తను అవమానించడం ద్వారా ప్రపంచవ్యాప్తంగా ముస్లింల మత మనోభావనలను గాయపరిచింది. దాంతో ప్రపంచవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో ముస్లింలు పెద్దెత్తున నిరసనలు వ్యక్తం చేయసాగారు. ఇది లిబియా నుండి మొదలై, ట్యునిసియా మీదుగా థాయ్‌లాండ్, ఇండొనీసియా, పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్, కాశ్మీర్ నుండి భారతదేశం వరకు, ముఖ్యంగా ఉత్తర ఆఫ్రికా, పశ్చిమాసియా, అరబ్ దేశాలకు విస్తరించింది. సిపిఐ (మావోయిస్టు) కేంద్రకమిటీ ముస్లింల మత మనోభావనల మీద అమెరికా చేసిన ఈ సాంస్కృతిక దాడిని తీవ్రంగా ఖండిస్తూ, అమెరికా ప్రభుత్వమూ, ఈ సినిమాని తీసినవారూ ప్రపంచవ్యాప్తంగా గల ముస్లింలందరికీ బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తోంది.

9/11 దాడి జరిగినప్పటి నుండి అమెరికా సామ్రాజ్యవాదం 'టెర్రరిజంపై యుద్ధం' పేరుతో ప్రపంచవ్యాప్తంగా ముస్లిం ప్రజలను మరింతగా దాడికి లక్ష్యాలుగా చేసుకుంటూ వస్తోంది. ఈ దాడి కేవలం రాజకీయ, మిలటరీ, ఆర్థిక రంగాల్లోనే కాక, సామాజిక, సాంస్కృతిక రంగాల్లో కూడా కొనసాగుతోంది. అమెరికా, దాని మిత్రదేశాల ఈ సాంస్కృతిక సామ్రాజ్యవాద దాడిరూపాల్లో పచ్చి క్రిస్టియన్ మత దురహంకార వ్యక్తీకరణలు, అబూ గ్రాయిబ్‌లో జరిగిన దారుణమైన చిత్రహింసల నుండి మొదలుకొని, మహమ్మద్ ప్రవక్తను, ఖురాన్‌ను, యితర ఇస్లాం మత సంకేతాలను కార్టూన్‌లలో, సినిమాలలో వ్యక్తీకరణ స్వేచ్ఛ పేరుతో అవమానించడం వరకు వున్నాయి. ఈ సాంస్కృతిక దాడి ముస్లింల మానసికతను దెబ్బతీసి, తాము తక్కువవారమని భావించేలా చేయడానికి, తద్వారా 'టెర్రరిజం మీద యుద్ధం' పేరిట తమపై జరుగుతున్న అత్యాచారాలనూ, సామ్రాజ్యవాద

దురాక్రమణలనూ ప్రతిఘటించకుండా వుండడానికి ఉద్దేశింపబడింది. అయితే అమెరికా సామ్రాజ్యవాదులు ఘోరంగా పొరబడ్డారు. ముస్లిం ప్రజానీకాన్ని దెబ్బ తీయడానికి ఉద్దేశించిన ప్రతి అవమానం తిరిగి ఒక బ్రహ్మాండమైన నిరసనగా ఎగిసి వారి ముఖంపై పిడిగుద్దుగా మారుతోంది. ఇందుకనుగుణంగానే ఈ సినిమా ఒక సాంస్కృతిక అంశంపై ప్రపంచం మునుపెన్నడూ ఎరుగని స్థాయి నిరసనలకు దారితీసింది. ఈ నిరసన రూపాల్లో బ్రహ్మాండమైన ప్రదర్శనలు, నిరసన ర్యాలీలు, అమెరికా జెండా, ఆస్తులు, ఇతర అమెరికా సంకేతాల దగ్ధం, విధ్వంసం నుండి మొదలుకొని అమెరికా దౌత్య కార్యాలయాల మీద దాడులు, వారి దౌత్యవేత్తల హత్యల దాకా వున్నాయి.

అపూర్వ స్థాయిలో వెల్లువెత్తుతున్న ఈ ఆగ్రహం కేవలం మహమ్మద్ ప్రవక్తను అవమానపరచడానికి వ్యతిరేకంగా మాత్రమే కాదనీ, అమెరికా సామ్రాజ్యవాదులు ముస్లిం ప్రజానీకం మీద, ముఖ్యంగా ఇరాక్, అఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్‌లలో కొనసాగించిన అన్ని రకాల అత్యాచారాలకూ, జియోనిస్టు ఇజ్రాయిల్ పాలస్తీనా ప్రజల మీద కొనసాగిస్తున్న అత్యాచారాలకు అది నిస్సిగ్గుగా అందిస్తున్న మద్దతుకీ వ్యతిరేకంగా వారిలో ఎన్నాళ్ల నుండో రగులుతున్న ద్వేషంలో కూడా భాగమనీ మనం అర్థం చేసుకోవాలి. ఈ నిరసనలను ఒక మత సముదాయం కేవలం ఒక మత సంబంధమైన విషయంలో చేస్తున్న నిరసనలుగా మాత్రమే కాక ఒక విశాలమైన అర్థంలో ప్రపంచవ్యాప్తంగా ప్రజలందరూ సంస్కృతి సహా అన్ని రంగాల్లో చేస్తున్న సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాల్లో భాగంగా చూడాల్సి వుంటుంది. అమెరికా, నాటో బలగాలు గల్ఫ్ ప్రాంతంలోని దేశాలను ఆక్రమించి, అక్కడి చమురు నిల్వలను దోచుకోవడానికి చేసిన దురాక్రమణ యుద్ధాలు, సమృద్ధమైన వనరులు గల అరబ్, ఉత్తర ఆఫ్రికా దేశాలపై చేస్తున్న నయా వలసవాద దోపిడీ, లూటీ అనేవి అమెరికా పట్ల వ్యక్తమవుతున్న ఈ ద్వేషం వెనుక గల ముఖ్య కారణం. ఈ దేశాల్లోని అత్యధిక మెజారిటీ జనాభా అయిన ముస్లిం ప్రజల ప్రతిఘటనను దెబ్బ తీయడానికి అమెరికా కుట్రపూరితంగా, ఉద్దేశపూర్వకంగా చేస్తున్న ఇస్లాం వ్యతిరేక ప్రచారం, చర్యల వల్లనే ప్రధానంగా ఇది మతపరంగా మారింది.

ఈ నిరసనలు వెల్లువెత్తుతున్న దేశాల్లో అధికారంలో వున్న దళారీ పాలకవర్గాలు, తమ అసలు స్వభావానికి అనుగుణంగానే తూటాలు, టియర్ గ్యాస్, లాఠీ చార్జీలు, అరెస్టులతో నిరసనకారుల్ని అణచివేయ ప్రయత్నిస్తున్నారు. అనేక దశాబ్దాలుగా ఈ పాలకవర్గాలు ఒకవైపు సామ్రాజ్యవాదులకు పెంపుడు కుక్కల్లాగానూ, మరోవైపు తమ స్వంత ప్రజలపై కరడు గట్టిన నిరంకుశులుగా వ్యవహరిస్తూ వస్తున్నారు. ఒకవైపు అమెరికా డ్రోన్ విమానాలు అఫ్ఘన్ గ్రామాలపై ఎడతెరిపిలేని దాడులు చేస్తూ రోజువారీ కార్యక్రమంగా అక్కడి అమాయక

ప్రజలను చంపుతూ వుంటే, ముస్లిం ప్రపంచం ఒక్కటై ఈ సినిమా రూపంలో జరిగిన అమెరికా సాంస్కృతిక దాడికి నిరసనగా పైకి ఎగుస్తూ వుంటే, కర్జయ్‌గారు మాత్రం 'టెర్రరిజంపై యుద్ధం' కొనసాగాల్సిందేననీ, అయితే అఫ్ఘన్ గ్రామాల్లో మాత్రం దీన్ని కొనసాగించవద్దని ఒబామాని బతిమాలుకుంటున్నారు. ఇటువంటి కీలుబొమ్మలు కూడా ప్రపంచవ్యాప్తంగా సామ్రాజ్యవాదులు ముస్లింల మీద అసంఖ్యాకంగా జరుగుతున్న దాడులకు అంతే బాధ్యులవుతారు. ఇటువంటి సాంస్కృతిక దాడులు జరిగినప్పుడు వీరు ఎన్నడూ ముస్లిం ప్రజల ఆత్మగౌరవాన్ని ఎత్తిపట్టరు. ప్రజలే ఇటువంటి కుమ్మక్కుదారుల అసలు ముఖాన్ని ఎండగట్టాల్సి వుంటుంది.

నిరసనల స్థాయిని చూసి నిర్ఘాంతపోయిన అమెరికా ప్రభుత్వం మహా ఆలస్యంగా 70,000 డాలర్లకు పైగా సొమ్మును ప్రకటనల మీద ఖర్చు చేసింది. వీటిలో ఒబామా, హిల్లరీ క్లింటన్‌లు అమెరికా ఎల్లప్పుడూ అన్ని మతాలను సమానంగా గౌరవిస్తూ వచ్చిందని సందేశాలు ఇస్తూ నిరసన వెల్లువను ఆపడానికి విఫలయత్నాలు చేశారు. మొదటగా అసలు ఈ సినిమా కేవలం ఎవరో ఒక మనిషి తన ఊహలు, భావాల వల్ల తీసింది కాదు. అమెరికా ప్రభుత్వమూ, దాని మిత్ర దేశాలూ బహిరంగంగానూ, రహస్యంగానూ 'టెర్రరిజంపై యుద్ధం'లో భాగంగా ప్రాయోజితం చేసి, మద్దతునిచ్చి, ప్రోత్సహించిన యావత్ ఇస్లాం వ్యతిరేక ప్రచారంలో ఇది ఒక విడదీయరాని భాగం. అఫ్ఘనిస్తాన్‌లో అమెరికా సైనికులు ఖురాన్‌ను తగులబెట్టడం వంటి అనేక ఉద్దేశపూర్వక, అవమానించే చర్యల్లో ఇది యిటీవలది మాత్రమే. ఈ నేపథ్యం లేకపోయి వుంటే ఇటువంటి సినిమాలను ఇంత సులభంగా తీసీ వుండేవారు కాదు, అవంత సులభంగా విడుదలయ్యేవీ కావు.

అమెరికా ప్రభుత్వ బ్రహ్మాండమైన నిఘా వ్యవస్థను దృష్టిలో వుంచుకున్నప్పుడు ఈ సినిమాని తీయడం గురించి గానీ, దాని విడుదల గురించి గానీ దానికి తెలీదని నమ్మడం అమాయకత్వమైనా అవుతుంది లేదా మనల్ని మనం మోసగించుకోవడమైనా అవుతుంది. ఇంత పెద్దెత్తున నిరసనలు వ్యక్తమైన తర్వాత కూడా అమెరికా ప్రభుత్వం ఈ సినిమాని తీసినవాళ్లని అరెస్టు చేయడానికి గానీ, దాని విడుదలను నిలుపుదల చేయడానికి గానీ, ముస్లింలకు క్షమాపణ చెప్పడానికి గానీ సిద్ధంగా లేదు. అది సమయాన్ని గడిపేయడానికి ప్రయత్నిస్తూ అన్ని మతాల్నీ గౌరవిస్తామంటూ నామమాత్రమైన, అస్పష్టమైన ఖండనలూ, ప్రకటనలూ యిస్తూ ప్రజల్ని మోసగించ జూస్తోంది. కానీ చరిత్ర ఇందుకు భిన్నమైన సాక్ష్యాన్నిస్తోంది. అంతే కాకుండా, తన పౌరుల్ని నిరసనకారుల నుండి కాపాడుకునే సాకుతో అది లిబియా వంటి దేశాల్లోకి నేరుగా తన సైనికుల్ని పంపిస్తూ వాటి సార్వభౌమత్వానికి భంగం కలిగిస్తోంది.

ముస్లిం ప్రజానీకానికి అమెరికా సామ్రాజ్యవాదపు దుర్మార్గాలతో తగినంత అనుభవం వుంది కనుకనే దాని మోసాన్ని గ్రహించారు. అందుకే అమెరికాకీ, దాని పశ్చిమ మిత్రదేశాలకూ వ్యతిరేకంగా నానాటికీ శాంతియుతమైన, హింసాత్మకమైన నిరసనలు మరింతగా ఎగుస్తున్నాయి. సామ్రాజ్యవాద యుగపు నీరోలైన పశ్చిమ దేశాల సామ్రాజ్యవాదులు ముస్లింల పట్ల ఎంత బాధ్యతారహితమైన, దుర్మార్గమైన వైఖరిని కలిగి వుంటారనే విషయాన్ని ఒక పక్క ప్రపంచం అంతా ఈ సినిమాకు వ్యతిరేకంగా మండిపోతుంటే ఫ్రాన్స్‌లోని ఒక పత్రిక మహమ్మద్ ప్రవక్తను అవమానిస్తూ 20 కార్టూన్‌లను ప్రచురించడాన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు. ఫ్రాన్స్ ముందస్తు హెచ్చరికగా 20 దేశాల్లో తన దౌత్య కార్యాలయాల్ని మూసివేసింది. అమెరికా మద్దతుతో ఇజ్రాయిల్ లెబనాన్‌పై చేసిన దురాక్రమణ దాడిని విజయవంతంగా తిప్పికొట్టిన, సామ్రాజ్యవాద వ్యతిరేక భావాలు గల హసన్ నస్రల్లా వంటి నేతలు మరింత విస్తృతమైన నిరసనలు తెలపల్సిందిగా పిలుపునివ్వడంతో మరొక విడతగా నిరసనలు వెల్లువెత్తాయి.

మత సామరస్య భావాలు గల ప్రతి ఒక్కరూ, ప్రతి ప్రజాస్వామికవాది ఈ నిరసనల్లో పాల్గొని ప్రత్యేకంగా ఇస్లాం మతస్తులను టార్గెట్ చేస్తున్న అమెరికా, యూరోప్ సామ్రాజ్యవాదుల సాంస్కృతిక సామ్రాజ్యవాదాన్ని ఖండించాలి. మత మనోభావనలను గాయపర్చడం అనేది సాంస్కృతిక సామ్రాజ్యవాదంలో ఒక భాగం మాత్రమే. ఈ సాంస్కృతిక సామ్రాజ్యవాదపు రాకాసికున్న ఇతర అనేక కోరలు ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాల స్థానిక సంస్కృతిని (భాషలు, యాసలు, ఆహారపు అలవాట్లు, కట్టు, కట్టడాలు - ఒకటనేంటి, అన్నిటినీ) ఎలా గొంతు నులిమివేస్తున్నాయో ఈ నిరసనల సందర్భంగా బహిర్గతం చేయాలి. అమెరికా ప్రభుత్వమూ, ఈ సినిమా తీసినవారూ బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేయడంతో పాటు ఈ నిరసనలు విశాలమైన సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలుగా, ప్రత్యేకించి వెనుకబడిన దేశాల్లో తన భౌగోళిక-రాజకీయ ప్రయోజనాలను నెరవేర్చుకోవడానికీ, ఆ దేశాల్లోని చమురు, ఇతర సహజ సంపదలనూ దోచుకోవడానికీ అక్కడి ముస్లింలను టార్గెట్ చేస్తున్న అమెరికా సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలుగా మారాల్సిన అవసరం వున్నది.

**అభయ్**

**అధికార ప్రతినిధి**

**కేంద్ర కమిటీ**

**సీపీఐ (మావోయిస్టు)**

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# కేంద్ర కమిటీ

**21-9-2012**

## రిటైల్, పౌర విమానయానం, విద్యుత్తు, ప్రసార రంగాల్లో ఎఫ్‌డిఐని అనుమతించాలనే నిర్ణయాన్ని తక్షణం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేయండి !

## పార్లమెంట్‌లోని దళారీ భారత పాలకవర్గాలు-సామ్రాజ్యవాద పెంపుడు కుక్కలు బహుళజాతి సంస్థలకు మన దేశ సార్వభౌమత్వాన్ని అమ్మివేయకుండా అడ్డుకోండి !

సెప్టెంబర్ 14న కేంద్ర ప్రభుత్వం బహుళ బ్రాండ్ రిటైల్ రంగంలోకి 51 శాతం, సింగిల్ బ్రాండ్ రిటైల్‌లోకి 51 శాతం కంటే ఎక్కువ, పౌర విమానయానంలోకి 49 శాతం, విద్యుత్తు ఎక్చేంజీల్లోకి 49 శాతం, ప్రసార రంగంలోకి (డిటిఎచ్ సహా) 49 నుండి 74 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను (ఎఫ్‌డిఐ) అనుమతించాలనే కేబినెట్ నిర్ణయాన్ని తీసుకుంది. పెద్దెత్తున వ్యక్తమవుతున్న నిరసనలను బేఖాతరు చేస్తూ సెప్టెంబర్ 20న నోటిఫికేషన్ జారీ చేయడంతో ఇది తక్షణం అమల్లోకి వచ్చింది. ఇప్పుడు విదేశీ పెట్టుబడిదారులు దేశంలోని పది రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో రిటైల్ రంగంలో మదుపులు పెట్టి దుకాణాలు తెరవచ్చు. ఇతర రాష్ట్రాలు వాటిని అనుమతించాలా లేదా అనే నిర్ణయాన్ని తామే తీసుకోవచ్చు. ఈ ప్యాకేజీపై 'జాతి ప్రయోజనాల రీత్యా' అంటించిన ప్రభుత్వ హెచ్చరిక ఇలా వుంది : అన్ని రంగాల్లోనూ మరింత ఎఫ్‌డిఐ రాబోతున్నాయి, 1991 నాటి నూతన ఆర్థిక విధానాలు రిహార్సల్స్ అయితే ఇప్పుడు జరుగుతున్నది మన దేశ అంతానికి జరుగుతున్న గొప్ప ఆరంభం, తిరగబడ్డం ఆరోగ్యానికి హానికరం. పుండు మీద కారం జల్లినట్టుగా డీజల్ ధర ప్రతి లీటర్‌కు 5 రూపాయలు పెంచేశారు. సబ్సిడీ వంటగ్యాస్ సిలిండర్ల సప్లైని కుటుంబానికి సంవత్సరానికి ఆరుకు కుదించారు.

ప్రతిపక్ష పార్టీలు ఈ నిర్ణయాలను వ్యతిరేకిస్తూ సెప్టెంబర్ 20న బంద్‌కు పిలుపునిచ్చాయి. అయితే తాము గతంలో లేదా ప్రస్తుతం అధికారంలో వుండిన రాష్ట్రాల్లో అవి ఒక దాన్ని మించి ఒకటిగా సామ్రాజ్యవాద అనుకూల విధానాలను వేగంగా అమలు చేయడానికి

ఎలా పోటీ పడ్డాయి అనే వాటి గత రికార్డులను పరిశీలిస్తే గనుక అవి తిరిగి 2011 నవంబర్ నాటి నామమాత్ర నిరసన అనే నాటకాన్నే మరోసారి ప్రదర్శిస్తున్నాయి అనీ, యుపిఎ, ప్రతిపక్ష పార్టీలు అనే రెండు పేర్లుగల ఈ దోపిడీదారుల ముఠా అంతా ఒకే తానులోని గుడ్డలే అనీ సులభంగా గ్రహించచ్చు. ఈ కుళ్లికంపు గొట్టే పార్లమెంటరీ ప్రహసనంలో ఈ దళారీలు తమ తమ పాత్రలను పోషించడం  పూర్తయిపోయాక, ఎఫ్‌డిఐ రారాజులా ముందు తలుపు గుండా దళారీ పాలకవర్గాలు పరిచిన ఎర్ర తివాచీ మీద బాజాప్తుగా ప్రవేశించి, దేశ నలుమూలల్లో తాను అడుగు పెట్టిన చోటల్లా తన ఉక్కుపాదాల కింద కోట్లాది చిన్న చిల్లర వ్యాపారస్తుల్నీ, రైతాంగాన్నీ తొక్కిపడేసుకుంటూ పోతుంది. సార్వభౌమత్వం అనేది ఇందుకోసం మనం చెల్లించాల్సిన స్వల్ప మూల్యం మాత్రమే. చిన్న చిల్లర వ్యాపారస్తుల, రైతుల ఆత్మహత్యలు అనూహ్యంగా పెరిగితే అది ఎఫ్‌డిఐ ద్వారా సాధించదల్చుకున్న 'ఆర్థిక అభివృద్ధి'తో పాటు అనివార్యంగా జరిగే నష్టం (కొలాటరల్ డామేజి)గా  ఉంటుందంతే.

ఎఫ్‌డిఐని అనుమతించాలా లేదా అనేది రాష్ట్రాలకే వదిలేశాం అంటున్నారు కనుక కాంగ్రెస్ నేతృత్వంలో వున్న ప్రభుత్వాలు ఉన్న రాష్ట్రాల్లో ఎలాగూ వాటిని అనుమతిస్తాయి. అకాలీదళ్ నిస్సిగ్గుగా ఈ నిర్ణయానికి మద్దతు తెలిపే వున్నది. మిగతా పార్టీలు కూడా దొడ్డిదారి నుండి అదే బాట పడ్తాయి. ఎందుకంటే అవన్నీ కూడా ఇప్పటివరకూ, ప్రతి రంగంలోనూ సామ్రాజ్యవాద బహుళజాతి సంస్థల ప్రయోజనాలు నెరవేర్చడానికే నానాపాట్లు పడుతూ వస్తున్న దళారీ పార్టీలే కనుక. కేవలం పరువు కాపాడుకోవడానికి మహా అయిష్టంగా తృణమూల్ కాంగ్రెస్ యుపిఎ నుండి ఉపసంహరించుకుంటున్నానని ప్రకటించింది. అయితే ఈ నిర్ణయాల్లో కొన్ని మార్పులు చేస్తే (అంటే డీజల్ ధర పెంపుని మూడు లేదా నాలుగు రూపాయలకు తగ్గించడం, సిలిండర్ల సంఖ్యని పెంచడం లేదా బహుళ బ్రాండ్ రిటైల్ వ్యాపారంలో ఎఫ్‌డిఐని కొంత శాతం తగ్గించడం వంటివి) తాను పునరాలోచిస్తానని సన్నాయి నొక్కులు నొక్కుతోంది. ఇప్పటికే సరిగ్గా ఎఫ్‌డిఐ విషయం మీదే గత సంవత్సరం హిల్లరీ క్లింటన్ మమతా బెనర్జీని నేరుగా కలిసింది. కనుక ఆమె తన రాష్ట్రంలో ఎఫ్‌డిఐకి  ఎర్రతివాచీ పరిచినప్పుడు ఆశ్చర్యపోనవసరం లేదు. ఎన్నికలు, పదవికి వేలాడ్డం లాంటి 'గంభీరమైన' విషయాలను దృష్టిలో వుంచుకుని సమయం చూసుకుని చేస్తారన్నమాట. మతశక్తుల పురోగమనాన్ని తన పార్టీ కోరుకోవడం లేదు కనుక ఎఫ్‌డిఐ విషయంలో యుపిఎకి మద్దతు ఉపసంహరించుకోవడం లేదని ములాయం ప్రకటించడం పచ్చి అబద్ధం. ఢిల్లీ సర్కారుకు సామంతులైన వీళ్లెవరికీ వెన్నెముకా లేదు, ఎఫ్‌డిఐ రాకాసులకు తమ జీవనోపాధిని కోల్పోబోతున్న 4, 5 కోట్ల చిన్న రిటైల్ వ్యాపారస్తుల మీద (వారి మీద ఆధారపడిన మరో

15, 20 కోట్లమంది ప్రజల మీద) అక్కర అంతకంటే లేదు. రివిజనిస్టు సిపిఐ, సిపిఎంలు సహా వీటిల్లో ఏ ఒక్క పార్టీ కూడా ఎఫ్‌డిఐని తీసుకురావాలనే నిర్ణయాన్ని సంపూర్ణంగా తిరస్కరించడం లేదంటే, దాన్ని సంపూర్ణంగా వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేయడం లేదంటే అది వారూ తోడుదొంగలనడానికి నిదర్శనం అనే విషయాన్ని మనం గంభీరంగా గమనంలోకి తీసుకోవాలి. వారి సోకాల్డ్ నిరసన, నామమాత్ర బంద్‌లు, ధర్నాలు తమ రాష్ట్రాలకు (తాము మింగడానికి వీలుగా) మరిన్ని నిధులు మంజూరు చేయించుకోవడానికో లేదా కేంద్ర ప్రభుత్వం చేతుల్లో కోట్ల రూపాయల విలువ చేసే అవినీతి, కుంభకోణాల అసంఖ్యాకమైన కేసుల పగ్గాలు వున్నాయి కనుక వాటిని వదులు చేసుకోవడానికో మాత్రమే.

ఒకవైపు వరల్డ్ ఆఫ్ వర్క్ 2011 నివేదిక ఉద్యోగాల విషయంలో ప్రపంచం భవిష్యత్తు అంధకారబంధురంగా వుందని చెప్తోంది, 150 దేశాల్లో చేసిన ఒక ప్రపంచ సర్వే ప్రపంచవ్యాప్తంగా సామాజిక-ఆర్థిక అభద్రత  విపరీతంగా పెరిగిందని ఘోషిస్తోంది. మరి అబద్ధాలు చెప్పడాన్ని వృత్తిగా చేసుకున్న ప్రధానమంత్రి ఏ వుద్యోగాలు గురించి మాట్లాడుతున్నట్టు? వాల్‌మార్ట్, టెస్కో వంటి ఎఫ్‌డిఐ రాకాసుల మొత్తం చరిత్ర అంతా (అమెరికాలో సహా) చెప్పేదేంటంటే వాటిని ఎక్కడ విత్తితే అక్కడల్లా బ్రహ్మాండమైన నిరుద్యోగ, తక్కువ ఉద్యోగిత పంటలనందించాయని. ఒక్క వాల్‌మార్ట్ దుకాణం 13,000 చిన్న చిల్లర దుకాణాల్ని అణగదొక్కేసి, 4,000 ఉద్యోగాలకు ఉద్వాసన పలకగలదు. కొత్తగా వచ్చిన ఒక్కో ఉద్యోగం వెనుకా కనీసం 20 దాకా కోల్పోయిన ఉద్యోగాలు వుంటాయి. భారతదేశం వంటి వెనుకబడిన దేశాల్లో ఒక్క ఉద్యోగానికొచ్చే ఆదాయం మీద కుటుంబంలో ఎంతమంది ఆధారపడి వుంటారు అనేది లెక్కబెడితే వచ్చే చిత్రం ప్రధానమంత్రిగారు చెప్పనట్టు అందంగా వుండదు, రక్తసిక్తంగా వుంటుంది. ఆ కొత్తగా వచ్చే ఉద్యోగాలు కూడా ఎక్కువ శాతం తక్కువ జీతాలు గల, గ్యారంటీ లేని, ఒళ్లు విరగ్గొట్టుకునే తాత్కాలిక ఉద్యోగాలుగా, పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను, హక్కులను ఉల్లంఘించేవిగా వుంటాయి. యూరోప్‌లోనూ, అమెరికా సహా ఇతర సామ్రాజ్యవాద దేశాల్లోనూ ప్రభుత్వాధినేతలందరూ నిరుద్యోగ భూతాన్నీ, దాన్ని వెన్నంటి తమ ఆర్థిక విధానాలకు  వ్యతిరేకంగా తీవ్రమవుతున్న నిరసనలను ఎలా సంబాళించాలో అర్థం కాక తలకాయలు పట్టుకుని వున్నారు. మరి మన దేశంలో వాలుతున్న ఈ బహుళజాతి రాబందులన్నీ ఆ దేశాల్లో పుట్టి పెరిగినవే. తమ దేశాల్లో ఉద్యోగాలను కల్పించడంలో ఘోరంగా విఫలమైన వీరు మన మీద ఉద్యోగాల వర్షాన్ని ఎలా కురిపిస్తారట? ఒబామా తన మందీ మార్బలంతో మన దేశానికి వ్యాపార ఒప్పందాలు చేసుకోవడానికి వచ్చి, అమెరికా పౌరులకు మరిన్ని ఉద్యోగాలను కల్పించానని గొప్పలు చెప్పుకుంటూ తిరిగి వెళ్లడాన్ని మనం మర్చిపోయామని భావిస్తున్నారా అబద్ధాల

గురువు అయిన ప్రధానమంత్రిగారు? తన దేశంలోనే ఉద్యోగాలు కురిపించగల బహుళజాతి ఉద్దండసంస్థలైన వాల్‌మార్ట్‌లను, టెస్కోలను, కారేఫోర్‌లను, మెట్రోలను కలిగి వున్న ఒబామాగారు తన పౌరులకు ఉద్యోగాల కోసం ప్రపంచ యాత్రలు ఎందుకు చేస్తున్నట్లో? 'మనల్ని కష్టకాలాల్నించి బైటకి తేవడానికి' గుత్త రాకాసులను ఆహ్వానించేకంటే ముందు అమెరికాలో ఎన్ని బెయిలౌట్లు ప్రకటించినా ఇలాంటి గుత్త రాకాసులే ఒకదాని వెంబడి ఒకటిగా కుప్పకూలడాన్ని ఆపమని ప్రధానమంత్రి తన యజమానులను అడక్కోడదూ?

దళారులను లేకుండా చేయడం ద్వారా ఎఫ్‌డి రైతాంగానికి లాభాలు చేకూరుస్తుందని ప్రధానమంత్రి అనడం ఒక క్రూర పరిహాసం. ఏం ఉత్పత్తి చేయాలి, ఏ విత్తనాలు వాడాలి, ఏ పురుగుమందులు, ఎరువులు వాడాలి, అంటే ఒక్క మాటలో ఉత్పత్తికి సంబంధించిన ప్రతి ఒక్క అంశాన్నీ ఈ రిటైల్ రాకాసులే నిర్ణయించడమే కాకుండా, ఒకసారంటూ మార్కెట్ మీద పైచేయి సాధించాక అవి రైతులకొచ్చే లాభాల్లో విపరీతంగా కోత విధిస్తాయి. వారు రైతాంగాన్ని ఒకే రకమైన పంటనే వేయాలని ఒత్తిడి చేస్తారు, దానివల్ల రైతాంగం జీవనోపాధి దెబ్బ తింటుంది, వారిక విపరీతమైన ధరలకు ప్రతి వస్తువునూ కొనుక్కోవడానికి నెట్టబడతారు. మరోవైపు భూసారం దెబ్బ తిని పర్యావరణానికి ఎనలేని హాని జరుగుతుంది. అంతిమ ఫలితంగాసేద్యం రోజురోజుకూ భారంగా మారడంతో ఈ రాకాసుల డిమాండ్లను నెరవేర్చలేని దుస్థితికి చిన్న, మధ్యతరగతి రైతులు నెట్టబడతారు. వారు కార్పొరేట్ సేద్యానికి తమ భూముల్ని అమ్ముకుని బికారులుగా మారిపోవాల్సి వస్తుంది. మన దేశంలో ఇప్పటికే భయానకంగా పెరిగిన వ్యవసాయ సంక్షోభాన్ని ఇది మరింతగా పెంచి రైతాంగంలో మరిన్ని ఆత్మహత్యలకూ, అశాంతికీ ఇది దారి తీస్తుంది. ఎఫ్‌డిఐ దుకాణాలు స్థానిక ఉత్పత్తులను 30 శాతం కొనాలని పెట్టిన షరతు కూడా ఒక బూటకం. ఎందుకంటే ఈ దుకాణాలు ఏం కొంటున్నాయి, ఏం అమ్ముతున్నాయి అనేదాన్ని పరిశీలించి అదుపు చేయగల ఎటువంటి వ్యవస్థ మన దేశంలో లేదు. భవిష్యత్తులో ఇటువంటివి ఏర్పడకుండా ముడుపులు చూసుకుంటాయి. లేదా డబ్ల్యుటివో వంటి సర్వాధికార సంస్థలు వాటిని ఎలా వుల్లంఘించాలి లేదా నిబంధనలకు మినహాయింపులు ఎలా సృష్టించాలి అనే విషయాలన్నీ చూసుకుంటాయి.

అయితే, ప్రధానమంత్రి ఒక విషయంలో మాత్రం సత్యం పలికారు. ఉత్పత్తిదారుకీ, వినియోగదారుకీ మధ్యన వుండే బ్రహ్మాండమైన, సంక్లిష్టమైన గొలుసులో భాగంగా వుండి జీవనోపాధిని పొందిన లేదా కొన్ని లాభాలు చేసుకున్న లక్షలాది చిన్న, పెద్ద దళారులను ఇది లేకుండా చేస్తుంది. వారిని దళారులు అన్నా మరో పేరు పెట్టినా, ఉత్పత్తిదారుల నుండి వినియోగదారులకు సరుకులను చేరవేసే ఒక సంక్లిష్టమైన క్రమానికి అసంఖ్యాకంగా

మనుషులు అవసరమౌతారు. మరిప్పుడు ఆ స్థానాన్ని ఎవరు భర్తీ చేస్తారు, వారు కోల్పోయిన 'లాభాలు' ఇప్పుడు ఎవరి జేబులోకి పోతాయి అనేది ప్రశ్న. కచ్చితంగా రైతులు కారు. వినియోగదారులు కూడా కారు ఎందుకంటే వారు ఏం సరుకులు వాడాలి (తినాలి, తాగాలి, తొడుక్కోవాలి, వినాలి, చూడాలి మొదలైన అన్నీ) బహుళజాతి సంస్థలే నిర్ణయించడంతో పాటు ఒకసారంటూ మార్కెట్‌ను కబళించాక ఎఫ్‌డిఐ రాకాసులు విపరీతంగా సరుకుల ధరలను పెంచేస్తాయి. (అసలు ఇప్పుడు కూడా ప్రపంచవ్యాప్తంగా ఎక్కడా కూడా వీరి దుకాణాల్లో ధరలు తక్కువగా ఏం లేవనేది రుజువులు గల వాస్తవం). లాభపడేది పార్లమెంటులోనూ, అసెంబ్లీలలోనూ కూర్చుని త్వరత్వరగా సరుకులను అమ్ముకుని పోవాలనుకునే వ్యాపారస్తుల్లా దేశాన్ని పల్లీలకు అమ్మేసి ముడుపుల్ని జేబుల్లో కుక్కుకోవాలనుకుంటున్న పెద్ద దళారులు. దేశం లోపల అతి పెద్ద లాభాలు దొరికేది ఇప్పటికే రిటైల్ రంగంలో, ఇతర ప్రైవేట్ సంస్థల్లో బహుళజాతి కంపెనీలతో తమ పెట్టుబడులను ముడివేసి పెట్టుకున్న దళారీ నిరంకుశ బూర్జువాలకు. ప్రపంచం అంతా గుత్తసంస్థల దారిన పోతున్నప్పుడు దళారీతనాన్ని కూడా ఈ బందిపోట్లకు గుత్తకిచ్చి చిల్లర దొంగల్నీ, జేబులు కొట్టేవాళ్లనీ ఏరిపారేస్తే పోలా? ఎంత కాదనుకున్నా, అమెరికావారి సౌజన్యంతో భారతదేశం సూపర్ పవర్‌గా మారే మార్గంలో దూసుకుపోతోంది కదా?

తన అమెరికా యజమానులచే ఇలాంటి 'ఆర్థిక సంస్కరణ'లను 'భేషుగ్గా' 'నమ్రత'గా అమలు చేయడం కోసమే తిరిగి తన పాత ఉద్యోగంలోకి తీసుకురాబడ్డాడని మనం సులభంగా అర్థం చేసుకోగల ఆర్థిక మంత్రి చిదంబరం ప్రభుత్వ పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా 30,000 కోట్లను కచ్చితంగా సంపాదిస్తాననీ, తద్వారా ఎఫ్‌డిఐని తేవడం ద్వారా మట్టుబెట్టాల్సిన మహమ్మారిగా ప్రధానమంత్రి చిత్రీకరిస్తున్న బడ్జెట్ లోటును అరికడతానని ఆత్మవిశ్వాసం ప్రకటించాడు. 30,000 కోట్లే ఎందుకు? ఇంకొంచెం **పెద్దగా** ఆలోచిద్దాం. మన గౌరవనీయులైన మంత్రుల వృత్తిపరమైన నిపుణత గల చేతుల్లో వేల కోట్ల రూపాయల లాభాల్ని గడిస్తూ అత్యంత లాభదాయకమైన ప్రభుత్వరంగ పరిశ్రమగా పరిఢవిల్లుతున్న కుంభకోణాల పరిశ్రమల నుండి పెట్టుబడుల్ని ఉపసంహరిస్తే ఎలా వుంటుంది? లేదా పోనీ ఒకసారికి ఐపిఎల్ సీజన్‌ని రద్దు చేయడం గానీ? సరే, మన భారతవాసులం అల్ప సంతోషులం కనుక, కేవలం ఒక్క 2జి కుంభకోణం నుండి ఉపసంహరించుకుంటే (1,75,00 కోట్ల రూపాయలు) లేదా దానికంటే కొంచెం పెద్దదైన, ఇటీవలి బొగ్గు బ్లాకుల కేటాయింపు కుంభకోణాన్ని ఒకదాని నుండి (2 లక్షల కోట్ల రూపాయలు)? (ఒక అంచాన ప్రకారం) విదేశీ బ్యాంకుల్లో మూలుగుతున్న 80 లక్షల కోట్ల రూపాయలను మొత్తంగా కాకున్నా కనీసం నాలుగో వంతునైనా వెనక్కి తెచ్చుకోవడం ఎలా వుంటుంది? లేదా శాశ్వతంగా

కాకున్నా కనీసం ఒక్క సంవత్సరం పాటు మైనింగ్ కింగ్‌లైన గాలి సోదరులవో, జగన్మోహనుడివో లాభాలను స్వాధీనం చేసుకుంటే 'ఈ మహత్తర దేశానికి ప్రధానమంత్రి'గా సింగ్‌గారు మనకు ఆరోగ్యం, విద్య, గూడు, ఉద్యోగాలు లాంటివన్నీ ఇవ్వగల్గుతారు కదా పాపం, అప్పుడు ఇందుకోసం వారు మనల్ని మింగమంటున్న ఈ ఎఫ్‌డిఐ గరళాన్ని మింగకుండా తప్పుకోగల్గుతాం కదా? పోనీ మన దేశంలో జిందల్, మిట్టల్ వంటి దళారీ నిరంకుశ బూర్జువాలను కనీసం రెండు సంవత్సరాలపాటు తమ భవనాల్లో రోజుకొకటి చొప్పున వంటగ్యాస్ సిలిండర్లను వాడకుండా నెలకు రెండు మాత్రమే వాడమని నిబంధన పెడితే ప్రస్తుతం మనం ఎదుర్కొంటున్న 'సిలిండర్ల సంక్షోభానికి' పరిష్కారం దొరుకుతుందేమో? లేదా ఆంటిల్లా లాంటి చూస్తే కళ్లొకొచ్చే భయానక కట్టడాలపై అనుత్పాదకంగా కోట్లు తగలెయ్యకోడదు అని నిషేధం పెట్టేసి ఆ నిధులన్నిటినీ ఎఫ్‌డిఐ సర్వరోగనివారిణి ద్వారానే కట్టగలం అని ప్రధానమంత్రి నమ్మబలుకుతున్న గొడౌన్లు, కోల్డు స్టోరేజి సౌకర్యాలు వగైరా వగైరాలను నిర్మించడానికి మళ్లిస్తే ఎలా వుంటుంది?

మన ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న కష్టకాలాల్ని అధిగమించడానికి ఎఫ్‌డిఐని తేవడం అవసరం అనీ, భారతదేశాన్ని విదేశీ మదుపులకు ఆకర్షణీయమైన గమ్యంగా మార్చడం 'జాతి ప్రయోజనాలను' నెరవేరుస్తుందనీ ప్రధానమంత్రి అంటున్నాడు. ప్రపంచంలోనే సంపద్వంతమైన అనేక సహజ వనరులకు నిలయం, ప్రపంచంలోనే అతి పెద్ద మానవ వనరులు, వాటి అభివృద్ధికి అపారమైన అవకాశాలు గల రెండవ దేశం అయిన మన ప్రియమైన భారతదేశానికి ఎఫ్‌డిఐ అవసరమేమున్నదసలు? ఈ వనరులన్నిటినీ బడా భూస్వాముల, దళారీ నిరంకుశ బూర్జువాల, వారి సామ్రాజ్యవాద యజమానుల ఇనుప కౌగిలి నుండి, దోపిడీ నుండి విడుదల చేసి, ఈ దేశ ప్రజలకు వాటిని దేశ అభివృద్ధి కోసం వినియోగించే అవకాశాన్ని కల్పించగల్గితే ఏ లోటు బడ్జెట్లూ వుండవు, కష్టకాలాలూ వుండవు.

ఇప్పుడు కావాల్సింది ప్రభుత్వ పెట్టుబడుల ఉపసంహరణ కాదు, భారత పాలకవర్గాల ప్రతినిధులుగా పార్లమెంటులో అక్రమంగా అధికారంలో కూర్చున్న (ఎందుకంటే వీరికి మొత్తం ప్రజల నుండి పావువంతు ఓట్లు కూడా లేవు, అందుకని వీరికి కోట్లాది ప్రజల జీవితాల్ని నిర్ణయించే నైతిక హక్కు, అధికారం అసలే లేవు) ఈ బందిపోట్ల నుండి 110 కోట్ల పైగా వున్న మన దేశప్రజల (వీరిలో అత్యధిక మెజారిటీ కార్మికులు, పేద రైతులు, పట్టణ శ్రామికులు, మధ్యతరగతి ప్రజలే) భవితవ్యాన్ని అత్యంత వినాశకరంగా ప్రభావితం చేసే నిర్ణయాలను తీసుకునే అధికారాల ఉపసంహరణ.

2008 నుండి తమను చుట్టుముట్టి ఊపిరాడకుండా చేస్తున్న ఆర్థిక సంక్షోభం నుండి

బయటపడ్డానికి సామ్రాజ్యవాదులకు మన దేశంలోని సంపద్వంతమైన వనరులు కావాలే తప్ప మన కష్టకాలాల నుండి బయటపడ్డానికి మనకు విదేశీ పెట్టుబడుల అవసరం లేదు.

మన కష్టకాలాలన్నీ బడా భూస్వాముల, దళారీ నిరంకుశ బూర్జువాల దోపిడీ వల్లా, ఈ పాలకవర్గాలు మన దేశ సార్వభౌమత్వాన్ని సామ్రాజ్యవాదుల పాదాక్రాంతం చేసి వారికి మనల్ని నిలువు దోపిడీ చేసే అధికారాన్ని ఇవ్వడం వల్లే తప్ప మన దేశం ఎఫ్‌డిఐకి ఆకర్షణీయమైన గమ్యంగా వుండకపోవడం వల్ల కానేకాదు.

ప్రియమైన ప్రజలారా! ప్రజాస్వామికవాదులారా, దేశభక్తులారా!

ఎఫ్‌డిఐని తీసుకురావడం కోసం సోనియా -మన్మోహన్- ప్రణబ్- చిదంబరం- అహ్లువాలియా-రంగరాజన్ ముఠా చేస్తున్న తలకిందులు వాదనలన్నిటినీ నిర్ద్వంద్వంగా తిప్పికొడుతూ ఎండగట్టండి. రిటైల్ తదితర రంగాల్లోకి ఎఫ్‌డిఐని అనుమతించే నిర్ణయాన్ని తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేయండి. తమ రాష్ట్రాల్లో చాలా కాలం ముందు నుండే ఎఫ్‌డిఐ ప్రవేశానికి మంతనాల్లో మునిగి వున్న అధికశాతం ప్రతిపక్షాల నామమాత్రమైన, బూటకమైన నిరసనలను బహిర్గతం చేయండి. రిటైల్ రంగంలోకి ఎఫ్‌డిఐని తీసుకొచ్చే నిర్ణయం ఏదో మామూలు నిర్ణయం కాదు. దేశంలోని అత్యధిక మెజారిటీ ప్రజల జీవితాలను అత్యంత అననుకూలంగా ప్రభావితం చేయగల ప్రభుత్వ అతి పెద్ద ఏకైక నయా ఉదారవాద ఆర్థిక నిర్ణయంగా యిది మారచ్చు. దీనిని అనుమతిస్తే ఇప్పటికే నయా వలసవాద దోపిడీ, లూటీ, అదుపులో గొంతులోతు కూరుకుపోయిన మన దేశం అతి వేగంగా ఒక బానిస దేశంగా మారిపోవడానికి దారి తీస్తుంది. మన జీవితంలో గానీ, ఏ రంగంలో గానీ ఇది ప్రభావితం చేయని అంశం ఒక్కటి కూడా వుండదు, ఎందుకంటే అవన్నీ నానాటికీ మరింతగా మార్కెట్‌తో ముడివేయబడ్తూ పోతున్నాయి. ఈ నిర్ణయం మన దేశానికి, మనకు ఎంత ముప్పుగా పరిణమిస్తుందో గుర్తించి దానికి వ్యతిరేకంగా సర్వశక్తులనూ ఒడ్డి పోరాడండి. నిజమైన దేశభక్తులు ఉవ్వెత్తున పైకి లేచి సామ్రాజ్యవాద దోపిడీదారుల చేతుల్నుండి మన దేశ సార్వభౌమత్వాన్ని కాపాడుకోవడానికి బరి గీసి నిలబడాలి.

**అభయ్**

**అధికార ప్రతినిధి**

**కేంద్ర కమిటీ**

**సీపీఐ (మావోయిస్టు)**

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# కేంద్ర కమిటీ

**30-9-2012**

## సత్యమూర్తిని ఎలా అంచనా వేయాలి?

భారత నూతన ప్రజాస్వామిక విప్లవోద్యమ చరిత్ర పుటల్లో ముందు అభ్యుదయకర, తర్వాతి కాలంలో విప్లవకర, చివరి దశలో విప్లవ విచ్ఛిన్నకర పాత్ర నిర్వహించిన కంభం జ్ఞాన సత్యమూర్తి ఏప్రిల్ 17, 2012న 81వ ఏట మరణించాడు. ఆయన మరణంపై చాలా మంది తమ తమ ప్రాపంచిక దృక్పథం, వర్గప్రయోజనానికి అనుగుణంగా వివిధ రకాలుగా స్పందిస్తూ వ్యాఖ్యానించారు. శివసాగరుడిగా, నటరాజుగా, శివుడుగా, ఆయన చేసిన విప్లవ కాల్పనిక, దళిత ఉద్యమ సాహితీకృషిని కొందరు కొనియాడారు, మరికొందరు ఆయనను విప్లవ నాయకుడిగా, కులవర్గ విప్లవ నాయకుడిగా, దీన దళిత జన బాంధవుడిగా, బహుజన ఉ ద్ధారకుడిగా ఆకాశానికెత్తారు. ఆయన దళిత ఉద్యమంలో, సాహితీ రంగంలో చేసిన కృషిని పొగిడిన వాళ్లల్లో చాలా మంది మా పార్టీపై అవాస్తవాలతో, వక్రీకరణలతో కూడిన నిజాయితీ లేని నిందారోపణలు చేస్తూ ఆయన విప్లవ జీవితానంతర (చివరి దశ) నిజ స్వభావాన్ని, విప్లవ విచ్ఛిన్నకర పాత్రను మాత్రం వుద్దేశపూర్వకంగానే దాటవేశారు. లేదా మరుగుపర్చారు. విప్లవ నాయకుడిగా, విప్లవ కవిగా, దళిత ఉద్యమ నాయకుడిగా-కవిగా ఆయన చేసిన కృషిని ఎత్తిపట్టిన వారిలో కొంతమంది, ఆయన చివరి దశలో గత పాతికేళ్ల కాలంలో విప్లవోద్యమం పట్ల తీసుకొన్న వ్యతిరేక వైఖరి గురించీ, కొనసాగించిన విచ్ఛిన్నకర అవకాశవాద కార్యకలాపాల గురించి స్పష్టంగా వ్యాఖ్యానించలేదు లేదా మౌనం వహించారు. ఈ నేపథ్యంలో మేం ఆలస్యంగానైనా ఈ ప్రకటన చేయాల్సి వస్తోంది.

ఆయన సుదీర్ఘ జీవితంలో ముందు సుమారు దశాబ్దకాలం కమ్యూనిస్టు అభిమానిగా విద్యార్థి, యువజన, సాంస్కృతిక రంగాలలో అభ్యుదయకర పాత్రని నిర్వహించాడు. నక్సల్బరీ తర్వాత మార్క్సిస్టు-లెనినిస్టు కార్యకర్తగా విప్లవోద్యమంతో పాటు ముందుకు సాగుతూ పార్టీ నాయకుల్లో ఒకరుగా దాదాపు రెండు దశాబ్దాలు పనిచేశాడు. ఇంచుమించు రెండున్నర దశాబ్దాల కాలం విప్లవ విచ్ఛిన్నకర కార్యకలాపాలుకొనసాగించాడు. ఇలాంటప్పుడు మనం సత్యమూర్తిని

ఎలా అంచనా వేయాలి?

**తొలి దశ లేదా విప్లవ పూర్వ దశ –** కె.జి. సత్యమూర్తి కృష్ణా జిల్లాలో ఒక దళిత మధ్యతరగతి కుటుంబంలో 1931లో పుట్టాడు. ఎం.ఏ. వరకు చదువుకున్నాడు. విద్యార్థి దశలోనే కమ్యూనిస్టు రాజకీయాలతో ప్రభావితుడై స్టూడెంట్ ఫెడరేషన్ కార్యకలాపాలలో చురుకుగా పాల్గొన్నాడు. విద్యాభ్యాసం ముగిసిన తర్వాత ఆయన విద్యార్థి, యువజన, సాహిత్య రంగాల్లో పనిచేస్తూ. కమ్యూనిస్టు పార్టీలో చేరాడు. పార్టీ దినపత్రిక 'విశాలాంధ్ర', విద్యార్థి యువజనోద్యమ పత్రిక 'యువజన'లలో పనిచేశాడు. కమ్యూనిస్టు పార్టీ సాంస్కృతిక ప్రదర్శనలలో పాల్గొన్నాడు. పాటలు రాశాడు. ఈ కాలమంతా ఆయన ప్రభావశీలమైన కవీ, రచయితా. ఆయన పనిచేసిన వివిధ రంగాల్లో ప్రభావవంతమైన పాత్ర నిర్వహించిన మేధావి. 1964లో ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ చీలికకు గురైనప్పుడు మార్క్సిస్టు పార్టీలో కొద్దికాలం కొనసాగినప్పటికీ దానిపట్ల ఆయనకెలాంటి నమ్మకం లేదు.

**రెండవ దశ లేదా విప్లవ దశ –** ఈ దశ నక్సల్బరీ విప్లవ రైతాంగ వెల్లువ పెల్లుబికిన తర్వాత మొదలై 80ల మధ్య వరకు కొనసాగింది. 1960ల మధ్యలోనే కాజీపేటలోని సెయింట్ గాబ్రియల్స్ హైస్కూల్‌లో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నప్పుడు కొండపల్లితో కలిసి విద్యార్థి-యువజన-ఉపాధ్యాయ-కార్మిక ఉద్యమాల్లో నిర్వహించిన పాత్ర ఎంతో ప్రశంసనీయమైనది. నక్సల్బరీ రాజకీయాలతో ప్రభావితులైన వీరిరువురు రీజినల్ ఇంజనీరింగ్ కళాశాలతో పాటు వివిధ విద్యార్థి సంస్థల్లో, కార్మికుల్లో క్రియాశీల శక్తుల్ని తయారు చేసుకుంటూ వరంగల్ జిల్లా రైతాంగంలో కూడా క్రియాశీల కార్యకర్తలను సంపాదించుకున్నాడు. అనతికాలంలో కామ్రేడ్ చారు మజుందార్ తదితర బెంగాల్ నాయకత్వంతో సంబంధాలు ఏర్పరచుకున్నాడు. నక్సల్బరీతో పాటు అప్పటికే ఆరంభమైన శ్రీకాకుళ విప్లవ సాయుధ రైతాంగ ఉద్యమం లాంటి ఉద్యమాలను వరంగల్, ఆదిలాబాద్, కరీంనగర్, ఖమ్మం తదితర జిల్లాల్లో నిర్మించాలనే లక్ష్యంతో కొండపల్లితో కలిసి సత్యమూర్తి తన ప్రయత్నాలను ముమ్మరం చేశాడు. ఇదే క్రమంలో 1969లో కామ్రేడ్ చారు మజుందార్ నేతృత్వంలో గుత్తికొండ బిలంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాయకత్వ కామ్రేడ్స్‌తో జరిగిన సమావేశంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీ సభ్యుడిగా ఎన్నికైనాడు. 1970 ఆరంభంలో జరిగిన పార్టీ రాష్ట్ర 11వ మహాసభలో రాష్ట్రకమిటీ సభ్యునిగా ఎన్నికైనాడు. తెలంగాణా రీజినల్ కమిటీ సభ్యునిగా ఆయన ఖమ్మంలో కొంతకాలం దళాలకు నేతృత్వం వహించాడు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రారంభమైన విప్లవ సాహితీ సాంస్కృతిక ప్రజాసంఘాల నిర్మాణ కృషిలో

ఆయన చురుగ్గా పాల్గొన్నాడు. 1972లో కామ్రేడ్ చారు మజుందార్‌ను కలవడానికి వెళ్లిన ఆంధ్రప్రదేశ్ పార్టీ ప్రతినిధి వర్గంలో కె.జి.సత్యమూర్తి ఒకరు. పార్టీ అత్యంత సంక్లిష్ట పరిస్థితిని ఎదుర్కొంటున్న సమయంలో, 1972 నవంబర్‌లో ఖమ్మంలో అరెస్టయి ఐదేళ్లకు పైగా జైలులో గడిపాడు. నక్సల్బరీ, శ్రీకాకుళ వుద్యమాల కాలంలో పార్టీ చేపట్టిన అతివాద ఎత్తుగడల వల్ల, ఈ ఉద్యమాలపై దేశవ్యాప్తంగా పాలకవర్గాలు కొనసాగించిన ఫాసిస్టు దమనకాండ వల్ల, పార్టీలో ప్రమాదకర స్థాయిలో ముందుకు వచ్చిన మితవాద అవకాశవాద కార్యకలాపాల వల్ల సెట్‌బ్యాక్‌కి గురైన వుద్యమాన్ని బయటకు తేవడానికి తీవ్రంగా కృషి చేసిన కొండపల్లి సీతారామయ్యను జైల్లో వుండి కూడా బలపరిచాడు (అప్పుడు ఆయన జైల్లో ఉన్నాడు). అలాగే ఈ కాలంలో బయట కొండపల్లి పార్టీనీ, ఉద్యమాన్నీ ప్రజాపంథాపై ఆధారపడి పునర్నిర్మాణం చేయడానికి చేసిన ప్రయత్నాలను బలపరిచాడు.

ఆయన 1978లో జైలు నుండి విడుదలైన తర్వాత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రకమిటీ సభ్యునిగా తిరిగి విప్లవోద్యమానికి నాయకత్వాన్నందించాడు. పార్టీ ప్రజాపంథాను చేపట్టిన తర్వాత పెల్లుబికిన జగిత్యాల-సిరిసిల్ల, కరీంనగర్-ఆదిలాబాద్ విప్లవ రైతాంగ ఉద్యమాలు క్రమంగా రాష్ట్రవ్యాపిత రైతాంగ ఉద్యమాలుగా, అక్కడక్కడ పునరారంభమైన విద్యార్థి, యువజన, సాహితీ-సాంస్కృతిక, కార్మిక ఉద్యమాలు చాలా వేగంగా రాష్ట్రవ్యాప్త ఉద్యమాలుగా అభివృద్ధి చెందడంలో సత్యమూర్తి ప్రముఖ భూమిక పోషించాడు. ఆయన ఆంధ్రప్రదేశ్ పార్టీ రాష్ట్ర నాయకత్వంలో భాగంగా సోదర విప్లవ పార్టీల గ్రూపులతో జరిగిన ఐక్యతా చర్చల్లో పార్టీ ప్రతినిధిగా పాల్గొన్నాడు. సి.పి.ఐ. (ఎం.ఎల్.) (పీపుల్స్‌వార్) ఏర్పాటుతో పాటు, పార్టీ కేంద్రకమిటీ సభ్యునిగా ప్రముఖ పాత్ర పోషించాడు. ఆంధ్రప్రదేశ్‌లో విప్లవోద్యమం పురోగమిస్తున్న తరుణంలో సి.పి.ఐ. (ఎం.ఎల్.) (పీపుల్స్‌వార్) ప్రధాన కార్యదర్శి కొండపల్లి సీతారామయ్య 1982 జనవరి 2న అరెస్టయిన తర్వాత సత్యమూర్తి పార్టీ ప్రధాన కార్యదర్శి బాధ్యతలు చేపట్టాడు. ఒక అణగారిన సామాజిక నేపథ్యం నుండి వచ్చిన సత్యమూర్తి ఈ విధంగా భారత విప్లవోద్యమ చరిత్రలో ఆనాడు అత్యంత కీలకమైన నాయకత్వ బాధ్యతలు నిర్వహిస్తూ పార్టీ శ్రేణుల్లో, విప్లవ ప్రజల్లోవుత్తేజాన్ని నింపాడు.

విద్యార్థి దశనుంచే సాహితీ-సాంస్కృతిక రంగంలో విశేష ప్రతిభ కనబరిచిన నేపథ్యం గల సత్యమూర్తి నక్సల్బరీ రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత కొనసాగించిన విప్లవ రాజకీయ కార్యాచరణ, దానితో పెనవేసుకు పోయిన సాహితీ కృషీ ఆయనను గొప్ప కవిగా మలిచాయి. శివసాగర్

పేరుతో ఆయన రాసిన కవితలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాహితీరంగంలో ఆనాటి యువతరాన్ని గొప్పగా ప్రభావితం చేశాయి. ఆయన తెలుగు సాహితీ రంగాన్ని పెద్దపెట్టున ఒక కుదుపు కుదిపి నూతన ఒరవడిని సృష్టించిన మేటి విప్లవకవి. ఆనాటి మేటి విప్లవ కవులలో ఆయన అగ్రగణ్యుడుగా గణుతికెక్కాడు.

అయితే పార్టీ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన సత్యమూర్తి పార్టీకీ, విప్లవోద్యమానికీ సమర్థవంతమైన నాయకత్వాన్ని అందించడంలో ఘోరంగా విఫలమైనాడు. 1982-85 మధ్య కాలంలో పార్టీ ప్రధాన కార్యదర్శి బాధ్యతల్లో వున్న సత్యమూర్తి పార్టీ శ్రేణుల విశ్వాసం చూరగొనలేకపోయాడు. ఆయన జీవితంలో ఎక్కువ సమయం ప్రచార రంగంలో పని చేయడం, పార్టీ కమిటీలకు, ప్రత్యేకంగా ఉన్నత కమిటీలకు ప్రత్యక్షంగా నేతృత్వం వహించిన అనుభవం లేకపోవడం, సిద్ధాంతాన్ని ఆచరణకు సృజనాత్మకంగా అన్వయించడంలో విఫలం కావడం వలన ఆ రోజు విప్లవోద్యమానికి, రాష్ట్ర, కేంద్ర కమిటీలకు సరిగా సారథ్యం వహించలేకపోయాడు. తన లోపాలను, పరిమితులను హుందాగా అంగీకరించి, ఆచరణ నుండి నేర్చుకొంటూ వుద్యమానికి సమిష్టిగా నేతృత్వం వహించడానికి కృషి చేయలేదు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రకమిటీలో తలెత్తిన ఆరు కార్మికవర్గేతర చెడులు తనలోనూ తలెత్తాయి. 1984 జనవరిలో కొండపల్లి జైలు నుండి విడుదలై వచ్చిన తర్వాత ఆయన ఈ చెడు ధోరణులను సరిదిద్దటానికి చేసిన ప్రయత్నాలను సత్యమూర్తి మనస్ఫూర్తిగా బలపరచలేదు. అందుకు బదులుగా ఆయన ఫాల్స్ ప్రిస్టేజీతో పదవీ వ్యామోహంతో కుట్రలు, కుహకాలకు పాల్పడుతూ కేంద్రకమిటీలోనూ, పార్టీలోనూ ముఠాలు కట్టి పార్టీని చీల్చడానికి ప్రయత్నించాడు. ఈ ప్రమాదాన్ని పసిగట్టిన కేంద్ర, రాష్ట్రకమిటీల కామ్రేడ్స్, పార్టీ శ్రేణులు సంబంధిత వేదికల్లో ఆయనపై, ఆయనతో కలిసి ముఠాగా వ్యవహరించిన మరో ముగ్గురు కేంద్రకమిటీ సభ్యులపై తీవ్రమైన విమర్శలు చేసినప్పటికీ వీరు తమ తప్పులను గుర్తించి ఆత్మవిమర్శ చేసుకోలేదు. పైగా వీరు “రెండు పంథాల మధ్య పోరాటం” పేరుతో పార్టీని మితవాద ప్రమాదం నుండి రక్షించాలనే నెపంతో విప్లవ పదజాలాన్ని గుప్పిస్తూ తమ విచ్ఛిన్నకర, లిక్విడేషనిస్టు కార్యకలాపాలను, కుట్రలను మరింత తీవ్రతరం చేశారు. ఈ సమయానికల్లా ఆంధ్రప్రదేశ్‌లో మా పార్టీ విప్లవోద్యమాన్ని వేగంగా రాష్ట్రం నలుమూలలకూ విస్తరించి అభివృద్ధిపరిచింది. విముక్తి ప్రాంతాల స్థాపనా లక్ష్యంతో దండకారణ్యానికి విస్తరించింది. అక్కడి ఆదివాసులను సంఘటితపరుస్తూ ఆ విప్లవోద్యమాన్ని పురోగమింపజేస్తున్న సమయంలో సత్యమూర్తి ముఠా పార్టీలో ముందుకు తెచ్చిన ఆంతరంగిక, సైద్ధాంతిక, రాజకీయ, నిర్మాణ సంక్షోభం ఆనాటి విప్లవోద్యమానికి

తాత్కాలికంగా చాలా తీవ్రమైన నష్టమే కలిగించింది. కేంద్రకమిటీ ఫంక్షనింగ్ పూర్తిగా స్థంభించి పోయింది. 1985-86లలో జరిగిన ఆంధ్రరాష్ట్ర పార్టీ ప్లీనం, రాష్ట్రకమిటీ సమావేశాల్లో ఆయనను సరిదిద్దటానికి చేసిన ప్రయత్నాలన్నీ విఫలమైనాయి. దీనితో 1987 సెపెంబర్‌లో జరిగిన పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ 13వ మహాసభ ఆయనను పార్టీ నుండి బహిష్కరించింది. ఈ విధంగా తాను తీసుకున్న తప్పుడు సైద్ధాంతిక, రాజకీయ వైఖరులతో, అమలుచేసిన తప్పుడు నిర్మాణ పద్ధతులతో, స్వార్థ ప్రయోజనాలతో విప్లవోద్యమ గమనాన్ని అడ్డుకోవాలని సత్యమూర్తి చేసిన ప్రయత్నాలను పార్టీ, చైతన్యవంతులైన పోరాట ప్రజలు విఫలం చేశారు. సత్యమూర్తి ఈ విధంగా తన విప్లవకర పాత్రను తానే అంతం చేసుకొని విప్లవ విచ్ఛిన్నకర పాత్రలోకి మారాడు. ఈ విధంగా సత్యమూర్తి చరిత్ర చెత్తబుట్టలోకి దొర్లిపోయాడు.

**మూడవ దశ లేదా విప్లవ వ్యతిరేక దశ –** ఈ దశ ఆయన కేంద్రకమిటీలో ముఠాకట్టి పార్టీలో ఆంతరంగిక సంక్షోభం సృష్టించటంతో ప్రారంభమై పార్టీ నుండి బయటకి గెంటి వేయబడినప్పటి నుండి పార్టీ వ్యతిరేక నిర్దిష్టరూపాన్ని సంతరించుకుంది. ఈ కాలమంతా సత్యమూర్తి మా పార్టీ నాయకత్వంలో కొనసాగుతున్న విప్లవోద్యమం పైన, నాయకత్వం పైన అసత్య ఆరోపణలు, అభూత కల్పనలు, కుహనా విమర్శలు ప్రచారం చేయడమే తన ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నాడు. ఆయన పార్టీ నాయకత్వంపై, ఉద్యమంపై చేయని విమర్శలు, మోపని నిందలు, వేయని అభాండాలు, ఆడని అబద్ధాలు, పెట్టని శాపనార్థాలు లేవు. ఒక్క మాటలో చెప్పాలంటే ఆయన శత్రువుతో గొంతు కలిపి పార్టీ నాయకత్వంపై, పార్టీపై, విప్లవోద్యమంపై విషం కక్కాడు. అదే చివరి వరకు చేస్తూ వచ్చాడు. అయితే ఆయన ఇదంతా వివిధ ముసుగుల్లో ఉండి కొనసాగించాడు.

కానీ కొంతమంది దళిత తదితర రచయితలు సత్యమూర్తి మరణంసందర్భాన్ని వినియోగించుకొని మా పార్టీకి వ్యతిరేకంగా, ఆయన్ని ఆకాశానికెత్తుతూ తమకు తోచిందల్లా రాశారు. నిజానికి సమాజంలో తరతరాలుగా తీవ్రమైన దోపిడీ పీడనలకు గురవుతూ, నికృష్టమైన నిచ్చెనమెట్ల కుల వ్యవస్థలో నిత్యం అవమానాల పాలవుతూ, దినమొక గండంగా జీవిస్తున్న దళిత-బహుజనుల విముక్తి కోసం అంటూ సత్యమూర్తి తదితర అవకాశవాదులు అశాస్త్రీయ సిద్ధాంతాలను, వర్గాతీత రాజకీయాలను ముందుకు తెచ్చారు. భారతదేశ సామాజిక విశిష్ట లక్షణమైన కులాన్ని వర్గానికి పోటీ పెడుతూ వీరు వర్గపోరాట రాజకీయాలను నీరుగార్చారు. వీరు వర్గపోరాటానికి, పీడిత సామాజిక సముదాయాలకు ఎనలేని హాని చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో

దాదాపు మూడున్నర దశాబ్దాలుగా తీవ్రమైన వర్గపోరాటాన్ని కొనసాగిస్తూ కుల నిర్మూలన కోసం అనేక త్యాగాలతో సాహసంగా పోరాడుతున్న మా పార్టీ పెంపొందించిన విప్లవోద్యమ ఫలితంగా రాష్ట్రంలోని దళితులు, మహిళలు, ఆదివాసులు, మతమైనారిటీలతో సహా యావత్తు పీడిత ప్రజానీకం ఈ రాష్ట్రం లోనే గాకుండా దేశంలోని చాలా రాష్ట్రాల్లోని వేలాది పల్లెల్లో, అనేక పట్టణాల్లో ఆత్మగౌరవంతో తలెత్తుకొని జీవించగలుగుతున్నారు. కులం పేరుతో కారంచేడు, చుండూరుతదితర పల్లెల్లో అమానుష హత్యలకు పాల్పడిన కరుడుగట్టిన అగ్రకుల దురహంకార భూస్వామ్య శక్తులను కఠినంగా శిక్షించిందీ, దళిత ప్రజలకు కొండంత అండగా నిలిచి వారిని పోరాటపథంలోకి నడిపిందీ, కుల విముక్తి పోరాట స్రవంతిలో వారికి నాయకత్వం అందించిందీ, ఆ పోరాటంలో భాగం చేసిందీ ప్రధానంగా మా పార్టేగానీ సత్యమూర్తి కాదూ, ఆయనను ఈనాడు ఆకాశానికెత్తుతున్న ఏ కుహనా నాయకుడూ కాదు.

మా పార్టీ నుండి బహిష్కృతుడైన తర్వాత సత్యమూర్తి తన స్వార్థ ప్రయోజనాల కోసం ఎన్ని నీచమైన సైద్ధాంతిక రాజకీయ అవకాశవాద కసరత్తులు చేశాడో, ఎన్ని రాజకీయ పార్టీలు మారాడో, లేదా వాటి నుండి బహిష్కృతుడైనాడో ఎన్ని జెండాలు మార్చాడో తెలుగు ప్రజలకు, ప్రత్యేకంగా విప్లవ రాజకీయాలతో అంతో ఇంతో పరిచయం ఉన్న వారందరికీ తెలియంది కాదు. కొండపల్లి నేతృత్వంలోని పీపుల్స్‌వార్ పార్టీది మితవాద ఎత్తుగడల పంథా అని విమర్శించి, తనదే అసలు సిసలైన ఎత్తుగడల పంథా అని చాటుకున్న ఆయన రెండేండ్లు తిరగకుండానే తమిళనాడు, మహారాష్ట్రల్లో తన సహచరులకు ఎందుకు ముఖం చూపించలేక పోయాడు? భారత విప్లవోద్యమానికి సరైన పంథాను రూపొందించామని ప్రకటించుకున్న సత్యమూర్తి తదితర మార్క్సిస్టు-లెనినిస్టు కేంద్రం (ఎం.ఎల్.సి.) నాయకుల పంథా అపసవ్యమైనదీ, పస లేనిది కాకపోతే, విప్లవ విచ్ఛిన్నకర పాత్ర నిర్వహించేది కాకపోతే పురిటిలోనే ఎందుకు సంధి కొట్టుకు పోయింది? విప్లవ సిద్ధాంతానికి, రాజకీయాలకు వీడ్కోలు పలికిన తర్వాత ఆయన బహుజనోద్ధరణకంటూ బహుజన సమాజ్ పార్టీలో చేరి తాను ఏమేరకు బహుజనులను ఉద్ధరించాడు? అవకాశవాదిగా, స్వార్థపరుడిగా మారి మార్క్సిజం-లెనినిజం-మావోయిజానికి, సి.పి.ఐ.(ఎం.ఎల్.) (పీపుల్స్‌వార్)కు దూరమైన తర్వాత పాతికేండ్ల సుదీర్ఘ జీవితంలో ఆయన దళిత-బహుజన ప్రజల విముక్తి కోసం క్రియాశీలంగా కొనసాగించిన కార్యాచరణగానీ, నిర్మాణాత్మకంగా చేసిన కృషిగానీ, నిర్మించిన సమరశీల ఉద్యమంగానీ ఏమిటనేది చైతన్యవంతులైన ఆంధ్రప్రదేశ్ పోరాట ప్రజల్లో తెలియందెవరికి? ఆయన తాను నిర్మించానని చెప్పుకున్న దళిత-బహుజన ఉద్యమాన్ని తానే స్వయంగా బూర్జువా పార్లమెంటరీ రాజకీయాల్లోకి

దిగజార్చివేసిన తర్వాత అది ఎలా బూర్జువా దళిత ఉద్యమ ప్రవంతిలో భాగం కాకుండా పోతుంది? ఆయన వివిధ సమయాల్లో పరస్పర విరుద్ధంగా తీసుకున్న సైద్ధాంతిక రాజకీయ అవకాశవాద వైఖరులకూ, నిర్మించిన లేదా పనిచేసిన అవకాశవాద పార్టీలకూ గల సంబంధం గురించి మా పార్టీ చెప్పింది అవాస్తవమని నేడెవరు బుకాయించగలరు? సత్యమూర్తి వివిధ సమయాల్లో తీసుకున్న సైద్ధాంతిక–రాజకీయ వైఖరులకూ, పనిచేసిన నిర్మాణాలకూ, ఈ రెంటికీ ఆయన రాసిన కవిత్వానికీ, చేసిన గానాలకూ గల సంబంధాన్ని విడదీయడం అమాయకత్వమో లేక బూటకమో కాక మరేమవుతుంది? విప్లవోద్యమాన్ని వదిలిన తర్వాత సత్యమూర్తి ఒకచేత్తో వర్గ–కుల విముక్తికంటూ, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగానంటూ, దళిత–బహుజన విముక్తికంటూ చేసిన కలం సృష్టీ, మరోచేత్తో విప్లవోద్యమానికి వ్యతిరేకంగా చేసిన కలంసృష్టీ, ఆయన చేసిన రెండు గళాల కవితాగానాలూ వర్గ విముక్తి–కుల విముక్తి ఉద్యమాలకు తోడ్పడినాయా లేక ఆ విశాల ఉద్యమాలను విచ్ఛిన్నం చేసి తూట్లు పొడవటానికి తోడ్పడినాయా? ఆంధ్రరాష్ట్ర వ్యాప్తంగా వందలాది మంది విప్లవకారులను పట్టుకొని బూటకపు ఎన్‌కౌంటర్ల పేరుతో కాల్చి చంపుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రక్తపుటేరులు పారిస్తుంటే వాటితో గొంతుకలిపి మా పార్టీకీ, ఉద్యమానికీ వ్యతిరేకంగా వివిధ ముసుగుల్లో సత్యమూర్తి చేసిన వ్యాఖ్యలను, ప్రకటనలను మా పార్టీ నిశితంగా పరిశీలించి ఆయనను పొలిటికల్ కోవర్టుగా ప్రజల ముందు బహిర్గతపరిచిన విషయం ఆంధ్రరాష్ట్రంలో తెలియందెవరికి? ఉద్యమాలన్నిటిలోనూ అవకాశవాదులు, ముతాకోరులు, విచ్ఛిన్నకారులు, స్వార్థపరులు సదా ముందు వరుసలో నిలబడి ఉపన్యసిస్తారే గానీ ఆచరణకొచ్చే సరికి వారు వెనుక వరుసలో కూడా కనిపించరని సత్యమూర్తి గత పాతికేండ్ల ఆచరణ మరోసారి రుజువు చేసింది.

తెలిసిగానీ తెలవకగానీ వర్గవిముక్తిని వదిలి, దీనితో వేర్పరచి కుల, లింగ తదితర సామాజిక అసమానతలు తొలగించడానికి ఎంచుకొనే కార్యక్రమాన్నే–ఉద్యమాలనే సర్వస్వంగా భావించేవారు ఎన్నటికీ పీడిత ప్రజల, పీడిత సామాజిక సెక్షన్ల నిజమైన విముక్తికి పరిష్కార మార్గాలను చూపించలేరు. విశాల ప్రజాస్వామిక విప్లవంలో విడదీయరాని భాగంగా సకల పీడిత సామాజిక సెక్షన్ల ఉద్యమాల ఆవశ్యకత ఎంత ఉన్నా అవి తమ నాయకత్వంలోని అవకాశవాద శక్తుల మూలంగా సామాజిక విప్లవానికి వ్యతిరేకంగా ఎక్కుపెట్టబడితే లేదా ఆ విప్లవంతో విడివడిపోతే అవి అత్యంత అమానుషమైన, క్రూరమైన అసమానతల వర్గవ్యవస్థ, కులవ్యవస్థ, పితృస్వామిక వ్యవస్థల పునాదిని కూడా తాకలేవు. అవి చేయగలిగిందల్లా నేటి వ్యవస్థకు ప్రమాదం కలిగించని విధంగా సంఘర్షిస్తూ, రాజీపడుతూ పాక్షిక సంస్కరణలను సంపాదించడం మాత్రమే. సమస్త

సామాజిక రుగ్మతల, సమస్యల పరిష్కారానికి మార్క్సిజం–లెనినిజం–మావోయిజమే సైద్ధాంతిక వెలుగు చూపుతుంది. సరైన రాజకీయ పంథాయే గమ్యాన్ని చేరుస్తుంది. వర్గపోరాటానికి అత్యున్నత రూపంగా సాయుధ పోరాటమే కేంద్రకంగా వుంటుంది. వీటి ద్వారానే దోపిడీ, పీడనల నుండి విముక్తి కావటానికి జరిగే ఉద్యమాల్లో పీడిత వర్గాలు, పీడిత సామాజిక సెక్షన్లు సమైక్యత సాధించడం, అవి సమరశీల ఉద్యమాలు నిర్మించడం, సామాజిక విముక్తి సాధించడం సాధ్యమవుతుంది. వీటి ద్వారానే సకల రూపాల దోపిడీ, పీడన, ఆధిపత్యం తదితర వర్గసమాజం అందించిన రుగ్మతలన్నిటి నుండీ సకల మానవాళి సంపూర్ణ విముక్తి సాధించటానికి మార్గం సుగమమవుతుంది.

సత్యమూర్తి తన రాజకీయ జీవితకాలంలో పీడిత ప్రజల ప్రయోజనాల కోసం నిలిచి పోరాడిందాని కన్నా ఎంతో ఎక్కువగా వారి ప్రయోజనాలను, ఆకాంక్షలను దెబ్బతీసే, నీరుగార్చే, వక్రమార్గం పట్టించే కార్యాచరణలోనే మునిగిపోయాడు. సత్యమూర్తి చివరి దశలో వివిధ ముసుగులు ధరించి కొనసాగించిన విప్లవ వ్యతిరేక రాజకీయ జీవితాన్ని ఉద్దేశపూర్వకంగా మరుగుపర్చి తొలిదశలో నిర్వహించిన అభ్యుదయకర, రెండవ దశలో నిర్వహించిన లాంటి సామాజిక విప్లవ పాత్రనే తుదివరకు కొనసాగించినవాడిగానో, ప్రజల ప్రయోజనాల కోసం నిస్వార్థంగా సేవ చేసిన వీరుడిగానో, ప్రజల ప్రయోజనాల కోసమే తన రచనలను త్రికరణశుద్ధిగా అంకితం చేసిన నిజమైన ప్రజాకవి గానో, చెప్పిందే చేసిన, చేసిందే చెప్పిన నిజాయితీ గల రాజకీయ నాయకుడిగానో ఆయన్ని అంచనా వేయడం తప్పు. ఏ విప్లవకారుడినైనా, ప్రగతిశీల సామాజిక ఉద్యమకారుడినైనా అంచనా వేసేటప్పుడు వారి ఉద్యమ జీవితం ఎలా ఆరంభమై కొంతకాలం లేదా చాలాకాలం కొనసాగిందనేది మాత్రమే కాదు చివరి వరకూ అదెలా కొనసాగిందనేదీ, అదెలా అంతమైందనేదీ కూడా తప్పనిసరిగా చూడాలి. ఇలాంటి వ్యక్తిని అంచనా వేసేటప్పుడు మార్క్సిస్టు మహోపాధ్యాయుడు కామ్రేడ్ మావో చేసిన బోధనే విప్లవకారులకు ప్రామాణికంగా వుంటుంది. అదే సరైనది. “ఒక యువకుడు విప్లవకారుడేనా అని ఎలా నిర్ణయించడం? మనం ఎలా చెప్పగలం? ఒకే ఒక ప్రమాణం మాత్రమే ఉండగలదు. అతడు కార్మిక, కర్షక విశాల జనసామాన్యంతో సమైక్యం కావాలనే కోరుకుంటున్నాడా, ఆచరణలో అలా సమైక్యం అవుతున్నాడా? అతడలా చేయడానికి ఇచ్ఛగిస్తూ, దానిని ఆచరణలో పెడుతూ ఉంటే అతడు విప్లవకారుడు. లేకుంటే కాదు. లేదా, విప్లవ ప్రతీఘాతకుడు. అతడీనాడు కార్మిక కర్షకులతో సమైక్యమైతే అతడీనాడు విప్లవకారుడు; రేపు అలా సమైక్యమవడం మానుకొని

వైదొలగి సామాన్య ప్రజల్ని వ్యతిరేకిస్తే అప్పుడు విప్లవకారుడు కాకుండా పోతాడు. లేదా విప్లవ ప్రతీఘాతకుడౌతాడు.'' *(మావో, యువజనోద్యమం సాధారణ పంథా)* ఇలా పరిశీలించగలిగినప్పుడే సత్యమూర్తి విషయంలోనే గాకుండా ఏ ఉద్యమకారుడి విషయంలోనైనా సరైన అంచనాకు రాగలుగుతాం. భిన్న ప్రాపంచిక దృక్పథాలు, భిన్న ప్రయోజనాలు గల వర్గసమాజంలో సత్యమూర్తి విషయంలో వివిధ వ్యక్తులు, సంస్థలు పరస్పర భిన్నమైన లేదా వివిధ రకాల అంచనాలకు రావడం ఆశ్చర్యకరమైందేమీ కాదు. సత్యమూర్తి తొలిదశలో అభ్యుదయవాదే; రెండవ దశలో విప్లవకారుడే. ఆయన ఈ రెండు దశల్లో వివిధ రంగాలలో నిర్వహించిన పాత్రని చివరి దశలో స్వయంగా నష్టపరిచాడు. తన గొప్ప విప్లవకర పాత్రని తానే స్వయంగా నెగేట్ చేసుకున్నాడు. ఒక విప్లవకారుడు ఒక రెనగేడ్‌గా మారాడు. ఒక విప్లవకారుడిగా జీవించిన కాలపు సత్యమూర్తి మనకాదర్శం. ఒక రెనగేడ్‌గా మరణించిన కాలపు సత్యమూర్తి మనకొక నెగెటివ్ గురువు. ఇది విప్లవ గతితర్కం.

**అభయ్**

**అధికార ప్రతినిధి**

**కేంద్ర కమిటీ**

**సీపీఐ (మావోయిస్టు)**

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# కేంద్ర కమిటీ

**13-2-2013**

## అఫ్జల్ గురు ఉరిని ఖండించండి!
## ప్రజా ఉద్యమకారులు, జాతి విముక్తి పోరాటకారులు, విప్లవకారులు కాదు, భారత రాజ్యమే అతి పెద్ద టెర్రరిస్టు!

ప్రపంచంలో అతి పెద్ద ప్రజాస్వామ్యంగా చెప్పుకునే భారత రాజ్యం 9 ఫిబ్రవరి 2013న ఢిల్లీలోని తీహార్ జైళ్లో అఫ్జల్ గురును అత్యంత రహస్యంగా ఉరి తీసింది. 13 డిసెంబర్ 2001న భారత పార్లమెంట్‌పై జరిగిన దాడికి సహకరించాడన్న ఆరోపణపై అరెస్టయిన అఫ్జల్ గురుకు తాను నిర్దోషినని నిరూపించుకునే అవకాశాలివ్వకుండా, ఆఖరుకు తాను కోరుకున్న న్యాయవాదులను కూడా ఇవ్వ నిరాకరించిన భారత అత్యున్నత న్యాయస్థానం 'జాతి మనోభావాలను సంతృప్తి పర్చడం' కోసం 2005లో ఉరిశిక్షను ఖాయం చేసింది. పార్లమెంట్‌పై జరిగిన దాడికి సూత్రధారులెవరో, దాని వెనుకున్న కుట్రేమిటో నిష్పక్షపాతంగా విచారణ జరపకుండానే ఈ కేసులో కశ్మీరీ జాతి విముక్తికారులను, ఉద్యమ సానుభూతిపరులను కుట్రపూరితంగా ఇరికించారు.

9/11 దాడుల దరిమిలా అమెరికా ప్రారంభించిన 'గ్లోబల్ వార్ ఆన్ టెర్రర్'లో భాగంగా భారత రాజ్యం జాతి విముక్తి ఉద్యమ సంస్థలను, విప్లవ సంస్థలను టెర్రరిస్టుగా చిత్రీకరిస్తూ కార్పొరేట్ మీడియా ద్వారా పెద్ద ఎత్తున ప్రచారం చేస్తూ వస్తున్నది. దేశ ప్రజల దృష్టిని తమ తక్షణ, మౌలిక సమస్యల నుండి మళ్లించి 'టెర్రరిజమే' అతి పెద్ద ప్రమాదం అనే భావనను సర్వత్రా వ్యాపింపజేస్తున్నది. కశ్మీర్‌లో, దేశంలోని అన్ని రాష్ట్రాల్లో కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు, సంఘ్ ముఠాకు చెందిన వివిధ హిందూ మత దురహంకార శక్తులు ఇస్లామిక్ టెర్రరిస్టుల సాకుతో ముస్లింలపై ఏళ్ల తరబడి సాగిస్తున్న ఫాసిస్టు హత్యాకాండలు, అత్యాచారాలు, చిత్రహింసలు, జైలు నిర్బంధాలు, అమానుష వివక్షల ఫలితంగా ముస్లిం ప్రజల్లో అంతులేని ద్వేషం గూడు కట్టుకుంది. దీనిని కొంత మంది ముస్లింలు తమకు తోచిన పద్ధతుల్లో ప్రతిఘటిస్తున్నారు. అందులో ఒక రూపంగా కొన్ని అవాంఛనీయమైన విధ్వంసకర దాడులు కూడ చోటు చేసుకుంటున్నాయి. దీనికి పూర్తి బాధ్యత పాలకవర్గాలదే, హిందూ మత దురహంకార

శక్తులదే. అదే సమయంలో భారత ప్రభుత్వానికి చెందిన ఇంటలిజెన్స్ సంస్థలు, అమెరికన్ ఇంటలిజెన్స్ సంస్థలు, హిందూ మతదురహంకార సంఘ్ ముఠాకు చెందిన సంస్థలు కుట్రపూరితంగా దేశంలో అనేక చోట్ల బాంబు దాడులకు, విధ్వంసకర చర్యలకు పాల్పడుతున్నాయి. ప్రభుత్వం, దానికి వంతపాడే మీడియా వీటన్నిటిలో అమాయక ముస్లింలను, జాతి విముక్తి ఉద్యమ సంస్థలను దోషులుగా చూపెడుతున్నాయి. వాళ్లను తప్పుడు కేసుల్లో ఇరికిస్తున్నారు. ఆ సాకుతో ప్రజల న్యాయమైన ఉద్యమాలన్నిటినీ అణచివెయ్యాలనేది భారత రాజ్యం లక్ష్యం. ఈ కుట్రలో భాగమే పార్లమెంట్‌పై నాటకీయంగా జరిగిన దాడి.

ఇంతకాలం అఫ్జల్ గురు ఉరిని వాయిదా వేస్తూ వచ్చిన కాంగ్రెస్ నాయకత్వంలోని యూపీఏ ప్రభుత్వం వచ్చే సంవత్సరం జరగనున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని బీజేపీపై పై చేయి సాధించి, 'టెర్రరిజం'పై తనను తాను ఛాంపియన్‌గా నిరూపించుకోవడం కోసమే ఇలా హఠాత్తుగా ఉరితీసింది. ఈ క్రమంలో అది తాను చెప్పుకునే న్యాయ సూత్రాలను కూడ తుంగలో తొక్కింది. క్షమాభిక్ష అపీల్‌ను రాష్ట్రపతి తిరస్కరించిన విషయాన్ని అతని కుటుంబానికి తెలియజేయకుండా, చివరిసారి కుటుంబాన్ని చూసే అవకాశం కూడ ఇవ్వకుండా, ముందస్తుగా కశ్మీర్ లోయ అంతటా కర్ఫ్యూ విధించి ఈ పిరికి చర్యకు పాల్పడింది. ఆఖరుకు అతని శవాన్నైనా కుటుంబ సభ్యులకు ఇవ్వకుండా – ప్రపంచంలో అతి పెద్ద టెర్రరిస్టు అమెరికా ఒసామా బిన్ లాదెన్ శవాన్ని సముద్రంలో పడవేసినట్టుగానే – జైల్లోనే ఖననం చేసేసి అత్యంత అమానుషత్వానికి పాల్పడ్డది.

అఫ్జల్ గురును ఉరితీసి భారత ప్రభుత్వం కశ్మీరీ ప్రజలతో పాటు, ప్రజాస్వామ్య ప్రియులైన భారత ప్రజలందరి మనోభావాలను తీవ్రంగా గాయపర్చింది. ఇప్పటికి 80 వేలకు పైగా మంది కశ్మీరీ ప్రజలను హతమార్చి, 7 లక్షల సాయుధ బలగాలతో కశ్మీర్ లోయనంతా సైనిక క్యాంపుగా మార్చినప్పటికీ కశ్మీరీ ప్రజల జాతి విముక్తి ఆకాంక్ష చల్లారలేదనేది వాస్తవం. అఫ్జల్ గురును ఉరితీసి కశ్మీర్ ప్రజల పోరాట చేవను నీరు కార్చగలమని భారత ప్రభుత్వం పగటి కలగంటున్నది. తమ జాతి విముక్తి కోసం, స్వాతంత్ర్యం కోసం కశ్మీరీ ప్రజలు దశాబ్దాలుగా సాగిస్తున్న పోరాటం న్యాయమైనది. అది అనేక ఎగుడు దిగుళ్లను ఎదుర్కొంటున్నప్పటికీ విభిన్న రూపాల్లో పలు సందర్భాల్లో విస్ఫోటనంలా ఎగుస్తూనే వున్నది. భారత ఫాసిస్టు పాలకుల ఇలాంటి అమానుష చర్యలు కశ్మీరీ ప్రజల్లో మరింత కసినే రగుల్చుతాయి తప్ప వాళ్లను శాశ్వతంగా అణచిపెట్టలేవు.

ఈ ఫాసిస్టు చర్యను భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) తీవ్రంగా ఖండిస్తున్నది. ఇలాంటి చర్యలతో పీడిత ప్రజల, జాతుల వుద్యమాలను అణచివెయ్యగలమని పాలకవర్గాలు కంటున్న కలలు కల్లలు కాకతప్పదని హెచ్చరిస్తున్నది. కశ్మీర్ కశ్మీరీ ప్రజలదే. భారత్‌కు గాని, పాకిస్తాన్‌కు గాని దానిపై ఎలాంటి హక్కూ లేదు. కశ్మీరీ ప్రజల జాతి విముక్తి ఉద్యమాన్ని మా పార్టీ పూర్తిగా సమర్థిస్తుంది. దేశాన్ని జాతుల బంధీఖానాగా మార్చిన బడా దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ, భూస్వామ్య పాలకవర్గాలకు, వారికి నాయకత్వం వహిస్తున్న సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా దేశంలోని కార్మికులు, కర్షకులు, విద్యార్థి, యువజనులు, దళితులు, ఆదివాసులు, మత మైనారిటీలు మహిళలు, వ్యాపారులు.. యావత్ పీడిత ప్రజలూ, పీడిత జాతులూ సమైక్యంగా పోరాడాలి. కార్మిక, కర్షక, పెటీ బూర్జువా, జాతీయ బూర్జువా వర్గాల ఐక్య సంఘటనగా ఏర్పడబోయే భారత నూతన ప్రజాస్వామిక రాజ్యం కోసం సాగుతున్న పోరాటంతో భుజం భుజం కలిపి నడవడం ద్వారానే జాతులు విడిపోయే హక్కుతో సహా స్వయంనిర్ణయాధికారాన్ని సాధించుకోగల్గుతాయి. పీడిత ప్రజలందరూ అన్ని రకాల దోపిడీ పీడనల నుండి విముక్తిని సాధించుకోగల్గుతారు.

**అభయ్**

**అధికార ప్రతినిధి**

**కేంద్ర కమిటీ**

**సీపీఐ (మావోయిస్టు)**

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# కేంద్ర కమిటీ

**23-3-2013**

## వ్యూహాత్మక ప్రతిష్టంభన దశను సాధించే తక్షణ కర్తవ్యంతో విజయపథంలో పురోగమిస్తున్న ఫిలిపినో విప్లవోద్యమానికి జేజేలు!

## ఫిలిపినో విప్లవానికీ పిలిపినో ప్రజలకూ బలమైన సంఘీభావాన్ని ప్రకటించండి!

## 'ఒప్లాన్ బయనిహాన్'ను వ్యతిరేకించండి, ఖండించండి!

## 2013 ఏప్రిల్ 22 నుంచి 28 వరకు ఫిలిపినో విప్లవానికి సంఘీభావ వారం పాటించండి!

ఫిలిప్పైన్స్ కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో వ్యూహాత్మక ప్రతిష్టంభన దశను సాధించాలన్న తక్షణ, కేంద్ర నినాదంగా జరుగుతున్న విప్లవాన్ని తుడిచిపెట్టడానికి అమెరికా కీలుబొమ్మ బెనిగ్నో అక్వినో ప్రభుత్వం బర్బర సైనిక క్యాంపెయిన్ 'ఒప్లాన్ బయనిహాన్'ను అమలు చేస్తున్నదని ప్రపంచ ప్రజలకూ అలాగే భారత దేశ ప్రజలకూ తెలిసిందే.

ఫిలిప్పైన్స్ దేశం ఆగ్నేయాసియాలో 3 లక్షల చ.కి.మీ. వైశాల్యం, సుమారు తొమ్మిదిన్నర కోట్ల జనాభాతో కూడిన దేశం. స్వేచ్ఛా ప్రియులైన ఫిలిపినో ప్రజలు వలస పాలనకు ప్రత్యేకించి అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాటాలు చేసిన గొప్ప చరిత్రను వీరోచిత విప్లవ పోరాటాల సాంప్రదాయ వారసత్వాన్నీ, త్యాగాలను కలిగి ఉన్నారు. ఇది గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని కలిగిన అర్ధవలస, అర్ధభూస్వామ్య దేశం. ఫిలిప్పైన్స్ దేశంలో స్వావలంబనకు కావలసినన్ని వివిధ రకాల వనరులు ఉన్నాయి. కోట్లాది శ్రామిక ప్రజలు దేశం సార్వభౌమిక, స్వతంత్ర, ప్రజాస్వామిక దేశంలో అభివృద్ధి కావడానికి ఒక బలమైన పునాదిగా ఉన్నారు. దేశ కార్మికులు, కర్షకులూ సామ్రాజ్యవాదుల, వారి దళారీ పాలక వర్గాల దోపిడీ పీడనలను

తుడిచిపెట్టి, నిజమైన ప్రజాస్వామ్యాన్నీ సామాజిక ప్రగతినీ సాధించడానికి ముఖ్య వనరుగా ఉన్నారు.

ఫిలిప్పైన్స్‌లో 1896లో జాతీయ ప్రజాస్వామిక విప్లవం ప్రారంభమయింది. 1930 దశకం ప్రారంభ కాలంలో ఫిలిప్పైన్స్ కమ్యూనిస్టు పార్టీ (సిపీపీ) భూస్వామ్య వ్యతిరేక పోరాటాల నుంచీ ఉద్భవించింది. మెలికలుగా సాగుతూ పార్టీలో రివిజనిస్టులను ఓడించిన తరువాత 1960ల రెండో సగంలోనే మావో – సీపీసీ నాయకత్వంలో అమెరికా సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా అంతర్రాష్ట్రీయ స్థాయిలోనూ నిజమైన విప్లవకర, ప్రజాస్వామిక శక్తుల నుంచీనూ ఎగిసిన గొప్ప వెల్లువ నేపథ్యంలో సీపీపీ సరైన విప్లవ పంథా చేపట్టగలిగింది. ఆనాటి నుంచీ ఫిలిప్పైన్స్ నూతన ప్రజాస్వామిక విప్లవం నూతన స్ఫూర్తిలో పురోగమించసాగింది. ప్రజా సైన్యం, అంటే, నూతన ప్రజా సైన్యం (ఎన్.పీ.ఏ.), జాతీయ ప్రజాస్వామిక వేదిక (ఎన్.డీ.ఎఫ్.)ల మద్దతుతో నూతన ప్రజాస్వామిక విప్లవం ప్రజల భారీ భాగస్వామ్యంతో మరిన్ని విజయాలు పొందుతూ పురోగమించసాగింది. ప్రస్తుతం ఫిలిప్పైన్స్ ప్రజల అత్యంత నమ్మకమైన, బహుళ పార్టీ సీపీపీ. అమెరికా సామ్రాజ్యవాదానికీ, భూస్వామ్యానికీ, దళారీ పెట్టుబడిదారీ విధానానికీ వ్యతిరేకంగా జాతీయ ప్రజాస్వామిక విప్లవాన్ని సంపూర్ణంగా పరిపూర్తి చేయడం కోసం సమస్త పీడిత ప్రజల, సామాజిక సెక్షన్‌లూ చేస్తున్న సమస్త పోరాటాలకూ సీపీపీ నాయకత్వం వహిస్తున్నది.

అర్థ వలస, అర్థ భూస్వామ్య వ్యవస్థలో సంక్షోభం తీవ్రతరమవుతూ ఉంటే అన్ని వర్గాల ప్రజలూ మరింతగా సీపీపీ నాయకత్వంలో సమీకృతులవుతున్నారు.

నడుస్తున్న నూతన ప్రజాస్వామిక విప్లవానికి పెరుగుతున్న ప్రజా ఆదరణ చూసి భయపడీ, తమ దోపిడీ వ్యవస్థకు పొంచి ఉన్న ప్రమాదం పసిగట్టీ బెనిగ్నో అక్వినో ప్రభుత్వం వివిధ పేరులతో ఒక దాని తరువాత మరొక అణిచివేత క్యాంపెయిన్‌లను నిర్వహించింది. అమెరికా సామ్రాజ్యవాద బంటు బెనిగ్నో అక్వినో ప్రభుత్వం అమలు చేస్తున్న బహుముఖ అణిచివేత దాడి క్యాంపెయిన్‌లో 'ఒప్లాన్ బయనిహాన్' సరికొత్తది. 'ఒప్లాన్ బయనిహాన్' క్యాంపెయిన్ ప్రతీఘాతుక అమెరికా కీలుబొమ్మ ప్రభుత్వం ఫాసిస్టు పద్ధతిలో అమలు చేస్తున్న అత్యంత క్రూర, బర్బర, పూర్తి సైనిక క్యాంపెయిన్.

అయితే సీపీపీ నాయకత్వంలో ఫిలిపినో ప్రజలు ఎన్‌పీఏ, ఎన్‌డీఎఫ్‌ల మద్దతుతో ఈ బర్బర 'ఒప్లాన్ బయనిహాన్'కు వ్యతిరేకంగా దేశం నలుమూలలలో తమ జీవితాలను త్యాగం చేస్తూ ధైర్యంగా, మిలిటెంటుగా ఖరాడుతున్నారు. వీరి పోరాటం ప్రపంచ సమస్త శ్రామిక,

పీడిత జాతులకూ ప్రజలకూ ప్రేరణదాయకంగా, ఉత్సాహజనకంగా ఉన్నది.

ఇటువంటి పరిస్థితులలో భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) 2012 ఆగస్టు సమావేశంలో ఈ 2013 ఏప్రిల్ 22 నుంచీ 28 వరకూ ఫిలిపినో విప్లవానికి మద్దతుగా సంఘీభావ వారాన్ని పాటించాలని నిర్ణయించి, ప్రజలకూ, పార్టీలో సమస్త శ్రేణులకూ అలాగే దేశంలో ప్రగతిశీల, ప్రజాస్వామిక, విప్లవ శక్తులకూ ఈ బర్బర సైనిక క్యాంపెయిన్ 'ఒప్లాన్ బయనిహాన్'ను బలంగా వ్యతిరేకించాలనీ తీవ్రంగా ఖండించాలనీ పిలుపునిచ్చింది.

ఈ రోజు ఆ ఉద్యమం గొప్ప ఉన్నత కర్తవ్యాలను చేపట్టి పోరాడుతోంది. అది ప్రస్తుతం వ్యూహాత్మక ఆత్మరక్షణ దశ నుండి వ్యూహాత్మక ప్రతిష్టంభన దశ లక్ష్యంతో పురోగమిస్తోంది. ఇప్పటికే అది 110 గెరిల్లా ఫ్రంటులను కలిగి ఉంది. వాటిని 2015 నాటికి 180 కు పెంచాలనే లక్ష్యాన్ని నిర్ణయించుకుంది. ప్రజాసైనిక బలగాలు రానున్న ఐదేళ్ల కాలంలో 25 వేల ఆయుధాలను శత్రువు నుంచి స్వాధీనం చేసుకొని తాను కొత్తగా నిర్మించ తలపెట్టిన 180 కంపెనీలకు అందివ్వాలనీ 2011లో జరుపుకున్న ఎన్.పి.ఏ. 42వ వార్షికోత్సవాల సందర్భంగా నిర్ణయించుకుంది. అది అనేక ఎత్తుగడల ఎదురుదాడులతో శత్రువును గట్టి దెబ్బలు తీస్తూ ఆ దేశ, ప్రపంచ పీడిత ప్రజలకు ముఖ్యంగా ప్రజాసాయుధ బలగాలకు ఉత్సాహాన్నీ, ఉత్తేజాన్నిస్తోంది. సామ్రాజ్యవాదుల ఎల్.ఐ.సి. దాడుల్లో భాగంగా అక్కడ అమలవుతున్న ఓప్లాన్ బయనిహాన్ ఎన్ని హత్యలకు, అపహరణలకు, అత్యాచారాలకు, గృహదహనాలకు, లూటీలకు, విప్లవ సంస్థల నిషేధాలకు పాల్పడుతున్నా అక్కడి ప్రజలు, వారికి పూర్తి దన్నుగా నిలిచిన ఎన్.పి.ఏ, ఎన్.డి.ఏ.లు సి.పి.పి. నాయకత్వంలో పోరాడుతున్నాయి. వాటికి మనమంతా అండగా ఉందాం. మీరు ఒంటరిగా లేరని ఎలుగెత్తి చాటుతూ మన సంఘీభావ సందేశాన్ని అందజేద్దాం.

బెనిగ్నో ప్రభుత్వం నడిపిస్తున్న 'ప్రజల పై యుద్ధం' తక్షణం నిలిపివేయాలంటూ అందరం డిమాండ్ చేద్దాం! ఫిలిప్పైన్స్‌లో అన్ని అమెరికా సైనిక బేసులనూ ఎత్తివేయాలని డిమాండ్ చేద్దాం! ఫిలిప్పైన్స్ జైళ్లలో ఉన్న సమస్త రాజకీయ ఖైదీలనూ తక్షణం విడిచిపెట్టాలని డిమాండ్ చేద్దాం! సామ్రాజ్యవాదుల, ముఖ్యంగా అమెరికా సామ్రాజ్యవాదుల, దళారీ బడా బూర్జువాల, బడా భూస్వామ్య వర్గాల ప్రయోజనాల కోసం సేవ చేస్తూ బెనిగ్నో అక్వినో సాగిస్తున్న ఫాసిస్టు పాలనకు వ్యతిరేకంగా జరగుతున్న వీరోచిత ఫిలిపినో విప్లవానికి సంఘీభావాన్నీ మద్దతునూ అందిద్దాం!

భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు), దేశంలో సమస్త విప్లవ ప్రజానీకం మీ అందరికా

తమ బలమైన మద్దతునూ విప్లవ సౌహార్ద్రతనూ అందిస్తున్నారు. భారతదేశంలోనూ, ఫిలిప్పైన్స్‌లోనూ రెండు పార్టీలూ అనన్య త్యాగాలతో తమ తక్షణ, అంతిమ లక్ష్య సాధన కోసం విప్లవ యుద్ధాలు చేస్తున్నాయి. నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయడానికి ఎటువంటి త్యాగానికీ వెరువకుండా చెక్కుచెదరని సంకల్పంతో విప్లవ యుద్ధం కొనసాగిస్తామని మేం హామీ ఇస్తున్నాం. ప్రపంచ సోషలిస్టు విప్లవంలో ఒక భాగంగా ఫిలిపినో విప్లవోద్యమానికి అన్ని విధాలుగా కదనరంగంలో దృఢమైన సహ కంబాటెంట్‌గా నిలుస్తామని ప్రతిన బూనుతున్నాం. తద్వారా కార్మికవర్గ అంతర్జాతీయతతో ప్రపంచ క్రార్మిక వర్గ విప్లవానికి సేవ చేయడం కోసం, మావంతు పాత్రను నిర్వహిస్తామని, ఫిలిప్పైన్ నూతన ప్రజాస్వామిక విప్లవ విజయానికి బలంగా మద్దతు ఇస్తామనీ వాగ్దానం చేస్తున్నాం. మహత్తర ఫిలిపినో ప్రజలు, సీపీపీ, ఎన్‌పీఏ అజేయమైనవి. ప్రపంచ కార్మికక వర్గం, పీడిత జాతులూ ప్రజానీకం మీ వెంట ఉన్నారు. పురోగమించండి ! అంతిమంగా విజయం మీదే! అమెరికా సామ్రాజ్యవాదులూ వారి ఫిలిప్పైన్ తొత్తులూ ఓడిపోతారు!

- 'ఒప్లాన్ బయనిహాన్'ను వ్యతిరేకించండి!
- ఫిలిప్పైన్స్‌లో నూతన ప్రజాస్వామిక విప్లవానికి బలమైన మద్దతునూ సంఘీభావాన్నీ అందించండి!
- ఫిలిప్పైన్స్ కమ్యూనిస్టు పార్టీ వర్థిల్లాలి!
- మార్క్సిజం లెనినిజం మావోయిజం వర్థిల్లాలి!
- కార్మికవర్గ అంతర్జాతీయత వర్థిల్లాలి!
- సామ్రాజ్యవాదం, దాని తొత్తులూ నశించాలి!

**అభయ్**

**అధికార ప్రతినిధి**

**కేంద్ర కమిటీ**

**సీపీఐ (మావోయిస్టు)**

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# కేంద్ర కమిటీ

**31-3-2013**

## ఝార్ఖండ్‌లోని ఛత్రా జిల్లా లకడ్‌బంధా హత్యాకాండను ఖండించండి!
## 2013 ఏప్రిల్ 16 నాడు భారత్ బంద్‌ను జయప్రదం చేయండి!!

2013 మార్చి 27 నాడు ఝార్ఖండ్ రాష్ట్రంలోని ఛత్రా జిల్లా కుందా పోలీస్ స్టేషన్ పరిధిలో గల లకడ్ బంధా గ్రామంలో అక్కడి ఎస్.పి. అనూప్ బిర్‌థారే నాయకత్వంలో పెద్ద సంఖ్యలో ఝార్ఖండ్ పోలీసులు, సీఆర్‌పీఎఫ్, కోబ్రా బలగాలు అత్యంత కుట్రపూరితంగా టీపీసీ(తృతీయ ప్రస్తుతి కమిటీ) గూండాలను ముందు పెట్టి ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఆ ఊరు వెళ్లిన భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) కార్యకర్తలు మరియు పిఎల్‌జిఎ బలగాలను నలువైపులా చుట్టుముట్టి దాడి చేశారు. ఆ దాడిలో కొద్ది మంది మా పార్టీ కార్యకర్తలు అమరులు కాగా, కొద్ది మందిని వాళ్లు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. తమ ఆధీనంలోకి తీసుకున్న మా కామ్రేడ్స్‌ను చెప్పనలవికాని హింసా వేధింపులకు గురి చేశారు. వాళ్ల అవయవాలను కోశారు. రాళ్లతో వాళ్ల తలలు పగులకొట్టారు, గుండెలపై గురిచూసి కాల్చారు. వాళ్ల నోళ్లలో, తలపై తుపాకులు పెట్టి కాల్పులు జరిపి పాశవికంగా హత్య చేశారు. ఆ తర్వాత పోలీసులు తమ క్రూరత్వానికి టీపీసీని అడ్డు పెట్టుకొని మావోయిస్టులతో టీపీసీ వారికి జరిగిన కాల్పుల కట్టు కథను విడుదల చేశారు. పోలీసులు మా సహచరుల శవాలను, ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ కుట్రపూరిత హత్యాకాండను ఖండించాల్సిందిగా మేము, మా పార్టీ ప్రజలకు విజ్ఞప్తి చేస్తోంది.

ఛత్రా ఎస్‌పి నాయకత్వంలో ఝార్ఖండ్ పోలీసులు, సీఆర్‌పీఎఫ్, కోబ్రా బలగాలు కుట్ర పూరితంగా పది మంది మా కామ్రేడ్స్‌ను అంతమొందించడం ఇదేమీ కొత్త కాదు. అమెరికా సామ్రాజ్యవాదుల నిర్దేశకత్వంలో వాళ్ల నమ్మక బంట్లయిన సోనియా, మన్‌మోహన్, సుశీల్ కుమార్ శిండే, చిదంబరం, జయరామ్ రమేష్‌ల ముఠా మావోయిస్టు పార్టీ నాయకత్వంలోని విప్లవోద్యమాన్ని అంతమొందించడానికి అనేక కుట్రలు పన్నుతున్నారు. వాళ్లు కొనసాగిస్తున్న పాశవికమైన ఆపరేషన్ గ్రీన్‌హంట్ బహుముఖ దాడిలో ఇది ఒక భాగం. ఈ హత్యాకాండ వాళ్లు కొనసాగిస్తున్న ఎల్‌ఐసి విధానాలలో భాగంగానే జరిగింది. వాళ్లు స్పెషల్ పోలీసు ఆఫీసర్లను తయారు చేసుకొని తమ నాయకత్వంలో అనేక గూండా గ్యాంగులను ఏర్పర్చుకొని వారికి

ఏకే-47 లాంటి అత్యాధునిక ఆయుధాలను అందజేస్తూ మావోయిస్టు విప్లవకారుల పైన, వాళ్ల సానుభూతిపరుల పైన దాడులను కొనసాగిస్తున్నారు. ఈ దాడులు ఒక చోట టిపిసి, జెపిసి(ఝార్ఖండ్ ప్రస్తుతి కమిటీ), ఝార్ఖండ్ లిబరేషన్ టైగర్స్, పీపుల్స్ లిబరేషన్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా లాంటి గూండా గ్యాంగుల ద్వారా పోలీసుల ప్రత్యక్ష మార్గదర్శకత్వంలో జరుగుతుండగా మరొకచోట సల్వాజుడుం పేరుతో ఇంకోచోట సేంద్ర పేరుతో, నాగరిక్ సురక్షా సమితి, గ్రామ రక్షా దళ్, శాంతి సేన, మహాత్మాగాంధీ తంటా ముక్తీ సంఘటన్, భైరవ వాహిని లాంటి పేర్లతో దాడులు జరుగుతున్నాయి. టిపిసి, జెపిసి, జెఎల్‌టి, పిఎల్ఎఫ్ఐ మొదలైన హంతక ముఠాలు మరియు నాగరిక్ సురక్షా సమితి, గ్రామ రక్షా దళ్ లాంటి ప్రభుత్వ పెంపుడు సంస్థలు ఝార్ఖండ్‌లో చాలా క్రియాశీలకంగా పని చేస్తున్నాయి. ఇవి పోలీసుల మార్గదర్శకత్వం వాళ్ల పూర్తి అండదండలతో మావోయిస్టులకు వ్యతిరేకంగా వాటి కార్యకలాపాలు కొనసాగిస్తున్నాయి. 2013 మార్చి 27 నాడు టిపిసి వాళ్లతో జరిగిన ఎదురుకాల్పులుగా చెప్పబడుతున్న ఘటన నిజానికి పోలీసుల కుట్ర ఫలితమే.

ఈ రకంగా అమెరికా సామ్రాజ్యవాదులు మరియు వాళ్ల నమ్మకమైన దళారీలు సోనియా, మన్‌మోహన్, సుశీల్‌కుమార్ శిందే, చిదంబరం, జయరాం రమేష్‌ల ముఠా విప్లవోద్యమాన్ని నిర్మూలించే దృష్ట తలంపుతో ఆపరేషన్ గ్రీన్‌హంట్ పేరుతో కొనసాగిస్తున్న అప్రకటిత యుద్ధం మావోయిస్టు విప్లవకారులు సహా పీడిత, తాడిత ప్రజానీకం పైన జరుగుతున్న పార్టీ నాయకత్వం, కార్యకర్తలు, విప్లవాభిమానులు మరియు సాధారణ ప్రజానీకం పై ఈ హత్యాకాండ కొనసాగుతోంది. ఛత్రలో జరిగిన మారణకాండ వాటి కొనసాగింపులో ఒక భాగమే. ఇంతేకాదు దీనికి కొద్ది ముందు మహారాష్ట్రలోని గడ్‌చిరోలి జిల్లా అహిరి తాలూకాలో గల గోవింద్‌గావ్‌లో అక్కడి ఎస్‌పి సువేజ్‌హక్ కుట్ర పూరితంగా జరిపిన దాడిలో జనవరి 19 నాడు ఆరుగురు విప్లవకారులను పోలీసులు హత్య చేశారు. ఆ తర్వాత మార్చి 8న ఛత్తీగఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో పామేడ్ వద్ద గల కంచాల గ్రామంపై ఆంధ్ర గ్రేహౌండ్స్ బలగాలు స్థానిక పోలీసులతో కలిసి దాడి చేసి ఒక ఆదివాసీ మహిళా, పురుషున్ని బూటకపు ఎన్‌కౌంటర్ కాల్చి చంపి మావోవాదులు హతులు అయినట్లుగా ప్రకటించారు. అక్కడే నారాయణపూర్ జిల్లాలో మాందోడ గ్రామ యువకున్ని మార్చి 2 నాడు పట్టుకొని ఊరి ప్రజల ముందే బహిరంగంగా చంపివేసి మావోయిస్టుగా ప్రకటించారు. ఇలాంటి అనేక ఘటనలు విప్లవోద్యమ ప్రాంతంలో ఎక్కడో ఒకచోట నిరంతరం పునరావృతం అవుతూనే వున్నాయి. వీటికి కొద్ది ముందు కామ్రేడ్ ఆజాద్, కామ్రేడ్ కోటేశ్వర్ రావుల హత్య, తూర్పు సింగ్‌భూమ్‌లోని గుడబందాలో జరిగిన కుట్రపూరిత మారణకాండ, ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా సార్‌కెన్‌గూడలో జరిగిన మారణకాండ లాంటివి కొన్ని ఉదాహరణలు మాత్రమే.

గ్రీన్‌హంట్ బహుముఖ దాడిలో పోలీసులు కేవలం సాధారణ ప్రజలు, విప్లవకారులనే

కాకుండా పౌర హక్కుల సంఘాల కార్యకర్తలను కూడా ఉపేక్షించడం లేదు. 2013 ఫిబ్రవరిలో ఒడిశాలో పౌరహక్కుల సంఘం కార్యకర్త దండపాణి మహంతిని పోలీసులు అరెస్టు చేసి అనేక తప్పుడు కేసుల్లో ఇరికించి తుదకు యు.ఎ.పి.ఎ.కింద అరెస్టు చేసి జైల్లో పెట్టారు. ఈరోజు దేశ వ్యాప్తంగా ముఖ్యంగా మావోయిస్టు విప్లవోద్యమ ప్రాంతాల్లో ప్రజల పైన భయంకర ఫాసిస్టు దాడులు కొనసాగుతున్నాయి. వీటికి వ్యతిరేకంగా యావత్తు ప్రజానీకం, విద్యార్థులు, మేధావులు, ప్రజాస్వామిక వాదులు ఎక్కడికక్కడే ప్రజా ఉద్యమాలను తీవ్రతరం చేయాల్సిందిగా మా పార్టీ విజ్ఞప్తి చేస్తోంది.

అమెరికా సామ్రాజ్యవాదులు మరియు వాళ్ల నమ్మకబంట్లయిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విప్లవోద్యమ నాయకులను, కార్యకర్తలను, విప్లవ సానుభూతిపరులను పాశవికంగా హత్య చేసినప్పటికీ విప్లవోద్యమాన్ని అంతమొందించాలనే వాళ్ల దుష్ట తలంపులు ఎన్నటికీ జయప్రదం కావు. తుదకు విప్లవ ప్రజానీకం వాళ్ల దుష్ట తలంపులన్నింటిని ఓడించి తీరుతారు. ఛత్రా లాంటి మారణకాండకు ఒడిగట్టిన హంతకులను, నేరస్తులను ఎన్నటికైనా విప్లవ ప్రజానీకం ప్రజా కోర్టులో విచారించి శిక్షించి తీరుతుంది. ప్రజల ప్రియతమమ నాయకుడైన కామ్రేడ్ ప్రశాంత్ సహా పది మంది వీరయోధుల హత్యలకు బదులు తీర్చుకుంటారు.

దేశవ్యాప్తంగా శత్రువు కొనసాగిస్తున్న బహుముఖ దాడులను వర్తమాన సామ్రాజ్యవాద, దేశ బడా బూర్జువా భూస్వామి పాలక వర్గాల సంక్షోభ పరిస్థితుల నుంచి వేరుచేసి చూడలేం. 2008 నుంచి కొనసాగుతున్న సామ్రాజ్యవాద ఆర్థిక, ద్రవ్య సంక్షోభం సమసిపోయే దారే లేకుండా పోయింది సరికదా అది దీర్ఘకాల స్వభావాన్ని సంతరించుకొంటున్నది. మనం దేశంలోని అత్యంత విలువైన ప్రకృతి సంపదలను కొల్లగొట్టుకపోయి తమ సంక్షోభ సుడిగుండంలోంచి బయట పడటానికి దోపిడీ పాలక వర్గాలు బహుముఖ దాడిని తీవ్రం చేస్తుండటంలో భాగంగానే ఈ హత్యాకాండ, హత్యాచారాలు పెచ్చరిల్లుతున్నాయి. దేశవ్యాప్తంగా అవినీతి కుంభకోణాలు రాజ్యమేలుతున్నాయి. ఈ అంతఃసంబంధాన్ని ప్రతీ ఒక్కరూ అర్థం చేసుకొని ఇక్కడ కొనసాగుతున్న విశాల ప్రజా పోరాటాలకు, ప్రజా యుద్ధానికి అండగా నిలువాలని నిజమైన ప్రజాస్వామిక ఉద్యమంలో భాగం కావాలని విశాల ప్రజారాశులకు మా పార్టీ విజ్ఞప్తి చేస్తోంది.

**అభయ్**

**అధికార ప్రతినిధి**

**కేంద్ర కమిటీ**

**సీపీఐ (మావోయిస్టు)**

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# సెంట్రల్ రీజినల్ బ్యూరో

**15-4-2013**

## ఫిలిపినో ప్రభుత్వం ప్రజలపై సాగిస్తున్న యుద్ధం "ఒప్లాన్ బయనిహాన్"ను వ్యతిరేకించండి !
## విజయపథంలో పురోగమిస్తున్న ఫిలిపినో విప్లవోద్యమానికి జేజేలు !
### *2013 ఏప్రిల్ 22 నుండి 28 వరకు ఫిలిపినో విప్లవానికి సంఘీభావ వారాన్ని పాటించండి !*

నేడు ఫిలిప్పైన్స్‌లో కార్మికవర్గ నూతన ప్రజాస్వామిక విప్లవానికీ, ప్రతీఘాత విప్లవానికీ మధ్య హెూరాహెూరీ సమరం సాగుతోంది. అమెరికా సామ్రాజ్యవాదుల సంపూర్ణ అండదండలతో బెనిగ్నో అక్వినో ప్రభుత్వం 'ఒప్లాన్ బయనిహాన్' పేరుతో గత రెండు సంవత్సరాలుగా ప్రజలపై యుద్ధాన్ని సాగిస్తోంది. ఈ అన్యాయపూర్ణ యుద్ధాన్ని ఫిలిప్పైన్స్ కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో ప్రజలు పెద్దయెత్తున ప్రతిఘటిస్తున్నారు.

ఫిలిప్పైన్స్ తొలి అధ్యక్షుడు రోక్జాస్ నుంచి గ్లోరియా అర్రోయో వరకూ తొత్తు పాలకవర్గ ప్రభుత్వాలు సిపిపి నాయకత్వంలో సాగుతున్న విప్లవోద్యమం తమ దోపిడి వ్యవస్థకు ముప్పుగా పరిణమించిందని భావించి, ఈ ఉద్యమాన్ని సమూలంగా నాశనం చేసే లక్ష్యంతో నిరంతరాయంగా అనేక 'అంతర్గత భద్రతా ఆపరేషన్ల' (అణచివేత ఆపరేషన్లు)ను సాగిస్తూనే వచ్చాయి. వీటన్నింటినీ ప్రజలు ఫిలిప్పైన్స్ కమ్యూనిస్టు పార్టీ (సిపిపి) నాయకత్వంలో ఓడించి ప్రజాయుద్ధాన్ని ఉన్నతస్థాయికి పురోగమింపజేశారు. సామ్రాజ్యవాద దోపిడి, పీడన, అదుపుకూ, అర్ధవలస, అర్ధవలస భూస్వామ్య వ్యవస్థకూ గోరికట్టేందుకు కార్మికవర్గ (సిపిపి, ఎన్‌పిఏ, ఎన్‌డిఎఫ్‌ల) నాయకత్వంలో ఫిలిపినో ప్రజలు విప్లవ పథంలో పురోగమించడం అమెరికా సామ్రాజ్యవాదులకు, అక్కడి దోపిడి పాలకవర్గాలు ఏమాత్రం మింగుడు పడని విషయంగా మారింది. ఫిలిప్పైన్స్ విప్లవం మరింత బలపడితే తమ దోపిడి ప్రయోజనాలకు చెల్లుచీటి మిగులుతుందని అమెరికా సామ్రాజ్యవాదం, దాని తొత్తు పాలకవర్గాలు భీతిల్లుతున్నాయి. అవి ప్రజలను మోసగించి విప్లవోద్యమాన్ని దెబ్బతీసేందుకు, విప్లవోద్యమంపై బురదజల్లుతూ వెనకబాటుతనానికి, పేదరికానికి, ఇతర సామాజిక సమస్యలకు కమ్యూనిస్టుల హింసే కారణమని కుట్రపూరితంగా దుష్ప్రచారానికి దిగాయి. అవి ఫిలిపినో విప్లవోద్యమాన్ని, ప్రజలను క్రూరంగా అణచివేసే లక్ష్యంతో అమెరికా కౌంటర్ ఇన్‌సర్జెన్సీ గైడ్‌ను అనుసరిస్తూ మరో విస్తృత, బహుముఖ

దాడి, సంపూర్ణ విప్లవ ప్రతీఘాతుక యుద్ధం అయిన 'ఒప్లాన్ బయనిహాన్'కు పూనుకున్నాయి. శాంతి–అభివృద్ధి–మానవ హక్కుల కోసం భారీస్థాయిలో రూపొందించిన పథకంగా దీనిని వూరూవాడ ప్రచారం చేస్తున్నాయి. 'శాంతి గెలుచుకోవడం' అనే నినాదాన్ని ప్రచారం చేస్తూ, క్రూరమైన సైనిక అణచివేత క్యాంపెయిన్లను శుద్ధ 'శాంతి–అభివృద్ధి' ఆపరేషన్లుగా చూపుతూ, ఏకకాలంలో సాగే ముప్పేట (కంబాట్, ఇంటలిజెన్స్, పౌర–సైనిక) ఆపరేషన్లను కప్పిపెడుతున్నాయి.

వాళ్లు చెబుతున్నట్లుగా శాంతికి సంబంధించిన ఎటువంటి ఎజెండా వారికి లేదు. శాంతి చర్చలకు వారు పెద్దగా ప్రాధాన్యత ఇచ్చిందీ లేదు. ప్రచారంలో, మానసిక యుద్ధంలో పైచేయి సాధించాలని ప్రయత్నించడం, విప్లవకారులను లొంగిరావాలని ప్రకటనలు చేయడం తప్ప, వీటిని మించి బెనిగ్నో అక్వినో ప్రభుత్వం ఏదైనా చేయాలని ఆశిస్తుందనడానికి లేదా అందుకు సిద్ధంగా ఉందనడానికి ఎటువంటి సూచనా ఇప్పటి వరకూ లేదు. నిజానికి సోకాల్డ్ శాంతి చర్చలలో నిర్ణయాత్మక పాత్ర వహించే అధికారులంతా (బ్యూరాక్రాట్లు) కమ్యూనిస్టుల పట్ల విషం కక్కేవారూ, విప్లవోద్యమమంటే ఏమాత్రం గౌరవం లేనివారూనూ.

ఫిలిప్పైన్స్ సైన్యం పేద రైతాంగం, జాతీయ మైనారిటీలపై ప్రధానంగా దాడులు చేస్తోంది. విస్తరిస్తున్న ప్రజా ప్రతిఘటనను అణచివేయడం, వికసిస్తున్న ప్రజాస్వామ్య అధికారాన్ని ధ్వంసం చేయడం, విదేశీ వాణిజ్య ప్రయోజనాలను కాపాడడమే ఒప్లాన్ బయనిహాన్ అసలు లక్ష్యం. దీనికోసం మొత్తం దేశాన్ని సైనిక శిబిరంగా మార్చివేస్తున్నారు. వివిధ ప్రభుత్వ–ప్రైవేట్ ప్రాజెక్టు నిర్మాణం కోసం పట్టణ, గ్రామీణ పేదల ప్రజలను లక్షలాది నిర్వాసితులను గావిస్తున్నారు. విదేశీ మైనింగ్ ప్రాంతాలు, వ్యాపార ప్లాంటేషన్లు, బడా వాణిజ్య పంటల క్షేత్రాలలో, అలాగే నిర్మాణంలో ఉన్న విదేశీ కంపెనీల ప్రయోజనాల కోసం నిర్మించే మెగా డ్యామ్‌లు, ఇతర విధ్వంసక 'అభివృద్ధి' ప్రాజెక్టుల ప్రాంతాల్లో, భారీ డ్యామ్‌ల నిర్మాణం సాగుతున్న ప్రాంతాల సైనికీకరణ తీవ్రంగా ఉంది.

హత్యలు, వ్యక్తులను మాయం చేయడం, చిత్రహింసలు, చట్టవ్యతిరేక గాలింపు చర్యలు–అరెస్టులు–నిర్బంధాలు, మానవహక్కుల ఉల్లంఘనలు నిరాఘాటంగా సాగుతున్నాయి. బాంబు దాడులు, తుపాకి కాల్పులు, ఊచకోతలు తీవ్రస్థాయిలో జరుగుతున్నాయి. ఈ ఆపరేషన్లు ప్రజల జీవనోపాధిని, ఇళ్లను, ఆస్తులను ధ్వంసం చేస్తున్నాయి. పదుల వేల సంఖ్యలో ప్రజలు రక్షణ కోసం తమ నివాసాలను వదిలిపెట్టి వలసపోతున్నారు. గ్రామస్తులను బలవంతంగా పారామిలటరీ గ్రూపులలో చేర్చుకుంటున్నారు.

ప్రజల ఐక్యతను దెబ్బతీయడం, వారి ప్రతిఘటనను తప్పుదారి పట్టించడం కోసం సైనికులు తప్పుడు సమాచారాన్ని వ్యాపింపజేస్తున్నారు, మోసపూరిత కార్యక్రమాలను ప్రచారం చేస్తున్నారు. బూటకపు వ్యవసాయ సంస్కరణలతో సహా డబ్బు బదిలీ పథకాలు వంటి విప్లవ వ్యతిరేక కార్యక్రమాలను సైన్యమే నేరుగా అమలు చేస్తోంది.

అమెరికా, యూరోప్, జపాన్, ఆస్ట్రేలియా తదితర సామ్రాజ్యవాదులకు కాసుల పంటలు పండించే పర్యావరణ టూరిజం, సముద్ర గర్భంలో మైనింగ్ (గనుల తవ్వకం) ప్రాజెక్టుల నిర్మాణం వల్ల పర్యావరణమూ, దేశంలోని మత్స్యపరిశ్రమ తీవ్ర ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నాయి. నల్ల ఇసుక, బంగారం, రాగి, సీసం, జింకు ఖనిజాల తవ్వకాల కోసం, చమురు, గ్యాస్ వెలికితీత కోసం, టూరిజం పరిశ్రమ కోసం వేలాది హెక్టార్ల భూముల నుంచి మత్స్యకారులను, రైతాంగాన్ని నిర్వాసితులను చేస్తున్నారు. ఈ పర్యావరణ విధ్వంస ప్రాజెక్టులకు వ్యతిరేకంగా ఫిలిప్పైన్స్ మత్స్యకారుల ఆందోళనలను అణచివేసే స్పష్టమైన లక్ష్యంతో అక్వినో ప్రభుత్వం కౌంటర్ ఇన్‌సర్జెన్సీ పథకాన్ని అమలు చేస్తున్నది. మానవహక్కులు అనే మాటకు తావులేకుండా లుమడ్ మైనారిటీలను ఆ ప్రాంతం నుంచి పారదోలడానికి ప్రత్యేకంగా 'న్యూ ఇండిజినస్ పీపుల్స్ ఆర్మీ ఫర్ రిఫార్మ్' అనే హంతక పారామిలటరీ బలగాన్ని 'ఒప్లాన్ బయనిహాన్' రూపకర్తలు ఏర్పర్చారు. ఈ విధంగా వందలాది మంది విప్లవ ప్రతీఘాతకులను సాయుధం చేశారు. ఫలితంగా అక్కడ బీభత్సం విలయతాండవం చేస్తోంది. రైతాంగంపై, ప్రత్యేకించి మహిళలు, పిల్లలపై అత్యాచారాలు సాగుతున్నాయి.

'ఒప్లాన్ బయనిహాన్'కు వ్యతిరేకంగా సిపిపి నాయకత్వంలో ఎన్‌పిఏ, ఎన్‌డిఎఫ్, ఇతర ప్రజా సంఘాలు, అనేక స్వతంత్ర పౌర సంస్థలు, పౌరహక్కుల సంఘాలు, సాయుధ–నిరాయుధ, రహస్య–బహిరంగ రూపాల్లో గత రెండు సంవత్సరాలుగా ప్రతిఘటనా పోరాటాలు సాగిస్తున్నాయి. శాంతి–అభివృద్ధి పేరుతో దేశాన్ని సైనిక శిబిరంగా మార్చివేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. సామ్రాజ్యవాదుల, ప్రత్యేకించి అమెరికా సామ్రాజ్యవాదుల ప్రయోజనాలను కాపాడే విప్లవ ప్రతీఘాతుక యుద్ధాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేస్తున్నాయి. ప్రజల జాతీయ, సామాజిక విముక్తిని అడ్డుకుంటూ సాయుధ విప్లవోద్యమాన్ని ధ్వంసం గావించే విప్లవ ప్రతీఘాతుక యుద్ధం 'ఒప్లాన్ బయనిహాన్'ని దెబ్బతీసి, ఓడించాలనే కృతనిశ్చయంతో పనిచేస్తున్నాయి.

2011 నుంచి సిపిపి దీర్ఘకాలిక ప్రజాయుద్ధంలో ప్రారంభదశ అయిన వ్యూహాత్మక ఆత్మరక్షణా దశను పరిపూర్తి చేసుకొని, మధ్య దశ అయిన వ్యూహాత్మక ప్రతిష్టంబనలోకి పురోగమించే లక్ష్యాన్ని నిర్దేశించుకొని కృషి చేస్తోంది. ఎన్‌పిఏ దేశవ్యాప్తంగా వందల సంఖ్యలో చిన్న, మధ్య, పెద్ద రకం ఎత్తుగడల ఎదురుదాడులను నిర్వహించి బెనిగ్నో అక్వినో సాయుధ బలగాలను బెంబేలెత్తిస్తోంది. పెద్దయెత్తున అది నిర్వహిస్తున్న చికాకుపరిచే చర్యలే ప్రభుత్వ సైన్యానికి ఒక గండంగా మారిపోయాయి. లక్షలాది ప్రజల క్రియాశీల భాగస్వామ్యంతో ఈ వీరోచిత ప్రతిఘటన రోజు రోజుకూ విస్తృత ప్రజాయుద్ధ రూపం తీసుకుంటోంది. మానవహక్కుల రక్షణకు, వ్యవసాయ సంస్కరణలకై ప్రజాస్వామ్య ఉద్యమ పురోగమనానికి, జాతి స్వయం నిర్ణయాధికార హక్కులకై ప్రజలు తమ ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తున్నారు.

ఫ్యాక్టరీలలో కార్మికులు, పట్టణ పేదలు, గ్రామీణ సముదాయాలు, స్కూలు విద్యార్థులు పెద్దయెత్తున రోడ్ల మీదకు వచ్చి ఆందోళనలు సాగిస్తున్నారు. పెట్టుబడిదారీ దోపిడి, రాజ్య అణచివేతలను కార్మికులు సమ్మెలు, ఇతర రూపాలలో ప్రతిఘటిస్తున్నారు. రైతులు భూముల

ఆక్రమణ, నిరసన ప్రదర్శనలు, పెద్దయెత్తున విజ్ఞాపన పత్రాల సమర్పణ, వీధి పోరాటాలతో పాటు సాయుధ చర్యలలో పాల్గొంటున్నారు. భూస్వామ్య, అర్ధభూస్వామ్య దోపిడిని, భూకబ్జాలను, ఫాసిస్టు అత్యాచారాలను ప్రతిఘటిస్తున్నారు. బస్తీలను ఖాళీ చేయించడాన్నీ, వివిధ ప్రజావ్యతిరేక నిర్మాణాల కోసం దూరప్రాంతాలకు పట్టణ పేదల్ని తరలించడాన్నీ నిరసిస్తూ నగరాల్లో ప్రజలు బారికేడ్లు నిర్మించుకొని పోలీసు బలగాలతో తలపడుతున్నారు.

ఈ విధంగా ఫిలిపినో ప్రజలు పట్టణాల్లో, గ్రామాల్లో, ఫ్యాక్టరీల్లో, మురికివాడల్లో, విద్యాలయాల్లో, కార్యాలయాల్లో మిలిటెంట్‌గానూ, మరోవైపు సాయుధంగానూ పోరాడుతూ ప్రపంచ పీడిత ప్రజానీకానికి ఉత్తేజంగా, ప్రేరణగా నిలుస్తున్నారు.

**'ఒప్లాన్ బయనిహాన్'ను వ్యతిరేకించండి! ఫిలిప్పైన్స్ విప్లవోద్యమానికి మద్దతుగా భారతదేశ వ్యాప్తంగా సంఘీభావ ఉద్యమాన్ని నిర్మించండి!**

అమెరికా సామ్రాజ్యవాదుల, బడా దళారీ బూర్జువా, బడా భూస్వామ్య వర్గ దోపిడి ప్రయోజనాల రక్షణ కోసం ఫిలిపినో ప్రజలపై హత్యలు-అత్యాచారాలు-అరెస్టులు-చిత్రహింసలు-నిర్వాసితుల్ని చేయడం ద్వారా బీభత్సం సృష్టిస్తున్న విప్లవ ప్రతీఘాతుక 'ఒప్లాన్ బయనిహాన్'ను వ్యతిరేకించండి! ఫిలిప్పైన్స్‌లోని అమెరికా మిలిటరీ బేసులన్నిటినీ ఎత్తివేయాలని డిమాండ్ చేయండి! అమెరికా మద్దతుతో తొత్తు బెనిగ్నో అక్వినో ప్రభుత్వం ప్రజలపై సాగిస్తున్న ఈ యుద్ధాన్ని తక్షణం నిలిపివేయాలని డిమాండ్ చేయండి! ప్రజలపై సైన్యం, పోలీసు, పారా మిలటరీ దాడులను నిలిపివేయాలనీ, వీటిని ఉద్యమ ప్రాంతాల నుండి వెనక్కు తీసుకెళ్లాలని డిమాండ్ చేయండి! ఫిలిప్పైన్స్ జైళ్లలో ఉన్న రాజకీయ ఖైదీలనందరినీ తక్షణమే బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేయండి! దేశాన్ని సామ్రాజ్యవాదులకు, ప్రత్యేకించి అమెరికా సామ్రాజ్యవాదులకు, బహుళ జాతి కార్పొరేట్ కంపెనీలకు తాకట్టు పెడుతున్న బెనిగ్నో అక్వినో ఫాసిస్టు పాలనకు వ్యతిరేకంగా వీరోచితంగా సాగుతున్న ఫిలిపినో విప్లవానికి మద్దతుగా సంఘీభావ ఉద్యమాన్ని నిర్మించాల్సిందిగా మా పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) ఈ దేశ ప్రజలకు, ప్రజాస్వామిక వాదులకు పిలుపు నిస్తోంది. ఫిలిప్పైన్స్‌లో సాగుతున్న బహుముఖ అణచివేత దాడిని సభలు, సమావేశాలు, క్యాంపెయిన్లు, పోస్టర్లు, కరపత్రాలు, సెమినార్లు, వీధి మీటింగులు, గ్రూపు మీటింగులు తదితర రూపాలతో విశాల ప్రజారాశులలో ఎండగట్టండి! 'ఒప్లాన్ బయనిహాన్' ఎంతటి క్రూరమైనది అయినా, అది తప్పక ఓడిపోయి తీరుతుందని ఫిలిపినో ప్రజల విప్లవ చరిత్ర, ప్రపంచ ప్రజల విప్లవోద్యమ చరిత్ర చాటిచెబుతున్నాయి. అంతిమంగా సామ్రాజ్యవాదులు, అభివృద్ధినిరోధకులు ఓడించబడతారు. ప్రజలే విజేతలుగా నిలుస్తారు.

**ఫిలిప్పైన్స్ విప్లవ ప్రజలారా!**

సి.పి.ఐ.(మావోయిస్టు) నాయకత్వంలో పురోగమిస్తున్న భారతదేశ విప్లవోద్యమం, యావత్తు విప్లవ ప్రజానీకం మీకు తమ దృఢమైన మద్దతునూ, విప్లవ సౌహార్ద్రతనూ తెలియజేస్తున్నారు. భారత, ఫిలిప్పైన్ విప్లవోద్యమాలు పరస్పర సహాయసహకారాలతో, తాము నిర్దేశించుకున్న

లక్ష్యాల వైపు అనన్య త్యాగాలతో విజయవంతంగా పురోగమిస్తున్నాయి. ప్రపంచ సోషలిస్టు విప్లవంలో ఒక భాగంగా భారతదేశంలో మా పార్టీ–సి.పి.ఐ.(మావోయిస్టు) నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయడానికి ఎటువంటి త్యాగాలకైనా వెరవకుండా మొక్కవోని దీక్షతో పురోగమించడం ద్వారా, ఫిలిపినో విప్లవోద్యమానికి అన్ని విధాలుగా కదనరంగంలో దృఢమైన సహ పోరాటయోధులుగా నిలవడం ద్వారా ఫిలిప్పైన్ నూతన ప్రజాస్వామిక విప్లవ విజయానికి కార్మికవర్గ అంతర్జాతీయతతో మావంతు పాత్రను నిర్వహిస్తామని వాగ్దానం చేస్తున్నాం. ఫిలిపినో ప్రజలు అజేయులు. ప్రపంచ పీడిత ప్రజానీకం మీ వెంట ఉంది. పురోగమించండి !

**ఆనంద్**

**కార్యదర్శి, సెంట్రల్ రీజినల్ బ్యూరో,**

**సీపీఐ (మావోయిస్టు)**

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# సెంట్రల్ రీజినల్ బ్యూరో

**19-4-2013**

## పువ్వార్ ఫాసిస్టు హత్యాకాండను ఖండించండి!
## ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఒడిషా పోలీసు, ప్రత్యేక కమాండో/ గ్రేహౌండ్స్, కేంద్ర పారామిలిటరీ బలగాలు సెంట్రల్ రీజియన్ ప్రాంతంలో సాగిస్తున్న హత్యాకాండలకు, విధ్వంసానికి నిరసనగా...
## ఏప్రిల్ 27న సెంట్రల్ రీజియన్ బంద్‌ను జయప్రదం చేయండి!

2013 ఏప్రిల్ 16న ఆంధ్రప్రదేశ్ సరిహద్దులో ఛత్తీస్‌గఢ్‌కు చెందిన సుక్మ జిల్లా, కొంట బ్లాక్, పువ్వార్ గ్రామంలో ఏపీ గ్రేహౌండ్స్, ఛత్తీస్‌గఢ్ పోలీసులు, సీఆర్‌పీ-కోబ్రా బలగాలు ఖమ్మం ఎస్‌పీ రంగనాథ్, కొత్తగూడెం ఓఎస్‌డీ నాయకత్వంలో, ఇన్‌ఫార్మర్లు అందించిన పక్కా సమాచారంతో సంయుక్తంగా దాడి చేసి ఉత్తర తెలంగాణాకు చెందిన ఐదుగురు మహిళలు సహా తొమ్మిది మంది కామ్రేడ్స్‌ను హత్య చేశాయి. ఈ దాడిలో ఉత్తర తెలంగాణా స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు కామ్రేడ్ మద్రి రవి ఎలియాస్ సుధాకర్‌తో పాటు గుగ్‌లోత్ లక్ష్మి ఎలియాస్ పుష్ప (కేకేడబ్ల్యూ డీవీసీఎం), వెట్టి నర్సక్క ఎలియాస్ సబిత (ఏటూర్‌నాగారం ఏసీఎస్), దుర్గం రాజు (ఏసీఎం), రీన (ఏసీఎం), వెట్టి రామక్క ఎలియాస్ ఊర్మిళ (ఏసీఎం), మద్ది సీత ఎలియాస్ నవత (డీవీసీఎం గార్డు), మడ్కాం భీమ ఎలియాస్ అజయ్ (డీవీసీఎం గార్డు), అర్లి వెంకటి ఎలియాస్ గౌతం (ఎస్‌జెడ్‌సీఎం గార్డు) అమరులయ్యారు. ఈ అమరులందరికీ సెంట్రల్ రీజనల్ బ్యూరో అరుణారుణ జోహార్లర్పిస్తూ వారి ఆశయసాధనకు ప్రతిన బూనుతున్నది. గత కొన్ని సంవత్సరాలుగా ఏపీ గ్రేహౌండ్స్ దండకారణ్యంలోకి జొరబడి ఇటువంటి హత్యాకాండలకు, విధ్వంసానికి పాల్పడుతున్నారు. 2008లో జరిగిన కంచాల్ హత్యాకాండ తర్వాత ఇది మరొక భారీ హత్యాకాండ. మా పార్టీ ఈ హత్యాకాండను తీవ్రంగా ఖండిస్తూ పోలీసు, గ్రేహౌండ్స్, అర్ధసైనిక బలగాల దాడులను ప్రతిఘటించాల్సిందిగా ప్రజలకు, పీఎల్‌జీఏ బలగాలకు పిలుపునిస్తున్నది.

గత నాలుగు నెలలుగా దండకారణ్యం, ఆంధ్ర-ఒడిషా సరిహద్దు జోన్, ఉత్తర తెలంగాణా, గోందియా (మహారాష్ట్ర) ప్రాంతాలు పోలీసు, గ్రేహౌండ్స్, పారామిలిటరీ బలగాల ఇనుప బూట్ల కింద నలిగిపోతున్నాయి. ప్రతిరోజూ, ప్రతి మూలనా ప్రభుత్వ సాయుధ బలగాలు సాగిస్తున్న హత్యలు, బూటకపు ఎన్‌కౌంటర్లు, విధ్వంసం, బీభత్సానికి సంబంధించిన వార్తలు

వినవస్తున్నాయి. ప్రపంచంలో అతి పెద్ద ప్రజాస్వామ్యంగా చెప్పుకునే భారత దోపిడీ పాలకవర్గాలు తరతరాలుగా అత్యంత క్రూర దోపిడీ పీడనలకు, అణచివేతకు, అన్యాయానికి, వివక్షకు, నిర్లక్ష్యానికి గురవుతున్న ప్రజలపై, ముఖ్యంగా ఆదివాసులపై మునుపెన్నడూ లేనంత పాశవికతకు పాల్పడుతున్నాయి. తమ యజమానులైన సామ్రాజ్యవాదుల, ప్రత్యేకించి అమెరికా సామ్రాజ్యవాదుల అండదండలతో, విప్లవోద్యమాన్ని సమూలంగా నిర్మూలించే లక్ష్యంతో గత నాలుగేళ్లుగా ఆపరేషన్ గ్రీన్‌హంట్ పేరుతో ప్రజలపై కొనసాగిస్తున్న యుద్ధం రోజురోజుకూ మరింత తీవ్ర రూపం దాలుస్తున్నది. దండకారణ్యంలో గత పది రోజుల వ్యవధిలో కనీసం 20 మంది విప్లవకారులను, సాధారణ ప్రజలను ఎన్‌కౌంటర్ల పేరిట హత్య చేశారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిషా, మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో వేరు వేరు రాష్ట్రాల పోలీసు, కమాండో బలగాలు, కేంద్ర బలగాలు సంయుక్త ఆపరేషన్లను నిర్వహిస్తూ విచ్చలవిడి ఎన్‌కౌంటర్లకు, హత్యాకాండలకు, విధ్వంసానికి పాల్పడుతున్నాయి. ఇటీవల ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మలో, ఆంధ్రప్రదేశ్‌లోని కరీంనగర్ జిల్లా, కాటారంలో నాలుగు రాష్ట్రాల పోలీసు వున్నతాధికారులు ప్రత్యేక సమావేశాలు జరిపి ఈ తాజా దాడులకు పథకరచన చేశారు. వాయుసైనిక హెలికాప్టర్ల వినియోగాన్ని పెంచడం, మానవరహిత విమానాల ప్రయోగాన్ని పెంచడంతో పాటు వాయుసైన్యం ద్వారా పై నుండి దాడులు చేయించాలని కూడా యోచిస్తున్నారు. మరోవైపు సైన్యం శిక్షణ పేరుతో మాడ్ ప్రాంతాన్నంతా ఆక్రమించి క్రమంగా ప్రజలపై యుద్ధంలోకి సైన్యాన్ని కూడ దించడం వాళ్ల ఎజెండాలో వున్నది. ఈ దాడుల ద్వారా, ప్రజలు నిర్మించుకుంటున్న నూతన ప్రజారాజ్యాధికార వ్యవస్థనూ, వారి గెరిల్లా సేననూ, వారి పార్టీనీ నిర్మూలించడానికి కేంద్రీకరిస్తున్నారు. ఇటీవలి కాలంలో జరిగిన మరి కొన్ని సంఘటనలు ఇందుకు సజీవ సాక్ష్యంగా నిలుస్తాయి.

- ఏప్రిల్ 12న మహారాష్ట్ర, గడ్చిరోలి జిల్లా, ధనోర తలూకా, సిందేసూర్ గ్రామంలో ప్రజలు గెరిల్లాలకు భోజన ఏర్పాట్లు చేస్తున్న సమయంలో పోలీసులు అకస్మాత్తుగా విరుచుకుపడి కామ్రేడ్ కైలాస్ ఎలియాస్ పంకజ్ (ఏసీఎం), కామ్రేడ్ చంప నురేటి (కంపెనీ-4 సభ్యురాలు)తో పాటు గ్రామానికి చెందిన వసంతి కొవాసీ, సంగీత ఆత్రం అనే ఇద్దరు నిరాయుధ మహిళలను కాల్చి చంపారు.
- ఏప్రిల్ 4న ఇదే జిల్లాలోని భామ్రాగఢ్ తాలూకా, భట్‌పర్ గ్రామంలో ప్రజలతో సమావేశం జరుపుతున్న గెరిల్లా దళంపై సీ-60 కమాండోలు జరిపిన విచ్చలవిడిగా జరిపిన కాల్పుల్లో కామ్రేడ్ లక్ష్మణ్ (ఏసీఎం), మిలిషియా సభ్యులు కామ్రేడ్స్ ప్రకాశ్, సుధాకర్‌లతో పాటు ఆ గ్రామానికి చెందిన అమ్మి, సునిత అనే మహిళలను హత్య చేశారు.
- ఏప్రిల్ 2న ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణ్‌పూర్ జిల్లా, మాడ్ ప్రాంతానికి చెందిన కొంగె గ్రామంలో దాడి చేసి అడవిలో వేటకు వెళ్లిన ఆరుగురు అమాయక ఆదివాసులను పట్టుకెళ్లి 'ఇనామీ నక్సలీ'లుగా ప్రకటించారు. అంతకు ముందు ఇండ్లలోకి జొరబడి

దోపిడీ దొంగల్లా లూటీకి, విధ్వంసానికి పాల్పడ్డారు.

- మార్చ్ 14న మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా, కోబ్రమెండ గ్రామం దగ్గర అడవుల్లో పార్టీ నాయకత్వాన్ని నిర్మూలించే లక్ష్యంతో భారీ దాడికి పాల్పడ్డారు.
- మార్చ్ 9న బీజాపూర్ జిల్లా కంచాల్ గ్రామం వద్ద ఏపీ గ్రేహౌండ్స్ జరిపిన కాల్పుల్లో కుంజాం దేవె అనే గ్రామస్తురాలు చనిపోగా, మరొక మహిళ గాయపడింది. నీళ్ల కోసం చెలిమె వద్దకు వచ్చిన వాళ్లపై ఈ పాశవిక దాడికి పాల్పడ్డారు. తర్వాత దేవె శవంతో పాటు గాయపడ్డ మహిళను హెలికాప్టర్‌లో తీసుకెళ్లి యూనిఫారాలు తొడిగించి నక్సలైట్లుగా ప్రకటించారు.
- మార్చ్ 1న నారాయణ్‌పూర్ జిల్లా మాందోడ గ్రామంలో మిలిషియా సభ్యులపై కాల్పులు జరిపి కామ్రేడ్ గుధ్‌రాం నేండిని హత్య చేశారు.
- ఫిబ్రవరి 24న బీజాపూర్ జిల్లా కొర్సెలి గ్రామంపై పారామిలిటరీ బలగాలు, ఛత్తీస్‌గఢ్ పోలీసులు, ఎస్‌టీఎఫ్ దాడి చేసి గ్రామంలో సాధారణ జీవితం గడుపుతున్న కామ్రేడ్ సలీం (సమ్మిరెడ్డి)ని పట్టుకొని మరుసటి రోజు ఆవునార్ గ్రామం వద్ద కాల్చి చంపారు.
- ఫిబ్రవరి 5-8 మధ్య మాడ్ డివిజన్ (నారాయణ్‌పూర్ జిల్లా)లోని గట్టకల్ గ్రామంపై ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర పోలీసులు, సీఆర్‌పీఎఫ్ వందల సంఖ్యలో దాడి చేసి విధ్వంసానికి, లూటీకి పాల్పడ్డారు. గ్రామంలో క్రాంతికారీ జనతన సర్కార్ నాయకత్వంలో నడిచే ఆశ్రమ పాఠశాలను కాలబెట్టారు.
- ఫిబ్రవరి 4 నాడు సింగం, రేంగం గ్రామాల మీద దాడులు చేసి గ్రామ మహిళలపై సామూహిక అత్యాచారాలకు పాల్పడ్డారు.
- జనవరి 21-23 మధ్య బీజాపూర్ జిల్లాలోని గంగలూర్ దగ్గర గల పిడియా గ్రామంపై పోలీసులు, పారామిలిటరీ బలగాలు విరుచుకుపడి భారీ విధ్వంసకాండకు పాల్పడ్డారు. ఇండ్లలోకి జొరబడి విచ్చలవిడి లూటీకి పాల్పడి ఆ తర్వాత 20 ఇండ్లను కాలబెట్టారు. దొడ్డి తుమ్‌నార్ గ్రామంలో ప్రజలు క్రాంతికారీ జనతన సర్కార్ ఆధ్వర్యంలో నడుపుకుంటున్న ఆశ్రమ పాఠశాలను కాలబెట్టారు.
- జనవరి 19న గడ్చిరోలి జిల్లా, అహిరి తాలూకా గోవింద్‌గాంలో గ్రామస్తులతో సమావేశం ముగించుకొని బయలుదేరుతున్న గెరిల్లాలపై ముందస్తు సమాచారంతో పోలీసు బలగాలు మాటుగాచి చేసిన దాడిలో కామ్రేడ్స్ శంకర్ లక్డా (డీవీసీఎం), వినోద్ కొడొపి (అహిరి దళ కమాండర్), గీత కుమోటి (ప్లాటూన్-14 డిప్యూటీ కమాండర్), మోహన్ కొవాసీ (డిప్యూటీ కమాండర్)లతో పాటు సభ్యులు లెబ్బె గావ్‌డే, జూరు మట్టామి అమరులయ్యారు.

- జనవరి 19న చత్తీస్‌గఢ్, కాంకేర్ జిల్లా, భుర్‌భుసి గ్రామం వద్ద స్నానం చేస్తున్న గెరిల్లా దళ సభ్యులపై బీఎస్ఎఫ్ బలగాలు కాల్పులు జరపగా సనోతి, సుమిత్ర అనే ఇద్దరు మహిళా కామ్రేడ్స్ అమరులయ్యారు.
- జనవరి రెండవ వారంలో ఏపీ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని నిమ్మలగూడెం గ్రామం మీద దాడి చేసి ఇద్దరు గ్రామ మహిళలను తీసుకొనిపోయి డ్రెస్సులు తొడిగించి చంపడానికి ప్రయత్నం చేశారు. ఆ తర్వాత కోర్టులో హాజరుపరిచారు.
- చర్ల, దుమ్ముగూడెం ప్రాంతంలో, ఛత్తీస్‌గఢ్ సరిహద్దు గ్రామాల్లో ఏపీ పోలీసులు గ్రామాల మీద నిరంతరాయంగా దాడులు చేస్తూ వందలాది మందిని అరెస్టు చేసి కేసులు పెట్టి జైలుకు పంపారు. ఆంధ్ర-ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో సంతలను బంద్ చేయిస్తున్నారు.

పైన పేర్కొన్నవి మచ్చుకు కొన్ని ఉదాహరణలు మాత్రమే. ఇంకా ఎన్నెన్నో సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఆదివాసీ రైతులను అరెస్టు చేస్తూ వాళ్లను ఇనామీ నక్సలైట్లుగా ప్రకటించి తప్పుడు కేసులతో జైలు పాలు చేస్తున్నారు. దొంగ సాక్ష్యాలతో కఠిన కారావాస శిక్షలు విధిస్తున్నారు.

పాలక వర్గాలు తమ అణచివేత దాడులకు తోడుగా మానసిక యుద్ధాన్ని కూడ జత చేసి నడుపుతున్నారు. మావోయిస్టు నాయకులు అనారోగ్యంతో వున్నారని, పని చేయలేక మంచాన పడుతున్నారని మీడియా ద్వారా ప్రచారం చేస్తున్నారు. మావోయిస్టు నాయకులు డబ్బు మూటలతో పారిపోతున్నారని అబద్ధపు ప్రచారం చేస్తున్నారు. లొంగిపోయిన వాళ్ల ద్వారా పార్టీలో మహిళలు దోపిడీకి గురవుతున్నారని, బలవంతంగా వ్యాసెక్టమీ ఆపరేషన్లు చేయిస్తున్నారని దుష్ప్రచారం చేస్తున్నారు. మరోవైపు సరెండర్ పాలసీని పదే పదే ప్రచారం చేస్తూ తలలకు వెలలు ప్రకటిస్తున్నారు. ఆయుధాలతో పారిపోయి వచ్చిన వాళ్లకు లక్షల రూపాయలిస్తామని పోస్టర్ల ద్వారా ప్రచారం చేస్తున్నారు. మరోవైపు పోలీసు, పారామిలిటరీ బలగాలు సివిక్ యాక్షన్ ప్రోగ్రాంల పేరుతో గ్రామాల్లో సామాన్లు పంచుతున్నాయి. దోపిడీ ప్రభుత్వాలు తమ ఎల్ఐసీ దాడిలో భాగంగా సైనిక అణచివేతకు తోడుగా మానసిక యుద్ధాన్ని, బూటకపు సంస్కరణలను తీవ్రంగా కొనసాగిస్తున్నాయి.

దేశవ్యాప్తంగా విప్లవోద్యమాన్ని నిర్మూలించడం, దేశంలోని వివిధ విప్లవోద్యమ ప్రాంతాల్లో పెంపొందుతున్న ప్రజా రాజ్యాధికారాన్ని నాశనం చేయడం, తద్వారా దేశంలోని విలువైన ప్రకృతి సంపదలను సామ్రాజ్యవాద బహుళజాతి కంపెనీలకు, దళారీ నిరంకుశ పెట్టుబడిదార్ల కార్పొరేట్ కంపెనీలకు దోచిపెట్టడంలో ఎదురవుతున్న అడ్డంకులను తొలగించుకోవడమే ఈ దాడి లక్ష్యం. ఈ దాడికి సోనియా-మన్మోహన్-చిదంబరం-షిందే-జయరాం రమేష్ పాలక ముఠా నాయకత్వం వహిస్తుండగా వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో ఇందులో పాలు పంచుకుంటున్నాయి. టాటా, మిత్తల్, జిందల్, ఎస్సార్, అల్ ఖైమా, నెకో జయస్వాల్స్ తదితర

దళారీ, విదేశీ  కార్పొరేట్ కంపెనీలతో చేసుకున్న లక్షల కోట్ల రూపాయల ఎంవోయూలు దేశవ్యాప్తంగా సాగుతున్న ప్రజల ప్రతిఘటన మూలంగా, అనేక చోట్ల ఆ ప్రతిఘటనకు భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) నాయకత్వం వహిస్తుండడం మూలంగా అమలుకు నోచుకోలేకపోతున్నాయి. అందుకే ఈరోజు మావోయిస్టు ఉద్యమం దేశ దోపిడీ పాలక వర్గాల దృష్టిలో 'అతి పెద్ద ప్రమాదం'గా మారింది. అందుకే దీన్ని నిర్మూలించాలని సామ్రాజ్యవాదులు, దళారీ నిరంకుశ పెట్టుబడి దార్లు, భూస్వామ్య వర్గాలు త్వరపడుతున్నాయి.

ప్రజలు తమను తాము కాపాడుకోవడానికి, స్వీయ సమైక్యతా కృషిపై ఆధారపడి తమ భవిష్యత్తును తామే నిర్మించుకోవడానికి, తమ ప్రజాస్వామిక ఆకాంక్షలను నెరవేర్చుకోవడానికి సామ్రాజ్యవాదుల, వారి పెంపుడు కుక్కలైన భారత అభివృద్ధి నిరోధక దోపిడీ పాలకవర్గాల ఆర్థిక, రాజకీయ, అణచివేత విధానాలన్నిటినీ గట్టిగా వ్యతిరేకించాలనీ, వారి కిరాయి పోలీసు, పారామిలిటరీ, మిలిటరీ బలగాలను మరింత దృఢంగా ప్రతిఘటించాలని విజ్ఞప్తి చేస్తున్నాం. ఈ దాడిని ఖండించాల్సిందిగా, ఆపాలని డిమాండ్ చేయాల్సిందిగా మేం దేశంలోని కార్మిక–కర్షకులకు, విద్యార్థి–మేధావులకు, ప్రజాస్వామికవాదులకు, దేశభక్తులందరికీ విజ్ఞప్తి చేస్తున్నాం. విప్లవోద్యమ ప్రాంతాల్లో తిష్టవేసిన పారామిలిటరీ బలగాలు వెనక్కి పోవాలని, సైన్య శిక్షణా కార్యక్రమాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేయాల్సిందిగా కోరుతున్నాం. ఈ దాడికి నిరసనగా ఏప్రిల్ 27న సెంట్రల్ రీజియన్ ప్రాంతంలో (ఉత్తర తెలంగాణ, ఆంధ్ర–ఒడిషా సరిహద్దు ప్రాంతం, దండకారణ్యం, మహారాష్ట్రలోని గోందియా, గడ్చిరోలి, మధ్యప్రదేశ్‌లోని బాలాఘాట్ జిల్లాలలో) జరుగబోయే బంద్‌ను విజయవంతం చేయాలని మా పార్టీ సెంట్రల్ రీజనల్ బ్యూరో ప్రజలందరికీ పిలుపునిస్తున్నది. విద్యాసంస్థలను, వ్యాపార సంస్థలను, బ్యాంకులను, రైలు, రవాణా తదితర కార్యకలాపాలన్నిటినీ నిలిపివేసి దోపిడీ ప్రభుత్వాలకు ఈ దాడి పట్ల నిరసన తెలపాలని ప్రజలందరినీ కోరుతున్నాం. (అయితే విద్యార్థుల పరీక్షలను, వైద్యం వంటి అత్యవసర సేవలను బంద్ నుండి మినహాయిస్తున్నాం.)

**ప్రతాప్**

**అధికార ప్రతినిధి**

**సెంట్రల్ రీజనల్ బ్యూరో**

**సీపీఐ (మావోయిస్టు)**

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# కేంద్ర కమిటీ

**20-4-2013**

## భూసేకరణ బిల్లుకు వ్యతిరేకంగా పోరాడండి!
## జల్, జంగల్, జమీన్‌లపై హక్కు కోసం పోరాటాల్ని తీవ్రతరం చేస్తూ, మన భూముల్ని గుంజడానికి సామ్రాజ్యవాదులు-దళారీ నిరంకుశ పెట్టుబడిదారులు-బడా భూస్వాములు చేస్తున్న కుట్రలను ఓడించండి!
## సిసలైన భూసంస్కరణలే నేటి అవసరం, భూసేకరణ కాదు!

ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లో మన కాళ్ల కింది నుండి భూమిని లాగేయడానికి అన్ని సన్నాహాలు పూర్తయ్యాయి. మన దేశంలో కోట్లాది రైతులు నేలతల్లిగా కొలిచే ప్రధాన ఉత్పత్తి సాధనమైన భూమి, తరతరాలుగా ఉపాధిని కల్పిస్తున్న, మరెన్నో తరాలకు కల్పించాల్సిన భూమి. మన దేశాన్ని బ్రిటిష్‌వాళ్లు ఆక్రమించుకున్న వలసకాలం నాటి అత్యంత అమానవీయమైన, క్రూరమైన భూకబ్జాలకు బూటకపు చట్టపరమైన ముసుగును తొడిగిన 'భూసేకరణ చట్టం, 1894' పైపై మెరుగులకు సిద్ధమైంది. పైపైన అనేది ఎందుకంటే దాని సారం, ఉద్దేశాలు మారలేదు. నాడు వలసవాదులు మన దేశ సంపదలను దోచుకు పోవడానికి అది దోహదపడితే, నేడు సామ్రాజ్యవాదులకు అదే పని కోసం దోహదపడుతుంది. ఇక మెరుగులు అనేవి 'న్యాయమైన నష్టపరిహారం, పారదర్శకత, పునరావాసం' లాంటి ముసుగుల్ని తగిలించుకుని వలసకాలం నుండి భూకబ్జాలకు మిగిలిపోయిన అడ్డంకులన్నిటినీ తొలగించే కార్యక్రమాన్ని చేపడతాయి. 1947 నామమాత్ర అధికార మార్పిడి తర్వాత వలసకాలం నుండి ఉన్నదున్నట్టుగా అన్వయించుకున్న లేదా సవరణలు చేసిన ఆర్థిక వ్యవస్థ సంబంధిత చట్టాలన్నీ ఆయా దశల్లో సామ్రాజ్యవాదుల, దళారీ నిరంకుశ బూర్జువాల అంతర్జాతీయ, దేశీయ అవసరాలను అనుసరించే జరిగాయి. ఇప్పుడు ప్రతిపాదిస్తున్న భూసేకరణ బిల్లు కూడా అందుకు అతీతం కాదు. యుపిఎ-2 'ప్రతిపక్ష పార్టీ'ల పరోక్ష మద్దతుతో త్వరత్వరగా తీసుకువస్తున్న, కార్పొరేట్ మీడియా పెద్దెత్తున హోరెత్తిస్తున్న 'బిగ్ బ్యాంగ్' సంస్కరణల వరుసలో ఇటీవలిదే 'కాలం చెల్లిన' 'భూసేకరణ చట్టం, 1894' స్థానంలో తీసుకువస్తున్న ఈ 'న్యాయమైన నష్టపరిహార హక్కు, భూసేకరణలో

పారదర్శకత, పునరావాసం బిల్లు, 2012'.

తాము ఎదుర్కొంటున్న ఆర్థిక సంక్షోభం నుండి త్వరత్వరగా బయటపడాలని చూస్తున్న సామ్రాజ్యవాదులు భారత పాలకవర్గాలను 'ఇంకా త్వరగా, ఇంకా త్వరగా' అని తొందరపెడ్తూ కొరడాలు ఝుళిపిస్తుండగా, వారికి అత్యంత నమ్మకమైన ఏజెంట్లయిన ప్రధాన మంత్రి, ఆర్థికశాఖ మంత్రి, గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రి 2012 సెప్టెంబర్ సంస్కరణల తర్వాత మరిన్ని త్వరలోనే తెస్తాం అని ఊదరగొట్టారు. చెప్పినట్టుగానే అనేక సంవత్సరాల మంతనాల తర్వాత భూసేకరణకు సంబంధించిన ఈ బిల్లును ఇప్పుడు పార్లమెంటు అనే ప్రహసనంలో ప్రవేశపెడుతున్నారు. ఈ మంతనాల ఉద్దేశం దోపిడీదారుల మధ్య ఎంత బాగా భూకబ్జాలను చేయాలనే విషయంలో ఏకాభిప్రాయం సాధించడం, ప్రజలను 'ప్రజాస్వామిక ప్రక్రియ' గురించి మోసగించడం తప్ప మరేమీ కాదు.

పేరులోనే ఉన్నట్టు ఈ బిల్లు ఉద్దేశం 'అభివృద్ధి' కోసం అంటే భారత పాలకవర్గాల భాషలో పెద్ద మైనింగ్ ప్రాజెక్టులు, పెద్ద ఆనకట్టలు, ప్రత్యేక ఆర్థిక మండళ్లు, హైవేలు, విమానాశ్రయాలు, రైల్వేలు, మిలటరీ కట్టడాలు వగైరా కోసం ప్రజల భూమిని సేకరించడం. నిజానికి, ఈ ప్రక్రియ 1947 నామమాత్ర అధికార మార్పిడి తర్వాత నుండే కొనసాగుతున్నా (నెహ్రూ ఆధునిక దేవాలయాలుగా అభివర్ణించిన పెద్ద ఆనకట్టలూ, ఇప్పటికీ నష్టపరిహారం అందకుండా మిగిలిపోయిన వాటి బాధితులూ మనకు తెలుసు), 1991 నాటి మొదటి తరం నయా వుదారవాద సంస్కరణల తర్వాత అది ఊపందుకుంది. న్యాయమైనది కాదు కదా, దాదాపుగా ఎటువంటి నష్టపరిహారమూ లేకుండా, సరైన పునరావాసం లేకుండా, నిర్ణయాల్లో ఎటువంటి పారదర్శకత, ప్రజల భాగస్వామ్యం లేకుండా ప్రభుత్వమూ, ప్రైవేటు పెట్టుబడి చేస్తూ వచ్చిన భూసేకరణ చరిత్రంతా ఒక అల్లకల్లోల చరిత్రే. ఒక అంచనా ప్రకారం 10 కోట్లమంది నిర్వాసితులు కాగా, పునరావాసం రేటు అతి ఘోరంగా 17 నుండి 20 శాతంగా వుంది. జీవనోపాధి కోల్పోవడం వల్లా, విస్థాపనకూ, మన దేశ సహజ సంపదలను అప్పనంగా బహుళజాతి కంపెనీలకు అప్పగించడానికీ వ్యతిరేకంగా పోరాడిన ప్రజలపై అమలైన రాజ్యహింసలోనూ ఎందరో ప్రాణాలు కోల్పోయారు. 'అభివృద్ధి' పట్ల భ్రమలు పూర్తిగా తొలగిపోయాయి. నిరాహార దీక్షలు మొదలుకొని సాయుధ పోరాటం దాకా వివిధ స్థాయిల్లో విస్థాపనకూ, 'అభివృద్ధి'కీ వ్యతిరేకంగా ప్రజాపోరాటాలు దేశవ్యాప్తంగా పెల్లుబుకడం, విస్తరించడంతో ఈ ప్రక్రియకు బ్రేకులు పడడం మొదలయ్యింది. ఈ నేపథ్యంలోనే పై బిల్లును తయారు చేసి చట్టంగా మార్చడానికి అన్ని సన్నాహాలు పూర్తి చేశారు.

'ప్రజాప్రయోజనం' పరిధిని చాలా విస్తరించేసి అందులో వ్యవసాయ సంబంధిత, వ్యవసాయ

ప్రాసెసింగ్, కోల్డ్ స్టోరేజి, పారిశ్రామిక కారిడార్లు లేదా మైనింగ్ కార్యకలాపాలు, జాతీయ పెట్టుబడులు, జాతీయ ఉత్పత్తి విధానంలో నిర్వచించిన లాంటి ఉత్పత్తి జోన్లకు సంబంధించిన అన్ని వ్యవస్థాపనా ప్రాజెక్టులు లేదా కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో నోటిఫికేషన్ పెట్టిన మరే వ్యవస్థాపనా సౌకర్యాలనైనా దానిలో చేర్చడం ద్వారా ఈ బిల్లు బహుళజాతి కంపెనీలకు భూమిని సేకరించడానికి తలుపులు బార్లా తెరిచేసి మిగిలిన కొద్దిపాటి స్వయం ప్రతిపత్తి, సార్వభౌమత్వాలను కూడా లేకుండా చేసేస్తోంది. మన దేశంలో భూమి మీద ఆధారపడిన కోట్లాది రైతాంగంతో పాటు, ఏ మాత్రం భూమిలేని కొన్ని కోట్లమంది ప్రజలు కూడా ప్రత్యక్షంగా, పరోక్షంగా దాని మీద ఆధారపడి బతుకుతున్నారు. సారవంతమైన భూములను నష్టపోవడం వల్ల వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు కూడా దెబ్బ తింటాయి. కాబట్టి ఈ బిల్లు కేవలం రైతాంగ కుటుంబాలనే కాక ఈ పరిశ్రమల మీద ఆధారపడిన కార్మికుల జీవితాలను కూడా ఛిన్నాభిన్నం చేస్తుంది.

ప్రైవేటు కంపెనీలు భూమిని ఉపయోగిస్తే 80 శాతం భూయజమానుల, ప్రభుత్వ-ప్రైవేట్ పార్ట్నర్‌షిప్ కోసం భూమిని సేకరిస్తే 70 శాతం భూయజమానుల ఆమోదం అవసరం అని ఈ బిల్లులో వుంది. కనీసం బాధిత కుటుంబాలన్నిటి ఆమోదం అవసరం అనేది కూడా లేకుండా కేవలం భూమిని కోల్పోయిన వారి ఆమోదం వుంటే సరిపోతుందన్నది. గత ఘోరమైన చరిత్రను చూసినపుడు, ఈ 'అనుమతి' వ్యవహారం ఎంత హాస్యాస్పదంగా మారిపోతుందో ఊహించచ్చు. 100 శాతం ప్రజల ఆమోదం లేకుండా 80 శాతం, 70 శాతం ప్రజల ఆమోదం ఎలా సరైంది? వీటి ద్వారా కలిగే దుష్పరిణామాల గురించి ప్రజలకు ఎంతవరకు చెప్తారు? ప్రజల్ని అజ్ఞానంలో వుంచడానికి ఎన్ని తప్పుడు సమాచార క్యాంపెయిన్‌లు నడుస్తాయి? దళారులకు ఇచ్చే లంచాల శాతం ఎంత, బలవంతంగా వత్తిడితో ఆమోదం తీసుకునే శాతం ఎంత? పోలీసు, పారామిలటరీ, ప్రత్యేక బలగాలు ప్రయోగించే హింస ఏ స్థాయిలో వుంటుంది? ప్రతి రాష్ట్రంలోనూ ఈ ప్రశ్నలకు సమాధానాలు ప్రజలకు అత్యంత పీడాకరంగా వుండినాయి. వారికి ఈ మోసం బాధాకరంగా తేటతెల్లమైంది.

అనేక పంటలు పండే సాగుభూమి సేకరణ పరిమితి ఎంత వుండాలి అనేది ఆయా రాష్ట్రాల ప్రత్యేకతలనూ, పరిస్థితులనూ దృష్టిలో వుంచుకుని నోటిఫై చేయడానికి ప్రభుత్వానికి ఈ బిల్లు విచ్చలవిడి అధికారాలను కట్టబెడుతున్నది. సామ్రాజ్యవాద-దళారీ నిరంకుశ పెట్టుబడికి కావల్సినన్ని ఎకరాల అనేక పంటలు పండే సాగుభూముల్ని సేకరించుకోగలిగే సౌకర్యాన్ని ఇది కలిగిస్తుంది. పెసా, అటవీ హక్కుల చట్టాలను స్పష్టంగా ఉల్లంఘిస్తూ గ్రామసభలన్నిటిలో కాకుండా, కేవలం 25 శాతం కంటే ఎక్కువ భూమలను సేకరించే గ్రామాల్లో, మున్సిపాలిటీల్లో

మాత్రమే పునరావాస ముసాయిదాపై బహిరంగ విచారణ వుంటుంది అని చెప్తోందీ బిల్లు. పునరావాస పథకానికి సంబంధించిన ప్రకటనను ఆలస్యం చేసే అధికారాన్ని కూడా ఈ బిల్లు ప్రభుత్వానికి కట్టబెడుతుంది. రైతులకు ఇచ్చే నష్టపరిహారం లక్షల రూపాయల్లో, భూమిని తిరిగి అమ్మే రేటు కోట్ల రూపాయల్లో వుంటున్నదంటే బలవంతంగా తమ భూముల్ని అమ్ముకోవాల్సి వచ్చే రైతుల దుస్థితిని మనం ఊహించచ్చు. లక్షాధికారులు కోటీశ్వరులు అవుతుంటే ఒకప్పటి స్వతంత్ర భూయజమానులు దరిద్రులుగా మారిపోతున్నారు. ఈ బిల్లులోని అత్యంత ప్రమాదకరమైన ప్రతిపాదనల్లో ఒకటి ఏంటంటే ఐదేళ్ల వరకు ఉపయోగించకుండా వుంటే ఆ భూమిని ఆ భూమి యజమానికి కాక ప్రభుత్వ భూబ్యాంకుకి బదిలీ చేయాలనేది. ఈ చర్య పెద్దెత్తున భూసేకరణకు దారి తీసి, తర్వాత వాటిని చట్టవిరుద్ధంగా బహుళజాతి కంపెనీలకు అప్పగించే అవకాశాన్ని ప్రభుత్వానికి ఇస్తుంది.

పట్టణ ప్రాంతాల్లో పెద్దెత్తున పేదవారినీ, మధ్యతరగతి వారినీ కూడా వారి ఆవాస ప్రాంతాల నుండి తొలగించివేయడం మామూలైపోయింది. అర్బన్ సీలింగ్ చట్టాలను తమకనుకూలంగా, ఊసే లేకుండా చేశారు. ఈ బిల్లు కనుక ఆచరణలోకొస్తే ఇప్పటికే మోయలేని భారంతో ఉన్న పట్టణ ఉద్యోగిత పెద్దెత్తున జరిగే గ్రామీణ వలసల వల్ల మరింతగా కుంగిపోతుంది. ఇది సామ్రాజ్యవాద-దళారీ పెట్టుబడి జోడీ ప్రయోజనాలకు సరిపడేదే. ఎందుకంటే 2007 చివరి నుండి తాము కూరుకుపోయిన ఆర్థిక సంక్షోభం నుండి బయటపడి గుత్త లాభాలను సంపాదించడానికి కార్మికుల వేతనాలను ఎంతగా వీలైతే అంతగా తగ్గించడానికి వారికి పెద్దెత్తున నిరుద్యోగ రిజర్వు సైన్యం వుండడం అవసరం. ఈ బిల్లు ఈ పార్లమెంటరీ పందికొక్కులు తలకెత్తుకునే వారి స్వంత రాజ్యాంగం ఇస్తున్న పని, జీవనోపాధి, విద్య, ఆహార, ఓటు వంటి మౌలిక హక్కులకు కూడా భంగకరమే. ఇది భూమిపై ఆధారపడి జీవించే వారందరి ఆహార, జీవనోపాధి రక్షణలపై తీవ్ర ప్రభావాన్ని కలిగిస్తుంది. ఇది ప్రాంతీయ అసమానతలనూ, ధనిక-పేద అంతరాన్నీ, పట్టణ-గ్రామీణ అంతరాన్నీ తీవ్రంగా పెంచివేస్తుంది. ఇది లాంఛనప్రాయమైన ఫెడరల్ వ్యవస్థకు కూడా హానికరంగా మారి, రాష్ట్రాల అధికారాలను తగ్గించి ఫాసిస్టు అధికారాలు మరింత కేంద్రీకృతం కావడానికి దారి తీస్తుంది.

1947 నుండి అత్యధిక కాలం కాంగ్రెస్ పార్టీ లేదా దాని నాయకత్వంలోని సంకీర్ణ ప్రభుత్వాలే అధికారంలో వుండినాయి. భూకబ్జాలకు అదే నాయకత్వం వహించి కోట్లాది కార్మికుల్నీ, రైతాంగాన్నీ, ఇతర పీడిత వర్గాలనూ, దళితులు, ఆదివాసులూ, మహిళలూ, మైనారిటీలు వంటి పీడిత సామాజిక సెక్షన్లనూ, వెనుకబడిన ప్రాంతాలనూ అణచివేస్తూ, విస్థాపితుల్ని చేస్తూ వచ్చింది. ఇతర పార్లమెంటరీ పార్టీలూ తక్కువ తినలేదు. ప్రతి ఒక్క పార్టీ నిర్వాసిత ప్రజల

క్రోధానికి గురయ్యే వుంది. తమ సామ్రాజ్యవాద యజమానుల పట్ల విశ్వాసం అనే ఏకసూత్రంతో బంధించబడిన ఈ పార్టీలన్నీ త్వరత్వరగా ఏకమై ఈ బిల్లును ఆమోదించడానికి అంగీకారానికి వచ్చాయి.

ప్రతిపక్ష పార్టీల సవరణలు, 'అభ్యంతరాలు' అనేక పంటలు పండే వ్యవసాయ భూముల్ని సేకరించరాదు (సమాజ్‌వాది పార్టీ) అనడం నుండి అసలు ప్రభుత్వం భూసేకరణలో ఎటువంటి జోక్యం చేసుకోరాదు (తృణమూల్ కాంగ్రెస్) అనే వరకే వున్నాయి. ఎన్‌జీవోల సూచనలూ, అభ్యంతరాలూ జీవనోపాధి ఆధారిత పునరావాసం, 100 శాతం బాధిత/విస్థాపిత ప్రజల ఆమోదం, గ్రామసభల భాగస్వామ్యం, పట్టణ తొలగింపులను చేర్చడం, సరైన పునరావాసం వంటి వాటి చుట్టూ వున్నాయి. అత్యంత పాక్షికంగా, విడివిడిగా ఈ అభ్యంతరాలు ప్రతిపాదిత బిల్లులోని కొన్ని మౌలిక లోపాలను ఎత్తిచూపినప్పటికీ వాస్తవంగా చూసినప్పుడు ఇవి జల్లెడ నుండి ఉధృతంగా పారుతున్న నీటిని పట్టించుకోకుండా, దాన్లోని ఒకటి, రెండు చిల్లుల్ని ఎత్తిచూపినట్టుగానే ఉంటాయి.

కేంద్రంలోనూ, రాష్ట్రాల్లోనూ అధికారంలో వుండిన, వున్న పార్లమెంటరీ పార్టీలన్నీ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పెద్దెత్తున భూకబ్జాలు చేయడానికీ, భూ మాఫియాలను పెంచి పోషించడానికీ, వాటిని ఉపయోగించి రైతాంగాన్ని, ముఖ్యంగా ఆదివాసులనూ, పట్టణ పేదలనూ బలవంతంగా భూముల నుండి బేదఖల్ చేయడానికీ, విస్థాపనను వ్యతిరేకించే ప్రజలను అణచడానికి రాజ్య యంత్రాంగాన్ని సంపూర్ణంగా ఉపయోగించడానికీ కుఖ్యాతి గాంచినవే. ఎంతో కొంత హోదా వున్న ఈ పార్టీల నాయకుల్లో భూకబ్జాల్లో తలదూర్చని, తమ ఖజానాల్ని నింపుకోని వారు అరుదే. ఇక ఎన్‌జీవోలైతే తాము ఎందుకోసం ఏర్పర్చబడ్డాయో దానికి అనుగుణంగానే ఒక సేఫ్టీ వాల్వ్‌గా పని చేస్తూ, ప్రజలకు సంబంధించిన కొన్ని సిసలైన సమస్యలను ఎత్తి చూపుతున్నట్టుగా కనిపిస్తూనే, మన దేశంలోని రైతాంగానికి సంబంధించిన అత్యంత మౌలికమైన సమస్యను ముందుకు తేనివ్వకుండా వారు అడ్డం నిలుచుంటున్నారు. మరో మాటలో భూయాజమాన్యం సమస్య గురించీ, భూసంస్కరణల గురించీ వాళ్లు పూర్తి మౌనాన్ని వహిస్తున్నారు.

సిపిఐ (మావోయిస్టు) కేంద్రకమిటీ ఈ బిల్లును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ దేశ ప్రజలందరూ ఐక్యంగా పోరాడాలనీ, భూకబ్జాలకూ, విస్థాపనకూ వ్యతిరేకంగా, జల్-జంగల్-జమీన్‌లపై తమ హక్కులకై పేద, మధ్యతరగతి, ధనిక రైతుల నుండి మొదలుకొని పట్టణ పేదలు, మధ్య తరగతి వరకు దీని వల్ల బాధితులయ్యే విశాల ప్రజానీకం అందరూ ఐక్యమై పోరాటాన్ని తీవ్రతరం చేయాలనీ పిలుపునిస్తోంది. సిసలైన భూసంస్కరణలు జరగకుండా భారతదేశంలో అభివృద్ధికి అర్థమే వుండదని అది మరోసారి స్పష్టం చేస్తోంది. భారతదేశం

అర్ధ వలస–అర్ధ భూస్వామ్య దేశం. ఇక్కడ 70 శాతం ప్రజలు భూమిపై ఆధారపడి జీవిస్తారు. కానీ సిసలైన భూసంస్కరణలు అమలు జరపడానికి బదులుగా దోపిడీదారులు అభివృద్ధి పేరుతో రైతాంగం భూముల్ని అగ్గువకు లాక్కుని మతిపోయేన్ని లాభాలు దండుకుంటున్నారు. కోట్లాది పేద రైతాంగం, భూమిలేని పేదలు మరింత దరిద్రులుగా మారిపోతున్నారు. పెరుగుతున్న వారి ఆత్మహత్యలు జరుగుతున్న మరింత పెద్ద విషాదానికి ఒక ముఖ్యమైన సూచిక మాత్రమే.

మన దేశ వ్యవహారాల్లో, ముఖ్యంగా ఆర్థిక, రాజకీయ రంగాల్లో పెరుగుతున్న సామ్రాజ్యవాదుల, ముఖ్యంగా అమెరికా సామ్రాజ్యవాదుల జోక్యం వల్ల, మన దేశాన్ని నయావలసగా మార్చే ప్రక్రియ సామ్రాజ్యవాద సైన్యాలు మన గడ్డ మీద అడుగుపెట్టకుండానే వేగవంతం అవుతోంది. ప్రత్యేక ఆర్థిక మండళ్లలో మన దేశ చట్టాలు పని చేయవు అనేది నామమాత్రంగా మిగిలి వున్న సార్వభౌమత్వాన్ని ఇప్పటికే హేళన చేసింది. మన దేశం వేర్వేరు ముసుగుల్లో మరింతగా నయావలసగా మారుతుండడంతో నూతన ప్రజాస్వామిక విప్లవంలో విడదీయరాని భాగంగా వుండే సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా జరిగే నిజమైన జాతీయ విప్లవం అవసరం మరింతగా పెరుగుతోంది. బడా భూస్వాములు ప్రయోజనాలు కూడా సామ్రాజ్యవాదుల, దళారీ నిరంకుశ బూర్జువాల ప్రయోజనాలతో విడదీయరాని విధంగా పెనవేసుకుని వున్నాయి. అందుకే మా పార్టీ కేంద్రకమిటీ మరోసారి స్పష్టంగా నూతన ప్రజాస్వామిక విప్లవానికి ఇరుసుగా వుండే వ్యవసాయ విప్లవం మాత్రమే ఈ ముగ్గురు ప్రజాశత్రువులను కూలదోసి దేశంలో సిసలైన భూసంస్కరణలకు దారి తీసి, దేశంలో సిసలైన ప్రజాస్వామ్యాన్నీ, స్వయం ప్రతిపత్తినీ, సార్వభౌమత్వాన్నీ నెలకొల్పి, ఈ వినాశనకరమైన భూకబ్జాలకు అంతం పలుకగల్గుతుంది అని ప్రకటిస్తోంది. పార్లమెంటరీ ప్రజాస్వామ్యం ముసుగులో మన దేశంలో అధికారంలో వుంటూ దేశాన్ని సంపూర్ణంగా అమ్మివేస్తున్న సామ్రాజ్యవాద తొత్తులకూ, దేశద్రోహులకూ వ్యతిరేకంగా ఐక్యమై దీర్ఘకాలిక ప్రజాయుద్ధాన్ని తీవ్రతరం, విస్తృతం చేస్తూ నూతన ప్రజాస్వామిక విప్లవ విజయానికై ముందుకు సాగాల్సిందిగా మా పార్టీ కేంద్రకమిటీ ప్రజలందరికీ పిలుపునిస్తోంది.

**అభయ్**

**అధికార ప్రతినిధి**

**కేంద్ర కమిటీ**

**సీపీఐ (మావోయిస్టు)**

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# సెంట్రల్ రీజినల్ బ్యూరో

**6-6-2013**

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, వారి హంతక పోలీసు మూకలు, పెట్టుబడికి, కట్టుకధలకు పుట్టిన విష పుత్రికలైన ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియా మా పార్టీ నాయకత్వం తీవ్ర అనారోగ్యానికి గురైందనీ, 'లొంగుబాట'లో వుందని చేస్తున్న దుష్ప్రచారాన్ని ఖండించండి! ప్రభుత్వం బహుముఖ దాడిలో భాగంగా మా పార్టీపైనా, విప్లవోద్యమంపైన కొనసాగిస్తున్న మానసిక యుద్ధాన్ని ఓడించండి!

ఈ మధ్య ప్రభుత్వ ఇంటలిజెన్స్ (ఎస్.ఐ.బి) నుండి సంపాదించిన కీలకమైన సమాచారం పేరుతో టివి–9, ఎన్.టి.వి వంటి ఎలక్ట్రానిక్ మీడియాతో పాటు, కొన్ని పత్రికలు మా పార్టీలో అగ్ర నేతల నుండి క్రింది కేడర్ దాకా తీవ్రమైన అనారోగ్యాలకు గురైనారనీ, పార్టీని నడిపించలేకపోతున్నారనీ, లొంగుబాట పట్టారనీ, అసత్య ప్రచారానికి పూనుకున్నాయి. ఇక ఎన్.టి.వి వారైతే అబద్ధాలు, అతిశయోక్తులు, అవాకులు, చవాకులతో ఒక ప్రత్యేక కథనాన్ని రూపొందించి ప్రదర్శించారు. వివిధ స్థాయిలలోని మా నాయకత్వ కామ్రేడ్ల పేర్లను ప్రస్థావిస్తూ, ఒక్కొక్కరికి ఏమేమి వ్యాధులున్నాయో ప్రకటించారు. ఈ రోగాలు నాయకత్వానికే కాకుండా క్రింది కార్యకర్తలకు కూడా అంటుకున్నాయనీ, పార్టీలో ఒకసారి రోగం వస్తే జీవితాంతం బాధపడవలసిందే అంటూ అతిశయోక్తులతో, రౌడీ భాషలో ఒక కట్టు కథను వినిపించారు. ఇక ఈ అనారోగ్యాలు ఎందుకు వస్తాయో వాళ్ళే సెలవిచ్చారు. ఎండనక, వాననక, చలి అనక తిరుగుతూ సరియైన సమయానికి సరియైన తిండి దొరకక, స్థావరాలు మారుస్తూ వుండటం వలన మావోయిస్టు నాయకులు రోగాలుపాలు పడుతున్నారని విశ్లేషించారు. ఇక ఈ రోగాల బారీన పడిన మావోయిస్టు నాయకులు మంచాన పడ్డారనీ, మంచానికి అతుక్కు పోయారనీ, షెల్టర్ నుండి బయటకు రాలేకపోతున్నారనీ, ఒక కిలోమీటర్ కూడ నడవలేకపోతున్నారనీ,

కొందరు వుద్యమానికి దూరంగా వుంటున్నారనీ, తప్పుడు ప్రచారం చేపట్టి విప్లవ ప్రజా సంఘాలను, సానుభూతిపరులను గందరగోళపరిచేందుకు ఎన్.టి.వి ప్రయత్నించింది. ఈ దాడి మా పార్టీలోని నేతృత్వ కామ్రేడ్స్‌పైనా, ప్రధానంగా మా పార్టీ జనరల్ సెక్రటరీ కామ్రేడ్ గణపతి, కేంద్ర రీజనల్ బ్యూరో సెక్రెటరీ కామ్రేడ్ కటకం సుదర్శన్, కామ్రేడ్ రామకృష్ణలపై ఎక్కుపెట్టారు. ఎందుకంటే ఈ కామ్రేడ్స్ పార్టీలో వాళ్ళ బాధ్యతలకు అనుగుణంగా శక్తి వంచన లేకుండా కృషి చేస్తూ పార్టీ, పి.ఎల్.జి.ఎ శ్రేణుల, ప్రజల విశ్వాసాన్ని చూరగొనటమే కాకుండా, వుద్యమాన్ని పురోగమింప చేయడంలో వాళ్ళ వంతు బాధ్యతలను నిర్వహిస్తున్నారు. కనుకనే ఈ దోపిడీ ప్రభుత్వం వారి అనారోగ్యాలపై అబద్ధపు ప్రచారాన్ని కొనసాగిస్తూ, ప్రజలలో గందరగోళం సృష్టించేందుకు ప్రయత్నించింది. అంతే కాకుండా వీరు వైద్యం సరిగా అందని పరిస్థితులలో వుద్యమానికి నాయకత్వం వహించలేకపోతున్నారనీ, కొద్ది మంది నాయకత్వం సరెండర్ అయ్యేందుకు రాజకీయ నాయకుల ద్వారా పోలీసులను సంప్రదిస్తున్నారని గోబెల్స్ ప్రచారానికి దిగింది.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, వారి హంతక పోలీసుమూకలు, వారి మానస పుత్రికలైన ఎలక్ట్రానిక్, ప్రింటు మీడియాలు మా పార్టీపై చేపట్టిన ఈ దుష్ప్రచార క్యాంపెయిన్ (డిస్ ఇన్‌ఫర్మేషన్ క్యాంపెయిన్) వెనుక రాజకీయ దురుద్దేశం వుంది. ముఖ్యంగా ఈ దేశ పీడిత ప్రజల ఆకాంక్షలకు మా పార్టీ నిజమైన విప్లవ ప్రతినిధిగా వుంటూ, ప్రజలకు ముందుండి వారి విముక్తి పోరాటానికి నేతృత్వం వహిస్తున్నది. ప్రజలు కూడా ఈ విషయాన్ని గుర్తిస్తూ పార్టీ నాయకత్వంలో రోజు రోజుకూ మరింతగా సమీకృతులవుతున్నారు. ఈ పరిణామాన్ని సహించలేకనే ఈ దేశ దోపిడీ పాలక వర్గాలు, వారి హంతక పోలీసు మూకలు, మీడియా–త్రయం కలిసి ప్రజలను రాజకీయంగా గందరగోళపరిచే దురుద్దేశంతో పార్టీ నాయకత్వం అనారోగ్యానికి గురైందనీ, లొంగుబాటు బాట పట్టిందని అసత్య ప్రచారానికి పూనుకున్నాయి. ప్రభుత్వం మా పార్టీపై చేపట్టిన ఈ దుష్ప్రచార క్యాంపెయిన్‌ను వారు విప్లవోద్యమాన్ని నిర్మూలించేందుకు అమలు చేస్తున్న ఎల్.ఐ.సి వ్యూహంలో భాగంగా చూడాలి. నేడు భారత పాలక వర్గాలు సామ్రాజ్యవాదుల ప్రయోజనాలతో పాటు, తమ ప్రయోజనాలను నెరవేర్చుకునేందుకు ఆటంకంగా వున్న విప్లవోద్యమంతో పాటు జాతుల పోరాటాలను, ప్రజా పోరాటాలను అణచివేసేందుకు సామ్రాజ్యవాదుల నేతృత్వంలో ఎల్.ఐ.సి వ్యూహాన్ని అమలు చేస్తున్నాయి. ఈ వ్యూహంలో భాగంగా బహుముఖ దాడి ఎత్తుగడలను చేపట్టాయి. ఈ ఎత్తుగడలలో భాగంగా మానసిక యుద్ధాన్ని ఒక ముఖ్యమైన ఎత్తుగడగా చేపట్టి అమలు చేస్తున్నాయి.

ఇక అనారోగ్యాలు, లొంగుబాటుల విషయంలో మా పార్టీ వాస్తవ స్థితిని తెలుసుకుందాం. ముందుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, పోలీసులు, మీడియా మా పార్టీపై చేస్తున్నది దుష్ప్రచారం అని మరోకసారి తెలియజేస్తున్నాం. అయితే ఒక విప్లవ పార్టీలో అనారోగ్యాలు, లొంగుబాటుల వంటి సమస్యలను అర్థం చేసుకోవాలంటే మరికొన్ని విషయాలను కూడా అర్థం చేసుకోవాలి. ముఖ్యంగా ప్రస్తుత సమాజంలో విప్లవ పార్టీల పుట్టుక, పెరుగుదలల అనివార్యతనూ, అది నిర్వహించే కఠోరమైన వర్గ పోరాటాన్నీ, ఆ క్రమంలో ఎదురయ్యే అనేక సమస్యలనూ, అధిగమించేందుకు అది అనుసరించే చైతన్యపూర్వక పద్ధతులను తెలుసుకోవాలి.

ఎక్కడైనా ఒక్క విప్లవ పార్టీ పుట్టుక, పెరుగుదలకు అక్కడి సమాజంలోనే భౌతిక ప్రాతిపదిక వుంటుంది. మన దేశంలో కూడా ఇక్కడ వర్గ సమాజం భౌతిక వాస్తవికతలో నుండే మా పార్టీ పుట్టి, అభివృద్ధి చెందుతున్నది. అయితే ఏ విప్లవ పార్టీ అయినా ఎత్తుగడలపరంగా తీవ్రమైన తప్పులు చేసినప్పుడు వ్యూహాత్మక స్థాయిలో అది వెనకంజ వేస్తుంది. మా పార్టీ కూడా ఎత్తుగడలపరమైన తప్పులు చేయడం వలన నక్సల్బరీ, శ్రీకాకుళ వుద్యమాలు తీవ్రమైన సెట్ బ్యాక్‌కు గురైనాయి. ఇటువంటి వెనుకంజలు తాత్కాలికమైనవిగానే వుంటాయి. ఇంకా నిర్దిష్టంగా చెప్పుకోవాలంటే వర్గ సమాజం వున్నంతకాలం సాయుధ విప్లవాలు జరుగుతూనే వుంటాయి. అవి విజయవంతం అయ్యేంత వరకు పురోగమన, తిరోగమన బాటలో ప్రయాణం చేస్తూ వుంటాయి. ఈ సూత్రానికి అనుగుణంగానే నక్సల్బరీ, శ్రీకాకుళంలో వెనకంజ వేసిన విప్లవోద్యమం తిరిగి జగిత్యాలలో పునర్జీవం పొందింది. మరోవైపు బీహార్, బెంగాల్‌లో పనిచేసిన గత ఎం.సి.సి.ఐ, పి.యు పార్టీలలో అభివృద్ధి కూడా ఇదే క్రమాన్ని అనుసరించింది. 21 సెప్టెంబర్ 2004న మా రెండు పార్టీలు (సి.పి.ఐ (ఎం.ఎల్) (పీపుల్స్ వార్), ఎం.సి.సి.ఐ) విలీనమై సి.పి.ఐ (మావోయిస్టు)గా ఆవిర్భవించాయి. ఈ పరిణామం ఈ దేశ పాలక వర్గాలను తీవ్ర ఆందోళనకు గురి చేసింది.

ఈ దేశంలో 'పార్లమెంటరీ ప్రజాస్వామ్యం' గానీ, ఈ పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని భద్రంగా కాపాడుతున్న పాలక పార్టీలు, వారి ప్రభుత్వాలు కానీ దోపిడీ వర్గాల (నిరంకుశ దళారీ బూర్జువా, భూస్వామ్య వర్గాలు, వారి యజమానులైన సామ్రాజ్యవాదుల) ప్రయోజనాలను మాత్రమే కాపాడుతున్నాయి. మా పార్టీ పార్లమెంటరీ ముసుగులో వున్న ఈ దోపిడీ వర్గాల నియంతృత్వాన్ని కూల్చి, ప్రజల రాజకీయ అధికారాన్ని నెలకొల్పేందుకు సాయుధ వర్గ పోరాటాన్ని (ప్రజా యుద్ధాన్ని) నిర్వహిస్తున్నది. అందుకే ఈ దేశ పాలక వర్గాలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నాయి. మా పార్టీ నిర్వహిస్తున్న ప్రజా యుద్ధం తమ భద్రతకు, అస్తిత్వానికి, తీవ్ర

విఘాతంగా భావిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే దేశ ప్రధాని మన్‌మోహన్ సింగ్ మా పార్టీ ఆవిర్భావం, ఎదుగుదల "దేశ అంతర్గత భద్రతకు పెను ముప్పు" అని ప్రకటించాడు. అంతేకాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా మా పార్టీపై గ్రీన్ హంట్ పేరుతో బహుముఖ దాడిని ప్రారంభించారు.

పై నేపథ్యంలోనే నేడు దేశంలో విప్లవ యుద్ధానికి, ప్రతిఘాతుక విప్లవ యుద్ధానికి నడుమ వర్గ ఘర్షణ రోజు రోజుకు తీవ్రతరమవుతున్నది. ముఖ్యంగా సామ్రాజ్యవాదుల నేతృత్వంలో ఈ దేశ పాలక వర్గాలు మా పార్టీపైనా, విప్లవోద్యమంపైనా, భారత ప్రజానీకంపైన ఎల్.ఐ.సి వ్యూహంలో భాగంగా సంపూర్ణ యుద్ధాన్ని (ఆల్ అవుట్ వార్) ప్రకటించారు. ఈ దాడిలో భాగంగా పోరాడే ప్రజలకు నాయకత్వం లేకుండా చేసేందుకు అనేక కుట్ర పద్ధతులు (కోవర్టులు, ఇన్‌ఫార్మర్లు, విష ప్రయోగం వంటి....) అనుసరించడం ద్వారా మా పార్టీ నాయకత్వాన్ని హత్య చేస్తున్నారు. మరోవైపు మా పార్టీ నాయకత్వ శ్రేణులు అనారోగ్య సమస్యలతో సతమతమౌతున్నారనీ, ప్రజలకు నాయకత్వం వహించలేకపోతున్నారనీ, లొంగుబాట పట్టారనీ, దుష్ప్రచారాన్ని చేస్తూ ప్రజల మానసిక స్థైర్యాన్ని దెబ్బ తీసేందుకు మానసిక యుద్ధాన్ని నిర్వహిస్తున్నారు.

ప్రభుత్వం నేడు మా పార్టీపైనా, విప్లవ ప్రజానీకంపైన రుద్దిన ఈ అన్యాయపూరితమైన యుద్ధాన్ని, ప్రజల ప్రత్యక్ష భాగస్వామ్యంతో మా పార్టీ ఎదుర్కొంటున్నది. ఈ అన్యాయపూరిత యుద్ధాన్ని ఓడించేందుకు ప్రజలు నిర్వహిస్తున్న ప్రజా యుద్ధంలో పార్టీ ప్రజలకు ముందుండి నాయకత్వం వహిస్తున్నది. అయితే ఈ యుద్ధం అనేక కష్టాలు, నష్టాలతో కూడుకొని వుంటుందనీ, త్యాగాలను కోరుకుంటుందని మాకు తెలుసు. ఈ మార్గం ఎంత కష్టభూయిష్టమైనా, ఇంతకి మినహా మరో మార్గంలేదు. ఈ సత్యాన్ని వర్గ సమాజ చరిత్ర ఇప్పటికే తేల్చి చెప్పింది. కనుక మానవ సమాజాన్ని పురోగమన దిశగా, ఊర్ధ్వముఖంగా తీసుకెళ్ళేందుకు, మేమెంచుకున్న శాస్త్రీయమైన విప్లవకర మార్గంలో ఎదురయ్యే ఏ సమస్యనైనా, కష్టాన్నైనా హుందాగా స్వీకరించి బోల్షివిక్ పట్టుదలతో పరిష్కరించుకుంటాము. ఈ అనుభవాలను రష్యా, చైనాలతో పాటు విప్లవాలు విజయవంతం అయినా అనేక దేశాల విప్లవకర కమ్యూనిస్టు పార్టీలు పొందాయి. ఆయా దేశాల పాలక వర్గాలు కూడా విప్లవ నాయకత్వాన్ని నిర్మూలించేందుకు ప్రయత్నాలు చేయడంతో పాటు ప్రజల మానసిక స్థైర్యాన్ని దెబ్బతీసేందుకు కా.లెనిన్, కా.స్టాలిన్, కా.మావో, కా.హోచిమిన్ విప్లవ నాయకుల అనారోగ్యాలను గోరంతలు కొండంతలుగా చేసి దుష్ప్రచారాన్ని చేపట్టాయి. ప్రస్తుతం అమెరికన్ సామ్రాజ్యవాదులు కూడా వారికి వ్యతిరేకంగా పోరాడుతున్న

ప్రజాస్వామిక, జాతుల, ప్రజా పోరాటాల నాయకులు అనారోగ్యానికి గురైనారని, చనిపోయినారని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఈ కుటిల ఎత్తుగడలను భారత పాలక వర్గాలు నేడు మా పార్టీపై ప్రయోగిస్తున్నారు. మీడియాపై వారికున్న ఆధిపత్యాన్ని వుపయోగించుకొని మా పార్టీ కేంద్ర కమిటీ నుండి మొదలుకొని వివిధ స్థాయిల క్యాడర్లకు కొన్ని జబ్బులను వారే సృష్టించడం, కొన్ని అనారోగ్య సమస్యలను చిలువలు పలవలు చేసి చెప్పటం వంటి గోబెల్స్ పద్ధతుల్లో ప్రచారం చేస్తున్నారు.

ఇక గడిచిన మూడున్నర దశాబ్దాల విప్లవోద్యమ చరిత్రలో మా పార్టీకి చెందిన నాయకత్వ కామ్రేడ్స్‌తో పాటు మెరికల్లాంటి వివిధ స్థాయిల క్యాడర్లను ఈ ఫాసిస్టు ప్రభుత్వాలు కిరాతకంగా హత్య చేశాయి. అయినప్పటికీ మా పార్టీ ప్రజలపై ఆధారపడ్తూ, కా.లెనిన్ చెప్పిన "రహస్య కమ్యూనిస్టు పార్టీ నిర్మాణ సూత్రాలను" దృఢంగా అమలు చేస్తూ వివిధ స్థాయిల నాయకత్వాన్ని రక్షించుకోగలిగింది. అంతే కాకుండా సాయుధ వ్యవసాయక విప్లవ పోరాటాన్ని తీవ్రతరం చేస్తూ ఆ పోరాటంలో భర్తీ అవుతున్న అనేకమందికి నాయకత్వ తర్ఫీదునిస్తూ ఎదిగించుకుంటుంది. ఈ క్రమంలో శత్రువు చేపట్టే అనేక నిర్మూలనా క్యాంపెయిన్లను తిప్పికొడుతూ, వివిధ స్థాయిల పార్టీ, పి.ఎల్.జి.ఎ నాయకత్వ క్యాడర్లను రక్షించుకోగలిగింది. అట్లా రక్షించుకోగలగటం వల్లనే మా పార్టీకి మూడు తరాల నాయత్వాన్ని ఏర్పర్చుకోగలిగాం. అంతేకాకుండా పైన చెప్పినట్లుగా కష్టభూయిష్టమైన విప్లవకర జీవితంలో ఎదురయ్యే అనేక అనారోగ్య సమస్యలను, వయసుతో పాటు వచ్చే పరిమితులను కర్తవ్య నిర్వహణకు ఆటంకం కాకుండా గొప్ప విప్లవ చైతన్యంతో మా పార్టీ నాయకత్వం అధిగమిస్తున్నది. ఇందుకు జైలులో తీవ్రమైన నిర్బంధాన్ని, అణచివేతను ఎదుర్కొంటున్న మా సీనియర్ కేంద్ర కమిటీ నాయకత్వ కామ్రేడ్స్ చైతన్యమే ఒక దృష్టాంతం. కా.బరుంద, కా.విజయ్‌దా, కా.చింతన్‌దా, కా.అంబర్‌దా, కా.భూపేష్‌దా, కా.పరేష్‌దా, కా.కోబడ్ గాంధీ వంటి కేంద్ర కమిటీ నాయకత్వంలో 70లకు దగ్గరపడిన వారు కొందరైతే, 70లు దాటిన వారు మరికొందరు వున్నారు. యింకా కా.షీలా దీదీ, కా.సుమిత్‌దా, కా.బి.ఆర్ వంటి సీనియర్ కామ్రేడ్స్ అనారోగ్య సమస్యలనెదుర్కుంటున్నారు. అయితే వారికున్న వయస్సు పరిమితులుగానీ, అనారోగ్య సమస్యలుగానీ వారి విప్లవ చైతన్యాన్ని మొద్దుబరచలేకపోతున్నాయి. వాళ్ళు జైళ్ళను పోరాట కేంద్రాలుగా మలచి బయట వున్న పార్టీకి, విప్లవ ప్రజానికానికి గొప్ప పోరాట స్ఫూర్తిని అందిస్తున్నారు. ఈ చైతన్యం సగటు మనిషికి సాధ్యం అయ్యేదికాదు. ప్రజల ప్రయోజనాలే సర్వస్వంగా భావించి, జీవించే విప్లవకారులకే సాధ్యం. యిక ఈ ప్రభుత్వ మీడియా ప్రచారం చేస్తున్నట్లు ఫీల్డులో పని చేస్తున్న సీనియర్ నాయకత్వ కామ్రేడ్స్ ఎవరూ

మంచానికి అతుక్కొని లేరు. నడవలేని వారుగానీ, షెల్టర్‌లకు పరిమితమైనవారుగానీ, వుద్యమ కార్యాచరణకు దూరంగా వుంటున్న వారుగానీ, నాయకత్వ కామ్రేడ్స్‌లో ఎవరూ లేరు. యింకా వాస్తవం చెప్పాలంటే కష్టభూయిష్టమైన చీకటి రహదారుల్లో గంటలు తరబడి టార్చిలైటు వెలుగు లేకుండా నడవగలిగే శక్తి మా నాయకత్వానికి వుంది. ప్రతీరోజు సుమారుగా 5,6 గంటలు చీకటి రాత్రులలో నడుస్తుంటారు. నడక అనంతరం అలసట లేకుండా గంటల తరబడి అధ్యయనంతోపాటు ప్రజలను విప్లవోద్యమంలోకి సమీకరించేందుకు రాజకీయ, నిర్మాణ, మిలటరీ, సాంస్కృతిక కర్తవ్యాలపై కేంద్రీకరిస్తుంటారు. ఒకవైపున ఈ పనులన్నింటినీ నిర్వహిస్తూనే, మరోవైపు ఈ ఫాసిస్టు ప్రభుత్వం మా పార్టీనీ, పి.ఎల్.జి.ఎను నిర్మూలించేందుకు తలపెడ్తున్న ఫాసిస్టు దాడులను ధీటుగా ఎదుర్కునేందుకు పి.ఎల్.జి.ఎ బలగాలకు ప్రత్యక్షంగా నేతృత్వం వహిస్తుంటారు. మాఈ కర్తవ్య నిర్వహణలో ప్రజలు మాకు ప్రేమగా, బాధ్యతగా ఆహార పదార్థాలను అందిస్తుంటారు. అంతేగానీ ఈ ప్రభుత్వ మీడియా చెపుతున్నట్లు తిండి దొరకని పరిస్థితి ఎప్పుడూ వుండదు. అయితే పీడిత రైతాంగం వారు తినే సాధారణ భోజనాన్నే మాకు యిస్తారు. ప్రజలతో మాకున్న ఈ సజీవ సంబంధమే మా పార్టీ, పి.ఎల్.జి.ఎ రాజకీయ దృఢత్వాన్ని పెంచుతున్నది. ప్రభుత్వ సాయుధ బలగాలతో పోరాడి మట్టుబెట్టే శక్తినిస్తున్నది. యింకా సూటిగా చెప్పాలంటే సాధారణంగా వచ్చే జబ్బులు, దీర్ఘకాలిక వ్యాధులు, వయసు పరిమితులు సైతం మా కార్యాచరణకు, పరిమితులు విధించలేక పోతున్నాయి. మేమొకసారి ప్రజల ప్రయోజనాలకు మా జీవితాలను అంకితం చేసిన తర్వాత, మా ఆరోగ్యాలను కాపాడుకోవడం కూడా మాకు ఒక సామాజిక భాద్యతే. అందుకే దుర్వ్యసనాలకు, అరాచకపు జీవితానికి యిక్కడ తావుండదు. అంతే కాకుండా పార్టీ, పి.ఎల్.జి.ఎ శ్రేణుల ఆరోగ్యానికి ప్రజలూ, ప్రజల ఆరోగ్యానికి పార్టీ, పి.ఎల్.జి.ఎ శ్రేణులు పరస్పరం బాధ్యత పడుతుంటారు. మరోవైపు ఎంతోమంది ప్రజా డాక్టర్లు ఎంతో వ్యయ ప్రయాసల కోర్చి వారి వంతు బాధ్యతగా పార్టీకి, పి.ఎల్.జి.ఎకి, ప్రజలకు వైద్య సేవలందిస్తుంటారు. ఈ విషయాలన్నింటినీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వుద్దేశ్యపూర్వకంగానే మరుగు పరుస్తున్నాయి. పైగా దుష్ప్రచారాన్ని ఒక ఒక కళగా అభ్యసించిన హంతక పోలీసు మూకలు, మీడియా ఇటువంటి దుష్ప్రచారాన్ని చేపట్టాయి.

ఇక చివరిగా మేము చెప్పదలుచుకున్నదేమిటంటే నేడు అనారోగ్యాలతో పాటు అనేక సమస్యలు ఈ సమాజ సృష్టిగా వున్నాయి. ఈ సమాజంలో భాగంగా వున్న మేము అనారోగ్యాలకు అతీతులమేమీ కాము. పైగా మాకు అప్పుడప్పుడు అనారోగ్య మరణాలు కూడా సంభవిస్తున్నాయి. ఈ మరణాలను తగ్గించుకునేందుకూ, నివారించుకునేందుకు కొన్ని ప్రయత్నాలు జరుగుతున్నప్పటికీ,

ఈ దుర్మార్గమైన దోపిడీ ప్రభుత్వం అమలు జరుపుతున్న ఫాసిస్టు నిర్బంధంలో కొంతమంది కామ్రేడ్స్‌ను కోల్పోవలసి వస్తున్నది. ఈ అసహజ, అనారోగ్య మరణాలు, పార్టీ, పి.ఎల్.జి.ఎ శ్రేణుల్లోనే కాకుండా సాధారణ పీడిత ప్రజానీకంలో ఇంకా ఎక్కువ జరుగుతున్నాయి. నేడు దేశంలో పీడిత ప్రజానీకం అనారోగ్య సమస్యలే కాకుండా ఆకలి, అధిక ధరలు, అత్యాచారాలు, అవినీతి, నిరుద్యోగం, దోపిడీ, పీడనలు వంటి అనేక సమస్యలతో సతమతమవుతున్నారు. ఈ సమస్యలన్నింటికీ ప్రస్తుత ఈ అర్ధవలస, అర్ధ భూస్వామ్య వ్యవస్థే కారణంగా వుంది. అందుకే ఈ వ్యవస్థను కూలదోసి నూతన ప్రజాస్వామిక వ్యవస్థను నిర్మించేందుకు మా పార్టీ ప్రజలతో మమేకమై వారికి నాయకత్వం వహిస్తున్నది. ఈ మహత్తర రాజకీయ లక్ష్యాన్ని చేపట్టిన మా పార్టీ అనారోగ్య సమస్యలతో కుదేలవుతున్నదనటం గానీ, లొంగుబాటలో వుందని చెప్పడంగానీ హాస్యాస్పదం అవుతుంది. కొద్ది మంది పార్టీ, పి.ఎల్.జి.ఎలో పని చేసిన వారు అనారోగ్యాలు, ఇతర సమస్యలను కారణంగా చూపి లొంగిపోయారు. వారు లొంగిపోవటానికి రాజకీయ బలహీనతలే కారణం తప్ప అనారోగ్యం, ఇతర సమస్యలు ఎంత మాత్రము కారణం కాదు. నిజమైన విప్లవ కారులెవరూ ఆఖరి శ్వాస విడిచే వరకు లొంగిపోరు. అనారోగ్యంతో వచ్చే మరణమైనా, ప్రజల సమక్షంలో, ప్రజల కోసమే పొందుతారు. నేడు ప్రభుత్వం విప్లవోద్యమంపై ఎక్కు పెట్టిన దాడిలో ఎంతో మంది వీర పి.ఎల్.జి.ఎ యోధులు తీవ్రంగా క్షతగాత్రులైనారు. కొన్ని అవయవాలు పోగొట్టుకున్న వారు కూడా వున్నారు. వారెవరూ శత్రువు ముందు లొంగిపోలేదు. వారు ప్రజల ప్రేమాభిమానాలు చూరగొంటూ, వారికేర్పడిన పరిమితులలోనే విప్లవ కార్యాచరణను కొనసాగిస్తున్నారు. విప్లవంలో పని చేసే ఎవరికైనా వారే ఆదర్శం. విప్లవ తత్వం నశించి, చేవ చచ్చి, స్వార్థంతో శత్రువు పాదాల చెంత మోకరిల్లిన దిగజారుడుగాళ్ళు కాదు. నేడు మా పార్టీ కామ్రేడ్ లెనిన్ చెప్పిన "కార్మిక వర్గ దృఢ సంకల్పమంటే, లొంగుబాటు కంటే మరణం మేలు అనే చారిత్రక పోరాట నియమానికి అచంచలంగా అంకితమవటమనీ, అది మాత్రమే నిర్ణయాత్మక విజయ సాధనకు దోహదపడుతుందనే" సూక్తికి దృఢంగా అంటిపెట్టుకుంటుందని తెలియజేస్తున్నాం. ప్రజలకు హామీ ఇస్తున్నాం.

ప్రియమైన ప్రజలారా!

ప్రపంచ దోపిడీదారులైన సామ్రాజ్యవాదులు నేడు తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలోకి కూరుకుపోయారు. ఈ సంక్షోభం నుండి బయట పడేందుకు ప్రపంచీకరణను వేగవంతం చేస్తున్నారు. సామ్రాజ్యవాద ప్రపంచీకరణ అంటే ప్రపంచ ప్రజలను హద్దు, అదుపులేని

దోపిడీకి గురి చేయడమే. ఈ దోపిడీని సంస్కరణలు, అభివృద్ధి అనే వాటి ముసుగులో కొనసాగిస్తున్నారు. ఈ దోపిడీకి వివిధ దేశాలలోని దళారీ పాలకులు వత్తాసు పలకడమే కాకుండా, దోపిడీలో భాగస్వాములవుతున్నారు. మన దేశంలో కూడా ఇదే పరిస్థితి నెలకొని వుంది. అయితే ఈ దోపిడీని ఇక్కడ విప్లవోద్యమంతో పాటు వివిధ సెక్షన్ల ప్రజానీకం వ్యతిరేకిస్తున్నారు. మిలిటెంట్‌గా ప్రతిఘటిస్తున్నారు. ఈ ప్రతిఘటనను అణచివేసేందుకు భారత పాలక వర్గాలు ఎల్.ఐ.సి వ్యూహంలో భాగంగా గ్రీన్ హంట్ పేరుతో బహుముఖ దాడిని ప్రారంభించారు. ఈ దాడి లక్ష్యం ప్రజలను మరింతగా దోపిడీ చేయడంతో పాటు అణచివేయడమే. ఈ బహుముఖ దాడిలో భాగంగానే పార్టీ నాయకత్వం అనారోగ్యానికి గురై నాయకత్వం వహించలేకపోతుందనే తప్పుడు ప్రచారంతో మానసిక యుద్ధాన్ని కొనసాగిస్తున్నారు. ఈ తప్పుడు ప్రచారాన్ని ప్రజలు, ప్రజాస్వామికవాదులు తిప్పి కొట్టాలి. అదే సందర్భంగా అనారోగ్యాలు వంటి అన్ని సమస్యలు ఈ సమాజ సృష్టేనని అర్థం చేసుకోవాలి. ఈ సమస్యలకు సరెండర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ పరిష్కారం కాదు. అనారోగ్యంతో పాటు అన్ని సమస్యలను పరిష్కరించుకునేందుకు ప్రజా యుద్ధాన్ని తీవ్రతరం చేయాలి. నిరంకుశ దళారీ బూర్జువా, భూస్వామ్య వర్గాలను అధికారం నుండి సాయుధంగా కూలదోసి నూతన ప్రజాస్వామిక వ్యవస్థను ఏర్పరిచేందుకు మరింత తీవ్రంగా కృషి చేయాలని ప్రజలందరికీ విజ్ఞప్తి చేస్తున్నాం.

**ప్రతాప్**

**అధికార ప్రతినిధి**

**సెంట్రల్ రీజనల్ బ్యూరో**

**సీపీఐ (మావోయిస్టు)**

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# కేంద్ర కమిటీ

**11-6-2013**

## మే 25 దాడిని సాకుగా ఉపయోగించుకుని ప్రజల మీద మరింత పెద్ద దాడుల్ని ఎక్కుపెట్టడానికి పాలకవర్గాలు చేస్తున్న కుట్రలను గ్రహించండి! 'ప్రజలపై యుద్ధాన్ని' ఐక్యంగా ఎదిరించండి, ఓడించండి!

భారత పార్లమెంటును తమ ఆవాసంగా చేసుకున్న గ్యాంగ్‌స్టర్-స్కామ్‌స్టర్ల బందిపోటు ముఠా గంగవెర్రులెత్తిపోతోంది. భయకంపితమౌతోంది. బెదిరిపోతోంది. చిర్రెత్తిపోతోంది. నిప్పులు కక్కుతోంది. గొడ్డళ్లు నూరుతోంది. రక్తదాహంతో దాడికి సమాయత్తమవుతోంది. కోరలు చాస్తోంది. విషం కక్కుతోంది. ఎంతైనా యుద్ధరంగంలో వారి విశ్వాసపాత్రమైన అత్యుత్తమమైన లెఫ్టినెంట్లలో ఒకడిని మే 25 జీరంఘాటీ దాడి మట్టిగరిపించింది కదా. అర్థం చేసుకోవచ్చు.

వాస్తవానికి, ఈ స్కాంస్టర్-గ్యాంగ్‌స్టర్ ముఠాకు మహేంద్ర కర్మ చావు పట్ల అంత పట్టింపేం లేదు. ఎందుకంటే సల్వాజుడుం పేరిట విధ్వంసమూ, హత్యాకాండా కొనసాగినప్పుడు గోదాల్లో బానిసలు పోట్లాడుతుంటే వినోదంగా చూస్తూ కూచున్న రోమన్ సెనేటర్ల వలే ప్రవర్తిస్తూ దాని పుట్టుకలోనూ, అత్యంత పీడనాదాయకమైన దాని కొనసాగింపులోనూ కూడా తమ వంతు పాత్ర వహించిన వీరికి ఇలాంటిదేదో జరగక తప్పదని ముందునుంచే తెలుసు. కర్మ దాని ప్రతినిధిగా బైటకు బహిర్గతం అవుతూ ఫాసిస్టు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సాయుధ బలగాల అండతో కొనసాగించిన మారణహోమం అది. నిజానికి వారు ఎక్కువ భయపడ్తున్నది, అన్ని రకాల దోపిడీ, అణచివేత, పీడన, అవినీతి, కుంభకోణాలూ ఎటువంటి సవాలూ లేకుండా అత్యంత సహజంగా, నిస్సిగ్గుగా ప్రజల కళ్లముందే కొనసాగే ఈ దేశంలో సుదూరాన ఎక్కడో ఎవరో ఈ ఫాసిస్టు స్కాంస్టర్-గ్యాంగ్‌స్టర్ లను బోనులో నిలబెట్టి, న్యాయం చేస్తారనే వాస్తవాన్ని హరాయించుకోలేకనే. అది తమ జడ్ ప్లస్ భద్రతల వలువలన్నీ ఊడిపోయి, భద్రతా వలయాలన్నీ చెదిరిపోయి, పీడిత ప్రజల క్రోధాగ్నిజ్వాలలు తమమీదకు నాలుకలు చాపుతుండగా హఠాత్తుగా తాము నగ్నంగా ఉన్నామని గుర్తించడంలాగా ఉంటుంది. మతిపోవడానికి తగినంత బలమైన కారణమే మరి. సులభంగా వివరించదగినదే.

ఏమో ఎవరికి తెలుసు తర్వాతి వంతు ఎవరిదో? భరించలేని స్థాయిలో పెచ్చరిల్లిపోతున్న పెంపుడు కుక్కల్లాంటి రాజకీయ నాయకుల దేశద్రోహకర, అప్రజాస్వామిక, బానిసప్రవృత్తితో కూడిన, దుర్మార్గమైన ప్రజావ్యతిరేక చర్యలతో విసిగివేసారిన ప్రజానీకం తమ క్రోధాన్ని వెళ్లగక్కడానికీ, అలవాటుగా వారు చేస్తున్న దళారీతనాన్ని అంతం చేయడానికీ ఈ మార్గాన్ని ఎంచుకుందామా అని ఆలోచిస్తే? అమ్మో, అదింకా భయానకంగా ఉండదూ? మావోయిస్టులు కూలదోస్తామని కంకణం కట్టుకుని, ప్రజలందరికీ కూడా కూలదోయమని పిలుపునిస్తున్న పార్లమెంటరీ వ్యవస్థను నిజంగానే కూలదోసేసి ఈ మొత్తం ముఠానే అంతం చేద్దామని వాళు ఆలోచిస్తేనో? అబ్బో, ఇది అన్నిటికంటే భీతావహమైనది కాదూ? అవును, చాలా అలజడి కలిగించే విషయమే సుమా.

కానీ జీవితంలో ఒకసారైనా వారలా అలజడి చెందడమే మంచిది. ఒక సల్వాజుడుం, ఒక సేంద్ర, ఒక శాంతి యాత్ర, ఓ హర్మద్ బాహిని, ఒక భైరవ్ సేన, ఒక టిపిసి లేదా ఒక ఆపరేషన్ గ్రీన్‌హంట్ పేరిట మన దేశంలోని పేదల్లోకెల్లా పేద ప్రజలను నయాఫాసిస్టు తరహాలో అణచివేస్తున్న, రోజువారీగా అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, రాత్రి భోజనం సమయాలను పాటించినట్టు క్రమం తప్పకుండా, ఎంతకీ ఆకలితీరని సామ్రాజ్యవాద రాకాసి కడుపు నింపడానికి మన దేశ సంపదలను ఒకొక్కటిగా అమ్మేస్తున్న, మానవులుగా మన అస్థిత్వానికి అర్థాన్నిచ్చే స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, సార్వభౌమత్వం, స్వయం సమృద్ధి, ప్రజాస్వామ్యం వంటి ప్రతి పదాన్నీ అర్థంలేనిదిగా మార్చేస్తున్న రాజకీయ నాయకులను ఎన్నటికీ బోనెక్కకుండా అలాగే సుఖంగా ఉండిపోనివ్వరని వాళ్లకు అర్థం కావడమే మంచిది. స్పార్టకస్ నాటి నుండి మొదలుకొని నేటివరకు జరిగిన అసంఖ్యాక తిరుగుబాట్లను లెక్కబెట్టుకుని, క్రూరమైన అణచివేతకు గురైన ప్రజానీకం ఎప్పటికీ అలాగే దాన్ని భరించుకుంటూ ఉండిపోరనేది వాళ్లు ఏ వెయ్యిన్నొకటోసారో గుర్తించడమే మంచిది. జీవితంలో ఒక్కసారైనా వారంతగా ఆందోళన చెందడమే మంచిది.

మధ్యయుగాల నాటి భూస్వామిలాంటివాడు, సల్వాజుడుం రూపశిల్పి, శాడిస్టు, రేపిస్టు, తన తెగకే శత్రువుగా పరిణమించినవాడు అయిన కర్మ అతని భద్రతా సిబ్బందిలోని అత్యధికులు (బలిపశువులే గానీ, అతగాడి హత్యాకాండకూ, విధ్వంసకాండకూ అండగా నిలవడానికి వచ్చినవారేననేది నిస్సందేహం) కొంతమంది సల్వాజుడుం నాయకులూ, కొంతమంది ఉన్నతస్థాయి కాంగ్రెస్ నాయకులూ మే 25 సంఘటనలో తుడిచిపెట్టుకుపోయారు. అసలైన శత్రువులు చేతికందాక మేం మరణాల సంఖ్యను తగ్గించడానికి ఎంతగా ప్రయత్నించినప్పటికీ దురదృష్టవశాత్తూ తొలి విడత కాల్పుల్లో చిక్కుకున్న కొందరు కూడా ప్రాణాలు కోల్పోయారు. మా పార్టీ దండకారణ్య శాఖ ప్రతినిధి కామ్రేడ్ గుడ్సా ఉసెండీ ఇప్పటికే దీనికి క్షమాపణలు

చెప్పారు కూడా. కర్మ, అతని తాబేదారులూ చేసిన అత్యాచారాల వివరణలతో పుస్తకాల్నే నింపేయచ్చు. అన్నిటినీ కాకపోయినా, వీటిలో చాలావాటిని సిపిఐ (మావోయిస్టు), విప్లవ, ప్రజాస్వామిక ప్రజాసంఘాలూ, పౌర, మానవహక్కుల సంఘాలూ, ప్రజాస్వామికవాదులూ, విలేకరులూ, పౌరస్పందన వారూ వివరంగానే నమోదు చేసి చూడాలనుకునేవారందరికీ అందుబాటులో ఉంచారు. ప్రజలను నిజాల నుండి పక్కదారి పట్టించడం తప్ప మీడియాలో ఈ దాడికి కారణంగా ప్రచారం అవుతున్న వివిధ 'కుట్ర సిద్ధాంతాలకు' వేరే ప్రయోజనం ఏమీ లేదు. సల్వాజుడుం పాశవికతకు సంబంధించిన నిజాలనూ, దీనిని సృష్టించి దాన్ని నరభక్షక రాక్షసిగా తయారు చేయడంలో భారతసైన్యం, పెద్ద కార్పొరేట్ ఘరానాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలూ, కాంగ్రెస్, బీజెపీ పార్టీలూ, కర్మ వంటి నరహంతకులూ నిర్వహించిన పాత్రనూ కప్పిపుచ్చడానికి కార్పొరేట్ మీడియా చేస్తున్న సిగ్గుమాలిన కుట్ర ఇది. మావోయిస్టులను తుడిచిపెట్టేయాలనే అసహనం దానికెంతగా ఉందంటే అది తమ అత్యున్నత న్యాయస్థానమే సల్వాజుడుంను చట్టవిరుద్ధమైనదిగా పేర్కొన్నదనే విషయాన్ని కూడా పరిగణనలోకి తీసుకోలేదు. వారంతా, జైరాం రమేశ్ సహా మళ్లొకసారి అత్యంత అర్థరహితమైన, తిరిగీ తిరిగీ అరిగిపోయిన 'తిరగలి సిద్ధాంతాన్ని' (అంటే మావోయిస్టులకూ, సాయుధ బలగాలకూ నడుమ ఆదివాసులు నలిగిపోతున్నారనే సిద్ధాంతం) వల్లించారు. వారు నిజంగా దీన్ని నమ్ముతుంటే, సాయుధ బలగాలు ఆదివాసులను అణచివేస్తున్నాయని వాళ్లు ఒప్పుకుంటూ వుంటే ముందుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లక్షల సంఖ్యలో మోహరిస్తున్న సాయుధ బలగాలను ఉపసంహరించుకోవాలని ఎందుకు డిమాండ్ చేయరు? మా బలమైన ఉద్యమ ప్రాంతాల్లో అత్యధిక మెజారిటీ మావోయిస్టులు ఆదివాసులే అన్న వాస్తవం ముందు వాళ్ల అబద్ధాలు పైకి చూసి ఉమ్మినట్టుగా వున్నాయి. మేం ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రజల ప్రయోజనాలకు వ్యతిరేకంగా పని చేయం అని మా పార్టీ మరోసారి నొక్కి వక్కాణిస్తోంది. ప్రజల్ని అణచివేస్తున్నది పాలకవర్గాలూ, వారి బలగాలూ మాత్రమే. మేం దాన్ని ప్రతిఘటిస్తున్నాం అంతే.

ప్రజాశత్రువులందరూ ఒక సత్యాన్ని గ్రహిస్తే మంచిది - ఇది అత్యంత సామాన్యమైన, సాధారణమైన నగ్నసత్యం. మా పార్టీ, పీఎల్‌జీఏ లు పీడకుల నుండీ, లూటీదారుల నుండి తమను తాము రక్షించుకోవడానికి ప్రజలకు గల హక్కును పరిరక్షిస్తాయి. మే 25న మా సాహసిక పీఎల్‌జీఏ గెరిల్లాలు ప్రజలకు ముందుండి నాయకత్వం వహిస్తూ భారత విప్లవ ప్రజానీకానికి, ప్రత్యేకించి దండకారణ్య ప్రజలకు, మరింత ప్రత్యేకించి బస్తర్ ప్రజానీకానికి బద్ధ శత్రువుల్లో ఒకడు అయిన కర్మనూ, మరికొంతమంది ప్రజాశత్రువులనూ మట్టిగరిపించింది. ఇది బడా భూస్వాములకూ, కార్పొరేట్ దోపిడీ, లూటీలకూ వ్యతిరేకంగా చేపట్టిన విశాల

ప్రతిఘటనలో ఒక భాగంగా జరిగింది. ఈ సందర్భంగా చెవులు చిల్లులు పడేంత బిగ్గరగా మేం మరోసారి ప్రకటిస్తున్నదేంటంటే మా పీఎల్‌జీఏ ప్రజలకు తమను తాము రక్షించుకోవడానికి గల హక్కును పరిరక్షించడాన్ని కొనసాగిస్తుంది ప్రభుత్వ బలగాలూ, రాజ్య ప్రాయోజిత హంతక ముఠాలూ, వర్గ శత్రువులూ 'ప్రజలపై యుద్ధాన్ని' కొనసాగించినంత కాలం వారికి ముందుండి నేతృత్వం వహిస్తుంది. ఎందుకంటే, పీడితులకు ప్రజాసైన్యం లేకుంటే మరేమీ లేదు.

మే 25 సంఘటనకు సంబంధించినంతవరకూ విషయం ఇంతే. కానీ మేం ప్రజల దృష్టికి తేవాలనుకుంటున్న విషయం – యిలాంటి దాడులు జరిగినప్పుడే ప్రజాస్వామ్యం చర్చకు వచ్చే అత్యంత ఆశ్చర్యకరమైన తీరు గురించి. పార్లమెంటు విపణిలో అతి అరుదుగా మాత్రమే దొరికే ఈ ప్రజాస్వామ్యం సరుకు, దేశపు ఏ మారుమూలలోనో పీడిత ప్రజలు ఒక భగత్సింగ్ లాగా చెవిటివారికి వినిపించేలాంటి చర్య ఏదైనా చేసినప్పుడు మాత్రం ఎక్కడపడితే అక్కడ అమ్మకానికి దొరకడం చాలా విడ్డూరంగా తోచదూ? వాస్తవం చెప్పాలంటే, మావోయిస్టులమైన మాకు కూడా ఇలాంటి ఘటనలప్పుడే మేం వార్తాపత్రికల పతాకశీర్షికల్లో చోటు చేసుకోవడం విసుగు కలిగించేదిగా వుంది. కాబట్టి, కాస్త పక్కకు వెళ్లి, ప్రజాస్వామ్యాన్ని గానీ, మావోయిజాన్ని రోజువారీ ప్రాసంగికత కలిగిన విషయంగా గ్రహించడానికి మన దైనందిన జీవితాల్లో క్రమం తప్పకుండా జరుగుతున్న విషయాలకేసి చూస్తే ఎలా ఉంటుంది?

తన సోషల్ ఫాసిస్టు స్వభావాని కనుగుణంగానే సిపిఎం పోలిట్‌బ్యూరో "ఈ మావోయిస్టు దురాగతాలకు" అంతం పలకడానికి "గట్టి చర్యలు" తీసుకోవాలని కోరుతూనే "అన్ని ప్రజాస్వామిక శక్తులూ మావోయిస్టులు చేపట్టిన హింసాత్మక రాజకీయాలకు వ్యతిరేకంగా పోరాడాలి" అని వేడుకొంది. కాంగ్రెస్, బీజేపీలు మొదలుకొని జనతాదళ్ (యు), సమాజ్‌వాదీ పార్టీల వరకూ అన్ని ప్రముఖ రాజకీయ పార్టీలన్నీ ఈ దాడిని ఖండించడంలో గొంతు చించుకున్నాయి గానీ ఈ దాడికి వెనుకగల అసలు కారణాల గురించి ఒక్కటంటే ఒక్క మాట తమ నోళ్ల నుండి పెగల్చలేదు. కార్పొరేట్ మీడియా అబద్ధాల్ని అల్లడంలో పరాకాష్టనందుకుని, మిగతా అన్ని సోకాల్డ్ ప్రజాస్వామ్య సంస్థలన్నిటినీ మించిపోయి బూట్లు నాకే కుక్కలాంటి తన స్వభావాని కనుగుణంగానే మావోయిస్టుల అంతానికై అంగలార్చింది. మే 25 సంఘటన తర్వాత ముఖ్యమంత్రులతో జరిగిన అంతర్గత భద్రతపై సమావేశం, ఆ తర్వాత జరిగిన అఖిలపక్ష సమావేశం కూడా "ప్రజాస్వామ్యం, స్వాతంత్ర్యాలపై నేరుగా జరిగిన దాడి"గా దాన్ని అభివర్ణించాయి. ముఖ్యమంత్రులంతా ముక్తకంఠంతో – "మేం మావోయిస్టుల సిద్ధాంతంతో బలంగా విభేదిస్తున్నాం. వారు హింసాత్మక పద్ధతుల్లో పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్నీ, రాజ్యాంగాన్నీ కూలదోయాలనుకుంటున్నారు...దీన్ని మనం శక్తికొలదీ ప్రతిఘటించాలి," అని ప్రకటించారు.

సిపిఐ (మావోయిస్టు) కార్యకలాపాలను ఎదుర్కోవడానికి తమకు "అందుబాటులో వున్న అన్ని చట్టబద్ధ పద్ధతులనూ ఉపయోగించాలి" అని తీర్మానిస్తూ, దాన్ని సహించబోమనీ, రాజీపడబోమనీ రంకెలేశారు.

"హింసను విడనాడమనీ, చట్టబద్ధ, ప్రజాస్వామిక పద్ధతుల్లో తమ లక్ష్యాలకై ముందుకు సాగమనీ బాధిత రాష్ట్రాల యువతకు మేం విజ్ఞప్తి చేస్తున్నాం. వారి సమస్యల పట్ల మాకు సంవేదన ఉందనీ, వారిని సామాజిక, రాజకీయ ప్రధానస్రవంతిలోకి తీసుకురావడానికి శాయశక్తులా కృషి చేస్తామనీ వారికి హామీనిస్తున్నాం," అని ఆ తీర్మానంలో జోడించారు. అఖిలపక్ష సమావేశంలోనూ ఇదే భావన వ్యక్తమైంది.

ప్రజాస్వామ్యమా? స్వాతంత్ర్యమా? ఎవరికున్నాయి, ఎందుకున్నాయి? సల్వాజుడుం లాంటి హంతక ముఠాలూ, సాయుధ బలగాలూ తమ కుటుంబాలపై చేస్తున్న అత్యాచారాల/ హత్యాకాండలకు ప్రత్యక్ష సాక్షులైన, ఒకోసారి తామే బాధితులైన పిల్లల్నీ, లైంగిక అత్యాచారాలకూ/ సామూహిక అత్యాచారాలకూ లేదా హత్యలకూ గురైన మహిళల్నీ అడగండి ఈ డొల్లలాంటి మాటలకు అర్థం ఏమిటో. మాకు కనిపిస్తున్న ఒకేఒక ప్రజాస్వామ్యం శెనక్కాయలకు అమ్మినట్టుగా మన దేశ సంపదలను సామ్రాజ్యవాదులకు అప్పగించడానికీ, మిగిలిన తునకల కోసం అంగలార్చడానికీ లూటీదారులకు ఉన్న ప్రజాస్వామ్యం మాత్రమే. మాకు కనిపిస్తున్న ఒకేఒక స్వాతంత్ర్యం లూటీ, విధ్వంసం, లైంగిక అత్యాచారాలూ, హత్యాకాండలూ కొనసాగించడానికీ, సామ్రాజ్యవాదుల, దళారీ నిరంకుశ బూర్జువాల, బడా భూస్వాముల ప్రయోజనాల కోసం పీడిత ప్రజల్ని నిర్వాసితులను చేయడానికీ సాయుధ బలగాలకు వున్న స్వతంత్రం మాత్రమే. 'ప్రజాస్వామ్యం, స్వాతంత్ర్యాల' పేరిట ఇదంతా జరగడానికి వీలు కల్పిస్తున్న భారత పార్లమెంటు మొత్తం ప్రపంచంలోనే కుళ్ళికంపుకొడుతున్న సంస్థల్లోకెల్లా ఒకటి. మరి గత ఆరు దశాబ్దాలకు పైగా బైటకు పోయే దారంటూ లేని ఒక చీకటి గుయ్యారంలోకి మన దేశప్రజలను తోసేసిన ఒక సంస్థను, దానిని ధ్వంసం చేయడం తప్ప మరో మార్గం అంటూ వదలని ఒక సంస్థను కూలదోయమని కోరుకుంటే, అందుకు పిలుపునిస్తే తప్పేంటి? ప్రజాస్వామ్యం అంటే ప్రజల కోసం, ప్రజలచే, ప్రజలతో నడిచేది అని మీరు స్కూళ్లలో నేర్పలేదా? మరి అది సరిగ్గా తమ ప్రయోజనాలకు హాని చేయడానికే ఉనికిలో వుండి పని చేస్తుంటే దాన్ని నిరాకరించడానికీ లేదా దాన్ని కూలదోయడానికీ ప్రజలకు హక్కు ఉండదా? తాడిమెట్ల, జీరంఘాటీ దాడుల్లాంటి వాటిని కాసేపు పక్కనబెట్టండి. అవి ఎత్తుగడలు. పైన చెప్పినట్టే లక్షలాది బలగాల్ని అత్యాధునిక ఆయుధాలతో తమను అణచివేయడానికి మోహరించినప్పుడు ప్రజల ప్రతిఘటనలో అనివార్యమైన భాగంగా అవి జరుగుతాయి. మా రాజకీయాచరణనూ, పంథానూ ఇటువంటి దాడులకు

కుదించి చూడకండి. సిపిఐ (మావోయిస్టు) ఒక స్పష్టమైన శాస్త్రీయమైన సిద్ధాంతం అయిన మార్క్సిజం-లెనినిజం-మావోయిజంతో సాయుధమైన, మన దేశప్రజలకు నిజమైన ప్రజాస్వామ్యాన్ని తీసుకురాగల ఒక రాజకీయ పంథా, రాజకీయ కార్యక్రమం గల రాజకీయ పార్టీ. మావోయిస్టుల గురించి మాట్లాడదల్చుకున్న, రాయదల్చుకున్నవారెవరైనా గానీ, మాకు టెర్రరిస్టులనీ, వామపక్ష తీవ్రవాదులనీ పేర్లు తగిలించే ముందు మా పార్టీ కార్యక్రమాన్ని చదివితే మంచిది.

క్లుప్తంగా మా పార్టీ కార్యక్రమం ఇలా చెప్తోంది - భారతదేశం అర్ధవలస-అర్ధభూస్వామ్య దేశం మా విప్లవ లక్ష్యాలు సామ్రాజ్యవాదం, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ విధానం, భూస్వామ్యం. ఇవి మన దేశ ప్రజల్ని దోపిడీ, పీడనలకు గురి చేస్తున్నాయి. జనతా ప్రజాస్వామిక ఫెడరల్ రిపబ్లిక్ ను స్థాపించడానికి వీటిని నూతన ప్రజాస్వామిక విప్లవం ద్వారా కూలదోయాల్సి ఉంటుంది. ప్రస్తుతం భూస్వామ్యానికీ, అశేష ప్రజానీకానికీ మధ్య ఉన్న వైరుధ్యమే ప్రధాన వైరుధ్యంగా ఉన్నది. నూతన ప్రజాస్వామిక విప్లవానికి ఇరుసు అయిన సాయుధ వ్యవసాయ విప్లవం, ప్రజాయుద్ధం ద్వారా ఈ వైరుధ్యాన్ని పరిష్కరించే క్రమంలో ఇతర వైరుధ్యాలు పరిష్కారం కావడానికి దారి సుగమం అవుతుంది. భారత సమాజ అర్ధవలస-అర్ధభూస్వామ్య స్వభావం కారణంగా భారత విప్లవం రెండు దశల గుండా సాగాల్సి ఉంటుంది. మొదటి దశ కర్తవ్యంలో ప్రస్తుత భారత సమాజంలోని రెండు మౌలిక వైరుధ్యాలైన భారత ప్రజలకూ సామ్రాజ్యవాదానికీ మధ్య వైరుధ్యం, అశేష ప్రజానీకానికీ భూస్వామ్యానికీ వున్న వైరుధ్యాలను పరిష్కరించడం ద్వారా అర్ధవలస-అర్ధభూస్వామ్య సమాజాన్ని స్వతంత్రమైన నూతన ప్రజాస్వామిక సమాజంగా మార్చాల్సి ఉంటుంది. తిరిగి దాని కొనసాగింపులో, రెండవ దశ కర్తవ్యంలో సోషలిస్టు సమాజాన్ని స్థాపించడం, విప్లవాన్ని కొనసాగిస్తూ ప్రపంచవ్యాప్తంగా కమ్యూనిజం వైపుగా పురోగమించడం ఉంటాయి. ఈ నూతన ప్రజాస్వామిక రాజ్యం కార్మికవర్గం నాయకత్వంలో, కార్మిక-కర్షక మైత్రి ప్రాతిపదికగా కార్మికవర్గం, రైతాంగం, పెటీబూర్జువావర్గం, జాతీయ బూర్జువావర్గాలతో కూడిన ఐక్యసంఘటన నెరిపే జనతా ప్రజాస్వామిక నియంతృత్వంగా ఉంటుంది. ఈ రాజ్యం విశాల ప్రజానీకానికి నిజమైన ప్రజాస్వామ్యాన్ని యిచ్చేందుకు హామీగా నిలుస్తూ గుప్పెడుమంది దోపిడీదారులపై నియంతృత్వాన్ని నెరుపుతుంది. ఈ నూతన ప్రజాస్వామిక విప్లవం సామ్రాజ్యవాదానికి చేసే ఊడిగాన్నీ, దాని దోపిడీ, అదుపుల్నీ తుడిచిపెట్టడం ద్వారా జాతీయ స్వాతంత్ర్యాన్నీ, భూస్వామ్య నిరంకుశత్వాన్ని తుడిచిపెట్టడం ద్వారా జనతా ప్రజాస్వామ్యాన్నీ స్థాపిస్తుంది.

మన దేశ జనాభాలో అత్యధిక మెజారిటీ అయిన కార్మికులు, కర్షకులు, పట్టణ పేదలు

దుర్భర దారిద్ర్యంలో ఆకలి, రోగం, అమానవీయ భూస్వామ్య–సామ్రాజ్యవాద దోపిడీ, పీడనలకు గురవుతూ జీవిస్తున్నారు. వీరంతా నూతన ప్రజాస్వామిక విప్లవం ద్వారా విముక్తులవుతారు. అది కోట్లాది దళితులనూ, ఇతర పీడిత కులాలనూ శతాబ్దాలుగా అణగదొక్కి ఉంచుతున్న బ్రాహ్మణీయ భూస్వామ్య నిచ్చెనమెట్ల అమానవీయ కులవ్యవస్థను కూలదోస్తుంది సగజనాభాగా ఉన్న స్త్రీలను దోపిడీ, పీడనలకు గురి చేస్తున్న భూస్వామ్య, సామ్రాజ్యవాద పితృస్వామిక సామాజిక వ్యవస్థను కూలదోస్తుంది. మన దేశంలోని మతమైనారిటీలను, ప్రత్యేకించి ముస్లింలనూ, క్రిష్టియన్లనూ అణచివేస్తూ వస్తున్న హిందూ మతోన్మాద ఆధిపత్యాన్ని అది నాశనం చేస్తుంది. విశాల ఆదివాసీ ప్రజానీకం ఎటువంటి ప్రత్యామ్నాయం లేకుండా తమ భూముల నుండీ, సంప్రదాయ జీవనోపాధుల నుండీ తొలగించబడ్తూ, విస్థాపనకూ, 'అభివృద్ధి'కీ ప్రధాన బాధితులుగా ఉంటున్నారు. వారు నూతన ప్రజాస్వామిక సమాజంలో ఆత్మగౌరవం, స్వాతంత్ర్యం, స్వయం–సమృద్ధితో కూడిన జీవనం సాగిస్తారు. నేటి భారతదేశం జాతుల బందిఖానాగా ఉన్నది. నూతన ప్రజాస్వామిక రాజ్యం జాతుల స్వయం నిర్ణయాధికారాన్ని విడిపోయే హక్కుతో సహా నిర్ద్వంద్వంగా గుర్తిస్తుంది స్వచ్ఛందంగా దానిలో ఉండడానికి సిద్ధపడే రాష్ట్రాలతోనే నూతన ప్రజాస్వామిక భారతదేశం ఏర్పడుతుంది. మన జీవనరంగాలన్నిటిలో ఆధిపత్యం వహిస్తున్న కుళ్లికంపు కొట్టే, ప్రజాస్వామ్య వ్యతిరేక, ప్రజావ్యతిరేక, అసభ్యకరమైన అర్ధవలస–అర్ధభూస్వామ్య సంస్కృతిని అది నాశనం చేస్తుంది. శ్రమపట్ల ద్వేషం, పితృస్వామ్యం, మూఢనమ్మకాలు, నిరంకుశత్వం, సామ్రాజ్యవాదానికి ఊడిగం చేయడం, జాతి ఉన్మాదం, మతోఛాందసవాదం, కులతత్వం, గుడ్డి లోభత్వం, స్వార్థం, వినిమయ సంస్కృతి, వెర్రితలలు వేసే సెక్స్–కేంద్రిత భావజాలం, సంస్కృతులను అది అంతం చేస్తుంది. పుట్టుకతో వచ్చే ఆధిపత్యాన్ని కలిగించే బ్రాహ్మణవాద కులాధారిత సంస్కృతి ప్రధానంగా గల భూస్వామ్య సంస్కృతిని అది అంతం చేస్తుంది.

ఈ రాజ్యం ఇరుగుపొరుగు దేశాలతో గల సరిహద్దు, నీరు, ఇతర వివాదాలను శాంతియుతంగానూ, నిష్పాక్షికంగానూ పరిష్కరించడానికి శాయశక్తులా కృషి చేస్తూ వాటితో మిత్ర సంబంధాలను అభివృద్ధిపరుచుకుంటుంది. ఈ రాజ్యం తన ఇరుగుపొరుగు దేశాలపట్ల ఎటువంటి విస్తరణవాద ధోరణినీ ప్రదర్శించదు. ఈ జనతా ప్రజాస్వామిక రాజ్యం అంతర్జాతీయ కార్మికవర్గంతోనూ, ప్రపంచ పీడిత జాతులతోనూ ఐక్యతను స్థాపిస్తుంది సామ్రాజ్యవాద యుద్ధాన్నీ, దురాక్రమణనూ, దౌర్జన్యాన్నీ, విద్రోహాన్నీ, జోక్యాన్నీ మొ॥ వ్యతిరేకిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారీ విధానానికీ, సామ్రాజ్యవాదానికీ, ప్రతీఘాతుకత్వానికీ వ్యతిరేకంగా జరుగుతున్న విప్లవ పోరాటాలకూ, విప్లవ యుద్ధాలకూ, ప్రత్యేకించి వివిధ

మావోయిస్టు శక్తుల నేతృత్వంలో నేడు కొనసాగుతున్న పోరాటాలకు అది మద్దతునిచ్చి, అన్ని రకాల సహాయ సహకారాలను అందిస్తుంది.

తెలుసుకోవాలని కోరుకునేవారందరి కోసం సిపిఐ (మావోయిస్టు) పార్టీ కార్యక్రమంలో జనతా ప్రజాస్వామిక ఫెడరల్ రిపబ్లిక్ లేదా నూతన ప్రజాస్వామిక రాజ్యం అమలు చేసే 25 అంశాలతో కూడిన ఒక సంక్షిప్త కార్యక్రమం రాసి ఉన్నది. మావోయిస్టుల గురించిన ఏ వాదోపవాదాలైనా గానీ దాని చుట్టూ కేంద్రీకృతమై జరిగితే మంచిది.

పాలకవర్గాలు యువతకు హింసను విడనాడమనీ, తమ లక్ష్యాలను చట్టబద్ధ, ప్రజాస్వామిక పద్ధతుల్లో నెరవేర్చుకోమనీ విజ్ఞప్తి చేస్తున్నాయి. ఇది నిష్పాక్షికమైన విజ్ఞప్తేనా? 'చట్టబద్ధ, ప్రజాస్వామిక' పద్ధతులను ఉపయోగించాలంటే కూడా కనీసంగా ప్రజాస్వామ్యం అనబడేది కలికానికైనా ఉండాలనేది ఇంగిత జ్ఞానం కాదా? కార్మికవర్గ సంస్థలు/ట్రేడ్ యూనియన్లు, రైతుకూలీ సంఘాలు, మహిళా సంఘాలు, సాంస్కృతిక సంఘాలు, విద్యార్థి–యువజన సంఘాలు, ఆఖరికి బాలల సంఘాలు కూడా నిషేధానికి గురై ఉన్నాయి. రచయితల, సాంస్కృతిక కార్యకర్తల, ప్రజాస్వామికవాదుల, మేధావుల, వారి సంస్థల గొంతులు నొక్కేశారు. రోజువారీగా మౌలిక హక్కుల హననం జరుగుతూ ఉంటుంది. తీవ్రతరం చేస్తున్న నిర్బంధ చర్యలకు తోడు వలసవాదుల అడుగుజాడల్లో నడుస్తూ నిరంకుశ చట్టాలను తయారు చేయడమో, సవరణ చేయడమో ఏమాత్రం క్రమం తప్పకుండా జరిగిపోతూ ఉంటుంది. కోర్టులు పెద్ద స్కాంస్టర్–గ్యాంగ్‌స్టర్ ల, దేశద్రోహకర రాజకీయ నాయకుల, స్మగ్లర్ ల, నేరస్థుల పక్షం వహిస్తాయి మరోవైపు రాజకీయ, సామాజిక కార్యకర్తలూ, అమాయక ప్రజలూ జైలుపాలవుతారు, చిత్రహింసల్లో కాళ్లూ చేతులూ పోగొట్టుకుంటారు, ప్రాణాలు కోల్పోతారు. మన ప్రియతమ దేశాన్ని ఒక నిజమైన స్వతంత్ర, సార్వభౌమ, సమృద్ధ, ప్రజాస్వామిక రాజ్యంగా తీర్చిదిద్దడానికి అవసరమైన అమోఘమైన శక్తిగల యువత నేడు అనుభవిస్తున్న స్థితి ఇదీ. భారత సాయుధబలగాలు కశ్మీరు, ఈశాన్యం, ఆంధ్రప్రదేశ్, దండకారణ్యం, బీహార్–ఝార్ఖండ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర, ఉత్తర్ ప్రదేశ్, కర్ణాటక, అసోం, మధ్యప్రదేశ్ లలోని విశాల గ్రామీణ ప్రాంతాల్లో, ఇతర విప్లవోద్యమ ప్రాంతాల్లో పాశవికంగా హత్య గావించిన లక్షలాది యువత స్వతంత్రమైన, సృజనాత్మకమైన, ఉత్పాదకమైన ఆలోచనాధోరణి గలిగిన నేటి భారతదేశపు అత్యుత్తమ పుత్రులు, పుత్రికలు. మన ప్రియతమ దేశ భవిష్యత్తును మెరుగ్గా తీర్చిదిద్దడానికి వీరు ప్రజాస్వామిక, జాతి విముక్తి, విప్లవ సంస్థలనూ, పార్టీలనూ ఏర్పర్చి/వాటిలో చేరి పని చేస్తూ ఉండినారు. కొట్టొచ్చినట్టుగా కనిపించే వాస్తవం ఏంటంటే – తమ న్యాయమైన డిమాండ్లు, హక్కుల కోసం దశాబ్దాల తరబడి 'చట్టబద్ధ, ప్రజాస్వామిక' పద్ధతులను

వారు ఉపయోగిస్తూ వచ్చినప్పటికీ భారత రాజ్యం పదేపదే, నవనాడులూ కుంగదీసేలా వాటికి ఏమాత్రం స్పందించకపోవడం జరిగాకనే యువత ఆయుధాలు చేపట్టారు. పీడిత ప్రజల చారిత్రక కర్తవ్యంగా తమ స్వశక్తిపైనా, తమ స్వంత ప్రజలపైనా ఆధారపడి తమ భవిష్యత్తును తమ చేతులతో తామే తీర్చిదిద్దుకోవడానికి వారు ఆయుధాలు చేపట్టారు. 'చట్టబద్ధ, ప్రజాస్వామిక' పద్ధతుల కోసం వారిని ఆయుధాలను విడనాడాలని కోరడం విషయాల్ని తలకిందులుగా చెప్పడమే కాదు, క్రూర పరిహాసం కూడా. తమకు తుపాకులంటే ఆరాధన కనుకనో, చట్టబద్ధ, ప్రజాస్వామిక పద్ధతులు వెల్లివిరుస్తున్న ఒక వాతావరణంలోనో లేక ప్రజాస్వామ్యాన్ని గౌరవించడం తెలువకనో వారు ఆయుధాలు పట్టలేదు. వాస్తవం ఇందుకు సరిగ్గా విరుద్ధంగా ఉన్నది. వారికి నిజమైన ప్రజాస్వామ్యం కావాలి కనుకనే వారు ఆయుధాలు చేపట్టారు. మా నూతన ప్రజాస్వామిక విప్లవం సరిగ్గా దానినే వాగ్దానం చేస్తోంది. ఇది ప్రస్తుతం ఉన్న బూటకపు ప్రజాస్వామ్యానికి సరిగ్గా విరుద్ధమైనది.

ముఖ్యమంత్రుల సమావేశంలోగానీ, అఖిలపక్ష సమావేశంలోగానీ ప్రజల మౌలిక సమస్యలైన భూమి, విద్య, ఆరోగ్యం మొ॥వాటిని కనీసంగా ప్రస్తావించని ప్రభుత్వం వేలాది యువతకు, ప్రత్యేకించి ఆదివాసులకూ, మహిళలకూ శిక్షణా కార్యక్రమాలను నడుపుతామనీ, శిక్షణ పొందినవారిలో కనీసం సగంమందికి ఉపాధి కల్పిస్తామనీ ప్రకటిస్తోంది. ఇది 'అభివృద్ధి' ప్యాకేజీలో భాగం. (రెండోది 'నిర్బంధం' ప్యాకేజి, మరణాలతో, దుర్భర పరిస్థితులతో కూడుకున్న ప్యాకేజీ, మన దేశ యువతకు వాస్తవంలో ఎక్కువ పరిచితమైనది ఇదే). నువ్వు వారి కాళ్ల కింది భూమిని లాక్కుంటావు, వారిని శతాబ్దాలుగా నివసిస్తున్న ఆవాసాల నుండి నిర్వాసితుల్ని చేస్తావు, అడవులపై, భూమిపై ఆధారపడిన వారి సంప్రదాయక జీవనోపాధుల నుండి దూరం చేస్తావు, తర్వాత వారిలో కొన్ని వేలమందికి మాత్రం శిక్షణనిస్తావు – అదీ వారిని స్వయంసమృద్ధం చేయలేని ఒక శిక్షణ. వారిలోనూ మళ్లీ కొద్దిమందికే ఉద్యోగాలిస్తామనే వాగ్దానం, అదీ బూటకపు వాగ్దానం. ఆహా! ఎంత గొప్పగా ఉందీ అభివృద్ధి భావన! అతి తక్కువ శాతం ప్రజలకు తక్కువ జీతాలొచ్చే ఉద్యోగాలు దొరికినప్పటికీ అవి ఒక కుటుంబ కనీస అవసరాలను తీర్చడానికి ఏమాత్రం సరిపోవు. అడవుల్లో జీవించినప్పుడు అందుబాటులో వుండిన సంప్రదాయకమైన జీవనోపాధి వనరుల నుండి దూరం అయ్యాక, రూపాయి విలువ వేగంగా పడిపోతున్న నేపథ్యంలో పరిస్థితి మరింత దారుణంగా మారిపోతుంది. 'యువత ఎదుర్కొంటున్న సమస్యల పట్ల మాకు సంవేదన వుంది' అని ప్రకటించిన పాలకవర్గాల 'సాహసాని'కి ఆశ్చర్యం వేస్తుంది. అవన్నీ బూటకపు సంవేదనలే కనుక, వాస్తవం ఇబ్బడిముబ్బడిగా పెరుగుతున్న నిరుద్యోగం, తక్కువ ఉద్యోగిత రూపంలో వెక్కిరిస్తుంది. వారికి నిజంగా అంత సంవేదనే ఉంటే భారత

పార్లమెంటే ఆమోదించిన పెసా, 5వ, 6వ షెడ్యూల్, అటవీ హక్కుల చట్టం వంటివాటిని ఎందుకు అమలు చేయరు? ఇవి 'యువత ఎదుర్కొంటున్న గంభీర సమస్యలు' కావా? అందుకే యువతను మావోయిస్టు పార్టీ నుండి దూరం చేయడానికి చేస్తున్న మానసిక యుద్ధంలో ఇదంతా చేస్తున్నారని మనం గుర్తెరగాలి.

రాజ్యాంగ పరిధిలో 'తీవ్రవాద బృందాలతో' చర్చలు జరపడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రధానమంత్రి ముఖ్యమంత్రుల సమావేశంలో ప్రకటిస్తే, మే 25 ఘటన తర్వాత మావోయిస్టులతో చర్చల సమస్యే లేదని హోం కార్యదర్శి ఆర్‌కె సింగ్ ప్రకటించాడు. విధానాలను ఎవరు నిర్ణయిస్తారనేది ఎవరికి వారు తేల్చుకోవచ్చు. అయితే, మా పార్టీ గతంలో అనేకసార్లు ప్రభుత్వంతో చర్చల విషయంలో మా వైఖరిని స్పష్టంగా ప్రకటించి ఉంది. ఇక్కడ మేం ప్రజల దృష్టికీ, ప్రభుత్వంతో చర్చలు చేయాలనో, కాల్పుల విరమణో చేయాలనో ప్రతిపాదిస్తున్న ప్రజాస్వామికవాదుల దృష్టికీ తేదల్చుకున్న విషయం ఇటువంటి ప్రతిపాదనల వెనుకగల నేపథ్యాన్ని చూడమని. దాన్ని చూస్తే ఇటువంటి ప్రతిపాదనల వెనుక వారికి ఎంత నిజాయితీ ఉందో మీరే నిర్ణయానికి రాగల్గుతారు – హత్యాకాండ, విధ్వంసం, లైంగిక అత్యాచారాలు చేయడానికి సాయుధ బలగాలు మావోయిస్టు ఉద్యమ ప్రాంతాల్లో ఏదో ఒక ఆపరేషన్ చేపట్టని రోజు ఒక్కటి కూడా లేదు మరోవైపు మా ఉన్నత నాయకత్వం చాలామంది అమానవీయ పరిస్థితుల్లో అనేక సంవత్సరాలుగా కనీస సౌకర్యాలకూ, బెయిల్స్ కు కూడా దిక్కులేకుండా జైళ్లలో మగ్గిపోతున్నారు.

ప్రస్తుత సందర్భానికి వస్తే, భారత పాలకవర్గాలు మావోయిస్టులను తుడిచిపెట్టడానికి మరో పెద్ద దాడికి మున్నెన్నడూ లేనంతటి స్థాయిలో సన్నాహాలను ఇప్పటికే మొదలుపెట్టేశాయి. కానీ ఇప్పుడు వారు మే 25 ఘటనను అందుకు సాకుగా ఉపయోగించుకునే ప్రయత్నం చేస్తున్నారు. రానున్న ఎన్నికలు ఆపరేషన్ గ్రీన్‌హంట్ ను విస్తృతం, తీవ్రతరం చేయడానికి మరో బలమైన కారణం. ఆదివాసీ ప్రాంతాల్లో మైనింగ్ కోసం, ఇతర 'అభివృద్ధి' పథకాల కోసం చేసుకున్న వివిధ ఎంఓయూ లను బలవంతంగా అమలు చేయడం కోసమే ఇదంతా చేస్తున్నారనే వాస్తవం చాలా వివరంగా, బలంగా ఇప్పటికే రుజువు చేయబడి ఉన్నది. ఈ కుట్రను గుర్తెరగమనీ, మే 25 ఘటన లాంటివే మరింత నిర్బంధానికి దారి తీస్తున్నాయేమో అని ఆలోచించే ఉచ్చులో పడొద్దనీ మేం ప్రజలందరికీ విజ్ఞప్తి చేస్తున్నాం. వాస్తవానికి, ఇంతకు కొన్ని రోజుల ముందే మే 17న ఎడ్సమెట్టలో జరిగిన నరసంహారం లాంటివి (ముగ్గురు పిల్లలు సహా ఎనిమిది ఆదివాసులను ప్రభుత్వ బలగాలు చంపేశాయి) ఇప్పటికే తీవ్రతరం అయిన 'ప్రజలపై యుద్ధం'లో భాగమే. ఊచకోతలతో పాటు ఈ నూతన దాడిలో ప్రధానంగా భారత వైమానిక దళ హెలికాప్టర్ల

మల్టిపుల్ యూనిట్లను భాగం చేస్తూ జరిగే వైమానిక దాడులు, మానవరహిత డ్రోన్ దాడులూ ఈసారి ఉంటాయి. రక్షణ మంత్రి సైన్యాన్ని వినియోగించం అన్నాడు గానీ వాస్తవం ఏంటంటే మే 25 దాడికంటే ముందే సైన్యం కోవర్టు పాత్ర అనేక రెట్లు పెరిగింది, ఇంకా పెరుగుతుంది కూడా. మే 17 ఊచకోత తర్వాత ఎడ్సమెట్ట ప్రజానీకం చాలా సూటిగా ప్రకటించారు – "వారు మా ఆదివాసుల్ని మొత్తానికే లేకుండా చేద్దామనుకుంటున్నారు."

ఈ సందర్భంగా, సార్కిన్‌గూడ, ఎడ్సమెట్ట మొ॥న ఫాసిస్టు ఊచకోతల తర్వాత తమను మొత్తంగా తుడిచిపెట్టేస్తారేమోనన్న భయంతో గ్రామల నుండి పారిపోతున్న ప్రజలకు అలా పారిపోవద్దని మేం మరోసారి విజ్ఞప్తి చేస్తున్నాం. క్రాంతికారి జనతన సర్కార్ల నేతృత్వంలో ఐక్యంగా నిలిచి, భారత రాజ్యం చేపట్టిన దాడిని ఎదుర్కొనండి. పార్టీ, పీఎల్‌జీఏ లు మిమ్మల్నీ, మీ హక్కులనూ ప్రాణాలకు తెగించి కాపాడతాయి.

కార్మికులు, కర్షకులు, యువత, మేధావులు, ప్రజాస్వామికవాదులు, మహిళలు, దళితులు, ఆదివాసులు, పీడిత జాతుల ప్రజలు, మత మైనారిటీలకూ, ఈ వర్గాల, సముదాయాల, సెక్షన్లన్నిటి సంస్థలకూ, ఒక్కమాటలో, మన దేశ విశాల ప్రజారాశులకు పాలకవర్గాల ఈ కుట్రనీ, కుతంత్రాలనూ గుర్తెరగమని విజ్ఞప్తి చేస్తున్నాం. సామ్రాజ్యవాదులకు, ప్రత్యేకించి అమెరికా సామ్రాజ్యవాదులకు నమ్మిన బంట్లు అయిన ఈ పాలకవర్గాలు మరింత క్రూరమైన, అమానవీయమైన ఫాసిస్టు 'ప్రజలపై యుద్ధం'లో భాగంగా మరో పెద్ద దాడికి ఒక్కటవుతున్నారు. అపూర్వమైన, అత్యంత విశాలమైన ఒక బ్రహ్మాండమైన పోరాటశక్తిగా ఐక్యం అయ్యి ఈ అన్యాయమైన అణచివేత యుద్ధాన్ని ఓడించండి. తద్వారా మాత్రమే మనం నిరంతరం మన మెడ మీద కత్తిలా వేలాడే రాజ్య టెర్రరిజం ముప్పును అంతమొందించే దిశగా పురోగమించి నిజమైన ప్రజాస్వామ్యాన్నీ, నిజమైన స్వాతంత్ర్యాన్నీ సాధించగలం. అంతేగాక మన దేశ భవిష్యత్తుకు అత్యంత విలువైన నిధి అయిన మన యువతను కూడా కాపాడుకోగల్గుతాం.

**అభయ్**

**అధికార ప్రతినిధి**

**కేంద్ర కమిటీ**

**సీపీఐ (మావోయిస్టు)**

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# కేంద్ర కమిటీ

**26-6-2013**

## ఉత్తరాఖండ్‌లో భారీ ప్రకృతి విధ్వంసం
## భారత దళారీ పాలకవర్గాల సామ్రాజ్యవాద అనుకూల ప్రజావ్యతిరేక ఆర్థిక, జీవావరణ విధానాల ఫలితమే!

మేఘాల విస్ఫోటనం, తదనంతర వరదలు, అంతులేని వర్షాలు 2013 జూన్ 16 నుంచి ఉత్తరాఖండ్ రాష్ట్ర వినాశనానికి దారితీశాయి. వేలాది ప్రజలు, అసంఖ్యాకంగా పశువులు దుర్మరణం పాలవడం పట్ల ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. 10 రోజులు గడిచినప్పటికీ ఒక లక్ష మంది పైగా ప్రజలను ఆ ఆపద నుంచి రక్షించినా, ఇంకా వేలాది మంది దుర్భర పరిస్థితుల్లోనే ఉన్నారనీ లేదా జాడ తెలియకుండా పోయారనీ ఆందోళన చెందుతున్నారు. ఆకలికి తాళలేక అనేక మంది ప్రజలు మృతి చెందారని తెలుస్తోంది. అంతేకాక ఇలాంటి విపత్తుల సందర్భంగా పెద్ద మొత్తంలో ప్రజలు, పశువులు మరణించినప్పుడు మహమ్మారి వ్యాధులు ప్రబలుతాయనే భయాలు ఉండనే ఉంటాయి. ఆస్తి నష్టం వేల కోట్ల రూపాయలు ఉంటుంది. మొత్తానికి మొత్తమే గ్రామాలు, ఇళ్లు, వాహనాలు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (మౌలిక సదుపాయాలు), సంస్థలు, ఇన్‌స్టలేషన్లు - ఇలా ప్రతి ఒక్క నిర్మాణమూ పెను వరదల్లో కొట్టుకుపోయాయి. వినాశనం జరిగిపోయింది. కానీ ఈ వినాశన స్థాయిని కొలవడం అంత తేలిక కాదు. పశువుల మరణాలు ఎంతటి తీవ్రస్థాయిలో జరిగాయంటే స్థానిక ప్రజలపై దీని ప్రతికూల ప్రభావం దీర్ఘకాలం పాటు తీవ్రంగా ఉంటుంది. ప్రజలు కోలుకొని తిరిగి సాధారణ జీవన స్థాయికి చేరుకోవడానికి అనేక సంవత్సరాలు పడుతుందని అంచనా వేస్తున్నారు.

సి.పి.ఐ. (మావోయిస్టు) కేంద్రకమిటీ, విపత్కర పరిస్థితుల్లో చిక్కుకున్న ఉత్తరాఖండ్ ప్రజల పక్షాన నిలబడుతోంది. తమ బంధువులను, మిత్రులను కోల్పోయిన ప్రజలకు ప్రగాఢ సానుభూతిని తెలువుతోంది. అంతులేని బాధను, నష్టాన్ని అనుభవిస్తున్న ప్రజల దుఃఖంలో పాలుపంచుకుంటోంది. ఉత్తరాఖండ్ ప్రజలకు మద్దత్తుగా కదలాల్సిందిగా, వారి కోసం సాగే సహాయ-రక్షణ కార్యక్రమాలలో పాల్గొనాల్సిందిగా లేదా వారు అందించగలిగే ఎటువంటి సహాయం లేదా మద్దతును అయినా అందించాల్సిందిగా మొత్తం తన పార్టీ శ్రేణులను, పిఎల్‌జిఏను, విప్లవ ప్రజా సంఘాలనూ, విప్లవ ప్రజా కమిటీలనూ/జనతన సర్కార్లనూ కోరుతున్నది. మనం తీవ్రమైన ప్రభుత్వ నిర్బంధాన్ని ఎదుర్కొంటున్నప్పటికీ వారి పక్షాన

నిలబడడం మన బాధ్యత. మా కేంద్రకమిటీ, మన దేశంలోని ప్రతి ఒక్కరినీ తాము అందించగలిగే అన్ని రకాల మద్దతును, సహాయాన్ని – పాదార్థికంగా, నైతికంగా – ఉత్తరాఖండ్ ప్రజలకు అందించాల్సిందిగా, వారు కోలుకునేంత వరకూ వారికి అండగా నిలవాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నది.

తక్షణం అక్కడ ప్రజలకు అవసరమైన సహాయ–రక్షణ చర్యలను చేపడుతూనే, ఈ సందర్భంగా ఒక పెద్ద ప్రశ్న గురించి మనం ఆలోచించాల్సిన అవసరం ఉంది – తీవ్రస్థాయిలో జరిగిన ఈ వినాశనం నివారించగలిగేదేనా? వాతావరణం, భూగోళ శాస్త్రం, నీటి శాస్త్రం (హైడ్రోలజీ) అధ్యయనాల ద్వారా సాధించినటువంటి శాస్త్రీయమైన ఆవిష్కరణల్ని వినియోగించుకోవడం ద్వారా ఇలాంటి వినాశనాల్ని తప్పించలేమా? కనీసం వినాశన స్థాయిల్ని తగ్గించడం సాధ్యమయ్యేది కాదా? అత్యంత విచారకరంగా హృదయ విదారకంగా ఉన్నప్పటికీ, ఈ ప్రశ్నలన్నింటికీ జవాబు మాత్రం అలాంటి వినాశనాల్ని తప్పించగలమూ, కనీసం వినాశన స్థాయిల్ని తగ్గించడం సాధ్యమూననేదే.

గతంలో ఇలాంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించాయి. నిస్సందేహంగా భవిష్యత్తులో కూడా ఇవి సంభవిస్తాయి. కానీ మనం 21వ శతాబ్దంలో ఉన్నాం. శాస్త్రీయ ఆవిష్కరణల్లో పురోగమనాన్ని మనం చూస్తున్నాం. ఈ 'ప్రాకృతిక విపద'ల వెనుక నిజమైన విషాదం ఏమంటే, ఆ సైన్సును ప్రజలకు సేవ చేయడం కోసం కాక లేదా పథకంతో కూడిన సమగ్ర అభివృద్ధి క్రమం కోసం కాక, దురాశాపూరిత సామ్రాజ్యవాదుల, భారత బడా దళారీ కార్పొరేట్ ఘరానాల సేవ కోసం వినియోగించడం. ఇది వికృత 'అభివృద్ధి'కి దారితీస్తోంది. దీని లక్ష్యం ప్రజల సంక్షేమమని చెప్పడం పచ్చి బూటకం. పేరాశతో కూడిన గుత్త పెట్టుబడిదారులకు లాభాలు సమకూర్చడమే దీని లక్ష్యం. ఉత్తరాఖండ్ వినాశనం ఇలాంటి ప్రజా వ్యతిరేక, ఆర్థిక, జీవావరణ విధానాలు, 'అభివృద్ధి నమూనాల' సూటి ఫలితమే.

ఉత్తరాఖండ్ రాష్ట్రం భూమి అత్యంత సుందరమైన స్థలాల్లో ఒకటి. సహజ వనాలతో సమృద్ధమైనది. ఎలాంటి కాలుష్యం లేని నదులు అక్కడి భూభాగాన్నంతటినీ తడుపుతున్నాయి. కానీ, విచక్షణారహితంగా, ఎలాంటి కనీస స్పృహ లేకుండా అడవులను, భూములను, జలాలను, దళారీ పాలకులు కొల్లగొట్టిన ఫలితంగా ఈ పరిస్థితి వేగంగా మారిపోయింది. ఇందుకు రాజ్యం చేపట్టిన టూరిజం 'అభివృద్ధి', మతపరమైన (ఆధిపత్య హిందు మతం) ప్రాధాన్యత ఉన్న ప్రదేశాలలోని పర్వతాలను, నదులను, ఎలాంటి ఇంగిత జ్ఞానం లేకుండా హ్రస్వదృష్టితో కలుషితం గావించడం తోడయ్యాయి. ఈ అతి చిన్న రాష్ట్రంలో 70 హైడ్రో–ఎలక్ట్రిక్ ప్రాజెక్టుల నిర్మాణం అవ్వడం లేదా అవుతుండడం అత్యంత ఆందోళనకరమైన అంశం. టూరిజం కోసం అసంఖ్యాకమైన ధాబాలు, హొటళ్లు, కాకా హొటళ్లు, మతపరమైన కార్యాల కోసం లెక్కలేనన్ని

ఆశ్రయాలు మొదలైనవి నదీ తీరాల వెంట, రోడ్ల వెంట కొండలను పగులగొట్టి అసురక్షితమైన ప్రదేశాలలో నిర్మాణం చేశారు. రోడ్ల నిర్మాణం కోసం, పైన ఉదహరించిన నిర్మాణాల కోసం కొండలను పగులగొట్టేందుకు లేదా తొలించేందుకు వేలాది టన్నుల డైనమైట్లు, లక్షలాది డిటోనేటర్లు ఉపయోగించబడ్డాయి. ప్రజల సాంప్రదాయక విజ్ఞానాన్ని చెత్తకుప్పల్లోకి విసిరేసి ఎండిపోయిన నదీ తలాలపై, పూర్వం నదులు ప్రవహించిన ప్రదేశాలపై నిర్మాణాలు (కన్‌స్ట్రక్షన్స్) ఉనికిలోకి వచ్చాయి. ఈ విషాదానికి వెనుక ప్రకృతి వినాశనానికి దారితీసేటటువంటి హ్రస్వదృష్టితో కూడిన లేదా మరింత ఖచ్చితంగా చెప్పాలంటే ఇంగిత జ్ఞానం లేని ఈ పథకాలు, దురాశపూరిత చర్యలు పదే పదే అనేక సార్లు అమలయ్యాయి. ప్రకృతి విపత్తికై రాష్ట్రం ఎదురుచూస్తూ ఉండింది.

కాని, ఈ కథ ఇంతటితో ముగియదు. ఉత్తరాఖండ్ మహా వినాశనాన్ని బలాధిక్యత కలిగిన సామ్రాజ్యవాదుల చర్యల ఫలితంగా ప్రపంచమంతటా సాగుతున్న జీవావరణ విధ్వంసంలో భాగంగా చూడాలి. కాలుష్యం, పర్యావరణం, జీవావరణ విధ్వంసం అనేవి పెట్టుబడిదారి అభివృద్ధికి సంబంధించిన విస్పష్టమైన లక్షణాలు. సామ్రాజ్యవాదులు, ప్రత్యేకించి అమెరికా సామ్రాజ్యవాదులచే అమలవుతున్న పర్యావరణ విధానాల వినాశకరమైన పరిణామాలకు ప్రపంచవ్యాప్తంగా ప్రజలు బలవుతున్నారు. ఈ అర్థంలో కూడా ప్రపంచ ప్రజలకు అమెరికా సామ్రాజ్యవాదం నెంబర్ 1 శత్రువు. సామ్రాజ్యవాదులు విశ్వం, సముద్రాలు, అడవులు, నదులు, పర్వతాలు, హిమనదాలు, వృక్ష-జంతుజాలం, భూమి, గాలి - అంటే, మన భూమికీ, మన జీవనానికీ స్థానాన్ని కల్పించే ప్రతి ఒక్క అంశమూ వారి ద్వారా ప్రభావితమయ్యింది. కాలుష్యానికి, విధ్వంసానికి గురయ్యాయి, చెడిపోయాయి లేదా నిర్జీవమయ్యాయి. అభివృద్ధి చెందుతున్న దేశాలని చెప్పబడుతున్న దేశాల దళారీ పాలకులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం తమ సామ్రాజ్యవాద ప్రభువులతో రహస్యంగా కుమ్మక్కై మన భూమిని, విశ్వాన్ని వారికి దోచబెడుతున్నారు. వారంతా తోడు దొంగలే. బ్రెజిల్ దేశంలో ఇప్పటి వరకూ కలుషితం కాని అమెజాన్ అడవులను లూలా ప్రభుత్వం, దాని తర్వాతి ప్రభుత్వాలతో కుమ్మక్కై కొల్లగొట్టడం అనేది కొనసాగుతున్న విధ్వంసానికి స్పష్టమైన సమకాలీన ఉదాహరణ. గ్లోబల్ వార్మింగ్ (భూమి వేడి పెరగడం), కార్బన్ ఉత్సర్జిత వాయువుల స్థాయిలు పెరుగుతూండడం, సముద్ర ప్రవాహ దిశలు మారుతుండడం, ఇలాంటి ప్రపంచ వాతావరణాన్ని వినాశనం గావించే పరిణామాలు అన్నీ సకల దేశాల జీవావరణాన్ని ప్రభావితం చేస్తున్నాయి. ఉత్తరాఖండ్ మహా వినాశనం దీనికి మినహాయింపు కాదు.

ఎప్పటి లాగానే ఇప్పుడు కూడా సాధారణ ప్రజలే దీనికి బలయ్యారు. అదే విధంగా, ఎలాంటి దయా దాక్షిణ్యాలు లేని దళారీ పెట్టుబడిదారులే పునర్నిర్మాణం పేరుతోనూ, పునరావాస

నిధుల్ని సమకూర్చే పేరుతోనూ డబ్బు సంచుల్ని నింపుకోవడం జరుగుతుంది. భుజ్ భూకంపం, సునామీల కాలంలో జరిగినట్లుగానే అవినీతి అంచనాలకు అందనంత స్థాయికి చేరుకుంటుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్దయెత్తున ఢంకా భజాయిస్తున్న సహాయ-రక్షణ చర్యలు ఏ మూలకూ సరిపోవు. భారత సైన్యం, వైమానిక దళాల (ఎయిర్ ఫోర్స్) వనరుల్ని పెద్దయెత్తున పూర్తిగా 'ప్రజలపై యుద్ధం' కోసం మోహరించడం కాక, ఇటువంటి విపత్తుల కాలంలో ప్రజలను తక్షణం రక్షించేందుకు వినియోగించడం సరిగ్గా ఉండదా? భారత ప్రభుత్వ రాజ్య సైనిక యంత్రాంగమంతా ప్రజల చెమట, నెత్తుర్లతోనే నిర్మాణమైంది గనుక, వాటి వినియోగం సరిగ్గా ఉండాలంటే వాటిని ప్రజల అణచివేత కోసం కాక వారి సంక్షేమం కోసం వినియోగించాలి.

ఉత్తరాఖండ్ ప్రజలకు ఉజ్వలమైన పోరాటాల చరిత్ర ఉంది. వారు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక, సామ్రాజ్యవాద అనుకూల జీవావరణ విధానాలకు వ్యతిరేకంగా అనేక పోరాటాలు చేశారు. తెహ్రీ ఆనకట్ట నిర్మాణానికి వ్యతిరేకంగా సాగిన సుదీర్ఘ కాలం జరిగిన పోరాటం, అడవుల నరికివేతకు వ్యతిరేకంగా చిప్కో ఉద్యమం అందులో సుపరిచితమైనవి. సంస్కరణవాద నాయకత్వం ఫలితంగా ఆ ఉద్యమాలు పూర్తిగా విజయవంతం కాకపోయినప్పటికీ, దురాశాపూరిత పెట్టుబడిదారులు విచక్షణారహితంగా తమ జీవావరణాన్ని విధ్వంసం చేయడానికి వ్యతిరేకంగా ప్రజలు ఇప్పటికీ పోరాడుతూనే ఉన్నారు. ఉత్తరాఖండ్‌లోని ప్రజలు నిర్మాణాలు చేసేటప్పుడు, అన్ని రకాల ఉత్పాదక, ఆధ్యాత్మక కార్యకలాపాలలోనూ అనాదిగా తమ విజ్ఞతను తెలివిగా వినియోగిస్తూ ప్రాకృతిక విపత్తుల మధ్యనే జీవిస్తూ ఉన్నారు. అడవులు పరిరక్షించబడ్డాయి, పునరుత్పత్తి చేయబడ్డాయి. నదులు కాలుష్యం పాలు కాకుండా ఉండినాయి. తాము ప్రకృతి సంతానమని భావించే ప్రజలకు, ప్రకృతికి మధ్య అక్కడ సయోధ్య ఉండింది.

ఉత్తరాఖండ్ మహా వినాశనం పైన ఉదహరించిన వాటికి సంబంధించిన అనేక సమస్యలను స్పష్టంగా ముందుకు తెచ్చింది. మనం ఈ వినాశకర పరిస్థితిని సరిదిద్దాలంటే, ఆ సమస్యల పట్ల మనం గంభీరంగా ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైంది. లేనిపక్షంలో, పాలకవర్గాల కాలం చెల్లిన  విధానాల వల్ల, వికృత అభివృద్ధి నమూనా వల్ల దేశంలోని అనేక ఇతర ప్రాంతాల్లో సంభవించనున్న అనేక 'ఉత్తరాఖండ్'లను మనం నివారించలేం. ప్రకృతి విలయతాండవం చేసిన తర్వాత 'వినాశనం నుంచి రక్షణ-సహాయ కార్యక్రమాలు' (డిసాస్టర్ మేనేజ్‌మెంట్) చేపట్టడం కాదు, ప్రకృతి నియమాల గురించి మనకున్న జ్ఞానాన్ని వినియోగించడం అవసరం. వినాశనాన్ని నివారించడం లేదా నష్టాలను, ప్రత్యేకించి వీలైనంత వరకూ ప్రాణ నష్టాన్ని తగ్గించడం అవసరం. మొదటి అడుగుగా, ఇలాంటి మహా వినాశనాలు పూర్తిగా ప్రకృతిపరమైనవి కావని, అవి చాలా వరకూ మానవ నిర్మితమని గుర్తించాలి. ఈ 'అభివృద్ధి నమూనా' వర్తమానంలో వినాశకరమైనదే కాక, భవిష్యత్తులో కూడా దీర్ఘకాల దుష్ప్రభావాలను

కలిగిస్తుంది. ఈ ప్రజా వ్యతిరేక ఆర్థిక, జీవావరణ విధానాలు భవిష్యత్తు తరాలకు అత్యంత ప్రమాదకరంగా పరిణమిస్తాయి.

మన దేశంలోని అర్ధవలస, అర్ధభూస్వామ్య వ్యవస్థ సామ్రాజ్యవాదానికి తోకగా ఉన్నది. ఇది ఉత్పత్తి శక్తులను, అందులో అత్యంత ముఖ్యమైన అంశంగా ఉన్న శ్రామిక ప్రజలను నాశనం చేయడమే కాక మన జీవావరణాన్ని కూడా ధ్వంసం చేస్తున్నది. లాభాలను దండుకోవడం తప్ప మరో యావలేని దళారీ పాలకవర్గాలు సామ్రాజ్యవాదులకు అంటకాగినంత వరకూ వినాశకర ఆర్థిక, పర్యావరణ విధానాలను అనుసరించినంత వరకూ ఇలాంటి ప్రకృతి విపత్తులు పదే పదే సంభవిస్తూనే ఉంటాయి. సి.పి.ఐ (మావోయిస్టు) కేంద్రకమిటీ, మనల్ని, మన జీవావరణాన్ని, మన భావితరాల భవిష్యత్తును సైతం నాశనం గావించే ఈ 'అభివృద్ధి నమూనా'ను తిరస్కరించాల్సిందిగా, దీనికి వ్యతిరేకంగా పోరాడి దానిని పూర్తిగా తిప్పికొట్టాల్సిందిగా ప్రజలకు పిలుపు నిస్తోంది. ఉత్తరాఖండ్ ప్రజలు ఇంతటి మహా విపత్తును ఎదుర్కొంటూనే బాధితులైన తమ తోటి ప్రజలకు ధైర్యంగా సహాయపడుతూ, దయా దాక్షిణ్యాలను ప్రదర్శించారు. వారికి మా కేంద్రకమిటీ (సిసి) ధన్యవాదాలు తెలుపుతోంది. అలాగే, వివిధ రాష్ట్రాల, వివిధ దేశాల ప్రజలు తీవ్రమైన ఆటంకాలను, అడ్డంకులను ఎదుర్కొంటూనే సహాయ, రక్షణ చర్యలలో పాల్గొన్నారు. వారికి సైతం మా సిసి ధన్యవాదాలు తెలుపుతోంది. సహాయ-పునరావాస నిధులు తమ చేతుల్లోనే ఉండాలనీ, అవినీతి ప్రభుత్వాలు, ఎన్‌జిఓల చేతుల్లో కాదనీ, నిధులను పారదర్శకంగా వినియోగించాలనీ, ప్రజలకు జవాబుదారీగా ఉండాలని డిమాండ్ చేయాలనీ ప్రజలకు మేం విజ్ఞప్తి చేస్తున్నాం. అదే సమయంలో, ఉత్తరాఖండ్ ప్రజలు తమ జీవావరణాన్ని కాపాడుకోవడానికి తాము గతం కొనసాగిస్తూ వచ్చిన ఉజ్వలమైన పోరాటాలను మళ్లీ కొనసాగించాల్సిందిగా, వాటిని ఉన్నతస్థాయికి తీసుకెళ్లాల్సిందిగా వారికి మేం విజ్ఞప్తి చేస్తున్నాం. మా పార్టీ మీ దుఃఖంలోనూ, మీ పోరాటాలలోనూ భుజం భుజం కలుపుతూ మీ పక్షానే దృఢంగా నిలబడుతుంది.

ఒక్క నూతన ప్రజాస్వామిక వ్యవస్థ మాత్రమే ప్రజా అనుకూల, వాతావరణ అనుకూల, పర్యావరణ విధానాలను ఒక వ్యూహాత్మక దృష్టితో, ప్రజల సాంప్రదాయక విజ్ఞానంలోనూ, ఆధునిక సైన్సులోనూ ఉన్న ప్రగతిశీల అంశాలను సమ్మిళితం చేసి పూర్తిగా వినియోగిస్తుందనీ మా కేంద్రకమిటీ పునరుద్ఘాటిస్తోంది. దురాశాపూరిత సామ్రాజ్యవాదులు, దళారీ పాలకవర్గాల సంకెళ్ల నుంచి 'సైన్సు'ను అది విముక్తి చేస్తుంది. ఈ భూతలం నుంచి సామ్రాజ్యవాదాన్ని తుడిచిపెట్టకుండా మన భవిష్యత్తు తరాల కోసం మన సుందర ధరిత్రిని మనం కాపాడడం సాధ్యం కాదు. ఈ వినాశకరమైన వ్యవస్థలో మాత్రమే 'సహజమైనవి' అయిన ఈ మానవ నిర్మిత విపత్తులు మరిన్ని సంభవించకుండా నివారించేందుకై సామ్రాజ్యవాదులకూ, మన

దేశంలోని దళారీ పాలకులకూ వ్యతిరేకంగా మనమంతా భుజం భుజం కలిపి పోరాడుదాం. ప్రకృతి వినాశనాలు సంభవించినా, ఇలాంటి మానవ నిర్మిత విధ్వంసాలకు మాత్రం ఎలాంటి తావులేని, విచక్షణారహితంగా దోపిడికి (ప్రజలను, పర్యావరణాన్ని) తావులేని ఒక ప్రపంచాన్ని సృష్టిద్దాం. రాజకీయ అధికారం లాభాల కోసం పాకులాడే సామ్రాజ్యవాదులు, దళారీ బడా బూర్జువా, బడా భూస్వాముల చేతుల్లో కాక ప్రజల చేతిలో ఉండడం ద్వారానే ఇది సాధ్యమవుతుంది.

**అభయ్**

**అధికార ప్రతినిధి**

**కేంద్ర కమిటీ**

**సీపీఐ (మావోయిస్టు)**

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# కేంద్ర కమిటీ

**30-6-2013**

## విరసం సీనియర్ సభ్యుడు , ప్రముఖ రచయిత , అనువాదకుడు
## కామ్రేడ్ ఆలూరి భుజంగరావుకు విప్లవ జోహార్లు!

విరసం సీనియర్ సభ్యుడు, ప్రముఖ రచయిత, అనువాదకుడు కామ్రేడ్ ఆలూరి భుజంగరావు 20-06-2013న కన్ను మూశారు. ఆయన వయస్సు 84 సంవత్సరాలు. మా పార్టీ సిపిఐ (మావోయిస్టు) కేంద్రకమిటీ ఆయనకు తలవంచి విప్లవ జోహార్లు అర్పిస్తోంది. ఆయన సహచరి లలిత గారికి, కూతుర్లకు, బంధుమిత్రులకు ప్రగాఢ సంతాపం తెలుపుతోంది. వారి దుఃఖంలో, శోకంలో సంపూర్ణంగా పాలు పంచుకుంటోంది.

కామ్రేడ్ భుజంగరావు 1928లో గుంటూరు జిల్లా పొన్నూరు దగ్గర కొండముది గ్రామంలో పుట్టారు. ఆయన తల్లి సీతారామమ్మ, తండ్రి వెంకటప్పయ్య. ముగ్గురు పిల్లల్లో ఆయన చిన్నవాడు. చిన్ననాటే తండ్రి చనిపోగా కడు పేదరికంతో తల్లి కుటుంబంతో సహా తెనాలికి వచ్చింది. అక్కడ ఆయన జీవితం ఒక హోటల్‌లో బాల కార్మికుడిగా ప్రారంభమైంది. అక్కడే ఆయనకు ఆంధ్ర మహాసభతో, పలువురు రచయితలతో పరిచయాలు ఏర్పడ్డాయి. ఆ పరిచయాలతో హోటల్‌లో పనిచేస్తూనే రాత్రిపూట హిందీ పాఠశాలలో విశారద వరకూ చదివారు. కమ్యూనిస్టు నాయకుల హిందీ ఉపన్యాసాలను తెలుగు అనువాదం చేయడంతో ఆయన మంచి అనువాదకుడిగా పలువురి మన్ననల్ని చిన్ననాటే పొందాడు. ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో సాగిన మహత్తర తెలంగాణా సాయుధ పోరాటం వేసిన ప్రభావంతో ఆయన కమ్యూనిస్టు రాజకీయాల వైపు ఆకర్షితుడయ్యారు. సాహిత్యం చదివే అలవాటు తన అమ్మ నుంచే అబ్బడం వల్ల, కుటుంబంలో ప్రజాస్వామిక వాతావరణం ఉండడం వల్ల తొలినాళ్ల నుండే ప్రజాస్వామిక, విప్లవ సాహిత్యాన్ని ఆయన శ్రద్ధగా చదివేవారు. క్రమంగా హిందీ నుంచి తెలుగులోకి పుస్తకాలను అనువాదం చేయడం, స్వయంగా రచనలు చేయడం ఆరంభించారు. బ్రాహ్మణవాద భావజాలాన్ని నిర్ద్వంద్వంగా వ్యతిరేకిస్తూ, తన కుటుంబాన్ని కమ్యూనిస్టు రాజకీయాలకు అనుగుణంగా చైతన్యపరుస్తూ ప్రజాస్వామిక-కమ్యూనిస్టు విలువలతో, కుల మత భావాలకు దూరంగా పిల్లల్ని పెంచారు. ఆయన హిందీ పండిట్‌గా మొదట కర్నూలులో, ఆ తర్వాత కృష్ణా జిల్లా ఉయ్యూరు, గుడివాడలలో పనిచేశారు. టీచర్‌గా ఆయన సహోద్యోగులతోనూ, విద్యార్థులతోనూ ఎంతో ప్రజాస్వామికంగా ఉండేవారు. ఆయనలో

తిరుగుబాటు స్వభావం ఉండేది. ఒక సందర్భంలో స్కూల్ మేనేజ్‌మెంట్ నిరంకుశత్వాన్ని సహించలేక టీచర్ ఉద్యోగానికి రాజీనామా చేశారు. ఆయన కమ్యూనిస్టు ఆదర్శాలను అర్థం చేసుకున్న పిల్లలు ఎదిగి రావడంతో భార్యాభర్తలిరువురు, పిల్లలు చేసే చిన్న చిన్న పనుల ద్వారా కుటుంబం ఆర్థికంగా ఏదో రకంగా నెట్టుకు వచ్చింది.

నక్సల్బరీ, శ్రీకాకుళ పోరాట జ్వాలలు ఆంధ్రప్రదేశ్‌లోని రచయితలను తట్టిలేపగా, తాను కూడా విప్లవ రాజకీయాల పక్షం వహించారు. మొదట్లో తరిమెల నాగిరెడ్డి గ్రూపు పరిచయాల్లోకి వెళ్లినప్పటికీ వారి రాజకీయాలను ఎప్పుడూ ఆమోదించలేదు. వారి నాయకత్వంలోని టీచర్స్ ఫెడరేషన్‌లో చురుగ్గా ఉంటూ తాను వారికి క్లాసులు చెప్పినప్పటికీ, కామ్రేడ్ చారు మజుందార్ నాయకత్వంలోని నక్సల్బరీ పంథాను సమర్థిస్తూ మాట్లాడేవారు. ఒక క్రమంలో వారి రాజకీయాలను విభేదించి వారితో తెగతెంపులు చేసుకున్నారు. విప్లవ రచయితల సంఘం (విరసం)లో సభ్యుడయ్యారు.

జగిత్యాల జైత్రయాత్రతో ఆంధ్రప్రదేశ్ నలుచెరగులా విస్తరించిన సాయుధ రైతాంగ విప్లవోద్యమ జ్వాలలను చూసి కామ్రేడ్ భుజంగరావు మళ్లీ నవ యువకుడిలా ఎంతో ఉత్తేజాన్ని పొందారు. రాడికల్ విద్యార్థి సంఘంతోనూ, పార్టీతోనూ పరిచయాలు ఏర్పడ్డాయి. రాడికల్ సభలకు వక్తగా హాజరయి తనకు గల అపారమైన సారస్వత, రాజకీయ, సైద్ధాంతిక జ్ఞానాన్ని ఉపన్యాసాల్లో ప్రతిభావంతంగా శ్రోతల ముందుంచడం ద్వారా వారి అభిమానాన్ని చూరగొన్నారు. ఆయన సహచరికి కూడా కమ్యూనిస్టు భావాలు ఉండడంతో ఆమె మరింత క్రియాశీలమై విప్లవ కార్యకలాపాల్లో పిల్లల్ని వెంటబెట్టుకుని పాల్గొనేది. ఆయన చేసే రచనలకు తొలి పాఠకురాలిగా, తొలి విమర్శకురాలిగా ఉండేది. ఆయన రాయలేని స్థితిలో చెబుతూ ఉంటే ఆమె రాసేవారు.

విప్లవోద్యమం దండకారణ్యంలోకి, ఉత్తర భారతదేశంలోకి విస్తరిస్తున్న క్రమంలో హిందీ భాషాకోవిదుల అవసరం పార్టీ ముందుకు వచ్చింది. ఆ క్రమంలో దండకారణ్య ఫారెస్టు కమిటీ రాజకీయ పత్రికగా 'ప్రభాత్'ను నడపాలని పార్టీ నిర్ణయించింది. ఆ బాధ్యతలను చేపట్టాల్సిందిగా పార్టీ కామ్రేడ్ భుజంగరావు ముందు ప్రతిపాదన చేసిందే తడవుగా ఎలాంటి శషభిషలకు తావులేకుండా ఆయనతో పాటు ఆయన సహచరి అంగీకరించారు. దండకారణ్య పత్రిక 'ప్రభాత్'ను నడపడం అంటే పూర్తిగా అజ్ఞాతవాసంలోకి వెళ్లాలనేది వారికి తెలుసు. అందుకు వారు మనస్ఫూర్తిగా సిద్ధపడ్డారు. తమ పిల్లలు పార్టీ సానుభూతిపరులుగా మారడానికే కాక, సిద్ధపడిన వారు పూర్తికాలం విప్లవ కార్యకర్తలుగా ఉద్యమంలోకి వెళ్లడానికి సంపూర్ణంగా ప్రోత్సహించారు, తోడ్పడ్డారు. మొదట పత్రికను పట్టణాల కేంద్రంగానే నడపడం వల్ల వారి డెన్ సహజంగానే ఫారెస్టు కమిటీ రహస్య కార్యకలాపాలకు కొంతవరకు కేంద్రంగా ఉండేది. తాను ఆ బాధ్యతలు నిర్వహించిన కాలంలో అత్యంత రహస్యంగా ఉంటూ శత్రువుకు బహిర్గతం

కాకుండా పనిచేశారు. డెన్ అవసరాలకు పార్టీ ఇచ్చిన ప్రతి పైసాను పొదుపుగా ఖర్చు చేయడంలో అందరికీ ఆదర్శంగా ఉండేవారు. అలా ఆయన అజ్ఞాతంలో ఉంటూ ప్రభాత్ పత్రికను 1988 చివరి నుండి 93 వరకు 6 సంవత్సరాల పాటు నిర్వహించడంలో ప్రముఖ పాత్ర వహించారు. ఈ కాలంలో ఆయన సహచరి తోడ్పాటు మరవలేనిది. వృద్ధాప్యం, అనారోగ్యం కారణంగా బహిరంగ కార్యకలాపాలలో తన విప్లవ కృషిని సాగించాల్సిందిగా పార్టీ ఆయన ముందు ప్రతిపాదించినపుడు, విప్లవ స్ఫూర్తితో ఎన్ని ఇబ్బందులనైనా అధిగమించేందుకు సంసిద్ధతను వ్యక్తం చేస్తూ మొదట అంగీకరించకపోయినా, దీర్ఘకాలిక దృష్టితో పార్టీ నిర్ణయాన్ని అర్థం చేసుకొని చివరి వరకూ అదే విధంగా తన కృషిని సాగించారు.

దండకారణ్యంలో గెరిల్లా దళాలతో చాలా ఆప్యాయంగా, సన్నిహితంగా ఉండేవారు. విప్లవోద్యమంలో వారి అనుభవాలను, అభిప్రాయాలను పత్రికలో ప్రతిబింబింపజేసేవారు. ఫీల్డ్‌లో తిరిగిన మేరకు ఉద్యమాన్ని అర్థం చేసుకునేందుకు ప్రయత్నిస్తూ ఉద్యమంతో మమేకమయ్యారు. 2000 డిసెంబర్ 2న ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం (పిఎల్‌జిఏ) ఏర్పాటును, 2004లో రెండు ప్రధాన విప్లవ స్రవంతులు ఐక్యమై సిపిఐ (మావోయిస్టు)గా ఏర్పడడాన్ని ఆయన అభినందించారు, ఎంతగానో ఉత్సాహం చెందారు.

ఇలా సరియైన విప్లవ పార్టీ నాయకత్వంలో విప్లవ పంథాను చేపట్టిన తర్వాత ఆయన ఏనాడూ మళ్లీ వెనుదిరిగి చూడలేదు. తన కుటుంబాన్ని, జీవితాన్ని పూర్తిగా విప్లవానికి అంకితం చేశారు. తుదిశ్వాస వరకూ ఆయన విప్లవాన్ని ప్రేమించారు. విప్లవ విజయం కోసం కలలు గంటూ రచయితగా, అనువాదకుడిగా అవిశ్రాంతంగా విశేషమయిన కృషి చేశారు. విప్లవ రచయితల సంఘంలో చివరి వరకూ కొనసాగారు. స్థానిక పార్టీ కార్యకర్తలకు సన్నిహితంగా మెలుగుతూ అవసరమైన సహాయ, సహకారాలు అందించేవారు. ఆయనకు పార్టీ పట్ల, పార్టీ పంథా పట్ల అపార విశ్వాసం ఉండేది. పార్టీలో తలెత్తిన అవకాశవాద ధోరణులను వ్యతిరేకించారు. ఉద్యమం ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొన్నప్పటికీ దృఢంగా నిలిచారు. ఈ పార్టీ నాయకత్వంలో ఈ దేశంలో తప్పక విప్లవ విజయవంతమవుతుందనే దృఢమైన విశ్వాసం ఎల్లప్పుడూ ఆయనలో ఉండేది. అందువల్లనే పార్టీలో వచ్చిన రెండు అంతర్గత సంక్షోభాల సమయంలోనూ ఆయన పార్టీతోనూ ఉన్నారు. పిఎల్‌జిఏ ఉచ్ఛస్థాయి ఫార్మేషన్లు ఏర్పడి గెరిల్లా యుద్ధాన్ని తీవ్రతరం చేస్తూ పురోగమిస్తున్న నేపథ్యంలో మళ్లీ దండకారణ్యం వచ్చి తన కన్నులారా పిఎల్‌జిఏ బలగాలను చూడాలనే ఆయన కోరిక తీరకుండానే మిగిలిపోయింది.

రాహుల్ సాంకృత్యాయన్, ప్రేమ్‌చంద్, టాల్‌స్టాయ్, శ్రీశ్రీ, వేమన మొదలైన ప్రముఖ రచయితల ప్రభావం ఆయనపై బలంగా ఉండేది. పారదర్శి, పెద్దన్న, చక్రధర్, జనార్ధన్ కలం పేర్లతో రచనలు చేసారు. ఉద్యమంలోని పరిణామాలను, అనుభవాలను కథలుగా రాశారు.

అలా 20కి పైగా కథలు రాసారు. ఆయన కథలు “అరణ్య పర్వం” పేరిట కథా సంకలనంగా వచ్చాయి. కొండవాగు, ప్రజలు అజేయులు, నైనా, గమనాగమనం, గమ్యం దిశగా గమనం, దిక్కుమొక్కులేని జనం తదితర నవలలు రాసారు. ‘సాహిత్య బాటసారి శారద’ పేర ప్రగతిశీల రచయిత శారద జీవిత చరిత్రను రాశారు. రాహుల్ సాంకృత్యాయన్ రచనలు – విస్మృత యాత్రికుడు, భారతీయ దర్శనం, ప్రాక్పశ్చిమ దర్శనాలు, దర్శన్–దిగ్‌దర్శన్, జయయౌధేయ, దివోదాసు, శాస్త్రీయ గతితార్కిక భౌతికవాదం, ప్రేమ్‌చంద్ రచనలు – రంగ భూమి, గబన్, కిషన్ చందర్ రచనలు – వాయుగుండం, పరాజయం, సరోజ్ దత్తా వ్యాసాలు, హెచ్.ఎస్.ఆర్.ఏ. చరిత్రను నమోదు చేసిన యశ్‌పాల్ రచన ‘సింహావలోకనం’ను హిందీ నుంచి తెలుగులోకి అనువదించారు. రాగో, అతడు, నేలతల్లి విముక్తి కోసం, బొగ్గు పొరల్లో, దండకారణ్య అమరవీరుల జీవిత చరిత్రలు తదితర విప్లవ సాహిత్యాన్ని తెలుగు నుంచి హిందీలోకి అనువదించారు.

కామ్రేడ్ భుజంగరావు కమ్యూనిస్టు ఆదర్శాలతో కూడిన నిరాడంబర జీవన విధానం, భేషజాలకు దూరంగా ఉండడం, పార్టీ పట్ల, పార్టీ పంథా పట్ల, విప్లవ విజయం పట్ల దృఢమైన విశ్వాసం, నిరంతర పరిశ్రమ, ప్రజల పట్ల అపారమైన ప్రేమ, దోపిడి సమాజం పట్ల అంతులేని కసి మొదలైన లక్షణాలు విప్లవ కమ్యూనిస్టులకు, నేటి యువతరానికి, ప్రజాస్వామిక, విప్లవ మేధావి వర్గానికి ఆదర్శం. తాను పూర్తి కాలం విప్లవకారుడిగా రహస్యంగా పనిచేసిన కాలంలోనూ, వృద్ధాప్యం, అనారోగ్యం కారణంగా శారీరక పరిమితులు ఏర్పడ్డాక బహిరంగంగా పనిచేసిన కాలంలోనూ చివరి ఊపిరి వరకూ మార్క్సిజం–లెనినిజం–మావోయిజం సిద్ధాంతానికి అంటిపెట్టుకొని ఉంటూ, తన రంగంలో తన శక్తియుక్తులను నమ్మిన సిద్ధాంతం కోసం అర్పించడం ఆయన నుండి నేటి తరాలు తప్పక నేర్చుకోవాల్సి అంశం. ప్రజాయుద్ధ పురోగమనంలో విప్లవ భావ ప్రచారానికి ఉన్న ప్రాధాన్యతను రీత్యా ఆయన ఈ రంగానికి అందించిన సేవలు చిరస్మరణీయం.

మా పార్టీ సిపిఐ (మావోయిస్టు) కామ్రేడ్ భుజంగరావు ఆదర్శాలను ఎత్తిపడుతోంది. ఆయన కన్నకలల్ని సాకారం చేసేందుకు అవిశ్రాంతంగా పోరాడుతానని శపథం చేస్తోంది. ఆయన ఆదర్శాలను, విలువలను ఎత్తిపడుతూ ప్రజలలో ప్రచారం చేస్తుంది.

**అభయ్**

**అధికార ప్రతినిధి**

**కేంద్ర కమిటీ**

**సీపీఐ (మావోయిస్టు)**

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# కేంద్ర కమిటీ

**1-7-2013**

## ఇంటర్నెట్ స్వాతంత్ర్యంపై బిగుస్తున్న అమెరికా సామ్రాజ్యవాదపు పట్టును ఖండించి ఎదిరించండి!

## అన్ని రకాల స్వతంత్రాలకూ సామ్రాజ్యవాదాన్ని కూలదోయడమే మార్గం!

2013 జూన్ నుండి మొదలుకొని ఎడ్వర్డ్ స్నోడెన్ అనే అమెరికా ఐటి నిపుణుడు విడుదల చేసిన అత్యంత రహస్యమైన నేషనల్ సెక్యూరిటీ ఏజెన్సీ (ఎన్ఎస్ఎ) డాక్యుమెంట్లు ప్రపంచంలో ఏ మూలనుండైనా చేసే యెటువంటి ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ నైనా పట్టుకునే శక్తిని కలిగి ఉండే నిఘా కార్యక్రమాల్ని అది నడుపుతోందనే విషయాన్ని బహిర్గతపరిచాయి. అన్ని రకాల ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ లనూ – టెలిఫోన్ కాల్స్, మొబైల్ మెసేజిలు, ఈ–మెయిల్స్, ఆన్‌లైన్ చాట్ లూ, సోషల్ మీడియా వెబ్‌సైట్లలో ఒకరితో ఒకరు పంచుకునే కమ్యూనికేషన్, సమాచారం, ఇంటర్‌నెట్ సర్చి చరిత్ర కమ్యూనికేషన్ లను– అంటే టెలిఫోన్లు, మొబైల్స్, కంప్యూటర్లు మొదలైన కమ్యూనికేషన్ పరికరాల వాడకందారులు ఉత్పత్తి చేసే అన్ని రకాల సమాచారాన్ని ఎన్ఎస్ఎ స్కాన్ చేస్తుంది. అమెరికా తన శత్రువులుగా భావించే దేశాలనూ, సంస్థలనూ, వ్యక్తులనే కాక, దాని 'మిత్రులను' కూడా అంటే మిత్రదేశాలూ, అమెరికా పౌరులనూ కూడా స్కాన్ చేస్తున్నదనే విషయాన్ని ఈ డాక్యుమెంట్లు వెల్లడించాయి. వాస్తవానికి, జర్మన్ ఛాన్స్‌లర్ సహా మరికొన్ని ప్రభుత్వాధినేతలను కూడా అనేక సంవత్సరాలుగా వీరు టెలిఫోన్ నిఘాకు గురి చేశారు. అమెరికా గుత్త పెట్టుబడిదారులూ, రాజ్యాన్ని నడిపే వారి ప్రతినిధులూ అమెరికాను ప్రపంచంలోని నెంబర్ వన్ సామ్రాజ్యవాద శక్తిగా నిలిపి ఉంచడానికీ, దాని ప్రపంచవ్యాప్త ఆర్థిక సామ్రాజ్యాన్ని పరిరక్షించడానికీ ఈ ప్రపంచంలోని ప్రతి ఒక్కదాన్నీ తెలుసుకోవడం, సూక్ష్మంగా పరిశోధించడం అవసరమని భావిస్తారనడానికి ఇది మరో రుజువు. స్నోడెన్ అన్నట్టుగా, "ప్రపంచంలోని ప్రతి ఒక్క సంభాషణనూ, ప్రతి ఒక్క ప్రవర్తననూ తమకు తెలిసేలా చేసుకోవాలని" అమెరికా ఇంటలిజెన్స్ సంస్థలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి.

ప్రజల ప్రజాస్వామిక హక్కులను ప్రజాస్వామ్యం, స్వాతంత్ర్యం మంచుతెరల కింద అణగదొక్కిన అమెరికా ప్రభుత్వంపై తనకు విశ్వాసం సడలిన కారణంగా ఎన్ఎస్ఎ ప్రజల ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ ను రహస్యంగా పరిశీలిస్తున్నదనే విషయాన్ని వారికి తెలియజెప్పాలనుకున్నానని ఎడ్వర్డ్ స్నోడెన్ చెప్పాడు. సామ్రాజ్యవాద యుద్ధ దారుణాల పట్ల వ్యతిరేకత, ప్రజాస్వామిక విలువలూ, పౌరహక్కులు పట్ల అక్కర వంటివి ప్రపంచవ్యాప్తంగా

ప్రజలను పాలకులకు వ్యతిరేకంగా వ్యక్తిగత స్థాయిలో కూడా ఎదిరించి నిలిచేలా చేశాయి. అమెరికా కూడా దీనికి మినహాయింపు కాదు. డేనియల్ ఎల్స్‌బర్గ్ అనే అమెరికా జర్నలిస్టు 1971లో "పెంటగన్ పేపర్స్" ను విడుదల చేశాడు. ఇటీవలే బ్రాడ్లీ మానింగ్ అనే అమెరికా సైనికుడు అమెరికా సామ్రాజ్యవాదం ప్రపంచ ప్రజలపై, ప్రత్యేకించి సోకాల్డ్ 'టెర్రరిజంపై యుద్ధం' పేరుతో ముస్లిం ప్రజానీకంపై అది చేస్తున్న దౌర్జన్యాల అసలు స్వరూపాన్ని బహిర్గతపరిచాడు. అమెరికా సైన్యం విచక్షణారహితంగా ఇరాక్ లో చేసిన హత్యలు, అబూగ్రయిబ్, గ్వాంటనామో బే జైళ్లలో ఖైదీలను పెట్టిన పాశవిక చిత్రహింసల గురించి అతను విడుదల చేసిన రుజువులు ఈ జైళ్లను మూసివేయాలనే, ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్ లనుండి అమెరికా సేనల్ని వెనక్కు పిలవాలనే డిమాండ్లు బలోపేతం కావడానికి దోహదం చేశాయి. ఈ 'నేరానికి' గానూ మానింగ్ కు 35 సంవత్సరాల శిక్ష లభించింది. అసలు నేరస్థులకు శిక్ష పడకపోగా, వాస్తవానికి వారే అతనిపై విచారణ జరిపి తీర్పులిచ్చారు. వికీలీక్స్ వ్యవస్థాపకుడు జూలియన్ అసాంజేను అమెరికా ప్రభుత్వం, దాని యూరోపియన్ మిత్రదేశాలూ వేధిస్తున్న తీరు సుప్రసిద్ధం కనుక ఎక్కువ వివరించనవసరం లేదు.

అయితే యిటువంటి వ్యక్తిగత సాహసాలు అమెరికా సామ్రాజ్యవాదం అనుసరించే పద్ధతుల్లో, తీరులో పెద్ద మార్పులేం తేలేదు. ఇంకా చెప్పాలంటే బహిర్గతం అవుతున్న యిటువంటి విషయాలు దాన్ని మరింత సిగ్గుమాలినదిగా, పొగరుమోతుగా చేశాయి. అయినప్పటికీ, ప్రజల్లో అమెరికా సామ్రాజ్యవాదాన్ని మరింత బహిర్గతపర్చడానికి ఇటువంటి చర్యలు దోహదం చేస్తాయి. విశాల ప్రజల సామ్రాజ్యవాద వ్యతిరేక చైతన్యాన్ని పెంచడంలో పాత్ర వహిస్తాయి. అప్పుడప్పుడు ఇవి 1960, 70 లలో ప్రపంచవ్యాప్త వియత్నాం యుద్ధ వ్యతిరేక మిలిటెంట్ ప్రజాఉద్యమాల్లాంటి వాటికి దారితీయచ్చు. విదేశీ గడ్డల మీద యుద్ధం చేయడం ద్వారా స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యాలను పరిరక్షిస్తున్నానని చెప్పుకునే అమెరికా ప్రభుత్వ గొప్పల్ని గురించి ప్రపంచవ్యాప్తంగా ఒక సెక్షన్ ఉదారవాద, పెటీబూర్జువా మేధావులకున్న భ్రమల్ని పటాపంచలు చేయడంలో ఇవి దోహదం చేస్తాయి. డేనియల్ ఎల్స్‌బర్గ్, బ్రాడ్లీ మానింగ్, ఎడ్వర్డ్ స్నోడెన్ లు అమెరికా సమాజంలోని శ్రామికవర్గాలతో కూడిన ప్రజాస్వామిక, సామ్రాజ్యవాద వ్యతిరేక సెక్షన్ కు చెందుతారు. ఇందులో అమెరికా ప్రభుత్వాన్ని ఎదిరించి నిలిచిన చరిత్ర కలిగిన నల్ల అమెరికన్లు, హిస్పానిక్ (స్పానిష్ భాషీయులు) లు, ఇతర పీడిత మైనారిటీలు ఉన్నారు. ప్రస్తుతం వారు బలహీనంగా, అసంఘటితంగా వున్నప్పటికీ, అమెరికా గుత్త పెట్టుబడిదారీ విధానపు సంక్షోభం మరింత పదునెక్కుతున్న కొద్దీ, దాని దుష్ఫలితాలకు గురవుతున్న అమెరికా ప్రజల ఈ సామ్రాజ్యవాద వ్యతిరేకత భవిష్యత్తులో మరింత ప్రాముఖ్యతను సంతరించుకుంటుంది.

మరోవైపు, అమెరికా యుద్ధాలకు టార్గెట్లుగా కొనసాగుతున్న కోట్లాది ప్రపంచ ప్రజానీకానికి సామ్రాజ్యవాదం ఎన్నెన్ని ఘోరాలు చేయగల ఘనత వహించిందనేది ఒప్పించడానికి ఇటువంటి వెల్లడింపుల అవసరం లేదు. ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్, వాయువ్య పాకిస్తాన్ లోని ప్రజానీకం ప్రిడేటర్ డ్రోన్ ల రూపంలో మరింత దుర్మార్గమైన నిఘాను ఎదుర్కొంటున్నారు. ఇవి ఆకాశం నుండి

వీరిపై నిఘాను ఉంచుతాయి. సుదూర అమెరికాలో కమాండ్ సెంటర్లలో ఒక బటన్ ను నొక్కడం ద్వారా అది ఏ మాత్రం అనుమానం లేకుండా రోజువారీగా తమ పనులు చేసుకుంటున్న ప్రజల జీవితాల్ని తరచుగా ఆర్పేస్తున్నాయి. వారు నిరంతరం మృత్యునీడలో జీవిస్తుంటారు. తమ చేదు అనుభవాల ద్వారా సామ్రాజ్యవాదం అనేది ప్రజాస్వామ్యానికీ, స్వాతంత్ర్యానికీ పొసగనిది అనీ, అవి రెండూ ఒకే దగ్గర మనుగడ సాగించలేవనీ వారికి తెలుసు.

స్వదేశంలోనూ, విదేశీ గడ్డల మీదా తన ఆధిపత్యాన్ని నిలుపుకోవడానికి సామ్రాజ్యవాదం అనుసరించే పద్ధతుల్లో తేడాలుండచ్చు. ఇవి బహిరంగ యుద్ధం నుండి మొదలుకొని కోవర్టు ఆపరేషన్లు, రహస్య నిఘాల వరకు వుండచ్చు. అయినప్పటికీ, సామ్రాజ్యవాద వ్యక్తీకరణల్లో తేడాలూ, దాని వివిధ రూపాలూ దాని సారభూతమైన లక్షణాలను ఏమాత్రం మార్చలేవు. అవి ఒకే వస్తువులోని విభిన్నమైన కానీ సారభూతమైన లక్షణాలను సూచిస్తాయి. పెద్దెత్తున సమాచారాన్ని సేకరించడం అనేది గుత్తపెట్టుబడికున్న విడదీయరాని లక్షణం అనీ, అది దాని ఆధిపత్యపు అనివార్యపు ఫలితం అనీ గత శతాబ్దన్నర సామ్రాజ్యవాద అభివృద్ధి చరిత్ర రుజువు చేసింది. గుత్తపెట్టుబడి కేంద్రీకరణ, సాంద్రీకరణ, గుత్తసంస్థలపై అత్యధికంగా ఉన్న అదుపూ వ్యాపక నిఘాకు పరిస్థితుల్ని తయారు చేస్తాయి.

ఎన్ఎస్ఎతో, ఇతర ఇంటలిజెన్స్ ఏజెన్సీలతో కూడా కుమ్మక్కయిన బ్రహ్మాండమైన ఇంటర్నెట్, టెలిఫోన్ కంపెనీల విశ్వాసపాత్రత నేడు ప్రశ్నార్థకమైంది. ఎందుకంటే లక్షలాది ప్రజల కమ్యూనికేషన్స్ ను రహస్యంగా ఉంచడాన్ని ఉల్లంఘించడం ద్వారా అవి వారి విశ్వాసాన్ని తుంచేశాయి అనేది యిప్పుడు తెలిసిపోయింది. ప్రజాగ్రహ వెల్లువతో ఇటువంటి నిఘా కార్యక్రమాల్లో తాము కుమ్మక్కయ్యామనే విషయాన్ని ఈ కంపెనీలు ఖండించక తప్పలేదు. తమకు అసలు ఆ విషయమే తెలీదు అని బొంకారు కూడా. అమెరికా ప్రభుత్వమూ, కార్పరేషన్లూ కూడా ఈ కుమ్మక్కును ప్రజల నుండి దాచాలనుకున్నాయనేది తేటతెల్లమే. ఎందుకంటే వాడకందార్ల సమాచార అనుల్లంఘనీయతకూ, ప్రైవసీకీ తాము హామీగా నిలవాలన్న విషయం ఆ కంపెనీలకు తెలుసు, అలాగే వ్యక్తిగత స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు హామీగా నిలిచే తమ రాజ్యాంగానికి ఇది వుల్లంఘనే అనే విషయం ప్రభుత్వానికీ తెలుసు. ఇప్పుడు మరోసారి రుజువైనట్టే ఈ సూత్రాలను ఈ కార్పొరేషన్లూ, రాజ్యమూ నీటిపై రాతలుగా మార్చేశాయి.

లక్షలాది ఇంటర్నెట్ వాడకందార్ల వ్యక్తిగత సమాచారాన్ని అదుపు చేయడం ద్వారా ఈ కంపెనీలు ఇంటర్నెట్ లోని స్థలాన్ని తమ మధ్య దాదాపుగా పంపకం చేసేసుకున్నాయి. కంప్యూటర్ ప్రపంచాన్ని ఈ గుత్త కంపెనీలు తమ మధ్య పంచుకోవడం అనేది సామ్రాజ్యవాద యుగంలో వాస్తవ ప్రపంచాన్ని గుత్తసంస్థలు పంచుకోవడం అనే పెట్టుబడిదారీ వ్యవస్థ స్వాభావిక లక్షణానికి ఒక వ్యక్తీకరణ. ప్రపంచంలోని అత్యధిక శాతం ఈ–మెయిల్ రవాణాపై గూగుల్, యాహూలకు గుత్తాధిపత్యం వుండగా, ఫేస్‌బుక్ సోషల్ నెట్‌వర్కింగ్ పైనా, ట్విట్టర్ మైక్రోబ్లాగింగ్ పైనా గుత్తాధిపత్యానికి మారుపేర్లయ్యాయి. యూట్యూబ్ ను కలుపుకోవడం ద్వారా గూగుల్ ప్రపంచంలోని అతి పెద్ద డిటిటల్ విడియో భాండాగారానికి యజమానిగా మారింది. గూగుల్

బుక్స్ ద్వారా దాని వద్ద అతి పెద్ద ఈ-బుక్ ల భాండాగారం ఉన్నది. అన్ని ప్రముఖ అమెరికా కంపెనీలూ ఈ దారినే అనుసరించాయి.

తాను చేసింది తప్పో, చట్టవిరుద్ధమో కాదనీ, అమెరికా ప్రభుత్వానికీ, దాని పౌరులకూ ముప్పుగా పరిణమించిన 'టెర్రరిజం' ఇటువంటి వ్యాపకమైన నిఘా కార్యక్రమాలను తగినంత న్యాయసమ్మతం చేస్తుందనీ వాదిస్తూ అమెరికా ప్రభుత్వమూ, ఎన్ఎస్ఎ లు తమ నిఘా యంత్రాంగాన్ని సమర్థించుకున్నాయి. మరోవైపు ఎడ్వర్డ్ స్నోడెన్ ను ప్రభుత్వ రహస్యాలను వెల్లడించి, శత్రువులకు ఉపయోగపడిన దేశద్రోహిగా పేర్కొంటూ అతన్ని వెంటాడి వేధించే ప్రయత్నాలు చేశారు. అమెరికా 'జాతీయ ప్రయోజనాల'కు హాని చేశాడనీ, విదేశాల్లోని తమ సాయుధ బలగాలు టెర్రరిస్టు దాడులకు గురి అయ్యే ముప్పును కలిగించాడనీ అతనిపై ఆరోపణలు చేశారు. 'ఇస్లామిక్ టెర్రరిజం'పై తమ పోరాటం మీదా, ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్ వంటి దేశాల్లో 'ప్రజాస్వామ్యాన్ని' ప్రవేశపెట్టే తమ ప్రయత్నాల మీదా ఈ వెల్లడింపులు ప్రతికూల ప్రభావాన్ని వేస్తాయి అని కూడా వారు వాదించారు. గూఢచారి చట్టం వంటి అనేక అమెరికా చట్టాలను అతను వుల్లంఘించాడన్నారు. యిందుకు అతనికి జీవితఖైదు సహా అనేక శిక్షలు పడే అవకాశం వుంది. నిజానికి ఎన్ఎస్ఎ, అమెరికా ప్రభుత్వాలే తమ గూఢచారి కార్యక్రమాల ద్వారా అనేక అమెరికా, అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించిన నేరస్థులు కాగా స్నోడెన్ పై విచారణ చేపట్టడానికి గానూ అతన్ని తమకు అప్పగించాలని వారు కోరడం హాస్యాస్పదం. స్నోడెన్ కు కఠినాతి కఠినమైన శిక్షలు వేయాలని కోరడంలో డెమాక్రటిక్, రిపబ్లికన్ పార్టీలు అసాధారణమైన భావసమైక్యతను ప్రదర్శించాయి.

ఈ వెల్లడింపుల నేపథ్యంలో, ఫ్రాన్స్, జర్మనీ, స్పెయిన్, అనేక ఇతర దేశాలూ అమెరికా దూతలను తమ దేశాలకు పిలిపించి లాంఛనప్రాయంగా తమ వ్యతిరేకతను నమోదు చేశాయి. యూరోపు దౌత్యవేత్తలు వైట్‌హౌస్ ను 'వివరణ' కోరడానికి విమానాల్లో హడావుడిగా వాషింగ్టన్ చేరారు. బరాక్ ఒబామా చాలామంది రాజకీయ నాయకులతో, ప్రత్యేకించి యూరోపు నాయకులతో వారి 'అప్రసన్నత'ను దూరం చేయడానికి మాట్లాడాడు. ఇంతటి అవమానకరమైన విషయం వెల్లడయ్యాక కూడా యూరోపు రాజకీయవేత్తలు ఇటువంటి నిఘా 'ఆమోదయోగ్యం కాదు' అని మాత్రం పేర్కొని అమెరికాకు తమ నామమాత్రమైన, పసలేని 'వ్యతిరేకత'ను మాత్రం తెలియజేసి ఊరుకున్నారు. అమెరికాకు వ్యతిరేకంగా వ్యక్తం చేసిన ఈ ప్రభుత్వ 'నిరసనలు' లాంఛనప్రాయంగా నిలిచి, యూరోపు నేతల పరువు కాపాడ్డానికి మాత్రమే పని చేశాయి. అయితే కొన్ని లాటిన్ అమెరికా దేశాలు స్నోడెన్ కోరిన రాజకీయ ప్రవాసం పట్ల సానుకూలంగా స్పందించగా, అమెరికా అతన్ని అప్పగించాలని చేసిన డిమాండ్లను పట్టించుకోకుండా రష్యా తాత్కాలికంగా ఒక ఏడాదిపాటు అతనికి ప్రవాసం మంజూరు చేసింది. బ్రాడ్లీ మానింగ్, జూలియన్ అసాంజేల వలే విచారణను ఎదుర్కోవలసి వస్తుంది కనుక తాను తన దేశానికి తిరిగి వెళ్లే సమస్యే లేదని స్నోడెన్ స్పష్టపరిచాడు.

ఆయా దేశాల ప్రభుత్వాలు వ్యక్తం చేసిన బలహీనమైన నిరసనలతో పోలిస్తే అమెరికా

నిఘాను నిరసిస్తూ ప్రపంచవ్యాప్తంగా ప్రజల నుండి వ్యక్తమైన బలమైన వ్యతిరేకత కొట్టొచ్చినట్టుగా కనిపిస్తుంది. అమెరికాలోనూ, ఇతర దేశాల్లోనూ ఎన్ఎస్ఎ, అమెరికా ప్రభుత్వాలకు వ్యతిరేకంగా కొన్ని నిరసనలు జరుగగా, ఎలక్ట్రానిక్ నిఘా ద్వారా ప్రజల జీవితాల్లో పెరుగుతున్న రాజ్యం జోక్యందారీతనాన్ని ప్రశ్నిస్తూ వాదోపవాదాలకు ఇది దారి తీసింది. అలాగే, స్నోడెన్ వెల్లడింపులు వచ్చిన కొద్దినెలల్లోనే 15 లక్షల ఫేస్‌బుక్ అకౌంట్లను మూసేయడం ద్వారా ఇంటర్నెట్ వాడకందార్లు తమ నిరసనను వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరినీ 'టెర్రరిస్టు అనుమానితుడిగా' మార్చేసే ఈ అమెరికా ప్రభుత్వ సర్వవ్యాపకమైన నిఘాకు వ్యతిరేకంగా తమ నిరసనను అమెరికా ప్రజలు వివిధ రూపాల్లో వ్యక్తం చేశారు. అత్యధిక అమెరికా ప్రజలు స్నోడెన్ దీన్ని వెల్లడించడాన్ని సమర్థిస్తున్నారనీ, అమెరికా ప్రభుత్వం అతని వెంటపడి వేధించడాన్ని వ్యతిరేకిస్తున్నారనీ ఒపీనియన్ పోల్స్ సూచించాయి. ఎన్ఎస్ఎ నిఘా రాజ్యాంగవ్యతిరేకమైనదనీ, చట్టవిరుద్ధమనీ, దేశ వ్యవస్థాపక సూత్రాల ఉల్లంఘన అనే భావన విస్తృతంగా వెల్లడైంది. ఎందుకంటే 'హేతురహిత సోదా'కు వ్యతిరేకంగా నాలుగవ సవరణ సహా అమెరికా రాజ్యాంగం తన పౌరులకు హామినిచ్చిన స్వాతంత్ర్యాలనూ, పౌరహక్కులనూ ఇది వుల్లంఘిస్తుంది. కొందరు ఇటువంటి స్వభావం గల ప్రభుత్వ నిఘా అమెరికా రాజ్య వ్యవస్థాపక సూత్రాలైన ప్రజాస్వామ్యం, స్వాతంత్ర్యం, వ్యక్తిగత స్వేచ్ఛ లకు ముప్పుగా పరిణమిస్తాయని సూచిస్తూ దీన్ని వ్యతిరేకించారు.

ఎన్ఎస్ఎ వ్యాపక నిఘా కార్యక్రమాలు దగ్గరగా పరిశీలించే దేశాల్లో భారతదేశం కూడా వుందనే విషయాన్ని కూడా స్నోడెన్ వెల్లడించాడు. అమెరికా సామ్రాజ్యవాదానికి మన దేశం ఆర్థిక, భౌగోళిక-వ్యూహాత్మక ప్రాధాన్యతను కలిగి ఉన్న రీత్యా ఇదేం ఆశ్చర్యకరం కాదు. భారత ప్రజలపై ఎన్ఎస్ఎ కొనసాగించిన ఈ చట్టవిరుద్ధమైన, అక్రమ, నిరంకుశ వ్యాపక నిఘా దేశ సార్వభౌమత్వాన్నీ, స్వాతంత్ర్యాన్నీ నిస్సందేహంగా అవమానించడమే. వాస్తవానికి, వ్యాపక నిఘాకూ, సైబర్ గూఢచారిత్వానికీ గురి చేసిన దేశాలన్నిటి సార్వభౌమత్వం, స్వాతంత్ర్యాలనూ కూడా అమెరికా దెబ్బతీసింది. ఐరాస ప్రకటనలనూ, సంప్రదాయాలనూ, దేశాల మధ్యా, జాతుల మధ్యా సమానత్వం, గౌరవం, ప్రజాస్వామిక ప్రవర్తనలను వాగ్దానం చేసే అంతర్జాతీయ ప్రవర్తనా నియమావళులను అది వెక్కిరించింది. దేశాల మధ్యా, జాతుల మధ్యా సమానత్వ సూత్రంపై ఆధారపడి స్థాపితమైన అంతర్జాతీయ చట్టాలనూ, నిబంధనలనూ అది వుల్లంఘించింది. అమెరికా తన దేశ చట్టాలనూ, తాను ఎలక్ట్రానిక్ నిఘా వేసిన దేశాల చట్టాలనూ కూడా ఉల్లంఘించింది.

అయితే భారత ప్రభుత్వం తమ సార్వభౌమత్వాన్ని ఇంత నగ్నంగా ఉల్లంఘించినందుకూ, ఆ క్రమంలో జరిగిన అంతర్జాతీయ చట్టాల ఉల్లంఘనలకూ వ్యతిరేకంగా సరిగ్గా యిలాంటి ఇంటలిజెన్స్ నిఘానే ఎదుర్కొన్న యూరోపు ప్రభుత్వాల మందం కూడా నామమాత్రమైన నిరసనను వ్యక్తం చేయలేదు. అమెరికా సామ్రాజ్యవాదానికి భారత పాలకులు ఎంతగా దాసోహమయ్యారో ఇది సూచిస్తుంది. దేశానికి నిజమైన స్వాతంత్ర్యం ఇంకా రాలేదనడానికి ఇది మరో రుజువు. అమెరికా సామ్రాజ్యవాద నయాఉదారవాద విధానాలతో, 'టెర్రరిజంపై

యుద్ధం' ముసుగులో అది చేస్తున్న సామ్రాజ్యవాద దురాక్రమణ యుద్ధాలతో దృఢంగా పెనవేసుకున్న భూస్వామ్య, దళారీ భారత పాలకవర్గాలకు ప్రజలను అదుపు చేసి అణగదొక్కే ఇటువంటి నిరంకుశ యంత్రాంగాల పట్ల వ్యతిరేకతేం లేదు. తమ వర్గప్రయోజనాలను కాపాడుకునే క్రమంలో ప్రజల ప్రతిఘటనను మరింతగా ఎదుర్కొన్నప్పుడు, తమ అణచివేత పాలనను నిలుపుకోవడం కోసం భారత పాలకులు కూడా కొత్త పద్ధతులను కనిపెడుతూనే ఉన్నారు.

అమెరికా దురాక్రమణ యుద్ధాల్లో మరణించిన, వికలాంగులైన, అత్యాచారాలకు గురైన ప్రజలు మాత్రమే అణగదొక్కబడ్డం లేదనీ, నేడు అత్యధిక సంఖ్యలో ప్రపంచ ప్రజానీకం స్థానిక దళారుల సహాయంతో సామ్రాజ్యవాదం బిగిస్తున్న పట్టులో చిక్కుకున్నారని ఎడ్వర్డ్ స్నోడెన్ మరోసారి రుజువు చేశాడు. ప్రపంచ దేశాలపై, జాతులపై, ప్రజలపై అమెరికా సాగిస్తున్న దురాక్రమణతో లంకె కలిగిన దాని వ్యాపక నిఘాను మనం ప్రతిఘటించాలి. సామ్రాజ్యవాదంతో, ప్రత్యేకించి అమెరికా సామ్రాజ్యవాదంతో వైరుధ్యం కలిగిన పీడిత వర్గాలు, జాతులూ, ప్రజలూ మావోయిస్టు శక్తుల నేతృత్వంలో అర్ధవలస-అర్ధభూస్వామ్య దేశాల్లోని జాతి విముక్తి పోరాటాలతో, సామ్రాజ్యవాద దేశాల్లోని కార్మికవర్గ పోరాటాలతో కూడిన సాధ్యమైనంత విశాలమైన ఐక్యవేదికను నిర్మించుకుని పోరాడాలి. మొత్తం ప్రపంచంపై వేళ్లమీద లెక్కబెట్టగలిగిన విప్లవ ప్రతీఘాతుకుల అదుపును ధ్వంసం చేసి నిజమైన స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, సార్వభౌమత్వం, శాంతి, అన్ని దేశాల అభివృద్ధికై ఈ పోరాటం సాగాలి. ప్రతీఘాతుక వర్గాలను బలప్రయోగంతో అధికారం నుండి కూలదోసి, కార్మికవర్గ నాయకత్వంలో పీడిత ప్రజారాశులు పాలకవర్గంగా సంఘటితపడే నూతన సమాజంలోనే ప్రజల సృజనాత్మకత ఎల్లలు లేకుండా వెల్లివిరిస్తుంది. ఆ సమాజంలోనే గుప్పెడుమంది ప్రతీఘాతుక వర్గాలను మినహాయించి మొత్తం ప్రజలందరికీ ప్రజాస్వామ్యం. స్వాతంత్ర్యం విశాలంగా అందుబాటులోకి వస్తుంది.

కమ్యూనిజంలో రాజ్యం అంతరించిపోవడంతో ఇటువంటి అదుపులు సాగడానికి గల భౌతిక పునాది కూడా లేకుండా పోతుంది.

**అభయ్**

**అధికార ప్రతినిధి**

**కేంద్ర కమిటీ**

**సీపీఐ (మావోయిస్టు)**

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)

# సెంట్రల్ రీజినల్ బ్యూరో

**7-7-2013**

## కామ్రేడ్ గంటి ప్రసాదం దారుణహత్యను తీవ్రంగా ఖండిస్తున్నాం!

## దుండగుల ముసుగులో ప్రభుత్వం పాల్పడిన పిరికిపంద చర్య ఇది!

## పీడిత ప్రజల విముక్తి బాటలో ప్రాణత్యాగం చేసిన కామ్రేడ్ గంటి ప్రసాదం అమర్ రహే!

## ఈ దారుణ హత్యకు నిరసనగా జూలై 15 నుండి 21 వరకు నిరసన వారాన్ని పాటించండి!

## జూలై 21న ఏపీ, ఎన్టీ, ఏఓబీల బంద్‌ను పాటించండి!

జూలై 4న నెల్లూరు జిల్లాలో దుండగుల ముసుగులో ప్రభుత్వ కాపలా కుక్కలు జరిపిన కాల్పుల్లో కామ్రేడ్ గంటి ప్రసాదం అమరుడయిన వార్త రాష్ట్ర విప్లవ ప్రజానీకం, రాష్ట్రంలోని, దేశంలోని వివిధ విప్లవ, ప్రజా, ప్రజాస్వామిక సంఘాల శ్రేణులతో పాటు మా పార్టీ శ్రేణులను విషాదంలో ముంచెత్తింది. ఈ హత్యను మా పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నది.

పీడిత ప్రజల విముక్తి కోసం తన జీవితాన్ని అంకితం చేసి దాదాపు నాలుగు దశాబ్దాల పాటు విప్లవోద్యమాన్ని అంటిపెట్టుకొని ప్రాణాలను సైతం తృణప్రాయంగా అర్పించిన ప్రజా యోధుడికి మా పార్టీ, ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం, ప్రజా సంఘాలు వినమ్రంగా తలవంచి అరుణారుణ జోహార్లర్పిస్తున్నాయి. కామ్రేడ్ గంటి ప్రసాదంను కోల్పోయి తీవ్ర దుఃఖంలో మునిగిపోయిన ఆయన కుటుంబ సభ్యులకూ, బంధు మిత్రులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాయి.

దేశ ప్రయోజనాలను సామ్రాజ్యవాదులకు తాకట్టు పెట్టిన భారత పాలక వర్గాలు, తమ లక్ష్యాన్ని నిరాటంకంగా కొనసాగించడం కోసం దేశవ్యాప్తంగా గత కొన్ని సంవత్సరాలుగా విప్లవోద్యమంపై, ప్రజా వుద్యమాలపై తీవ్రమైన అణచివేతను ప్రయోగిస్తున్న విషయం అందరికీ తెలిసినదే. మరీ ముఖ్యంగా విప్లవ, ప్రగతిశీల, ప్రజాస్వామిక వుద్యమాల సుసంపన్నమైన వారసత్వాన్ని కలిగివున్న ఆంధ్రప్రదేశ్‌ను తమ అణచివేతకు ప్రయోగశాలగా ఎన్నుకొని,

సి.పి.ఐ.(మావోయిస్టు) నాయకత్వంలో సుదీర్ఘకాలంగా అక్కడ కొనసాగుతున్న విప్లవోద్యమాన్ని అణచివేయడంలో విజయం సాధించామని గొప్పలు చెప్పుకుంటున్నాయి. ఆంధ్రప్రదేశ్‌ను మావోయిస్టు రహిత రాష్ట్రంగా చేశామని ప్రకటనల మీద ప్రకటనలు గుప్పిస్తున్నాయి. అయితే తాము సాధించిన విజయం తాత్కాలికమేనని పాలకవర్గాలకు స్పష్టంగా తెలుసు. సుసంపన్నమైన పోరాట వారసత్వమున్న ఆంధ్రప్రదేశ్ గడ్డ నుండి విప్లవోద్యమాన్ని పూర్తిగా తుడిచిపెట్టడం సాధ్యం కాదని, ఏ మాత్రం ఉపేక్షించినా అక్కడ మళ్లీ దావానలం చెలరేగుతుందని పాలకులు భయపడుతున్నారు. ఆ భయాన్ని నిజం చేస్తూ ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లో నిరంతరాయంగా వివిధ ప్రజా వుద్యమాలు కొనసాగుతున్నాయి. తెలంగాణ రాష్ట్రం కోసం ప్రజలు మడమ తిప్పకుండా పోరాడుతున్నారు. మరోవైపు సామ్రాజ్యవాద, బహుళజాతి ప్రయోజనాల కోసం తలపెట్టిన అనేక ప్రాజెక్టులకు, సెజ్‌లకు వ్యతిరేకంగా పోరాడుతున్నారు. ప్రభుత్వం దేశవ్యాప్తంగా తలపెట్టిన ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను ఎండగట్టడంలో ఆంధ్రప్రదేశ్ ప్రజానీకం ముందు పీఠిన నిలుస్తున్నారు. ఇంకా తమ దైనందిన సమస్యల కోసం వివిధ సెక్షన్ల ప్రజలు పోరాడుతున్నారు. ఈ విధంగా దేశంలో ప్రజా వుద్యమాలకు ఆంధ్రప్రదేశ్ ఒక నమూనాగా ముందుకొస్తున్నది. ఈ పోరాటాలకు వెరిచిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పథకం పన్ని ప్రజా వుద్యమ నాయకుడు, అమరవీరుల బంధు మిత్రుల కమిటీ అధ్యక్షుడు, ఆర్.డి.ఎఫ్. ఉపాధ్యక్షుడు కామ్రేడ్ గంటి ప్రసాదంను దుండగుల ముసుగులో హత్య చేసింది.

కామ్రేడ్ గంటి ప్రసాదం విప్లవ ప్రస్థానం నాటి శ్రీకాకుళ పోరాటం నుండే ప్రారంభమైంది. నక్సల్బరీ పంథాలో నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేసే లక్ష్యంతో ఏర్పడిన సి.పి.ఐ.(ఎం-ఎల్)లోనూ, ఆ తర్వాత ఏర్పడిన సి.పి.ఐ.(ఎం-ఎల్) (పార్టీ యూనిటీ)లోనూ ఆయన క్రియాశీలక కార్యకర్త అయ్యారు. కామ్రేడ్ అప్పలసూరి నాయకత్వంలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జిల్లాల్లో ఆయన ఎన్నో పోరాటాలకు నాయకత్వం వహించి, వివిధ సెక్షన్ల ప్రజలను సంఘటితపరిచి బలమైన ప్రజా, కార్మిక వుద్యమాలను నిర్మించారు. చారిత్రాత్మక నెల్లిమర్ల జూట్‌మిల్ పోరాటాన్ని నేతృత్వం వహించారు. ఈ వుద్యమ ప్రస్థానం ఫలితంగా ఆయన సి.పి.ఐ.(ఎం-ఎల్) (పార్టీ యూనిటీ)లో కేంద్ర కమిటీ సభ్యులయ్యారు.

1998లో సి.పి.ఐ.(ఎం-ఎల్) (పార్టీ యూనిటీ), సి.పి.ఐ.(ఎం-ఎల్) (పీపుల్స్‌వార్)ల ఐక్యత మూలంగా సి.పి.ఐ.(ఎం-ఎల్) (పీపుల్స్‌వార్) ఆవిర్భవించింది. ఈ క్రమంలో ఆయన సి.పి.ఐ. (ఎం-ఎల్) (పీపుల్స్‌వార్) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఎన్నికై 2005 వరకూ కొనసాగారు. ఆ బాధ్యతల్లో వుండి ఆయన నిర్మాణ, రాజకీయ, సైద్ధాంతిక రంగాల్లో విశేషమైన కృషి చేశారు. పట్టణోద్యమ, విప్లవ ప్రజా సంఘాల నిర్మాణ బాధ్యతను నిర్వర్తించారు. రాష్ట్ర కమిటీ అధికార పత్రిక 'క్రాంతి'ని నడిపారు. ఈ క్రమంలో 2005 మేలో ఆయన మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో అరెస్టయ్యారు. జైలు జీవితం అనుభవించారు. విడుదలైన తర్వాత ఆయన

బహిరంగ విప్లవోద్యమాలకు అంకితమయ్యారు. 1998 అగస్టులో కోపర్‌డెంగ్ ఎన్‌కౌంటర్‌లో అమరుడైన సి.పి.ఐ. (ఎం-ఎల్) (పీపుల్స్‌వార్) నాయకుడు కామ్రేడ్ రాజన్నకు, స్వయాన సోదరుడైన కామ్రేడ్ గంటి ప్రసాదం అమరవీరుల బంధు మిత్రుల కమిటీకి నాయకుడైనాడు. అప్పటి నుండి ఎన్‌కౌంటర్ల పేరుతో పోలీసులు చేసే ప్రతి హత్యనూ ఆయన ఖండిస్తూ వచ్చారు. పాలకుల, పోలీసుల హంతక ముఖాలను బట్టబయలు చేస్తూ వచ్చారు. అమరులైన ఎందరో అమరవీరుల కుటుంబాలకు మద్దతుగా నిలిచారు. విప్లవకారుల మృతదేహాలకు సరైన అంత్యక్రియలు కూడా జరగకూడదనే పాలకుల, పోలీసుల వికృత కోరికలకు విరుద్ధంగా, అమరుల అంత్యక్రియలను ముందుండి గౌరవప్రదంగా, ఉత్తేజకరంగా జరిపించారు.

ప్రజా వుద్యమాలలో ఆయన కృషిని సహించలేని ప్రభుత్వం ఆయనపై నిర్బంధం కొనసాగిస్తూనే వుంది. ఒడిశా ప్రభుత్వం కూడా 2011లో ఆయనను అరెస్టు చేసి జైలులో పెట్టింది. అయితే ప్రజలు పోరాడి తమ నాయకుడిని విడిపించుకున్నారు.

ఇంకా తన విప్లవ కార్యాచరణను పెంచుకుంటూ 2012 ఏప్రిల్‌లో ఆర్.డి.ఎఫ్.కు అఖిల భారత ఉపాధ్యక్షులయ్యారు. దేశంలో కొనసాగుతున్న విప్లవోద్యమానికి సంఘీభావం కూడగట్టడంలోనూ, పాలకులు కొనసాగిస్తున్న గ్రీన్‌హంట్ దమనకాండకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా వివిధ సెక్షన్ల ప్రజలను సంఘటితం చేయడంలోనూ ఆర్.డి.ఎఫ్. చేస్తున్న కృషిని సహించలేని ప్రభుత్వం ఆర్.డి.ఎఫ్.ను నిషేధించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఆ సంఘ నాయకుడిని హత్య చేసేందుకు తెగించింది. పైగా నిస్సిగ్గుగా ఎవరో అనామక దుండగులు చేసిన చర్యగా దీన్ని ప్రచారం చేసుకుంటున్నది. ప్రజా వుద్యమాల్లో పనిచేసే నాయకులను చంపడానికి రక రకాల పేర్లతో ముఠాలు ఏర్పరిచి ప్రజా, పౌరహక్కుల సంఘాల నాయకులు పురుషోత్తం, ఆజం అలీ, కనకాచారి తదితరులతో పాటు ఇటీవలి కాలంలో మహబూబ్‌నగర్ జిల్లాలో వెంకటేశ్వర్లును హత్య చేసిన నీచ చరిత్ర ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి వున్నది. కాబట్టి ఇది ముమ్మాటికి గ్రీన్‌హంట్‌లో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ఏపీఎస్ఐబీ చేసిన, లేదా చేయించిన హత్య.

ఈ హత్య నేడు దేశంలోనూ, రాష్ట్రంలోనూ జరుగుతున్న ప్రజా వుద్యమాలకు ఒక హెచ్చరిక. రోజు రోజుకూ పెరుగుతున్న పాలకవర్గాల ఫాసిజంకు ఒక వుదాహరణ. ప్రజా వుద్యమాలను మరింతగా పెంపొందించడం ద్వారానే ఇటువంటి హత్యాకాండలను అడ్డుకోగలం.

ఈ దారుణ హత్యను ప్రజలు, ప్రజాస్వామికవాదులు ముక్త కంఠంతో ఖండించాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

ఈ దారుణ హత్యను ఖండిస్తూ **జూలై 15 నుండి 21 వరకూ నిరసన వారాన్ని పాటించండి.** ఈ వారం రోజుల పాటు వివిధ రూపాలలో నిరసన కార్యక్రమాలు చేపట్టండి. ఈ నిరసన

కార్యక్రమాల్లో ప్రజలను విస్తృతంగా కదిలించండి. **21న ఏపీ, ఎన్‌టీ, ఏఓబీ బంద్‌ను పాటించండి.** ఈ కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా వివిధ సెక్షన్ల ప్రజలు, ప్రజాస్వామికవాదులు విస్తృతంగా పాల్గొనాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

- ★ **కామ్రేడ్ గంటి ప్రసాదం అమర్ రహే!**
- ★ **ప్రజా వుద్యమాలపై ఫాసిస్టు హత్యాకాండను ఖండించండి!**
- ★ **గ్రీన్‌హంట్‌కు వ్యతిరేకంగా బలమైన ప్రజా వుద్యమాన్ని నిర్మిద్దాం!**
- ★ **ఉద్యమకారులపై ఫాసిస్టు హత్యాకాండను ఖండించండి!**

**ఆనంద్**

**కార్యదర్శి,**

సెంట్రల్ రీజినల్ బ్యూరో,

**సీపీఐ (మావోయిస్టు)**

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# సెంట్రల్ రీజినల్ బ్యూరో

**31-7-2013**

## కాంగ్రెసు తదితర బూర్జువా పార్టీల మెడలు వంచి చారిత్రక విజయం సాధించిన తెలంగాణ ప్రజలకు మా విప్లవ జేజేలు!

## తెలంగాణాలో ప్రజల మౌలిక సమస్యల పరిష్కారం కోసం నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని కొనసాగించాలని ప్రజలకు పిలుపు

60 యేండ్లుగా తెలంగాణ ప్రజలు ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిపిన పోరాటం విజయవంతం అయ్యింది. యుపిఏ సమన్వయ సమతి, కాంగ్రెసు వర్కింగ్ కమిటీ సమావేశాల అనంతరం కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర డిమాండ్‌ను అంగీకరిస్తూ ప్రకటన చేసింది. ఏర్పడబోయే తెలంగాణ రాష్ట్రంలో హైదరాబాద్ నగరం అంతర్భాగమేనని, పది సంవత్సరాల వరకు అది ఉమ్మడి రాజధానిగా ఉంటుందని ప్రకటించింది. పార్లమెంట్‌లో బిల్లు పెట్టే ప్రక్రియను ప్రారంభిస్తున్నట్టు సి.డబ్ల్యు.సి. ప్రకటించింది. ఈ ప్రకటనను బిజెపి కూడా బలపరిచింది. దీనికి ముందు న్యూఢిల్లీలో పెద్దయెత్తున రాజకీయ కార్యకలాపాలు జరిగాయి. ప్రత్యేక తెలంగాణ ఏర్పాటును అడ్డుకోవడానికి సీమాంధ్ర రాజకీయ నాయకులు చివరి వరకు తీవ్ర ప్రయత్నాలు చేశారు. కాని ఈసారి వారి కుట్రలు దానిని అడ్డుకోలేకపోయాయి. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు యావత్తు తెలంగాణ ప్రజల చారిత్రక పోరాట విజయం. కాంగ్రెసు, టిడిపి యితర బూర్జువా పార్టీల కుట్రలను ఎదుర్కొంటూ తెలంగాణ ప్రజలు గొప్ప ప్రజా ఉద్యమాన్ని నడిపారు. టిఆర్ఎస్ లాబీయింగ్ రాజకీయాలను ఓడిస్తూ పోరాట పథంలో ముందుకు సాగారు. దీర్ఘకాలంగా పట్టువదలకుండా ప్రజలు నడిపిన పోరాటం ముందు కాంగ్రెసు, టిడిపి పార్టీలు ఓడిపోక తప్పలేదు. దృఢనిశ్చయంతో పోరాడితే ప్రజలు దేనినైనా సాధించగలరని చరిత్రలో మరోసారి ఈ సందర్భంగా రుజువైంది. తెలంగాణ ప్రజల సుదీర్ఘ, రక్తసిక్త, త్యాగపూరిత పోరాట చరిత్రలో ఈ రోజు ఒక మైలురాయిగా నిలుస్తుంది.

ప్రజల ఆకాంక్ష అయిన ప్రత్యేక తెలంగాణ డిమాండ్‌ను మా పార్టీ 1969 నుండి సమర్థిస్తూనే, ఈ ఉద్యమానికి నాయకత్వం వహిస్తూ వస్తున్నది. 1996 నుండి తిరిగి మలి దశ ఉద్యమాన్ని ప్రారంభించడంలో మా పార్టీ చేసిన కృషి ప్రధానమైనది. వరంగల్‌లో భారీ బహిరంగసభను జరిపి వరంగల్ డిక్లరేషన్‌ను ప్రకటించింది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తెలంగాణ

ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్షలో భాగంగా పేర్కొంటూ ప్రజాస్వామిక తెలంగాణ ఏర్పాటుకై పోరాడాలని మా పార్టీ ప్రజలకు పిలుపు నిచ్చింది. ప్రజలు పోరాటం ద్వారానే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకోగలరని, లాబీయింగ్ రాజకీయాలతో సాధించలేరని ప్రజలను నిరంతరం పోరాట రంగంలో కదిలించింది. తెలంగాణ ప్రజల సమైక్య పోరాటం ద్వారానే ఈ డిమాండ్ నెరవేరిందని ఈ రోజు ఘంటాపథంగా చెప్పవచ్చు. ఈ పోరాటంలో పాల్గొన్న అనేక మంది విద్యార్థులు, ప్రజలతో పాటు మా పార్టీ కార్యకర్తలు కూడ ప్రభుత్వ నిర్బంధకాండలో ప్రాణాలు కోల్పోయారు. అనేక మంది జైళ్ల పాలైనారు. మా పార్టీ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకై రాజీలేని మిలిటెంట్ పోరాటాన్ని నడుపుతూ ముందు పీఠిన నడిచింది. అనేక క్లిష్ట పరిస్థితులలో ప్రజా ఉద్యమానికి నాయకత్వం వహించి నడిపింది. కాంగ్రెసు, టిడిపి, కోస్తాంధ్ర బడా పెట్టుబడిదారులకు వ్యతిరేకంగా పోరాటం నడిపింది. 610 జి.ఓ.తో పాటు, తెలంగాణ వనరులను సీమాంధ్ర దోపిడిదారుల నుండి కాపాడుకోవాలని పిలుపు నిచ్చింది. బాబ్లీ ప్రాజెక్టు, పోలవరం, ఓపెన్ కాస్ట్ గనులు, బయ్యారం గనులు, ప్రత్యేక ఆర్థిక మండలాలు, కవ్వాల్ టైగర్ లాంటి ప్రజల జీవన్మరణ నిర్వాసిత సమస్యలపై ఆందోళన చేసింది. ఛలో అసెంబ్లీ, మిలియన్ మార్చ్ ప్రదర్శన, సాగరహారం, క్విట్ తెలంగాణతో పాటు అనేక మిలిటెంట్ ప్రదర్శనల్లో క్రియాశీలంగా పాల్గొంది. యూనివర్సిటీ విద్యార్థుల పక్షాన నిలబడి ఆ ఉద్యమాలకు నాయకత్వం వహించింది. పార్లమెంటులో బిల్లు పెట్టాలనే రాజకీయ నినాదాన్ని బలపరిచి ముందుకు వచ్చింది. సకల జనుల సమ్మెలో చురుకుగా పాల్గొని సార్వత్రిక ఉద్యమంగా నడపాలని పిలుపు నిచ్చింది. ఇలా తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొంటూ ఉద్యమానికి నాయకత్వం వహించింది. ప్రజల మిలిటెంట్ పోరాటాలను పక్కదారి పట్టించజూసిన టిఆర్ఎస్ పార్టీ లాబీయింగ్ రాజకీయాలను ఎప్పటికప్పుడు బహిర్గతం చేసింది.

ఈ పోరాటంలో తెలంగాణ ప్రజలు సమైక్యంగా పోరాడడంతో పాటు, ప్రత్యేక రాష్ట్ర డిమాండ్‌పై సీమాంధ్ర ప్రజల, ప్రజాస్వామికవాదుల మద్దతు కూడ పొందారు. సీమాంధ్ర నుండి లభించిన ఈ మద్దతు, అక్కడి బూర్జువా నాయకులను ఒంటరి చేసి తెలంగాణ ప్రజల ఉద్యమానికి నైతిక బలాన్నిచ్చింది. ఇలా మూడు ప్రాంతాల ప్రజల మధ్య సమైక్యత పెరుగుతూ ఉంటే బూర్జువా పార్టీలు, నాయకులు ప్రజల నుండి దూరం అవుతూ వచ్చారు. అయితే బూర్జువా నాయకులు ఆ ప్రాంతాల్లో ప్రజలను విద్యార్థులను రెచ్చగొట్టడానికి ఇప్పటికీ తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. అన్నదమ్ములుగా విడిపోదాం – కలిసి మెలసి ఉందాం అనే వైఖరితో మూడు ప్రాంతాల ప్రజల మధ్య సౌభ్రాతృత్వాన్ని పెంపొందించుకోవడానికి కృషి చేస్తూనే, బూర్జువా నాయకులను ఒంటరి చేసి వారి కుట్రలను ఓడించాలి.

తెలంగాణ ప్రజలు రాష్ట్ర డిమాండ్‌ను సాధించుకొన్నామని సంబరపడుతూ కర్తవ్య సాధనలో ఆదమరచి ఉండకూడదు. పార్లమెంటులో బిల్లు పెట్టి, కాంగ్రెసు పార్టీ చేసిన నిర్ణయాన్ని అమలు

చేసేంతవరకూ పట్టు సడలించవద్దు. గతంలో 2009లో ప్రభుత్వం తరఫున అప్పటి హోంమంత్రి తెలంగాణ ఏర్పాటుపై స్పష్టమైన ప్రకటన చేసి, తదుపరి సీమాంధ్ర నాయకుల రాజీనామాల ఒత్తిడితో తెలంగాణ ప్రజలకు వ్యతిరేకమైన రెండో ప్రకటన చేసి తెలంగాణ ప్రజలకు విద్రోహం చేసిన విషయం ప్రజలందరికీ తెలిసిందే. ప్రజలు ఈ విషయంలో సోయితో ఉండి, ఎలాంటి కుట్రలు ముందుకు వచ్చినా వాటిని తిప్పికొట్టాలి. పార్లమెంటులో బిల్లు పెట్టేంతవరకూ పోరాడాలి. పార్లమెంటులో బిల్లు ఆమోదం పొందడంతో ప్రజల ఆకాంక్షలో భాగంగా ప్రత్యేక తెలంగాణ ఏర్పడుతుంది. కాని ఈ రాష్ట్రంలో కూడ అధికారం ప్రజల చేతిలో కాకుండా దళారీ నిరంకుశ బూర్జువా, బడా భూస్వామ్య వర్గాల పార్టీలైన కాంగ్రెసు, టిడిపి, టిఆర్ఎస్, బిజెపి లాంటి పార్టీల చేతిలోనే ఉంటుంది. ప్రత్యేక తెలంగాణ ఏర్పాటుతో వివక్ష పోవడం, నీళ్లు, ఉద్యోగాలు లాంటి డిమాండ్ల విషయంలో కొంతమేరకు ప్రయోజనం చేకూరుతుంది. కాని ప్రజల మౌలిక సమస్యలకు పరిష్కారం దొరకదు. ప్రజలకు అధికారం లభిస్తేనే ఈ సమస్యలకు పరిష్కారం సాధ్యం అవుతుంది.

అందుకని తెలంగాణ ప్రజలంతా ఈ కింది ప్రజల ప్రజాస్వామిక డిమాండ్ల సాధన కోసం పోరాడాలి.

1) భూ సంస్కరణలు అమలు చేయాలి.

2) బడా పెట్టుబడిదారులు, సామ్రాజ్యవాదులు, రాజకీయ నాయకులు దురాక్రమించిన ప్రభుత్వ, అస్సైన్డ్ భూములను స్వాధీనం చేసుకొని పట్టణ పేదలకు పంపిణీ చేయాలి.

3) భూస్వామ్య, సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంలో ప్రజలు ఆక్రమించిన భూములపై వారికే హక్కు కల్పించాలి.

4) సామ్రాజ్యవాదుల, బహుళజాతి సంస్థల ప్రవేశాన్ని అడ్డుకోవాలి. రాష్ట్రం స్వయం అభివృద్ధికై ప్రణాళికలు చేపట్టాలి.

5) ప్రభుత్వ రంగ పరిశ్రమలతో పాటు, చిన్న, మధ్యతరహా పరిశ్రమలను ప్రోత్సహించాలి. కార్మికుల హక్కులను కాపాడాలి.

6) రాజ్యాంగంలోని 5వ షెడ్యూల్ (పెసా)ను, 1/70 చట్టాన్ని కచ్చితంగా అమలు చేస్తూ, ఆదివాసులకు జల్, జంగల్, జమీన్‌లపై అధికారం ఇవ్వాలి.

7) ప్రజలను నిర్వాసితులను చేస్తున్న పోలవరం, పులిచింతల, ఓపెన్ కాస్ట్ గనులు, బయ్యారం గనులు, కవ్వాల్ టైగర్ ప్రాజెక్ట్, ప్రత్యేక ఆర్థిక మండలాలను రద్దు చేయాలి. వీటికి సంబంధించి దళారీ నిరంకుశ బూర్జువాజీతో, బహుళజాతి సంస్థలతో చేసుకున్న ఎంఓయులన్నీ రద్దు చేయాలి.

8) భూమిలేని దళితులందరికి భూమి పంపిణీ చేయాలి. దళితులపై జరుగుతున్న అన్ని రకాల దాడుల నుండి వారికి రక్షణ కల్పించాలి.

9) మహిళలకు చట్టసభలు, విద్య, ఉపాధి రంగాలలో 50 శాతం రిజర్వేషన్ కల్పించాలి. మహిళలకు రక్షణ కల్పించాలి.

10) మైనారిటీలకు రిజర్వేషన్లు కల్పించాలి. భూమిలేని వారికి భూమిని పంపిణీ చేయాలి. ఉర్దూను రెండవ అధికార భాషగా అమలు చేయాలి.

11) విద్యారంగంలో ప్రైవేటీకరణను రద్దు చేయాలి. ప్రభుత్వ రంగంలోనే విద్యను కొనసాగించాలి.

12) ప్రైవేటీకరణను వ్యతిరేకించాలి.

13) తాత్కాలిక, తక్షణ ఉపాధి అవకాశాలకై ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు కల్పించాలి.

14) బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి కేటాయింపులు పెంచాలి. రైతులకు ఉచితంగా విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు పంపిణీ చేయాలి. గిట్టుబాటు ధరలు కల్పించాలి. విద్యుత్తు కోతలు ఎత్తివేయాలి. రుణాలు మాఫీ చేయాలి. వడ్డీలేని రుణాలు ఇవ్వాలి.

15) రాష్ట్రంలో పౌర, ప్రజాస్వామిక హక్కులను పునరుద్ధరించాలి. పోలీసు ఎన్‌కౌంటర్లను నిలిపివేయాలి.

16) సి.పి.ఐ. (మావోయిస్టు)పై, ఇతర విప్లవ ప్రజా సంఘాలపై నిషేధాన్ని ఎత్తివేయాలి.

17) గ్రేహౌండ్స్ బలగాలను రద్దు చేయాలి.

18) రాజకీయ ఖైదీలను బేషరతుగా విడుదల చేయాలి.

19) తెలంగాణ ఉద్యమకారులపై ఉన్న కేసులన్నింటినీ ఎత్తివేయాలి.

20) తెలంగాణ అమరుల కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవాలి.

20) తెలంగాణకు న్యాయబద్ధంగా రావలసిన నీటిని కేటాయించి సాగు నీటిని రైతాంగానికి, ప్రజలకు తాగు నీటిని అందించాలి.

తెలంగాణ ప్రజలు ప్రత్యేక రాష్ట్ర సాధన ద్వారా వారు దేశ ప్రజల ముందు రాజకీయంగా ఒక నమూనాను నిలిపారు. ప్రాంతీయ ఆకాంక్షలతో పోరాడుతున్న ప్రజలకు తెలంగాణ ప్రజల పోరాటం ఒక గొప్ప ప్రేరణగా నిలుస్తుంది. జాతుల పోరాటాలకు కూడ నూతన ఉత్తేజాన్ని ఇస్తుంది. దేశంలో సిపిఐ (మావోయిస్టు) నాయకత్వంలో జరుగుతున్న పోరాటాలకు బలాన్ని

యిస్తుంది. తెలంగాణ ప్రజలు గొప్ప పోరాట వారసత్వం కల్గినవారు. వారు అనేక త్యాగాలతో భూమి, భుక్తి, విముక్తి కోసం పలు పోరాటాల్ని నడిపారు. మహత్తర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం, నక్సల్బరీ మార్గంలో సాగుతున్న ప్రజాయుద్ధంలో భాగంగా తెలంగాణ వ్యాప్తంగా భూస్వామ్య వ్యతిరేక పోరాటాలను నడిపి, వ్యవసాయ విప్లవాన్ని కొనసాగిస్తూ వేలాది ఎకరాల భూములను ఆక్రమించారు. గ్రామాల్లో భూస్వామ్య దోపిడిని అరికట్టారు. తెలంగాణ వ్యాప్తంగా ప్రజలు పోరాడి అనేక పోరాట విజయాలు సాధించారు. ప్రభుత్వం నిర్బంధంతో ఈ పోరాటాలను అణచివేసింది. ఇప్పటికీ మా పార్టీ నాయకత్వంలో సాగుతున్న నూతన ప్రజాస్వామిక విప్లవోద్యమాన్ని తీవ్రంగా అణచివేస్తున్నది. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో ప్రదర్శించిన ఐక్యతా, పట్టుదలలను మరింత బలంగా కొనసాగిస్తూ ప్రజలు తమ మౌలిక సమస్యల కోసం పోరాడుతూ, తెలంగాణ ప్రజలంతా నూతన ప్రజాస్వామిక విప్లవ కర్తవ్య నిర్వహణలో దృఢంగా ముందుకు సాగాలి. దున్నేవారికే భూమి కావాలనే నినాదంతో వ్యవసాయ విప్లవాన్ని కేంద్రంగా చేసుకొని విముక్తి ఉద్యమంలో ముందుకు సాగాలి. నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయడానికి ప్రజలంతా ముందుకు రావాలి. యిదే మనకు గొప్ప అవకాశం. బూర్జువా పార్టీలు, వారి తొత్తులు రేపు ప్రజలందరినీ బూర్జువా పార్లమెంటరీ ఎన్నికల్లోకి దింపి, వారి మధ్య నెలకొల్పబడిన పోరాట సమైక్యతను విచ్ఛిన్నం చేసి, తమ అధికారాన్ని, దోపిడిని కొనసాగింపజూస్తారు. ప్రజలు తమ ఐక్యత పునాదిగా ముందుకు సాగి కాంగ్రెస్, టిడిపి, బిజెపి, టిఆర్ఎస్, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలతో పాటు రివిజనిస్టు సిపిఐ, సిపిఎంల కుట్రలను ఎదుర్కొని నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని పురోగమింప చేయాలని మా పార్టీ యావత్తు ప్రజలకు పిలుపు నిస్తున్నది. ప్రజలు సాధించిన విజయాలను కాపాడుకుంటూ తెలంగాణ ఉద్యమకారులు, సంస్థలు ఐక్యంగా నూతన తెలంగాణ రాష్ట్రంలో ప్రజాస్వామిక డిమాండ్ల సాధన కోసం పోరాటాలు కొనసాగించాలి. కోస్తా, రాయలసీమ ప్రజలతో ఐక్యమై ఉమ్మడి శత్రువులైన బడా భూస్వామ్య, నిరంకుశ దళారీ బూర్జువా వర్గాలకు వ్యతిరేకంగా పోరాడాలి. గ్రామాలలో, పట్టణాలలో ప్రజలు విజయోత్సవ సభలు జరుపుకోవాల్సిందిగా, భవిష్యత్తు పోరాట కార్యక్రమాన్ని రూపొందించుకోవాల్సిందిగా మా పార్టీ విజ్ఞప్తి చేస్తున్నది.

**ఆనంద్**

**కార్యదర్శి,**

సెంట్రల్ రీజినల్ బ్యూరో,

**సీపీఐ (మావోయిస్టు)**

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# కేంద్ర కమిటీ

**5-9-2013**

## యుద్ధపిపాసి ఒబామా! సిరియా నుండి తక్షణం తొలిగిపో! సిరియా భవిష్యత్తును నిర్ణయించుకునే హక్కు సిరియన్లకే, కేవలం సిరియన్లకే ఉన్నది, అది సామ్రాజ్యవాదులకు గానీ, మరెవరికి గానీ లేదు! నయా నాజీ అమెరికా నాయకత్వంలో సిరియాపై జరగబోయే దాడిని తీవ్రంగా వ్యతిరేకించండి!

నయా నాజీ అమెరికా నేతృత్వంలోని సామ్రాజ్యవాదులు సిరియా చుట్టూ తమ ఉచ్చును బిగించి గోతికాడి నక్కల్లా దాడి చేయడానికి కేవలం ఒక అవకాశం కొరకు ఎదురుచూస్తున్నారు. ఇరాక్ పై దాడికి 'మానవహనన ఆయుధాల'ను సాకుగా చూపారు. నయాఫాసిస్టు అమెరికా సిరియాపై దాడికి రసాయన ఆయుధాలను (విషవాయువు) 'కారణం'గా చూపుతున్నది. సిరియా ప్రజలపై బషర్ అల్ అస్సద్ ప్రభుత్వం రసాయన ఆయుధాలను ప్రయోగించిందనడానికి రుజువులున్నాయనీ, ఇది 1400 సిరియన్ల చావులకూ, మరెంతోమంది దాని ప్రభావానికి గురి కావడానికి దారి తీసిందనీ అమెరికా చెప్తోంది. ఈ ఆరోపణలన్నిటిలోని నిజానిజాల్ని తేల్చడానికి ఒక ఐరాస ఇనస్పెక్టర్ల బృందం సిరియాకు వెళ్లింది. కానీ వారు తమ నివేదికనింకా సమర్పించక ముందే (అందుకు కనీసం మరి మూడు వారాలు పట్టచ్చునంటున్నారు), ఒబామా యుద్ధానికి సన్నాహాలు మొదలుపెట్టేశాడు.

సిరియాపై దాడి చేయకపోతే అక్కడ పరీక్షకు గురయ్యేది తన ప్రతిష్ఠ కాదనీ, అమెరికా, దాని కాంగ్రెస్ ల ప్రతిష్ఠ అనీ కూడా ప్రకటించేంత వరకూ వెళ్లాడు ఒబామా. అవును మరి! వైమానిక దాడుల్లో అత్యధిక సంఖ్యలో పౌరుల్ని చంపిన ఘనత వహించిన రికార్డును నిలబెట్టుకోకపోతే ఈ ప్రపంచ నెంబర్ వన్ నరహంతకుడి ప్రతిష్ఠకు భంగం కలగదూ. ఐరాస పరిశోధనా బృందం వెనక్కి తిరిగి రాకముందే అమెరికా సెక్రటరీ ఆఫ్ స్టేట్ (గృహమంత్రి) జాన్ కెర్రీ రసాయన ఆయుధాలను ప్రయోగించారనడానికి మా వద్ద రుజువులన్నీ ఉన్నాయనీ, వాటిని అస్సద్ ప్రభుత్వమే ప్రయోగించిందనీ రంకెలు వేస్తున్నాడు. అంటే ఇందుకు సరైన రుజువులు కావాలని అడిగిన దేశాలూ, ప్రజలూ అందరూ అమెరికా సామ్రాజ్యవాదుల దృష్టిలో బుద్ధిలేని వాళ్లు. సామ్రాజ్యాధినేతలకు వారికి సమాధానం చెప్పాల్సిన అవసరం లేదు అన్నమాట!

యుద్ధ సన్నాహాల్లో ప్రపంచ ప్రజలను ఇటువంటి దాడి 'అవసరం' విషయంలో కళ్లు కప్పడానికి అవసరమైన 'అబద్ధాలన్నిటినీ' పోగు చేసుకోవడం కూడా ఎల్లప్పుడూ భాగంగా వుంటాయి అనేది గమనార్హం.

విదేశీ వ్యవహారాలపై అమెరికా సెనేట్ కమిటీ సిరియాపై రెండు నెలల దాకా పరిమితమైన దాడికి అధ్యక్షుడికి అధికారాలిచ్చింది. కొన్ని షరతులకు లోబడి దీన్ని మరో నెల పొడిగించుకోవచ్చు. కాల్బలాలను పంపకోడదని అది చెప్పింది. ఈ 'పరిమితమైన' దాడికి 'పరిమితులు' ఏవీ ఉండవనేదీ, అది బషర్ ప్రభుత్వ వెన్నెముకను వ్యూహాత్మకంగా విరిచేశాకే, నేల మీద ఉన్నదాన్నంతా విధ్వంసం చేసిపారేశాకే అంతమవుతుందనేదీ తేటతెల్లమే. ఇది అసంఖ్యాకంగా పౌరుల మరణానికీ, ఊహకందనంత స్థాయిలో ప్రజల ఆస్తుల, జీవనోపాధుల నష్టానికీ దారి తీస్తుంది. అమెరికా సామ్రాజ్యవాదులు అస్సద్ ప్రభుత్వ వ్యూహాత్మకమైన/కీలకమైన మిలటరీ, ఆర్థిక నిర్మాణాలను ధ్వంసం చేయడం ద్వారా దాన్ని మెసలనీయకుండా చేయాలనీ, లిబియాలో చేసినట్టుగానే సిరియాలోనూ తమ ప్రయోజనాల కోసం పని చేసే శక్తులను అధికారంలోకి తేవాలనీ కోరుకుంటున్నారు. డమాస్కస్ ప్రపంచంలోనే అత్యంత ప్రాచీనమైన ఆవాస నగరాల్లో ఒకటి. ఇప్పుడు ఒబామా వైమానిక బాంబింగ్ ల ద్వారా ఈ చారిత్రక నగరాన్ని ధ్వంసం చేయాలని కంకణం కట్టుకున్నాడు. ఇది గతంలో ఇరాక్ లో ప్రపంచంలోకెల్లా అత్యంత పురాతనమైన నాగరికతా వారసత్వాన్ని బుష్ తిరిగి బాగుచేయలేనంతటి స్థాయిలో విధ్వంసం చేయడానికి ఏ విధంగా భిన్నం?

రష్యా దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ అమెరికా అంటున్నదానికి తగిన సాక్ష్యాధారాలు కావాలని కోరింది. అస్సద్ ప్రభుత్వం రసాయన ఆయుధాలను ప్రయోగించిందని నిజంగా రుజువయితే కనుక సిరియాపై ఎటువంటి దాడికైనా ఐరాస ఆమోదముద్ర వుండాల్సిందేనని పుతిన్ ఆచితూచి మాట్లాడాడు. కానీ ఒబామా ఐరాస ఆమోదం లేకుండా దాడి కనుక చేసేట్లైతే అది చట్టవిరుద్ధమవుతుందన్నాడు. డమాస్కస్ లోని అణు కర్మాగారాలు వేటినైనా పొరపాటున ఏ చిన్న మిస్సైల్ దెబ్బకొట్టినా అది అణు ఎమర్జెన్సీకి దారి తీస్తుందనీ, దానివల్ల వెలువడే రేడియేషన్ ఒక విశాలమైన ప్రాంతాన్నీ, రాబోయే అనేక తరాల వరకూ పెద్ద సంఖ్యలో పౌరజనాభానూ ప్రభావితం చేస్తుందనీ హెచ్చరించాడు. తామంతా కూరుకుపోయి ఉన్న ప్రపంచ ఆర్థిక సంక్షోభాన్ని కూడా అది పెంచుతుందని కూడా హితవు పలికాడు. ఐరాస పరిశోధనా ఫలితాలు వెలువడినాకే, అదీ ఐరాస ఆధ్వర్యంలోనే ఏ నిర్ణయమైనా తీసుకోవాలని చైనా అంటూ వస్తోంది. జర్మనీ కూడా ఇదే వైఖరి తీసుకున్నది – ఇప్పటికి. సముద్రం నుండి నేలమీదకు లాంగ్ రేంజి మిస్సైల్స్ పేల్చగల అమెరికా యుద్ధ నౌకలు సిరియా సమీపానికి రాగా, రష్యాకు చెందిన గూఢచారి నౌక కూడా మెడిటెర్రేనియన్ సముద్రంలోకి ప్రవేశించడంతో మొత్తం పశ్చిమాసియాలోనూ,

ప్రపంచంలోనూ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

అమరికాతో పాటు సిరియా మీద దాడిలో పాల్గొనడానికి డేవిడ్ కెమరూన్ బ్రిటిష్ పార్లమెంటు ఆమోదాన్ని కోరాడు. అతనికది లభించలేదు. అయితే సిరియా మీద దాడి చేయాలనే ఆయనగారి యుద్ధాకాంక్ష ఏమాత్రం తగ్గదనేది ఎవరయినా వూహించగలిగిందే. ఐరాస ఆమోదం గానీ మరే సాకు అయినా గానీ ఈ పరిస్థితిని ఏ క్షణంలోనైనా మార్చవచ్చు. బ్రిటన్ పార్లమెంటు యుద్ధానికి అనుమతినివ్వకపోయినా తాను మాత్రం బషర్ అల్ అస్సద్ పాలనను శిక్షించడానికి దాడిలో పాల్గొనడానికి సిద్ధం అని నయాఫాసిస్టు ఫ్రాన్స్‌వా హోల్యాండ్ నాయకత్వంలోని ఫ్రాన్స్ ప్రకటించింది. బ్రిటన్ పార్లమెంట్ కెమరూన్ ప్రతిపాదనను తిరస్కరించడానికి కారణం కూడా అస్సద్ ప్రభుత్వం విషవాయువును ఉపయోగించింది అనడానికి తగిన ఆధారాలు లేవనే అంటే దాడిని న్యాయసమ్మతం చేసి, మిత్రదేశాలను కలుపుకురావడానికి ఆధారాలు లేవనే. అమెరికాలో డెమాక్రాట్లూ, రిపబ్లికన్ ల తీరూ అంతే. సామ్రాజ్యవాద దేశాల్లోని పాలక, ప్రతిపక్ష పార్టీలకు (గుత్త పెట్టుబడిదారులూ, వారి తైనాతీలూ) ఏ దేశం పైన అయినా 'దాడి చేయడానికి' తమకున్న 'హక్కు'పై ఎటువంటి ప్రముఖ వివాదాలూ ఎన్నడూ లేవు. తమ దేశ భవిష్యత్తును నిర్ణయించుకునే హక్కు ఆ దేశ ప్రజలకు మాత్రమే ఉంటుందనీ, ఇతర దేశాలకు గానీ శక్తులకు గానీ ఉండదు అనే వాస్తవం విషయంలో అక్కడ ఎన్నడూ ఏ చర్చా జరగదు. ఎప్పటిలాగే సామ్రాజ్యవాద దేశాధినేతలు తమ దేశాల్లోనూ, ప్రపంచవ్యాప్తంగానూ దురాక్రమణ యుద్ధాలకు వ్యతిరేకంగా వెల్లువెత్తుతున్న ప్రజాభిప్రాయాన్నీ, నిరసననూ పట్టించుకోకుండా తమ అజెండాను దూకుడుగా కొనసాగిస్తున్నారు.

ఐరాస దాని గత సంప్రదాయాల ప్రకారమే సిరియా విధ్వంసానికి అవసరమైన సాకులను వెతికిపెట్టడానికి ప్రయత్నిస్తోంది. దాని పుట్టుక నుండి మొదలుపెడితే సామ్రాజ్యవాద దురాక్రమణ యుద్ధాలలో దాని మిలాఖత్ ల జాబితా పొడువాటిదే. తటస్థంగా ఉంటున్నట్టుగా కనిపించడానికి అది వేసుకునే ముసుగు ఎప్పుడో పీలికలు చీలికలైపోయి సామ్రాజ్యవాదులకు, ప్రత్యేకించి అమెరికాకు దాని దాసోహాన్ని బయటపెడుతోంది. వివిధ సామాజిక వ్యవస్థలు గల దేశాల మధ్య సంబంధాల్లో ఉండాల్సిన ఐదు సూత్రాలు – ప్రాంతీయ సమగ్రత, సార్వభౌమత్వాల విషయంలో పరస్పర గౌరవం పరస్పరం దురాక్రమించుకోకపోవడం ఒకరి అంతర్గత వ్యవహారాల్లో మరొకరు జోక్యం చేసుకోకపోవడం సమానత్వం పరస్పరం సహకారం శాంతియుత సహజీవనం – అమలుకు హామీగా ఈ సంస్థ నిలవాల్సి ఉన్నది. అది మానవహక్కులను పరిరక్షించాలి, దురాక్రమణ యుద్ధాలను ఆపాలి, దేశాల మధ్య వివాదాలను దౌత్యపరంగా, ఇతరత్రా పద్ధతుల్లో పరిష్కరించాలి. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత యుద్ధాలను నివారించడానికి సామ్రాజ్యవాద దేశాలు సహా ప్రపంచ దేశాలన్నీ రూపొందించిన నియమాలు నిబంధనల ప్రకారం కూడా (వీటిని ఐరాస అమలు చేయాలి) రసాయన ఆయుధాల వాడకం

వంటి నీచమైన నేరాల సమస్యను పరిష్కరించడానికి అన్ని రకాల దౌత్యపరమైన, రాజకీయ చర్చలు/చర్యలు చేపట్టాల్సి ఉంటుంది. కానీ 'సిరియా సంక్షోభాన్ని' పరిష్కరించడానికి రాజకీయ, దౌత్యపరమైన మార్గాల్ని అన్వేషించాలి అనేలాంటి మొండికత్తి పడికట్టు మాటలు మాట్లాడ్డం, 'దాడికి ఐరాస ఆమోదాన్ని పొందు బాబూ' అని ఒబామాను వేడుకోవడం తప్ప ప్రధానంగా ప్రపంచ శాంతికి హామీగా నిలవడం కోసం ఏర్పడిన ఈ అంతర్జాతీయ సంస్థ దురాక్రమణను ఆపడానికి దాదాపుగా ఏమీ చేయడం లేదు. ఒబామా ఎంత నిస్సిగ్గుగా తన దురాక్రమణ పథకాన్ని దూకుడుగా ముందుకు తోస్తున్నాడంటే 'జీ హుజూరు' ఐరాసకు కూడా దాన్ని ఈ దుర్మార్గమైన రూపంలో సమర్థించడం కష్టమైపోతోంది!

నోబెల్ 'శాంతి' బహుమతి విజేత, రక్తపిపాసి, మానవుల, నాగరికతల విధ్వంసకుడు అయిన తమ అధ్యక్షుడు సిరియాపై దాడి చేయాలని రంకెలు వేస్తున్న సమయంలోనే అమెరికా దేశం మార్టిన్ లూథర్ కింగ్ చేసిన 'నాకో కల ఉంది' అనే ఉపన్యాసం 50వ వార్షికోత్సవాన్ని జరుపుకోవడం ఒక విరోధాభాస. ఒబామా ఇంకేమీ సాధించకున్నా వైట్ హౌస్ లో ఒక ఆఫ్రికన్-అమెరికన్ ఉన్నంత మాత్రాన నల్లవారు సహా పీడిత ప్రజల 'కలలు' నెరవేరడానికి హామీ ఉన్నట్టు కాదని కనీసం నిర్ద్వంద్వంగా రుజువు చేసేశాడు. అమెరికా ప్రపంచాధిపత్య అజెండాను ఒబామా గతంలోని కొందరు 'తెల్ల' అధ్యక్షులతో సమానంగా లేదా మరింత ఎక్కువ దూకుడుతో, ఉత్సాహంతో ముందుకు తీసుకుపోతున్నాడు. వారంతా తమ, తమ పాలనల్లో ప్రపంచవ్యాప్తంగా లక్షలాది ప్రజలను, పీడిత దేశాలను నాశనం గావించారు, అసంఖ్యాకమైన నగరాలనూ, గ్రామాలనూ నేలమట్టం గావించారు. ప్రజలను తాత్కాలికంగానే అయినప్పటికీ మోసం చేయడానికి అమెరికా పాలకవర్గాలకు ఇతగాడు 'తెల్ల' వారికంటే ఎక్కువ ఉపయోగకరంగా ఉన్నాడనేది స్పష్టమే.

1986 నుండి, ప్రత్యేకించి దాని ట్విన్ టవర్స్ పై 9/11 దాడి తర్వాత నుండి సిరియా కూడా ప్రపంచ భద్రతకు ముప్పుగా ఉంటోందనీ, ఎందుకంటే అది 'టెర్రరిస్టు' గ్రూపులకు మద్దతు ఇస్తోందనీ అమెరికా ఒకదాని తర్వాత ఒకటిగా దానిపై ఆరోపణలు దాఖలు చేస్తూ వస్తోంది. ఆ విధంగా అది దాన్ని ఏదో ఒక పద్ధతిలో టార్గెట్ చేస్తూ వస్తోంది. గత రెండున్నర ఏండ్లుగా సిరియా సామ్రాజ్యవాద దేశాలకు ఆటస్థలంగా మారిపోయింది. అస్సద్ గద్దె దిగాలని డిమాండ్ చేస్తూ అక్కడొక ఉద్యమం ఊపందుకుంది. 'తిరుగుబాటు' దళాలకూ, ప్రభుత్వ బలగాలకూ మధ్య అసంఖ్యాకమైన సాయుధ ఘర్షణలు జరిగి లక్షలాది ప్రాణాలు గాలిలో కలిశాయి, పెద్దెత్తున ఆస్తులు ధ్వంసమైనాయి, లక్షలాది మంది వలసపోయారు. అమెరికా నేతృత్వంలోని సామ్రాజ్యవాదులూ, అరబ్ ప్రపంచంలోని వారి కీలుబొమ్మ ప్రభుత్వాలూ దౌత్యపరంగా, రాజకీయంగా కుయుక్తులు పన్నుతూ, ప్రతిపక్షానికి ఆర్థికంగా, మిలటరీపరంగా, సాంకేతికంగా మద్దతునిస్తూ వారికి పెద్దెత్తున ఆయుధాలు పంపిస్తూ, శిక్షణనిస్తూ వారికి

మార్గదర్శకత్వం వహిస్తున్నారు. వారు అస్సద్ గద్దె దిగాలనీ, తమ కీలుబొమ్మలు అధికారంలోకి రావాలనీ  కోరుకుంటున్నాం చాలా స్పష్టంగానే పేర్కొంటున్నారు. రష్యా, చైనాలు అస్సద్ ప్రభుత్వానికి నేటివరకూ నిరంతరాయంగా మద్దతునిస్తూ సిరియాలో ఎటువంటి సామ్రాజ్యవాద చొరబాటును గానీ, దాడిని గానీ వ్యతిరేకిస్తూ వస్తున్నాయి. కార్పొరేట్ మీడియా కూడా అస్సద్ కు సిరియన్లలో గణనీయమైన మద్దతు వుందని అయిష్టంగానైనా ఒప్పుకోక తప్పని స్థితి. లిబియాపై చేసినట్టే సిరియా పైనా దాడి చేయాలని సామ్రాజ్యవాదులు ఉవ్విళ్లూరినప్పటికీ చేయలేకపోవడానికి రష్యా, చైనా, లెబనాన్, ఇరాన్ లనుండి అస్సద్ కు లభిస్తున్న కీలకమైన మద్దతే కాక ఇది కూడా ఒక కారణం. నిజానికి, ఇటీవలే తిరుగుబాటుదార్ల బలమైన స్థావరాల్లో వారిపై అస్సద్ బలగాలు పైచేయి సాధించాయని కూడా వార్తలు వచ్చాయి. అందుకనే సామ్రాజ్యవాదులు సిరియాపై వీలైనంత త్వరగా దాడి చేయాలని చూస్తున్నారు.

తమ దేశంలోని ఏ పరిపాలననైనా కొనసాగనిచ్చే లేదా కూలదోసే హక్కు కేవలం ఆ దేశ ప్రజలకే ఉంటుందనే వైఖరిని మా పార్టీ సిపిఐ (మావోయిస్టు) ఎల్లప్పుడూ ప్రకటిస్తూ వచ్చింది. అస్సద్ అధికారంలో వుండాలా లేదా అనే విషయం సిరియా ప్రజలు నిర్ణయించుకుంటారు. తిరగబడడానికీ, తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవడానికీ వారికి అన్ని హక్కులూ ఉన్నాయి. కానీ సిరియా అంతర్గత వ్యవహారాల్లో అవాంఛనీయ సామ్రాజ్యవాద జోక్యం వల్ల, ఆ దేశపు భవిష్యత్తుకు ఇప్పటికే గొప్ప ముప్పు వాటిల్లింది. బహుశా అది వారి చేతుల్లో రాబోయే చాలాకాలం వరకూ  ఉండకపోవచ్చు.

అరబ్ వసంతం తర్వాత ఈజిప్టు వంటి దేశాల్లో ఇటీవల జరుగుతున్న పరిణామాలు సామ్రాజ్యవాదులు, ప్రత్యేకించి అమెరికా సామ్రాజ్యవాదులు తమ కీలుబొమ్మ ప్రభుత్వాలను ఎలా అధికారంలోకి తీసుకురావాలని భావిస్తారనేదాన్ని అక్షరాలా సూచిస్తున్నాయి. రాజీవాద శక్తే అయినప్పటికీ మోర్సీని ఎటువంటి మర్యాదలూ పాటించుకుండా గద్దె దింపి పారేశారు. ఎందుకంటే అతను తమ విదేశీ వ్యవహారాల్లో కొన్ని అమెరికా జోక్యాల్ని వ్యతిరేకించాడు. అతన్ని మిలటరీ జైల్లోకి తోసింది. మిలటరీ పాలనను వ్యతిరేకించే ప్రజల ఊచకోతలు అక్కడ రోజువారీగా జరిగిపోతున్నాయి. మోర్సీని అధికారంలోకి తెచ్చిన బ్రహ్మాండమైన ప్రజావెల్లువ, లాంఛనప్రాయమైన ప్రజాస్వామిక ప్రక్రియ, దానిలో ఎన్ని లోపాలు ఉన్నప్పటికీ, నేడు అమెరికా మద్దతు గల మిలటరీ ఉక్కుపాదాల కిందా, గత అధ్యక్షునికి చెందిన బలగాల పాదాల కిందా నలిగిపోతున్నాయి. అరబ్ వసంతంలో భాగంగా తమ పాత నిరంకుశ పాలనల్ని కూలదోసిన దాదాపు అన్ని దేశాల్లోనూ ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్షలు ఏవైప్పటికీ సామ్రాజ్యవాద అనుకూల కీలుబొమ్మ ప్రభుత్వాలో లేక రాజీవాద శక్తులో అధికారంలోకి వచ్చాయి. తమ తమ దేశాల్లోని నిరంకుశ పాలనలను సవాలు చేసి వాటిని మార్చాలనుకనే ఏ శక్తులకైనా ఇది ఒక కనువిప్పుగా ఉండాలి. వారు ఎట్టి పరిస్థితుల్లోనూ సామ్రాజ్యవాదుల కుయుక్తులకు ఉపయోగపడరాదు.

అది ఒక నియంత స్థానంలో మరొకడు రావడానికీ, లేదా మరింత నిరంకుశుడు రావడానికీ దారి తీస్తుంది, ఆ వచ్చేవాడు తప్పక సామ్రాజ్యవాదులకు దాసోహమయ్యేవాడుగానే ఉంటాడు. సిసలైన ప్రజాస్వామ్యాన్ని కోరుకుని నిరంకుశ పాలనల్ని వ్యతిరేకించే శక్తులేవైనా గానీ తమ స్వశక్తి మీద ఆధారపడుతూ, ప్రజల్ని సమీకరిస్తూ, ప్రపంచ ప్రజల మద్దతుతో స్వతంత్రంగా ఆ పని చేయాలి. వారు సామ్రాజ్యవాదులతో చేతులు కలపరాదు. అలా చేస్తే నేడు ఈజిప్టులోనూ, ప్రపంచంలోని ఇతర ప్రాంతాల్లోనూ జరుగుతున్నట్టే అధికారంలోకి వచ్చే సామ్రాజ్యవాదుల తైనాతీలతో ప్రజలు మరోసారి పోరాడడానికి నెట్టబడతారు.

రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత నుండి వియత్నాంలో జాతి విముక్తి యుద్ధం విజయవంతం అయ్యేవరకూ, అమెరికా దురాక్రమణ యుద్ధాలు చేయడానికి ప్రధానంగా చూపిన సాకు 'కమ్యూనిజం వ్యాప్తిని ఆపడం.' సోవియట్ యూనియన్ పతనంతో, అది తరచుగా చూపిస్తున్న సాకు 'మానవ హక్కుల ఉల్లంఘన' లేదా 'టెర్రరిజం' లేదా రెండూ. ఒకోసారి అది దీనికి 'ప్రజాస్వామ్య పునరుద్ధరణ' లేదా 'స్వాతంత్ర్యాన్ని ఇవ్వడం' అనే ముసుగులు వేస్తున్నది. కానీ ప్రతి సందర్భంలోనూ వాటి వెనుక ఉండిన/గల అసలు కారణం ప్రపంచాధిపత్యానికై దాని దాహం. ఫ్రాన్స్, బ్రిటన్ లు గానీ లేదా మునుపటి అగ్రరాజ్యమైన యుఎస్ఎస్ఆర్ గానీ చేసిన వివిధ దురాక్రమణ యుద్ధాల వెనుక గల కారణం కూడా ఇదే.

దాడికి కారణంగా చూపుతున్న రసాయన ఆయుధాల వాడకం అనేదాన్ని అస్సద్ ప్రభుత్వం బలంగా ఖండించింది. వాటిని వాడింది తిరుగుబాటుదార్లే అని అది బలంగా వాదిస్తోంది. రసాయన ఆయుధాల వాడకాన్ని, అది ప్రభుత్వం ద్వారా గానీ, తిరుగుబాటుదారుల ద్వారా గానీ, ఎవరూ సమర్థించరు. తిరుగుబాటుదారులు వాటిని వాడారు అనే ఆరోపణ నిజమైతే కనుక నిస్సందేహంగా సామ్రాజ్యవాదులే వారికి విషపూరిత సారిన్ గ్యాస్ ను సప్లై చేసి ఉంటారు. రెండేళ్లు దాటిపోతున్నా అస్సద్ ఓడిపోవడం లేదు కనుక, సారిన్ గ్యాస్ వాడకం గురించి అన్నిటికంటే నమ్మదగిన వివరణ వారు వాటని ఉపయోగిస్తే ఆ సాకుతో అమెరికా సిరియాపై దాడి చేయడానికుంటుంది కనుక దాన్ని వారికి అమెరికా సామ్రాజ్యవాదులు సప్లై చేసి ఉంటారనేదే. రసాయన ఆయుధాలను వాడడం అనే 'ఎర్రగీత'ను దాటవద్దని సిరియాను ఒబామా గతంలో హెచ్చరించిన విషయం గుర్తు చేసుకుంటే, ఆ 'ఎర్రగీత'నే సరిగ్గా దాడికి సాకుగా ఉపయోగించుకుంటారనేది వూహించచ్చు.

అన్నిటికంటే ఆశ్చర్యకరం ఏంటంటే అమెరికా సామ్రాజ్యవాదులు 'దొంగే దొంగా దొంగా' అన్నట్టు అరవడం. ఎందుకంటే వియత్నాంలో గానీ, ఇరాక్ లోగానీ ఇతర ప్రాంతాల్లో గానీ అత్యంత వినాశకరమైన రసాయన ఆయుధాలను (నాపాం, ఏజెంట్ ఆరంజి, వైట్ ఫాస్పరస్ వంటివి వాటిలో కొన్నే) వాడిన దుర్మార్గమైన చరిత్ర ఉన్నది అమెరికా సామ్రాజ్యవాదులకే.

1915 నుండి 1918 దాకా జరిగిన భయంకరమైన రసాయన యుద్ధం వల్ల లీగ్ ఆఫ్ నేషన్స్ 1925 నాటి జెనీవా ప్రొటోకాల్ ను ఆమోదించింది. ఇది జీవ, రసాయన ఆయుధాల వాడకాన్ని నిషేధించింది. అమెరికా ఇటువంటి ఒప్పందాన్ని ప్రతిపాదించి, దాని తయారీలో భాగం అయినప్పటికీ, 1926లో అమెరికా సెనేట్ దాన్ని ఆమోదించలేదు. 1970లో దీన్ని సెనేట్ కు తిరిగి పంపినప్పుడు కూడా నాలుగు సంవత్సరాల తర్వాత గానీ దాన్ని ఆమోదించలేదు. అమెరికా ఆయుధాల తగ్గింపుకు సంబంధించిన అన్ని విషయాల్లో ఈనాటి వరకూ కూడా అనుసరిస్తూ వస్తున్న రెండు నాల్కల ధోరణికి ఇదో మచ్చుతునక. ఈనాటి వరకూ అమెరికా గానీ, ఇతర ప్రముఖ సామ్రాజ్యవాద శక్తులు గానీ క్లస్టర్ బాంబులు, జీవ-రసాయన ఆయుధాలు, అణ్వాయుధాలు మొదలైన అత్యంత వినాశకరమైన ఆయుధాలను పూర్తిగా నిషేధించడానికి సిద్ధంగా లేనే లేవు. మరి, వారిప్పుడు సిరియా గురించి ఎందుకు మాట్లాడుతున్నారు? ఈ గోలంతా తమ ప్రయోజనాల కోసం సిరియాపై గానీ, ప్రపంచంలోని ఇతర ప్రాంతాల్లో గానీ మరింత వినాశకరమైన ఆయుధాలను వాడడం కోసమే అయ్యి వుండాలి.

యుద్ధపిపాసులైన సామ్రాజ్యవాదులే నేరుగా గానీ, పరోక్షంగా గానీ రసాయన ఆయుధాలను అభివృద్ధి చేసి వెనుకబడిన దేశాల్లో సామాన్య ప్రజానీకంపై వాడడానికీ, తమ శత్రుదేశాలపై ప్రయోగించడానికీ తమ తైనాతీలకు, నియంతలకు లేదా పాలకుల్ని మార్చడానికి విప్లవ ప్రతీఘాతుక శక్తులకూ సప్లై చేస్తున్నారు. సామాన్య ప్రజానీకంపై విచక్షణారహితంగా వినాశకర ఆయుధాలను వాడడమే కాక సామ్రాజ్యవాదులు, ప్రత్యేకించి అమెరికా సామ్రాజ్యవాదులూ, ఇజ్రాయెలూ తమ ఆదేశాల్ని ఖాతరు చేయని దేశాధినేతల్ని లేదా సంస్థల ప్రముఖుల్నీ హత్య గావించడానికి కూడా వాటిని వాడేందుకు వెనుకాడింది లేదు. మొత్తం ప్రపంచంలో జీవ, రసాయన ఆయుధాల వాడకానికి అందరికంటే ముందుగా బోనెక్కాల్సింది ఎవరైనా వుంటే అది అమెరికా సామ్రాజ్యవాదులూ, దాని నేతృత్వంలోని లేదా దానితో చేతులు కలిపిన సామ్రాజ్యవాద బందిపోట్లే.

పశ్చిమాసియాలో తమ భౌగోళిక-రాజకీయ ప్రయోజనాల కోసం అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, ఇజ్రాయెల్ కూటమీ, టర్కీ లు సిరియాలో ఒక కీలుబొమ్మ ప్రభుత్వాన్ని కోరుకుంటున్నాయనేది తేటతెల్లమే. సిరియా నెలకొని ఉన్న ప్రదేశానికున్న వ్యూహాత్మక ప్రాధాన్యత రీత్యానూ, ఆ దేశంలోని ప్రకృతి వనరులు, ప్రత్యేకించి చమురు రీత్యాను వారు దాన్ని కోరుకుంటున్నారు. తద్వారా గతంలో యుఎస్ఎస్ఆర్/సిఐఎస్ లో భాగంగా ఉండిన మధ్య ఆసియా దేశాల్లోని చమురు, ఇతర సంపదలపై అదుపు సాధించడం కోసం వాటిలోకి చొరబడడానికి కూడా వారికి దారి సుగమం అవుతుంది. పెరుగుతున్న రష్యా, చైనాల ప్రాబల్యానికి ఇది గట్టి సవాలుగా నిలిచి, అమెరికా జూనియర్ పార్ట్నర్ అయిన ఇజ్రాయెల్ ఆధిపత్యాన్ని పశ్చిమాసియాలో మరింతగా నెలకొల్పడానికి ఇది దోహదపడుతుంది. 1967 నాటి 'ఆరు రోజుల యుద్ధం' నాటి నుండి

సిరియాలోని గోలాన్ హైట్స్ ను ఇజ్రాయెల్ ఆక్రమించుకుని, 1973 నాటి 'అరబ్-ఇజ్రాయెల్ యుద్ధం' నాటి నుండి అక్కడే శాశ్వతంగా తిష్ట వేసింది. అది ఆ ప్రాంతాన్ని వదులుకోదల్చుకోలేదు. క్యాంపు డేవిడ్ ఒప్పందాల్లో ద్రోహానికి గురైన సిరియా గోలాన్ హైట్స్ ను తనకు బేషరతుగా అప్పగించాలని డిమాండ్ చేస్తూనే వుంది.

పశ్చిమాసియాలో అమెరికా-ఇజ్రాయెల్ సామ్రాజ్యవాద జోక్యాలనూ, కుతంత్రాలనూ సిరియా నిరంతరాయంగా వ్యతిరేకిస్తూ వస్తోంది. పాలస్తీనా ఆకాంక్షను కూడా సిరియా క్రమం తప్పకుండా సమర్థిస్తూ వస్తోంది. హిజ్‌బుల్లా (లెబనాన్)కూ, పాలస్తీనా ఆకాంక్షకూ అస్సద్ ఇస్తున్న మద్దతునూ, ఇజ్రాయెల్ ను అతను తీవ్రంగా వ్యతిరేకించడాన్నీ కూడా సామ్రాజ్యవాదులు ఈ దాడితో మొద్దుబార్చదలిచారు. అలాగే ఈ దాడి ఆ ప్రాంతంలో అమెరికా-ఇజ్రాయెల్ ఆధిపత్య ప్రయోజనాలను నిరంతరాయంగా వ్యతిరేకిస్తూ, ప్రస్తుతం సిరియాపై దాడికి జరుగుతున్న ప్రయత్నాలను తీవ్రంగా వ్యతిరేకిస్తూ లొంగుబాటుని ప్రదర్శించని ఇరాన్ కు కూడా మరోసారి పెద్ద హెచ్చరికగా నిలుస్తుంది, అంటే ఒకటే దెబ్బకు రెండు పిట్టలు.

మొదటి, రెండవ ప్రపంచ యుద్ధాల్లో ఏదేని ఒక ప్రాంతంలో జరిగిన విధ్వంసం కంటే రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత ప్రత్యర్థి సామ్రాజ్యవాద క్యాంపులు రెచ్చగొట్టిన లేదా మద్దతు పలికిన దురాక్రమణ యుద్ధాల్లో, పరోక్ష యుద్ధాల్లో జరిగిన విధ్వంసమే ఎక్కువ. సుదూర సముద్ర ప్రాంతాల నుండి వేసే లాంగ్ రేంజి మిస్సైల్స్, విమానాల ద్వారా ఎత్తైన ప్రదేశాల నుండి చేసే బాంబింగ్ లు టార్గెట్ చేసిన ప్రాంతంలో నేల మీద ఉన్న ప్రతి ఒక్కదాన్నీ - మనుషులనూ, వస్తువులనూ అన్నిటినీ ధ్వంసం చేసి పారేస్తున్నాయి. విచక్షణారహితంగా, దుర్మార్గంగా రోజువారీగా చేస్తున్న డ్రోన్ దాడులు చరిత్రలో మునుపెన్నటికన్నా ఎక్కువ పౌరమరణాలకు దారి తీశాయి. ఈ దురాక్రమణ యుద్ధాలు అత్యంత విలువైన ప్రాచీన నాగరికతల వారసత్వాన్నీ, నేటి తరాల జీవితాలనూ ధ్వంసం చేయడమే కాక, రాబోయే అనేక తరాల భవిష్యత్తును కూడా ధ్వంసం చేస్తున్నాయి. అనేక సందర్భాల్లో జరుగుతున్న విధ్వంసం తిరిగి బాగుచేయలేనిదిగా వుంటోంది.

సిరియాలో అమాయక స్త్రీలు, పిల్లలు, పౌరులు విషవాయువు వల్ల ప్రాణాలు కోల్పోయారనీ, ఇకనెంత మాత్రం దీన్ని సహించరాదనీ నయాహిట్లర్ ఒబామా అంటున్నాడు. నిజమే, అమాయకులు ప్రాణాలు కోల్పోడాన్ని మనం సహించరాదు. కానీ పాకిస్తాన్, యెమెన్, ఆఫ్ఘనిస్తాన్ మొదలైన ప్రాంతాల్ల అమెరికా డ్రోన్ దాడుల్లో చనిపోతున్న అమాయక స్త్రీలు, పిల్లలు, పౌరులకు కూడా ఇదే విషయం వర్తిస్తుందనేది సామాన్య తర్కం కాదా? వలసకాలంలోనూ, తర్వాతా అసంఖ్యాకమైన వెనుకబడిన దేశాల్లో సామ్రాజ్యవాదులు గతంలో చేసిన అత్యాచారాలన్నిటినీ వదిలేసినా, ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్, పాలస్తీనాలలో మరణించిన లక్షలాది అమాయకుల సంగతేమిటి?

వారి గురించి ఎల్లప్పుడూ ఒక కుట్రపూరితమైన మౌనం రాజ్యమేలుతుంది ఎందుకు?

మన భూమిని ఎన్నోసార్లు సంపూర్ణంగా నాశనం చేయగల అణ్వాయుధాలు సహా కుప్పలు తెప్పలుగా మారణాయుధాలుగల అమెరికా, వాటిని ఎప్పుడైనా ఎక్కడైనా ఉపయోగించడానికి వెనుకాడని అమెరికా, 'మానవ హనన ఆయుధాలు' ఉన్నాయనే సాకుతో ఇరాక్ పై దాడి చేయడం ఒక క్రూర పరిహాసం. మరో తలకిందులు విషయం ఏంటంటే జపాన్ లోని హిరోషిమా, నాగసాకీలపై అణుబాంబును వేసిన అమెరికా ఇప్పుడు ఇరాన్ అభివృద్ధి చేయగల అణ్వాయుధాల గురించి ఇంతగా గగ్గోలు పెట్టడం. లిబియాపై దాడి చేసి గడాఫీని చంపడానికైతే సామ్రాజ్యవాదులు కనీసం ఒక 'కారణం' లాంటిదాన్ని చూపించేంత శ్రమ కూడా తీసుకోలేదు. గమనించాల్సిందేంటంటే ఇరాక్ లో మానవ హనన ఆయుధాలు దొరికిందే లేదు ఇరాన్ కు అణ్వాయుధాలు ఉత్పత్తి చేసే హక్కు ఉన్నప్పటికీ, అక్కడి ప్రభుత్వం పదేపదే తమకు అలాంటి వుద్దేశం లేదని ఇప్పటికీ ప్రకటిస్తూనే వుంది ఇక సిరియా ప్రభుత్వం తాను రసాయన ఆయుధాలను ప్రయోగించలేదని ఈనాటికీ వాదిస్తూనే ఉంది.

ఇదంతా చూస్తుంటే గొర్రెపిల్ల పైన నీళ్లు తాగినా, కింద నీళ్లు తాగినా, దాని తలరాత ప్రకారం దాన్ని తినక తప్పదు అన్న తోడేలు గురించిన సృజనాత్మకమైన జానపద కథ గుర్తుకురాక మానదు. గొర్రెపిల్లగా పుడితే చాలు తోడేలు తినక తప్పదు అన్నట్టు వనరులు సమృద్ధిగా వుంటేనో లేక వ్యూహాత్మకమైన భౌగోళిక ప్రాంతంలోనో వుంటే చాలు ఆ దేశాలు దురాక్రమణకు గురి కావల్సిందే. ఇది తోడేలులాంటి జంగల్ న్యాయంతో కూడిన సామ్రాజ్యవాద ప్రపంచాధిపత్య దాహం తప్ప మరేం కాదు. నయానాజీలు దురాక్రమణ యుద్ధాలకు కారణాలుగా మన మొహాన కొడుతున్న మానవహక్కుల ఉల్లంఘనల సాకులన్నీ వనరులకై వారి దాహం, ప్రపంచాధిపత్యానికై నగ్నపోటీ తప్ప మరేమీ కాదని ప్రపంచ ప్రజలు గుర్తించాలి.

ప్రపంచ పెట్టుబడిదారీ విధానం సర్వస్వాన్నీ చుట్టుముట్టిన తీవ్ర సంక్షోభంలో కూరుకునిపోయి ఉంది. దీని నుండి బయటపడ్డానికి బెయిల్ అవుట్ లివ్వడం, సమృద్ధిగా వనరుల గల వెనుకబడిన దేశాలను మరింతగా నిర్దాక్షిణ్యంగా లూటీ చేయడంతో పాటు దురాక్రమణ యుద్ధాలకు కూడా సామ్రాజ్యవాదులు పాల్పడుతున్నారు. అయితే సంక్షోభాన్నిండి బైటపడ్డానికి చేసే ఈ ప్రయత్నాలన్నీ వారిని మరింతగా సంక్షోభంలోకే నెట్టివేస్తున్నాయి. సామ్రాజ్యవాదులు తాము సంపదలను పోగుచేసుకుంటున్నామని అనుకుంటున్నారు గానీ వారు తమ దురాక్రమణలు, లూటీల ద్వారా నిజానికి పోగుచేసుకుంటున్నదంతా పీడిత ప్రజల ఆగ్రహాన్నీ, ద్వేషాన్నీ మాత్రమే. దురాక్రమణ యుద్ధాలు అంతిమంగా తమను అధికారం నుండి కూలదోయడానికే దారి తీస్తాయనే చరిత్ర పాఠాన్ని ఈ మూర్ఖులు నేర్చుకోలేదు. సిరియాపై దురాక్రమణ యుద్ధం సుదీర్ఘకాల గొంతులోతు ఆర్థిక, రాజకీయ సంక్షోభం నుండి బైటపడడానికి ఏమాత్రం దోహదపడకపోగా, వారిని మరింత

లోతైన సంక్షోభంలోకే నెట్టడం ఖాయం. ప్రపంచవ్యాప్తంగా ఆకాశాన్నంటుతున్న చమురు ధరలు, అల్లకల్లోలం అవుతున్న మార్కెట్లూ, అత్యంత వేగంగా పడిపోతున్న మన రూపాయి సహా అనేక వెనుకబడిన దేశాల కరెన్సీలు వేగంగా పడిపోవడం వంటివి ఇప్పటికే జరుగుతున్న ఆ పరిణామానికి సూచికలే.

తమ దేశంపై జరిగే ఎటువంటి సామ్రాజ్యవాద దురాక్రమణనైనా మేం తీవ్రంగా ఎదిరిస్తాం అని సిరియా అధ్యక్షుడు బషర్ అల్ అస్సద్ ప్రకటించాడు. సిరియా విదేశాంగ మంత్రి సామ్రాజ్యవాద దురాక్రమణను ఎదిరించి పోరాడడానికి సర్వసన్నద్ధంగా ఉన్నామనీ, మూడవ ప్రపంచ యుద్ధానికి దారి తీసినా కూడా దురాక్రమణదారులను ఓడించేదాకా విశ్రమించమనీ ధిక్కారస్వరంతో ప్రకటించాడు. సిరియా ప్రభుత్వం అమెరికా మిలటరీ దాడిని వ్యతిరేకించమనీ, ఈ సంక్షోభాన్ని శాంతియుతంగా పరిష్కరించమనీ ఐరాసకు కూడా పదేపదే విజ్ఞప్తి చేస్తూ వస్తోంది. సిరియా ప్రజలు ధిక్కారంగా ఉంటూ, ప్రాణాలకు తెగించి దాడిని ఎదిరించడానికి తమను తాము సన్నద్ధం చేసుకుంటున్నారు.

అస్సద్ ఎటువంటి సామ్రాజ్యవాద దురాక్రమణనైనా ఎదిరిస్తామని ప్రకటించినప్పటికీ, ప్రజలందరినీ సమీకరించి, వారిపై ఆధారపడినప్పుడే అది విజయవంతమవుతుంది. ప్రజలకు ప్రజాస్వామ్యం ఉన్నప్పుడే ఏ పాలకులైనా ప్రజలను సమీకరించడం గానీ, సామ్రాజ్యవాద దురాక్రమణకు వ్యతిరేకంగా వారి మద్దతును పొందడం గానీ సాధ్యం అనేది కూడా అంతే సత్యం. బషర్ తండ్రీ, మునుపటి సిరియా అధ్యక్షుడూ అయిన హఫెజ్ అల్ అస్సద్ ఇరాక్ పై సామ్రాజ్యవాద దురాక్రమణలో పాలుపంచుకుంటూ అక్కడకు బలగాలను పంపించాడు. 2005 వరకూ కూడా సిరియా బలగాలు లెబనాన్ లో వుండినాయి. సిరియా తమ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటోందని లెబనాన్ ఆరోపించింది. తన స్వంత ప్రయోజనాల కోసం గానీ, సామ్రాజ్యవాద వత్తిళ్లకు లొంగి గానీ వేరే దేశాల్లో జోక్యం కలిగించుకునే హక్కు గానీ, బలగాలను పంపే హక్కు గానీ తమకు లేదని వెనుకబడిన దేశాల పాలకులు ఈ సందర్భంగా మరోసారి గుర్తించాలి. ఇతర దేశాల్లోగానీ, తమ దేశంలో గానీ సామ్రాజ్యవాద జోక్యాన్నీ, దురాక్రమణనూ రాజీలేకుండా దృఢంగా ఎదిరించడం అనేది మాత్రమే సామ్రాజ్యవాదులను ఎదిరించడంలో తమ స్వంత ప్రజల, ప్రపంచ ప్రజల మద్దతును సంపాదించి పెట్టగల్గుతుంది.

దాడి నిర్ణయం తీసుకోవడానికి ఐరాస ఇనస్పెక్టర్లు తమ ఫలితాలను వెల్లడించేవరకూ ఆగాలని భారత ప్రభుత్వం ప్రకటించింది. ఐరాస ఆమోదం వుంటే కనుక సిరియాపై దాడికి దానికి నిజానికి ఏ అభ్యంతరమూ లేదు. వాస్తవం ఏంటంటే భారత ప్రభుత్వం ఇటు అమెరికాను గానీ, అటు రష్యాను గానీ వ్యతిరేకం చేసుకోదల్చుకోలేదు. అందుకే అది యెటైనా గెంతడానికి వీలుగా గోడ మీద కూచుంది. అది ఐరాస ఆమోదం వున్నా లేకున్నా సిరియాలో ఏ

దురాక్రమణదారు దేశం గానీ, అలాంటి దేశాల కూటమి గానీ చేసే ఎటువంటి మిలటరీ జోక్యాన్నైనా నిర్ద్వంద్వంగా వ్యతిరేకించడం లేదు. గతంలో దురాక్రమణ యుద్ధాలు జరిగిన అనేక సందర్భాల్లో సామ్రాజ్యవాదులకు సాష్టాంగపడిన లేదా గోడ మీద పిల్లి వాటంగా వుండిన దాని చరిత్రను గమనించినప్పుడు ఇదేం ఆశ్చర్యకరం కాదు, కేవలం అసహ్యించుకోదగినదీ, ఆగ్రహించదగినదీ మాత్రమే.

సిరియాపై దాడి చేయడానికి అమెరికా నేతృత్వంలోని సామ్రాజ్యవాదులు చేసే ఎటువంటి ప్రయత్నాన్నైనా సిపిఐ (మావోయిస్టు) కేంద్రకమిటీ నిర్ద్వంద్వంగా ఖండిస్తూ, అటువంటి ప్రయత్నాలన్నిటినీ తక్షణం నిలిపివేయాలని డిమాండ్ చేస్తున్నది. సామ్రాజ్యవాద జోక్యానికీ, ప్రతిపాదిత దురాక్రమణకూ వ్యతిరేకంగా సిరియా ప్రజలు చేసే అన్ని రకాల ప్రతిఘటనకూ అది తన సంపూర్ణమైన మద్దతునూ, సంఘీభావాన్నీ ప్రకటిస్తోంది. అన్ని రకాల సామ్రాజ్యవాద జోక్యాలు, దురాక్రమణలూ, అదుపులకు వ్యతిరేకంగా ప్రపంచ పీడిత ప్రజలూ, జాతులూ చేస్తున్న వివిధ రకాల ప్రతిఘటనల్లో భాగంగా వీరి ప్రతిఘటనను పరిగణిస్తోంది. అమెరికా నేతృత్వంలో సిరియాపై ప్రతిపాదిత దాడిని నిర్ద్వంద్వంగా వ్యతిరేకించడం, ఖండించడం ప్రపంచంలోని ప్రతి ఒక్క ప్రజాస్వామ్యవాది కర్తవ్యం అని అది దృఢంగా ప్రకటిస్తోంది.

సిరియాపై ప్రతిపాదిత అమెరికా దాడిని నిరసిస్తూ ప్రపంచవ్యాప్తంగా సామ్రాజ్యవాద వ్యతిరేక శక్తులు తమ నిరసనను వ్యక్తం చేస్తూ, దాన్ని తక్షణం నిలిపివేయాలని కోరుతూ రోడ్ల మీదకు వస్తున్నారు. మా కేంద్రకమిటీ అటువంటి నిరసనలన్నిటినీ ఆహ్వానిస్తూ, అటువంటి అన్ని సామ్రాజ్యవాద వ్యతిరేక గళాలతో పాటు తన గొంతు కలుపుతోంది. సిరియాపై యుద్ధాన్ని వ్యతిరేకిస్తున్న అన్ని శక్తులతో చేతులు కలపాలనీ, దాన్ని ఒక విశాల ప్రాతిపదికన అన్ని సామ్రాజ్యవాద దురాక్రమణ యుద్ధాలకూ, జోక్యాలకీ వ్యతిరేకంగా జరిగే మిలిటెంట్ పోరాటంగా మలచాలనీ తన శ్రేణులకు పిలుపునిస్తోంది. సిరియాపై దాడి చేయడానికి అమెరికా నేతృత్వంలో జరుగుతున్న అన్ని నీతిమాలిన ప్రయత్నాలనూ ఖండించమని మన దేశంలోని, ప్రపంచంలోని సకల సామ్రాజ్యవాద వ్యతిరేక శక్తులకూ, సంస్థలకూ, కార్మికవర్గ పార్టీలకూ మా కేంద్రకమిటీ విజ్ఞప్తి చేస్తోంది. ఈ దురాక్రమణ యుద్ధానికి వ్యతిరేకంగా సిరియా ప్రజల ప్రతిఘటనకు అంతర్జాతీయ మద్దతును నిర్మించాల్సిన అవసరం వుంది. తమ, తమ దేశాల్లో సామ్రాజ్యవాదాన్ని ప్రతిఘటించడం అనేది ఇతర దేశాలను దురాక్రమించే, లూటీ చేసే వారి దుర్మార్గ ప్రయత్నాలను ఓడించడంలో కీలక పాత్ర వహిస్తుంది. అమెరికాలోనూ, ఇతర సామ్రాజ్యవాద దేశాల్లోనూ సిరియాపై యుద్ధానికి వస్తున్న వ్యతిరేకతను మా కేంద్రకమిటీ ఆహ్వానం పలుకుతోంది. సిరియాపై దాడిలో పాల్గొనడానికి సన్నద్ధం అవుతున్న అమెరికా, ఫ్రాన్స్ తదితర సామ్రాజ్యవాద దేశాల్లోని, టర్కీలోని, కతార్, సౌదీ అరేబియా వంటి పశ్చిమాసియాలోని వారి కీలుబొమ్మ ప్రభుత్వాలున్న దేశాల్లోని ప్రజలకు ప్రత్యేకించి మేం విజ్ఞప్తి చేస్తున్నాం – సిరియాను నాశనం చేయడానికి మీ మీ ప్రభుత్వాలు చేస్తున్న ప్రయత్నాలను వ్యతిరేకించండి, ప్రపంచ పీడిత జాతుల, ప్రజల ఐక్య

పోరాటాన్ని బలోపేతం చేయండి.

ఇప్పటికే ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్ లలో కూరుకుపోయి ఉన్న అమెరికా సామ్రాజ్యవాదాన్ని సిరియాపై జరిగే దురాక్రమణ యుద్ధం మొత్తంగా కుదేలుపరిచినా ఆశ్చర్యం లేదు. కానీ మట్టికాళ్ల మహారాక్షసి అయిన సామ్రాజ్యవాదానికి అంతర్గతంగా ఎన్ని బలహీనతలు ఉన్నా అది దానంతట అది ఎన్నటికీ కూలిపోదు. ఈ భూప్రపంచం నుండి అది పూర్తిగా తుడిచిపెట్టుకుపోవాలంటే ప్రపంచ పీడిత ప్రజలందరం కలిసి దాన్ని ఒక్క తోపు తోయాల్సిందే. సామ్రాజ్యవాదులు సిరియాపై దాడికి సాహసిస్తే, సామ్రాజ్యవాద జోక్యాలకు వ్యతిరేకంగా పోరాడిన ఉజ్వలమైన చరిత్ర, ఆత్మగౌరవం గల సిరియా ప్రజల వీరోచిత ప్రతిఘటనా, దానికి ప్రపంచ ప్రజల మద్దతూ సామ్రాజ్యవాద శవపేటికకు కొట్టే కొన్ని ఆఖరి మేకులుగా పరిణమించగలవు.

ప్రపంచ పీడిత జాతులు, ప్రజల మీద సామ్రాజ్యవాద బలప్రయోగాలు, జోక్యాలు, అదుపు, దోపిడీ, అణచివేత, దురాక్రమణ యుద్ధాలకు వ్యతిరేకంగా ఒక విశాలమైన వేదికను ఏర్పర్చడానికి భౌతిక పరిస్థితులు వేగంగా పరిపక్వం చెందుతున్నాయి. అటువంటి విశాలమైన, మిలిటెంట్, సమగ్ర సామ్రాజ్యవాద వ్యతిరేక వేదిక మాత్రమే సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక తదితర రంగాలన్నిటా సామ్రాజ్యవాద ఆధిపత్యాన్నీ, జోక్యాన్నీ, అన్ని రకాల దురాక్రమణ యుద్ధాలనూ ఎదిరించి పోరాడగలదు. ఇది అంతిమంగా దాన్ని కూలదోయడానికి దారి తీస్తుంది. సామ్రాజ్యవాదాన్నీ, అన్ని రకాల విప్లవ ప్రతీఘాతుకులనూ కూలదోయడానికి చేసే అటువంటి ఐక్య పోరాటం ద్వారా మాత్రమే మనం నిజమైన ప్రజాస్వామ్యం, ప్రగతి, ప్రపంచ శాంతులను సాధించగల్గుతాం.

గత శతాబ్ద కాలంగా సామ్రాజ్యవాదులు తమ ఆర్థిక సంక్షోభం నుండి బైటపడ్డానికి ఫాసిజానికీ, యుద్ధాలకూ పాల్పడుతూ వస్తున్నారు. ప్రజలు వారిని ఎదిరించడానికీ, ఓడించడానికీ ప్రతిఘటననూ, విప్లవాలనూ చేపడ్తూ వస్తున్నారు. ప్రపంచ పరిస్థితులు నానాటికీ విప్లవానికి మరింత అనుకూలంగా మారుతున్నాయి, అందువల్ల మా పార్టీ మన దేశప్రజలకూ, ప్రపంచ ప్రజలకూ విప్లవాలను విజయవంతం చేయమని పిలుపునిస్తోంది. అటువంటి విప్లవ యుద్ధాల ద్వారానే మనం అన్ని సామ్రాజ్యవాద అన్యాయ యుద్ధాలకూ అంతం పలికి ప్రపంచ శాంతిని స్థాపించగల్గుతాం.

**అభయ్**

**అధికార ప్రతినిధి**

**కేంద్ర కమిటీ**

**సీపీఐ (మావోయిస్టు)**

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# కేంద్ర కమిటీ

**17-9-2013**

## ఒడిషాలో నయాఫాసిస్టు నవీన్ పట్నాయక్ ప్రభుత్వం 14 మంది మావోయిస్టులను పాశవికంగా ఊచకోత కోయడానికి నిరసనగా అక్టోబర్ 5న భారత్ బంద్ ను పాటించండి!

2013 సెప్టెంబర్ 14న, ఒడిషాలోని మల్కన్‌గిరి జిల్లా పొడియా బ్లాక్ లోని శిలాకోట అడవుల్లో ఒడిషా ఎస్‌ఓజి, జిల్లా వాలంటరీ ఫోర్సు, ఒడిషా పోలీసులు ఒక జాయింట్ ఆపరేషన్ జరిపి ఒక మహిళా కామ్రేడ్ సహా 14 మంది మావోయిస్టులను పాశవికంగా ఊచకోత కోశాయి. పోలీసులు వారి ఆయుధాలు కూడా స్వాధీనం చేసుకున్నారు. సామ్రాజ్యవాదుల, ప్రత్యేకించి అమెరికా సామ్రాజ్యవాదుల మార్గదర్శకత్వంలో కేంద్ర ప్రభుత్వంతో కుమ్మక్కై నయాఫాసిస్టు నవీన్ పట్నాయక్ ప్రభుత్వం చేసిన ఈ పాశవిక హత్యాకాండకు నిరసనగా అక్టోబర్ 5న భారత్ బంద్ పాటించాల్సిందిగా సిపిఐ (మావోయిస్టు) కేంద్రకమిటీ దేశ ప్రజలకు పిలుపునిస్తోంది.

తాను అధికారంలోకి వచ్చినప్పటి నుండి నిస్సిగ్గుగా ఒడిషాలోని అపార వనరులనూ, ప్రకృతి సంపదలనూ బహుళజాతి కంపెనీలకు అప్పగించడానికి అసంఖ్యాకంగా ఎంఓయూలపై సంతకాలు పెడుతూ నవీన్ పట్నాయక్ అపర దళారీగా అవతారమెత్తాడు. ఒడిషా ప్రజలు, ప్రత్యేకించి ఆదివాసీ, దళిత రైతాంగం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకూ, మైనింగ్ మాఫియాలకూ వ్యతిరేకంగా జీవన్మరణ పోరాటం చేస్తున్నారు. ఎందుకంటే బహుళజాతి కంపెనీలను ప్రసన్నులను చేసుకోవడానికి ఈ ఎంఓయూలను అమలు చేయడం ద్వారా రైతాంగాన్నీ, ప్రజలనూ విస్థాపితులను చేసి వారిని దారిద్ర్యంలోకి తోయాలని ఇవి కంకణం కట్టుకున్నాయి. మరోవైపు తమ రక్తాన్ని జలగల్లా పీలుస్తున్న బడా భూస్వాములకూ, వడ్డీ వ్యాపారులకూ, మద్యం మాఫియాకూ వ్యతిరేకంగా వారు భీషణ పోరాటాలు చేస్తున్నారు. మిలిటెంట్ గా, సుదీర్ఘకాలంగా, రాజీ లేకుండా ఒడిషా వీర ప్రజానీకం పోస్కోకు వ్యతిరేకంగా, కాశీపూర్, నియంగిరి, నారాయణపట్నాలలో చేస్తున్న పోరాటాలు మన దేశ పోరాట ప్రజలనే కాక ప్రపంచవ్యాప్తంగా నయా ఉదారవాద విధానాల దుష్ఫలితాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న ప్రతి కార్యకర్తకూ ఉత్తేజంగా నిలిచాయి.

దాని దళారీ స్వభావం కారణంగా పుట్టు గుడ్డి, చెవిటి అయిన నవీన్ పట్నాయక్ ప్రభుత్వం

ప్రజల న్యాయమైన డిమాండ్లను నిర్లక్ష్యం చేసి కేంద్ర ప్రభుత్వ సంపూర్ణ సహాయ సహకారాలతో ఒడిషా అంతటా పోరాడే ప్రజలపై రాష్ట్ర పోలీసు బలగాలకు తోడుగా కోబ్రా బెటాలియన్ లు సహా 27 బెటాలియన్ల పారామిలటరీ బలగాల్ని ఉసిగొల్పింది. ప్రజల, కార్యకర్తల, మావోయిస్టుల ఊచకోతలు ఈ నిర్బంధంలో మామూలైపోయాయి. అరెస్టులు, తప్పుడు కేసులు, కఠిన శిక్షలు, అమానవీయ జైలు నిర్బంధాలు, కొట్టడం, అత్యాచారాలు, లైంగిక అత్యాచారాలు, ప్రజల ఇండ్లనూ, ఆస్తులనూ తగులబెట్టడం – ఒక్కటనేమిటి, ఈ నయాఫాసిస్టులు ప్రజల న్యాయమైన ఆకాంక్షలను అణగదొక్కడానికి ఏ ఒక్క క్రూరమైన చర్యనూ విడిచింది లేదు, అన్నిటినీ ప్రయోగించారు.

మా పార్టీ దశాబ్దాలుగా ఒడిషాలో పని చేస్తూ, పాలకవర్గాల చేతుల్లో పీడిత ప్రజలు, ప్రత్యేకించి ఆదివాసులు అనుభవిస్తున్న దోపిడీ, పీడన, అణచివేతలకు వ్యతిరేకంగా వారిని సంఘటితం చేస్తూ వస్తోంది. ఉదారీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణలకు (ఎల్‌పిజి) వ్యతిరేకంగా ఒడిషాలోనే కాక దేశంలోని అత్యధిక రాష్ట్రాల్లో జరుగుతున్న ప్రజాఉద్యమాల్లో అది ముందు పీఠీన నిలిచింది లేదా వాటికి తన సంపూర్ణ మద్దతును అందించింది. అందుకని భారత పాలకవర్గాలు సామ్రాజ్యవాదులు ప్రోద్బలంతో, వారి మార్గదర్శకత్వంలో మా ఉద్యమాన్ని తుడిచిపెట్టి, ప్రజల న్యాయమైన పోరాటాల్ని అణచడానికి ఆపరేషన్ గ్రీన్‌హంట్ ను అనగా ప్రజలపై యుద్ధాన్ని దేశవ్యాప్త బహుముఖ దాడిగా 2009 మధ్య నుండి ఎక్కుబెట్టారు. ఏ దోపిడీ ప్రభుత్వానికైనా పీడిత ప్రజలపై నిర్బంధాన్ని ప్రయోగించడం కొండగుర్తుగా వుంటుంది. ఆపరేషన్ గ్రీన్‌హంట్ అనేది ఇందులో ఒక కీలకమైన దశను సూచిస్తుంది. ఎందుకంటే అది స్థాయిలోనూ, పాశవికత్వంలోనూ గత అణచివేత దాడులన్నిటినీ మించిపోయింది. దీని ఉద్దేశ్యం మావోయిస్టు ఉద్యమాన్ని తుడిచిపెట్టడంగా చెప్తున్నారుగానీ నిజానికి ఇది ప్రజల న్యాయమైన, ప్రజాస్వామికమైన ప్రతి ఒక్క డిమాండ్ నూ, ప్రత్యేకించి జల్, జంగల్, జమీన్ లకై చేసే పోరాటాలను అణచివేయడానికి ఉద్దేశించబడినది. అందుకనే మావోయిస్టులు, ప్రజాస్వామిక సంస్థలూ, వ్యక్తులూ, ప్రజలూ ఈ దాడికి బలౌతున్నారు.

నాజీ హిట్లర్, ఫాసిస్టు ముస్సోలినీ, వారి నేటి వారసులైన బుష్, ఒబామా, హోల్యాండ్, కామెరూన్ లు గానీ, వారి దేశీ అవతారాలైన సోనియా, మన్మోహన్, రాహుల్ గాంధీ, చిదంబరం, జైరాం రమేష్, ప్రణబ్ ముఖర్జీలు గానీ, రాష్ట్రాల్లో వారి సామంతులైన రమన్ సింగ్, నవీన్ పట్నాయక్, కిరణ్ కుమార్ రెడ్డి, మమతా బెనర్జీ, పృథ్వీరాజ్ చౌహాన్ మొదలైనవారందరికీ గానీ ఒక సామాన్య లక్షణం ఉంటుంది. వీరంతా తాము ప్రజల జీవితాలతో ఎలాగంటే అలా ఆడుకోవచ్చని భావిస్తారు. వారు మినహాయింపు లేకుండా గ్రహించలేని విషయం ఏమిటంటే వారంతా ప్రజల ఆగ్రహావేశాలను మూటగట్టుకుంటున్నారనీ, దాని వెల్లువలో వారంతా కొట్టుకుపోక తప్పదనీ. కాశీపూర్, నియంగిరి, నారాయణపట్నాలలోగానీ, ఇప్పుడు సెప్టెంబర్

14న మల్కన్‌గిరిలో గానీ పోలీసు కాల్పుల్లో లేదా బూటకపు ఎన్‌కౌంటర్లలో జరిగిన హత్యాకాండలు ఒడిషా ప్రజలను ఏమాత్రం అణచివేయలేవు. అంతేకాదు, అవి ఈ ప్రభుత్వాన్ని మరింత ద్వేషించడానికీ, దాన్ని కూలదోయడానికీ మరిన్ని కారణాల్ని ఇవ్వగలవు.

మహాఅజ్ఞాని అయిన ఒడిషా డిజిపి పాలకవర్గాల బూట్లు నాకే తన సహజస్వభావానికి అనుగుణంగానే ఒడిషాలోకి ప్రవేశించే మావోయిస్టులందరికీ ఈ 14 మావోయిస్టులకు పట్టిన గతే పడుతుందని రంకెలు వేశాడు. వీరసలు చరిత్ర నుండి నేర్చుకునేదంటూ ఏమీ వుండదా? బహుశా ఉండదు, అవి వారి అంతిమఘడియలు అయితే తప్ప. మన దేశంలోని ప్రతి రాష్ట్రంలోని విశాల గ్రామీణ ప్రాంతాల్లో మావోయిజం తలెత్తడానికి కారణం భారత పాలకవర్గాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక, సామ్రాజ్యవాద అనుకూల, దళారీ నిరంకుశ బూర్జువా అనుకూల, భూస్వామ్య అనుకూల నయా ఉదారవాద విధానాలే. అందుకని ఏ రాష్ట్రంలోకి అయినా మావోయిస్టులు 'బైట నుండో' 'ఆకాశం నుండో' ఊడిపడాల్సిన అవసరమేం లేదు. ఎల్‌పిజి విధానాలను అనుసరిస్తున్న ప్రతి పాలకుడూ ప్రజల ప్రతిఘటనను రుచి చూడక తప్పదు. అక్కడి నుండి వారు మావోయిస్టులుగా మారడానికి ఉన్న దూరం కేవలం ఒక్క అడుగు మాత్రమే. ఫాసిస్టులందరికీ ఉన్న మరో సామాన్య లక్షణం వాస్తవాలను గౌరవించకపోవడం. అందుకే ఈ గోబెల్స్ వారసులకు మల్కన్‌గిరిలో అసువులు బాసిన ఒడిషా ముద్దుబిడ్డలు 'బైటివారు'గా కనిపిస్తున్నారు. ఒడిషా ప్రజలు పెద్ద సంఖ్యలో మావోయిజాన్ని అక్కున చేర్చుకోవడం ద్వారా, నవీన్ పట్నాయక్ ముఠాకు తగిన గుణపాఠం చెప్పడం ద్వారా శిలాకోటలో జరిగిన తమ ముద్దుబిడ్డల హత్యాకాండకు తప్పక ప్రతీకారం తీర్చుకుంటారు.

**ప్రియమైన దేశ ప్రజలారా!**

మల్కన్‌గిరిలో అసువులు బాసిన మా ప్రియమైన కామ్రేడ్స్ అందరూ దాదాపుగా ఆదివాసీలే. ఆదివాసులకే కాక దేశంలోని పీడిత, తాడిత ప్రజలందరి ప్రయోజనాలకూ హానికరంగా ఉన్న నయా ఉదారవాద విధానాలకు వ్యతిరేకంగా పోరాడే కర్తవ్యాన్ని వీరంతా భుజాలకెత్తుకున్నారు. వారి హత్యలను నిరసించడం అంటే పాశవిక ఆపరేషన్ గ్రీన్‌హంట్ దాడికి వ్యతిరేకంగా మీ గొంతుల్ని ఎక్కుపెట్టడమే కాదు, పాలకవర్గాల సామ్రాజ్యవాద అనుకూల విధానాలను బిగ్గరగా గొంతెత్తి నిరాకరించడం కూడా అవుతుంది.

ఈ ఒక్క ఏడాదిలోనే అనేకచోట్ల ప్రజలనూ, మావోయిస్టులనూ ప్రభుత్వ బలగాలు ఊచకోత కోశాయి – ఝార్ఖండ్ లోని లకడ్‌బంధా ఊచకోత, మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో గోవిందగాం, భట్‌పార్, సింధేసుర్, మేడ్రీ, భగవాన్‌పుర్ ఊచకోతలూ, ఛత్తీస్‌గఢ్ లో ఎడ్సమెట్ట, పువ్వర్తి ఊచకోతలూ వంటివి ఈ ఏడాదిలోవే. దాదాపుగా ఈ ఘటనలన్నిటిలో గ్రామ మహిళలనూ, మహిళా మావోయిస్టులనూ కూడా నిర్దయగా దారుణంగా చంపేశారు. అసువులు

బాసినవారంతా మన దేశ పీడిత వర్గాలకూ, సెక్షన్లకు చెందినవారు, మన సమాజంలోని పీడిత సెక్షన్లన్నిటి విముక్తి కోసం పోరాడుతుండినవారు. పాలకవర్గాల తలకిందులు అభివృద్ధి నమూనాను వ్యతిరేకించేవారందరూ ఈ ఊచకోతల్ని ఖండించాలి. మన దేశంలో ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పాలని ఆకాంక్షించే పౌరులంతా ఈ నిరసనలో పాలుపంచుకోవాలని మేం విజ్ఞప్తి చేస్తున్నాం.

మన దేశంలోని అన్ని నిజమైన ప్రజాస్వామిక సంస్థలకూ, పార్టీలకూ, వ్యక్తులకూ ఈ సెప్టెంబర్ 14 ఊచకోతను నిర్ద్వంద్వంగా ఖండించమనీ, దానికి వ్యతిరేకంగా జరిగే నిరసనల్లో పాలుపంచుకోమనీ మేం విజ్ఞప్తి చేస్తున్నాం. అక్టోబర్ 5న భారత్ బంద్ ను పాటించమనీ, నిరసనల్లో పెద్ద సంఖ్యలో పాల్గొనమనీ దేశప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాం.

**అభయ్**

**అధికార ప్రతినిధి**

**కేంద్ర కమిటీ**

**సీపీఐ (మావోయిస్టు)**

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# కేంద్ర కమిటీ

**16-10-2013**

## దోపిడీ న్యాయ వ్యవస్థలో పీడిత ప్రజలకు న్యాయం ఆశించలేం!
## 2013 అక్టోబర్‌లో బీహార్ హైకోర్టు, ఒడిశా కందమాల్ జిల్లా సెషన్స్ కోర్టులో వెలువరించిన రెండు తీర్పులను ఖండిస్తున్నాం!

**విప్లవ ప్రజలారా!**

బీహార్ రాష్ట్రంలోని జహనాబాద్ జిల్లాలో 1997 డిసెంబర్ 1న, ఉన్నత కులాలకు చెందిన ప్రైవేట్ గూండా వాహిని నిషేధిత రణబీర్ సేన, లక్ష్మణ్‌పూర్ బాతే గ్రామంలో 58 మంది దళితులను ఊచకోత కోసింది. హతులలో 27 మంది మహిళలు, 16 మంది పిల్లలు సైతం వున్నారు. ఈ కేసు దాదాపు 13 సంవత్సరాలు జిల్లా కోర్టులో నడిచింది. ఈ కోర్టు 2010 ఏప్రిల్‌లో 26 మందిని హంతకులుగా నిర్ధారించి 16 గురికి మరణశిక్ష, 10 మందికి యావజ్జీవ కారాగార శిక్షను విధిస్తూ తీర్పును ఇచ్చింది. కానీ, ఆ తర్వాత దాదాపు మూడున్నర సంవత్సరాలు ఆ కేసు రాష్ట్ర హైకోర్టులో నడిచింది. 2013 అక్టోబర్ 3 నాడు హైకోర్టు తన ఉన్నతమైన తీర్పును వెలువరిస్తూ తగిన సాక్ష్యాధారాలు లేవంటూ పై దోషులందరినీ నిర్దోషులుగా ప్రకటించింది. రణబీర్ సేన 58 మంది దళితుల హత్యకు పాల్పడగా, హైకోర్టు తన దుర్మార్గమైన తీర్పుతో న్యాయాన్ని హత్య చేసింది. గత 16 సంవత్సరాలలో వాస్తవాలు వెలుగులోకి రాకుండా చేయడానికి వున్నత స్థాయిలో అధికార యంత్రాంగం, రాజకీయ నాయకులు సామ, దాన, భేద, దండోపాయాల ద్వారా బాధిత కుటుంబాలకు చెందిన సాక్షులను ఎలా వేధించారో, ఆ కుటుంబాల ద్వారానే ఈ రోజు బహిరంగంగానే వెల్లడవుతోంది. 58 మంది దళితుల హత్యపై అప్పటి భారత రాష్ట్రపతి ఆర్.కె. నారాయణన్ వ్యాఖ్యానిస్తూ ఇది దేశానికి సిగ్గుచేటన్నాడు. వాస్తవాన్ని చెప్పాలంటే హంతకులను నిర్దోషులుగా ప్రకటించడం అంటే ఆ హత్యలను పరోక్షంగా సమర్థించడమే! పాట్నా హైకోర్టు వెలువరించిన ఈ తీర్పును మా పార్టీ తీవ్రంగా ఖండిస్తోంది.

పై తరహాకు చెందిన మరో తీర్పును ఒడిశా రాష్ట్రంలోని కందమాల్ జిల్లా (ఫుల్బనీ) అదనపు సెషన్స్ న్యాయమూర్తి వెలువరించారు. హిందూ మతోన్మాద సంఘ్ పరివార్‌కు చెందిన విశ్వహిందూ పరిషత్ నాయకుడు లక్ష్మణానంద సరస్వతిని మా పార్టీ నాయకత్వంలో పీఎల్‌జీఏ గెరిల్లాలు 2008 ఆగస్టు 23 నాడు మట్టుబెట్టారు. అతడు కందమాల్ జిల్లాలోని ఆదివాసీ

ప్రజలపై తలపడని కిరాతకమంటూ లేదు. తమ పేదరికం, అజ్ఞానం నుంచి తాత ముత్తాతల నాడెప్పుడో క్రైస్తవ మతం స్వీకరించిన ఆదివాసీలను, హిందూ మతంలోకి తేవాలన్న కుట్రలతో వీహెచ్‌పీ 'ఘర్ వాపసీ' కేంపెయిన్ చేపట్టి అనేక ఘాతుకాలకు పాల్పడింది. లక్ష్మణానంద తన తుమిడిబంద ఆశ్రమం నుంచి పరమ మతోన్మాద శక్తులను ఉసిగొల్పి ప్రజలపైకి వదిలాడు. వాళ్లు అనేక రకాలుగా ప్రజలను హింసించారు. ప్రజల అభిప్రాయంపై ఆధారపడి, వారి సంపూర్ణ మద్దతుతో మా పార్టీ నాయకత్వంలో పీఎల్‌జీఏ గెరిల్లాలు ఆ ప్రజాహంతకుడిని తుదముట్టించారు. దీనితో యావత్తు ఒడిశా రాష్ట్రంలో మతోన్మాద శక్తులు మరింత పెట్రేగిపోతూ క్రైస్తవులపై బడి హత్యలు, అత్యాచారాలు, దొమ్మీలు, గృహ దహనాలు సహ పరమ విధ్వంసాన్ని సృష్టించాయి. ఆనాటి నర సంహారంలో దాదాపు 38 మంది సాధారణ ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. లక్ష్మణానందను మట్టుబెట్టిన కేసులో పోలీసులచే ఇరికించబడిన మా పార్టీ కామ్రేడ్స్ సహా 8 మంది సాధారణ ప్రజలకు జిల్లా కోర్టు గోరుచుట్టుపై రోకటిపోటులా పదివేల రూపాయల జరిమానాతో యావజ్జీవ కారాగార శిక్షను విధించింది. ఈ హేయమైన తీర్పును కూడా మా పార్టీ తీవ్రంగా ఖండిస్తోంది.

పాట్నా హైకోర్టు తీర్పుగానీ, ఫుల్బనీ జిల్లా కోర్టు తీర్పు గానీ ఈ వ్యవస్థలో అనూహ్యామైనవేవీ కావు. వర్గ వ్యవస్థలో న్యాయం వర్గాతీతం కాదని పై తీర్పులు మరోసారి స్పష్టం చేస్తున్నాయి. దేశంలో విప్లవోద్యమం పురోగమిస్తూ వివిధ ప్రాంతాలకు విస్తరిస్తూన్న క్రమంలో బేజారెత్తిపోతున్న దోపిడీ పాలక వర్గాలుదశాబ్దాలుగా బహుముఖ దాడికి పాల్పడుతున్నాయి. అందులో భాగంగానే పై తీర్పులను చూడాలని మా పార్టీ అభిప్రాయపడుతోంది.

విప్లవోద్యమ ప్రాంతాలలోని ప్రజలను భయ కంపితులను చేయడానికి సేంద్ర, సల్వాజుడుం లాంటి విధ్వంసకర కేంపెయిన్‌లను పాలకవర్గాలు కొనసాగించి బీహార్-ఝార్ఖండ్, దండకారణ్యం తదితర పలు రాష్ట్రాలలో భారీ విధ్వంసాన్ని సృష్టించాయి. ప్రజలు తెగించి పోరాడి వాటిని తిప్పికొట్టి ఓడించారు. దానితో ఖంగుతిన్న పాలకవర్గాలు సామ్రాజ్యవాదులతో, ముఖ్యంగా అమెరికా సామ్రాజ్యవాదులతో కుమ్మక్కై మరింత పాశవికమైన బహుముఖ దాడిని 'ఆపరేషన్ గ్రీన్‌హంట్' పేరుతో గత నాలుగేళ్లుగా కొనసాగిస్తున్నాయి. దేశంలోని అడవులను, గనులను, సమస్త ప్రకృతి సంపదలను కొల్లగొట్టుకపోవడానికే ఈ విధ్వంసకర బహుముఖ దాడి జరుగుతుందనేది ఒక వాస్తవం. ఒడిశా రాష్ట్రం అత్యంత విలువైన వివిధ రకాల ప్రకృతి సంపదలకు నిలయం. ఇప్పటికే అక్కడ పోస్కో, వేదాంత లాంటి సంస్థలు సృష్టిస్తున్న విధ్వంసం, అక్కడి ఆదివాసీ ప్రజల జీవితాలను అతలాకుతలం చేస్తుండగా, ఇలాంటి తీర్పులతో వారి ప్రతిఘటనా పోరాట శక్తిని నీరుగార్చాలన్నది పథకం ప్రకారం జరుగుతున్న దాడుల్లో భాగమే. ఈ దాడులు కేవలం అడవులకు - ఆదివాసీలకు మాత్రమే పరిమితం కాలేదు. పట్టణాల్లోని దేశభక్తులను, ప్రజాస్వామిక వాదులను, ప్రజాహిత మేధావులను, కవులను, కళాకారులను,

రచయితలను, పాత్రికేయులను, విప్లవ విద్యార్థి సంఘాల నాయకులను కూడా వదలకుండా టార్గెట్ చేసి దాడులు జరుగుతున్నాయి. ఇందులో భాగంగానే కోర్టులు - చట్టాలు కోరలు జాపుకొని దాడులకు దిగుతున్నాయి. విప్లవోద్యమంతో సంబంధాలు వున్నాయని భావిస్తే చాలు కఠిన కారాగార శిక్షలు, జీవిత ఖైదులే కాకుండా మరణశిక్షల వరకు శిక్షలు విధిస్తున్నాయి. ఈ మధ్య కాలంలో ప్రభుత్వం విప్లవకారుల ఆస్తులను జప్తు చేసుకోవడం కూడా ప్రారంభించింది. వర్గ న్యాయం గురించి తెల్సిన వారికి ఇవన్నీ సులువుగానే బోధపడుతాయి. ఇప్పటికే దేశంలోని పలు జైళ్లలో మా పార్టీ కార్యకర్తలు, నాయకులు 4-5 వేల మందికి పైగా అనేక సంవత్సరాలుగా మగ్గుతున్నారు. మరో వైపు అనేక నేరాలలో ముద్దాయిలుగా కేసులు ఎదుర్కొంటున్నవారు, రాష్ట్రాలలోని వివిధ విధాన సభలలోరాజ్యమేలుతుండడం అందుకు ఒక పెద్ద ఉదాహరణ. దేశ పార్లమెంట్, అసెంబ్లీల్లో కుఖ్యాత హంతకులైన రఘురాజ్ ప్రతాప్ సింగ్, పప్పు యాదవ్‌లాంటి వారికి కొదువ లేదు. ఇలాంటి నీచులకు, దోషులకు, హంతకులకు ఏ కోర్టులూ శిక్షలు సాధారణంగా విధించవు. ప్రజల జీవితాలతో చెలగాటమాడేవాళ్లకు, లక్ష్మన్‌పూర్ బాతే, బథానీటోల, నగరి, మియాన్‌పూర్, కందమాల్ లాంటి నరసంహారాలకు పూనుకునే వాళ్లకు, సేంద్ర, సల్వాజుడుం లాంటి కేంపెయిన్‌లలో అగ్ర భాగాన నిలిచే ప్రజా ద్రోహులకెవరికైనా రణబీర్ సేన కుఖ్యాత నాయకుడైన బ్రహ్మేశ్వర్ సింగ్, వీహెచ్‌పీ నాయకుడైన లక్ష్మణానంద, జుడుం నేత మహేంద్ర కర్మలకు విధించినట్లే ప్రజాకోర్టుల్లో తగిన శిక్ష విధించక తప్పదని చరిత్ర హెచ్చరిస్తోంది.

### ప్రజలారా, ప్రజాస్వామికవాదులారా, న్యాయవాదుల్లారా!

పాట్నా హైకోర్టు, కందమాల్ జిల్లా కోర్టు తీర్పులకు వ్యతిరేకంగా వుద్యమించాలని మా పార్టీ విజ్ఞప్తి చేస్తోంది. ఆ తీర్పులు న్యాయ వ్యవస్థలో తీవ్రమవుతున్న ఫాసిస్టు ధోరణులకు ఒక ప్రతీక మాత్రమే. ఆ తీర్పులు ఆమోదయోగ్యం కావని నినదించండి! దేశంలోని విప్లవ ప్రజలకు - ఆదివాసీలు, దళితులు, నిరుపేద రైతాంగం, కార్మికులు, మత మైనార్టీలు, మహిళలు మొదలైన సెక్షన్ల పీడిత ప్రజలకు అండగా నిలవండి. ఈ దేశంలో దాదాపు నాల్గవ వంతు జనాభా దళిత, ఆదివాసీలేనన్నది ఒక వాస్తవం కాగా, వీరిలో అత్యధిక శాతం ప్రజలు వివిధ ఆర్థిక, రాజకీయ, సామాజిక సమస్యలతో బాధపడుతున్నారు. దేశంలో తరతరాలుగా దళితుల పట్ల కొనసాగుతున్న అస్పృశ్యత వారికి ఒక శాపంగా ఉంది. వారికి ఏనాడూ సామాజిక శాంతి, సమ న్యాయం, ఆత్మ గౌరవంతో కూడిన జీవితం దక్కిందే లేదు. దేశంలోని విప్లవోద్యమం వారితో పాటు విశాల పీడిత ప్రజానీకానికి పూర్తి అండగా నిలిచింది. పాలక వర్గాలు ప్రచారం చేసే అభివృద్ధి, ప్రజా సంక్షేమం తదితర మాటల గారడీ వెనుక దాగిన పీడిత ప్రజల అసలు జీవితాల చీకటి అధ్యాయాలు ఎన్నెన్నో. ముఖ్యంగా బీహార్, ఝూర్ఖండ్‌లలో దళితుల పట్ల అమానుష హత్యాకాండలు, నరసంహారాలు, క్రూర దాడులు, అత్యాచారాలు, ఆస్తుల విధ్వంసానికి

పాల్పడిన అగ్రవర్ణాల పలు ప్రైవేటు సైన్యాలను (రాజ్యంలో రాజ్యంలా వ్యవహరిస్తాయి) విప్లవోద్యమం మట్టుబెట్టి వారికి ఎంతో ఊరట కలిగించింది. క్రైస్తవ ఆదివాసీలపై కరడుగట్టిన హిందూ మతతత్వ శక్తులు సాగించే దుర్మార్గమైన దాడులను సైతం విప్లవోద్యమం ఎదుర్కొని ఆదివాసీల ఆత్మగౌరవాన్ని నిలబెడుతోంది. దేశంలోని మత మైనార్టీ ప్రజలలో ఆత్మ విశ్వాసాన్ని ఇనుమడింప చేయడానికి విప్లవోద్యమం చిత్తశుద్ధితో కృషి చేస్తోంది. వీరందరికీ నిజమైన ప్రజాస్వామ్యం, భూమి, సామాజిక శాంతి, న్యాయం, ఆత్మగౌరవంతో కూడిన జీవనం, నిజమైన సెక్యులరిజం విప్లవోద్యమం ద్వారానే సాధ్యమని గత నాలుగున్నర దశాబ్దాల విప్లవోద్యమం దేశవ్యాప్తంగా తిరుగులేని విధంగా రుజువు చేసింది. ఆ విప్లవోద్యమాన్ని కాపాడుకుంటూ పురోగమింప చేయడం ద్వారానే పీడిత ప్రజలకు సామాజిక శాంతి, న్యాయం లభిస్తాయనీ, మీరంతా అందులో భాగస్తులు కావాలనీ మా పార్టీ మరోసారి విజ్ఞప్తి చేస్తోంది.

**అభయ్**

**అధికార ప్రతినిధి**

**కేంద్ర కమిటీ**

**సీపీఐ (మావోయిస్టు)**

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# కేంద్ర కమిటీ

**2-12-2013**

## ఛత్తీస్‌ఘుడ్ విధానసభ ఎన్నికలను బహిష్కరించిన ప్రజలకు విప్లవ జేజేలు!

ఛత్తీస్‌గఢ్‌లో 2013 నవంబర్‌లో రెండు విడుతలుగా విధానసభ ఎన్నికలు జరిగాయి. విప్లవోద్యమ ప్రాంతంలో తొలి విడుతలోనే ఎన్నికల తంతు ముగించుకోవాలని భావించిన ఎన్నికల కమీషన్ నవంబర్-11 నాడు ఆ తంతును పూర్తి చేసుకున్నది. ఈ సారి తొలి విడుత విధానసభ ఎన్నికల సందర్భంగా మున్నెన్నడూ లేనంతటి స్థాయిలో పోలీసు, అర్ధసైనిక బలగాలను, వాహనాలను, మందుపాతర నిరోధక వాహనాలను, గగన తలంపై హెలికాప్టర్లను. డ్రోన్‌లను మోహరించారు. మే 25 నాడు జీరంగాటి వద్ద మా పిఎల్‌జిఎ బలగాలు జరిపిన వీరోచిత దాడిలో కరుడుగట్టిన జుడుం నాయకుడు, ప్రజా కంటకుడు, కాంగ్రెస్ నాయకుడు మహేంద్రకర్మ మట్టిగరిచిన నేపథ్యంలో భద్రతను పెద్ద ఎత్తున కట్టుదిట్టం చేసినట్టు ఎన్నికల కమీషన్ సాకు చూపింది. వాస్తవంగా గత మూడు దశాబ్దాలుగా ఈ ప్రాంతంలో పార్లమెంటరీ ఎన్నికలు జరుగుతున్న ప్రతి సందర్భంలోనూ మరింత తీవ్రస్థాయిలో బలగాలను మోహరించడం జగమెరిగిందే! తుపాకుల నీడలోనే తమ బూటకపు పార్లమెంటరీ ఎన్నికల ప్రజాస్వామ్య తంతును ముగించుకుంటున్నది చూస్తున్నదే! అయినప్పటికీ ఏ నాటికానాడు విప్లవోద్యమంలో పురోగమిస్తున్న ప్రజలు ఒక వైపు తమ ప్రత్యామ్నాయ రాజ్యాధికార అంగాలను (జనతన సర్కార్‌లను) ఎన్నుకుని పటిష్టం చేసుకుంటూనే మరోవైపు మరింత క్రియాశీలంగా బూటకపు ఎన్నికలను బహిష్కరిస్తున్నారు. ఆ సమరశీల ప్రజానీకానికి మా కేంద్ర కమిటీ విప్లవ జేజేలు తెలుపుతోంది.

మున్నెన్నడూ లేని స్థాయిలో పోలీసు, అర్ధసైనిక బలగాలను మోహరించిన ఎన్నికల కమీషన్ విప్లవోద్యమంపై తమ దుష్ప్రచారాన్ని కూడా అదే స్థాయిలో కొనసాగించింది. బృహత్ బస్తర్‌లోని ఏడు జిల్లాల కలెక్టర్లు కూడా ఒక అడుగు ముందుకు వేసి విప్లవోద్యమంపై పరమ విషం కక్కుతూ తమ దుష్ప్రచారాన్ని కొనసాగించారు. మా పార్టీ నాయకత్వాన జరిగిన ఎన్నికల బహిష్కరణ చరిత్రలో ఎక్కడా ఓటర్లను బెదిరించిన, హింసించిన ఏ ఒక్క ఘటనైనా నమోదు కాని పరిస్థితులలో ఈ సారి 7 జిల్లాల కలెక్టర్లు మరో కొత్త అస్త్రం వదిలారు. మావోయిస్టులు ఓటర్ల వేళ్లు నరుకుతారనే తమ తప్పుడు ప్రచారానికి సాధికారత (లెజిటిమసీ)ను కల్పించుకోవడానికి ఈ సారి ఏకంగా ఓటర్ల వేళ్లపై గుర్తు పెట్టకూడదనే ఓ కొత్త ప్రతిపాదనను

ముందుకు తేవడం గమనార్హం. దీనికి తోడు 'నోటా' (None of the Above) ప్రాముఖ్యతను చిలువలకు పలువలల్లుతూ తెగ ప్రచారం చేశారు. కానీ అతి ప్రజాస్వామ్యయుతంగా తమ విప్లవ ప్రభుత్వ ప్రతినిధులను ప్రతి మూడేళ్లకొకసారి ఎన్నుకుంటున్న ఈ ప్రాంతంలోని ప్రజలు 'నోటా'ను మించిన రీ కాల్ హక్కును అనుభవిస్తున్నారనేది అమలవుతున్న వాస్తవం. ఇలాంటి పరిస్థితులలో ఎన్నికల కమిషన్, పోలీసులు ఎన్నెన్ని రకాల భయాలు, భ్రమలు సృష్టించినా ప్రజలు తమ బూటకపు ఎన్నికల బహిష్కరణ పరంపరను మున్నెన్నటికన్నా క్రియాశీలంగా అమలు జరిపారు. పోలీసులు సంతలు బందు చేసినా, రహదారులను దిగ్బంధనం చేసినా, రేషన్ కార్డులను నిలిపివేస్తామని బెదిరించినా ఇంకా పరమ హీన స్థాయిలో తమ ప్రచారాన్ని ముమ్మరంగా కొనసాగించినా, ఖాకీల తుపాకులు గ్రామాలపై, అడవులపై అడుగడుగునా ఎక్కుపెట్టినా ఇవన్నీ ప్రజల రాజకీయ దృఢ సంకల్పాన్ని దెబ్బ తీయలేకపోయాయి సరికదా పార్లమెంటరీ ఎన్నికల అసలు రంగును బయటపెట్టాయి.

బూటకపు ఎన్నికలను బహిష్కరిస్తున్న విప్లవ ప్రజలకు రక్షణ కల్పించడంలో వారి సైన్యం పిఎల్‌జిఎ అత్యంత బాధ్యతాయుతమైన పాత్రను పోషించినందుకు మా కేంద్ర కమిటీ అభినందిస్తోంది. ప్రజలకు రక్షణ కల్పించడంలో పలు చోట్ల శత్రుప్రభుత్వ బలగాలతో పిఎల్‌జిఏ తలపడక తప్పలేదు. ఆ ప్రతిఘటనా చర్యలలో కనీసం రెండు డజన్ల సంఖ్యలో ఖాకీ శక్తులు మట్టి గరవడమో, గాయపడడమో జరిగింది. ఖాకీల భీతావహచర్యలు కేవలం (పాత) బస్తర్‌కే పరిమితం కాలేదు. సరిహద్దుల్లోని మహారాష్ట్ర గడ్‌చిరోలి, గోందియా జిల్లాల్లో సి-60 కమాండోలు తీవ్ర భయోత్పాతాన్ని సృష్టిస్తూ దాడులకు పూనుకున్నారు.

ఎన్నికల సందర్భంగా దోపిడి పాలకవర్గాల భద్రతా దళాలు సృష్టించిన భయోత్పాతం నుంచి విప్లవ ప్రజానీకానికి రక్షణ కల్పిస్తూ గడ్‌చిరోలిలో కా. సరిత, కా. రీతలు పోరులో తమ ప్రాణాలర్పించారు. అలాగే ఎన్నికల బహిష్కరణలో పాల్గొంటున్న ప్రజలకు రక్షణ కల్పించడంలో నిమగ్నమైన ప్రజా మిలిషియా కార్యకర్తల్లో కా. మంగ్లూ పొరపాటున తుపాకి పేలి అమరుడయ్యాడు. వారి త్యాగానికి మా కేంద్ర కమిటీ వినమ్రంగా తలవంచి విప్లవ జోహార్లర్పిస్తోంది.

మున్నెన్నడూ లేని విధంగా పోలీసులను మోహరించినా ప్రజలు అనేక చోట్ల ఒక్క ఓటు కూడా వేయలేదు. ఎన్నికల కమీషన్ 35 బూతులలో ఖాళీ మిషన్‌లు వెనక్కి వచ్చాయని ప్రకటించడం గమనార్హం. నిజంగా విప్లవోద్యమ ప్రాంతంలో వాస్తవ పరిస్థితిని గమనిస్తే వందలాది బూతులలో నామమాత్ర పోలింగ్ జరిగింది. మరోవైపు ఎన్నికల కమీషన్ దాదాపు 170 బూతులను లోతట్టు గ్రామాల నుంచి పోలీసుల కనుసన్నలలోనే తరలించిందంటేనే అక్కడ నెలకొన్న పరిస్థితిని ఎవరైనా గ్రహించవచ్చు. ఇంతేగాకుండా విప్లవోద్యమ ప్రాంతాలలో

తమ డ్యూటీలు నిర్వర్తించడానికి వచ్చిన అర్ధ సైనిక బలగాలలో ఇద్దరు గుండె ఆగి మరణించగా మరో ఘటనలో తన ప్లాటూన్ కమాండర్‌ను ఒక కానిస్టేబుల్ కాల్చి చంపాడు. ఇలాంటి పరిస్థితులను కప్పిపుచ్చుతూ ఛత్తీస్‌గడ్ డిఎస్‌పి ఎన్నికల నిర్వహణలో భద్రతా బలగాల పాత్రను తెగ కొనియాడుతూ సందేశం ఇవ్వడం హాస్యాస్పదంగానే ఉంది.

జనతన సర్కార్ల ఎన్నికలలో అత్యంత ఉత్సాహంగా పాల్గొంటూ బూర్జువా విధాన సభ ఎన్నికలను బహిష్కరించిన ప్రజలకు మరోసారి మా కేంద్ర కమిటీ విప్లవాభివందనాలు తెలుపుతోంది. తమ ప్రజాస్వామ్య హక్కుల సాధనలో భాగంగా దాదాపు ఏడేళ్లు చట్టపరంగా పోరాడి 'నోటా'ను సాధించుకున్న వాళ్లు వాస్తవంగా బూటకపు ఎన్నికల బహిష్కరణను కొనసాగిస్తూ, రీకాల్ హక్కుతో సహా తమ ప్రభుత్వాలను ఎన్నుకుంటున్న విప్లవ ప్రజానీకం పక్షం నిలిచి వారి హక్కులను ఎత్తిపట్టడానికి ముందుకు రావాల్సిందిగా మా పార్టీ ప్రజాస్వామికవాదులకూ, మేధావులకూ, హక్కుల సంఘాల కార్యకర్తలకూ విజ్ఞప్తి చేస్తోంది.

**అభయ్**

**అధికార ప్రతినిధి**

**కేంద్ర కమిటీ**

**సీపీఐ (మావోయిస్టు)**

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# సెంట్రల్ రీజినల్ బ్యూరో

**9-12-2013**

## హైదరాబాద్‌ను పది సంవత్సరాల ఉమ్మడి రాజధానిగా ప్రకటించడం, గవర్నర్ పాలనను రుద్దడం, పోలవరం ప్రాజెక్టును వ్యతిరేకించాలి!

## తెలంగాణ ముసాయిదా బిల్లు పార్లమెంటులో ఆమోదం పొందే అంతవరకు ప్రజలు రాజీలేని పోరాటం చేయాలి!!

ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ ముసాయిదా బిల్లు - 2013 లేదా తెలంగాణ ముసాయిదా బిల్లును కేంద్ర కేబినేట్ ఆమోదించి రాష్ట్రపతికి పంపడము కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ప్రకటన అనంతరం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియలో మరొక ముందడుగు అని చెప్పవచ్చు. అయితే గత 60 సంవత్సరాలుగా తెలంగాణలో తమ రాజకీయ, ఆర్థిక, అధికార బలంతో కోస్తా, రాయలసీమ పెట్టుబడిదారులు అక్రమంగా సంపాదించిన ఆస్తులను చట్టబద్ధం చేసుకోవడానికి భవిష్యత్తులో తమ దోపిడీని కొనసాగించడానికి ఆంధ్ర ప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ బిల్లు ద్వారా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. దీని వల్ల సుదీర్ఘ కాలం పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో కూడా సీమాంధ్ర పెట్టుబడిదారుల దోపిడీ కొనసాగుతుంది. తెలంగాణ ప్రయోజనాలను పణంగా పెట్టి సీమాంధ్ర పెట్టుబడిదారుల ప్రయోజనాలకు అనుకూలంగా బిల్లు రూపొందించబడిన సమయంలో తెలంగాణ రాజకీయ నాయకులు సోనియాగాంధీకి కృతజ్ఞతలు తెలుపుకోవటంలోనే కాలయాపన చేస్తున్నారు. తెలంగాణ ప్రజలు సుదీర్ఘకాలం చేసిన వీరోచిత పోరాటాలకు కాంగ్రెస్ పార్టీ తలొగ్గి రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో ఓటమి భయంతోనే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు అంగీకరించింది. కానీ తెలంగాణ కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞత సభలతో బానిస వ్యక్తిత్వాలను బయట పెట్టుకుంటున్నారు.

భారతదేశ చరిత్రలో పది సంవత్సరాలు ఉమ్మడి రాజధానిగా ఉన్న సందర్భాలు లేవు. హర్యానా, పంజాబ్‌లకు పది సంవత్సరాలు ఉమ్మడి రాజధానిగా ఛండీఘడ్‌ను నిర్ణయించి అనేక సమస్యలతో నేటికి కొనసాగిస్తున్నారు. తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్‌లకు హైదరాబాద్‌ను పది సంవత్సరాలు ఉమ్మడి రాజధానిగా నిర్ణయించి దాని పై గవర్నర్‌కు అధికారం ఇవ్వటం అంటే పరోక్షంగా కేంద్ర పాలిత ప్రాంతంగా చేయడమే అవుతుంది. యిప్పటికీ భారత పాలక వర్గాలు బ్రిటిష్ వలస పాలన నుంచి అరువు తెచ్చుకున్న పాలన విధానాలను వదిలించుకోలేక పోతున్నారు. అందుకు తాజా ఉదాహరణ హైదరాబాద్‌లో గవర్నర్ పాలనను ప్రతిపాదించడం. ఫెడరల్ స్ఫూర్తికి విఘాతం కలిగేలా, తెలంగాణ రాష్ట్ర హక్కును హరించేలా ఈ ప్రతిపాదన ఉంది. కోస్తా, రాయలసీమ ప్రజలు హైదరాబాద్‌లో మాత్రమే కాకుండా తెలంగాణ అంతటా స్థిరపడి వున్నారు. కానీ ఒక హైదరాబాద్‌ను మాత్రమే ఉమ్మడి రాజధానిగా కోరుతున్నారంటే అది సీమాంధ్ర ప్రజల ప్రయోజనాలకు కాకుండా వారు అక్రమంగా సంపాదించిన ఆస్తులను కాపడుకోవడానికే అనేది స్పష్టంగా తెలుస్తుంది.

పెద్ద మనుష్యుల ఒప్పందం, ముల్కీ నిబంధనలు, 610 జి.వో. లను వుల్లంఘించి తెలంగాణలో అక్రమంగా ఉద్యోగాలు పొందిన వారిని కోస్తా, రాయలసీమ ప్రాంతాలకు పంపి వేయకుంటే తెలంగాణ విద్యార్థులు, నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరుగుతుంది. అక్రమంగా ఉద్యోగాలు పొంది ఇక్కడే పదవి విరమణ చేసిన ఉద్యోగులకు తెలంగాణ ప్రభుత్వమే పెన్షన్‌లు చెల్లించాలని నూతన బిల్లులో పొందుపరచారు. కానీ, వాస్తవంగా వారికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వమే పెన్షన్‌లు చెల్లించాలి.

కృష్ణా, గోదావరి నది జలాలను యిప్పటికే కోస్తా వాళ్లు వారి వాటాకు మించి ఉపయోగించుకుంటున్నారు. యింత కాలం తెలంగాణలో వ్యవసాయానికి ప్రాజెక్టుల ద్వారా నీటిని అందించకుండా తీవ్ర నష్టం చేసారు. యిప్పుడు గోదావరి నది జలాలను కోస్తా వ్యవసాయ స్థిరీకరణకు, కోస్తా పారిశ్రామిక కారిడార్‌కు పోలవరం ప్రాజెక్టు నిర్మించి నీటిని ఇవ్వబోతున్నారు. దీని వల్ల తెలంగాణ గోదావరి నది జలాలను కోల్పోవటమే కాకుండా నిర్వాసిత, పర్యావరణ సమస్యలు తల ఎత్తుతాయి. ఆదివాసీ ప్రజలు తమ జీవనాధారాలన్నింటినీ కోల్పోతారు. అంతే కాక యి నదులపై రివర్ అథారిటీ పేరిట కమిటీలను ఏర్పాటు చేస్తూనే ఒకవైపు పులిచింతలను పూర్తి చేయ పూనుకోవడం మరోవైపు పోలవరంకు జాతీయ హోదా కల్పించడం ద్వారా తెలంగాణ ప్రజలు నీటిపై హక్కులు కోల్పోతారు. రాయలసీమ ప్రాంతానికి కూడా సమస్యలు ఎదురవుతాయి. రెండు రాష్ట్రాలు, వెనుకబడిన ప్రాంతాలు ప్రతిపాదికపై నదీ జలాలను సహజ న్యాయసూత్రాలపై ఆధారపడి పంపకాలు చేయాలి.

ఆంధ్రప్రదేశ్‌కున్న అప్పులను జనాభా ప్రాతిపదికన కాకుండా ఆ అప్పులను ఏ ప్రాంత అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించారో ఆ ప్రాంతం వారే వాటిని భరించాలి. తెలంగాణ ప్రజలు ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ ముసాయిదా బిల్లులోని అప్రజాస్వామిక మైన తెలంగాణ

ప్రజలకు తీవ్రంగా నష్టం చేసే పోలవరం ప్రాజెక్టుకు రద్దుకు, ఉమ్మడి రాజధాని, గవర్నర్ పాలనలకు వ్యతిరేకంగా ఉద్యమించాలి.

కోస్తా, రాయలసీమ పెట్టుబడిదారులు హైదరాబాద్ లో ఆక్రమించుకున్న ప్రభుత్వ ప్రైవేటు భూములను స్వాధీనం చేసుకొని భూమి లేని పేదలకు పంపిణి చేయాలి. కోస్తా, రాయలసీమ ప్రజలు అక్కడి పెట్టుబడిదారుల, రాజకీయ నాయకుల అబద్ధపు ప్రచారాలను నమ్మకుండా కొత్త రాజధాని నిర్మాణం, అభివృద్ధి, వికేంద్రీకరణలపై దృష్టి పెట్టాలి. వెనుకబడిన ప్రాంతాలయిన రాయలసీమ, ఉత్తర కోస్తాలు భవిష్యత్తులో పెట్టుబడిదారుల చేత మోసపోకుండా ఇప్పుడే వాటి అభివృద్ధికి సమగ్రమైన పథకాలు రూపొందించి అమలు పరిచేందుకు అక్కడి ప్రజలు ఉద్యమించాలి. తెలంగాణ ముసాయిదా బిల్లుకు యి ప్రాంతాల ప్రజానీకం మద్దత్తునివ్వాలి.

విప్లవాభివందనాలతో

ఆనంద్

సెంట్రల్ రీజనల్ బ్యూరో కార్యదర్శి

భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# కేంద్ర కమిటీ

**28-12-2013**

## కామ్రేడ్స్ గంటి ప్రసాదం, ఆకుల భూమయ్యల పాశవిక హత్యలను ఖండించండి!
## ప్రజానాయకుల అక్రమ అరెస్టులనూ, వేధింపులనూ, వారిపై తప్పుడు కేసుల బనాయింపునూ ఖండించండి!
## ప్రజా ఉద్యమాలలోకి ప్రజారాశులను లక్షలాదిగా కదిలించి, సంఘటితం చేయడం ద్వారా ప్రజాసంఘాలను అణచివేయాలనే పాలకవర్గాల కుట్రను ఓడించండి!

కొద్ది నెలల తేడాలోనే ఆంధ్రప్రదేశ్ పాలకవర్గాలు ఇరువురు విప్లవ ప్రజానాయకులను ఒకరి వెంబడి ఒకరిని హత్య చేశాయి. కామ్రేడ్ గంటి ప్రసాదం, కామ్రేడ్ ఆకుల భూమయ్యలు హంతక ముఠాల నుండి తమ ప్రాణాలకు నిరంతరం ముప్పు ఉన్నప్పటికీ ఖాతరు చేయకుండా తమ తమ సంస్థలకు నాయకత్వం వహిస్తూ వస్తున్న క్రమంలో రాజ్య ప్రాయోజిత కిరాయి హంతకుల చేతుల్లో అసువులు బాసారు. బహిరంగ హెచ్చరికలనూ, బెదిరింపులనూ పక్కను తోసేస్తూ వారు తీవ్రమైన నిర్బంధాన్ని ఎదిరించి నిలిచారు, జైళ్ల పాలయ్యారు, దశాబ్దాలుగా విప్లవోద్యమ ఒడిదుడుకుల్లో గట్టిగా నిలిచారు, నక్సల్బరీ పంథా పట్ల తమ నిబద్ధతను నిలుపుకున్నారు. ప్రజలు, ప్రజలు మాత్రమే చరిత్ర నిర్మాతలు అనే విశ్వాసాన్ని వారు ఎన్నడూ కోల్పోలేదు. ప్రజల రాజకీయాల్లో వారికున్న ఈ విశ్వాసమే తమ చివరి శ్వాస వరకూ అనేక కష్టనష్టాల మధ్య కూడా ఎర్రజెండాను ఎత్తిపట్టే శక్తినీ, నిశ్చయాన్నీ వారికివ్వగలిగింది. మార్క్సిజం-లెనినిజం-మావోయిజం అనే ఆయుధం తప్ప మరే ఆయుధాన్నీ ధరించని ఈ ఇరువురు ప్రజానాయకులనూ లేకుండా చేయడానికి శత్రువుకు మరే మార్గమూ లేకపోయింది అనేది ఒక విధంగా విప్లవాశయం పట్ల ఊగిసలాట లేని వారి నిబద్ధతకు ఒక గొప్ప సూచిక. యుద్ధరంగంలో ముందుపీఠిన నిలిచి వారు విప్లవ ప్రజాసంఘాలపై శత్రువు ఎక్కుపెట్టిన ఇటీవలి దాడిలో తుపాకులకెదురు నిలిచారు. తమ ప్రాణాలను ఒడ్డి వారు ప్రజలకు అత్యంత అంకిత భావంతో సేవ చేశారు. తమ అమరత్వంతో వారు మనందరినీ కూడా అలా చేయమని పిలుపునిస్తున్నారు. వారి మరణం

హిమాలయాలకన్నా ఉన్నతమైనది.

ఇటువంటి ఫాసిస్టు పద్ధతులు ఏపీ విప్లవ ప్రజానీకాన్ని తొక్కిపెట్టి ఉంచడంలో విఫలమయ్యాయనేది తేటతెల్లమే. గతంలోనూ డా.రామనాథం, జాపా లక్ష్మారెడ్డి, నర్రా ప్రభాకర రెడ్డి, పురుషోత్తం, ఆజం అలీ వంటి ప్రఖ్యాత పౌరహక్కుల సంఘం నాయకులనూ, బెల్లి లలిత, కనకాచారి, మన్నెం ప్రసాద్ ఇంకా మరెందరో వివిధ ప్రజాసంఘాల కార్యకర్తలనూ యూనిఫారం ధరించని పోలీసుల చేతుల్లోనో, రాజ్యప్రాయోజిత హంతక ముఠాల్లోనో ప్రాణాలు కోల్పోడాన్ని వారు చూసి ఉన్నారు. వర్గహింస ఎంత పాశవికంగా ఉంటుందనేది వారికి తెలుసు. ఎంపిక చేసిన ప్రజా నాయకులను ఒక్కొక్కరినిగా చంపే పాలకవర్గాల క్రూరత్వం విషయంలో వారికి భ్రమలు లేవు. ఈ హత్యలతో ఏమాత్రం వెనకడుగు వేయకుండా వాటిని గట్టిగా నిరసిస్తూ ఏపీ ప్రజానీకం, వారి సంస్థలూ, కార్యకర్తలూ ఏపీ పోలీసుల, వారి రాజకీయ నేతల కుతంత్రాలను గట్టిగా ఓడించారు. ప్రతిఘటనా స్ఫూర్తితో వారి హత్యలకు ఎల్లెడలా నిరసనలు వ్యక్తం చేశారు.

రాజ్యం చేసిన ఈ రెండు హత్యలకూ ఏపీ సంబంధిత ఒక నిర్దిష్ట నేపథ్యం ఉంది. అదే సమయంలో, విప్లవోద్యమంపై భారత దళారీ పాలకులు చేపట్టిన దేశవ్యాప్త బహుముఖ దాడి నుండి దీన్ని వేరు చేసి చూడలేం. సామ్రాజ్యవాదుల నుండి నేర్చుకుని దశాబ్దాలుగా కశ్మీర్, ఈశాన్య ప్రాంతాల్లో అమలు చేస్తూ వస్తున్న తక్కువ తీవ్రత యుద్ధ (లో ఇంటెన్సిటీ కాన్లిఫ్ట్-ఎల్ఐసీ) ఎత్తుగడలను రాజ్యం మావోయిస్టు ఉద్యమాన్ని తుడిచిపెట్టడానికి అన్వయించాలని ప్రయత్నిస్తున్నది. ఒకవైపు అది విప్లవ పార్టీపైనా, ప్రజలపైనా పాశవిక నిర్బంధాన్ని ప్రయోగిస్తూనే మరోవైపు వారి "హృదయాలనూ, మెదళ్లనూ" గెలుచుకోవడానికి ఉద్దేశించిన బూటకపు సంస్కరణలను అమలు చేస్తోంది. తెల్లబీభత్సం ద్వారా ప్రజలను బెదిరించి లొంగదీసుకోవడం, విప్లవ సంస్థలను విశాల ప్రజల నుండి వేరుచేయడం, ఆ సంస్థల నాయకత్వాన్ని తుంచేయడం, విప్లవపార్టీకి ప్రజలతో సజీవ సంబంధాలు కలిగి ఉండడాన్ని అసాధ్యం చేయడం వారి లక్ష్యం. విప్లవ ప్రజానీకం సృష్టించుకున్న బీజరూపంలోని ప్రజారాజ్యాధికారాన్ని అణగదొక్కడానికీ, తుపాకుల నీడలో బూటకపు ఎన్నికల ప్రహసనాన్ని వారిపై రుద్దడానికీ వందల వేల పోలీసు, పారామిలటరీ, సైనిక బలగాలను కేంద్రీకరిస్తున్నారు. ఆపరేషన్ గ్రీన్‌హంట్ రెండవ దశలో తీవ్రతరం చేస్తున్న ఈ దాడితో భారత రాజ్యం నేడు కొనసాగుతున్న అంతర్యుద్ధంలో చొరవను చేజిక్కించుకోవడానికీ, పైచేయి సంపాదించడానికీ తీవ్రంగా కృషి చేస్తోంది.

ఈ విప్లవ ప్రతీఘాతుక యుద్ధంలో భాగంగా కామ్రేడ్స్ ప్రసాదం, భూమయ్యల హత్యలు జరిగిన 2013 జులై-నవంబర్ ల మధ్యకాలంలో రాజ్యం మన దేశంలోని ప్రజాస్వామిక విప్లవంతో సంబంధం కలిగిన ఎందరో కార్యకర్తలను వరుసగా అరెస్టులు చేసింది. ఒడిషా

ప్రజాస్వామిక ఉద్యమంలోని ప్రముఖుల్లో ఒకరు, ఆర్‌డిఎఫ్ కార్యనిర్వాహకవర్గ సభ్యుడు అయిన దండపాణి మొహంతిని 2013 ఫిబ్రవరిలో అరెస్టు చేసి, తప్పుడు సాక్ష్యాలతో ఆయనపై 19 మావోయిస్టు సంబంధిత కేసులను బనాయించారు. ఆయనపై ఇతర అభియోగాలతో పాటు రాజద్రోహం, ప్రభుత్వానికి వ్యతిరేకంగా యుద్ధం, అల్లర్లు, చట్టవిరుద్ధ సంస్థలో సభ్యత్వం, ఆయుధాల చట్టం, చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం కింద అభియోగాలు ఉన్నాయి. పశ్చిమ బెంగాల్ స్పెషల్ టాస్క్ ఫోర్సు అన్ని రకాల నిబంధనలనూ ఉల్లంఘించి కోల్‌కతాలోని ప్రజాస్వామిక, ప్రజా ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొంటుండిన జయితా దాస్ అనే ప్రజాకార్యకర్తను 2013 ఆగస్టులో అరెస్టు చేసింది. అదే నెలలో చట్టానికి తమను తాము అతీతులుగా భావించుకునే ఝార్ఖండ్ పోలీసులు, సాంస్కృతిక కార్యకర్త ఉత్పల్ భస్కేనూ, విస్థాపన వ్యతిరేక కార్యకర్త ఇస్పాత్ హేంబ్రంనూ 'విస్థాపన విరోధి జన వికాస్ ఆందోళన్' కార్యాలయం నుండి ఎత్తుకుపోయారు. ఇటీవలి కాలంలో కేరళ ప్రభుత్వం ఆర్‌డిఎఫ్ నాయకులనూ, ఇతర ప్రజాస్వామికవాదులనూ అనేకమందిని అరెస్టు చేసి నిరసన గళాలను అణచివేయడంలో ఇతర ఫాసిస్టు రాష్ట్ర ప్రభుత్వాలతో పోటీపడింది. పశ్చిమ బెంగాల్ లో మమతా బెనర్జీ ప్రభుత్వం కామ్రేడ్ కిషన్‌జీకి ఎప్పుడో వైద్యం చేశాడనే కారణంతో సమీర్ బిస్వాస్ అనే రిటైర్డ్ డాక్టర్ ను అరెస్టు చేసింది. పశ్చిమ బెంగాల్ ఆర్‌డిఎఫ్ కార్యనిర్వాహక సభ్యుడు రాజా సర్ఖేల్ నూ, మరో కమిటీ సభ్యుడు ప్రసూన్ చటర్జీనీ కూడా అరెస్టు చేసి జైల్లోకి తోశారు.

హేమ్ మిశ్రా అనే ఉత్తరాఖండ్ విద్యార్థి, సాంస్కృతిక కార్యకర్తను గడ్చిరోలి పోలీసులు ఆగస్టులో అరెస్టు చేసి అక్రమ నిర్బంధంలో ఉంచారు. మావోయిస్టు పార్టీ కోసం పని చేస్తున్నాడనే ఆరోపణలతో అతనిపై నిరంకుశ ఊపా చట్టం కింద కేసు నమోదు చేశారు. కొద్ది వారాలు కూడా గడవకుండానే, ఉత్తరాఖండ్ కు చెందిన పౌరహక్కుల కార్యకర్త ప్రశాంత్ రాహీని గడ్చిరోలి పోలీసులు రాయ్‌పూర్ నుండి అరెస్టు చేసి, మహారాష్ట్రలో అరెస్టును చూపి హేమ్ మిశ్రాపై పెట్టిన కేసుల్లో ఇరికించారు. అంతేగాక, ఈ అరెస్టులను సాకుగా చూపి ఢిల్లీ యూనివర్శిటీ ప్రొఫెసర్, అఖిల భారత విప్లవ ప్రజాసంఘాల వేదిక నాయకుడూ, అంతర్జాతీయ సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమ నాయకుడూ అయిన జి ఎన్ సాయిబాబా ఇంటిపై పోలీసులు దాడి చేసి, ఆయనను ఇంటారగేట్ చేశారు. దేశ విప్లవ ప్రజాఉద్యమ ప్రముఖ నాయకుడూ, ఆర్‌డిఎఫ్ జనరల్ సెక్రటరీ అయిన రాజ్‌కిశోర్ ను నవంబర్ లో బీహార్ లో అరెస్టు చేసి, ఆయన వయస్సునూ, అనారోగ్యాన్నీ కూడా పట్టించుకోకుండా జైల్లో పడేశారు. ఎప్పుడో 2005-2006లో నమోదు చేసిన కేసుల్లో ఇరికించి ఆయనను సంవత్సరాల తరబడి జైల్లోనే మగ్గిపోయేలా చేయగల హత్యానేరం వంటి తీవ్రమైన ఆరోపణలు చేశారు. ఆయన వయస్సునూ, అనారోగ్యాన్నీ దృష్టిలో పెట్టుకున్నప్పుడు ఆయన ప్రాణాలకు జైల్లో తీవ్రమైన

ముప్పు పొంచి వుంది.

వీరందరినీ వారి రాజకీయ విశ్వాసాల కారణంగా, ప్రత్యేకించి ప్రజా ఉద్యమాలకు మద్దతుగా చేపట్టిన వారి రాజకీయ కార్యకలాపాల కారణంగానే లక్ష్యంగా చేసుకున్నారు అనేది తేటతెల్లమే. ప్రజా ఉద్యమాలపై రాజ్య నిర్బంధాన్ని బహిర్గతం చేసే అన్ని కార్యకలాపాలు, దేశంలోనూ, అంతర్జాతీయంగానూ పీడితుల పోరాటాలను మద్దతును కూడగట్టడం, అంతర్యుద్ధ ప్రాంతాలకు నిజనిర్ధారణలకు వెళ్లడం, రాజకీయ ఖైదీల హక్కులకై పోరాడడం, ఉపఖండంలోని ప్రజా ఉద్యమాల మధ్య వారధులను నిర్మించడం, ఇంకా యితర రాజకీయ కార్యకలాపాలూ రాజ్యం దాడికి లక్ష్యంగా వున్నాయి. భారతదేశ ప్రజాయుద్ధానికి లభిస్తున్న అంతర్జాతీయ మద్దతు కూడా పాలకులకు ఆందోళన కలిగిస్తోంది. అందుకని వారు మన దేశ పట్టణ విప్లవ, ప్రజాస్వామిక ఉద్యమాన్ని మరింత తీవ్రంగా లక్ష్యంగా చేసుకుంటున్నారు.

నవంబర్ మధ్యలో గృహ మంత్రిత్వ శాఖ సుప్రీం కోర్టులో దాఖలు చేసిన ఒక అఫిడవిట్ లో "నగరాల్లో, పట్టణాల్లోని సిపిఐ (మావోయిస్టు) సిద్ధాంతకర్తలూ, మద్దతుదారులూ రాజ్యాన్ని చాలా దారుణంగా చిత్రీకరించడానికీ, దాన్ని దుష్ప్రచారంతో బద్‌నాం చేయడానికీ ఒక క్రమబద్ధమైన, సమన్వయంతో కూడిన ప్రచారాన్ని చేపట్టారు. వాస్తవానికి, మావోయిస్టు ఉ ద్యమాన్ని సజీవంగా ఉంచినది ఈ సిద్ధాంతకర్తలే. వారు అనేక విధాలుగా ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం కంటే ప్రమాదకరమైనవారు,'' అని పేర్కొంది. ఇది పరోక్షమైన బెదిరింపు కాదు, ప్రజాస్వామిక, విప్లవ ప్రజాసంఘాలకు ప్రత్యక్ష బెదిరింపే. మన దేశ ప్రగతిశీల ప్రజానుకూల మేధావుల పట్ల ప్రభుత్వాల ఈ వైఖరి వెలుగులోనే ఇటీవలి దాడులనూ, హత్యలనూ చూడాల్సి ఉంటుంది.

పోరాడే ప్రజలకు అందే అన్ని రకాల సహాయసహకారాలనూ అందకుండా చేయడానికీ, అన్ని రకాల ప్రభుత్వ పాశవిక చర్యలనూ ఎదిరిస్తూ జల్, జంగల్, జమీన్ ల కోసం పోరాడుతున్న పీడిత ప్రజలకు అన్ని రకాల సంఘీభావాల్నీ అణచివేయడానికీ భారత రాజ్యం చేస్తున్న ఈ కుట్రల అసలు స్వభావాన్ని గుర్తెరగమని అన్ని ప్రజాస్వామిక సంస్థలకూ, వ్యక్తులకూ, ప్రత్యేకించి ప్రజానుకూల మేధావులకూ మేం విజ్ఞప్తి చేస్తున్నాం. ఈ రాజకీయ హత్యలూ, అక్రమ అరెస్టులూ, విద్యార్థుల, మేధావుల వేధింపులూ అన్నీ పాలకవర్గాల ఎల్ఐసీ వ్యూహంలో విడదీయరాని భాగమే. గ్రామీణ ప్రాంతాల్లో పేదల్లోకెల్లా పేదలైన ప్రజలపై జరుపుతున్న లెక్కలేనన్ని అత్యాచారాల నాణేనికి ఇది మరొక వైపు, ఇది పట్టణ ప్రాంతాల్లో జరిగే గ్రీన్‌హంట్.

కామ్రేడ్స్ గంటి ప్రసాదం, భూమయ్యల పాశవిక హత్యలను ఖండించమని మేం ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాం. ప్రజానాయకుల అక్రమ అరెస్టులు, వేధింపులు, తప్పుడు కేసుల బనాయింపులను ఖండించండి. కామ్రేడ్స్ ప్రసాదం, భూమయ్య, ఇతర అమరుల త్యాగాల

స్ఫూర్తితో వారి ఆశయాల సాధన కోసం శత్రువును దృఢనిశ్చయంతో ఎదుర్కోమనీ, జాతీయ ప్రజాస్వామిక విప్లవోద్యమాన్ని ముందుకు కొనిపోమనీ మన దేశ మేధావులకూ, ప్రజలకూ మేం విజ్ఞప్తి చేస్తున్నాం.

ప్రజాసంఘాలనూ, వాటి నాయకులనూ అణగదొక్కాలని చూసే పాలకవర్గాల కుట్రలను లక్షలాదిగా ప్రజలను ప్రజాస్వామిక ప్రజాసంఘాలలోకి సమీకరించి, సంఘటితం చేయడం ద్వారా, ప్రజా ఉద్యమాల వెల్లువను సృష్టించడం ద్వారా ఓడిస్తామని ప్రతినబూనుదాం. గ్రామాల్లో, అడవుల్లో, గనుల్లో, మైదానాల్లో, బస్తీల్లో పోరాడుతున్న మన దేశ ప్రజలతోపాటుగా రెట్టించిన దృఢనిశ్చయంతో నిలుస్తామనీ, వారి పోరాటాలకు అత్యంత విశాలమైన సంఘీభావాన్ని మన దేశంలోనూ, ప్రపంచవ్యాప్తంగానూ నిర్మిస్తామనీ ప్రతినబూనుదాం. మన ఆచరణ ద్వారా అసలైన మేధావి స్థానం పీడిత ప్రజానీకం సరసన ఉంటుందే తప్ప పాలకవర్గాల ఒడిలో కాదని రుజువు చేద్దాం. వర్గపోరాటంలో రాటుదేలడం ద్వారా వందలాది ప్రసాదాలూ, భూమయ్యలూ పుట్టగల పరిస్థితులను సృష్టిద్దామని ప్రతినబూనుదాం.

**అభయ్,**

**అధికార ప్రతినిధి,**

**కేంద్ర కమిటీ,**

**సీపీఐ (మావోయిస్టు)**

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# సెంట్రల్ రీజినల్ బ్యూరో

**30-12-2013**

## తెలంగాణ ప్రజా నాయకుడు కామ్రేడ్ ఆకుల భూమయ్య హత్యను ఖండిస్తున్నాం!

## జనవరి 2వ తేదీన తెలంగాణ బంద్ సంపూర్ణంగా పాటించాలని ప్రజలకు విజ్ఞప్తి!!

డిశంబర్ 24వ తేదీన రాత్రి 9.30 గంటల సమయంలో తెలంగాణ ప్రజా ఫ్రంట్ అధ్యక్షులు కామ్రేడ్ ఆకుల భూమయ్య బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో "తెలంగాణ చారిత్రక పత్రాలు" "నేను తెలంగాణోన్ని మాట్లాడుతున్నా" పుస్తకాల ఆవిష్కరణలో పాల్గొని తిరిగి అడిక్‌మెట్‌లోని తన ఇంటికి స్కూటర్ పై వెళుతున్నప్పుడు బల్గియా టిప్పర్ చే ప్రమాదానికి గురి చేసి, అక్కడికక్కడే చంపివేసిన ప్రభుత్వ, ఎస్ఐబి దుశ్చర్యను తీవ్రంగా ఖండిస్తున్నాం. ఆయన ప్రజాస్వామిక ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి అహర్నిషలు కృషి చేసిన సేవలను గుర్తు చేసుకుంటూ ఆయనకు భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) కేంద్రకమిటీ ఘనమైన నివాళులను అర్పిస్తున్నది. ఆయన ఆశయ సాధన కోసం ముందు ప్రజాస్వామిక తెలంగాణ తో ప్రారంభించి, దేశంలో ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేసి మనిషిని మనిషి దోచుకోలేని సమ సమాజాన్ని నిర్మించడానికి మనమంతా పునరంకితమవుదామని శపథం చేద్దాం.

కామ్రేడ్ ఆకుల భూమయ్య ప్రజాస్వామిక తెలంగాణ సాధన లక్ష్యం కోసం పోరాడడంలో ఆయనకు ఎల్లవేళలా సహాయ సహకారాలందించిన ఆయన కుటుంబ సభ్యులందరికీ కేంద్రకమిటీ తరపున సంతాపాన్ని తెలియజేస్తున్నాం.

ఆయన మరణవార్త తెలిసి, ప్రమాద స్థలం నుండి ప్రారంభించి, హైదరాబాద్‌తో పాటు కాచాపూర్ గ్రామంలో ఆయన అంతిమ సంస్కారం జరిగేంత వరకు వేలాది మంది ప్రజాసంఘాల నాయకులు, మేధావులు, ప్రజాస్వామిక వాదులు, విప్లవ ప్రజానీకం హాజరై ఆయనకు ఘనంగా నివాళులు అర్పించినందుకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాం.

కామ్రేడ్ ఆకుల భూమయ్య విప్లవాల పురిటిగడ్డ అయిన కరీంనగర్ జిల్లాలోని జూలపల్లి మండలంలోని కాచాపూర్ గ్రామంలో జన్మించాడు. ఆయన విద్యార్థి దశ నుండే విప్లవ

రాజకీయాల్లో చురుకుగా పాల్గొన్నాడు. 1969లో ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో ఆయన మిలిటెంట్‌గా పాల్గొన్నాడు. ఆయన జిల్లా విద్యార్థి నాయకుడిగా ఆ రోజు ఉద్యమానికి నాయకత్వం వహించాడు. ఆ ఉద్యమంలో పాల్గొన్న నుండే ఆయన తెలంగాణ చరిత్ర, తిరుగుబాట్ల పై స్పష్టమైన అవగాహన ఏర్పరుచుకున్నాడు. ఆ వెనువెంటనే నక్సల్బరీ, శ్రీకాకుళం పోరాటం ఝుం ఝుం మారుతాములా కరీంనగర్ జిల్లా జగిత్యాల, సిరిసిల్లలను తాకినప్పుడు ఆయన విప్లవోద్యమంలో భాగమై పాలేర్ల, రైతు కూలీల హక్కులు, అధికారం కోసం భూస్వామ్య వ్యతిరేక పోరాటాల్లో చురుకుగా పాల్గొన్నాడు. ఈ పోరాటంలో భాగంగా ఒక హత్య కేసులో ఆయన కొంత కాలం పాటు జైలు శిక్ష అనుభవించాడు. ఆ తదుపరి ఆయన ఉపాధ్యాయ సంఘాల్లో వారి హక్కుల కోసం తీవ్రంగా కృషి చేశాడు. కోస్తాంధ్ర ప్రాంతానికి పరిమితమైన ఎపిటిఎఫ్ సంఘాన్ని 1984 లో తెలంగాణలోకి ఆహ్వానించి, తెలంగాణలో ఆ సంఘం అభివృద్ధికి తీవ్రంగా కృషి చేశాడు. ఆ రకంగా ఆయన ఉపాధ్యాయుల్లో ఎపిటిఎఫ్ సంఘం ద్వార విప్లవ, అభ్యుదయ భావాలను విస్తృతంగా వ్యాప్తి చేసాడు. ఈ కాలంలో ఆయన టీచర్స్ ఆర్గనైజేషన్‌ను బలోపేతం చేయడానికి తెలంగాణలోని అన్ని జిల్లాల్లో విస్తృతంగా పర్యటనలు చేశాడు.

తెలంగాణ మలి దశ ఉద్యమంలో వరంగల్ డిక్లేరేషన్ నుండి చురుకుగా పాల్గొన్నాడు. 1997లో ప్రజాస్వామిక ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తెలంగాణ జనసభను ఏర్పాటు చేసి దానికి అధ్యక్షులుగా పని చేశాడు. ఈ సంఘం తెలంగాణలో వేల గ్రామాల్లో ప్రచారాన్ని నిర్వహించి తెలంగాణ రాష్ట్ర ఆవశ్యకతను వివరించింది. ఈ సంఘం పై ప్రపంచబ్యాంక్ ఏజెంట్ చంద్రబాబు నాయుడు తీవ్ర నిర్బంధంను అమలు చేసి కామ్రేడ్స్ బెల్లి లలిత, అయిలన్న, చంద్రశేఖర్, నల్ల వసంత్, సుధర్శన్ లను పొట్టన బెట్టుకుంది. కామ్రేడ్ భూమయ్యను ఆ రోజే హత్య చేయడానికి అనేక కుట్రలు ప్రభుత్వం సాగించింది. చివరకు తమ గ్రామంలో ఆయనకు గల శత్రువుతోనే హత్య చేయించాలని పథకం వేసింది. కాని అది ఆరోజు సఫలం కాలేదు.

తెలంగాణ మలి దశ ఉద్యమంలో తెలంగాణ జనసభ, తెలంగాణ ఐక్య కార్యచరణ సంఘం, తెలంగాణ ప్రజాఫ్రంట్ సంస్థలకు నాయకత్వం వహించాడు. ఈ ఉద్యమానికి ఆయన చేసిన కంట్రీబూషన్ వెలకట్టలేనిది. ఆయన 610 జి.వో. విషయాన్ని, బాబ్లీ ప్రాజెక్టు సమస్య; తెలంగాణ బిల్లును పార్లమెంటులో ప్రవేశ పెట్టాలనే నినాదం; ఎన్నికల ద్వారా తెలంగాణ సాధ్యం కాదు – పోరాటమే మార్గం; చివరకు రాజ్యాంగంలో గల 3 ఆర్టికల్‌కు ఉన్న అధికారాలను ప్రచారం చేస్తూ తెలంగాణను అడ్డుకోవడం కోస్తాంధ్ర, రాయలసీమ పెట్టుబడి దారులకు సాధ్యం కాదని ప్రచారం చేస్తూ, తెలంగాణ ఉద్యమానికి ఎప్పటికప్పుడు ఎంతో ముందు చూపుతో దిశ – దశ ను అందిస్తూ వచ్చాడు. తనకు రాజకీయంగా ఉన్న అనుభవం, జ్ఞానంతో మార్క్సిజం – లెనినిజం – మావోయిజం సిద్ధాంత అవగాహనతో ఏ విషయంలోనైన

ప్రజా వ్యతిరేక విధానాలను తన వాగ్ధాటితో ఎదుటి వాదనలను తుత్తునియలు చేసేవాడు. అలా అయన తెలంగాణ ప్రజా పక్షపాతిగా, దేశంలోని అన్ని ప్రాంతాల్లోని పీడిత ప్రజల కోసం నిరంతరం తన జీవిత కాలమంతా పోరాడుతూ వచ్చాడు. ఆయన మార్క్సిజం – లెనినిజం – మావోయిజం సిద్ధాంత వెలుగులో జాతుల పోరాటాలను సంశ్లేషిస్తూ తెలంగాణ చరిత్ర, రాజకీయాలకు జోడించి తెలంగాణలో గొప్ప ప్రజా ఉద్యమానికి నాయకత్వం వహించాడు. గత 45 ఏండ్లుగా ప్రజాస్వామిక ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం ఆయన పట్టు విడుపులు లేకుండా పోరాడారు. ప్రత్యేక తెలంగాణ రాష్ర్రం సిద్ధించబోయే సమయంలో ఆయనను కోల్పోవడం తెలంగాణ పునర్నిర్మాణానికి ఎంతో లోటు. తెలంగాణ సమాజం గొప్ప దార్శనికున్ని కోల్పోయింది.

రాష్ట్రంలో కిరణ్ కుమార్ ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం యుపిఏ కలిసి ఈ హత్య చేశాయి. ఈ మధ్య కాలంలోనే మహబూబ్‌నగర్ మనిపెంట వెంకటేశ్వర్లు, బంధు మిత్రుల సంఘం గౌరవ అధ్యక్షుడు కామ్రేడ్ గంటి ప్రసాదంను ప్రభుత్వం హత్య చేసింది. ఇలా వరసగా ప్రజా సంఘ నాయకులను చంపి ప్రజా ఉద్యమాలను అణచివేయడానికి ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తుంది. కామ్రేడ్ భూమయ్యను ప్రజాస్వామిక ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం పోరాటం మొదలైనప్పుడే హత్య చేయడానికి ప్రభుత్వం కుట్ర పన్నుతూనే వుంది. చివరకు తెలంగాణ పునర్నిర్మాణంలో ఆయన మేధస్సు పని చేయకుండా చేయడం కోసమే ఈ హత్యకు పాల్పడింది. ప్రభుత్వం కామ్రేడ్ భూమయ్యను హత్య చేసి తెలంగాణ పోరాట కారులకు, ప్రజలకు తెలంగాణ పునర్నిర్మాణంలో ప్రజాస్వామిక ఆకాంక్షలను వెల్లడించే వారందరికి ఒక హెచ్చరిక చేసింది. ఈ సవాలును స్వీకరించి ప్రజాస్వామిక తెలంగాణ కోరుకునే వారందరూ ముందుకు వచ్చి ఆ లక్ష్యం కోసం ఈ దోపిడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బరిగీసి నిలబడి పోరాడి ప్రజాస్వామిక తెలంగాణను సాధించుకోవడం ద్వారానే మనం కామ్రేడ్ ఆకుల భూమయ్యకు నిజమైన నివాళు లు యివ్వగలం. ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, మేధావులు, ప్రజా సంఘాల నాయకులు బలంగా పోరాడడం ద్వారానే ఈ ప్రభుత్వ హత్యలను ఆపగలుగుతాము.

విప్లవాబివందనాలతో

మీ

**ఆనంద్**

**కార్యదర్శి,**

సెంట్రల్ రీజినల్ బ్యూరో,

**సీపీఐ (మావోయిస్టు)**

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# సెంట్రల్ రీజినల్ బ్యూరో

**16-2-2014**

## తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు బిల్లును అన్ని రాజకీయ పార్టీలు బేషరతుగా ఆమోదించాలి!

## పార్లమెంటులో కోస్తాంధ్ర, రాయలసీమ పాలకవర్గ పార్టీల నాయకుల అప్రజాస్వామిక చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం!!

గురువారం నాటి పార్లమెంటు సంఘటనలు పార్లమెంటరీ ప్రజాస్వామ్యంపై విశ్వాసమున్న వారందరినీ ముక్కున వేలేసుకునేటట్లు చేసిన కోస్తాంధ్ర, రాయలసీమ పెట్టుబడిదారుల, రాజకీయ నాయకుల అప్రజాస్వామిక చర్యలు లగడపాటి రాజగోపాల్ తదితర అరాచక నాయకులు సృష్టించిన గందరగోళం పార్లమెంటరీ ప్రజాస్వామ్యమని చెప్పుకుంటున్న దాన్ని కూడ అపహస్యం చేసింది. తమ స్వప్రయోజనాలలే పరమార్థంగా రాజకీయాల్లోకి వస్తున్న కూహానా నాయకులు ఎంతకైనా తెగించగలరనీ, ప్రజల సమస్యలకు వీళ్ల దృష్టిలో ఎటువంటి విలువ లేదని మరొక్కసారి ఈ ఘటన దేశ ప్రజల కళ్లకు కట్టినట్లు చూపింది. ఇదంతా ప్రత్యేక తెలంగాణకు వ్యతిరేకంగా, సమైక్యాంధ్ర పేరుతో హైదరాబాద్, దాని చుట్టుపక్కల తెలంగాణలోని తమ ఆస్తులు కాపాడుకోవడానికి కోస్తాంధ్ర, రాయలసీమ నాయకులు సృష్టిస్తున్న వీరంగం అనేది దేశప్రజలందరికీ స్పష్టమైంది.

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమైందని కాంగ్రెస్ నాయకత్వంలోని యుపీఏ ప్రభుత్వం ప్రకటించినప్పటి నుండి కోస్తాంధ్ర, రాయలసీమ పెట్టుబడిదారులు కాంగ్రెస్ టీడీపీ, వైఎస్ఆర్‌సీపీ వంటి పాలకవర్గ పార్టీల నాయకులు దీన్ని అడ్డుకోవడానికి అన్ని రకాలుగా ప్రయత్నిస్తున్నారు. ముఖ్యంగా పాలకవర్గ పార్టీల నాయకులు గతంలో ఓట్లు, అధికారం కోసం తెలంగాణ జపం చేసినవారే తెలంగాణకు వ్యతిరేకంగా సమైక్యాంధ్ర పేరుతో కిరణ్ కుమార్‌రెడ్డి ప్రభుత్వ మద్దతుతో కృత్రిమ ఉద్యమాలను సృష్టించి కోస్తాంధ్ర, రాయలసీమ ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నాలు చేశారు. నేను తెలంగాణలో పుట్టాను, తెలంగాణకు వ్యతిరేకం కాదని ఒకనాడు స్వయంగా ప్రకటించిన కిరణ్ కుమార్‌రెడ్డి తెలంగాణ ఏర్పాటు ఎలాగూ తప్పదని స్పష్టమైనాక చిట్టచివరి వరకు అడ్డుకుంటామని నిస్సిగ్గుగా ప్రకటించాడు. చివరికి రాష్ట్ర శాసనసభ, శాసనమండలిలో ముఖ్యమంత్రి కిరణ్ కుమర్ రెడ్డి ప్రవేశపెట్టిన తీర్మానం ద్వారా మూజువాణి ఓటుతో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును తిరస్కరించారు. తెలంగాణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టిన చిట్ట చివరి అంకంలో అడ్డుకోవడానికి భౌతికదాడులు, పెప్పర్ స్ప్రేతో నిస్సిగ్గుగా పార్లమెంటులోనే ముష్టి యుద్ధానికి తలపడటం వీరి దురాఘాతాలకు పరాకాష్ట. ఇటువంటి దుండగానికి పాల్పడిన అరాచకుడు లగడపాటి రాజగోపాల్‌ను ఆంధ్ర భగత్‌సింగ్‌గా కీర్తించడం వీరి సిగ్గుమాలిన చర్యలకు పరాకాష్ట.

ప్రజాస్వామ్యానికి తలమానికమని తాము చెప్పుకునే పార్లమెంటులో స్వదేశ ప్రజలకు వ్యతిరేకంగా తాము వల్లించే ప్రజాస్వామ్యాన్నే అవమానపరిచిన లగడపాటి, విదేశీ పాలకులను గడగడ లాడించిన భగత్‌సింగ్ కాలిధూళికి కూడా సరితూగడని భారత ప్రజలకు బాగానే తెలుసు.

కాంగ్రెస్ నేతృత్వంలోని యుపీఏ ప్రభుత్వం తెలంగాణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టక తప్పనిస్థితికి నెట్టింది తెలంగాణ ప్రజల నిరంతర పోరాటమే. డిసెంబర్ 9, 2009న తెలంగాణ ప్రక్రియను ప్రారంభించాల్సిన యుపీఏ ప్రభుత్వం, ఇంతకాలం సమస్యను సాగదీసి తీరా తన పాలనా కాలం చివరిదశకు చేరిన సమయంలో ప్రవేశపెట్టడం ఈ అనర్థాలకు కారణం. అందువల్ల జరుగుతున్న పరిణామాలన్నింటికీ కాంగ్రెస్ నేతృత్వంలోని యుపీఏ ప్రభుత్వానిదే ప్రధాన బాధ్యత.

అయితే వీటన్నింటి మాటున తెలంగాణకు మద్దతిస్తామంటూ చిట్టచివరి అంకంలో 'సమన్యాయం' అంటున్న ప్రధాన ప్రతిపక్షం బీజేపీ అసలు స్వభావం కూడా ఇక్కడి దృష్టిలో వుంచుకోవాలి. వాస్తవంగా యుపీఏ హయంలో తెలంగాణ ఏర్పాటువల్ల ఆ క్రెడిట్ కాంగ్రెస్‌కు దక్కుతుందనేది బీజేపీ ఆలోచన. ఏ విధంగానైనా తెలంగాణ ఆగిపోతే దాన్ని వుపయోగించుకొని తెలంగాణలో ఓట్లు దండుకోవడం, కేంద్రంలో అధికారంలోకి వస్తే కాంగ్రెస్ వలే తన అధికారం నిలబెట్టుకోవడానికి ఉపయోగపడినంత కాలం తెలంగాణ సమస్యను వుపయోగించుకోవాలనేది దాని ఉద్దేశ్యం. ఒక ఓటు – రెండు రాష్ట్రాలు అంటూ తను అధికారంలో వున్న కాలంలో ఇవ్వకుండా తెలంగాణకు తెడ్డుచూపిన బీజేపీ మరోసారి అధికారంలోకి వస్తే ఇస్తుందనుకోవడం కల్ల. రాష్ట్రంలో, కేంద్రంలోనూ అధికారంలో వున్న కాంగ్రెస్‌కు సాధ్యంకాని తెలంగాణను బీజేపీ ఇస్తుందనుకోవడం పెద్ద భ్రమగానే మిగిలిపోగలదు. ఇది వాస్తవం కాకపోతే ఇన్నాళ్లు కన్పించని సమన్యాయం ఇవ్వాళ బీజేపీకి ఎలా కన్పించినట్లు? దశాబ్దాలుగా తెలంగాణకు జరుగుతున్న అన్యాయం దశాబ్దానిక పైగా ఎంతో మంది మేధావులు నిగ్గుతేల్చిన గణాంకాలు, లెక్కలు ఎటువంటి మినహాయింపులు లేని తెలంగాణ రాష్ట్ర ఏర్పాటే సరైన న్యాయమని ఘోషిస్తుంటే ఇప్పుడు చివరి దశలో బీజేపీకి సమన్యాయం ఎలా కన్పించకుండా పోయింది? కాగల కార్యం గంధర్వులే నెరవేర్చుతారన్న చందంగా క్రియాశీల మద్దతు నిచ్చే పోరాటాలేమి చేయకుండా

అగ్నిలో తానింతా ఆజ్యం పోస్తే సరి అన్నట్లు 'సమన్యాయం' పుల్లను ఎగదోస్తున్నది. మరో పక్క తెలంగాణ బిల్లు పార్లమెంటులో ప్రవేశపెట్టినట్లు కాంగ్రెస్ స్పష్టంగా ప్రకటించిన తర్వాత బిల్లు ప్రవేశపెట్టినట్లు తాము భావించడం లేదని బీజేపీ నేత సుష్మా స్వరాజ్ సన్నాయి నొక్కులు నొక్కుతున్నది. ఇదంతా కన్పించకుండా కాలడ్డువేసే బీజేపీ వైఖరి తప్ప మరోకటికాదు. కాకుంటే తనతో సంప్రదింపులకు వచ్చిన వైఎస్ఆర్ సీపీ అదినేత జగన్ ముందు దేశ ప్రజల ముందు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు పట్ల తన పార్టీ చిత్తశుద్ధిని, నిజాయితీని బీజేపీ అధ్యక్షుడు రాజ్‌నాథ్‌సింగ్ నిర్ద్వంధంగా ప్రకటించాలి. తెలంగాణ పేరుతో తెలంగాణలో బలపడడం, ఓట్లు దండుకోవడం సంఘ్ పరివార్ ఎజెండాను అమలు చేయడమే బీజేపీ అసలు వుద్దేశ్యం. తెలుగుదేశం పార్టీ తెలంగాణలో ఓట్ల కోసం ఎన్నెన్ని నాటకలాడిందో తెలంగాణ ప్రజలకు తెలుసు. సరైన సమయంలో సరైన నిర్ణయం, రెండు కళ్ల సిద్ధాంతం, పాద యాత్రలు వంటి ఎన్ని ఫీట్లు చేసినా టీడీపీ అదినేత చంద్రబాబు తెలంగాణ ప్రజల విశ్వాసాన్ని సంపాదించలేకపోయాడు. తెలంగాణ ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుండి తెరవెనుక ఎన్ని కుట్రలు చేయాలో, ఎన్ని గోతులు తవ్వాలో అన్ని తవ్వుతూ చివరికి పార్లమెంటులో పెప్పర్ స్ప్రే అరాచకుల దుండగాలకు, ముష్టి యుద్ధాలకు యుధోచితంగా సహాయం చేశాడు. శాసనసభలో తెలంగాణ మాట ఎత్తరాదన్న పచ్చి తెలంగాణ వ్యతిరేకి చంద్రబాబును తెలంగాణ ప్రజలు ఎన్నటికీ మరువరు. విజయమ్మలు, షర్మిలమ్మలు ఎన్ని నిరహారదీక్షలు, పాదయాత్రలు చేసినా వైఎస్ఆర్ సీపీ జగన్‌ల బుద్ధి ఎరిగిన తెలంగాణ జనం మహబూబాబాద్ ఘటన నాడే దాని రంగు బహిరంగం చేశారు. ఇటువంటి గోడ మీది పిల్లులకు, గోతికాడి నక్కలకు ఎలా బుద్ధి చెప్పాలో తెలంగాణ ప్రజలకు బాగానే తెలుసు.

ప్రియమైన ప్రజలారా!

తెలంగాణ సమస్య పట్ల దోపిడీ పాలకవర్గ పార్టీల, నాయకుల చిత్తశుద్ధి ఏమిటో ఇప్పుడు స్పష్టంగా బయటపడుతుంది. తెలంగాణ వ్యతిరేకుల, ద్రోహుల ముసుగులన్నీ తొలగిపోయి బహిర్గతమవుతున్నారు. ఈ దశలో కూడా పార్లమెంటులో ప్రవేశపెట్టిన తెలంగాణ బిల్లును గెలిపించేది నాలుగున్నర కోట్ల తెలంగాణ ప్రజల ఉద్యమమే. ఎవరెన్ని అడ్డంకులు కల్పించినా బిల్లును తెలంగాణ ప్రజలు గెలిపించుకొని తీరుతారు.

తెలంగాణ రాష్ట్రం తెలంగాణ ప్రజల జీవన్మరణ సమస్య. దాని పరిష్కారానికై వందలు, వేలుగా బలిదానాలు చేస్తూ ఉద్యమిస్తున్న తెలంగాణ ప్రజలకు ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు మద్దతివ్వవలసిందిగా కోస్తాంధ్ర, రాయలసీమ ప్రజలకు, ప్రజాస్వామిక వాదులకు విజ్ఞప్తి చేస్తున్నాం. తెలంగాణ బిల్లును అడ్డుకుంటూ పార్లమెంటులో కోస్తాంధ్ర, రాయలసీమ ఎంపీలు సృష్టించిన ముష్టియుద్ధాన్ని, పెప్పర్ స్ప్రే ప్రయోగం వంటి అప్రజాస్వామిక, అరాచక చర్యలను తీవ్రంగా ఖండించాలని కోస్తాంధ్ర, రాయలసీమతో సహా దేశ ప్రజలను, ప్రజాస్వామిక వాదులను కోరుతున్నాం.

తెలంగాణ ప్రజల న్యాయమైన సమస్య పరిష్కారం కొరకు తెలంగాణ బిల్లును దేశంలోని అన్ని రాజకీయ పార్టీలు పార్లమెంటులో బేషరతుగా ఆమోదించాలని డిమాండ్ చేస్తున్నాం. ఫిబ్రవరి 13న పార్లమెంటులో కోస్తాంధ్ర, రాయలసీమ పాలకవర్గ పార్టీల ఎంపీల అప్రజాస్వామిక అరాచక చర్యను తీవ్రంగా ఖండిస్తున్నాం.

విప్లవాభివందనాలతో

అధికార ప్రతినిధి

సెంట్రల్ రీజినల్ బ్యూరో

సిపిఐ (మావోయిస్టు)

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# కేంద్ర కమిటీ

**1-3-2014**

## భారత విప్లవ నాయకుడు కామ్రేడ్ ఎస్.ఏ. రవూఫ్ అమరత్వాన్ని పురస్కరించుకొని

## సి.పి.ఐ. (మావోయిస్టు) సిసి సంతాప సందేశం

భారత విప్లవ నాయకుడు కామ్రేడ్ ఎస్.ఏ. రవూఫ్ 2014 ఫిబ్రవరి 9న రాత్రి 80 సంవత్సరాలకు పైబడిన వయస్సుతో తీవ్ర అనారోగ్యంతో అమరులైనారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అనంతపూర్ జిల్లా కదిరి పట్టణం ఆయని స్వస్థలం. ఆయన ఎల్.ఎల్.బి. విద్య చదివారు. 1950ల నుంచి భారత కమ్యూనిస్టు ఉద్యమంలో భాగమయ్యారు. సిపిఐ రివిజనిజంతోనూ, సిపిఐ (ఎం) నయా రివిజనిజంతోనూ సైద్ధాంతికంగా పోరాడిన వారిలో కామ్రేడ్ రవూఫ్ ఒకరు. కేంద్రకమిటీ, సి.పి.ఐ. (మావోయిస్టు) కామ్రేడ్ ఎస్.ఏ. రవూఫ్‌కు తలవంచి వినమ్రంగా జోహార్లు అర్పిస్తోంది.



నక్సల్‌బరీలో 1967లో ఆరంభమైన రైతాంగ సాయుధ విప్లవం భారత విప్లవ చరిత్రలోనే ఒక పెద్ద మలుపు. 1948 నుండి 1951 వరకు జరిగిన వీర తెలంగాణ సాయుధ పోరాటం, పునప్రా, వాయలార్, తెభాగ ఉద్యమాల విప్లవ వారసత్వ కొనసాగింపుగా చైతన్యపూరితంగా నిర్దిష్టమైన లక్ష్యంతో మార్క్సిజం-లెనినిజం-మావో ఆలోచనా విధానం (నేడు మావోయిజం) గైడెన్స్‌లో ఆరంభమై కొనసాగుతున్న సాయుధ రైతాంగ విప్లవానికి నాంది నక్సల్బరీయే. రివిజనిస్టు నాయకత్వంపై తిరుగుబాటు చేసి పార్టీలో పదునైన సిద్ధాంత పోరాటం జరిపిన ఫలితంగా బద్దలైందే నక్సల్బరీ పోరాటం. గతంలోని తెలంగాణ సాయుధ పోరాటాన్ని తిరిగి భారతదేశంలో ఎజెండాలోకి తెచ్చిన పోరాటం. శత్రువు బలహీనంగా ఉండే విశాల గ్రామీణ ప్రాంతాలలో స్థావర ప్రాంతాలు నిర్మించి, ఒంటరి స్థలాల నుండి విస్తార ప్రాంతాలకు విస్తరిస్తూ క్రమక్రమంగా చివరకు నగరాలను చుట్టుముట్టి అధికారాన్ని హస్తగతం చేసుకునే దీర్ఘకాల ప్రజాయుద్ధ పంథా ద్వారా దేశవ్యాప్తంగా విజయం సాధించడమే

విప్లవం యొక్క కేంద్ర, కీలక కర్తవ్యమనే విషయాన్ని నక్సల్బరీకి ముందు వరకెన్నడూ భారత కమ్యూనిస్టు పార్టీలో సిద్ధాంతపరంగా ఆమోదించి ఉండలేదు. మన దేశంలో ఊడలు దిగి ఉన్న రివిజనిజానికి మొట్టమొదటి గొడ్డలిపెట్టు. దానితోనే రివిజనిజానికి పునాదులు కదలబారాయి. నక్సల్బరీ రైతాంగ విప్లవం దేశవ్యాపితంగా పీడిత ప్రజల నెంత ఉత్తేజపరిచిందతో దోపిడీ వర్గాలనంత కలవరపెట్టింది. నక్సల్బరీ మార్గమొక్కటే రైతాంగ విముక్తికి మార్గమనే అవగాహన క్రమంగా పీడిత రైతాంగంలో పెంపొందసాగింది. నానాటికీ పెరిగిపోతున్న నిరుద్యోగంతోనూ, ఆర్థిక సంక్షోభంతోనూ సతమతమౌతున్న కార్మిక-కర్షకులతో పాటు పట్టణ మధ్యతరగతి ఆ పోరాటంతో భారత విప్లవ చరిత్రలోనే ఎన్నడూ లేనంతగా ఉత్తేజం పొందింది. నక్సల్బరీలో అంటుకున్న నిప్పురవ్వ అణతికాలంలోనే భారతదేశంలో పలు తావులకు వ్యాపించింది. శ్రీకాకుళం, ముషాహరి, బీర్‌భూమ్, గోపీవల్లభపూర్, లఖింపూర్, ఖేరీలలో జరిగిన రైతాంగ సాయుధ పోరాటాలు దోపిడీ వర్గాలను దేశవ్యాపితంగా హడలెత్తించాయి.

రివిజనిస్టు నాయకత్వంపై తిరుగుబాటు చేసి నక్సల్బరీ వెల్లువను గట్టిగా సమర్థించి, నక్సల్బరీ మార్గమే ఏకైక మార్గమని చాటి చెబుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విప్లవోద్యమానికి నాయకత్వాన్ని అందించిన కమ్యూనిస్టు విప్లవకారులలో కామ్రేడ్ రవూఫ్ ఒకరు. అప్పటి వరకూ వృత్తి రీత్యా లాయర్‌గా పనిచేస్తూ బహిరంగ కార్యకలాపాలలో పనిచేసిన ఆయన ఆ వృత్తికి స్వస్తి చెప్పి అజ్ఞాతవాసంలోకి వెళ్లారు. కామ్రేడ్ చారుమజుందార్ నాయకత్వంలో తొలుత ఆయన **1968**లో ఏర్పడిన ఏఐసిసిఆర్‌లో చేరి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కోఆర్డినేటింగ్ యూనిట్ రాష్ట్ర కమిటీ సభ్యునిగా ఉన్నారు. కామ్రేడ్ చారుమజుందార్ నాయకత్వంలో గుత్తికొండ బిలంలో ఆంధ్రప్రదేశ్ నాయకత్వ ప్రతినిధులతో జరిగిన సమావేశంలో పాల్గొని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీ సభ్యునిగా ఎన్నికైనారు. అనంతరం **1969** ఏప్రిల్ **22**న ఏర్పడిన సి.పి.ఐ. (ఎం-ఎల్)లో ప్రారంభం నుంచి ఉన్నారు. నాగిరెడ్డి, దేవులపల్లి, పుల్లారెడ్డిల మితవాద అవకాశవాద రివిజనిస్టు సిద్ధాంతాలకు వ్యతిరేకంగా సైద్ధాంతిక, రాజకీయ పోరాటాన్ని నిర్వహించిన ప్రముఖులలో ఆయన ఒకరు. ఆంధ్రప్రదేశ్‌లో **1970** మేలో జరిగిన సి.పి.ఐ. (ఎం-ఎల్) రాష్ట్ర కాన్ఫరెన్స్‌కు హాజరు అయ్యి రాష్ట్ర కమిటీ సభ్యునిగా ఎన్నికైనారు. **1972**లో పార్టీలో చీలిక ఏర్పడినప్పుడు సెంట్రల్ ఆర్గనైజింగ్ కమిటీ, సి.పి.ఐ. (ఎం-ఎల్) పక్షాన నిలబడి ఆంధ్రప్రదేశ్ ప్రొవిన్షియల్ కమిటీ (రాష్ట్ర కమిటీ) సభ్యునిగా ఉన్నారు. **1973**లో బెంగాల్‌లో అరెస్టయినారు. **1977**లో ఆంధ్రప్రదేశ్ ప్రొవిన్షియల్ కమిటీ మారిన పరిస్థితులకు అనుగుణంగా ఎత్తుగడలు రూపొందించిన ఆగస్టు తీర్మానాన్ని వ్యతిరేకిస్తూ కామ్రేడ్ రవూఫ్ పార్టీ నుంచి బయటకు వెళ్లిపోయారు. ఎత్తుగడల విషయంలో పార్టీలో తన అభిప్రాయాలను చర్చకు పెట్టి రెండు పంథాల మధ్య పోరాటాన్ని సాగించాల్సిందిగా ఆంధ్రప్రదేశ్ ప్రొవిన్షియల్

కమిటీ, ప్రత్యేకించి రాయలసీమ కామ్రేడ్స్ విజ్ఞప్తి చేసినప్పటికీ కామ్రేడ్ రవూఫ్ తిరస్కరించి పార్టీ నుంచి వెళ్లిపోయారు. ఆయన విడిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మరో విప్లవ పార్టీని ఏర్పరచారు. దీంతో పార్టీలో చీలిక ఏర్పడింది.

1979లో కామ్రేడ్ రవూఫ్ సి.పి.ఐ. (ఎం-ఎల్) కేరళ రాష్ట్ర కమిటీతో కలిసి సెంట్రల్ రీఆర్గనైజింగ్ కమిటీ (సిఆర్సి), సి.పి.ఐ. (ఎం-ఎల్) స్థాపనలో భాగమయ్యారు. అందులో ఆయన సిఆర్సి కమిటీ సభ్యునిగా ఉండినారు. అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమం (రిమ్) మూడు వ్యవస్థాపక మెంబర్లలో సిఆర్సి ఒకటి. పెరూ కమ్యూనిస్టు పార్టీ, రివల్యూషనరీ కమ్యూనిస్టు పార్టీ (అమెరికా)లు మిగతా రెండు వ్యవస్థాపక మెంబర్లుగా ఉండినాయి. సిఆర్సి 1980లలో ఆంధ్రప్రదేశ్‌లో సాయుధ పోరాటాన్ని నిర్మించేందుకు అనేక ప్రయత్నాలు చేసినప్పటికీ ప్రజాపునాది పెంచుకోలేకపోవడంతో తగిన ఫలితాలు పొందలేకపోయింది. పార్టీ ప్రజలలోకి వెళ్లడంలో విఫలం కావడంతో పార్టీ విస్తరించలేక ఉద్యమం దెబ్బతినిపోయింది. సిఆర్సి, సి.పి.ఐ. (ఎం-ఎల్) ప్రధాన కార్యదర్శిగా ఉన్న వేణు మితవాద అవకాశవాద రివిజనిస్టు సిద్ధాంతాన్ని కామ్రేడ్ రవూఫ్ వ్యతిరేకిస్తూ దానితో తెగతెంపులు చేసుకొని విప్లవ పంథాను చేపట్టారు.

కామ్రేడ్ రవూఫ్ 1987లో ఆ పార్టీని సి.పి.ఐ. (ఎం-ఎల్) రెడ్‌ఫ్లాగ్‌గా పునర్నిర్మాణం చేయడంలో భాగమై దాని సిసి మెంబర్‌గా 1998 వరకూ కొనసాగారు. దాని ప్రధాన కార్యదర్శిగా ఉన్న రామచంద్రన్ తీసుకొని వచ్చిన మితవాద అవకాశవాద రివిజనిస్టు పంథాకు వ్యతిరేకంగా పోరాడి సరైన విప్లవ పంథా చుట్టూ ఆ పార్టీలోని విప్లవకారులను సమైక్యంగా నిలబెట్టారు. తర్వాత ఎంయుసి, సి.పి.ఐ. (ఎం-ఎల్) మహారాష్ట్ర, కేరళ యూనిట్లతో కలిసి 1999లో సి.పి.ఐ. (ఎం-ఎల్) నక్సల్బరీగా ఆవిర్భవించాయి. ఈ యూనిఫైడ్ పార్టీకి 2008 వరకూ కామ్రేడ్ రవూఫ్ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. కామ్రేడ్ రవూఫ్ దానిని ఒక విప్లవ పార్టీగా నిలదొక్కుకునేట్లు కృషి చేశారు. ఈ పార్టీ సికంపోసా (కోఆర్డినేషన్ కమిటీ ఆఫ్ మావోయిస్టు పార్టీస్ అండ్ ఆర్గనైజేషన్స్ ఆఫ్ సౌత్ ఆసియా) వ్యవస్థాపక సభ్యురాలు. విప్లవ ప్రచారం చేయడంలో ఈ పార్టీ మంచి పాత్ర నిర్వహించింది. అంతర్జాతీయంగా ఆర్.సి.పి. (అమెరికా) నాయకుడు బాబ్ అవాకిన్, నేపాల్‌లో యు.సి.పి.ఎన్. (మావోయిస్టు)లో ప్రచండ, భట్టారాయ్‌లు ముందుకు తెచ్చిన రివిజనిస్టు పంథాలను ఎండగట్టడంలో రిమ్‌లోనూ, కంపోసాలోనూ ప్రముఖ పాత్ర నిర్వహించింది. 2008 తర్వాత నుంచి కామ్రేడ్ రవూఫ్ తీవ్ర అనారోగ్యానికి గురైనారు.

కామ్రేడ్ రవూఫ్ ఎన్నటికైనా భారతదేశంలో ఒక సరైన మావోయిస్టు పంథా చుట్టూతా విప్లవకారులందరూ సమైక్యం కావాలనే ఆకాంక్షతో, విశ్వాసంతో పనిచేశారు. ఉద్యమంలో వచ్చిన అనేక ఆటుపోట్లను, ప్రభుత్వ నిర్బంధాలను లెక్కచేయకుండా విప్లవం యెడల

అచంచల విశ్వాసం, దృఢ నిశ్చయం, సంకల్పంతో కామ్రేడ్ రవూఫ్ చివరి వరకూ ఒక గొప్ప విప్లవ నాయకుడిగా నిలిచాడు. భారతదేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవం విజయం కోసం దీర్ఘకాల ప్రజాయుద్ధ పంథాను సాకారం చేయడానికి అహర్నిసలు కృషి చేశారు. తాను నిర్మించిన పార్టీని మావోయిస్టు విప్లవ పంథా చుట్టూ సమైక్యం చేసి భారతదేశంలోని నిజమైన విప్లవకారుల ఐక్యతను సాకారం చేసే కృషిలోనే అమరుడయినాడు. "నక్సల్బరీ ఏక్ హీ రాస్తా'' అనే నినాదాన్ని సార్ధకం చేశారు.

కామ్రేడ్ రవూఫ్ అమరత్వాన్ని ఎత్తిపడుతూ మా సిసి, సిపిఐ (మావోయిస్టు) ఆయన మరణానికి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తోంది. ఆయన కుటుంబ సభ్యుల దుఃఖంలో భాగం వంచుకుంటోంది. ఆయన కలలు కన్న నూతన ప్రజాస్వామిక సమాజం-సోషలిజం-కమ్యూనిజం లక్ష్యాన్ని సాకారం చేయడం కోసం తుదికంటా పోరాడుతామని ఈ సందర్భంగా మరోసారి శపథం చేస్తోంది.

**అభయ్**

**అధికార ప్రతినిధి**

**కేంద్ర కమిటీ**

**సీపీఐ (మావోయిస్టు)**

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)

# కేంద్ర కమిటీ

**24-3-2014**

## బూటకపు పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికలను బహిష్కరించండి!

## నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయండి!

## నిజమైన ప్రజాస్వామ్యం, స్వావలంబనలపై ఆధారపడిన భారత ప్రజల ప్రజాస్వామిక రిపబ్లిక్కుల సమాఖ్య నిర్మాణమే ఏకైక ప్రత్యామ్నాయం!

16వ లోక్‌సభకు, తెలంగాణ, సీమాంధ్ర, ఒడిశా, సిక్కిం, అరుణాచల్ ప్రదేశ్ విధానసభలకు ఎన్నికలు ఏప్రిల్ 7 నుండి మే 12వ తేదీ వరకూ జరగబోతున్నాయి. దీనితో వేల కోట్ల రూపాయల భారీ ఖర్చుతో కూడుకున్న మరో పెద్ద ఆర్థిక భారాన్ని దేశ దోపిడీ పాలకవర్గాలు ప్రజలపై మరోసారి మోపబోతున్నారు. ఈ సందర్భంగా దోపిడీ పాలకవర్గాల ప్రముఖ పార్లమెంటరీ పార్టీలైన కాంగ్రెస్, బిజెపిలు తామే దేశాన్ని అభివృద్ధిపరుస్తామంటూ ఒకదాన్ని మించి మరొకటి అధికారం కోసం తీవ్రంగా పోటీపడుతూ, ప్రజలను మరోసారి వంచించాలని ప్రయత్నిస్తున్నాయి. కప్పల తక్కెడ లాంటి తమ అవకాశవాద కూటములు - కాంగ్రెస్ నేతృత్వంలోని యుపిఏ (యునైటెడ్ ప్రోగ్రెసివ్ అలయెన్స్), బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఏ (నేషనల్ డెమొక్రటిక్ అలయెన్స్)లలో పై నుంచి కింది వరకూ ఒక పార్టీ నుంచి మరో పార్టీకి గెంతడం చాలా ముందే మొదలైనప్పటికీ ఎన్నికలు సమీపించే కొలదీ ఈ కప్పదాటుడు మరింత వేగం పుంజుకుంటోంది.

ఇటీవలనే 11 పార్టీలతో ఆర్భాటంగా రంగంలోకి వచ్చిన మూడవ ఫ్రంటు, అందరూ ఊహించిన విధంగానే సీట్ల పంపిణీ దగ్గరే గుద్దులాటలో మునిగి తేలుతోంది. ఇందులో అన్నాడిఎంకెకూ, వామపక్షాలకు మధ్య సీట్ల పంపిణీలో పొత్తు కుదరక వాటి మధ్య ఈ మధ్యే కుదుర్చుకున్న ఒప్పందం సిరా తడి ఆరక ముందే రద్దయ్యింది. పశ్చిమ బెంగాల్ ఎన్నికలలో అవమానకర ఓటమి ప్రభావం నుంచి సిపిఎంతో సహా వామపక్ష పార్టీలు ఇంకా కోలుకోలేదు. సోకాల్డ్ సామాజిక న్యాయం, దళిత, బహుజన ఉద్ధరణ, ప్రాంతీయ అభివృద్ధి తదితర నినాదాలతో ఎస్‌పి, బిఎస్‌పి, డిఎంకె, ఏఐడిఎంకె, బిజూ జనతా దళ్, జనతా దళ్ (యు), తృణమూల్, ఏజిపి, టిడిపి, టిఆర్ఎస్, వైఎస్ఆర్‌సిపి వంటి పార్టీలు ఓటమి భయంతో

అటు యుపిఏలో గానీ, ఎన్‌డిఏలో గానీ చేరకుండా మూడవ ఫ్రంట్ నాటకంలో రక్తి కట్టించడానికి అవకాశవాద ప్రయత్నాలు కొనసాగిస్తున్నాయి లేదా స్వతంత్రంగా ఎన్నికల్లోకి దిగుతున్నాయి. మూడవ ఫ్రంట్ పార్టీలుగానీ, విడిగా పోటీ చేస్తున్న పార్టీలుగానీ ఎన్నికల ఫలితాలను చూసి ఏ ఫ్రంట్ అధికారానికి వస్తే దానిలోకి వెళ్లడానికి అనుగుణంగా వేచిచూసే విధానం అవలంబిస్తున్నాయి. యుపిఏలో ఉంటే ఓటమి తప్పదని లోక్ జనశక్తి దళ్ ఎన్‌డిఏలో చేరగా, ఏదోక రకంగా దీపాన్ని ఆరిపోకుండా చూసుకోవాలని ఆర్‌జెడి యుపిఏలోనే కొనసాగేందుకు సిద్ధపడింది. తాము‌న్న పార్టీలలో సీటు దొరకకో, ప్రజా వ్యతిరేకత వల్ల తిరిగి గెలుస్తామో లేదో అనే ఆందోళనతోనో తామున్న పార్టీల నుంచి బయటకు వచ్చి రాత్రికి రాత్రి నూతన జండాలు, ఎజెండాలతో ముందుకు వచ్చిన వివిధ పార్టీల రాజకీయ నాయకులు ఈ సీట్ల కుమ్ములాటల్లో ఒకరిపై ఒకరు చేతికి అందినంత దుమ్మెత్తి పోసుకుంటున్నారు. ఎటువంటి నీతి నియమాలు లేకుండా డబ్బుతో తిరిగి అధికారం, అధికారంతో డబ్బు, డబ్బుతో తిరిగి అధికారం సంపాదించుకోవడం అనే లక్ష్యంతో అధికారానికి వచ్చి ప్రజలను నిరంతరం దోపిడీ పీడనలకు హింసకు గురిచేయడం వల్ల వారి విశ్వాసాన్ని కోల్పోయిన ఫలితంగానే ఈ ఎన్నికల్లో గెలుపు మీద ఏ మాత్రం నమ్మకం లేక అవి ఈ రకమైన పచ్చి అవకాశవాద పద్ధతులకు దిగజారుతున్నాయి.

ప్రజలను మరోసారి భ్రమల్లో ముంచెత్తుతూ పబ్బం గడుపుకోవాలనే లక్ష్యంతో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) లోక్‌సభ ఎన్నికల బరిలోకి దూకింది. అది గాంధీవాద 'అహింస' 'స్వరాజ్'లను, జయప్రకాశ్ నారాయణ్ 'సోషలిస్టు' రాజకీయాలను, తన ఎన్‌జిఓల 'ప్రత్యక్ష/ భాగస్వామ్య ప్రజాస్వామ్యం' వైఖరులతో కూడిన సైద్ధాంతిక మిశ్రమవాదాన్ని ఆశ్రయించిన విప్లవకర పదగుంభనలతో ప్రజల్ని మంత్రముగ్ధుల్ని చేసేందుకు ప్రయత్నిస్తున్నది.

గత 65 ఏళ్ల 'స్వతంత్ర' పాలనలో అనేక సార్లు ఎన్నికలు జరిగి, అనేక ప్రభుత్వాలు మారిపోయినప్పటికీ ఈనాటికీ కూడు, గుడ్డ, గూడు, విద్యా, వైద్యం వంటి ప్రజల కనీస అవసరాలు కూడా తీరలేదనేది నిజం. నూటికి 95 శాతంగా వున్న పీడిత ప్రజలు పేదరికం, నిరక్షరాస్యత, నిరుద్యోగం, అధిక ధరలు, అనారోగ్యం, ఆకలి చావులు, అవినీతి వంటి సమస్యలతో నిత్యం సతమతమవుతున్నారు. దేశంలో 77 శాతం మంది ప్రజలు రోజుకు 20 రూపాయలైనా దొరకని దుస్థితిలో జీవిస్తున్నారు. మరోవైపు బడా పెట్టుబడిదార్లు, బడా భూస్వాములు అంతులేని ఐశ్వర్యాలు అనుభవిస్తున్నారు. అంబానీ, టాటా, బిర్లా, మిత్తల్, జిందల్ తదితర వంద కార్పొరేట్ రాబందుల సంపదలు దేశ జీడీపీలో పావు భాగంగా ఎదిగాయి. పేదలకు, ధనికులకు అంతరాలు ఈ వ్యవస్థలో చెప్పనలవి కాని స్థాయికి పెరిగిపోయాయి. అవినీతి, కుంభకోణాలు అంతు లేకుండా పెరిగిపోయాయి. ఈ సామాజిక అంతరాల్ని అడ్డుకునేందుకు, నివారించేందుకు చేసిన చట్టాలు ధనికవర్గాలపై ఎన్నడూ ఉ

పయోగించబడలేదు. దాంతో దేశవ్యాప్తంగానే సామాజిక అశాంతి ప్రబలుతున్నది. దేశంలో మతపరమైన మైనారిటీలపై హిందూత్వ సంఘ్ పరివార్ మతదురహంకార పీడన, దళితులపై హిందూత్వ బ్రాహ్మణవాద అగ్రకుల పీడన పెరిగిపోయాయి. కశ్మీర్, అసోం, మణిపూర్ వంటి జాతుల విముక్తి ఉద్యమాలపై అణచివేత నానాటికీ పెరుగుతున్నది. దశాబ్దాల తరబడి తెలంగాణ ప్రజలు కొనసాగించిన సుదీర్ఘ పోరాటాల ఫలితంగా తప్పనిసరి పరిస్థితులలో పార్లమెంట్ తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పర్చేందుకు ఆమోదించినప్పటికీ, బోడోలాండ్, గూర్ఖాలాండ్ వంటి ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షలను క్రూరంగా అణచివేస్తూనే ఉన్నారు. జల్-జంగల్-జమీన్-అధికారానికీ ఆదివాసులు వంచితులవుతూనే ఉన్నారు. మహిళా లోకం సామ్రాజ్యవాద, భూస్వామ్య విషసంస్కృతిచే నలిగిపోతున్నది.

ప్రపంచ ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన సామ్రాజ్యవాదుల, దేశ బడా పెట్టుబడిదారుల వత్తిడి వల్ల కాంగ్రెస్ నేతృత్వంలోని యూపిఏ-2 ప్రభుత్వం తన ఐదేళ్ల పాలనలో సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ విధానాలకు కొనసాగింపుగా రెండో దశ ఆర్థిక సంస్కరణలను వేగంగా అమలు చేస్తుండడంతో దేశం అన్ని రంగాల్లోనూ దిగజారిపోయింది. బహుళజాతి కంపెనీలతో, దేశ బడా కంపెనీలతో అది లెక్కలేనన్ని ఒప్పందాలు చేసుకుని దేశంలోని ప్రకృతి సంపదలను వాటికి అప్పగించి విచ్చలవిడిగా దోపిడి చేసేందుకై తలుపులు బార్లా తెరిచింది. ఆదివాసీ ప్రాంతాలలో రాజ్యాంగంలోని ఐదవ షెడ్యూల్, పెసా మొదలైన చట్టాలను ఘోరంగా ఉల్లంఘిస్తూ, ఆదివాసీలతో, దేశంలోని అనేక ప్రాంతాల్లో రైతాంగంతో తుపాకీ నీడన గ్రామసభలను నిర్వహించి వారిని బలవంతంగా భూస్వాధీనానికి ఒప్పిస్తూ, పెద్దయెత్తున నిర్వాసితుల్ని గావించే విధానాలను అమలు చేస్తున్నది. ఈ ప్రభుత్వ దివాలాకోరు విధానాల వల్ల దేశ పారిశ్రామిక ఉత్పత్తి దెబ్బతిని లక్షలాది కార్మికులు వీధిన పడ్డారు. కార్మికులపై పని భారం పెరిగింది. వారి నిజ వేతనాలు పడిపోయాయి. ఎటువంటి చట్టాలు వర్తించని అసంఘటిత కార్మికుల సంఖ్య పెరిగిపోయింది. చిల్లర వర్తకాన్ని సామ్రాజ్యవాద కంపెనీలకు కట్టబెట్టే విధానాలను చేపట్టింది. అది వ్యవసాయ రంగాన్ని క్రమక్రమంగా కార్పొరేట్ సంస్థలపరం చేస్తూ వ్యవసాయాన్ని మరింత తీవ్ర సంక్షోభంలోకి నెట్టింది. ఉత్పత్తి ఖర్చుల పెరుగుదల, రుణ సౌకర్యం తదితర ప్రభుత్వ మద్దత్తు లేకపోవడం, గిట్టుబాటు ధరలు లేకపోవడంతో రైతుల ఆత్మహత్యలు పెద్దయెత్తున కొనసాగుతున్నాయి. ఎప్పటికప్పుడు పెట్రోల్, డీజల్ ధరల పెరుగుదలతో చుక్కలనంటే నిత్యావసర వస్తువుల ధరలతో ప్రజల బతుకులు దుర్భరమయ్యాయి. విద్య, వైద్యాల ప్రైవేటీకరణతో అవి సామాన్య మానవునికి గగనకుసుమం అయ్యాయి. అవినీతి తారాస్థాయికి చేరి 2జి స్పెక్ట్రమ్, కామన్‌వెల్త్ ఆటలు, బొగ్గు కుంభకోణం వంటి మహా కుంభకోణాలతో వివిధ పాలక పార్టీల నాయకులు, ముఠాలు, ప్రభుత్వ-సైనిక తదితర ఉన్నతాధికారులు లక్షల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దిగమింగారు. ఈ ఘరానా

దోపిడిదార్లు, దేశద్రోహులు వేలు, లక్షల కోట్ల రూపాయలు స్విస్ బ్యాంకులలో దాచుకుంటున్నారు.

ఇందిరా గాంధీ చేపట్టిన 'గరీబీ హఠావో' నినాదాన్ని సోనియా గాంధీ సాకారం చేస్తోందని చెబుతూ యుపిఏ ప్రభుత్వం చేపట్టి పెద్దయెత్తున ప్రచారం చేస్తున్న పథకాలు అన్నీ అవినీతితో అపహాస్యం పాలవుతున్నాయి. నిజానికి ఆనాటి భూసంస్కరణల మాట కూడా నేడు గల్లంతైంది. దాని పర్యావరణ వ్యతిరేక విధానాల వల్ల తుఫాన్లు, అకాల వర్షాలు, ఉత్తరాఖండ్ వంటి ప్రకృతి విపత్తులు సంభవించి ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారు. అది కొత్తగా రూపొందించిన 'భూసేకరణ', 'జాతీయ ఆహార భద్రత', 'నిర్భయ' చట్టాలు సామ్రాజ్యవాద, దోపిడి పాలకవర్గాల ప్రయోజనాలను కాపాడడం కోసమూ లేదా ప్రజల కంటి తుడుపు కోసమే.

యుపిఏ ప్రభుత్వం తన ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా తిరగబడుతున్న ప్రజలను అణచడం కోసమూ, తమ అధికారాన్ని సుస్థిరం చేసుకోవడం కోసమూ సైనిక, అర్ధసైనిక, ప్రత్యేక పోలీసు, కమాండో బలగాలపై, ఐబి, ఎన్ఐఏ, ఎస్ఐబి వంటి ఇంటలిజెన్స్ సంస్థలపై ఆధారపడుతూ ఫాసిస్టు పద్ధతుల్లో దాడులు కొనసాగించింది. ప్రజల పౌరహక్కుల్ని, జీవించే హక్కును సైతం కాలరాచి వేస్తున్నది. మా పార్టీ నేతృత్వంలో కొనసాగుతున్న విప్లవోద్యమ ప్రాంతాలలో శత్రు బలగాలు వందలాది ఆదివాసులను, దళితులను, ఇతర పీడిత ప్రజలను, విప్లవ కార్యకర్తలను ఊచకోతలు సాగిస్తున్నాయి. కార్పొరేట్ సెక్యూరిటీలో భాగంగా వివిధ రాష్ట్రాలల్లోని ఉద్యమ ప్రాంతాన్నింటినీ శత్రు బలగాల క్యాంపులుగా మార్చివేశాయి. వేలాది మంది అమాయక ప్రజలను, విప్లవ కార్యకర్తలను, నాయకులను జైళ్లల్లో బంధించాయి. 'అడవుల్లో ఉండి హింసకు తెగబడుతున్న మావోయిస్టు గెరిల్లాలకు ఒక సిద్ధాంతమంటూ లేదు' అంటూ విరుచుకుపడే పాలకవర్గాలు 'మావోయిస్టు భావజాలాన్ని ఆరిపోనీయకుండా నిరంతరం రాజేస్తున్న నగరాల్లోని మావోయిస్టు మేధావులే గెరిల్లాల కన్నా ప్రమాదకరం' అంటూ వారిని నియంత్రించేందుకు పూనుకుంటున్నాయి. అభ్యుదయ మేధావులనూ, సాహితీవేత్తలనూ, యువతీ యువకులనూ, విద్యార్థులను విప్లవోద్యమం నుంచి వేరుచేసి, దానికి వ్యతిరేకంగా వారిని నిలబెట్టడం కోసం ప్రయత్నిస్తున్నారు. ఇందుకు ఆయా బిజెపి, వామపక్ష రాష్ట్ర ప్రభుత్వాలు కూడా యుపిఏ ప్రభుత్వంతో కుమ్మక్కు అయ్యాయి. గత పదేళ్ల యుపిఏ పాలనలో అది అనుసరించిన ప్రముఖ విధానాలన్నింటికీ బిజెపి మద్దతు నిచ్చింది. తేడా అల్లా అధికారంలో ఉండి మాట్లాడుతున్నారా, ప్రతిపక్షంలో ఉండి మాట్లాడుతున్నారా అనేదే. ప్రజలను వంచించడానికే వారి పరస్పర ఆరోపణలు, ప్రత్యారోపణలు. పార్టీలు ఏవైనా ఈ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పెద్ద తేడాలేమీ లేవు. అలాగే ఈ అణచివేత కేవలం మావోయిస్టు ఉద్యమ ప్రాంతాలకే పరిమితమై లేదు. పోస్కో, కూడంకులం వ్యతిరేక పోరాటాలపై అణచివేత ఇందుకు తాజా ఉదాహరణ. యుపిఏ

పాలనలో అమెరికా సామ్రాజ్యవాదుల ఆర్థిక, రాజకీయ, సైనిక, సాంస్కృతిక ఆధిపత్యం, దాని ఇంటలిజెన్స్ ఏజెన్సీ ఎఫ్ఐబి జోక్యం పెరిగిపోయాయి. సుమారు ఒక లక్ష మంది అమెరికన్ సైనికులు, అధికారులు రహస్యంగా మన దేశంలోనే ఉంటూ ప్రజలపై ఫాసిజాన్ని అమలు జరపడంలో అన్ని సహాయ, సహకారాల్ని ప్రత్యక్షంగా, పరోక్షంగా అందిస్తున్నారనేది వికీలీక్స్ వెల్లడింపుల ద్వారా స్పష్టమవుతోంది.

కాంగ్రెస్ పదేళ్ల పాటు అధికారంలో కొనసాగుతూ సామ్రాజ్యవాద అనుకూల, దళారీ నిరంకుశ బూర్జువా, బడా భూస్వామ్య అనుకూల విధానాలను అనుసరించింది. ప్రజల జీవన పరిస్థితులు దిగజారిపోవడానికి, మన దేశ ఆర్థిక వ్యవస్థ వినాశనానికి, వివిధ ప్రజాస్వామిక, విప్లవోద్యమాలకు చెందిన వేలాది మంది కార్యకర్తలు, ప్రజల ఊచకోతలకు, 'టెర్రరిస్టుల' పేరుతో మతపరమైన మైనారిటీలను పీడించటానికి దానిదే బాధ్యత. మన దేశ పార్లమెంటరీ చరిత్రలో అవినీతి కుంభకోణాలలో అతి పెద్ద మూల విరాట్టుగానూ, అత్యధిక సంఖ్యలో కుంభకోణాలకు పాల్పడి రెండు విధాలా అది రికార్డు సృష్టించింది. ఫలితంగా అది ప్రజల తీవ్ర ఆగ్రహానికి గురైంది. దీని నుండి తప్పించుకోవడానికి, ప్రజల కళ్లు కప్పడానికి, కాంగ్రెస్ పదేళ్ల పాలనలో తాను సాధించిన 'అభివృద్ధి'ని, తాను రూపొందించిన అవినీతి–వ్యతిరేక, భూసేకరణ, ఆహార భద్రత, నిర్భయ చట్టాలను, సంక్షేమ పథకాలను చూపుతూ అది 'భారత్ నిర్మాణ్' అనే ప్రధాన నినాదాన్ని ముందుకు తీసుకు వస్తున్నది. 1947 తర్వాత కాంగ్రెస్ కేంద్రంలోనూ, చాలా రాష్ట్రాలలోనూ ఎక్కువ కాలం పాటు అధికారంలో ఉంది. ఇంతటి సుదీర్ఘకాలం అది అధికారంలో ఉండి ప్రజా వ్యతిరేక విధానాలను రూపొందించి అమలు చేసింది కనుక అందుకు ప్రధాన బాధ్యత దానిదే. దాని పాలనలో మతపరమైన మైనారిటీల ఊచకోతలు, వేధింపులు, ప్రత్యేకించి 1984లో సిక్కుల ఊచకోతలు, హెచ్చు సంఖ్యలో చోటుచేసుకున్నాయి. బాబ్రీ మసీదు విధ్వంసంలో సంఘ్ పరివార్‌ది ప్రత్యక్ష బాధ్యత అయినప్పటికీ, కేంద్రం నుంచి నడిచిన హై డ్రామా వెనుక కాంగ్రెస్ ఉంది. కశ్మీర్, ప్రస్తుత ఈశాన్య ప్రాంతాలలో క్రూరమైన సైనిక బలగాల ద్వారా పదుల వేల యువతను ఊచకోత కోసి న్యాయమైన జాతి విముక్తి పోరాటాలను అణచివేయడంలో దానిదే ప్రధాన బాధ్యత. ఈ ప్రజా వ్యతిరేక విధానాలన్నింటినీ అమలు చేయడంలో, అది అధికారంలో ఉన్నప్పుడు ఇతర పార్లమెంటరీ పార్టీల సహాయాన్ని తీసుకుంది, అధికారంలో లేనప్పుడు అధికార కూటములతో కుమ్మక్కైంది. మన దేశంలో కార్మికులు, రైతాంగం, పెట్టీబూర్జువా సెక్షన్లు, పీడిత జాతులు, దళితులు, ఆదివాసులు, మతపరమైన మైనారిటీలు, మహిళలు, చిన్న, మధ్య స్థాయి పెట్టుబడిదారుల దయనీయమైన పరిస్థితులకు కాంగ్రెస్‌ది కంటే ప్రధాన బాధ్యత మరెవరిది? దాని 'భారత్ నిర్మాణ్' నినాదాన్ని, సోకాల్డ్ సంక్షేమ పథకాల్ని, మోసపూరిత అవినీతి వ్యతిరేక ఫోజును నమ్మడానికి ప్రజలేమీ తెలివితక్కువ వాళ్లు కాదు.

బిజెపి ప్రధానంగా కాంగ్రెస్ అవినీతికర పాలనపై దాడిని ఎక్కుపెట్టింది. కాంగ్రెస్‌కు ఉ

న్నలాంటి అవే అవినీతికర, దేశద్రోహకర, నిరంకుశ విధానాలు తప్ప, ఏ రంగంలో కూడా కాంగ్రెస్ కంటే మౌలికంగా భిన్నమైన విధానాలేవీ దానికి లేవనేది స్పష్టం. ఆర్.ఎస్.ఎస్. ఆదేశాలతో బిజెపి పచ్చి హిందూ మతోన్మాది, నరహంతకుడైన నరేంద్ర మోడీని తన ప్రధానమంత్రి అభ్యర్థిగా ప్రకటించింది. అది తన హిందూ మతోన్మాద ఎజెండాను దాచిపెడుతూ 'గుజరాత్ వికాస్' నమూనాను ముందు పెట్టి తిరిగి కేంద్రంలో అధికారాన్ని హస్తగతం చేసుకోవడానికి తన యంత్రాంగాన్నంతా మోడి చుట్టూ కదలిస్తున్నది. 'గుజరాత్ వికాస్ నమూనా' అంటే ముస్లిం మతమైనారిటీల ఊచకోత, వారిని అంతులేని అత్యాచారాలకు గురిచేయడంతో పాటు క్రిస్టియన్ మత మైనారిటీలపై అత్యాచారాలు కొనసాగించడం ద్వారా వారందరినీ టెర్రరైజ్ చేయడం, వారి ఆస్థులను స్వాధీనం చేసుకోవడం, వారిని తమ మూలవాసాల నుండి తరిమివేయడం లేక లొంగదీసుకోవడం; బహుళజాతి కంపెనీల, బడాబూర్జువాల మదుపులకు హబ్‌గా రాష్ట్రం మొత్తాన్ని మార్చివేసి వారి అంతులేని దోపిడీపీడనలకు తలుపులు బార్లా తెరవడం. సంఘ్‌పరివార్, బిజెపిల లక్ష్యం ఈ ఎన్నికల్లో అధికారంలోకి వచ్చి 'వికాస్' ముసుగు కప్పుకున్న ఈ హిట్లర్ తరహా నమూనాను దేశవ్యాప్తంగా ఏర్పరచడం. గత రెండు దఫాల ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ప్రజల ఆగ్రహాన్ని కూడగట్టుకుంది. అందువల్ల, పాలకవర్గాలు, అమెరికా సామ్రాజ్యవాదులు మోడీ తమ ఎజెండాను నిర్దాక్షిణ్యంగా అమలుపరచగలడనే దానితో ప్రధానమంత్రి పదవి కోసం అతని అభ్యర్థిత్వాన్ని బాహాటంగా బలపరుస్తున్నాయి. అదే విధంగా కార్పొరేట్ మీడియా మోడీని పెద్దయెత్తున ప్రచారం చేస్తున్నది. అది ముజఫర్ నగర్‌లో మతపరమైన దాడుల ద్వారా మతపరమైన ధృవీకరణను తీసుకొని వచ్చి ఢిల్లీ ఎన్నికల్లో విజయవంతం కావడానికి ప్రయత్నించడం అనేది దాని ఫాసిజాన్నే సూచిస్తుంది. ఎన్నికల ప్రకటనకు కొద్ది రోజుల ముందు రాజ్‌నాథ్ సింగ్ 'దేశంలో ఎక్కడైనా ఎప్పుడైనా ఏదైనా తప్పు జరిగితే' క్షమించమని ముస్లిములను కోరడం గుజరాత్‌లో మోడీ సాగించిన ముస్లిముల ఊచకోతను కప్పిపుచ్చి వారి ఓట్లను దండుకోవడానికే. కానీ, 1947 నుండి ఇటీవలి ముజఫర్ నగర్ ఊచకోతల వరకూ సంఘ్ పరివార్ చేత చవిచూసిన ఊచకోతలు, వివక్ష, అణచివేత, దురహంకారాలను ముస్లిం, క్రిస్టియన్ మతమైనారిటీలు ఎలా మరిచిపోగలరు? మోడీ నేతృత్వంలోని గుజరాత్‌లో మతమైనారిటీల ఊచకోతలు, వేధింపులు ఆ రాష్ట్రంలోనే గాక దేశవ్యాప్తంగా కూడా మున్నెన్నడూ ఎరుగనంతటి స్థాయిలో వ్యతిరేకతను, నిరసననూ ఎదుర్కొన్నాయి. హిందూ ఫాసిస్టులు రేపు అధికారంలోకి వచ్చినా, వారు దేశవ్యాప్తంగా ముస్లిం, క్రిస్టియన్ మైనారిటీల, విప్లవ, ప్రజాస్వామిక శక్తుల క్రియాశీల ప్రతిఘటనను ఎదుర్కోక తప్పదు. అప్పుడు అది ఈ శక్తుల ప్రముఖ కర్తవ్యంగా ఉంటుంది.

ఎన్‌జిఓల నేపథ్యంతో సామ్రాజ్యవాద సంస్థల, ఎన్ఆర్ఐల నిధులతో, మద్దత్తుతో పుట్టి పెరిగిన ఆప్ పార్టీ ఈ వ్యవస్థ మూలాలలోకి, ప్రజల మౌలిక సమస్యలలోకి వెళ్లకుండా ప్రజల

సమస్యల పరిష్కారం గురించి గాంధీవాద విన్యాసాలు చేస్తున్నది. దోపిడీ పీడనలతో నలిగిపోతున్న పీడిత వర్గాల, ప్రజల, సెక్షన్ల మౌలిక సమస్యలకు దాని వద్ద ఎటువంటి పరిష్కారమూ లేదు. అవినీతికి వ్యతిరేకంగా ప్రజలలో పెల్లుబుకుతున్న ఆగ్రహాన్ని పార్లమెంటరీ తరహా – శాంతియుత పరిష్కారాల్లోకి మళ్లించే సేఫ్టీవాల్వ్‌గా పనిచేస్తూ దానిని సొమ్ము చేసుకోవాలని అది ప్రయత్నిస్తోంది.

పార్లమెంటులో గాని, అసెంబ్లీల్లో గాని ప్రజల వాస్తవిక సమస్యలు ఎప్పుడూ చర్చకు రావు. అవి సామ్రాజ్యవాదుల, బడా దళారీ నిరంకుశ బూర్జువా, బడా భూస్వామ్య వర్గాల నియంత్రణలో వుంటాయి. ఓట్లను డబ్బుతో, మద్యంతో, మతపరమైన, కులపరమైన సెంటిమెంట్లతో కొనుక్కోగల ఈ వ్యవస్థలో ప్రజాస్వామ్యానికి చోటెక్కడిది? నేరగాళ్లు, బందిపోట్లు, కుఖ్యాతి గాంచిన అవినీతికర రాజకీయ నాయకులు ఎన్నికల్లో గెలుస్తుంటే దీన్ని ప్రజాస్వామ్యం అని చెప్పడం హాస్యాస్పదం. నిజానికి చరిత్రను పరిశీలిస్తే ప్రజల సమస్యలు ఏవైనా ప్రజా పోరాటాలు, వర్గ పోరాటాలు, దీర్ఘకాల ప్రజాయుద్ధం ద్వారానే పరిష్కారమయ్యాయి తప్ప పార్లమెంటరీ వేదికల ద్వారా కాదు.

ప్రతిసారీ ఎన్నికలు ఒక ఫార్సుగా జరుగుతుంటే, ఈ ఎన్నికల్లో ప్రజాస్వామికం మరింత బలోపేతం చేస్తామంటూ భారత ఎన్నికల కమీషన్ సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం మార్గదర్శకాలను ఎన్నికల ప్రవర్తనా నియమావళిలో చేర్చడంతో పాటు అనేక సంస్కరణలను ముందుకు తీసుకు రావడానికి నానాపాట్లూ పడుతోంది. ప్రజాస్వామికాన్ని బలోపేతం చేయడంలో భాగంగానే అభ్యర్థులను 'నిరాకరించే' హక్కును ఓటర్లకు కల్పించాలని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఫలితంగా 'నోటా' బటన్‌ను ఈవిఎంలలో మొట్టమొదటిసారిగా గత ఐదు రాష్ట్రాల అసెంబ్లీలకు జరిగిన ఎన్నికల్లో ఆరంభించి ఈ లోక్‌సభ ఎన్నికలలోనే దేశవ్యాప్తంగా చేరుస్తున్నారు. నిజానికి ఈ 'నోటా' హక్కు ప్రజలకు ఉండాల్సిన 'గెలిచిన అభ్యర్థులను వెనక్కు పిలిచే (రీకాల్) హక్కు'ను తొక్కిపడుతుంది. 'నిరాకరించే' హక్కును నిజంగా కల్పించే పనైతే మా పార్టీ ఎన్నికల్ని బహిష్కరణకు పిలుపునిచ్చిన విప్లవోద్యమ ప్రాంతాలలో ఎన్నికలను 'నిష్పాక్షికంగా', 'స్వేచ్ఛగా' జరిపే పేరుతో లక్షలాది ప్రభుత్వ సాయుధ బలగాలను మోహరించి దాడులు, సర్చ్ ఆపరేషన్లు, అరెస్టులు, బూటకపు ఎన్‌కౌంటర్లు, ప్రజల్ని ఊచకోత కోయడం ఎందుకు సాగిస్తున్నట్లు?

మార్క్సిస్టు మహోపాధ్యాయుడు కామ్రేడ్ లెనిన్ 'రాజ్యం, విప్లవం'లో ఇలా అన్నాడు - "పాలకవర్గంలోని ఏ సభ్యుడు పార్లమెంటు ద్వారా ప్రజలను అణచివెయ్యాలో, నలిపివెయ్యాలో ప్రతి కొద్ది సంవత్సరాలకు ఒకసారి నిర్ణయించడం - ఇది బూర్జువా పార్లమెంటరిజపు నిజమైన సారం, పార్లమెంటరీ రాజ్యాంగబద్ధ రాజరిక దేశాలలో మాత్రమే కాదు, అత్యంత

ప్రజాస్వామిక రిపబ్లిక్కులలో కూడ.'' ఇది 'అత్యంత పెద్ద ప్రజాస్వామికం' అని చెప్పుకునే మన అర్ధవలస-అర్ధభూస్వామ్య దేశానికి మరింత ఎక్కువగా వర్తిస్తుంది. అందుకే ఈ ఎన్నికల ద్వారా ఎవరు గెలిచినా తమ బతుకు మారుతుందని గాని, ఈ వ్యవస్థలో మౌలిక మార్పు వస్తుందని గాని పీడిత ప్రజలెవ్వరూ నమ్మడం లేదు. దేశంలో ఇంత వరకూ జరిగిన అన్ని ఎన్నికల్లో గణనీయమైన సంఖ్యలోనే ఓటర్లు వోటింగ్‌కు దూరంగా వుండిపోతున్నారు. పార్టీలు ఎవరికి బలముంటే వారు తమ గూండా బలంతో పోలింగ్ కేంద్రాలను ఆక్రమించుకొని రిగ్గింగ్ చేస్తున్నారు. వోట్లు వేస్తున్న వాళ్లలో కూడ ఎక్కువ మంది ఎన్నికలు తమకేదో ఒరగబెడతాయనే నమ్మకంతో కాక కేవలం స్థానిక అవసరాల కోసమో, కులం, మతం, ప్రాంతీయత, డబ్బు, మద్యం, గూండాయిజం తదితర వత్తిళ్లతోనో లేదా ప్రలోభాలతోనో ఓట్లు వేస్తున్నారు. లేదా అధికారంలో వున్న పార్టీపై వ్యతిరేకతతో మరో పార్టీకి ఓట్లు వేసి గెలిపిస్తున్నారు. ఈ బూటకపు పార్లమెంటరీ వ్యవస్థలో ప్రజలకు ప్రత్యామ్నాయం లేదు.

ఎన్నికల్లో ముందుకు వస్తున్న ప్రధాన పార్టీలన్నీ సామ్రాజ్యవాదులకు ఊడిగం చేస్తూ, భారత దోపిడి పాలకవర్గాలకు ప్రాతినిధ్యం వహించేవి మాత్రమే. ఈ పార్టీలన్నీ ప్రజావ్యతిరేక, ద్రోహపూరిత, అవినీతికర, ప్రజాపీడక, అభివృద్ధి నిరోధక, ఫాసిస్టు స్వభావం కలిగినవే. సామ్రాజ్యవాదం, దళారీ నిరంకుశ బూర్జువా వర్గం, బడా భూస్వామ్య వర్గాల ప్రయోజనాలను కాపాడడమూ, భారత అర్ధవలస-అర్ధభూస్వామ్య వ్యవస్థను నిలిపి ఉంచడమూ, అన్ని ప్రజాస్వామిక, విప్లవ ఉద్యమాలను అణచివేయడమూ ఈ పార్టీల లక్ష్యం. దీనికి ప్రత్యామ్నాయంగా ముందుకు వస్తున్న మా పార్టీ సిపిఐ (మావోయిస్టు)ను, దాని నాయకత్వంలో సాగుతున్న నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని, మొగ్గ తొడుగుతున్న నిజమైన ప్రజాస్వామ్యం, స్వావలంబనలపై ఆధారపడిన భారత ప్రజల ప్రజాస్వామిక రిపబ్లిక్కుల సమాఖ్యకు ప్రాతినిధ్యం వహిస్తున్న నూతన రాజకీయాధికార అంగాలను సమూలంగా నాశనం చేయడం కోసం ఈ పార్టీలు ఏకమవుతున్నాయి. దోపిడీలో వాటాల కోసం ఈ దళారీ పార్టీలు పార్లమెంటు పందుల దొడ్డిలో అధికారం కోసం పోట్లాడుతూ పరస్పరం ఎంత తీవ్రంగా కొట్లాడుకుంటున్నప్పటికీ, 'దేశ అంతర్గత భద్రతకు అత్యంత ప్రమాదకారి' అనే పేరుతో విప్లవోద్యమాన్ని తుదముట్టించే విషయంలో ఏకాభిప్రాయంతో ఉన్నారు. అమెరికా నిర్దేశిత ఎల్ఐసి వ్యూహం-ఎత్తుగడలకు అనుగుణంగా అత్యంత తీవ్రస్థాయిలో బహుముఖ దాడికి దిగుతున్నారు. వారి మోసపూరిత శాంతి చర్చల ప్రతిపాదనలు, సంస్కరణ పథకాలు ప్రజలను, ప్రజాస్వామికవాదులను పక్కదారి పట్టించేందుకూ విప్లవోద్యమంపై మరింత భారీ దాడి సాగించేందుకూ ఉద్దేశించినవే. 2009 మధ్య నుంచి కేంద్ర ప్రభుత్వం బిజెపితో కుమ్మక్కై వివిధ రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి ప్రజలపై యుద్ధం - ఆపరేషన్ గ్రీన్‌హంట్ పేరుతో సాగిస్తున్న దేశవ్యాప్త బహుముఖ దాడి ఇందులో భాగమే. ఈ అణచివేత ద్వారా కుళ్లి కంపుకొడుతున్న

ఈ దోపిడీ వ్యవస్థను కాపాడాలని విఫల యత్నం చేస్తున్నాయి. దినదినం విప్లవ పరిస్థితులు పరిపక్వమవుతున్న నేపథ్యంలో ప్రజా వెల్లువలో వారు కొట్టుకుపోక తప్పదు.

ఎన్నికల ద్వారా ప్రస్తుత దోపిడీ వ్యవస్థలో మార్పు రాదు. ప్రజల మౌలిక సమస్యలు పరిష్కారం కావు. వారి ప్రాథమిక అవసరాలు కూడా నెరవేరవు. ఎన్నికల పార్టీలన్నీ ప్రజల నిజమైన ప్రజాస్వామ్యం, స్వావలంబన, దేశ సార్వభౌమత్వానికి పూర్తిగా వ్యతిరేకం. వీటి కోసం ప్రజల్ని ఓట్లు అడిగే నైతిక అర్హత వీటిలో దేనికీ లేదు. అందుకే మా పార్టీ ఈ బూటకపు పార్లమెంటరీ, అసెంబ్లీ ఎన్నికలను బహిష్కరించాలని, భారత ప్రజల ప్రజాస్వామిక రిపబ్లిక్కుల సమాఖ్య నిర్మాణం కోసం దున్నేవారికే భూమి ప్రాతిపదికన వ్యవసాయ విప్లవమే ఇరుసుగా నూతన ప్రజాస్వామిక విప్లవ విజయానికై దీర్ఘకాల ప్రజాయుద్ధ పంథాలో ముందుకు సాగాలనీ యావత్ భారత ప్రజానీకానికి పిలుపునిస్తున్నది. ఈ నూతన ప్రజాస్వామిక రాజ్యం కార్మికవర్గ నాయకత్వంలో కార్మిక-కర్షక మైత్రి పునాదిగా కార్మికవర్గం, రైతాంగం, పెట్టీబూర్జువా వర్గం, జాతీయ బూర్జువా వర్గాలతో కూడిన ఐక్యసంఘటన ద్వారా ప్రజల ప్రజాస్వామిక నియంతృత్వాన్ని అమలు చేస్తుంది. సామ్రాజ్యవాదుల, దళారీ నిరంకుశ బూర్జువా, బడా భూస్వాముల కబంధ హస్తాలను నుంచి మన దేశాన్ని విముక్తి చేస్తుంది.

**అభయ్**

**అధికార ప్రతినిధి**

**కేంద్ర కమిటీ**

**సీపీఐ (మావోయిస్టు)**

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# కేంద్ర కమిటీ

**25-3-2014**

## భారత రాజ్యం ప్రజలపై యుద్ధం 'ఆపరేషన్ గ్రీన్ హంట్' పేరుతో సాగిస్తున్న తెల్ల బీభత్సం పర్యవసానమే తోంగ్‌పాల్ ఆంబుష్!

ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా తోంగ్‌పాల్ సమీపంలో జగ్దల్‌పూర్-కుంట జాతీయ రహదారి-221పై భారత కిరాయి అర్ధసైనిక, జిల్లా పోలీసు సంయుక్త బలగాలపై మార్చి 11న మా ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం (పి.ఎల్.జి.ఏ.) కమాండర్లు, ఎర్ర పోరాట యోధులు సాగించిన సాహసోపేతమైన దాడిలో 11 మంది 80వ సిఆర్‌పిఎఫ్ బెటాలియన్ బలగాలు, నలుగురు జిల్లా పోలీసులు మరణించారు. వారి వద్ద నుండి 19 ఆయుధాలు (ఏకె47-6, ఎస్ఎల్ఆర్-2, ఇన్‌సాస్-7, గ్రెనేడ్ లాంచర్లు-3, ఎల్ఎంజి-1), మందుగుండు, ఇతర సైనిక సామగ్రిని మా గెరిల్లాలు స్వాధీనం చేసుకున్నారు. భారత రాజ్యం ప్రజలపై యుద్ధం 'ఆపరేషన్ గ్రీన్ హంట్' పేరుతో సాగిస్తున్న తెల్ల బీభత్సానికి (వైట్ టెర్రరిజానికి) వ్యతిరేకంగా ఆత్మరక్షణ కోసం మా పార్టీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా పిఎల్‌జిఏ కొనసాగిస్తున్న ఎత్తుగడల ఎదురుదాడులలో భాగమే తోంగ్‌పాల్ ఆంబుష్. ఈ దాడిని విజయవంతం చేసిన పిఎల్‌జిఏ బలగాలకు కేంద్రకమిటీ విప్లవ జేజేలు తెలుపుతోంది.

ఈ ఘటన కిరాయి సైనిక, అర్ధసైనిక, పోలీసు మూకల ఉక్కుపాదాల కింద నలిగిపోతున్న భారత పీడిత ప్రజానీకాన్ని ఎంతో ఉత్సాహపరచగా దోపిడి ప్రభుత్వాలను, వారి బంట్లను మరోసారి కుదిపివేసింది. దీనికి వ్యతిరేకంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాంగ్రెస్, బిజెపిలు ఖండనమండనలకు దిగాయి. ఇది రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యమని చెబుతూ కాంగ్రెస్ రమణ్‌సింగ్ రాజీనామాను డిమాండ్ చేస్తూ రాష్ట్ర బంద్‌కు పిలుపు నిచ్చింది. తమ కిరాయి బలగాల మొరేల్ నిలబెట్టేందుకై కేంద్ర హోంమంత్రి సుశీల్ కుమార్ షిండే, ముఖ్యమంత్రి రమణ్‌సింగ్, పోలీసు ఉన్నతాధికారులు హుటాహుటిన ఘటనా స్థలాన్ని సందర్శించి, ఇది నక్సల్స్ పిరికి చర్య అనీ, నిజానికి నక్సలైట్లు బలహీనపడ్డారని, వారి డాక్యుమెంట్లే ఇందుకు నిదర్శనమని, తమ బలహీనతను కప్పిపుచ్చుకునేందుకే ఈ ఘాతుకానికి ఒడిగట్టారని మొసలి కన్నీరు కార్చారు. షిండే 'నక్సల్స్ సాగించిన ఈ టెర్రరిస్టు చర్యకు ప్రతీకారం తీర్చుకుంటామని' విప్లవ ప్రతీఘాతక స్వభావాన్ని రుజువు చేసుకుంటున్నాడు. ఈయన ప్రపంచంలో 'అత్యంత పెద్ద ప్రజాస్వామిక దేశం'గా పిలువబడే భారత దేశ హోంమంత్రి!

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆపరేషన్ గ్రీన్ హంట్ పేరుతో ప్రజలపై సాగిస్తున్న యుద్ధాన్ని కప్పిపుచ్చుకునేందుకు దొంగే దొంగ అన్న చందంగా మమ్మల్ని టెర్రరిస్టులుగా నిందిస్తున్నాయి. అసలు ఎవరు టెర్రరిస్టులు? మేం నిజంగా బలహీనపడితే దాదాపు 4 లక్షలకు పైగా కేంద్ర, రాష్ట్ర సాయుధ బలగాలను విప్లవోద్యమ ప్రాంతాలలో మోహరించి గ్రామాలపై నిత్యం కూంబింగులు, దాడులు సాగిస్తూ అంతూపొంతూ లేకుండా ప్రజలను వేధింపులు, అరెస్టులు, జైలు, హత్యలు, మహిళలపై అత్యాచారాలు, బూటకపు ఎన్‌కౌంటర్లు, ఊచకోతలకు గురిచేయడం దేనికి? ఛత్తీస్‌గఢ్ విధానసభ ఎన్నికలకు మునుపెన్నడూ లేని విధంగా 165 కంపెనీల అర్ధసైనిక బలగాలను ఎందుకు మోహరించాల్సి వచ్చింది? భారత రాజ్య యంత్రాంగాన్ని ఫాసిజీకరిస్తూ దేశ ప్రజలపై నిరాఘాటంగా దాడులు చేస్తున్న కేంద్ర, రాష్ట్ర దోపిడి పాలకవర్గాలే అసలైన టెర్రరిస్టులు. ఢిల్లీని అడ్డా చేసుకున్న అమెరికా సామ్రాజ్యవాదుల ఇంటలిజెన్స్ సంస్థ ఎఫ్ఐబి ప్రత్యక్ష పర్యవేక్షణలో ఈ దాడులకు వ్యూహ రచన జరుగుతోంది. మా పార్టీని, దాని నాయకత్వంలో సాగుతున్న దీర్ఘకాల ప్రజాయుద్ధాన్ని, ఈ దోపిడి భారత రాజ్యానికి ప్రత్యామ్నాయంగా మొగ్గతొడుగుతున్న నిజమైన ప్రజాస్వామ్యం, స్వావలంబనలపై ఆధారపడిన విప్లవ ప్రజా కమిటీలను (విప్లవ ప్రజా ప్రభుత్వాలను) సమూలంగా నాశనం చేయడమే ఈ దాడుల లక్ష్యం. 'దేశ అంతర్గత భద్రత'కు అత్యంత ప్రమాదకారి అనే పేరుతో అమెరికా నిర్దేశిత ఎల్ఐసి వ్యూహం-ఎత్తుగడలకు అనుగుణంగా అత్యంత తీవ్రస్థాయిలో బహుముఖ దాడికి దిగుతున్నారు. వారి మోసపూరిత శాంతి చర్చల ప్రతిపాదనలు, సంస్కరణ పథకాలు ప్రజలను, ప్రజాస్వామికవాదులను పక్కదారి పట్టించేందుకూ విప్లవోద్యమంపై మరింత భారీ దాడి సాగించేందుకూ ఉద్దేశించినవే. దినదినం విప్లవ పరిస్థితులు పరిపక్వమవుతున్న నేపథ్యంలో సమాజంలోని పురోగామి విప్లవశక్తుల నాయకత్వాన్ని నిర్మూలించడం ద్వారా ప్రజలకు నాయకత్వం లేకుండా చేసి ఈ దోపిడి వ్యవస్థను కాపాడాలనేదే పాలకవర్గాల కుట్ర.

ఇందులో భాగంగా బీహార్, ఝార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఒడిశా, పశ్చిమ బెంగాల్, ఆంధ్రప్రదేశ్, కర్నాటక, తమిళనాడు, అసోం మొదలైన ఉద్యమ ప్రాంతాలలో వందలాది ఆదివాసులను, ఇతర పీడిత ప్రజలను, విప్లవ కార్యకర్తలను ఊచకోత కోస్తున్నాయి. ఈ దాడుల్లో గడచిన సంవత్సర కాలంలోనే 150 మందికి పైగా విప్లవకారులను, సాధారణ ప్రజలను వారి కిరాయి సాయుధ బలగాలు ఊచకోత కోశాయి. ఉద్యమ ప్రాంతాలను సైనిక క్యాంపులుగా మార్చివేశాయి. వేలాది మంది అమాయక ప్రజలను, విప్లవ కార్యకర్తలను, నాయకులను జైళ్లల్లో బంధించాయి. మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో గోవిందగావ్, భట్‌పార్, సిందేసూర్, మెడ్రీ ఊచకోతలు, ఆ రక్తం తడి ఆరకముందే పేందోడ్‌వాయ, ఇందూర్ దాడులు, గోందియా జిల్లాలో ఇటీవల జరిగిన బేత్‌కఠి ఊచకోత, ఝార్ఖండ్‌లో లకడబాంధా

ఊచకోత, తదితర దాడులు, దండకారణ్యంలో పువ్వార్, మారాయిగూడా, ఒడ్నార్, ఎడ్స్మెట్ట, బుర్గుం, బడేకాకిలేర్, నేల్నార్ దాడులు, ఒడిశాలో శిలాకోట, ముంగులువలస దాడులు ఇందులో ప్రముఖమైనవి. గోవిందగావ్లో గ్రామంలో రాత్రిపూట సభ జరిపి వస్తుంటే పోలీసులు మాటుగాచి మా కామ్రేడ్స్పై దాడి చేసి డివిసిఎం కామ్రేడ్ శంకర్తో సహా ఆరుగురిని, భట్పార్లో వెనుక నుండి దెబ్బతీసి ముగ్గురు గ్రామస్థులతో సహా ఐదుగిరిని, సిందేసూర్లో అన్నం తెచ్చిన ముగ్గురు గ్రామస్థులతో సహా ఏడుగిరిని ఊచకోత కోశాయి. మేడ్రీలో ఆరుగురు మహిళా కామ్రేడ్స్ ఊచకోతకు మేడ్రీ గ్రామస్థులే ప్రత్యక్ష సాక్ష్యం. మీడియాలో కూడా ఈ విషయం వెలుగులోకి వచ్చింది. హత్యానంతరం కుఖ్యాత సి-60 కమాండోలు మహిళా కామ్రేడ్స్ శవాలను కూడా వదిలిపెట్టకుండా అసభ్యంగా వ్యవహరిస్తూ మొబైల్లో వీడియో చిత్రీకరించి ఆ క్లిప్పులను సంతలలో అమ్ముతున్నారు. లకడబాంధా (ఝార్ఖండ్)లో కోబ్రా కమాండోలు, విప్లవ ప్రతీఘాతక టిపిసి గూండాలు మా పార్టీ నాయకత్వాన్ని లక్ష్యంగా చేసుకొని ఏకపక్షంగా దాడి చేసి కామ్రేడ్ ప్రశాంత్తో సహా పదిమందిని హత్య చేశారు. పువ్వార్ ఘటనలో 26 మందితో కూడిన మా పిఎల్జిఏ బలగాలను 4000 వేలమంది గ్రేహౌండ్స్, కోబ్రా, సిఆర్పిఎఫ్, సిఏఎఫ్ బలగాలతో చుట్టిముట్టి క్రూరంగా ఎస్జడ్సిఎం కామ్రేడ్ సుధాకర్ నుంచి ఏరియా స్థాయి వరకూ గల ముఖ్యమైన నాయకత్వాన్ని హత్య చేశారు. మారాయిగూడా వద్ద ఒక జిల్లా కమిటీ సభ్యుడు కామ్రేడ్ నరేష్తో సహా ఇద్దరిని కాల్చిచంపారు. ఒడ్నార్లో ఇద్దరు గ్రామస్థులను పోలీస్స్టేషన్కు పిలిపించి పట్టుకొని బూటకపు ఎన్కౌంటర్లో హత్య చేసి శవాలను కూడా బంధువులకు ఇవ్వకుండా ఖననం చేశారు. ఎడ్స్మెట్ట గ్రామంలో పండుగ జరుపుకుంటున్న గ్రామస్థులపై దాడి చేసి ముగ్గురు పిల్లలతో సహా 8 మందిని ఊచకోత కోశారు. బుర్గుం గ్రామ సమీపంలో చిన్న పిఎల్జిఏ టీముపై దాడి చేసి ఇద్దరు మహిళా కామ్రేడ్స్ను పొట్టనబెట్టుకున్నారు. వారిలో ఒక మహిళా కామ్రేడ్ గాయపడి పడిపోగా పట్టుకొని కాల్చిచంపారు. కువ్వెంలో ఇలాగే ముగ్గురు మిలీషియా కామ్రేడ్స్ను, బడేకాకిలేర్లో ముగ్గురిని, నేల్నార్లో ముగ్గురిని హత్య చేశారు. ఒడిశాలోని శిలాకోటలో గ్రామీణ ప్రజా మిలీషియా కామ్రేడ్స్ను 13 మందిని ఊచకోత కోయగా, మాచ్ఖండ్ ప్రాంతంలో కామ్రేడ్ మాధవ్ను, ఇటీవల ముంగులువలసలో కామ్రేడ్స్ మంగన్న, మహేందర్లను పట్టుకొని బూటకపు ఎన్కౌంటర్లో హత్య గావించారు. ఇంకా అనేక మందిని విడి విడిగా పట్టుకొని హత్య చేసిన ఘటనలు ఉన్నాయి.

మరోవైపు 'అడవుల్లో ఉండి హింసకు తెగబడుతున్న మావోయిస్టు గెరిల్లాలకు ఒక సిద్ధాంతమంటూ లేదు' అంటూ విరుచుకపడే పాలకవర్గాలు 'మావోయిస్టు భావజాలాన్ని ఆరిపోనీయకుండా నిరంతరం రాజేస్తున్న నగరాల్లోని మావోయిస్టు మేధావులే గెరిల్లాల కన్నా ప్రమాదకరం' అంటూ ఆపరేషన్ గ్రీన్ హంట్ను నగరాలకు, పట్టణాలకు విస్తరింపజేస్తున్నాయి.

ప్రజాస్వామిక, విప్లవ, జాతి విముక్తి ఉద్యమాలకు మద్దతు తెలిపే మేధావులపై ఏదో ఒక రకంగా యు.ఏ.పి.ఏ. వంటి కుట్ర కేసులు మోపి జైళ్లల్లో కుక్కుతున్నారు. గత సంవత్సరం నుంచి మరో అడుగు ముందుకు వేసి ఆంధ్రప్రదేశ్ పీడిత ప్రజల ప్రియతమ నాయకుడు కామ్రేడ్ గంటి ప్రసాదంను ప్రభుత్వ నల్లదండు ముఠా చేత, తెలంగాణ ఉద్యమ నాయకుడు కామ్రేడ్ ఆకుల భూమయ్యను యాక్సిడెంట్ పేరున హత్య చేయించాయి. ప్రభుత్వ వ్యతిరేక ఉద్యమాలలో, బహిరంగ విప్లవ కార్యక్రమాలలో చురుకుగా ఉండే ఎంతో మంది కార్యకర్తలకూ, మేధావులకూ బెదిరింపు ఫోన్స్ సాధారణ విషయంగా మారింది.

తమ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా తిరగబడే ప్రజలను అణచివేయడం కోసమూ, తమ అధికారాన్ని సుస్థిరం చేసుకోవడం కోసమూ సైనిక, అర్ధసైనిక, ప్రత్యేక పోలీసు, కమాండో బలగాలపై, ఐబి, ఎన్ఐఏ, ఎస్ఐబి వంటి ఇంటలిజెన్స్ సంస్థలపై ఆధారపడుతూ ఫాసిస్టు దాడులు కొనసాగిస్తున్నాయి. ప్రజల పౌరహక్కుల్ని, జీవించే హక్కును సైతం కాలరాచి వేస్తున్నాయి.

ఇదంతా పిడికెడు మంది దోపిడిదారుల కోసం నూటికి 90 శాతంగా ఉన్న పీడిత ప్రజలు, సెక్షన్లు, జాతులపై భారత రాజ్యం సాగిస్తున్న ప్రత్యక్ష హింస కాక మరేమిటి? లెక్కలు తీస్తే ఈ హింసలో ప్రతి సంవత్సరం లక్షలాదిగా ప్రజలు మరణిస్తున్నారని స్పష్టమవుతుంది. ఈ దోపిడి పాలకవర్గాలు, వాటి భారత రాజ్య యంత్రాంగం సాగిస్తున్న ఈ తెల్ల బీభత్సానికి (వైట్ టెర్రర్) వ్యతిరేకంగా మా పార్టీ నాయకత్వంలో పిఎల్‌జిఏ సాగిస్తున్నది కేవలం ప్రతిహింస, విప్లవ హింస మాత్రమే. కనీస ప్రజాస్వామిక పద్ధతులు, పౌరహక్కులు మృగ్యమైపోయిన స్థితిలో ప్రపంచంలో ఎక్కడైనా పీడిత జాతులు, ప్రజలు ఈ మార్గాన్నే అనుసరించారని చరిత్ర గురించి ఏమాత్రం తెలిసినావారికైనా అర్థమవుతుంది.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొనసాగిస్తున్న తెల్ల బీభత్సానికి వ్యతిరేకం గానూ, ప్రత్యేకించి ప్రజలపై యుద్ధం - ఆపరేషన్ గ్రీన్ హంట్‌లో భాగంగా సాగిస్తున్న హింసకు వ్యతిరేకంగా ఉద్యమించాల్సింది గానూ కార్మిక-కర్షక తదితర పీడిత ప్రజలకు, ప్రజాస్వామికవాదులకు, విద్యార్థి, యువతీ యువకులకు, మేధావులకు, దేశభక్తయుత శక్తులకు, ఆదివాసీ శ్రేయోభిలాషులకు, పర్యావరణ ఉద్యమకారులకు, కవులు, రచయితలు, కళాకారులకు ఈ సందర్భంగా మా పార్టీ విజ్ఞప్తి చేస్తోంది.

**అభయ్**

**అధికార ప్రతినిధి**

**కేంద్ర కమిటీ**

**సీపీఐ (మావోయిస్టు)**

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# కేంద్ర కమిటీ

**19-5-2014**

## మోడీ నేతృత్వంలో బిజెపి విజయం దేశంలో ప్రజలపై తీవ్రతరం కానున్న దోపిడీ పీడనలకు, ఫాసిజానికి సూచికే!
## బ్రాహ్మణవాద హిందూ ఫాసిస్టుల నుంచి పొంచి ఉన్న పెనుముప్పును తిప్పికొట్టడానికి విశాల ప్రాతిపదికన విప్లవ, ప్రజాస్వామిక సంస్థలు, ప్రజలు సమైక్యమై ఉద్యమించాల్సిందిగా ప్రజలకు పిలుపు!

అతిపెద్ద ప్రజాస్వామిక వ్యవస్థ అని చెబుతున్న భారతదేశంలో 16వ లోక్‌సభ ఎన్నికలు మునుపెన్నడూ లేనివిధంగా 9 దశలలో జరిగాయి. ఇందుకోసం 70 లక్షల సిబ్బందిని, పదుల లక్షల సంఖ్యలో భద్రతా బలగాలను మోహరించారు. పదుల వేల కోట్ల రూపాయాల ప్రజాధనాన్ని ఖర్చు చేశారు. "స్వేచ్ఛగా, పారదర్శకంగా, స్వతంత్రంగా" ఎన్నికలను నిర్వహించేందుకై ఇలా చేయాల్సి వచ్చిందని ఎన్నికల కమీషన్ చెప్పింది. ఈ బూటకపు పార్లమెంటరీ ఎన్నికల పట్ల ప్రజలలో తీవ్ర వ్యతిరేకత ప్రబలి ఉంది. ప్రత్యేకించి, మా పార్టీ సిపిఐ (మావోయిస్టు)తో పాటు కశ్మీర్ జాతి విముక్తి పోరాట సంస్థలు, ఈశాన్య ప్రాంతంలో ప్రత్యేకించి మణిపూర్‌లో కొన్ని శక్తులు, అనేక ప్రజాస్వామిక సంస్థలు బహిరంగంగానే ఎన్నికల బహిష్కరణకు పిలుపు నిచ్చాయి. నిజానికి ఎన్నికల పట్ల నానాటికీ పెంపొందుతున్న ఈ వ్యతిరేకతను తొక్కిపట్టడం కోసమే పెద్దయెత్తున సాయుధ బలగాలను ప్రత్యేకించి ప్రజా పోరాట ప్రాంతాలలో మోహరించారు. ఈ సాయుధ బలగాల కనుసన్నలలో ప్రజలపై ఒక యుద్ధంలాగానే ఈ ఎన్నికలు జరిగాయి.

ఎన్నికల్లో ప్రజల భాగస్వామ్యాన్ని, పోలింగ్ శాతాన్ని పెంచేందుకై మునుపెన్నడూ లేనివిధంగా ఎన్నికల కమీషన్ 2009లో జరిగిన 15వ లోక్‌సభ ఎన్నికల నుంచి కొనసాగిస్తూ వస్తున్న అనేక వినూత్న విన్యాసాలను ఈ ఎన్నికలలో కూడా నిర్వహించింది. సామ్రాజ్యవాద ఏజెన్సీలు తెరచాటు నుంచి అందించిన అన్ని రకాల మద్దతుతో భారత కార్పొరేట్ సంస్థలు ప్రత్యక్షంగా రంగంలోకి దిగి 'ఓటు హక్కు'ను వినియోగించుకోవాల్సిన అవసరం గురించి

ప్రచార హోరును సృష్టించాయి. ఎన్నికల పార్టీలు కార్పొరేట్ మీడియాని ఉపయోగించుకొని బూటకపు వాగ్దానాలను గుప్పించాయి. పార్లమెంటరీ ఎన్నికల ప్రాధాన్యత గురించి పెద్దయెత్తున భ్రమలను, ఎన్నికల చుట్టూ ఒక టెంపోను సృష్టించాయి. పార్లమెంటరీ వ్యవస్థ పట్ల విమర్శనాత్మక వైఖరిని చేపట్టిన ఏరియాల్లోని ప్రజలు కూడా ఓటు వేసేలా ఒత్తిడి తీసుకొని వచ్చాయి. ఎన్నికలను విజయవంతంగా నిర్వహించేందుకు ఎన్నికల కమీషన్ ఎంతగానో పాటుపడిందనీ, ధనబలాన్ని, కండబలాన్ని చెప్పుకోదగిన రీతిలో అణచివేసిందనీ చెబుతున్నప్పటికీ ఎన్నికల పార్టీలన్నీ తమ అభ్యర్థులుగా స్మాంగ్లర్స్, గాంగ్‌స్టర్స్, క్రిమినల్స్‌నే మరోసారి ప్రజల ముందుకు తెచ్చాయి. ఏ ఎన్నికల పార్టీ కూడా విశాల ప్రజారాశులు, దేశం ఎదుర్కొంటున్న మౌలిక సమస్యలను గంభీరంగా చేపట్టటం గానీ, ప్రజల ముందుకు తీసుకురావడం గానీ జరగలేదు. ఎన్నికల ప్రచార క్యాంపెయిన్ల సందర్భంగా బరిలోని పార్టీలు, అభ్యర్థులు ప్రజల సమస్యలను పట్టించుకోవడం మాట అటుంచి పరస్పర ఆరోపణలు చేసుకోవడంపై కేంద్రీకరించడం జరిగింది. తద్వారా అన్ని పార్లమెంటరీ పార్టీలూ, అభ్యర్థులూ తమ ప్రజావ్యతిరేక స్వభావం, అభివృద్ధి నిరోధక-స్వార్థపూరిత విధానాలు, కుంభకోణాలు, అవినీతి వ్యవహారాలు పరస్పరం బహిర్గతం చేసుకోవడం, ముసుగు తొలగించుకోవడం జరిగింది. నల్లధనం, కండబలం, మతం, కులం, ప్రాంతం, సారాయి-మాదక ద్రవ్యాలు వంటి మత్తు పదార్థాలను, బెదిరింపులను పెద్దయెత్తున వినియోగించారు. దేశవ్యాపితంగా ఎన్నికల్లో పంపిణీ చేయడానికి ఉద్దేశించిన 200 కోట్ల రూ.లకు పైగా నగదు, రెండు కోట్ల లీటర్లకు పైగా సారాయి, పెద్దయెత్తున మాదక ద్రావ్యాలను పోలీసులు స్వాధీనం కావడం ఇందుకు నిదర్శనం. వీటి కన్నా వెలుగు చూడనివే ఎన్నో రెట్లు ఎక్కువ అనేది వేరే చెప్పక్కర్లేదు. కేవలం ఒక్క మోడీ ఎన్నికల ప్రచారం కోసమే 30 వేల కోట్ల రూ.లు ఖర్చయ్యిందని మీడియానే వెలువరించింది. ప్రతి అభ్యర్థి తన ప్రచారం కోసం 70 లక్షల రూ.లకు మించి ఖర్చు చేయరాదని ఎన్నికల నిబంధన ఉండగా దీనిని ఉల్లంఘిస్తూ సగటున ప్రతి ఒక్క అభ్యర్థి 8 కోట్ల రూ.లు ఖర్చు చేశారు. వెలుగు చూసిన ఇలాంటి వాస్తవాల ద్వారా ప్రపంచంలో అతిపెద్ద పార్లమెంటరీ ఎన్నికలలోని బూటకపు స్వభావాన్ని తెలియజేస్తున్నాయి.

గత పది సంవత్సరాలుగా అధికారంలో కొనసాగిన కాంగ్రెస్ పార్టీ అత్యంత అభివృద్ధినిరోధక, ప్రజావ్యతిరేక, విద్రోహపూరిత పాత్ర నిర్వహిస్తూ సామ్రాజ్యవాద అనుకూల విధానాలను, పాలకవర్గాల అనుకూల విధానాలను పెద్దయెత్తున అమలు చేసింది. దేశానికి, ప్రజలకు వ్యతిరేకంగా కాంగ్రెస్ చేయని నేరమంటూ లేదు. ఫలితంగా కాంగ్రెస్ ఈ ఎన్నికల్లో మునుపెన్నడూ లేనివిధంగా 50 కంటే తక్కువ సీట్లతో తన మొత్తం చరిత్రలో అవమానకరమైన ఓటమిని చవిచూసింది. కాంగ్రెస్ పట్ల ప్రజలలో ఏర్పడిన తీవ్ర వ్యతిరేకతను సొమ్ము చేసుకొని భారత పార్లమెంటరీ చరిత్రలో మొట్టమొదటిసారిగా మోడీ నేతృత్వంలోని

కాంగ్రెసేతర బిజెపి-ఎన్‌డిఏలు లోక్‌సభలోని మొత్తం 543 సీట్లలో అత్యధికంగా 334 సీట్లను సంపాదించి అధికారాన్ని చేపట్టాయి.

ఎన్నికల ప్రకటనకు ముందు నుంచే పెద్దయెత్తున అదనపు అర్ధసైనిక బలగాలను మోహరించారు. సాయుధ బలగాలు విప్లవోద్యమ ప్రాంతాలుగా ఉన్న మొత్తం 14 రాష్ట్రాలలో, కశ్మీర్, ఈశాన్య జాతీయ విముక్తి, ప్రజా ప్రతిఘటనా ప్రాంతాలలో కార్డెన్ అండ్ సర్చ్ ఆపరేషన్లు ముమ్మరం చేశాయి. మొట్టమొదటి దేశవ్యాప్త అణచివేత క్యాంపెయిన్‌ను వారం రోజుల పాటు (2013 డిసెంబర్ 26 నుంచి 2014 జనవరి 1 వరకు) తొమ్మిది రాష్ట్రాలలో 40 వేల అదనపు అర్ధసైనిక బలగాలు, రాష్ట్ర పోలీసు బలగాలతో నిర్వహించగా, రెండవ అణచివేత క్యాంపెయిన్‌ను 2014 మార్చి 19 నుంచి 27 వరకు సుమారు ఒక లక్ష అర్ధసైనిక బలగాలు, ఆరు వేల కమాండో బలగాలు, 4 ఇజ్రాయిల్ ఏరోన్ గూఢచర్య విమానాలు, రాడర్లతో కూడిన అనేక మైన్‌ప్రూఫ్ వాహనాలు, 70 మంది పోలీసు ఇన్‌స్పెక్టర్ జనరల్స్ (ఐజిపి) అధికార్ల నేతృత్వంలో మావోయిస్టు ఉద్యమం క్రియాశీలంగా ఉన్న ఆరు రాష్ట్రాలలో నడిపారు. ఈ విప్లవ ప్రతీఘాతక క్యాంపెయిన్ల లక్ష్యం ఉద్యమాన్ని అణచివేయడం, తమ 'ప్రజాస్వామిక' ఎన్నికలను నిర్వహించేందుకు వీలుగా ప్రజలలో తెల్ల బీభత్సాన్ని సృష్టించడం. విప్లవోద్యమ, జాతి విముక్తి పోరాట ప్రాంతాలలో పదుల సంఖ్యలో విప్లవ, జాతి విముక్తి కార్యకర్తలు, పోరాటయోధులను, సాధారణ ప్రజలను హత్య గావించాయి. మహిళలు, పిల్లలు, వృద్ధులు అని లక్ష్యపెట్టకుండా అనేక మంది ప్రజలను, రాజకీయ కార్యకర్తలను పట్టుకొని చిత్రహింసలు పెట్టారు. గ్రామాలలో ప్రజలను సామూహికంగా చితకబాదారు. తుపాకీ సన్నీల కింద పెద్దయెత్తున భయోత్పాతాన్ని సృష్టించి ఎన్నికలు నిర్వహించారు. కశ్మీర్‌కు స్వాతంత్ర్యం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ లోక్‌సభ ఎన్నికల బహిష్కరణకు పిలుపు నిచ్చిన హురియత్ కాన్ఫరెన్స్ నాయకులను, కార్యకర్తలను ప్రభుత్వ సాయుధ బలగాలు అదుపులోకి తీసుకోవడానికి నిరసనగా ఏప్రిల్ 21న రాష్ట్రవ్యాప్త బంద్ పూర్తిగా విజయవంతమైంది. భద్రతా బలగాల హత్యలు, అత్యాచారాలకు వ్యతిరేకంగా కశ్మీర్ లోయ ఒకవైపు బంద్‌లు, నిరసన ప్రదర్శనలు, మరోవైపు రాజ్య నిర్బంధం, ప్రభుత్వ కర్ఫ్యూలతో అట్టుడికిపోయింది. కర్ఫ్యూలను, ఇతర నిషేధాజ్ఞలను ధిక్కరిస్తూ ప్రజలు సైనిక, అర్ధసైనిక బలగాలతో రాళ్ల యుద్ధాలకు దిగారు.

నయానా భయానా ఇంతటి ప్రచార హోరును, భయావహ వాతావరణాన్ని సృష్టించినప్పటికీ, ఎన్నికల కమీషన్ 90 శాతం పోలింగ్ లక్ష్యం పెట్టుకొని నానాపాట్లూ పడినప్పటికీ అధికారిక లెక్కల ప్రకారం 66 శాతానికి మించి పోలింగ్ జరగలేదు. పెద్దయెత్తున ధనబలం, కండబలం, అధికార బలం, సాయుధ బలగాల డామినేషన్‌తో సాగించిన రిగ్గింగ్ శాతాన్ని ఇందులో నుండి మినహాయిస్తే నిజమైన పోలింగ్ శాతం ఇంకా పడిపోతుంది. ఈ రిగ్గింగ్‌లో ప్రధాన పార్లమెంటరీ పార్టీలన్నింటికీ భాగస్వామ్యం ఉంది. ఎన్నికల అధికారాలను, సిబ్బందిని

తరలించేందుకై భారత వాయుసేనకు, భారత మరియు విదేశీ ప్రైవేటు కంపెనీలకు చెందిన అసంఖ్యాకంగా హెలికాప్టర్లను, విమానాలను మోహరించినప్పటికీ, అది చాలక, విప్లవ, జాతి విముక్తి ఉద్యమాలు బలంగా ఉన్న ప్రాంతాలలో పోలింగ్ జరపడం కష్టమని అనేక పోలింగ్ కేంద్రాలను పోలీసు స్టేషన్లు, అర్థసైనిక బలగాల క్యాంపుల వద్దకు బదిలీ చేశారు. ఇలాంటి పోలింగ్ కేంద్రాలలో పెద్దమొత్తంలో దొంగఓట్లను గుద్దుకున్నారు. అయినా దండకారణ్యం, బీహార్, ఝార్ఖండ్, ఒడిశా, ఆంధ్ర-ఒడిశా సరిహద్దు ప్రాంతాలలో విప్లవ ప్రజా ప్రభుత్వాలు, మావోయిస్టు ఉద్యమం బలంగా ఉన్న చోట 5-20 శాతానికి చేరడం గగనం కాగా, కశ్మీర్‌లో పెద్దయెత్తున భయావహ వాతావరణం సృష్టించినప్పటికీ అధికారిక లెక్కల ప్రకారం 27 శాతం మాత్రమే పోలింగ్ జరిగింది. 'కశ్మీర్‌కు స్వాతంత్ర్యం కావాలి' అనే నినాదం ఈ ఎన్నికల సందర్భంగా మరోసారి మారుమోగింది.

'నోటా' ప్రత్యామ్నాయం అనేది నిజానికి ప్రజలను 'రైట్ టు రీకాల్' హక్కు నుంచి వంచితులను గావించేందుకై ముందుకు తెచ్చినప్పటికీ, ఓటు వేయకపోతే ఉగ్రవాది గానో, మావోయిస్టు గానో ముద్ర పడుతుందని రాజకీయ పార్టీలు, సాయుధ బలగాల బెదిరింపులతోనూ, మరో ప్రత్యామ్నాయం లేని పరిస్థితులలోనూ ఓటర్లు దాదాపు ఒక కోటి మంది 'నోటా' బటన్‌ను నొక్కారు. ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలకు, అణచివేతకు వ్యతిరేకంగా విప్లవోద్యమ, జాతి విముక్తి పోరాట ప్రాంతాలలోనూ ప్రజాస్వామిక, విస్థాపన వ్యతిరేక ఉద్యమాల పిలుపు మేరకూ పీడిత ప్రజలు, పీడిత జాతులు గణనీయమైన సంఖ్యలో ఎన్నికల్ని బహిష్కరించటం జరిగింది. రాజ్యం నుండి ఎదురైన తీవ్రమైన బెదిరింపులను, హెచ్చరికలను ధిక్కరిస్తూ బూటకపు ఎన్నికలను తిరస్కరించి, బహిష్కరించిన వారందరికీ మా పార్టీ సిపిఐ (మావోయిస్టు) విప్లవ జేజేలు పలుకుతోంది.

శత్రు దాడుల నుంచి ఆత్మరక్షణ చేసుకోవడంలో భాగంగా మా పార్టీ నాయకత్వంలో పిఎల్‌జిఏ ఎర్ర పోరాటయోధులు దండకారణ్యం (ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర), బీహార్, ఝార్ఖండ్, ఒడిశా, ఆంధ్ర-ఒడిశా సరిహద్దు ప్రాంతం, తదితర రీజియన్లలో శత్రు బలగాలపై అనేక వీరోచిత దాడులు నిర్వహించి అనేక మంది సాయుధ పోలీసులను నిర్మూలించి, గాయపరిచారు. వారి నుండి అనేక ఆధునిక ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. అయితే అత్యంత విచారకరమైన విషయం - మా పిఎల్‌జిఏ బలగాలు ఎన్నికల సిబ్బంది ప్రయాణిస్తున్న వాహనాలను పోలీసు వాహనాలుగా తప్పుగా అర్థం చేసుకొని పేల్చివేశాయి. ఇటువంటి లోపాల వల్ల కొంతమంది సాధారణ ఎన్నికల సిబ్బంది మరణించడం, గాయపడడం జరిగింది. మా పార్టీకి చెందిన సంబంధిత యూనిట్లు ఇప్పటికే ఇలాంటి దురదృష్టకరమైన సంఘటనల పట్ల తమ క్షమాపణలను కోరాయి. ఈ సందర్భంగా మేం ఇందుకు మరొకసారి ప్రజలను క్షమాపణలు కోరుతూ, బాధిత కుటుంబాలకు, మిత్రులకు హృదయపూర్వక ప్రగాఢ సంతాపాన్ని తెలుపుతున్నాం.

ఒక ఫార్స్‌లా జరిగిన ఎన్నికల్లో మునుపెన్నడూ లేనివిధంగా ఎన్‌డిఏ కూటమి చారిత్రాత్మక విజయం సాధించిందని చెబుతున్నప్పటికీ నిజానికి దానికి లభించిన ఓట్ల శాతం 35కు మించలేదు. 65 సంవత్సరాల అతిపెద్ద ప్రజాస్వామిక వ్యవస్థగా చెబుతున్న భారతదేశంలో 35 శాతం మాత్రమే ఓట్లు పొందిన ఎన్‌డిఏ గెలుపును చారిత్రాత్మక గెలుపుగా చెప్పటానికి మించిన దివాలాకోరుతనం మరొకటి ఉండదు. తిరిగి స్కాంస్టర్స్, గ్యాంగ్‌స్టర్స్, క్రిమినల్స్ గెలవడమే ఎన్నికలు ఫక్తు ఫార్స్‌గా జరిగాయనడానికి నిదర్శనం.

సంఘ్ పరివార్ ప్రోద్బలంతో బిజెపి ప్రధానమంత్రి పదవి అభ్యర్థిగా మోడీని ముందుకు తెచ్చారు. ఈ ఎన్నికల్లో సంఘ్ పరివార్ భాగస్వామ్యం పూర్తిగా ఉంది. పోలింగ్ జరిగిన మేరకు అది ఎంత తప్పుల తడకగా జరిగినప్పటికీ అందులో మోడీ నాయకత్వంలో బిజెపికి గతంలో ఎన్నడూ లేని విధంగా భారీ సీట్లలో విజయాన్ని సాధించింది. మరోవైపు, యుపిఏ కూటమి ఘోరమైన ఓటమికి చవిచూడాల్సి వచ్చింది. యుపిఏ ప్రభుత్వ కాలంలో నూతన సరళీకృత ఆర్థిక విధానాలను పెద్దయెత్తున అమలు చేయడం, పెచ్చరిల్లిపోయిన అవినీతి, కుంభకోణాలు, అధిక ధరలు, విద్యా వైద్యం సౌకర్యాల లేమి, ప్రజలకు జవాబుదారీతనం లేకపోవడం, తీవ్ర నిరుద్యోగం, కార్మికుల రిట్రెంచ్‌మెంట్లు, రైతుల ఆత్మహత్యలు, మహిళలపై అత్యాచారాలు-హింస, సాంఘిక అసమానతలు, ఆకలి చావులు, దళితులపై బ్రాహ్మణవాద అగ్రకులతత్వ శక్తుల అత్యాచారాలు-హింస, పీడిత జాతులపై ఘోరమైన మానవహక్కుల ఉల్లంఘన, *జల్-జంగల్-జమీన్, హక్-అధికార్,* ఇజ్జత్‌ల నుంచి ఆదివాసీ ప్రజలను, పీడితులను వంచితులను గావిస్తూ వారు చేపట్టిన విస్థాపన వ్యతిరేక ఉద్యమాల పట్ల, ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాలు ప్రత్యేకించి తెలంగాణ, గూర్ఖాలాండ్ ఉద్యమాల పట్ల, తీవ్ర అణచివేత, నిర్లక్ష్యం వల్ల, పెద్దయెత్తున పర్యావరణ విధ్వంసం వల్ల యుపిఏ ప్రభుత్వం పట్ల ప్రజలలో తీవ్ర వ్యతిరేకత ఏర్పడడమే ఇందుకు ప్రధాన కారణం.

అలాగే యుపిఏ ప్రభుత్వం పట్ల ఏర్పడిన ప్రజా వ్యతిరేకతనూ, అన్నా-ఆప్ పార్టీల చొరవతో ముందుకు వచ్చిన అవినీతి వ్యతిరేక ఉద్యమ ఫలితాలనూ తన ఎన్నికల ప్రయోజనాల కోసం బిజెపి ఉపయోగించుకుంది. తెరవెనుక నుంచి బిజెపి-ఆర్ఎస్ఎస్‌లు ముస్లిం వ్యతిరేక దాడులను పురికొల్పి, దేశవ్యాపితంగా హిందూ మతదురంకారాన్ని ప్రత్యేకించి ముజఫర్‌నగర్, సామ్లి (ఉత్తరప్రదేశ్)లలో జరిగిన అల్లర్లలో రెచ్చగొట్టి, హిందువుల ఓట్లను దండుకోగలిగింది. ఇందులో సంఘ్‌పరివార్ కేంద్ర పాత్రను పోషించింది. ఈశాన్య ప్రాంతంలో ప్రత్యేకించి అసోంలో బాంగ్లాదేశీ ముస్లిముల వలసలకు వ్యతిరేకంగా ప్రజలను రెచ్చగొట్టి దాన్ని ఓట్లుగా సొమ్ము చేసుకోగలిగింది. వీటన్నింటినీ బట్టి అన్ని సెక్షన్ల ఓట్లను పొందాననీ, మత, కుల, సముదాయాలు, లైంగిక వివక్ష మొదలైన వాటికి అతీతంగా ఓట్లు పడ్డాయనీ బిజెపి చెప్పుకోవడం ఎంత బూటకమో స్పష్టమవుతుంది. నిజానికి దళితుల, ముస్లిముల ఓట్లు బిజెపికి పడలేదు. ఎన్‌డిఏ గెలుపు వెనుక మోడీ ప్రభంజనం లేదనడానికి కేరళ, ఒడిశా, పశ్చిమ బెంగాల్,

తమిళనాడు, సీమాంధ్ర, తెలంగాణ వంటి రాష్ట్రాలే నిదర్శనం. త్రిపుర, అరుణాచల్ ప్రదేశ్, సిక్కింలో కూడా ఎన్‌డిఏ యేతరులే గెలుపొందారు. మోడీ ప్రభంజనంగా చెబుతున్నది అంతా సామ్రాజ్యవాద ప్రాయోజిత బడా దేశ కార్పొరేట్ సంస్థల, మీడియాల సంయుక్త సృష్టి మాత్రమే. పాలకవర్గాల నూతన సరళీకృత ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా ప్రజల ఆగ్రహాన్ని పక్కదారి పట్టించడానికి అమెరికా సామ్రాజ్యవాదులు, ఎంఎన్‌సి, బడా దళారీ నిరంకుశ బూర్జువా, బడా భూస్వామ్య వర్గాలు హిట్లర్ తరహా ఫాసిజాన్ని అమలు చేస్తూ తమ ప్రయోజనాలను సమర్థవంతంగా నెరవేర్చగలిగే నరేంద్ర మోడీనీ ఒక పథకం ప్రకారం ముందుకు తెచ్చాయి.  నిజానికి, కాంగ్రెస్ ప్రజావ్యతిరేక, అభివృద్ధి నిరోధక, అవినీతికర పార్టీగా పూర్తిగా బహిర్గతమై అభాసుపాలైంది. కాంగ్రెస్ పట్ల ఈ ప్రజా వ్యతిరేకతను పసిగట్టిన భారత పాలకవర్గాలు, సామ్రాజ్యవాదులు మరో ఐదు సంవత్సరాల పాటు ప్రజలను పార్లమెంటరీ భ్రమల చుట్టూ తిరిగేట్లు చేసేందుకు మరో పాలకవర్గ పార్టీని బిజెపి-నరేంద్ర మోడీ రూపంలో ప్రజలు ఒక ప్రత్యామ్నాయంగా ముందుకు తీసుకువచ్చాయి.

ఈ ఎన్నికలలో యుపిఏ కూటమి ప్రత్యేకించి కాంగ్రెస్ పార్టీ రాజస్తాన్, గుజరాత్, సీమాంధ్ర, ఢిల్లీలలో, మరికొన్ని చోట్ల తుడిచిపెట్టుకుపోయింది. ఇతర చాలా రాష్ట్రాలలో అరకొరగా మిగిలిపోయింది. ఆప్ పార్టీకి ప్రజల, దేశ మౌలిక సమస్యల పట్ల, ప్రజల జీవన్మరణ సమస్యల పట్ల స్థిరమైన విధానాలు ఏమీ లేకపోవడంతో అది ఎంతగా సంస్కరణవాద వాగాడంబరాన్ని ప్రదర్శించినప్పటికీ ఆశించిన ఫలితాలు సాధించలేకపోయింది. మన్‌మోహన్ సింగ్ ప్రభుత్వం అనుసరించిన విధానాలను ముందుండి కొనసాగించడం వల్ల, అవినీతి, దోపిడి, అణచివేత, అవకాశవాదాలలో కూరుకుపోయిన ఎస్‌పి, బిఎస్‌పి, ఆర్‌జెడి, జెడి (యు), డిఎంకె, సిపిఎం నాయకత్వంలోని వామపక్షాలు, ఇతర ప్రాంతీయ పార్టీలు సైతం ఓటమిని చవిచూడాల్సి వచ్చింది. ప్రత్యేకించి, బిఎస్‌పి, నేషనల్ కాన్ఫరెన్స్, డిఎంకెలు లోక్‌సభ నుంచి తుడుచుపెట్టుకుపోయాయి. ఒడిశాలో బలమైన ప్రతిపక్షం లేకపోవడం వల్ల బిజెడి 4వ దఫా తిరిగి అధికారంలోకి వచ్చింది. ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం, టిఆర్ఎస్‌లు కాంగ్రెస్ పట్ల ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను ఉపయోగించుకొని గెలిచాయి. కశ్మీర్‌లో కశ్మీర్ జాతి విముక్తి ఉద్యమాన్ని అణచివేసేందుకూ, నీరుకార్చేందుకు కాంగ్రెస్ పార్టీతో కుమ్మక్కై అవలంబిస్తూ వచ్చిన విధానాలు నేషనల్ కాన్ఫరెన్స్‌కు బెడిసి కొట్టాయి.

మోడీ నేతృత్వంలోని బిజెపికి ప్రస్తుతం లోక్‌సభలో అత్యధిక సీట్లు ఉన్నప్పటికీ అది ఎన్‌డిఏ భాగస్వామ్య శక్తులతోనూ, తనకు ఓట్లు వేయని సామాజిక సెక్షన్ల వారిని కూడా కలుపుకొని పనిచేస్తాననీ చెబుతోంది. స్వయంగా మోడీ తన విజయం తర్వాత ప్రజలకు ఇచ్చిన సందేశంలో 'భారతదేశం గెలిచింది, మంచి రోజులు ముందున్నాయని', 'దేశాన్ని స్వయం సమృద్ధం చేస్తానని' నమ్మబలికాడు. దీనిని చూసి కొంతమంది 'ఇది మంచి పాలనకు ఆరంభం' అని, 'మోడీ ఏదో ఒకటి చేసి చూపుతాడు' అని భ్రమలకు గురవుతున్నారు.

కొంతమంది అమాయకంగా మోడీ నేతృత్వంలోని ఎన్‌డిఏ పాలనలో గుజరాత్‌లో లాగా హిందూ ఫాసిస్టు ఎజెండా ప్రాతిపదికన ఎన్‌డిఏ పాలన ఉండరాదని, 'వికాస్ ఎజెండా' దాని ప్రాతిపదికగా ఉండాలని, 2002 గుజరాత్ అల్లర్లను పక్కకు పెట్టి అన్ని వర్గాలను, సెక్షన్లను సమానంగా చూడాలి, అవినీతిని అరికట్టాలని, ఉపాధి అవకాశాలు కల్పించాలని, మహిళలకు భద్రత కల్పించాలని ఆకాంక్షలను వ్యక్తం చేస్తున్నారు. కానీ, బ్రాహ్మణవాద హిందూత్వాన్ని తలకెక్కించుకున్న మోడీ, తదితరులు వీటిని ఎంతమాత్రమూ నెరవేర్చలేరు. దీనికి భిన్నంగా యుపిఏ ప్రభుత్వం అమలు చేసిన నూతన సరళీకృత విధానాలను ఇప్పుడు మరింత దూకుడుగా మోడీ నేతృత్వంలోని ఎన్‌డిఏ ప్రభుత్వం అమలు చేస్తుంది. అన్ని రంగాలలో ప్రజల బతుకులు మరింత దుర్భరమవుతాయి.

మోడీ నేతృత్వంలో ఎన్‌డిఏ ప్రస్తుతం ఏర్పడిన లోక్‌సభలో అది పూర్తి మెజారిటీ సంపాదించుకోవడం, బలమైన ప్రతిపక్షం లేకపోవడం, అంతకంటే ప్రధానమైనది - దాని హిందూత్వ ఎజెండా తీవ్రతరం కానున్న కాషాయ ఫాసిస్టు దాడి ముప్పును సూచిస్తున్నాయి. సామ్రాజ్యవాద అనుకూల, ఫెడరల్ వ్యతిరేక, భారత పాలకవర్గాల విస్తరణవాద విధానాలను కలిగి ఉన్న బిజెపి ప్రభుత్వం తన ప్రజావ్యతిరేక చర్యలను సమర్థించుకోవడానికి ఎన్నికల్లో తన కూటమికి అనుకూలంగా ప్రజలు ఇచ్చిన తీర్పును ఉపయోగించుకొని తన ఫాసిస్టు రూపాన్ని ప్రదర్శించడానికి ఎంతో సమయం పట్టదు. అనతికాలంలోనే కార్మికులు, కర్షకులు, ముస్లిములు, దళితులు, తదితర పీడిత ప్రజలు దుర్భర పరిస్థితులను ఎదుర్కోవలసి వస్తుంది. మోడీ అండ్ కో., బడా దళారీలు, బడా భూస్వాములు పెద్దయెత్తున గుజరాత్ మోడల్‌ను ముందుకు తెచ్చి ప్రజలను భ్రమల్లో ముంచెత్తడానికి ప్రయత్నిస్తున్నారు. నిజానికి 'హిందూత్వ ప్రయోగశాల'గా చెప్పబడుతున్న గుజరాత్ మోడల్ అంటే సమాజంలోని కార్మికులు, కర్షకులు, మత మైనారిటీలు ప్రత్యేకించి ముస్లిములు, తదితర పీడిత ప్రజల నుండి ఎదురయ్యే అన్ని రకాల వ్యతిరేకతనూ అణచివేయడం. గుజరాత్ మోడల్ అంటే ప్రతిపక్షాలను నియంత్రించడం, తన పార్టీలో వ్యతిరేకతను నియంత్రించడం, బడా దేశీయ, అంతర్జాతీయ కార్పొరేషన్లు తమ ఇష్టారాజ్యంగా కొల్లగొట్టుకు పోవడానికి, దోచుకోవడానికి తలుపులు బార్లా తెరవడం, ఇంకా ఇలాంటివి తప్ప మరొకటేమీ కాదు. వీటితో పాటుగా, 'గుజరాత్ మోడల్' గోబెల్స్ తరహాలో పెద్దయెత్తున మాస్ మీడియాను ఉపయోగించుకుంటూ ప్రజలందరి సమస్యలను పరిష్కరించే సామర్థ్యం ఉన్న ఒక ఉక్కు మనిషికి, పార్టీకి చెందిన ఛాయాచిత్రాన్ని ప్రజల ముందు ఉంచడానికి సంకేతంగా నిలుస్తుంది. మోడీ గుజరాత్ మోడల్‌కు చెందిన ఫాసిస్టు పాలన ఇప్పుడు ఇక మొత్తం దేశానికి విస్తరిస్తుంది. మొత్తం దక్షిణ ఆసియా ఉపఖండంలో విస్తరణవాద ముప్పును తీవ్రతరం చేస్తుంది. అది ఇప్పటి ఎన్నికల మానిఫెస్టోలో కశ్మీర్ జాతి వ్యతిరేక, మైనారిటీ వ్యతిరేక, హిందూత్వ అంశాలను పేర్కొనడం మరిచిపోలేదు. అది ఇతర అనేక అంశాలతో పాటు రాజ్యాంగంలోని 370 అధికరణాన్ని రద్దు చేస్తానని,

కామన్ సివిల్ కోడ్‌ను తీసుకొస్తాననీ, అయోధ్యలో రామాలయాన్ని నిర్మిస్తాననీ వాగ్దానం చేసింది. ఇవి భారత ప్రజానీకానికి, ప్రత్యేకించి సాయుధ వ్యవసాయ విప్లవ యుద్ధానికి, మత మైనారిటీలకు, పీడిత జాతులకు, దళితులు, ఇతర పీడిత సముదాయాల ఉనికికి ఎంతో ప్రమాదకరమైనవి.

ప్రపంచవ్యాప్తంగా సంక్షోభం తీవ్రతరమవుతూ విప్లవ, జాతి విముక్తి, ప్రజాస్వామిక ఉద్యమాలు ఊపందుకుంటున్న నేపథ్యంలో సంక్షోభాన్ని అధిగమించడానికి, ఆయా ఉద్యమాల పెరుగుదలను ఎదుర్కొనడానికి యెల్లెడలా ఫాసిజం తలయెత్తడం ప్రస్తుతం స్పష్టంగా కనపడుతున్నది. నూతన సరళీకృత విధానాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు సామ్రాజ్యవాదులు వారి మిత్రులు నియోఫాసిస్టు రూపాల పాలనను స్థాపించాలని కోరుకుంటున్నారు. దీన్ని మన దేశంలో కూడా చూడవచ్చు. ఇది మన దేశంలోని విప్లవ, ప్రజాస్వామ్య శక్తులకు, ప్రజలకు ఒక సవాల్. కనుక భారత పీడిత ప్రజలు, జాతులు, ప్రజాస్వామికవాదులు, దేశభక్తులు, ప్రజాశ్రేయోభిలాషులు, సంస్థలు, విద్యార్థులు, యువత, మేధావులు, ఇతర ప్రగతిశీల శక్తులు బ్రాహ్మణవాద హిందూ ఫాసిస్టుల నుంచి పొంచి ఉన్న పెనుముప్పును గుర్తించాలి. అన్ని పాలకవర్గాలకు ప్రత్యేకించి కాషాయ ఫాసిజానికి వ్యతిరేకంగా విప్లవ, ప్రజాస్వామిక సంస్థలను, శక్తులను, వ్యక్తులను, విశాల ప్రజారాశులను సమైక్యం చేయడం ద్వారా విశాల, శక్తివంతమైన ప్రజా ఉద్యమాలను నిర్మించడం మన ముందున్న ఒక ముఖ్యమైన కర్తవ్యం. అదే సమయంలో ప్రజలు తమ దైనందిన, మౌలిక సమస్యల పరిష్కారానికి పెద్దయెత్తున ఉద్యమాలను చేపట్టాలి. పోరాడకుండా ఏ ఒక్క హక్కునూ ప్రజలు సాధించలేరు. పోరాడే శక్తులనన్నింటినీ సమైక్యం చేయడం, దీర్ఘకాలిక ప్రజాయుద్ధాన్ని పరిరక్షించుకుంటూ, తీవ్రతరం-విస్తృతం చేయడం, వ్యవసాయ విప్లవం ఇరుసుగా సాగే నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని పరిపూర్తి చేయడం ద్వారానే ప్రజల, దేశ మౌలిక సమస్యలకు పరిష్కారమవుతాయి. అన్ని రకాల అభివృద్ధి నిరోధక, ఫాసిస్టు, విప్లవ ప్రతీఘాతక శక్తులను కూకటివేళ్లతో పెకలించడం సాధ్యమవుతుంది.

**అభయ్**

**అధికార ప్రతినిధి**

**కేంద్ర కమిటీ**

**సీపీఐ (మావోయిస్టు)**

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# కేంద్ర కమిటీ

**20-5-2014**

## నక్సల్బరీ ఉద్యమ సీనియర్ నాయకుడు, విప్లవ మేధావి కామ్రేడ్ సునీతి కుమార్ ఘోష్‌కు విప్లవ నివాళి!

నక్సల్బరీ ఉద్యమ సీనియర్ నాయకుడు, విప్లవ మేధావి కామ్రేడ్ సునీతి కుమార్ ఘోష్ 2014, మే 11న పశ్చిమ బెంగాల్ లోని అసన్‌సోల్ లో 96 ఏండ్ల పండు వయసులో ఆఖరి శ్వాస విడిచారు. ఆయన వృద్ధాప్య సంబంధిత వ్యాధులతో కొంతకాలంగా అస్వస్థులుగా వుండినారు. సిపిఐ (మావోయిస్టు) కేంద్రకమిటీ పార్టీ శ్రేణులందరి తరఫునా, పీఎల్‌జీఏ, విప్లవకర ప్రజాసంఘాలు, విప్లవ ప్రజాధికార అంగాలన్నిటి తరఫునా కామ్రేడ్ ఘోష్ కు వినమ్రంగా విప్లవ నివాళినర్పిస్తున్నది. ఆయన కుటుంబానికీ, మిత్రులకూ మా ప్రగాఢ సానుభూతిని ప్రకటిస్తున్నాం.

కమ్యూనిస్టు పార్టీతో తనకున్న సుదీర్ఘ అనుబంధంలో కామ్రేడ్ ఘోష్ విప్లవోద్యమానికి ముఖ్యమైన సేవలు అందించారు. మన దేశం ఇంకా వలసపాలనలో కునారిల్లుతున్న సమయంలో ఆయన 1940ల నుండి ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ సభ్యుడిగా ఉండినాడు. వలస పీడన నేపథ్యంలో పుట్టి పెరిగిన ఆయన చిన్న వయసు నుండే సామ్రాజ్యవాద వ్యతిరేక రాజకీయ దృక్పథాన్ని పెంపొందించుకున్నారు. అదే సమయంలో ఆయన బెంగాల్ గ్రామీణ ప్రాంతాల్లో పేద రైతాంగం భూస్వాముల చేతుల్లో అనుభవిస్తుండిన దుర్భరమైన భూస్వామ్య దోపిడీ విషయంలో కూడా జాగృతమయ్యారు. అందువల్ల 1946లో తెభాగా ఉద్యమం ఉవ్వెత్తున ఎగసినప్పుడు ఆయన అందులోకి దూకి భాగస్వాములయ్యారు. భారతదేశ ప్రజల మూపులపై సవారీ చేస్తున్న మూడు పర్వతాలను - భూస్వామ్యం, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ విధానం, సామ్రాజ్యవాదాలను - కూలదోయడానికి జరుగుతున్న పోరాటానికి ఆయన తన జీవితాన్ని అంకితం చేశారు.

తరువాతి కొద్ది సంవత్సరాల్లో 1951లో చారిత్రాత్మక తెలంగాణ సాయుధ వ్యవసాయక విప్లవోద్యమానికి వెన్నుపోటు పొడవడం వంటి ద్రోహాలతో సిపిఐ రివిజనిస్టు పంథా మరింతగా ప్రస్ఫుటమవ్వసాగింది. 1956లో కామ్రేడ్ స్టాలిన్ పైనా, మార్క్సిజం-లెనినిజం పైనా రెనగేడ్ కృశ్చేవ్ చేసిన విషపూరిత దాడిని సమర్థించడం ద్వారా సిపిఐ తన సైద్ధాంతిక దివాళాకోరుతనాన్ని మరోసారి బహిర్గతపరుచుకుంది. కామ్రేడ్ ఘోష్ దీన్ని నిరసిస్తూ పార్టీకి రాజీనామా ఇచ్చారు. 'మహత్తర చర్చ' సందర్భంగా సిపిఎస్‌యు రివిజనిస్టు శిబిరంలో చేరడాన్ని బహిర్గతపరుస్తూ, దాన్ని ఓడిస్తూ చైనా కమ్యూనిస్టు పార్టీ చేసిన పోరాటాన్ని ఆయన ఉత్సాహంగా సమర్థించారు. సిపిఐలో జరిగిన

అంతర్గత పోరాటం పార్టీ చీలికకూ, సిపిఐ(ఎం) ఏర్పాటుకూ దారి తీసినప్పుడు రివిజనిజంతో నిర్ణయాత్మకంగా తెగతెంపులు చేసుకునే ఆకాంక్షతో ఆయన యితర విప్లవకారులతో కలిసి నూతన పార్టీలో చేరారు.

అయితే, సిపిఐ(ఎం) నాయకులు నిజమైన సామాజిక మార్పు వైపుగా వేసే ఎటువంటి అడుగునైనా వ్యతిరేకించడం ద్వారా అతి త్వరలోనే తమ రివిజనిస్టు స్వభావాన్ని బహిర్గతపర్చుకున్నారు. పార్టీలో రివిజనిజం పట్టు సంపాదించడంతో కామ్రేడ్స్ చారు మజుందార్ (సిఎం), కన్హయ్ చటర్జీ (కెసి), మరెంతోమంది సిసలైన విప్లవకారులు మరో విడత రెండు పంథాల మధ్య పోరాటాన్ని జరపడానికి పరిస్థితులు పరిపక్వం అయ్యాయి. కామ్రేడ్ ఘోష్ 1965లో సిపిఐ(ఎం) నుండి రాజీనామా చేసి కామ్రేడ్ సిఎం నాయకత్వంలో కమ్యూనిస్టులు ఉత్తర బెంగాల్ లో సాయుధ వ్యవసాయక విప్లవ పోరాటాన్ని నిర్మించడానికి చేస్తున్న ప్రయత్నాలకు మద్దతునిచ్చారు. 1967 నాటి మహత్తర నక్సల్బరీ తిరుగుబాటు భారత కమ్యూనిస్టు ఉద్యమంలో జరిగిన ఈ పదునైన సైద్ధాంతిక-రాజకీయ పోరాట ఫలితమే. చైనా కమ్యూనిస్టు పార్టీ చైనాలో రివిజనిజాన్ని ఓడించడానికి చేపట్టిన మహత్తర శ్రామికవర్గ సాంస్కృతిక విప్లవం నేపథ్యంలో ఇది ముందుకొచ్చింది. నక్సల్బరీ సిపిఐ, సిపిఐ(ఎం)ల రివిజనిజాన్ని చావుదెబ్బ కొట్టింది. కామ్రేడ్ ఘోష్ మన దేశంలో నూతన ఉషోదయాన్ని ఆవిష్కరించిన చారిత్రాత్మక మలుపుగా దాన్ని కొనియాడారు.

కామ్రేడ్ ఘోష్ త్వరలోనే వసంతకాల మేఘగర్జన రగిలించిన మహత్తర విప్లవ వెల్లువలో భాగస్వాములయ్యారు. 1967లో ఆయన 'పశ్చిమ బెంగాల్ కో-ఆర్డినేషన్ కమిటీ ఆఫ్ కమ్యూనిస్టు రివల్యూషనరీస్' (డబ్ల్యుబిసిసిసిఆర్) లో చేరారు. ఇది ఆ రాష్ట్రంలో సాయుధ వ్యవసాయక విప్లవోద్యమానికి నాయకత్వం వహిస్తుండింది. 1967 నవంబర్ లో ప్రారంభించిన ఆ కమిటీ అధికార ఆంగ్ల పత్రిక 'లిబరేషన్' కు సంపాదకత్వం వహించే బాధ్యతను ఆయనకు అప్పగించారు. ఆయన 'లిబరేషన్' కూ, 'దేశ్‌బ్రతి' పత్రికకూ 'సౌమ్య' పేరుతో అనేక సైద్ధాంతిక, విశ్లేషణాత్మక వ్యాసాలను రాశారు. 1968లో 'ఆల్ ఇండియా కో-ఆర్డినేషన్ కమిటీ ఆఫ్ కమ్యూనిస్టు రివల్యూషనరీస్' (ఏఐసిసిసిఆర్) ఏర్పడ్డాక ఆయన దానిలో ఒక నేతృత్వ కామ్రేడ్ గా కొనసాగారు. ఆయన ఏఐసిసిసిఆర్ అధికార పత్రికగా మారిన 'లిబరేషన్' సంపాదకుడిగా కొనసాగారు. విప్లవోద్యమ పురోగమనంతో ఏఐసిసిసిఆర్ సభ్యులు 1969లో సిపిఐ(ఎం.ఎల్) ను ఏర్పర్చారు. కొన్ని నెలల తర్వాత కామ్రేడ్ కన్హయ్ చటర్జీ నాయకత్వంలో 'దక్షిణ్ దేశ్' గ్రూపు ఎంసిసిని ఏర్పాటు చేయడం ద్వారా ఉద్యమాన్ని కొనసాగించారు.

కామ్రేడ్ ఘోష్ నూతన పార్టీలో కేంద్రకమిటీ సభ్యుడిగా, 'లిబరేషన్' సంపాదకుడిగా ముఖ్యమైన సేవలను అందించారు. కామ్రేడ్ సిఎం మార్గదర్శకత్వంలో, కామ్రేడ్ ఘోష్ సమర్థవంతమైన సంపాదకత్వంలో వెలువడిన 'లిబరేషన్' పత్రిక పార్టీ క్రమం తప్పకుండా సైద్ధాంతిక వ్యాసాలు, రివిజనిజానికీ, మితవాదానికీ వ్యతిరేకంగా రాజకీయ చర్చా వ్యాసాలు, అంతర్జాతీయ, దేశీయ రాజకీయాల విశ్లేషణలు, ఫీల్డురిపోర్టులూ మొదలైనవి ప్రచురించడం ద్వారా శ్రేణులను విద్యావంతం

చేయడంలో కీలకమైన పాత్రను వహించింది. అది కేంద్రకమిటీకీ, వివిధ పార్టీ కమిటీలకూ మధ్య సమాచార సేతువుగా పని చేసింది. కామ్రేడ్ ఘోష్ తీవ్రమైన నిర్బంధం మధ్యన పత్రికను ప్రచురించడానికి ఎంతో శ్రమకోర్చి పని చేశారు. నిర్బంధంలో భాగంగా 1970 ఏప్రిల్ లో పత్రిక కోల్‌కతా కార్యాలయాన్ని కూడా పోలీసులు మూసివేశారు. పత్రికను అడపాదడపా 1972 మొదటి భాగం వరకూ నడిపించారు. కానీ ఉద్యమం వెనుకపట్టు పట్టడంతో పత్రికను అనివార్యమైన స్థితిలో ఆపివేయాల్సి వచ్చింది.

కామ్రేడ్ ఘోష్, ఆయన సహచర కామ్రేడ్స్ తీవ్రతరమౌతున్న నిర్బంధం మధ్యన, రెనగేడ్లు పార్టీ విచ్ఛిన్నానికి దారి తీసే విధంగా తీవ్రతరం చేస్తున్న దాడుల మధ్యన నక్సల్బరీ విప్లవ పంథాను ఎత్తిపట్టారు. సత్యనారాయణ సింగ్, శివకుమార్ మిశ్రా వంటి అవకాశవాదులు దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథా మౌలిక పంథానే ప్రశ్నిస్తూ కామ్రేడ్ సిఎం నాయకత్వాన్ని వ్యతిరేకించారు. కామ్రేడ్ ఘోష్ కామ్రేడ్ సిఎం రూపొందించిన రాజకీయ పంథా, 1970 నాటి పార్టీ కాంగ్రెస్ ఆమోదంచిన పార్టీ కార్యక్రమాలను దృఢంగా అంటిపెట్టుకుని వుంటూ మితవాద అవకాశవాద దాడుల నుండి పార్టీని కాపాడుతూ వచ్చారు.

ఈ విధంగా కామ్రేడ్ ఘోష్ 1972 వరకూ ఉద్యమాన్ని సైద్ధాంతికంగా, రాజకీయంగా నడిపించడంలో మంచి పాత్ర వహించారు. కామ్రేడ్ సిఎం సహా అనేకమంది సిపిఐ(ఎం.ఎల్.) నాయకత్వ కామ్రేడ్స్ అమరులు కావడం లేదా అరెస్టు కావడంతో విప్లవోద్యమం ఆటులోకి వెళ్లింది. పార్టీ చీలికలు పేలికలకూ, విచ్ఛిన్నానికీ గురైంది. కామ్రేడ్ ఘోష్ ప్రజల సహకారంతో శత్రువు వల నుండి తప్పుకున్న అతి కొద్ది నాయకత్వ కామ్రేడ్స్ లో ఒకరు. అయితే, ఉద్యమం కామ్రేడ్ సిఎం ను, ఇతర ముఖ్యమైన కామ్రేడ్స్ ను కోల్పోయిన ఆ కీలకమైన కాలంలో ఆయన నాయకత్వ పాత్రను వహించలేకపోయారు. విప్లవ క్యాంపులో ఆయన పట్ల ఎన్నో ఆశలూ ఆకాంక్షలూ వ్యక్తమైనప్పటికీ వెనుకంజ తర్వాత ఉద్యమాన్ని నిర్మించడానికి ఆయన దేశంలో చెల్లాచెదురైన పార్టీ శక్తులను ఏకం చేయలేకపోయారు.

కామ్రేడ్స్ శర్మ, సునీతి కుమార్ ఘోష్, కొండపల్లి సీతారామయ్య, రామనాథ్ ల వంటి నాయకత్వ కామ్రేడ్స్ 1973లో సెంట్రల్ ఆర్గనైజింగ్ కమిటీ (సిఓసి) ఏర్పాటు చేయడం ద్వారా పార్టీని ఐక్యం చేయడానికి చేసిన ప్రయత్నాలు, విభేదాలు పరిష్కారం కాకపోవడం వల్ల విఫలమయ్యాయి. గతాన్ని సమీక్షించే విషయంలో, అనుసరించాల్సిన ఎత్తుగడల విషయంలో ఐక్యత సాధ్యం కాలేదు. సిఓసి లోని ఇతర సభ్యులు కామ్రేడ్ ఘోష్ ఉద్యమంపై చేసిన విమర్శనాత్మక సమీక్షను ఆమోదించలేదు. వారు తమ, తమ సమీక్షలతో ముందుకొచ్చారు. అప్పటి నుండి విప్లవోద్యమాన్ని పురోగమింపజేయడంలో వివిధ విప్లవ స్రవంతులు తమ, తమ స్వతంత్ర మార్గాలను అనుసరించాయి. కామ్రేడ్ ఘోష్ నిర్మాణాత్మక కార్యకాలాపాల నుండి వెనక్కు తగ్గి మార్క్సిజం-లెనినిజం-మావోయిజం వెలుగులో భారతదేశ చరిత్రనూ, భారత సమాజాన్నీ అధ్యయనం చేసి విశ్లేషణ చేయడంలో నిమగ్నమయ్యారు. ఆయన 1970ల చివరి నుండి అనేక పదునైన విశ్లేషణ గల పుస్తకాలనూ, వ్యాసాలనూ ప్రచురించడం ద్వారా మార్క్సిస్టు అధ్యయన రంగాన్ని సుసంపన్నం చేశారు. తన

జీవితపు చరమాంకంలో ఆయన నక్సల్బరీ ఉద్యమ నాటి తన జ్ఞాపకాలనూ, ఆ ఉద్యమంపై తన అంచనానూ ప్రచురించారు. ఉద్యమ మౌలిక పంథాను ఎత్తిపడుతూనే ఆయన సిపిఎం(ఎం.ఎల్.), దాని అత్యంత ప్రముఖ నాయకుడు సిఎం లు అనుసరించిన ఎత్తుగడలు, పద్ధతుల విషయంలో తన విమర్శలనూ, విభేదాలనూ అందులో వ్యక్తపరిచారు. 1973లో ఆయన ఉద్యమ సమీక్షలో ఎక్కుపెట్టిన విమర్శలకు 2009లో ప్రచురించిన ఈ పుస్తకంలో కొనసాగింపు వుంది. మా పార్టీకి ఆయన చేసిన విమర్శలన్నిటితో, వచ్చిన నిర్ధారణలన్నిటితో ఏకీభావం లేదు. మా పార్టీకి కామ్రేడ్ ఘోష్ ప్రకటించిన కొన్ని అంచనాల విషయంలో, ఆయన వచ్చిన నిర్ధారణల విషయంలో భిన్నాభిప్రాయం వుంది.

అయితే, కామ్రేడ్ ఘోష్ మౌలికంగా నక్సల్బరీ పంథాకు దృఢంగా కట్టుబడి వుంటూ జీవితాంతం విప్లవకారునిగా కొనసాగారు. ఆయన నక్సల్బరీ జెండాను ఎత్తిపట్టే విప్లవ ప్రవంతులన్నిటికీ మిత్రునిగా, శ్రేయోభిలాషిగా కొనసాగారు. ఆయన ఉద్యమ సీనియర్ కామ్రేడ్ గా విప్లవకారులకు కొన్ని విలువైన సూచనలు, సలహాలు ఇవ్వడం కొనసాగించారు. మునుపటి సిపిఐ(ఎం.ఎల్.) (పిడబ్ల్యు), ఎంసిసిఐ, సిపిఐ(ఎం.ఎల్.) పియు, తర్వాత సిపిఐ (మావోయిస్టు) కూడా ఆయనతో కామ్రేడ్లీ సంబంధాలను వివిధ రూపాల్లో కలిగి వుండినాయి. దేశంలోనూ, అంతర్జాతీయంగానూ కమ్యూనిస్టు ఉద్యమం వెనుకడుగులు వేసిన సమయాల్లో, సోషలిజం, కమ్యూనిజాలు కాలం చెల్లినవనీ, ప్రాసంగికతను కోల్పోయాయనీ, పెట్టుబడిదారీ విధానంతో చరిత్ర అంతం అనీ ప్రతీఘాతుక శక్తుల సమర్థకులు ప్రచారం చేస్తున్న సమయాల్లో కూడా కామ్రేడ్ ఘోష్ మొక్కవోని నిబద్ధతతో మార్క్సిజం-లెనినిజం-మావోయిజానికీ, సామాజిక విప్లవానికీ అంటిపెట్టుకుని వుండడం ఆయనలోని మహత్తరమైన సుగుణాలకు ఒక ప్రతిబింబమే. ఆయన విస్తృతమైన, లోతైన అధ్యయనం, దృఢనిశ్చయం, కష్టపడి పని చేసే గుణం, సాదాసీదా జీవనశైలి ఆదర్శంగా తీసుకుని ఆచరించవల్సిన విలువలు. ఆయన మరణంతో పార్టీ, మన దేశ శ్రామిక జనావళి ఒక గొప్ప మిత్రుడినీ, సహ ప్రయాణీకుడినీ కోల్పోయాయి. కార్మికవర్గ సిద్ధాంతానికీ, దాని గొప్ప ఆశయమైన విప్లవానికీ, పీడిత ప్రజలకూ ఆయన జీవితాంతం కట్టుబడి వుండిన తీరు మనకు ఎల్లప్పటికీ ఒక ఉత్తేజపూరితమైన ఉదాహరణగా నిలుస్తుంది. అమరులైన కామ్రేడ్స్ మనకందించి పోయిన ఎర్రజెండాను మరింత ఉన్నతంగా ఎత్తిపడతామని ప్రతిన పూనడమే మన ప్రియతమ కామ్రేడ్ సునీతి కుమార్ ఘోష్ కు మనం అందించగల అత్యుత్తమ నివాళి.

**అభయ్**

**అధికార ప్రతినిధి**

**కేంద్ర కమిటీ**

**సీపీఐ (మావోయిస్టు)**

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# కేంద్ర కమిటీ

**19-6-2014**

## గొప్ప విప్లవ నాయకుడు కామ్రేడ్ సుశీల్ రాయ్ ఎర్ర సూర్యునిలా ఎల్లప్పుడూ మన మార్గాన్ని ప్రకాశవంతం చేస్తూనే ఉంటారు!

## ఆయని గొప్ప కమ్యూనిస్టు గుణాలను, ఆదర్శాలను అలవర్చుకుంటూ విస్తృతంగా ప్రచారం చేద్దాం!

మన పార్టీ సీనియర్ పొలిట్‌బ్యూరో సభ్యులు, భారత విప్లవ ప్రముఖ నాయకులు కామ్రేడ్ సుశీల్ రాయ్ (అశోక్, శోమ్, బరున్‌దా) సుదీర్ఘకాలం పాటు అనారోగ్యం తర్వాత 2014 జూన్ 18న ఢిల్లీలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్)లో కన్నుమూశారు. దాదాపు అర్ధ శతాబ్ద కాలం పాటు, తన చివరి ఊపిరి వరకు పీడిత ప్రజల ప్రయోజనాల కోసం, విప్లవ ప్రయోజనాల కోసం నిస్వార్థంగా పాటుపడిన తమ గొప్ప పుత్రుడిని మన దేశ కార్మికవర్గం, పీడిత ప్రజలు కోల్పోయారు. కామ్రేడ్ సుశీల్ రాయ్ అమరులు, అజరామరులు!



మన ప్రియతమ కామ్రేడ్ సుశీల్ రాయ్‌కు సిసి, సిపిఐ (మావోయిస్టు) తన సమస్త శ్రేణులు, పిఎల్‌జిఏ, విప్లవ ప్రజా సంఘాలు, విప్లవ ప్రజా రాజకీయ అధికార అంగాలు, విప్లవ ప్రజానీకం తరఫున తలవంచి వినమ్రంగా అరుణాంజలి ఘటిస్తోంది. విషాదకరమైన ఈ సందర్భంగా ఆయన ఆశయాలను మన చివరి నెత్తుటి బొట్టు వరకూ ముందుకు తీసుకొని పోయేందుకు ఆయన నుంచి, మన మహత్తర అమరుల నుంచి నేర్చుకునేందుకు రెట్టింపు సంకల్పంతో, అంకితభావంతో కృషి చేస్తామని అది పిడికిలెత్తి శపథం చేస్తోంది. శోకతప్తమైన ఆయన కుటుంబానికి, స్నేహితులకు, బంధువులకు, భారత విప్లవ శ్రేయోభిలాషులకు తన ప్రగాఢ సంతాపాన్ని తెలుపుతోంది.

కామ్రేడ్ సుశీల్ రాయ్ 76 సంవత్సరాల క్రితం ప్రస్తుత బంగ్లాదేశ్‌లో జన్మించారు. ఆయన గొప్ప విప్లవకారుడు, అమరుడు దినేష్ గుప్తాకు అల్లుడు. దేశం పట్ల, దేశ ప్రజల పట్ల ఆయన ప్రేమను, ఆయన చేసిన త్యాగాన్ని, అందించిన ఉత్తేజాన్ని చివరి వరకూ కామ్రేడ్ సుశీల్ రాయ్

తన మదిలో నిలుపుకొన్నారు. 1960ల ప్రారంభం నుంచి ఆయన తన 20ల ప్రాయంలో కమ్యూనిస్టు ఉద్యమంలో క్రియాశీలమయ్యారు. ఆయన కార్మికవర్గ ఉద్యమంలో పనిచేసి 1963లో సి.పి.ఐ.లో చేరారు. ఆయన వియత్నాంపై అమెరికా అన్యాయ యుద్ధానికి నిరసనగా సాగిన అమెరికా వ్యతిరేక ప్రదర్శనలలో, దక్షిణ కోల్‌కతాలో 1966 ఆహార ఉద్యమంలో క్రియాశీలంగా పాల్గొన్నారు. ఆయన సి.పి.ఐ.లోని రివిజనిస్టులకు వ్యతిరేకంగా సాగిన అంతర్గత పోరాటంలో భాగమయ్యారు. ఆయన తన తోటి సహచరుల మాదిరిగానే, రివిజనిస్టు సి.పి.ఐ. నుంచి చీలి ఆవిర్భవించిన సి.పి.ఐ.(ఎం) ఒక విప్లవ పార్టీగా రూపొందుతుందనే ఆశాభావంతో 1964లో అందులో చేరారు.

ఆయన చైనా విప్లవ మార్గంలో ఒక విప్లవ పార్టీ కోసం, నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని సాగించడం కోసం సైద్ధాంతిక, రాజకీయ, నిర్మాణ సన్నాహాలలో తలమునకలుగా ఉన్న కామ్రేడ్స్ కన్హయ్ చటర్జీ (కెసి), అమూల్య సేన్‌లతో సంబంధాలు పెట్టుకున్నారు. రివిజనిజం నడ్డివిరిచిన వసంత కాల మేఘగర్జన నక్సల్బరి ఇచ్చిన ఉత్తేజకరమైన పిలుపును సమర్థిస్తూ, 'నక్సల్బరీ ఏక్ హీ రాస్తా' అంటూ దానిని ఆయన ఎత్తిపట్టారు. ఆయన తొలినాళ్ల నుంచే చింతా, దక్షిణ్ దేశ్ గ్రూపులో భాగమయ్యి, మావోయిస్టు కమ్యూనిస్టు సెంటర్ (ఎంసిసి) సంస్థాపక సభ్యులలో ఒకరయ్యారు. ఆయన వృత్తి విప్లవకారుడిగా మారి, వ్యూహాత్మక దృక్పథంతో పని చేయడానికి పశ్చిమ బెంగాల్‌లోని మారుమూల గ్రామాలలోకి వెళ్లారు.

దీర్ఘకాల ప్రజాయుద్ధ పంథాను సృజనాత్మకంగా అమలు చేయడంలో భాగంగా ఎంసిసి పశ్చిమ బెంగాల్‌లోని సోనార్‌పూర్, కాంక్సా ప్రాంతాలలో ఉద్యమాన్ని నిర్మించడంలో తొలి అనుభవాలను గడించింది. ఈ ఉద్యమాలు తాత్కాలికంగా వెనుకపట్టు పట్టడానికి దారితీసిన బలహీనతలను పార్టీ లోతుగా సమీక్షించింది. నిజమైన కమ్యూనిస్టు స్ఫూర్తితో, (మునుపటి బీహార్‌లోని) గయ-హజారీబాగ్ ప్రాంతంలో కామ్రేడ్ కెసి ప్రత్యక్ష నాయకత్వం కింద ప్రజాసైన్యం, విముక్తి ప్రాంతాల నిర్మాణానికి చెందిన వ్యూహాత్మక పథకంతో పని ప్రారంభమైంది. గత తప్పుల నుంచి నేర్చుకోవడం ద్వారా అక్కడి ఉద్యమాన్ని పురోగమింపజేయడానికి తీవ్రమైన ప్రయత్నాలు జరిగాయి. అనతికాలంలోనే సాయుధ వ్యవసాయ విప్లవ జ్వాలలు విస్తరించాయి. శత్రు నిర్బంధం కూడా తీవ్రతరమైంది. కొన్ని తీవ్రమైన నష్టాలు జరిగినప్పటికీ కామ్రేడ్ సుశీల్ రాయ్‌తో సహా సమర్థవంతమైన పార్టీ నాయకత్వం శత్రుదాడిని తిప్పికొట్టగలిగింది. వారు ఒక బలమైన కార్మికవర్గ పార్టీ, ప్రజాసైన్యం, విప్లవకర ఐక్యసంఘటన నిర్మాణానికి పునాదులు వేశారు. సాయుధ వ్యవసాయ విప్లవ క్రమంలో గణనీయమైన పురోగమనాలు సాధించారు.

కామ్రేడ్ కెసి 1982 జూలై 18న తీవ్రమైన అనారోగ్యంతో అకాల మృతి చెందగా, అదే సంవత్సరం కామ్రేడ్ సుశీల్ రాయ్ ఎంసిసి కార్యదర్శిగా బాధ్యతలను చేపట్టి ఆ సవాలును స్వీకరించారు. పార్టీని ఐక్యంగా నడిపిస్తూ, అభివృద్ధి చేస్తూ, పార్టీ పంథాకు దృఢంగా అంటిపెట్టుకొని ఉంటూ ఉద్యమాన్ని నిర్మించారు. 1989లో జరిగిన ఎంసిసి మొదటి కేంద్ర కాన్ఫరెన్స్‌లో పార్టీ కార్యదర్శిగా ఆయన ఎన్నికయ్యారు. ఆయన 1996 వరకూ పార్టీ కార్యదర్శిగా

సమర్థవంతంగా పార్టీకి నేతృత్వం వహించారు. బలమైన పార్టీని, సాయుధ వ్యవసాయ విప్లవ యుద్ధాన్ని, ప్రజాపునాదిని నిర్మించడంలో, ప్రత్యేకించి బీహార్-ఝార్ఖండ్, బెంగాల్‌లలో సైద్ధాంతిక, రాజకీయ, నిర్మాణ, సైనిక, సాంస్కృతిక రంగాలలో ఆయన అందించిన తోడ్పాటు, సేవలు అమూల్యమైనవి. అంకితభావం, కార్మికవర్గ వ్యూహాత్మక నాయకత్వ సామర్థ్యం, పరిశ్రమ, మార్గదర్శకత్వం, పట్టుదల, నిస్వార్థ సేవల ద్వారా ఆయన తన కమిటీ, కింది స్థాయి కమిటీల, మొత్తం పార్టీ శ్రేణుల విశ్వాసాన్ని చూరగొన్నారు. చూపును దాదాపుగా కోల్పోవడం, అనారోగ్య కారణాల వల్ల ఆయన స్వచ్ఛందంగా పార్టీ కార్యదర్శి బాధ్యతల నుంచి తప్పుకునే ప్రతిపాదనను స్వయంగా ముందుకు తెచ్చారు. 1996లో జరిగిన రెండవ కేంద్ర కాన్ఫరెన్స్‌లో ఆయన ప్రతిపాదనను పార్టీ ఆమోదించింది. అప్పటి నుంచి ఆయన పార్టీ సిసిఎంగా సిసిలో, పార్టీలో కీలకమైన భూమిక పోషిస్తూ కొనసాగారు. ప్రత్యేకించి సైద్ధాంతిక, రాజకీయ రంగాలలో, పార్టీలో అంతర్గతంగా రెండు పంథాల మధ్య పోరాటాలను విజయవంతంగా నిర్వహించడంలో, ఉద్యమాన్ని సంశ్లేషించడంలో, అంతర్జాతీయ సంబంధాలను అభివృద్ధి చేయడంలో, అనేక నిజమైన మావోయిస్టు సంస్థలతో, ప్రత్యేకించి సి.పి.ఐ. (ఎం-ఎల్) (పి.డబ్ల్యు.)తో ఐక్యతను సాధించడంలో ఆయన కీలక పాత్ర కొనసాగింది.

అనేక అంతర్గత పోరాటాలను విజయవంతంగా నిర్వహించడంలో, సిసిలోని అత్యంత అవకాశవాద, విచ్ఛిన్నకర, దివాలాకోరు భరత్-బాదల్ ముఠాకు వ్యతిరేకంగా 1999-2001 మధ్య సాగించిన అత్యంత తీవ్రమైన రెండు పంథాల మధ్య పోరాటంలో, ఒక నాయకత్వ కామ్రేడ్‌గా, పార్టీ కార్యదర్శిగా, ఒక సీనియర్ సిసిఎంగా పార్టీ సరైన పంథాను పరిరక్షించడంలో కామ్రేడ్ సుశీల్ రాయ్ పాత్ర ప్రముఖమైంది. ఈ అంతర్గత పోరాటాలలో భాగంగా, ఆయన, తన ఇతర నాయకత్వ సభ్యులతో పాటుగా పార్టీలో తలయెత్తిన అతివాద, మితవాద అవకాశవాద ధోరణులను విజయవంతంగా తిప్పికొట్టారు. ఈ పోరాటాల సందర్భంగా ఆ అవకాశవాదుల విచ్ఛిన్నకర కార్యకలాపాల వల్ల కొన్ని తాత్కాలిక నష్టాలను ఎదుర్కొన్నప్పటికీ పార్టీని తిరిగి సరియైన మార్గంలో ముందుకు నడిపారు.

దేశంలోని నిజమైన కమ్యూనిస్టు విప్లవకారుల మధ్య ఐక్యతను సాధించడంలో కామ్రేడ్ సుశీల్ రాయ్ నిర్వహించిన భూమిక భారత కమ్యూనిస్టు ఉద్యమ పుటలలో ఎంతో ప్రత్యేకంగా పేర్కొనదగినది. పి.డబ్ల్యు.తో ఐక్యతా కృషి 1981లో కామ్రేడ్ కెసి ప్రత్యక్ష నాయకత్వంలోనే ప్రారంభమై, ఐక్యతకు బలమైన పునాది పడింది. ఇతర అంశాలతో పాటు, 2000 సంవత్సరంలో ఎంసిసి చొరవ చేసి ఏకపక్షంగా కాల్పుల విరమణను ప్రకటించడంతో అంతిమంగా ఎంసిసి, పిడబ్ల్యుల మధ్య ఐక్యతా కృషి ఫలవంతం కావడం ఆరంభమైంది. అది ఒక మలుపు. ఈ నిర్ణయాన్ని తీసుకోవడంలో ఆయన పాత్ర కీలకమైంది. ఈ గొప్ప ఐక్యతను సాధించే క్రమం అంతటా ఆయన కీలకమైన పాత్ర పోషించారు. ఈ మొత్తం విలీన క్రమంలో ఎంసిసిఐకి చెందిన ఉన్నతస్థాయి ప్రాతినిధ్యంలో ఒక నాయకత్వ సభ్యునిగా ఆయన పాల్గొన్నారు. ఈ విలీనానికి కొద్ది ముందుగా, ఆర్‌సిసిఐ, ఆర్‌సిసిఐ (ఎం), సెకండ్ సిసిలతో ఐక్యం కావడంలో

కూడా ఇదే విధంగా ఆయన ముఖ్యమైన పాత్ర పోషించారు. సిపిఐ (ఎం-ఎల్) నక్సల్బరీతో ఎంసిసిఐ ఐక్యతా చర్చలు నిర్వహించి, ఐక్యతను సాధించే క్రమంలో కొన్ని ముఖ్యమైన అంశాలపై ఒక ఉమ్మడి అవగాహనకు వచ్చారు. రెండు పార్టీల మధ్య సన్నిహిత సంబంధాలు కొనసాగాయి. ఇవి కూడా ఇటీవల 2014లో సిపిఐ (మావోయిస్టు), సిపిఐ (ఎం-ఎల్) నక్సల్బరీల మధ్య ఐక్యతకు పునాదిని వేశాయి.

విలీనానంతరం, మన పార్టీలో సీనియర్ కామ్రేడ్‌గా, పొలిట్‌బ్యూరో సభ్యుడిగా కింది స్థాయిల వరకూ విలీన క్రమాన్ని పరిపూర్తి చేయడం కోసం, నూతన పరిస్థితులలో ఒక సమైక్య పార్టీగా పని చేసే విధంగా మొత్తం పార్టీని మలచడం కోసం ఆయన కృషి చేశారు. ఐక్యతా కాంగ్రెస్‌ను నిర్వహించేందుకు జరపవలసిన సన్నాహాలలోనూ, అన్ని రంగాలలో ప్రజాయుద్ధాన్ని పురోగమింపజేయడంలో సిసి, పిబిలు చేసిన అన్ని ముఖ్యమైన నిర్ణయాలలోనూ ఆయన భాగమయ్యారు. కొన్ని అంతర్జాతీయ బాధ్యతలు కూడా చూసేవారు.

విలీనానంతరం భారత విప్లవ ఏకైక నిర్దేశనా కేంద్రం కింద పార్టీ, పిఎల్‌జిఏ, ప్రజా పునాది అభివృద్ధి ఒక గుణాత్మకమైన మలుపును తీసుకున్నది. ప్రజాయుద్ధం పురోగమించింది. దీనితో అభివృద్ధినిరోధక భారత పాలకవర్గాలు, తమ సామ్రాజ్యవాద ప్రభువుల నిర్దేశత్వంతో నూతనంగా ఏర్పడిన సిపిఐ (మావోయిస్టు) నాయకత్వాన్ని అరెస్టు చేసేందుకు లేదా నిర్మూలించేందుకు సునిశితమైన పథకాలను రూపొందించాయి. ఆ క్రమంలోనే, కొద్దికాలానికే కామ్రేడ్ సుశీల్ రాయ్ 2005 మే 21న అరెస్టయ్యారు. ఆయనను ఇంటరాగేట్ చేసి, మానసిక చిత్రహింసలకు గురిచేశారు. అనేక తప్పుడు కేసులు మోపి జైల్లో బంధించారు. పశ్చిమ బెంగాల్, ఝార్ఖండ్‌లలోని జైళ్లలో ఆయన పట్ల అత్యంత అమానవీయ, దారుణ చర్యలకు ఒడిగట్టారు. వాస్తవానికి, జైలులో బంధించబడిన ఈ మొత్తం కాలంలో ఆయనకు రెండు లేదా మూడు సార్లు జామీన్లు మంజూరు అయ్యాయి. కాని, జైలు గేట్ల ముందే ఆయనపై తప్పుడు కేసులు మోపి, తిరిగి జైళ్లలో బంధించారు. రాజ్యం నాయకత్వ కామ్రేడ్స్‌ను, ప్రత్యేకించి సిసిఎం కామ్రేడ్స్‌ను విప్లవానికి నేతృత్వం వహించకుండా, సేవ చేయకుండా నిరోధించేందుకు కుట్రపూరితంగానే ఇలాంటి చర్యలకు ఒడిగడుతోంది. ఆయన వృద్ధాప్యాన్ని, తీవ్రమైన శారీరక సమస్యలను సైతం చూడ నిరాకరిస్తూ, ఎటువంటి సహాయం అందించకుండా (కనీసం రోజువారీ కాలకృత్యాలు తీర్చుకోవడానికి ఆయనకు తప్పనిసరిగా ఎవరో ఒకరి సహాయం అవసరం ఉండింది) ఒంటరి గదిలో బంధించారు. ఇది ఆయన ఆరోగ్యం వేగంగా దిగజారిపోవడానికి, ఆయని తొంటి ఎముక విరగడానికి సైతం దారితీసింది. ఆయనను చాలా ఆలస్యంగా 2012 సెప్టెంబర్‌లో మాత్రమే, అదీ అనేక ప్రజాస్వామిక సంస్థలు పదే పదే తీవ్ర నిరసనలను తెలపడం వగైరా కృషి వల్ల ఢిల్లీలోని ఎయిమ్స్ ఆసుపత్రిలో చేర్పించారు.

కామ్రేడ్ సుశీల్ రాయ్ మూత్రాశయ కాన్సర్‌కు గురయ్యారు. అప్పటికే ముత్రాశయం నుంచి ఒక ట్యూమర్‌ను డాక్టర్లు తొలగించారు. కాన్సర్ కోసం మరో ఆపరేషన్ నిర్వహించారు. ఆయనకు గుండె సమస్య (ఇస్కెమియా) ఉండేది. ఒక మూత్రపిండం పూర్తిగా దెబ్బతినగా,

మరొకటి వ్యాధిగ్రమస్తమైంది. అయినప్పటికీ ఆయన చివరి ఊపిరి వరకూ వివిధ అనారోగ్యాలతో ఒక యోధునిలా పోరాడారు. అలా శారీరక ఆరోగ్యం వల్ల కన్నా, ఆయనలోని విప్లవ స్ఫూర్తి వల్ల ఆయన మరి కొంత కాలం బతకగలిగారు. శారీరక బాధలు, వైకల్యం ఎదుర్కొన్న ఇటువంటి అత్యంత వేదనాభరితమైన కాలంలో ఒక క్షణం కూడా కామ్రేడ్ సుశీల్ రాయ్ గుండె నిబ్బరాన్ని లేదా స్ఫూర్తిని కోల్పోలేదు.

కామ్రేడ్ సుశీల్ రాయ్ అమరత్వం నిస్సందేహంగా మా పార్టీకి, ఉద్యమానికి ఒక తీవ్రమైన నష్టం, అత్యంత దుఃఖదాయకమైన సంఘటన. కానీ, మా సమస్త పార్టీ, విప్లవ ప్రజారాశులు ఈ గొప్ప అమరుని నుంచి నేర్చుకుంటారు. రెట్టింపు సంకల్పశుద్ధితో విప్లవ లక్ష్యాలను పరిపూర్తి చేసేందుకై కృషి సాగిస్తారు. మా ప్రియతమ సీనియర్ కామ్రేడ్ సుశీల్ రాయ్ ఒక మహత్తరమైన కామ్రేడ్, ఆదర్శ కమ్యూనిస్టు. ఆయన మా హృదయాలలో సదా జీవించే ఉంటారు, మమ్మల్ని సదా ఉత్తేజితుల్ని చేస్తూనే ఉంటారు. మన మహత్తర అమరవీరుల కలల్ని నిజం చేసేందుకై ముందుకు వచ్చే భావితరాల కమ్యూనిస్టుల కోసం ఆయన అనేక గొప్ప ఆదర్శాలను నెలకొల్పారు. కామ్రేడ్ సుశీల్ రాయ్ జీవితమంతా భారత కమ్యూనిస్టు ఉద్యమం ఎగుడు దిగుళ్లు, మెలికలు, మలుపులు, కీర్తి–విజయాలతో విడిదీయరానంతగా పెనవేసుకొని పోయింది. ఆయన తనను తాను అప్రధానం చేసుకుంటూ, నిజమైన కమ్యూనిస్టు స్ఫూర్తితో తన జీవితంలో ఎక్కువ భాగాన్ని సమిష్టిపరం చేసి కృషి చేశారు. కనుక ఆయన జీవితాన్ని అధ్యయనం చేయడం అంటే మన దేశ విప్లవ కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రను అధ్యయనం చేయడంలాగానే ఉంటుంది.

మన గొప్ప నాయకుడు కామ్రేడ్ సుశీల్ రాయ్‌లోని సుగుణాలైన – ఎంఎల్ఎంకు దృఢంగా కట్టుబడి ఉండడం, దాన్ని సృజనాత్మకంగా ఆయన అన్వయించిన తీరు; ఒకవైపు అవకాశవాదాన్ని, చీలికవాదాన్ని వ్యతిరేకిస్తూ, మరోవైపు ఐక్యత కోసం పాటు పడడం, దానికి అంటిపెట్టుకొని ఉ ండడం; తప్పులను అంగీకరించడంలో, ఇతరుల తప్పులను సరి చేయడంలో నిజాయితీ; మూడు అద్భుత ఆయుధాల నిర్మాణానికి సర్వశక్తులనూ ధారపోస్తూ ఉద్యమాన్ని అప్రతిహతంగా పురోగమింపజేయడం, సమిష్టి ప్రయోజనాలకు తన వ్యక్తిగత ప్రయోజనాలను కట్టుబడేలా చేయడం – నుంచి ప్రతి కమ్యూనిస్టు తప్పనిసరిగా నేర్చుకోవాలి.

కామ్రేడ్ సుశీల్ రాయ్ సాదాసీదా జీవనానికి ప్రతీక.. ఆయన చాలా మితవ్యయంతో కూడిన జీవితాన్ని గడిపారు. చివరి వరకూ ఆయన అవివాహితుడిగానే ఉండిపోయారు. నక్సల్బరి, సోనార్‌పూర్, కాంక్సా ఉద్యమాల తర్వాత, ఆ తదుపరి కూడా తీవ్రమైన రాజ్య నిర్బంధంలో ఉ ద్యమం ఎదుర్కొన్న ఆటుపోట్లన్నింటిలో ఆయన దృఢంగా నిలిచారు. ఆయన ఎన్నడూ తొణకలేదు. పార్టీ ఆయనపై ఎలాంటి బాధ్యతలు ఉంచినా వాటిని కొండంత దృఢంగా నిలబడి పరిపూర్తి చేసేవారు. ఆయన ఎల్లప్పుడూ ఇతర ఉద్యమాల పట్ల, పార్టీల పట్ల సానుకూల దృక్పథంతో మొదలయ్యేవారు. విమర్శనాత్మక దృష్టితో వాటి నుంచి నేర్చుకోవడానికి, వాటిని అధ్యయనం చేయడానికి పూనుకునేవారు. ఆయన అధ్యయనం లోతైనది. కామ్రేడ్స్ పట్ల చాలా ఓపికగా వ్యవహరించేవారు. ఒక విప్లవకారుని జీవితంలో ఎదురయ్యే దాదాపు ప్రతి ఒక్క కష్టాన్ని

ఆయన ఎదుర్కోవడమే కాక, ఒక నిజమైన కమ్యూనిస్టుగా వాటన్నింటినీ ఆయన హుందాగా అధిగమించారు. మానవ జాతి విముక్తి కోసం ఎటువంటి తుఫాన్లనైనా ఎదుర్కొనేందుకు సిద్ధమయ్యే కమ్యూనిస్టుల దృఢత్వాన్ని అది సూచిస్తుంది. అత్యంత ఒత్తిడితో కూడుకొని ఉండే పరిస్థితులలో సైతం విప్లవకర స్ఫూర్తిని ఎత్తిపట్టే ఆయన హాస్యప్రియత్వాన్ని ఆయనతో కలిసి పనిచేసినవారెవరూ మరచిపోలేరు. ఇదేదో కేవలం ఆయనిలోని గొప్ప గుణాల వల్ల అబ్బినది మాత్రమే కాదు, అన్ని రకాల దోపిడి, పీడన, వివక్షల నుంచి ప్రపంచ పీడిత ప్రజలను విముక్తి చేసే మహత్తర లక్ష్యం పట్ల ఆయనలోని మొక్కవోని అంకితభావం వల్లనే అది సాధ్యమైంది.

**మన దేశ ప్రియతమ ప్రజలారా, భారత విప్లవ శ్రేయోభిలాషులారా!**

భారత రాజ్యం అంత దారుణంగా వ్యవహరించకపోయి ఉండనట్లయితే కామ్రేడ్ సుశీల్ రాయ్ ఇంత తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కోవలసి వచ్చేది కాదు, ఇంత త్వరగా మరణించి ఉండేవారు కాదు అనేది ఒక నిరాకరించలేని వాస్తవం. పాలకవర్గాలు, వారి రాజ్య యంత్రాంగం, సామ్రాజ్యవాదులు చేసిన ఈ అత్యంత క్రూరమైన, అమానవీయమైన కోవర్టు హత్యను మేం తీవ్రంగా ఖండిస్తున్నాం. ఈ దారుణాన్ని బహిర్గతం చేయాల్సిందిగా ప్రజాస్వామికవాదులందరికీ విజ్ఞప్తి చేస్తున్నాం. ఈ వాస్తవాన్ని మనం ప్రజలలో విస్తృతంగా ప్రచారం చేయాలి. జైలులో ఉన్న నాయకత్వ కామ్రేడ్స్‌ను పరిరక్షించుకోవడం గురించి వారి స్పృహను పెంచాలి. వారిపైన, ఇతర ఖైదీలపైన రాజ్యం అసంఖ్యాకంగా సాగిస్తున్న అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడేలా వారిని జాగృతం చేయాలి. కామ్రేడ్ సుశీల్ రాయ్ తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కొంటూ రాజ్యానికి వ్యతిరేకంగా దృఢంగా సాగించిన పోరాటం పై పోరాటంలో సైతం ప్రజలను ఉత్తేజితం గావించే ఒక నమూగా నిలుస్తుంది.

కామ్రేడ్ సుశీల్ రాయ్‌ను ఎయిమ్స్‌లో చేర్చాక, ఆయనకు ఆపరేషన్ జరిగిన తర్వాత ఆయన మంచం మీద నుంచి లేవలేని పరిస్థితిలో, ఎవరో ఒకరు ఆయనతో కూడా ఉండి ఎప్పటికీ సహాయం చేస్తూ ఉండాల్సిన స్థితిలో విప్లవ, ప్రజాస్వామిక ప్రజా సంఘాలు, వ్యక్తులు, ప్రజలు ఆయనకు ఆ సహాయాన్ని అందించారు. ఆయన విడుదల కోసం, ఆయనకు తగిన వైద్యం అందించడం కోసం అన్ని విధాలా పోరాడిన, చివరి వరకూ ఆయనకు ఎంతో అవసరమైన వ్యక్తిగత సహాయాన్ని అందించిన వారందరికీ సిసి, సిపిఐ (మావోయిస్టు), సమస్త విప్లవ శిబిరం తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలను, లాల్‌సలాములను తెలుపుతోంది. ఆయనకు సేవ చేసి నిజమైన మానవతా విలువలను ప్రదర్శించిన వారిని మా పార్టీ, విప్లవ ప్రజలు ఎన్నటికీ మరిచిపోలేరు. అత్యంత అమానవీయంగా వ్యవహరించిన అధమ విలువలు కలిగిన భారత రాజ్యంతో పోల్చినప్పుడు వారి మానవ విలువలు మరింత ఉజ్వలంగా కాంతులీనుతున్నాయి. అలాంటి వయోవృద్ధులైన, నిజమైన ప్రజా నాయకులకు సేవలు అందించడం అనేది సమస్త ప్రపంచంలో నిజమైన మానవతా విలువలను స్థాపించడం కోసం చేసే పోరాటంలో విడదీయరాని భాగమని మా పార్టీ విశ్వసిస్తోంది.

అనేక మంది సీనియర్ కామ్రేడ్స్ తీవ్రమైన ఆరోగ్య సమస్యలతో జైళ్లలో ఐదు, పదేళ్ల

నుంచీ ఉంటూ, జామీన్లు, సరియైన వైద్య సహాయం, పారిశుధ్యం, శుభ్రత లేకుండా ఉంటున్న నేపథ్యంలో భవిష్యత్తు ఇలాంటి కర్తవ్యాలు అనేకం ముందుకు వస్తాయి. కామ్రేడ్ సుశీల్ రాయ్‌కు సరియైన వైద్య సహాయం కోసం సాగించిన పోరాటం అనేది రాజకీయ ఖైదీలందరి బేషరుతు విడుదల కోసం, ఖైదీల హక్కుల కోసం సాగించే విశాలమైన పోరాటంలో భాగమే. నిజమైన ప్రజా నాయకులు విడుదలయ్యేలా, వారికి సరియైన వైద్య సహాయం అందేలా చూడడం ప్రజల హక్కు, బాధ్యత.

మన ప్రాంతాలన్నింటా, దేశంలో యెల్లెడలా స్మారక సభలు నిర్వహించి ఈ గొప్ప కమ్యూనిస్టుకు ఘనమైన నివాళులు అర్పించాల్సిందిగా, సాధ్యమైన అన్ని పద్ధతులలో ఆయన ఆదర్శాలను విస్తృతంగా ప్రచారం చేయాల్సిందిగా సిసి, సిపిఐ (మావోయిస్టు) తన సమస్త పార్టీ శ్రేణులకు, మన దేశంలోని విప్లవ క్యాంపుకు పిలుపు నిస్తోంది. వివిధ రూపాలలో (రచనలు, ఫిల్మ్‌లు, డాక్యుమెంటరీలు వగైరాల ద్వారా) ఆయని ఆదర్శాలను ప్రచారం చేసేందుకై ముందుకు రావాల్సిందిగా వివిధ స్థాయిల కామ్రేడ్స్‌కు, భారత విప్లవ శ్రేయోభిలాషులకు, సానుభూతిపరులకు అది పిలుపు నిస్తోంది. మన ప్రియతమ కామ్రేడ్ సుశీల్ రాయ్, ఇతర గొప్ప అమరవీరుల విప్లవ గుణాలను, ఆదర్శాలను గ్రహించి, అలవర్చుకోవడం ద్వారానే మన నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని ఖచ్చితంగా విజయం సాధించే దిశగా పురోగమింపజేయగలం. సోషలిజాన్ని, కమ్యూనిజాన్ని సాధించగలం.

**అభయ్**

**అధికార ప్రతినిధి**

**కేంద్ర కమిటీ**

**సీపీఐ (మావోయిస్టు)**

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# కేంద్ర కమిటీ

**21-6-2014**

## మోడీ మన గొంతుల్లో కూరుతున్న రైల్వే చార్జీల పెంపు 'చేదు మాత్ర'కు వ్యతిరేకంగా పోరాడండి!
## ఆకాశాన్నంటుతున్న అధిక ధరలకు వ్యతిరేకంగా ఐక్య పోరాటాన్ని ఎక్కుపెట్టండి!

'దేశ ఆర్థిక వ్యవస్థను పట్టాలెక్కించాలంటే' కొన్ని 'చేదు మాత్రలు' మింగక తప్పదు అని తాను అధికారంలోకి వచ్చిన కొద్ది రోజులకే మోడీ గోవాలో ప్రకటించాడు. బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం ఏర్పడి నెల రోజులు కూడా కాకముందే అది మన గొంతులో కూరుతున్న చేదుమాత్రలు అప్పుడే అసంఖ్యాకంగా తోస్తున్నాయి.

బిజెపి చేసిన ముఖ్యమైన ఎన్నికల వాగ్దానాల్లో అధిక ధరల అదుపు, ద్రవ్యోల్బణం అదుపు వున్నాయి. కానీ నెల కూడా గడవకుండానే మున్నెన్నడూ లేని రీతిలో రైల్వే చార్జీలను పెంచేశారు. ప్రయాణీకుల చార్జీలను 14.2 శాతం, సరుకు రవాణా చార్జీలను 6.5 శాతం పెంచేశారు. ఇది సాధారణ ప్రజలపై, పేద ప్రజలు, మధ్య తరగతి ప్రజలపై నేరుగా పెనుభారాన్ని మోపుతుంది. అలాగే అన్ని దిగుమతి చేసుకునే సరుకులు సహా అన్ని రవాణా సరుకుల రేట్లు పెరగడం వల్ల కూడా అధిక భారం పడుతుంది. ఇది అన్ని వాడకం సరుకుల, ఆహార పదార్థాల ధరల్లో అనూహ్యమైన పెరుగుదలకు దారితీస్తుంది. ఇప్పటికే ఉల్లిపాయల, కాయగూరల, పండ్ల ధరలు ఆకాశాన్నంటుతూ ద్రవ్యోల్బణం పెరుగుతూ పోతోంది. ప్రతి నెల డీజిల్ రేట్లను పెంచే యుపిఎ ప్రభుత్వ విధానం ఎలాగూ కొనసాగుతోంది. దీనికి వారు చూపుతున్న సాకు ప్రపంచ మార్కెట్ రేట్లకు అనుగుణంగా వీటిని సరిచేయాలనేది. రిలయన్స్ సంస్థకు సహాజ వాయువు ఉత్పత్తి కోసం ఇస్తున్న సబ్సిడీల విషయంలో, దాని ఫలితంగా దాని ధరల్లో వచ్చే అనుహ్యమైన పెరుగుదల విషయంలో వేర్వేరు సెక్షన్ల ప్రజలు సీరియస్ ప్రశ్నల్ని లేవనెత్తుతున్నారు. వంటగ్యాస్ ధరలను ముందుగానే పెంచేశారు.

ప్రపంచ ఆర్థిక సంక్షోభాన్నీ, ప్రపంచ మార్కెట్‌లో చమురు ధరల్లో జరుగుతున్న నిరంతర మార్పులనూ పెట్రోలు, డీజిల్, వంటగ్యాస్ మొదలైన వాటి ధరల పెంపునకు 'కారణాలు'గా

యుపిఎ ప్రభుత్వం చూపింది. బిజెపి ప్రతిపక్షంలో వున్నప్పుడు కాంగ్రెస్ నేతృత్వంలోని యుపిఎ ప్రభుత్వాన్ని ఇందుకు తీవ్రంగా విమర్శించడమే కాక దాన్ని తన ఎన్నికల ప్రచారంలో ప్రముఖంగా ముందుకు తెచ్చింది. కానీ ప్రస్తుత ధరల పెంపును సమర్థించుకోవడానికి అది ఇరాక్ ఉత్తర ప్రాంతంలో నూరి-అల్-మలికీకి వ్యతిరేకంగా ఐఎస్ఐఎస్ వేగంగా పురోగమించడం వల్ల ప్రపంచ మార్కెట్‌లో చమురు ధరల్లో వచ్చిన మార్పులు వంటి వాటిని అదే విధమైన సాకులుగా చూపుతోంది. అది మన మోహాన కొడుతున్న మరో కారణం 'రైల్వేలను ఆధునీకరించాల్సిన' అవసరం, పదేళ్ళ యుపిఎ ప్రభుత్వం మన ఆర్థిక వ్యవస్థకు చేసిన 'నష్టాన్నంతా బాగుచేయాల్సిన' అవసరం.

గత యుపిఎ ప్రభుత్వం చేసిన నిర్ణయాన్నే తాను అమలు చేస్తున్నాననీ, అది అప్పుడు ఎన్నికల రీత్యా దాన్ని అమలు చేయడం ఆపిందనీ కూడా రైల్వే మంత్రి సిగ్గులేకుండా ఈ దారుణమైన ప్రయాణ, రవాణా చార్జీల పెంపును సమర్థించుకుంటూ ఆ దోషాన్నంతా యుపిఎ నెత్తిన రుద్దడానికి ప్రయత్నించాడు. ప్రతి రోజూ మోడీ సర్కార్ యుపిఎ ప్రభుత్వం చేసిన అనేక నిర్ణయాల్నీ, నిర్మాణాల్నీ సామ్రాజ్యవాద, దేశీయ దళారీ రాకాసి కార్పోరేషన్ల ప్రయోజనాల కోసం రద్దు చేస్తూనే వుంది. కానీ ఇప్పుడు రైల్వే చార్జీల పెంపు నిర్ణయాన్ని మాత్రం రద్దు చేయలేనంటూ 'నిస్సహాయతను' వ్యక్తం చేస్తూ మనల్ని నమ్మమంటోంది. పోలవరం ప్రాజెక్టు వల్ల ముంపుకు గురయ్యే తెలంగాణాలోని ఖమ్మంకు చెందిన ఏడు మండలాల గ్రామాలను ఆంధ్రప్రదేశ్‌కు అప్పగించే ఆర్డినెన్స్‌ను తేవడానికి కూడా అది ఇదే సాకును చూపింది. ఈ రెండు విషయాల్లో అది చేస్తున్న సిగ్గూ-నీతీ మాలిన ప్రకటనలు అత్యంత విప్లవ ప్రతీఘాతుక ప్రజావ్యతిరేక నిర్ణయాలు తీసుకోవడంలో 'కొత్త' ప్రభుత్వం 'పాత' దానికంటే ఏమాత్రం భిన్నమైనది కాదని స్పష్టంగా బహిర్గతం చేసేశాయి.

రైల్వేలు సహా అనేక రంగాలలోకి 100 శాతం విదేశీ ప్రత్యక్ష మదుపులను తేవడానికి దారిని సుగమం చేయడం గురించిన ప్రకటన మోడీ క్యాబినెట్ చేసిన మొట్టమొదటి ప్రకటనల్లో ఒకటి అని గుర్తుంటే, 'రైల్వేలను ఆధునీకరించడం' 'పాత ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థకు చేసిన నష్టాన్ని భర్తీ చేయడం' అంటూ చార్జీల పెంపునకు చూపిన సాకులు వెనుక అసలు కారణం బహిర్గతమవుతుంది. అతి పెద్ద పబ్లిక్ రంగ సర్వీస్ అయిన రైల్వేలను ప్రైవేటీకరించడానికి పెట్టిన ముద్దుపేరే 'ఆధునీకరణ'. ఇది సామ్రాజ్యవాదులకూ, దళారీ నిరంకుశ పెట్టుబడిదారులకూ దాన్ని శెనక్కాయల ధరలకు అమ్మడానికి తప్ప మరెందుకూ కాదు.

మే 16న ఎన్నికల ఫలితాలపై వ్యాఖ్యానిస్తూ, మోడీ 'మంచి రోజులు రానున్నాయి' అన్నాడు. అవును, మంచి రోజులు రానున్నాయి, అవి బహుళజాతి కంపెనీలకూ, వాటి బూట్లునాకే దళారీలకూ, రాజకీయ నాయకులకూ, అత్యున్నత ప్రభుత్వాధికారులకూ రానున్నాయి. వీరంతా మనం ఊపిరాడకుండా చనిపోయేవరకు మన గొంతుల్లో 'చేదు మాత్రల'ను కూరడానికి ఏమాత్రం వెనుకాడని ఒక 'బలమైన ప్రధాని' అధికారంలో వుండడం వల్ల సూపర్ ఆదాయాలనూ, లాభాలనూ

సంపాదించుకోనున్నారు. కానీ సామాన్య ప్రజానీకానికి మాత్రం రానున్న రోజులు ఆకాశాన్నంటే ధరలు, జీవన ప్రమాణాలు/స్థితిగతులు వేగంగా పడిపోవడం, ధనికులకూ పేదలకూ మధ్య ఆదాయాల్లో అపూర్వమైన అంతరాలు మొదలైన దారుణమైన పరిస్థితులతో నిండి వుండే రోజులు రానున్నాయి.

**ప్రియమైన దేశ ప్రజలారా!**

రానున్న రోజులు ఎలా వుంటాయనడానికి ఇవి కేవలం కొన్ని సూచికలు మాత్రమే. గత ప్రభుత్వ విధానాలన్నిటినీ తాను నిరాకరించబోననీ, 'ఉపయుక్తమైన' వాటినన్నిటినీ యథాతథంగా కొనసాగిస్తాననీ ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే మోడీ స్పష్టంగా ప్రకటించాడు. ప్రాథమిక సూచికలు ఎంత స్పష్టంగా అగుపిస్తున్నాయంటే వాటినెవరూ చూడకుండా వుండలేరు. నిజానికి, ప్రతి ఒక్కరూ వాటి వల్ల ప్రభావితులౌతారు. ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే మోడీ తన ప్రభుత్వ మూడు ప్రాధాన్యతలను ప్రకటించాడు. అవి తమను తామే వివరించుకునేలా వున్నాయి – మదుపులను తీసుకురావడం, మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల పరిపూర్తి/నిర్మాణం, సహజ వనరుల వినియోగం. ఇంతకంటే అత్యుత్తమమైన విదేశీ, స్వదేశీ కార్పొరేట్ ఎజెండా ఏముంటుంది? ఈ ఎజెండా అమలు వల్ల మన దేశం రానున్న కొద్ది సంవత్సరాల్లో అత్యంత నిర్దాక్షిణ్యమైన పరిపాలనల్లో ఒక దానిని చవిచూడనున్నది. దీనిని మనమంతా ఐక్యంగా ఎదిరించి పోరాడకపోతే మన దేశ ప్రజల జీవితాలు మహా దుర్భరంగా, అత్యంత దారుణంగా తయారవడం ఖాయం. వాటిలో మృత్యువు, విధ్వంసం తప్ప మరేం మిగలవు.

రైల్వే ప్రయాణ, రవాణ చార్జీల్లో దారుణమైన పెంపునూ, ఆహార పదార్థాల్లో ద్రవ్యోల్బణాన్ని, డీజిల్, సహజ వాయువు ధరలు మొదలైన వాటి ఆకాశాన్నంటే ధరలనూ సామ్రాజ్యవాదుల ప్రత్యేకించి అమెరికా సామ్రాజ్యవాదుల ఆదేశాల ప్రకారం దళారీ నిరంకుశ బూర్జువాల ప్రయోజనాల కోసం మనపై రుద్దుతున్న మోడీ సర్కార్‌ను ఎదిరించి పోరాడాలని సిపిఐ (మావోయిస్టు) మన దేశ ప్రజలకు పిలుపునిస్తోంది. ప్రజలను పెద్దెత్తున అధిక ధరలకు వ్యతిరేకంగా జరిగే ఆందోళనల్లోకి సమీకరించాల్సిందిగా తన పార్టీ శ్రేణులన్నిటికీ, పిఎల్‌జిఎకూ పిలుపునిస్తోంది. అత్యంత విశాల ప్రాతిపదికన అన్ని పీడిత వర్గాలకూ, సెక్షన్లకూ చెందిన ప్రజలను ఐక్యం చేసి, సమీకరించి రైల్వే తదితర ధరల పెరుగుదలలకు వ్యతిరేకంగా దృఢమైన పోరాటాన్ని ఎక్కుపెట్టాల్సిందిగా విప్లవ, ప్రజాస్వామిక సంస్థలకూ, వ్యక్తులకూ విజ్ఞప్తి చేస్తోంది.

**అభయ్**

**అధికార ప్రతినిధి**

**కేంద్ర కమిటీ**

**సీపీఐ (మావోయిస్టు)**

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# కేంద్ర కమిటీ

**29-6-2014**

## ఆదివాసుల పట్ల అత్యంత దారుణ నేరమైన, మానవవిషాదానికీ, పర్యావరణ విధ్వంసానికీ మారుపేరైన పోలవరం నిర్మాణాన్ని వ్యతిరేకించండి!

## ప్రాజెక్టు నిలుపుదలను కోరుతూ విశాల ప్రజాఉద్యమాన్ని నిర్మించండి!

తన మొదటి సమావేశంలోనే మోడీ క్యాబినెట్ పోలవరం నిర్మాణం వల్ల ముంపుకు గురయ్యే తెలంగాణలోని ఖమ్మం జిల్లాలో ఏడు మండలాలకు చెందిన ముంపు గ్రామాలన్నిటినీ (దాదాపు 400 గ్రామాలు) ఆంధ్రప్రదేశ్‌కు బదిలీ చేస్తూ ఆర్డినెన్స్‌ను ఆమోదించింది. షెడ్యూల్ గ్రామాలను బదిలీ చేయడం, ఆదివాసీ ప్రాంతాన్ని విభజించడం వల్ల ఇది రాజ్యాంగంలో సుదీర్ఘ ప్రజా ఉద్యమాల ఫలితంగా, గతంలో ప్రభుత్వాలు చేసిన పలు చట్టాలు కల్పించిన ఆదివాసుల హక్కుల పరిరక్షణల ఉల్లంఘనే కాక ఆదివాసుల క్షేమం, వారి ఆకాంక్షలు, తమ జీవితాల్ని తామే నిర్ణయించుకునే జన్మహక్కుకు పూర్తి వ్యతిరేకమైన ఒక నిర్ణయం. 'పారదర్శక పాలన' గురించి గొంతు చించుకునే మోడీ ఈ ఆర్డినెన్స్‌ను ఎంత నీచమైన పద్ధతిలో తెచ్చాడంటే న్యాయశాఖా మంత్రి రవిశంకర్ ప్రసాద్ క్యాబినెట్ సమావేశం నిర్ణయాల గురించి మీడియాకు తెలియజేస్తూ ఈ విషయంలో ఇంకా చర్చలు నడుస్తున్నాయని సిగ్గులేకుండా అబద్ధాలు చెప్పాడు. వాస్తవం బైటకొచ్చాక తెలంగాణ ప్రజలు, ప్రత్యేకించి ఆదివాసీ ప్రజానీకం భగ్గుమన్నారు. ఈ ఆర్డినెన్స్‌ను తక్షణం వెనక్కి తీసుకోవాలని కోరుతూ రాష్ట్రవ్యాప్త బంద్ సహా అనేక రకాల నిరసనలు, నిరాహారదీక్షలు, ప్రదర్శనలు వగైరా ఆందోళనలతో తెలంగాణ అట్టుడుకింది.

ఈ ఆర్డినెన్స్‌ను తీసుకొచ్చే నిర్ణయం గత యుపిఎ-2 ప్రభుత్వానిదనీ, తాము కేవలం దాన్ని అమలు మాత్రమే చేస్తున్నామనీ మోడీ ప్రభుత్వం నిస్సిగ్గుగా తన నిర్ణయాన్ని సమర్థించుకుంది. కానీ అసలు వాస్తవం ఏంటంటే సామ్రాజ్యవాదుల, వారి దేశీ దళారుల ప్రయోజనాలు నెరవేర్చడం కోసం ప్రజావ్యతిరేక అభివృద్ధి-నిరోధక నిర్ణయాలు తీసుకోవడంలో యుపిఎ, ఎన్‌డిఎ ప్రభుత్వాలకు ఎన్నడూ ఎటువంటి తేడా లేదు. ఈ విషయంలో రెండూ ఒకదానితో మరొకటి పోటీపడ్తూనే వచ్చాయి. దేశీ, విదేశీ ఘరానా కార్పొరేట్ కంపెనీల బడితొత్తులైన నాయుడు ద్వయం (ఏపి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్ర పట్టణాభివృద్ధి, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి

వెంకయ్య నాయుడు) ఈ ఆర్డినెన్స్‌ను తేవడంలో కీలకపాత్ర నిర్వహించారు. యుపిఎ-1, యుపిఎ-2 తీసుకున్న అనేక నిర్ణయాలను తిరగదోడే మోడీ, ఆదివాసులకు ఎనలేని హాని చేసే ఈ ఆర్డినెన్స్‌ను ఎవరి ప్రయోజనాలను కాపాడ్డానికి మార్చలేకపోతున్నాడో ప్రజలకు, ప్రత్యేకంగా ఆదివాసులకు స్పష్టంగానే అర్థమవుతోంది. అసలు విషయం ఏంటంటే ఈ రెండు పాలక కూటములు కలిసే పోలవరం అనే కుట్రకు పాల్పడ్డాయి. ఇప్పుడూ అదే చేస్తున్నాయి. వారు కూర్చునే స్థానాలు అధికార, ప్రతిపక్షాలుగా మారుతున్నాయంతే. తెలంగాణ ప్రజలు, ముఖ్యంగా ఆదివాసులు ఈ మోసాన్ని గ్రహించారు. అందుకనే వారు గత యుపిఎ, ప్రస్తుత ఎన్‌డిఎ ప్రభుత్వ నిర్ణయాలను తీవ్రంగా నిరసిస్తున్నారు.

నూతనంగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ (ఏపి) రాష్ట్ర అసెంబ్లీ తన మొదటి సమావేశంలోనే కేంద్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా అమలు చేయాలనీ, దాని నిర్మాణాన్ని త్వరితం చేయాలని కోరుతూ, ఈ ప్రతీఘాతుక ఆర్డినెన్స్‌ను తీసుకురావడంలో కీలకపాత్రను వహించినందుకు నాయుడు ద్వయాన్ని ఆకాశానికెత్తుతూ తీర్మానం చేసింది. వీరిరువురూ, వారి దళారీ మాఫియా గ్యాంగులూ ఈ ఆర్డినెన్స్‌ను తీసుకురావడానికి వివరించిన హాస్యాస్పదమైన కారణాల్లో ఒకటి ఏంటంటే ముంపు గ్రామాలు ప్రాజెక్టు రాష్ట్రానికే చెందాలనేది. ఒకటికంటే ఎక్కువ రాష్ట్రాలకు సంబంధించిన ఆనకట్టల నిర్మాణాల సందర్భంగా భారతదేశంలో ఎక్కడా ఇటువంటి వాదనలు చేయడం గానీ, ఇలాంటి పొంతనలేని పథకాల్ని అమలు చేయడం గానీ జరగలేదు. ముంపు గ్రామాలన్నీ తమకు యిచ్చేస్తే తమ ఇష్టానుసారం వ్యవహరించి కంటితుడుపులాంటి పునరావాసం వంటి విషయాల్లో ఆదివాసుల పట్ల అడ్డూఆపూ లేని అన్యాయాలనూ, అక్రమాలనూ కొనసాగించడానికి వీలుగా ఉంటుందనేది అసలు కారణం.

పోలవరం నిర్మాణం వల్ల తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో 400 గ్రామాలు, ఒడిషాలో 50 గ్రామాలు, ఛత్తీస్‌గఢ్‌లో 50 గ్రామాలు ముంపుకు గురవుతాయి. కుకునూర్, వేలేరిపాడు, బూర్గంపాడు, చింతూరు, కూనవరం, వరరామచంద్రపురం మండలాల్లోని అన్ని గ్రామాలూ, రాముని దేవాలయం వున్న భద్రాచలం రెవెన్యూ గ్రామాన్ని మినహాయించి భద్రాచలం మండలంలోని అన్ని గ్రామాలూ ఏపికి బదిలీ అవుతాయి. గత యుపిఎ ప్రభుత్వం ఏపీ పునర్విభజన బిల్లుకు సవరణగా దీనిని ప్రతిపాదించినప్పుడు కూడా దీనికి తెలంగాణలోని ఆదివాసీ ప్రజల నుండి, వివిధ సెక్షన్ల ప్రజల నుండి, పర్యావరణవాదుల నుండి, తీవ్రమైన నిరసనలు వ్యక్తం అయ్యాయి. ఆ నిరసనలు ఇప్పుడు కూడా ఆర్డినెన్స్ రద్దును కోరుతూ కొనసాగుతున్నాయి. మా పార్టీ కేంద్రకమిటీ, సంబంధిత రాష్ట్ర కమిటీలు, విప్లవ, ప్రజాస్వామిక సంఘాలూ నాడూ, నేడూ ఈ నిర్ణయాన్ని తీవ్రంగా ఖండించాయి. దీనికి వ్యతిరేకంగా ప్రజాఉద్యమాన్ని నిర్మిస్తున్నాయి.

పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని ఆదివాసులు, తెలంగాణ, ఏపిల్లోని విప్లవ, ప్రజాస్వామిక శక్తులు, ప్రగతిశీల సెక్షన్‌కు చెందిన పర్యావరణవాదులు, మానవవిజ్ఞాన శాస్త్రజ్ఞులు, ఇంజినీర్లు, నిపుణులు

మొదలైనవారు వ్యతిరేకిస్తున్నారు. విశాఖపట్నం-నెల్లూరు పారిశ్రామిక కారిడార్ నిర్మాణం వల్ల దొరికే ముడుపుల వల్లా, ఈ కారిడార్ వెంబడి రియల్ ఎస్టేట్ బిజినెస్సుల వల్లా, విచ్చలవిడి అవినీతి వల్లా ఊహకందనంతటి లాభాలు పొందగల విదేశీ, దేశీ కార్పొరేషన్లు, సీమాంధ్ర ఘరానా పెట్టుబడిదారులు, భూస్వాములు, బడా మాఫియాలు, రాజకీయ నాయకులు, బడా కాంట్రాక్టర్లు తప్ప ఈ బహుళార్ధసాధక ప్రాజెక్టునెవరూ సమర్థించడం లేదు. ఈ ప్రాజెక్టు వల్ల కృష్ణా, గుంటూరు జిల్లాల రైతులకు మూడవ పంటకు సాగునీరు అందుతుందని చెప్తున్నారు. కానీ ఇది బూటకపు సాకు మాత్రమే. ఇక్కడ 'రైతులు' అంటే ప్రధానంగా భూస్వాములు, ధనికరైతులే. ఇది ఉపయోగపడేది ప్రధానంగా వారికే. దీని వల్ల జరిగే నష్టాలు లాభాలకంటే ఎన్నోరెట్లు ఎక్కువ. అందుకని దీనివల్ల సాగయ్యే కొన్ని లక్షల ఎకరాల భూమిని చూపి దాన్ని సమర్థించుకోలేరు. ఏపిలో సాగునీరు అందని రైతులకు నీటిని అందించడానికి ఇంకా అనేక మార్గాలను అనుసరించవచ్చు. నిజానికి ఏపి ప్రజలకు కూడా దీని నిర్మాణం వల్ల నష్టమే ఎందుకంటే ఈ ఆనకట్ట వరదనీటి ఉధృతిని తట్టుకోలేక కూలిపోయే ప్రమాదం ఉందనీ, ఇది తూర్పు కనుమల్లో దారుణమైన మానవ విషాదానికి దారి తీస్తుందనీ అనేకమంది నిపుణులు హెచ్చరించి ఉన్నారు. ఈ రాకాసిని నిర్మిస్తే జరగగల ప్రమాదాలను గురించి వారు అనేక శాస్త్రీయమైన రుజువుల్నీ, వాస్తవాల్నీ ముందుపెట్టే వున్నారు. కాబట్టి ఆంధ్రప్రదేశ్ ప్రజలు వాస్తవాలు గ్రహించి పోలవరం ప్రాజెక్టుకు వ్యతిరేకంగా జరిగే పోరాటానికి మద్దతు ఇస్తూ దానిలో భాగస్వాములు కావాలి.

ఈ 'ఆధునిక విధ్వంసకర దేవాలయ' నిర్మాణం వల్ల ప్రధానంగా బాధితులయ్యేది తెలంగాణ ప్రజలు, ప్రత్యేకించి దీనివల్ల నిర్వాసితులయ్యే లక్షలాది ఆదివాసులు. ఇది ఒక సాంస్కృతిక మానవ మారణకాండ తప్ప మరొకటి కాదు. ఎందుకంటే అక్కడి నేల, అడవుల మీద ఆధారపడి బతుకుతున్న మూడు లక్షలకు పైగా కోయ, కొండరెడ్డి (ఎస్‌టి), షెడ్యూల్డ్ కులాలు, అనేక యితర సముదాయాలు దీనివల్ల తమ మూలనివాసాల నుండి కూకటివేళ్లతో నిర్దాక్షిణ్యంగా పెకిలించవేయబడతారు. నాగరీకుల పరిభాషలో నిర్వాసితులవుతారు.

ఈ ప్రాజెక్టు ప్రజల పోరాటాల ఫలితంగా దేశరాజ్యాంగంలో, ఐక్యరాజ్యసమితి నియమావళిలో పొందుపర్చిన మానవహక్కుల ఉల్లంఘనే కాక ఆదివాసుల మానవ, సాంస్కృతిక హక్కులను దారుణంగా కాలరాచివేయడం కూడా. చారిత్రకంగా, సాంస్కృతికంగా ఈ ప్రాంతంలోని ఆదివాసులు తమ ప్రత్యేక అస్థిత్వాన్ని నిలుపుకుంటూనే అందుకు ఆటంకం కల్పిస్తున్న కేంద్ర, రాష్ట్ర విధానాలను ప్రతిఘటిస్తూనే తాము తెలంగాణవాసులుగానే భావించుకుంటూ వస్తున్నారు. వారు ఈ బదిలీకి బద్ధవిరోధులు. ఈ గ్రామాలను ఏపికి బదిలీ చేస్తే వారి అస్థిత్వం, ఆర్థికం, భాషాసంస్కృతులు వంటివన్నీ మొత్తంగా ప్రతికూలంగా ప్రభావితమవుతాయి. అంతేకాక, సల్వాజుడుం, ఆపరేషన్ గ్రీన్‌హంట్‌లు చేసిన విధ్వంసం వల్ల బస్తర్ నుండి వేలాది ఆదివాసులు ఖమ్మం అటవీ ప్రాంతానికి వలసపోవాల్సిన స్థితికి నెట్టబడ్డారు. వీరి పరిస్థితి ఈ ప్రాజెక్టు వల్ల ఎంత అధ్వాన్నంగా మారుతుందనేది ఊహకు కూడా అందదు. వీరికి గుర్తింపే లేదు కనుక నామమాత్రమైన పునరావాసం కూడా

కరవే.

పద్ధతీ పాడూ లేకుండా, ఆదివాసులతో సంప్రదింపులు గానీ, వారి ఆమోదం గానీ లేకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఈ ప్రాజెక్టు నిర్మాణాన్నీ, ఈ దుర్మార్గమైన ఆర్డినెన్సునూ ముందుకు తోయడం ద్వారా **1996** పెసా చట్టం ప్రకారం షెడ్యూల్డ్ ప్రాంతంలోని సంబంధిత గ్రామసభల లేదా పంచాయితుల ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలనే ఆదేశాన్ని తుంగలో తొక్కారు. రాజ్యాంగంలోని అనేక ఇతర అధికరణాలను కూడా బాజాప్తుగా, నిరంతరంగా ఉల్లంఘిస్తూనే పోతున్నారు. ఉదాహరణకు ఆర్టికల్ **244** ప్రకారం ఐదవ షెడ్యూల్ కింద షెడ్యూల్డ్ ప్రాంతాల పరిపాలన, అదుపులకు రాష్ట్రంలోని ట్రైబల్ అడ్వయిజరీ కౌన్సిల్‌ని సంప్రదించడం, అనుమతి పొందడం అనివార్యం. ఇది **2013** భూసేకరణ, పునరావాస, పున:స్థాపనా చట్టానికి కూడా ఉల్లంఘనే ఎందుకంటే దీని ప్రకారం స్థానిక ప్రజల అనుమతి ఉండడంతో పాటు సాగునీటి ప్రాజెక్టుల వల్ల బాధితులయ్యే ప్రజలకు 'భూమికి బదులు భూమి'', ఇతర నష్టపరిహారాలు యివ్వాలనేది వుంది. తాము నివసిస్తూ వుండిన ప్రాంతంలో పొందుతుండిన రిజర్వేషన్ సహా అన్ని రకాల సదుపాయాలు రీసెటిల్‌మెంటు ప్రాంతంలో కూడా షెడ్యూల్డ్ తెగలు, కులాలకు వర్తించాలనేది వుంది. అసలు **50,000** కంటే ఎక్కువమంది ఆదివాసులను నిర్వాసితులను చేసే ఎటువంటి ప్రాజెక్టునైనా ఆమోదించకూడదనే జాతీయ ట్రైబల్ విధానానికి కూడా ఇది నేరపూరితమైన ఉల్లంఘనే.

ఒడిషా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల ప్రభుత్వాల అనుమతులు, అక్కడి గ్రామసభల అనుమతులు, అటవీ పరిరక్షణ చట్టం అనుమతి, అనేక పర్యావరణ అనుమతులు వంటి అనేక అనివార్యమైన అనుమతులు ప్రస్తుతం ఆ ప్రాజెక్టు ఇంకా పొందనే లేదు. ఈ జాబితా చాలా పొడవైనది. గతంలో వైఎస్సార్ ప్రభుత్వం ఏపిలో అధికారంలో వున్నప్పుడు టెండర్లు కూడా పెట్టేసి బడా నిర్మాణ (కన్‌స్ట్రక్షన్) కంపెనీలకు కాంట్రాక్టులు కూడా ఇచ్చేశాడు. దోపిడీశక్తుల కొమ్ముగాసే మోడీ ప్రభుత్వం ఎంత వేగంగా అసంఖ్యాకమైన ప్రతీఘాతుక నిర్ణయాలను తీసుకుంటోందంటే వీటన్నిటికీ త్వరలోనే అనుమతులు సంపాదిస్తారు లేదా నిర్మాణాన్ని వేగవంతం చేయడం కోసం ఏవో అత్యంత మోసపూరితమైన చర్యలు తీసుకోవడం ఖాయం.

ఛత్తీస్‌గఢ్, ఒడిషా వంటి పక్క రాష్ట్రాలు దీనికి అభ్యంతరం తెలుపుతూ నమోదు చేసిన అనేక కేసులు సుప్రీంకోర్టులో పెండింగ్‌లో వున్నాయి. ఆదివాసీ సంస్థలు, తెలంగాణ సంఘాలు, పర్యావరణ సంఘాలు అత్యంత వివాదాస్పదమైన ఈ నిర్మాణాన్ని సవాలు చేస్తూ దాఖలు చేసిన కేసులు కూడా అక్కడ పెండింగ్‌లో వున్నాయి. అయినప్పటికీ ఏపి ప్రభుత్వం బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వ పూర్తి అండదండలతో ఈ నిర్మాణం విషయంలో నిర్దాక్షిణ్యంగా ఆదివాసులను తన ఉక్కుపాదాల కింద తొక్కేస్తూ ముందుకు సాగాలని చూస్తోంది.

కేంద్రంలోని, ఆంధ్రప్రదేశ్‌లోని కాంగ్రెస్, టిడిపి, వైఎస్సార్‌సిపి, బిజెపి పార్టీలు దీనికి జాతీయ

హోదా ఇవ్వాలనీ, దీని నిర్మాణాన్ని వేగవంతం చేయాలనీ డిమాండ్ చేస్తూ వచ్చాయి. వారి ఈ 'అసహనానికి' గల ఏకైక కారణం - ఏపిలో నిర్మాణం అయ్యే విశాఖపట్నం-కాకినాడ కారిడార్ వెంబడి నిర్మాణం అయ్యే బహుళజాతి సంస్థలకు చెందిన అసంఖ్యాక ప్రత్యేక ఆర్థిక మండళ్లకూ, పారిశ్రామిక కారిడార్‌లకూ, టూరిజం 'పరిశ్రమ'కూ, ఇంకా యిటువంటి 'అభివృద్ధి' ప్రాజెక్టులకూ నీటిని సప్లై చేయడం, వీటికి అందే ముడుపులతో తమ జేబులు నింపుకోవడం. ఈ ప్రాజెక్టుకయ్యే ఖర్చుల అంచనాల్లో మధ్యమధ్యలో మతిపోయేంత స్థాయిలో పెంపుదలను చేస్తూపోతూ, అందుకనుగుణంగా అవినీతినీ, అక్రమాలనూ కూడా పెంచుకుంటూ పోతున్నారు, పోతారు. కాంట్రాక్టర్ల ముసుగులో వున్న టిడిపి, వైఎస్సార్‌సీపీ, కాంగ్రెస్, బిజెపి లకు చెందిన కుఖ్యాత అవినీతి దురంధర రాజకీయ నాయకులు లేదా రాజకీయ నాయకుల ముసుగులోని బడా కాంట్రాక్టర్లు పోలవరం ఛాంపియన్లుగా పోజు కొట్టడానికి ఊరికే పోటీపడ్డం లేదు. ఈ ప్రాజెక్టు నిర్మాణంలోకి ధారపోసే వేలాది కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని కొల్లగొట్టడానికి వారు పడుతున్న పోటీ అది.

ఇక టిఆర్ఎస్ ఎన్నడూ పోలవరం నిర్మాణాన్ని ఆపడానికి అవసరమైన నిరసనను గానీ, ఒత్తిడిని గానీ చేసింది లేదు. ఈ ప్రాజెక్టు నిర్మాణం టూ-ఇన్-వన్ ఫార్ములాలో భాగంగా ఆంక్షల తెలంగాణ రాష్ట్రాన్ని ఇవ్వడానికి బదులుగా పదేళ్ల ఉమ్మడి రాజధాని, పోలవరం ప్రాజెక్టు వరాలు కోస్తాంధ్ర, రాయలసీమకు కేంద్రం ఇచ్చింది. టిఆర్ఎస్ కూడా ఆదివాసులకు వ్యతిరేకంగా జరిగిన ఈ కుట్రలో భాగస్వామి కాకుంటే ఈ ఫార్ములాను ఎందుకు ఆమోదించినట్టు? అది పోలవరం నిర్మాణం గురించి ఉన్నతస్థాయిలో జరిగిన కుట్ర గురించి ఎందుకు సకాలంలో బహిర్గతం చేయలేదు? ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా గానీ, హైదరాబాదును పదేళ్లపాటు ఉమ్మడి రాజధానిగా చేసే నిర్ణయానికి వ్యతిరేకంగా గానీ పోరాడకపోవడం ప్రజలను పక్కదారి పట్టించడం కాకుంటే మరేమిటి? మూడు లక్షలమంది స్థానిక ఆదివాసీ, ఆదివాసేతర ప్రజలను బలిపశువుల్ని చేసి అది ప్రజలను తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే చాలు ఏది, ఎంత దొరికితే దాంతో సంతృప్తి పడమన్నది. ఘనంగా తెలంగాణ ఏర్పాటు విజయోత్సవాలు జరుపుకుందాం అన్నదే తప్ప తన నిరసన గళాన్ని ఆ సందర్భంగా ఎందుకు విప్పలేదు? నేడు అది పై ఆర్డినెన్సుకు వ్యతిరేకంగా బంద్ పిలుపులు ఇస్తుండవచ్చు కానీ వాస్తవం ఏంటంటే అది దాన్ని వ్యతిరేకించాల్సిన సమయంలో వ్యతిరేకించలేదు. టిఆర్ఎస్ మొసలికన్నీళ్లు సీమాంధ్ర, దేశ, విదేశీ కార్పొరేట్ వలసవాదుల నుండి ప్రజలను తప్పించగలవా? అంతకంటే ముఖ్యంగా అది పోలవరం నిర్మాణాన్ని ఎన్నడూ వ్యతిరేకించింది లేదు. అది నేటికీ కూడా కేవలం దాని డిజైనులో, ఎత్తులో మార్పును మాత్రమే కోరుతోంది. "నేను దాని నిర్మాణానికి వ్యతిరేకం కాదు మహాప్రభో" అని తన కార్పొరేట్ యజమానులకు హామీలివ్వడంలో అది మునిగితేలుతోంది.

దొంగరాత్రి ఒక్క కలంపోటుతో ఏడు మండలాల గ్రామాలను ఆంధ్రప్రదేశ్‌లో కలిపేస్తూ నియంత మోడీ సర్కార్ నిర్ణయాన్ని తిరస్కరిస్తూ స్థానిక ప్రజలు మేం తెలంగాణలోనే భాగమనీ, ఈ ప్రాజెక్టును కట్టద్దనీ గొంతెత్తి నినదిస్తున్నారు. అందువల్ల కేంద్ర ప్రభుత్వ ఆర్డినెన్సును

వ్యతిరేకిస్తున్నామని చెప్పుకునే కేసిఆర్ ప్రభుత్వం ఈ ప్రాంతాన్ని తెలంగాణలోనే అంతర్భాగంగానే గుర్తించి ఈ రాష్ట్ర పౌరులుగానే గుర్తించి పౌర, రాజకీయ, సామాజిక, విద్యా, వైద్య, రవాణా తదితర ప్రజాస్వామిక హక్కులూ, సదుపాయాలూ కల్పించాలనీ, వారిని తెలంగాణలోని మిగతా పౌరులలాగే చూడాలని మా పార్టీ డిమాండ్ చేస్తున్నది. ఈ ప్రాంత ప్రజలతో పాటు ఈ ఉద్యమాన్ని బలపర్చే సంస్థలు, వ్యక్తులు, ప్రజలంతా కూడా ఈ విధంగా డిమాండ్ చేయాలని విజ్ఞప్తి చేస్తున్నది. ఇలా చేయడం ద్వారానే కేసిఆర్ పార్టీ, ఆయన ప్రభుత్వం ఏ పక్షం అనేది తేలిపోతుంది. తెలంగాణలోని ఇతర రాజకీయ పార్టీల విషయంలో కూడా మా పార్టీ వైఖరి ఇదే.

ఇప్పటికే పోలవరం పైన ఆదివాసీ సంఘాలు విశాల ఐక్యసంఘటన ద్వారా పోరాడుతున్నాయి. వీరు పోరాటాల్లోకి రావడంతో అనివార్యంగా ఖమ్మం జిల్లాలోని బూర్జువా, రివిజనిస్టు పార్టీలు కూడా వీరి పోరాటాన్ని నామమాత్రంగా బలపరుస్తున్నాయి. అయితే వీరు ప్రధానంగా 7 మండలాల గ్రామాలను తెలంగాణ నుండి ఆంధ్రప్రదేశ్‌కు బదిలీ చేయడం పైననే మాట్లాడుతూ ఈ ఆందోళనలో పాల్గొంటున్నాయి.

ఈ ముంపు గ్రామాలు ఏ రాష్ట్రానికి చెందుతాయనేదే కాదు, అసలు అవి ఎందుకు ముంపుకు గురి కావాలనేది ముఖ్యమైన ప్రశ్న. స్థానిక, మూలవాసుల, ప్రజల నిర్ణయానికీ, ఆశలకూ, ఆకాంక్షలకూ, అభిప్రాయాలకూ, ప్రయోజనాలకూ విరుద్ధంగా నియంత మోడీ, చంద్రబాబుల ప్రభుత్వాలకే కాదు, ఈ భూమ్మీద ఏ శక్తికీ ఈ ప్రాజెక్టును నిర్మించే, ఈ ప్రాంతాన్ని ఆంధ్రప్రదేశ్‌లో కలిపే అధికారం లేదు. ప్రజలు తమ స్వశక్తి మీద ఆధారపడి బలమైన ఉద్యమాన్ని నడిపితే తప్పక విజయవంతం అవుతారనడంలో సందేహం లేదు. ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని వ్యతిరేకించే ఆదివాసీ, విప్లవ, ప్రజాస్వామిక, దేశభక్త, పర్యావరణ సంబంధ, మానవవిజ్ఞానశాస్త్ర సంబంధ శక్తులు, ఆదివాసీ శ్రేయోభిలాషులు వగైరా అన్ని రకాల వర్గాలు, శక్తులు అన్నీ ప్రజామిత్రులే. ఈ వినాశకర ప్రాజెక్టు నిర్మాణానికి మద్దతునిచ్చే, ఈ ప్రాజెక్టు వల్ల బాధితులయ్యే మూడు లక్షల ఆదివాసుల ప్రయోజనాలకు వ్యతిరేకంగా పని చేసే, దీనిని బలపరిచే ఏ రాజకీయ పార్టీల నాయకులైనా ప్రజాశత్రువులే తప్ప మరొకటి కాలేరు. తెలిసో తెలీకో ఈ ప్రాజెక్టును సమర్థించే ఇతర శక్తులు ప్రజావ్యతిరేక పక్షంలో చేరుతున్నామని అర్థం చేసుకోవాలి.

**ప్రజలారా!**

ఇప్పటికీ దేశవ్యాప్తంగా నిర్మించిన అనేక గత ప్రాజెక్టుల మూలంగా నిర్వాసితులైన వారికి సరైన పునరావాసం లేదు. వారు ఎదుర్కొంటున్న కడగండ్లు (చావు సహా) లెక్కలేనన్నిగా కొనసాగుతూనే వున్నాయి. అదే సమయంలో ఒకవైపు నల్లమల, మన్యం, సరండాల్లో తీవ్ర నిర్బంధం ద్వారా మావోయిస్టు ఉద్యమంపై క్రూరంగా సైనికదాడి చేసి బహుళజాతి కంపెనీల, దేశీయ బడా కార్పొరేట్ల మైనింగ్‌కూ, ఇతర ప్రాజెక్టులకూ అప్పగించిన తీరూ, మరోవైపు నర్మద బచావో, జైతాపూర్, కూడంకుళంలలో అణు ప్రాజెక్టు వ్యతిరేక ఉద్యమాలలో పెల్లుబుకిన ప్రజానిరసనలను ఖాతరు

చేయకుండా, నిర్బంధం ద్వారా ప్రజావ్యతిరేక నిర్ణయాలను అమలు చేస్తున్న తీరూ, పోస్కో, కళింగనగర్ వంటి సమరశీల ప్రజా ఉద్యమాలను కూడా అణచివేస్తూ కార్పొరేట్ అజెండాను అమలు చేస్తున్న తీరూ గమనించినప్పుడు ప్రజలను నెత్తుటి ఏరుల్లో ముంచి అయినా గానీ సామ్రాజ్యవాద, దళారీ ప్రయోజనాలను నెరవేర్చడానికి పాలకవర్గాలు ఎంతకైనా తెగిస్తాయనేది తేటతెల్లమే. ప్రజలంతా ఇది కేవలం పోలవరం ప్రాజెక్టుకు సంబంధించిన సమస్య మాత్రమే కాదనీ, మొత్తం దేశ భవిష్యత్తుకు సంబంధించిన సమస్య అనీ గుర్తించాల్సిన అవసరం మరింతగా వుంది. పోలవరం సందర్భంగా మనమంతా ఐక్యమై పోరాడకపోతే మన ప్రియమైన దేశాన్నీ, మన ప్రజలనూ ఈ పాలకవర్గాలు సర్వనాశనం చేస్తాయి. ప్రపంచంలో యూరోపు వలసవాదులు జరిపిన ఆదివాసీ మానవహననం వంటిదే నేడు మన దేశంలో జరుగుతోంది. తేడా అల్లా పాలకులు మన దేశంవారు కావడమే. ఇదొక అంతర్గత వలసవిధానం వంటిదే.

ఈ ఆర్డినెన్స్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తూనే అసలు మానవ, ప్రాకృతిక మహావిధ్వంసానికి పర్యాయపదమైన ఈ ప్రాజెక్టు నిర్మాణాన్నే ఆపివేయాలని డిమాండ్ చేస్తూ ఉద్యమాన్ని తీవ్రతరం, విస్తృతం, సంఘటితం చేసే విధంగా మనం ప్రజలను కదిలించాలి. ప్రాజెక్టు వ్యతిరేక ప్రజలందర్నీ సమీకరించి విశాల ప్రాతిపదికన చేసే ఐక్య పోరాటం సమరశీల ఉద్యమం ద్వారా మనం దీనిపై తీవ్ర పోరాటాన్ని ఎక్కుపెట్టాలి. ఈ ప్రాజెక్టు నిర్మాణం కోసం మోడీ-చంద్రబాబు ప్రభుత్వాలు తీసుకునే అన్ని ప్రతీఘాతుక నిర్ణయాలకు వ్యతిరేకంగా జరిగే పోరాటాలన్నీ ఈ ఉద్యమంలో భాగంగా కొనసాగించాలి.

ఈ కింది నిర్దిష్ట డిమాండ్లపై ఉద్యమాన్ని నిర్మిస్తూ ఉద్యమ మార్పులకు అనుగుణంగా నూతన డిమాండ్లు రూపొందించుకోవాలి.

1. పోలవరం బహుళార్ధసాధక ప్రాజెక్టు నిర్మాణాన్ని తక్షణం ఉపసంహరించాలి.

2. ఇలాంటి ఏకపక్ష నిర్ణయాలు తీసుకునే అధికారాన్ని తొలగించేలా చట్టాన్ని మార్చాలి.

3. స్థానిక ఆదివాసీ, ఆదివాసేతర ప్రజల ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక హక్కుల అమలుకు పోరాడాలి.

4. ఇంతవరకు ప్రభుత్వాలు కంటితుడుపుగానైనా చేసిన 5వ షెడ్యూల్, పెసా, 1/70, అటవీ హక్కుల చట్టం, భూసేకరణ చట్టాల్లో ఆదివాసులకు అనుకూలమైన అంశాల అమలుకై పోరాడాలి.

5. ఈ ప్రాంతంలో అత్యధిక జనాభా అయిన ఆదివాసీ ప్రజానీకం స్వయం ప్రతిపత్తి కోసం చేసే పోరాటాలతో ఈ ఉద్యమాన్ని అనుసంధానించాలి.

6. ఈ ప్రాంతం తెలంగాణలోనే ఉండాలి తప్ప ఆంధ్రప్రదేశ్‌కు బదిలీ చేయరాదు.

ఇది తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిషా, ఛత్తీస్‌గఢ్ నాలుగు రాష్ట్రాల ప్రజల ఉమ్మడి సమస్య. ఇది ఈ నాలుగు రాష్ట్రాల ప్రజల ఉమ్మడి ఉద్యమంగా వుండాలి. ఎందుకంటే తెలంగాణ దీనికి

కేంద్రస్థానంలో వున్నా, రెండు రాష్ట్రాల తెలుగు ప్రజలపైననే కాకుండా ఒడిషా, ఛత్తీస్‌గఢ్ ప్రజలపై కూడా ఇది వినాశకర ప్రభావాలను చూపుతుంది. ఈ ఉద్యమాన్ని బ్రహ్మాండమైన శక్తిగా మార్చడానికి నాలుగు రాష్ట్రాల్లోనూ ఈ ప్రాజెక్టు బాధిత ఆదివాసీ, ఆదివాసేతర శక్తులు, సంస్థలు అన్నీ సమైక్యం కావాలి. ఇప్పటికే ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో, ఒడిషాలోని మల్కాన్‌గిరి జిల్లాలో ఆందోళనను మొదలుపెట్టిన శక్తులన్నీ మరింత ఉధృతంగా తమ ఆందోళనను కొనసాగించాలి. ప్రాజెక్టు నిర్మాణానికి వ్యతిరేకంగా పోరాడే సంస్థలతో ఇది విశాలమైన ఐక్యసంఘటనను కట్టాలి. ఏడు మండలాల గ్రామాల బదిలీకి వ్యతిరేకంగా పరిమితమై ఇప్పటికే సాగుతున్న ఉద్యమాన్ని ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని వ్యతిరేకించే విశాల ఉద్యమంలో భాగం చేయాలి.

మన సమాజంలో అత్యంత దుర్భర స్థితిగతుల్లో జీవించేలా నెట్టివేయబడిన ఆదివాసులకు వ్యతిరేకంగా ఎక్కుపెట్టిన ఈ మానవకల్పిత మహావిపత్తునీ, ఘోర అన్యాయాన్నీ, వారి హక్కులు, ఆత్మగౌరవం, స్వయం సమృద్ధి, మర్యాదమన్ననలు మొదలైనవాటి ఘోర ఉల్లంఘననూ మీరంతా ముక్తకంఠంతో ఖండిస్తూ ముందుకు రావాలనీ, దీన్ని ఇలాంటి సమస్యలపై దేశంలో కొనసాగుతున్న వివిధ ఉద్యమాలను సమైక్యం చేసి, దేశవ్యాప్త విశాల ఉద్యమంగా మలచాలనీ నాలుగు రాష్ట్రాల ప్రజలకూ, దేశ ప్రజలకూ సిసి, సిపిఐ (మావోయిస్టు) విజ్ఞప్తి చేస్తున్నది.

దేశంలోని కార్మికులు, కర్షకులు, ఆదివాసులు, విద్యార్థులు, యువజనులు, కవులు, కళాకారులు, మేధావులు, జర్నలిస్టులు, టీవీ-సినిమా కళాకారులూ, ప్రభుత్వ-ప్రైవేటు ఉద్యోగులు, వ్యాపారస్తులు, దళితులు, మైనారిటీలు, మహిళలు పెద్దెత్తున ఈ ఉద్యమానికి మద్దతుగా కదలాలని విజ్ఞప్తి చేస్తున్నాం. మూలవాసుల హక్కుల కోసం కశ్మీరు, ఈశాన్య జాతివిముక్తి పోరాటకారులు దీనికి మద్దతు పలకాలని ప్రత్యేకించి మా కేంద్రకమిటీ, సిపిఐ (మావోయిస్టు) విజ్ఞప్తి చేస్తున్నది.

తెలంగాణ ప్రభుత్వంతో పాటు ఈ ప్రాజెక్టును వ్యతిరేకిస్తున్నామని చెప్పుకుంటున్న ఒడిషా, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వాలు తమ, తమ రాష్ట్రాల ప్రజల ప్రయోజనాలను తుంగలో తొక్కుతున్న, ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధంగా వున్న కేంద్ర ప్రభుత్వ ఫాసిస్టు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ప్రజలపక్షాన గట్టిగా నిలబడాలని మా పార్టీ డిమాండ్ చేస్తున్నది. ఈ విషయంలో ఇవి మోడీ-చంద్రబాబు ప్రభుత్వాలతో మోసపూరిత రాజీలకు పాల్పడితే ప్రజాగ్రహానికి గురి కాక తప్పదని మా పార్టీ హెచ్చరిస్తుంది.

పెద్ద ఆనకట్టల వంటి ప్రజావ్యతిరేక, పర్యావరణ విధ్వంసకర నిర్మాణాలను వ్యతిరేకించే అన్ని అంతర్జాతీయ శక్తులకూ, మూలవాసుల హక్కుల కోసం పోరాడేవారందరూ పోలవరం ప్రాజెక్టు ముంపు ప్రజల ఉద్యమానికి మద్దతుగా నిలవాలనీ, అంతర్జాతీయ స్థాయిలో సాధ్యమైనంత వత్తిడిని తేవాలనీ మా పార్టీ విజ్ఞప్తి చేస్తున్నది.

సిసి, సిపిఐ (మావోయిస్టు) తన మొత్తం శ్రేణులకూ, పీఎల్‌జీఏకూ, విప్లవోద్యమ ప్రాంతాలలోని విప్లవ, ప్రజాస్వామిక సంస్థలకూ, ప్రజలకూ ఈ ఉద్యమాన్ని బలపర్చాలనీ, అందులో క్రియాశీల

పాత్ర వహించాలనీ, ముందుపీఠిన నిలవాలనీ పిలుపునిస్తోంది. ఉద్యమశక్తులన్నిటినీ, ప్రజలనూ సమైక్యం చేయడానికి పాటుపడాలనీ పిలుపునిస్తున్నది. ప్రజల ప్రయోజనాలకే మొట్టమొదటి ప్రాధాన్యతనిచ్చే మన పార్టీ ఈ ప్రజాఉద్యమాన్ని ఒక విశాల, సమరశీల, సమైక్య ఉద్యమంగా అభివృద్ధి చేయడానికి కృషి చేయాలనీ, దేశవ్యాప్తంగా వివిధ ఉద్యమాలు దీనికి మద్దతుగా నిలబడేలా కృషి చేయాలనీ, పాలకవర్గాలు కొనసాగించే దేశ వినాశకర విధానాలకు వ్యతిరేకంగా జరిగే ప్రజాస్వామిక విప్లవోద్యమంలో అంతర్భాగంగా ఈ ఉద్యమంలోకి విశాల ప్రజలను కూడగట్టాలనీ కోరుతున్నది. ప్రపంచవ్యాప్తంగా సాగుతున్న విశాల సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంలో దీన్ని అంతర్భాగం చేయడానికి కృషి చేయాలి.

**అభయ్**

**అధికార ప్రతినిధి**

**కేంద్ర కమిటీ**

**సీపీఐ (మావోయిస్టు)**

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# కేంద్ర కమిటీ

**30-7-2014**

## జియోనిస్టు ఇజ్రాయెల్ గాజా మీద దాడి చేసి పాలస్తీనీయులను ఊచకోత కోయడాన్ని ఖండించండి !

## పాలస్తీనా విముక్తి కోసం వీరోచితంగా పోరాడుతున్న పాలస్తీనా ప్రజల జాతి విముక్తి పోరాటాన్ని ఎత్తిపట్టండి !!

జియోనిస్టు ఇజ్రాయెల్ గాజా మీద దూకుడుగా దాడిచేసి పిల్లలు, ముసలివారితో సహా 1200 మంది పాలస్తీనీయులను ఊచకోత కోయడాన్ని సి.పి.ఐ.(మావోయిస్టు) కేంద్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తోంది. గాజా మీద దుర్మార్గమైన ఆర్థిక దిగ్బంధాన్నీ, ఇజ్రాయెల్ మిలటరీ దాడులను వెంటనే ఆపివేయాల్సిందిగా డిమాండ్ చేస్తోంది. అనన్య త్యాగాలతో పాలస్తీనీయులు సాగిస్తున్న సాయుధ ప్రతిఘటనను కేంద్ర కమిటీ అభినందిస్తోంది.

అన్ని పాలస్తీనా భూభాగాలను కలుపుతూ ఒక జాతీయ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని హమాస్, ఆల్‌ఫతాలు ఇటీవల చేసుకున్న ఒప్పందాన్ని ఖాతరు చేయకుండా ఈ ఇజ్రాయెల్ దాడి కొనసాగుతోంది. అరబ్ ప్రపంచంలో కొనసాగుతున్న అనైక్యత, షియా, సున్నీ తెగల మధ్య కొనసాగుతున్న విద్వేషాలు సిరియా, ఇరాక్‌ల మధ్య ఘర్షణ రూపాన్ని తీసుకుంటున్న నేపథ్యాన్నీ ఉపయోగించుకొని ఇజ్రాయెల్ పాలస్తీనాపై దాడులు కొనసాగిస్తోంది. పశ్చిమాసియాలో అమెరికా సామ్రాజ్యవాదానికి జూనియర్ పార్టనర్‌గా ఉండి, అమెరికా మరియు యూరోపియన్ సామ్రాజ్యవాద శక్తుల మద్దతును ఇజ్రాయెల్ పొందుతోంది.

పాలస్తీనా ప్రజల డిమాండ్లను సమర్థిస్తున్నామంటూ, అదే సమయంలో ఇజ్రాయెల్‌తో సంబంధాల్ని కూడా బలోపేతం చేసుకుంటూ పార్లమెంటులో ప్రభుత్వం తరఫు నుంచి విదేశాంగమంత్రి సుష్మా స్వరాజ్ ఒక ద్వంద్వ వైఖరితో కూడిన ప్రకటన చేసింది. ఈ విధమైన ప్రకటనలు ఇజ్రాయెల్ దాడికి బహిరంగ మద్దతునూ, పాలస్తీనా ప్రజల పోరాటాన్ని తూట్లు పొడిచేందుకూ తోడ్పడతాయి. జనరల్‌గా భారత పాలకవర్గాలు ఇజ్రాయెల్‌కి అనుకూలురే అయినప్పటికీ, ముఖ్యంగా నేటి బిజెపి నాయకత్వంలోని బ్రాహ్మణీయ హిందూ ఫాసిస్టు ముఠా, ముస్లిం వ్యతిరేక దురహంకార, విస్తరణవాద ఇజ్రాయెల్‌కు సైద్ధాంతికంగా అత్యంతసమీప బంధువు. భారతదేశం ఇజ్రాయెల్‌తో సన్నిహిత సంబంధాల్ని నెరపుతోంది. ఇజ్రాయెల్ నుండి మిలటరీ ఉపకరణాల్ని పెద్దయెత్తున దిగుమతి చేసుకుంటోంది. 'ఇస్లామిక్

టెర్రరిజాన్నీ' మరియు 'మావోయిస్టుల' నాయకత్వంలో జరుగుతున్న విప్లవ పోరాటాన్నీ దెబ్బతీయాలనే పథకంతో నిత్యం ఇజ్రాయెల్‌తో కొనసాగుతున్న జాయింట్ సైనిక ఎక్సర్‌సైజులు, భారత సైన్యానికీ, పోలీస్‌కు ఇజ్రాయెల్ శిక్షణ నివ్వటం, గూఢచార సమాచార సేకరణలో నైపుణ్యాన్ని సంపాదించటం వీటిలో భాగమే. మొన్నటిదాకా ఇజ్రాయెల్‌తో ఆర్థిక, దౌత్యపరమైన సన్నిహిత సంబంధాల్ని కొనసాగించిన కాంగ్రెస్ పార్టీ నేడు ఎన్.డి.ఏ. ప్రభుత్వం ఇజ్రాయెల్ చర్యల్ని ఖండించలేదంటూ గొంతు చించుకుంటోంది.

అన్ని విప్లవ మరియు ప్రజాతంత్ర సంస్థలూ, పీడిత జాతులు, మైనారిటీ మతాల మరియు ముస్లిం సంస్థలు, అన్ని రాజకీయ పార్టీలకు చెందిన స్వేచ్ఛను కోరే శాంతికాముక ప్రజలూ మరియు మన దేశ ప్రజలంతా పాలస్తీనా ప్రజలకు సంఘీభావంగా నిలబడి భారత ప్రభుత్వం అనుసరిస్తున్న ఇజ్రాయెల్ అనుకూల విధానాన్ని గట్టిగా వ్యతిరేకించాలని మేము విజ్ఞప్తి చేస్తున్నాం. అన్ని దేశాలకు చెందినమావోయిస్టు విప్లవ సంస్థలూ, సామ్రాజ్యవాద వ్యతిరేక సంస్థలూ, జాతి విముక్తి పోరాట సంస్థలూ, స్వేచ్ఛను కోరే శాంతికాముక ప్రజలంతా ముక్తకంఠంతో సమైక్యంగా ఇజ్రాయెల్ కొనసాగిస్తున్న దురాక్రమణ యుద్ధాన్ని వ్యతిరేకించాల్సిందిగా, పాలస్తీనా ప్రజల న్యాయమైన పోరాటాన్నిసమర్థించాల్సిందిగా మేము విజ్ఞప్తి చేస్తున్నాం.

**అభయ్**

**అధికార ప్రతినిధి**

**కేంద్ర కమిటీ**

**సీపీఐ (మావోయిస్టు)**

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# కేంద్ర కమిటీ

**28-8-2014**

## సీనియర్ మావోయిస్టు నేత కామ్రేడ్ కోబాడ్ గాంధీపై వేధింపులను తక్షణమే నిలిపివేయాలి !
## సీనియర్ మావోయిస్టు రాజకీయ ఖైదీలందరినీ బేషరతుగా విడుదల చేయాలి !

సీనియర్ మావోయిస్టు కామ్రేడ్ కోబాడ్ గాంధీని 2009 సెప్టెంబర్ 17న ఢిల్లీ నగరంలో ఆంధ్రప్రదేశ్, ఢిల్లీ ఇంటెలిజెన్స్, పోలీసులు ఒక బహిరంగ ప్రదేశం నుండి ఎత్తుకుపోయి, మూడు రోజుల పాటు చట్టవిరుద్ధ కస్టడీలో ఉంచి ఇంటరాగేషన్ పేరుతో తీవ్ర మానసిక హింసకు గురి చేశారు. వివిధ పౌరహక్కుల, ప్రజాస్వామిక సంఘాల నుండి తీవ్రమైన నిరసనలూ, ఆందోళనలూ చేపట్టాకే సెప్టెంబర్ 21న కోర్టులో ప్రవేశపెట్టారు. అప్పటి కేంద్ర హోంమంత్రి చిదంబరం నిస్సిగ్గుగా ఆయనను 20న అరెస్టు చేసినట్టుగా, '24 గంటల్లోపే ఆయనను కోర్టులో ప్రవేశపెట్టినట్టు'గా పచ్చి అబద్ధాలు కూశాడు. అరెస్టు అయ్యాక ఆయనకు చాలా రోజుల వరకూ తన మందులను అందజేయడం గానీ, ఆయనకు ప్రాణహాని వున్నటువంటి జబ్బులున్నప్పటికీ వాటికి చికిత్స చేయించడం గానీ ఏదీ చేయకుండా రాజ్యం ఆయనను నిర్దాక్షిణ్యంగా వేధించింది.

కామ్రేడ్ కోబాడ్‌ను అరెస్టు చేసి ఇప్పటికి ఐదేండ్లు అవుతోంది గానీ ఆయనకు ఎటువంటి బెయిల్స్ ఇవ్వకుండా తప్పుడు కేసుల్లో ఇరికించి రాజ్యం ఆయన విడుదలను అడ్డుకుంటూ వస్తోంది. 70వ పడిలోకి ప్రవేశిస్తున్న ఆయనకు రక్తపోటు, గుండెజబ్బు, తీవ్రమైన ఇరిటబుల్ బవెల్ సింఢ్రోమ్ (జీర్ణకోశ సంబంధిత వ్యాధి), సెర్వైకల్ స్పాండిలైటిస్, లుంబర్ స్పాండిలోసిస్, దీర్ఘకాల ప్రోస్టేట్ గ్రంథి వ్యాధి మొదలైన తీవ్రమైన శారీరక సమస్యలున్నాయి. ఆయన వయస్సు, శారీరక స్థితుల పట్ల తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ, చట్టప్రకారం ఆయనకు అందాల్సిన కనీస సౌకర్యాలను కూడా కల్పించకుండా కేంద్ర, రాష్ట్ర ఇంటలిజెన్స్ అధికారులు, జైలు అధికారులు, న్యాయవ్యవస్థ ఆయనను వేధింపులకు గురి చేస్తున్నారు. ఇదంతా ఆయన ఆరోగ్యాన్ని దెబ్బతీయడానికే కుట్రపూరితంగా చేస్తున్నారు. తన సోదరి

పంపే ఆరోగ్య సంబంధితమైన వస్తువులు గానీ, కుర్చీ, టేబుల్, మంచం, పుస్తకాలు, కలం, నోటుబుక్కులు వంటివి గానీ ఆయన ఎంతో పోరాడితే గానీ అందుబాటులోకి రాలేదు. ఇవి కూడా జైలు అధికారులు వెయ్యి కళ్లతో పరిశీలించే ఇస్తారు.

2013 ఫిబ్రవరిలో అఫ్జల్ గురుని రహస్యంగా ఉరి తీసేశాక (అసలు ఈ ఘటనే భారత న్యాయవ్యవస్థపై ఒక చెరిగిపోని మచ్చ) ఢిల్లీలోని తీహార్ కారాగారంలోని జైలు నెంబర్.3లోని హైరిస్క్ వార్డు నుండి ఖైదీలందరినీ వేరే జైలుకు తరలించారు. దాన్ని కామ్రేడ్ కోబాడ్ ఎంతో ప్రతిఘటించినప్పటికీ ఆయనను జైలు నెంబర్.1కు బలవంతంగా మార్చారు. అంతే కాదు, అలా తరలించేటప్పుడు కనీసమైన మానవత్వాన్ని కూడా ప్రదర్శించకుండా శారీరక సమస్యలున్న ముసలాయనతోనే ఆయన వస్తువులన్నిటినీ మోయించారు. దానితో అనేక వారాల పాటు ఆయన లేవలేని స్థితి ఏర్పడింది. ఆయనకు రోజువారీ పనులు చేసుకోవడం కష్టమవుతున్నప్పటికీ బకెట్లలో నీళ్లు మోసుకోవాల్సి రావడం, వంగుని బట్టలు ఉతుక్కోవడం వంటి పనుల్లో ఆయనకు సహాయకుల్ని కూడా కనీసంగా ఇవ్వకుండా తన అమానుషత్వాన్ని రుజువు చేసుకుంటున్నారు అధికారులు.

జైలును మార్చిన ప్రతిసారీ ఆయన తిరిగి రోజువారీ అవసరాలకు సంబంధించి అనేక విజ్ఞప్తులు చేసుకోవాల్సి రావడం, ఎన్నో రోజులకు గానీ ఒక్కొక్కటీ అందడం లేదా అసలు అందకపోవడం వంటి రూపాల్లో కూడా వేధింపులు కొనసాగుతున్నవి. తీహార్ జైలులోని సీనియర్ సిటిజన్ల వార్డుకు తనను తరలించమని ఆయన చేసుకున్న విజ్ఞప్తిని తిరస్కరించడమే కాక, మరోసారి మరొక జైలుకు పై విధంగా తరలిస్తే తాను ఇక తేరుకోవడం చాలా కష్టమని ఆయన ఎంతో స్పష్టంగా చెప్పినప్పటికీ మళ్లీ 2014 జులైలో ఆయనను జైలు నెంబర్.2కు తరలించ ప్రయత్నించారు. దాంతో ఆయన నిరాహార దీక్షకు కూర్చోక తప్పలేదు. ఆయనను బలవంతంగా జులై 16న జైలు నెంబర్.2కు స్ట్రెచర్‌పై తరలించారు.

సిపిఐ (మావోయిస్టు) పొలిట్‌బ్యూరో సభ్యుడు కామ్రేడ్ సుశీల్ రాయ్ (బరున్‌దా) ఆరోగ్యం విషయంలో రాజ్యం దారుణమైన నిర్లక్ష్యం చూపడం వల్లే 2014 జూన్ 18న తీవ్ర అనారోగ్యంతో ఆయన మరణించిన నేపథ్యంలో కామ్రేడ్ కోబాడ్ పరిస్థితి ఆందోళనకరంగా ఉందనేది తేటతెల్లమే. 50, 60, 70వ పడిలో వున్న, తీవ్ర ఆరోగ్య సమస్యలు వున్న అనేకమంది సీనియర్ పార్టీ నేతల విషయంలో రాజ్యం ఇలాగే చాలా క్రూరంగా, అమానవీయంగా ప్రవర్తిస్తూ వారిని జైలులోనే త్వరగా చనిపోయేలా చేయడానికి కుట్ర పన్నుతోంది. సంవత్సరాల తరబడి వారిని జైలులోనే మగ్గిపోయేలా చేస్తోంది. బెయిల్స్ రానీయడం లేదు, వచ్చినా వెంటనే కొత్త కేసులు పెట్టి వారిని జైలు గేటు బయటనే తిరిగి

అరెస్టు చేసి లోపలకు తోస్తోంది. కామ్రేడ్స్ నారాయణ్ సన్యాల్, భూపేష్‌దా, పరేష్‌దా, సాహెబ్‌దా, చింతన్‌దా, షీలాదీదీ, అమిత్ బాగ్చీ ప్రమోద్ మిశ్రా, బచ్చా ప్రసాద్ సింగ్, చంద్రశేఖర్ రెడ్డి, ఎల్‌ఎస్‌ఎన్ మూర్తి, పతిత్ పావన్ హల్దార్, వారణాసి సుబ్రహ్మణ్యం వంటి ఎందరో సీనియర్ పార్టీ నేతలను వారి వృద్ధాప్యాన్ని, ఆరోగ్య సమస్యలను ఏమాత్రం పరిగణనలోకి తీసుకోకుండా వేధింపులకు గురి చేస్తున్నారు. జి ఎన్ సాయిబాబా వంటి మేధావులను కూడా 90 శాతం వికలాంగత వున్నప్పటికీ చట్టాలను తుంగలో తొక్కి ఎటువంటి సౌకర్యాలు ఇవ్వకుండా వేధిస్తున్నారు. ఇక సామాన్యులైన ఆదివాసులు, దళితులు, మహిళలు వేలాదిగా నేడు దేశంలోని డజన్ల కొద్దీ జైళ్లలో ఎటువంటి సౌకర్యాలు, సహాయం లేక, పోలీసు-జైలు అధికారుల దౌర్జన్యానికీ, న్యాయవ్యవస్థ అన్యాయాలకూ బలైపోతూ ఏండ్ల తరబడి మగ్గిపోతున్నారు. కొందరు అక్కడే తుదిశ్వాస విడుస్తున్నారు.

ఇప్పుడిక మోడీ నాయకత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం ఆధ్వర్యంలో న్యాయవ్యవస్థ నరహంతకులైన అమిత్‌షా వంటి వారికి క్లీన్‌చిట్‌లు ఇస్తూ, వారికి జెడ్ ప్లస్ సెక్యూరిటీలు కల్పిస్తూ వారి అకృత్యాలన్నిటికీ న్యాయసమ్మతిని సృష్టిస్తోంది. రాజకీయ ఖైదీల విషయంలో గానీ, సామాన్య ఖైదీల విషయంలో గానీ ఎస్కార్ట్ లేదనే కుంటిసాకులతో, నామమాత్రమైన కేసులను కూడా ఏండ్ల తరబడి సాగలాగుతూ వారిని వేధిస్తోంది. ఖైదీలకు న్యాయంగా దక్కాల్సిన ఎటువంటి సౌకర్యాలను కల్పించడం లేదు. కక్షపూరితంగా వ్యవహరిస్తోంది.

కామ్రేడ్ కోబాడ్ గాంధీని ప్రత్యేకంగా టార్గెట్ చేసి జైలు అధికారుల ద్వారా రాజ్యం చేస్తున్న వేధింపులను తక్షణం నిలుపుచేయాలనీ, ఆయనను బేషరతుగా తక్షణం విడుదల చేయాలని అన్ని విప్లవ, ప్రజాస్వామిక, పౌరహక్కుల సంస్థలనూ, శక్తులనూ, న్యాయవాదులనూ సమైక్యంగా, దృఢంగా పోరాడాల్సిందిగా సిపిఐ (మావోయిస్టు) కేంద్రకమిటీ విజ్ఞప్తి చేస్తున్నది. ఆయన వలెనే ఏండ్ల తరబడి జైళ్లలో మగ్గిపోతున్న పైన పేర్కొన్న సీనియర్ పార్టీ నేతలందరి విడుదల కోసం, వారందరికీ రాజకీయ ఖైదీలుగా గుర్తింపునివ్వడం కోసం ప్రజలందరినీ ప్రజాందోళనలు కొనసాగించాల్సిందిగా, ప్రభుత్వాలపై, న్యాయవ్యవస్థపై తీవ్రమైన ఒత్తిడి తేవాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నది.

**అభయ్**

**అధికార ప్రతినిధి, కేంద్ర కమిటీ**

**సీపీఐ (మావోయిస్టు)**

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# కేంద్ర కమిటీ

**29-8-2014**

## సీనియర్ కమ్యూనిస్టు మరియు ప్రజానాయకుడు కామ్రేడ్ ఎం.టి.ఖాన్‌కు అరుణారుణ శ్రద్ధాంజలి !

ఆంధ్రప్రదేశ్ (ఈనాటి తెలంగాణాతో సహా)లో విప్లవ రచయితల మరియు పౌరహక్కుల ఉద్యమ స్థాపకులలో ఒకరైన కామ్రేడ్ ఎం.టి.ఖాన్ ఆగస్టు 20, 2014న తుదిశ్వాస విడిచారు. ఆయన మరణంతో సి.పి.ఐ. (మావోయిస్టు) పార్టీ నాయకత్వంలో నడుస్తున్న భారత విప్లవోద్యమంతో చేయి చేయి కలిపి నడిచే ఒక మిత్రుణ్ణి మరియు పీడిత ప్రజల పక్షాన తన వాణిని వినిపించే ఒక గొప్ప వ్యక్తిని కోల్పోయింది. సి.పి.ఐ.(మావోయిస్టు) పార్టీ కేంద్రకమిటీ ఆయనకు వినమ్రంగా తలవంచి శ్రద్ధాంజలి అర్పిస్తోంది. ఆయన కుటుంబ సభ్యులకూ, మిత్రులకూ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేస్తోంది. ఆయనను కోల్పోయి దుఃఖంలో మునిగి ఉన్న ప్రజాస్వామిక మరియు విప్లవ సంస్థల దుఃఖంలో పాలుపంచుకుంటోంది.

ఖాన్ సాబ్ అని ప్రేమగా పిలువబడే మహమ్మద్ తాజుద్దీన్ హైద్రాబాద్‌లోని పురానాపూల్ దర్వాజా వద్ద 1935లో జన్మించారు. సిటీ కాలేజీలో హైస్కూల్ పూర్తిచేసి వివేక వర్ధని కాలేజీలో పి.యు.సి. కోర్సు పూర్తి చేశారు. ఉస్మానియా యూనివర్సిటీలో బి.ఏ.లో చేరినప్పటికీ ఆర్థిక పరిస్థితి వలన ఆయన బి.ఏ. కోర్సును పూర్తి చేయలేకపోయాడు. తెలంగాణాలో ఆరోజు కొనసాగిన కమ్యూనిస్టు రైతాంగ మరియు విద్యార్థి ఉద్యమాలకు ప్రభావితమై యుక్తవయస్సులోనే కమ్యూనిజం వైపుకు ఆకర్షితులైనారు. ఆయన సి.పి.ఐ. పార్టీలో కార్యకర్తగా చేరారు. తెలంగాణా సాయుధ పోరాటంలో హైద్రాబాద్‌కు చెందిన గొప్ప నాయకుడూ, కవీ కా. మగ్దూం మహియుద్దీన్‌కు ఈయన కొరియర్‌గా పనిచేశాడు. చివరి వరకూ ఆయన ప్రభావం ఈయనపై ఉంది. అభ్యుదయ రచయితల సంఘంలో చేరి సాహిత్య రంగంలో పనిచేశారు.

1964లో సి.పి.ఐ., సి.పి.ఎం.లుగా విడిపోయినప్పుడు విప్లవకాంక్షతో ఆయన సి.పి.ఎం.లో చేరారు. సి.పి.ఎం. రివిజనిస్టు పంథా చేపట్టటంతో ఆయన ఆశలు అడియాసలయ్యాయి. 1967లో నక్సల్బరీ పోరాటం మరియు 1968లో శ్రీకాకుళ సాయుధ పోరాటాలు పెల్లుబుకటంతో ఆయన సి.పి.ఎం.ని వదిలి నిస్సంకోచంగా నక్సల్బరీ మార్గాన్ని ఎన్నుకున్నారు. ఒకసారి సరైన మార్గాన్ని ఎంచుకున్న తర్వాత ఎటువంటి ఊగిసలాటలు లేకుండా చివరి వరకూ అదే మార్గంలో కొనసాగారు.

1972లో కా. చారు మజుందార్ అమరత్వం తర్వాత ఉద్యమం సెట్‌బ్యాక్‌కి గురైంది.

ఆ సందర్భంలో భారతదేశ వ్యాప్తంగానూ, ఆంధ్రప్రదేశ్‌లోనూ పార్టీ నాయకత్వం ఉద్యమ పునరుద్ధరణకు ప్రయత్నాలు చేసింది. ఆ సందర్భంలో పార్టీ పంథా వైపు గట్టిగా నిలబడి పార్టీ నాయకత్వానికి సహకరించిన కొద్దిమంది వ్యక్తుల్లో ఖాన్‌సాబ్ ఒకరు. 1972లో ఆంధ్ర రాష్ట్ర కమిటీ 'పిలుపు' పత్రికను ప్రచురించాలని నిర్ణయించింది. ఆ సమయంలో అనేక ప్రమాదాలను ఎదుర్కొని కూడా పిలుపు పత్రిక ప్రచురణకర్తగా ఖాన్‌సాబ్ ఆ బాధ్యతను తీసుకున్నారు. పిలుపు పత్రిక ద్వారా దీర్ఘకాల ప్రజాయుద్ధానికి కార్యకర్తలను కూడగట్టేందుకు వీలుగానూ, చారు మజుందార్‌ని వ్యక్తిగతంగా అప్రదిష్టపాలు చేసే మితవాద అవకాశవాద దాడులకు వ్యతిరేకంగా మరియు నక్సల్బరీ, శ్రీకాకుళ పోరాటాలను విచ్ఛిన్నం చేసే రాజకీయాలకు వ్యతిరేకంగానూ ఒక మహత్తర రాజకీయ, సైద్ధాంతిక పోరాటాన్ని కొనసాగించారు. ఆ కాలంలో తీవ్రమైన ప్రభుత్వ అణచివేతకు తట్టుకోలేక ఎంతోమంది ఉద్యమాన్ని వదిలి వెళ్లిపోయారు. కొంతమంది మితవాద అవకాశవాదంతో ఉద్యమం మీద దాడిచేశారు. కొంతమంది విచ్ఛిన్నకర కార్యకలాపాలకు పాల్పడ్డారు. అటువంటి కష్టభూయిష్టమైన పరిస్థితిలో ఖాన్‌సాబ్ లాంటి వ్యక్తులు నిర్వహించిన పాత్రను కీర్తించాల్సిందే.

1973లో ఆయనను మీసా కింద అరెస్టు చేశారు. 1974లో సికింద్రాబాద్ కుట్రకేసులో ఇరికించారు. ఎమర్జెన్సీ కాలంలో ఆయన జైల్లో ఉన్నారు. ఆయన జైల్లో ఉన్న కాలంలో తోటి రాజకీయ ఖైదీలతో విప్లవోత్తేజంతో సజీవ సంబంధాలు కొనసాగించారు. ఉద్యమం వెనుకంజ వేసిన ఆ రోజుల్లో రాజకీయ, సైద్ధాంతిక పోరాటాలకూ, చర్చలకూ జైళ్లు కేంద్రాలుగా ఉన్నాయి. ఆ గందరగోళ పరిస్థితుల్లో సరైన మార్గాన్ని ఎంచుకోవటం మామూలు విషయం కాదు. ఈ రాజకీయ సైద్ధాంతిక చర్చలూ, పోరాటాల్లో నుండే ఆయన రాటుదేలారు.

1970 జులైలో విరసం స్థాపనలో ఒకరిగా ఉండి, హైద్రాబాద్‌లో 1971లో మొదటి విరసం మహాసభను నిర్వహించారు. నక్సల్బరీ, శ్రీకాకుళ పోరాటాలను, మార్క్సిజం-లెనినిజం-మావోయిజం సిద్ధాంతాన్ని విరసం దీటుగా ప్రచారం చేసింది. ఎం.టి.ఖాన్ ఈ మొత్తం కార్యక్రమంలో ఒకరుగా ఉన్నారు. 1974లో ఏ.పి.సి.ఎల్.సి. వ్యవస్థాపక సభ్యులలో ఒకరుగా ఉండి పౌరహక్కుల ఉద్యమం ఆంధ్రలోనూ, భారతదేశవ్యాప్తంగానూ వ్యాప్తి చెందటానికి తనవంతు కృషి చేశారు. వెంగళరావు ప్రభుత్వం బూటకపు ఎన్‌కౌంటర్లనూ, శ్రీకాకుళ పోరాటాలను అణచివేసేందుకు ఆదివాసీ ప్రజలపై లెక్కలేనన్ని ఘోరకృత్యాలను చేస్తుండిన ఆరోజుల్లో ఏ.పి.సి.ఎల్.సి.ని స్థాపించడం చాలా ప్రాధాన్యత కలిగిన విషయం. దీని నిర్మాణంలో ఈయన విశేష కృషి చేసి 1992 నుంచి 1998 వరకు ఏ.పి.సి.ఎల్.సి. అధ్యక్షునిగా పనిచేశారు.

సి.పి.ఐ., సి.పి.ఎం.ల నేతృత్వంలో ప్రజాసంఘాలు సంస్కరణవాద ఊబిలో కూరుకుపోయిన కారణంగా నక్సల్బరీ పోరాటంలో ప్రజాసంఘాలను స్థాపించలేదు. తర్వాత దీనిని సమీక్షించుకొని ఆంధ్రప్రదేశ్‌లో వాటిని నిర్మించటం ప్రారంభమైంది. ఆ క్రమంలో నక్సల్బరీ, శ్రీకాకుళ పోరాటాలను సమర్థించే రచయితలూ, ప్రజాస్వామికవాదులతో విరసం, ఏ.పి.సి.ఎల్.సి. నిర్మాణం చేయటం జరిగింది. సి.పి.ఐ., సి.పి.ఎం.ల సంస్కరణవాద మరియు మితవాద అవకాశవాదాల్లో కూరుకు పోకుండా ఈ సంఘాలను సజీవంగా ఉంచేందుకు దృఢదీక్ష

మరియు సామర్థ్యం కలిగిన వారితో వీటిని నిర్మించి ఆచరణలో వీటిని రాటుదేలేలా చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు ప్రజల విప్లవ ప్రజాస్వామిక చైతన్యాలను పెంచటంలో ఈ సంఘాలు ఎనలేని కృషి చేశాయి. దానిలో ఖాన్‌సాబ్ పాత్ర మరువలేనిది.

ఇండో-చైనా మిత్రమండలిలో చైనా సోషలిస్టు దేశంగా కొనసాగినంతకాలం ఆయన దానిలో సభ్యునిగా ఉండి రివిజనిస్టుగా మారిన తర్వాత దాని నుండి వైదొలిగారు. హైద్రాబాద్‌లో మతఘర్షణలకు వ్యతిరేకంగా ఏర్పాటు చేసిన అనేక వేదికలకు ఆయన నాయకత్వం వహించారు. ఎన్‌కౌంటర్లకు వ్యతిరేకంగానూ, రాజకీయ ఖైదీలను విడుదల చేయాలనే ఉద్యమాల్లోనూ, ప్రభుత్వ దమనకాండకు వ్యతిరేకంగానూ, ప్రత్యేక తెలంగాణా ఉద్యమంలోనూ మరియు ప్రజల ప్రజాస్వామిక హక్కుల కోసం జరిగిన అనేక ఉద్యమాలలో ఆయన ముందు నడిచారు.

పౌరహక్కుల, కళా, సాహిత్య మరియు నాటక రంగాల్లో ఆయనకు ఆసక్తి ఉండేది. మరియు ఆ రంగాల్లో ఆయన విశేష కృషి చేశారు. ఆయన అనేక కవితలు, వ్యాసాలు రాశారు. ఉర్దూ నుండి చాలా అనువాదాలు చేశారు. హైద్రాబాద్‌లో ముస్లిం ప్రజల్లో విప్లవ రాజకీయాల ప్రచారం కోసం అనేక కరపత్రాలను ఉర్దూలో రాసి ప్రచారం చేశారు. సియాసత్ వంటి ఉర్దూ పత్రికకు, న్యూస్ టైమ్ వంటి ఆంగ్లపత్రికలకూ చారిత్రక భౌతికవాద దృక్పథంతో అనేక విషయాలను విశ్లేషిస్తూ వ్యాసాలను రాశారు.

ఆరు దశాబ్దాలుగా ప్రజాజీవనంలో ఉండి అనేక బాధ్యతలు నిర్వహించారు. ఉద్యమ మలుపులలో కీలకమైన పాత్రను పోషించారు. కమ్యూనిస్టు సమాజ స్థాపన కోసం ఆయన కష్టభూయిష్టమైన ఈ పనులను నిర్వహించారు. విరసం, ఏ.పి.సి.ఎల్.సి.లకు మూలస్తంభంలా ఉండటమే గాక ఆంధ్ర, తెలంగాణాలలో అనేక విప్లవ ప్రజాస్వామిక సంఘాలకూ, ఉద్యమాలకూ ప్రేరణగా ఉండి యువతరాన్ని ఉత్తేజపరిచారు. ఆయనకు సమకాలికులుగా ఉండి అనేక మంది ఉద్యమాల్లో చేరి ప్రభుత్వ అణచివేత, కుటుంబ సమస్యలు లాంటి సమస్యలతో సతమతమై మార్క్సిస్టు సిద్ధాంతం మీదే సందేహాలేర్పడి ఉద్యమాలను వదిలి వెళ్లి స్వార్థపరులుగా మారారు. కాని ఖాన్‌సాబ్ ఎటువంటి శషభిషలు లేకుండా తాను నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి చివరిదాకా ఉద్యమంలో కొనసాగారు. ఆంధ్ర, తెలంగాణాలలో వరుసగా ఎన్‌కౌంటర్లు జరిగి నాయకత్వాన్ని నష్టపోయిన గత దశాబ్దకాలంలో ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తల నుండి ఎంతో ఓర్పుతో ఉండి కొద్దిగా పరిస్థితులు అనుకూలించినప్పుడు ఆ పరిస్థితులను ఉపయోగించుకునే నేర్పును కలిగి ఉండే తత్వాన్ని డిమాండ్ చేస్తున్న పరిస్థితులలో ఖాన్‌సాబ్ లాంటి సీనియర్లు తీవ్ర ప్రతికూల పరిస్థితుల్లో కూడా ఎర్రజెండాని ఎత్తిపట్టి ముందుకే సాగారు. ఇది భావితరాలకు నమూనాగా ఉంటుంది. విప్లవోద్యమం విప్లవ రాజకీయాలను మైనారిటీ మతస్థులైన ముస్లిం ప్రజలలోకి పెద్దగా తీసుకొని వెళ్లలేక పోయింది. ఈనాడు ఖాన్‌సాబ్ లాంటి వారి అవసరం ఎంతో ఉంది. ఈ కర్తవ్యాలను పరిపూర్తి చేసేందుకు ఆయన చాలా కృషి చేశాడు. ఆయన అర్ధాంతరంగా వదిలి వెళ్లిన ఈ కర్తవ్యాన్ని పరిపూర్తి చేయటమే ఆయనకు నిజంగా అర్పించే నివాళి. ముస్లిం ప్రజల నుండి నక్సల్బరీ రాజకీయాలకు కట్టుబడి ఉన్న ఆయన విప్లవ జీవితాన్ని వారి ముందు పెట్టి వారిని

ప్రేరేపించాలి. రాజ్యయంత్రాగమూ, హిందూ ఫాసిస్టుగా మారుతూ ముస్లింలను టార్గెట్ చేస్తున్న నేటి పరిస్థితులలో ఇది ఎంతో అవసరం. ఆయన జీవితం మనుషుల పట్ల ప్రేమతో చాలా సాదాసీదాగా ఉండేది. సామ్రాజ్యవాద వస్తు వ్యామోహ సంస్కృతి రాజ్యమేలుతున్న నేటి తరుణంలో సామాన్య జీవితం గడపటం గొప్ప విశేషం. ఆయన జీవితాంతం ఆర్థిక సమస్యలతో సతమతమైనప్పటికీ విప్లవోత్సాహాన్నీ, చైతన్యాన్నీ పలుచన కానీయలేదు.

ఈ దేశ ప్రజల స్వేచ్ఛ కోసం, ప్రజాస్వామ్యం కోసం మరియు దోపిడీ వ్యవస్థ నిర్మూలన కోసం కొనసాగుతున్న నూతన ప్రజాస్వామిక విప్లవంలో అమరులైన వేలాది మందితో పాటు కా. ఎం.టి.ఖాన్ కలలను నిజం చేస్తామని సి.పి.ఐ.(మావోయిస్టు) కేంద్ర కమిటీ మరోసారి వాగ్దానం చేస్తోంది. ప్రజల హక్కులు, ప్రజాసాహిత్యం పూర్తి వికాసం చెందాలంటే నూతన ప్రజాస్వామిక సమాజంలోనే సాధ్యం. దాని పరిపూర్తిలో కొనసాగిన ఖాన్‌సాబ్ ఉద్దేశ్యమెన నూతన ప్రజాస్వామిక సమాజాన్ని నిర్మించటమే ఆయనకిచ్చే నిజమైన నివాళి. ప్రతి యువ కార్యకర్త ఆయన జీవితంలో అనుసరించిన విలువలను కొనసాగించిన సాధారణ జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని ఆయన అనుసరించిన మార్గంలో కొనసాగాలి. ప్రియమైన ఖాన్‌సాబ్ ఆశయాలను ప్రచారం చేయటం ద్వారా సజీవంగా ఉంచాలని అందరికీ విజ్ఞప్తి చేస్తున్నాం.

**అభయ్**

**అధికార ప్రతినిధి**

**కేంద్ర కమిటీ**

**సీపీఐ (మావోయిస్టు)**